శ్రీ స్వామీ పరమానంద భారతీ

వేదాంత ప్రబోధం



శ్రీ జగద్గురు ఆదిశంకర భగవత్పాదాచార్య

గ్రంథ పరిచయము

అగాధము, జటిలము, వైవిధ్యమయము అయిన జగత్తును చూసినప్పుడు, "ఇది ఎక్కడ నుంచి వచ్చింది? ఎందుకు వచ్చింది?" అని ఇత్యాది ప్రశ్నలు మనస్సులో రావటం స్వాభావికం. వీటికి అనుమానాది ప్రమాణములతో ఉత్తరములు దొరకవు. శ్రుతి ప్రమాణము నుంచే దొరుకుతుంది. శ్రుతి ఇలా చెపుతుంది – "ఏకమేవాద్వితీయము అత్యంత నిర్గుణమైన బ్రహ్మ జగత్కారణము. దాని శక్తి అయిన మాయ ద్వారా అది జీవుల కర్మఫలభోగము కోసము, మోక్షసాధన కోసము జగదాకారమును పొందుతుంది. ఇలా ప్రతి కల్పములోనూ, జగత్తు బ్రహ్మనుంచే పుట్టి దానిలో లయమవ్వడం వల్ల జగత్తు స్వరూపం బ్రహ్మమే. జగత్తు అసత్యము, బ్రహ్మమొక్కటే సత్యము. అది నీవే అనే ఆత్మవిద్యను నీవు పొందితే ముక్తుడవుతావు." ఈ శ్రుతి సిద్ధాంతమును స్పష్టం చేయటానికి భగవంతులైన శంకరులు ప్రస్థానత్రయభాష్యమును రచించారు. వాటిలో జగత్తును గురించి అసత్యమని, అనిర్వచనీయమని, మిథ్యయని, ఇలా వేరువేరు విశేషణములతో వర్ణించారు. ఈ అన్ని విశేషణములు పర్యాయములని తెలుసుకొన్నవారికి భాష్యవాక్యములు పరస్పర విరుద్ధముగా కనిపిస్తాయి. దానిని సమన్వయం చేయుటకు జటిలమైన తర్కములను ఉపయోగిస్తే శాంకర సిద్ధాంతము నిస్సందిగ్ధము కాకుండా ఇంకా ఎక్కువగా సందిగ్ధము అవుతుంది. అప్పుడుజగత్స్వరూపము స్పష్టము కాదు, బ్రహ్మస్వరూపమూ స్పష్టము కాదు. ఒక్కొక్కరికీ ఒక్కొక్కవిధముగా అర్థమవుతుంది. శాంకరభాష్యములు ప్రసన్నము, గంభీరము అయినప్పటికీ – శ్రుత్యర్థములో భిన్నాభిప్రాయములకు అవకాశము లేనట్టు – వాటిలో కూడా లేదనే జ్ఞానము ఈ గ్రంథాధ్యయనము వల్ల ముముక్షువులకు అంది, దాని ద్వారా తత్త్వనిదిధ్యాసనములకు దారి చూపిస్తున్నదని మా నమ్మకం.

వేదాంతప్రబోధం

శ్రీ స్వామీ పరమానంద భారతీ

ప్రకాశకులు :
రాగరాగిణి ట్రస్ట్
శ్రీ సచ్చిదానంద గణపతి ఆశ్రమం, ఊటి రోడ్
మైసూరు - 570025
ఫోన్ : 0821-2486 486 / 2480 424

వేదాంతప్రబోధం
శ్రీ స్వామీ పరమానంద భారతీ

ప్రథమ ముద్రణ :
శాంకర శక 1219, మార్గశిర శుక్ల పంచమీ, శుక్రవారం, 2007

వెల : రు. **150-00**

ప్రకాశకులు :
రాగరాగిణి ట్రస్ట్
శ్రీ సచ్చిదానంద గణపతి ఆశ్రమం, ఊటి రోడ్
మైసూరు - 570025
ఫోన్ : 0821-2486 486 / 2480 424

డి.టి.పి.టైప్‌సెట్టింగ్ :
ఆర్. అనురాధ రఘురామ్
9441186831

కవర్ డిజైన్ :

ప్రాప్తిస్థానం :
రాగరాగిణి ట్రస్ట్
శ్రీ సచ్చిదానంద గణపతి ఆశ్రమం, ఊటి రోడ్
మైసూరు - 570025
ఫోన్ : 0821-2486 486 / 2480 424

ప్రింటర్స్ :
శ్రీ నవ్య గ్రాఫిక్స్
8-3-949/3, పెద్ద బజారు వెనుక, పంజగుట్ట, హైదరాబాద్-500073
ఫోన్ : 040-23740757. ఇ-మెయిల్ : srinavyagraphics@gmail.com

మున్నుడి

ఈ వేదాంత ప్రబోధ గ్రంథం మొదటగా కన్నడభాషలో ప్రచురింపబడినది. తరువాత ఇది హిందీ భాషలోకి అనువదింపబడి ద్వితీయ ముద్రణకు నోచుకొన్నది. దీనిని స్వామీ శ్రీ త్రిభువనదాస్‌గారు ప్రచురింపచేశారు.

వేదాంత దర్శనసమితి, కర్నాల్, హరియానా వారు పుస్తకరూపంలోకి తెచ్చి ఆస్తికలోకానికి అందించారు.

దీనిని హైదరాబాద్ వాస్తవ్యులైన శ్రీమతి లక్ష్మిగారు ఎంతో శ్రద్ధతో హిందీ నుంచి తెలుగులోకి అనువాదం చేశారు.

తరువాత ఇది ఒక రూపంలోకి రావటానికి శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు, కొంతమంది పేర్లు ప్రచురించుకోవటానికి అంగీకరించని భక్తులు, శ్రీమతి అనూరాధ రఘురామ్ సహాయం చేశారు.

ముఖ్యంగా దత్తపీఠ ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థులవారు, ఈ పుస్తకాన్ని ప్రచురించటానికి వెంటనే ఒప్పుకున్న దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వార్లు ఇచ్చిన చేయూత మరువలేనిది.

వారి విశాల మనోభావం, వేదాంతమందు వారికున్న అభిరుచి ఎంతో ప్రశంసనీయాలు. ఇప్పుడు ఈ పుస్తకం తెలుగులో ప్రచురితమైంది. తెలుగు లోకములోని ముముక్షువులకు దీనివల్ల ఉపయోగం జరిగితే, మా అందరి పరిశ్రమ, సార్థకమవుతుంది.

"ఓం"

– స్వామీ పరమానంద భారతీ.

అవధూత దత్తపీఠాధిపతి
జగద్గురు పరమపూజ్య
శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి

సచ్చిదానందీయమ్

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే ॥ ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

జయగురుదత్త –

శ్రీ పరమానంద భారతీస్వాములవారి "వేదాంత ప్రబోధం" అనే ఉద్గ్రంథాన్ని స్థాలీపులాక న్యాయంగా స్వామీజీ పరిశీలించారు.

అందులో దత్తాత్రేయులవారి విరాట్స్వరూపం, శ్రీ శంకర భగవత్పాదుల వైఖరీ వాగ్రూపంలో దర్శనమిచ్చింది. చాలా ఆనందం వేసింది. అట్టి ఆనందమే సచ్చిదానందీయంగా ఆవిర్భవించింది.

శ్రీ పరమానంద భారతీ స్వాములవారు దత్తాత్రేయులవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందిన అదృష్టవంతులు. వారు తురీయాశ్రమ స్వీకారం చేసినప్పటినుండి వేదాంత విచారమే వారి జీవితం. శ్రీమచ్ఛంకర భగవత్పాదుల అద్వైతామృతమే వారికి ఆహారం.

వేదాన్త విషయ విచారణే వారి తపస్సు. "తద్ధి తపస్తద్ధి తపః" అను శ్రుతి వాక్యమునకు ఉదాహరణమే వారి అంతరంగం.

శ్రీ పరమానంద భారతీ స్వాములవారికి దత్తపీఠంతో అవినాభావ సంబంధం ఉంది. అనేక పర్యాయాలు, ఎన్నో రాత్రులు, మరెన్నో పగళ్లు, మా దత్తవిజయానంద తీర్థ స్వామివారితో వేదాంత విషయ చర్చలను చేస్తూ, మాకు, మా దత్తభక్తులకు అందరికీ ఆప్తులు, సన్నిహితులు అయ్యారు.

వీరు తమ గ్రంథానికి "వేదాంత ప్రబోధం" అనే నామకరణం చేశారు. కానీ, ఇది పరిచయ గ్రంథం కాదు. పరిప్రశ్న పూర్వక పరిశోధనా గ్రంథమే.

తావచ్ఛాస్త్రాణి గర్జన్తి జంబుకా విపినే యథా ।
న గర్జతి మహాశక్తిః యావత్ వేదాన్త కేసరీ ॥

అన్నట్లు శంకర భగవత్పాదులయొక్క ప్రస్థానత్రయ భాష్య రహస్యాలనన్నిటినీ ఒకచోట చేర్చి పాఠకులకు, జిజ్ఞాసువులకు, వేదాన్త విషయాలను సులభతరం చేశారు.

వేదాన్త శాస్త్ర విషయాలను సామాన్యపాఠకులకు పరిచయం చేస్తూ, నెమ్మది నెమ్మదిగా శాస్త్రంలోని లోతులను చూపించిన శ్రీ పరమానంద భారతీస్వాములవారి రచనా నైపుణ్యం హర్షించదగినది.

వీరు తమ గ్రంథాన్ని పీఠిక, జగత్, బ్రహ్మ, జీవ, సాధన అను ఐదు ప్రకరణాలుగా విభజించారు.

పీఠికా ప్రకరణంలోని నాలుగు అధ్యాయాలలోనూ వేదాన్త శాస్త్రంయొక్క ప్రవేశద్వారములైన అనుబంధ చతుష్టయం, సాధనా చతుష్టయం, గురుతత్త్వం, గురువుయొక్క ఆవశ్యకత, సద్గురువుయొక్క లక్షణాలు, సద్గురువును సేవించి ఆశీస్సులను స్వీకరించు విధానం తెలియజేశారు.

అదేవిధంగా ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, అర్థాపత్తి, ప్రమాణములతోపాటు, మీమాంసకులయొక్క విభిన్న ప్రమాణాలు, ఆగమ ప్రమాణాలు తెలియజేస్తూ శాస్త్రవాసనలను పాఠకులకు రుచి చూపించి, కొన్ని ప్రశ్నలు, సమాధానాలు చెప్పిన విధానం వీరి యొక్క బోధనా సామర్థ్యాన్ని తెలియచేస్తోంది.

రెండవదైన జగత్ప్రకరణంలో ప్రాచీనములైన బౌద్ధ, మీమాంసక, వైశేషిక, తార్కిక, సాంఖ్యవాదములతోపాటు ఆధునిక వాదములను కూడా చూపించి శంకర భగవత్పాదులయొక్క శాస్త్ర వాద చాతుర్యం, భూత భవిష్యద్వర్తమానములకు తగినట్లుగా ఉండుటచే అది త్రికాలాబాధితమని నిరూపించారు.

వేదాన్త సిద్ధాంతమును, బ్రహ్మ కారణత్వ చర్చను రెండు అధ్యాయములయందు విపులీకరించి భగవత్పాదులయొక్క మాయా సిద్ధాంతమును కూలంకషంగా చర్చించారు.

మూడవదైన బ్రహ్మప్రకరణంలో బ్రహ్మయొక్క పృథక్ కరణత్వమును, పారమార్థిక, వ్యావహారిక, ప్రాతిభాసికములనెడి మూడురకముల సత్యమును, బ్రహ్మజ్ఞానమును, బ్రహ్మజ్ఞానముయొక్క సర్వజ్ఞత్వమును ప్రతిపాదించుచూ, జ్ఞానులయొక్క అనుభవములను కూడా ప్రతిపాదించుట. వేదాన్త శాస్త్రముయొక్క ప్రయోగశాలను కూడా పాఠకులకు పరిచయం చేసినట్లు అనిపించింది.

బ్రహ్మయొక్క నిర్గుణ లక్షణాలను తెలియచేసి, జగత్తు సత్పదార్థమా? అసత్ పదార్థమా? అను జిజ్ఞాసను పాఠకులకు కల్పించి, అధ్యారోప, అపవాదములతో ప్రకరణమును పూర్తిచేశారు.

నాల్గవదైన జీవ ప్రకరణంలో స్థూల సూక్ష్మ శరీర భేదములు, అంతఃకరణము, పంచజ్ఞానేంద్రియ జ్ఞానము పంచ కర్మేంద్రియ జ్ఞానమును వివరించి, కారణ శరీరమును ప్రతిపాదించి, సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మస్వరూపమును వివరిస్తూ, జనన మరణ క్రమములను తెలియజేసి, శరీరస్వరూపాన్ని పాఠకులకు అందించారు.

తరువాత రెండు అధ్యాయములలో అజ్ఞానాన్ని సుదీర్ఘంగా వివరించి, అవస్థాత్రయ చర్చలో జాగ్రత్స్వప్న సుషుప్తి స్థితులను వివరించారు.

వేదాన్త శాస్త్రమునకు ఆధారమైన అవస్థాత్రయ విభాగంలో చివరకు సుషుప్తిలో అవిద్య ఉన్నదని, అధ్యాసలేదని శాస్త్రీయంగా నిరూపించారు.

సాక్షి చైతన్య లక్షణాలు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములయొక్క వివరణలతో జీవప్రకరణమును పూర్తిచేశారు.

చివరిదైన సాధనా ప్రకరణంలో మోక్ష లక్షణాలను, సంన్యాస లక్షణాలను, సంన్యాస స్వీకారమునకు వేదాంగీకారత్వమును వివరిస్తూ, విద్వత్సంన్యాస, వివిదిషా సంన్యాస లక్షణాలను తెలియచేశారు.

సంన్యాసాశ్రమమును స్వీకరించి, తరువాతి కాలంలో ఆశ్రమచ్యుతుని యొక్క దశను కూడా వివరించారు.

ఉపాసన, కర్మ, భక్తి విషయాలను ప్రస్తావిస్తూ కర్మలతో మోక్షం వస్తుందా? మోక్షమనేది ఒక్కటేనా? లేక పలువిధముల మోక్షములున్నవా? అని ప్రశ్నించి పాఠకుని సమాధానపరిచి ఉపసంహారం చేశారు.

ఈవిధంగా సాగిన వీరి రచనా ప్రణాళిక ప్రాచీనులకు, అర్వాచీనులకు ఆనంద దాయకమై శ్రేయస్సును, ప్రేయస్సును కలిగించగలదని ఆశిస్తున్నాము.

వేదాన్త శాస్త్రమునకు కావలసిన అన్ని విషయాలు ఈ గ్రంథంలో తెలియచేయబడ్డాయి.

సామాన్య ప్రజలకు కొన్ని సందేహాలు వస్తాయి. బ్రహ్మసాక్షాత్కారం ఎవరికి కలుగుతుంది? అనేదానికి శంకరుల సమాధానాన్ని తెలుసుకొందాం.

"తస్మాత్ కిమపి వక్తవ్యం యదన్తరం బ్రహ్మ జిజ్ఞాసా ఉపదిశ్యత ఇతి...." అని ప్రారంభించి "తస్మాత్ యథోక్త సాధన సంపత్త్యనంతరం బ్రహ్మ జిజ్ఞాసా కర్తవ్యా" అన్నారు శంకరులు.

బ్రహ్మ సాక్షాత్కారం పొందడానికి సాధన చతుష్టయ సంపత్తి కలవాడే అర్హుడు.

అయితే సాధన చతుష్టయం అంటే ఏమిటి? అనేది ప్రశ్న. నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విచారము, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము అనేవాటిని సాధనా చతుష్టయం అంటారు.

అంటే మోక్షం కావాలనుకొనే వాడికి పై నాలుగు లక్షణాలు ఉండాలి. అందు మొదటిది నిత్యానిత్య వస్తు వివేకము. ఎదురుగా కనిపించే ఈ జగత్తులో ఏది నిత్యం? అనగా మూడు కాలములయందు ఏది ఉండేది? ఏది ఉండనిది? అని ఆలోచించాలి.

ఏ వస్తువైనా కొంతకాలం మాత్రం ఉండి, తరువాత నశించిపోయేదే కదా! కాబట్టి ఏ వస్తువూ ఎల్లవేళలా ఉండదు. కొద్దికాలం ఉంటుంది. మరి కొంతకాలానికి కాలగర్భంలో కలిసిపోతుంది.

మోక్షం కావాలనుకొనేవాడికి ముందుగా ఇట్టి ప్రాథమిక జ్ఞానం కావాలి. ఏ వస్తువులకొరకై మనం తాపత్రయపడుతున్నామో, అవేవీ స్థిరంగా ఉండవు. కొంతకాలం అయిన తరువాత నాశనం అయిపోతాయి. చివరికి ఈ శరీరం కూడా నాశనం అయిపోతుంది.

నాశనం కాని వస్తువు కావాలి. అది జ్ఞానమొక్కటే. అందువలన జ్ఞానమును గ్రహించాలి అనే ఆలోచన వచ్చినవాడు మోక్షమునకు మొదటిమెట్టు ఎక్కినట్లు.

తరువాత ఈ శరీరంతో అనుభవించే సుఖాలు కానీ, దుఃఖాలు కానీ శాశ్వతాలు కావు. దీనిని మించిన మరొక సుఖం ఉంది అనే ఆలోచన రావాలి. అట్టి జ్ఞాన సంపాదనకూ శమ దమాదులు, వివేక వైరాగ్యాదులు కలవాడే మోక్షమునకూ అధికారి అవుతాడు.

ఇచట అధికారి అనగా ఫలస్వామ్యము. అంటే ఫలమును పొందుటకు అర్హత. వివేకాదులు ఉన్నవానికే బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుంది. లేనివానికి బ్రహ్మసాక్షాత్కారం కలుగదు.

పూర్వమీమాంసాశాస్త్రమును చదివినా, చదవకపోయినా, గృహస్థుడైనా, కాకపోయినా, చివరకు దేవలోకాలలో ఉన్నప్పటికీ, వివేకాదులు కలవానికి మాత్రమే బ్రహ్మవిద్యా జ్ఞానం లభిస్తుంది.

మనోనిగ్రహానికి శమము అని పేరు. బాహ్యేంద్రియ నిగ్రహానికి దమము అని పేరు. సంన్యాసము లేదా విక్షేప రాహిత్యము అనుదానికి ఉపరతి అని పేరు. సుఖదుఃఖాదులను, శీతోష్ణములను సహించు

శక్తికి తితిక్ష అని పేరు. ఏకాగ్రమైన బుద్ధికి సమాధి అని పేరు. పరమేశ్వరుని యందు ఆస్తిక్యబుద్ధికి శ్రద్ధ అని పేరు. ఈ ఆరు లక్షణాలూ మానవునికి తప్పనిసరిగా ఉండాలి.

అయితే ఇచట ఒక ప్రశ్న వేయవచ్చు. "అక్షయ్యం హ వై చాతుర్మాస్య యాజినః సుకృతం భవతి, అపామ సోమం అమృతా అభూమ" మొదలైన వేదమంత్రాలు, కర్మలచేత నిత్యసుఖం లభిస్తుందని, దానినే స్వర్గమంటారని, అందువలన మోక్షం పొందడానికి యజ్ఞకర్మలే ముఖ్యం కాని వైరాగ్యం ఎంతమాత్రం కాదని అనవచ్చు.

పైగా బ్రహ్మ పదార్థం తెలిసినంత మాత్రంచేత ప్రయోజనం ఏమిటి? కూటస్థబ్రహ్మగా ఉంటే ఏమిటి ప్రయోజనం?

కదలకుండా మెదలకుండగా ఉండే కర్రలు – రాళ్లు ఏమి సుఖాన్ని అనుభవిస్తున్నాయి? అందువలన అద్వైత మోక్షం ప్రయోజనకారి కాదు. అట్టి మోక్షమునందు కోరిక అనవసరం – అని పూర్వపక్షం చేయవచ్చు.

ఈ ప్రశ్నకు వేదమే సమాధానం చెప్పింది. 'తద్యథా ఇహకర్మ చితోలోకః క్షీయతే, ఏవం ఏవ అముత్ర పుణ్యచితోలోకః క్షీయతే" అని.

లోకంలో వ్యాపారం, వ్యవసాయం, ఉద్యోగం మొదలగు పనులచేత సంపాదించబడిన ఫలం ఏవిధంగా నశిస్తుందో, అదేవిధంగా అగ్నిహోత్రం మొదలగు యజ్ఞములచేత సంపాదించబడిన స్వర్గాది ఫలములు కూడా నశిస్తాయి.

అందువలన నాశనం కాని ఫలమును సంపాదించాలి. దానిని ఎవడు సంపాదిస్తాడు అనగా "బ్రహ్మ విదాప్నోతి పరం" బ్రహ్మవేత్త మాత్రమే సంపాదిస్తాడని వేదం చెప్పింది.

శోకము, మోహము, భయము మొదలగువాటిని విడచిపెట్టి నిత్య నిరతిశయ స్వరూపానందమును బ్రహ్మవేత్త పొందుతాడు.

బ్రహ్మజ్ఞానము నిత్యమైన మోక్షసుఖాన్నిస్తుంది. వివేక వైరాగ్యాదులచేత సాధన చతుష్టయ సంపన్నుడు అధికారి అయినప్పటికీ, జన్మాంతర సుకృతము కూడా సాధన సంపత్తికి సహాయపడుతుంది.

"బ్రహ్మచర్యం సమాప్య గృహీ భవేత్ గృహాత్ వనీ భూత్వా ప్రవ్రజేత్" అనుట వలన బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము అయిన తర్వాత సంన్యాసము స్వీకరింపవలయును కదా! మరియు

"అధీత్య విధివత్ వేదాన్ పుత్రాంశ్చ ఉత్పాద్య ధర్మతః ధర్మతః ఇష్ట్వా చ శక్తితో యజ్ఞైః, మనో మోక్షే నివేశయేత్" అను వాక్యం వలన వివాహం చేసికొని పిల్లలు కలిగిన తరువాత వైదిక కర్మలు చేయుచూ అవకాశమున్నంతవరకూ యజ్ఞములు చేసి, తరువాత మోక్షమును పొందవలయును అని ఉన్నది కదా! అను ప్రశ్నకు –

''బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్'' అను వేదవాక్యం వలన బ్రహ్మచారిగ నున్నవాడు నేరుగా సన్న్యాసాశ్రమమును స్వీకరింపవచ్చు. మధ్యలోని గృహస్థాశ్రమ విధులను విడచిపెట్టవచ్చు అని చెప్పుటచే యజ్ఞాది కర్మలు మోక్ష విషయమున అప్రాధాన్యములైపోయాయి కదా!

"ఆసాదయతి శుద్ధాత్మా మోక్షం వై ప్రథమాశ్రయే" అను వాక్యం శుద్ధమైన, నిశ్చలమైన అంతఃకరణం కలవాడు నేరుగా మోక్షపదమును పొందుచున్నాడు అని తెలియచేస్తోంది. అందువలన బ్రహ్మచారిగా

నున్నవాడు సంన్యాసదీక్షను స్వీకరించవచ్చు అని వేదం చెప్తోంది.

అంటే జన్మాంతర సంస్కారము గల సాధకుని మనస్సు దృఢంగా ఉంటుంది. పూర్వజన్మలయందు చేసిన కర్మలయొక్క ఫలం ప్రకృత జన్మలో ఫలిస్తుంది. అట్టివారు బ్రహ్మచర్యం నుండి సంన్యాస దీక్షను స్వీకరించి, వేదాంత విచారణ చేయుచూ బ్రహ్మజ్ఞానమును పొందవచ్చు.

మనస్సునందు రాగాది దోషములున్నవారు, వివాహం చేసికొని ఇంద్రియనిగ్రహమును పాటించుటను అభ్యసించుచూ, చివరకు వనవాసదీక్షలో ఆహారనియమములతో శరీరముపై వ్యామోహమును కూడా జయించి, తపస్సాధన చేయుచూ, సంన్యాసం స్వీకరించి, బ్రహ్మజ్ఞానమును పొంది, మోక్షమును చేరవచ్చు.

"అశరీరం వా వసన్తం న క్రియా ప్రియే స్పృశతః" అను ఛాందోగ్య శ్రుతివాక్యం, శరీరము లేనివానికి సుఖదుఃఖాదులు ఉండవు కావున శరీరము లేకపోవుటయే మోక్షము అని తెలియచేస్తోంది.

సుఖదుఃఖాలు మోక్షంలో లేకపోవుటచే, సుఖ దుఃఖసాధనాలైన ధర్మాధర్మములయొక్క కార్యం కూడా మోక్షం కాదు అని చెప్పబడింది.

వేదాన్త విచారము నందు ఉపాసనా విధిని అంగీకరిస్తే విధిగోచరమైన ఉపాసన ధర్మమే కాబట్టి ధర్మకార్యము కూడా మోక్షమే అని చెప్పవలసి వస్తుంది. అప్పుడు మోక్షం అనునది సుఖరూపమగుటచే 'న ఏనం ప్రియాప్రియే స్పృశతః' అను శ్రుతియందు సుఖస్పర్శ లేకపోవుటచే ఉపాసన మోక్షము కానేరదు. పైగా ఉపసానజన్యమగుటచే మోక్షమునందు కూడా జన్యత్వ లక్షణమైన అనిత్యత్వము సిద్ధించుచున్నది.

అందువలన అశరీరత్వమే మోక్షమని చెప్పుట కుదరదు. మోక్షం కూడా కర్మఫలముల వంటిది అయిపోయింది. కావున ఉపాసన కర్మయేగాని మోక్షము కాదు.

అశరీరత్వమే మోక్షమని అంగీకరించగా "బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి" అను ముండక వాక్యముచే బ్రహ్మను తెలిసికొనినవాడు బ్రహ్మయే అగుచున్నాడు.

కార్యకారణములకు అధిష్ఠాన బ్రహ్మయొక్క సాక్షాత్కారము కలిగిన తరువాత ప్రారబ్ధాది అతిరిక్త కర్మలన్నీ నశించిపోతాయి.

అట్టి బ్రహ్మ స్వరూపానందమును అనుభవించువాడు దేనికి భయపడడు "ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన".

గురూపదేశము వలన అహం బ్రహ్మాస్మి అని గ్రహిస్తాడు. వేదాన్త శాస్త్రమున గల ఇట్టి అనేక విషయాలను చర్చించిన శ్రీ పరమానంద భారతీస్వామి వారిపై దత్తదేవుని ఆశీస్సులు వర్షించుగాక –

మీ స్వామీజీ

మైసూరు
12-10-2007

శ్రీః

ఓమ్ స్వస్తిశ్రీ గణేశాయ నమః

ప్రవేశిక

పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీ శంకరాచార్యులు ఉపనిషత్ప్రతిపాదితమైన అద్వైతతత్త్వాన్ని ఈశ–కేన–కఠ–ప్రశ్న–ముండక–మాండూక్య–తైత్తిరీయ–ఛాందోగ్య–బృహదారణ్యక–ఐతరేయోపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు మహాభారతాంతర్గతమైన భగవద్గీతకూ సువిస్తృతములూ, సారగర్భితములూ అయిన వ్యాఖ్యానాలు రచించి విశదీకరించారు. ఈ విస్తృత వ్యాఖ్యానాలకు భాష్యములని పేరు. వీటి రచనచేత శ్రీ శంకరాచార్యులకు 'భాష్యకారులు' అను ప్రసిద్ధి ఆస్తికలోకంలో తత్ప్రథమంగా లభించింది. శ్రీ శంకరాచార్యుల ప్రత్యక్షశిష్యులైన పద్మపాదాచార్యులు సూత్రభాష్యానికీ, సురేశ్వరాచార్యులు తైత్తిరీయ–బృహదారణ్యకోపనిషద్భాష్యాలకీ వ్యాఖ్యానాలు రచించారు. పద్మపాదాచార్య విరచితమైన పంచపాదిక, చతుస్సూత్రికి మాత్రమే లభిస్తున్నది. సురేశ్వరాచార్యవిరచిత వ్యాఖ్యలు శ్లోకరూపంలో ఉండడంచేత వీటికి వార్తికా లని పేరు.

బాదరాయణులు బ్రహ్మసూత్రాలు రచించేనాటికి వేదప్రామాణ్యాన్ని అంగీకరించకపోవడంచేత నాస్తికదర్శకాలుగా చెప్పబడే చార్వాక – జైన, బౌద్ధ దర్శనాలూ, సాంఖ్యయోగ న్యాయ–వైశేషిక దర్శనాలూ, పాశుపత పాంచరాత్రాది మతాలూ ప్రచారంలో ఉండేవి. వీటిలో కొన్ని సాంఖ్య–యోగ–న్యాయ–వైశేషికాదులు వేదాలకు ప్రామాణ్యం అంగీకరించినా తర్కానికి అధికంగా ప్రాధాన్యం ఇస్తాయి. కొన్ని ఆయా ఆగమాలకు ప్రాధాన్యం ఇస్తాయి. వీటినన్నింటినీ సూత్రకారులు చూపిన పద్ధతిని అనుసరించి అనేక యుక్తులతోను, ఇతర ప్రమాణాల సాహాయ్యంతోను ఖండిస్తూ, శ్రీ శంకరాచార్యులు అద్వైతమతాన్ని స్థాపించారు. అయితే – ఈ దర్శనాలలో అద్వైతసిద్ధాంతానికి విరుద్ధంగా చెప్పిన అంశాలలో మాత్రమే మాకు విరోధం కాని, దీనికి విరుద్ధం కాని అంశాలు మాకు కూడా పరిగ్రాహ్యములే అని శ్రీ శంకరాచార్యులు అనేక స్థలాలలో స్పష్టంగా చెప్పారు. ఇది వీరిలో మాత్రమే కనబడే విశాలహృదయత్వానికి ఉదాహరణం.

వేదాలకు పరమప్రామాణ్యాన్ని అంగీకరించిన పూర్వమీమాంసలకులతో సహా పైన చెప్పిన అందరు దార్శనికులూ, మతాలవారూ కూడా ద్వైతవాదులే. వీరి అందరి ఆక్షేపణలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ కూడా సమాధానాలు చెపుతూ శ్రీ శంకరాచార్యులు తమ సిద్ధాంతాన్ని కేవలం ఉపనిషత్తులనే ప్రమాణంగా చూపుతూ స్థాపించారు. ఇది ఔపనిషదమే అయినా అనుభవానికి కూడా చాలా సన్నిహితమైన తత్త్వం అనే విషయం కూడా నిరూపించారు. తన సిద్ధాంతాన్ని ఇతరులు అంత సులువుగా అర్థం చేసికొనరనీ, చేసికొన్నా మనఃస్ఫూర్తిగా అంగీకరించడానికి వెనుకాడతారనీ ఆయనకు తెలుసు. అయితే తత్త్వం అనేది మెజారిటీ వోట్లతో నిర్ణయించేది కాదు. చక్కగా విచారణ చేసి దీనిని నిర్ణయించాలి అను విషయాన్ని వారు హాస్యపూర్వకంగా చెపుతూన్నట్లు చమత్కారంగా తైత్తిరీయోపనిషద్భాష్యంలో సూచించారు.

"చిన్తయసి త్వమ్ న నిర్ణేష్యసి". న నిర్ణేతవ్యమితి వేదవచనమ్? "న"; "కథం తర్హి?" "బహుప్రతిపక్షత్వాత్. ఏకత్వవాదీ త్వమ్; వేదార్థ పరత్వాత్. బహవో హి నానాత్వవాదినః వేదబాహ్యాః త్వద్విపక్షాః. అతో మమాశఙ్కా న నిర్ణేష్యసీతి". ఏతదేవ మే స్వస్త్యయనమ్, యన్మామేకయోగినమ్ అనేకయోగిప్రతిపక్షమాత్థ. అతో జేష్యామి సర్వాన్. ఆరభే చ చిన్తామ్". (బ్రహ్మానన్దవల్లీ, 8.6).

ఇది శ్రీ శంకరాచార్యులకీ, ఊహాకల్పితుడైన ఒక ప్రతివాదికీ లేదా మధ్యస్థునికీ మధ్య జరిగిన సంభాషణ. (ప్రతివాది). "నిజమే. నువ్వు వాదించాలని అనుకొంటున్నావు. కాని నువ్వు ఏ నిర్ణయానికీ రాజాలవు" (శం). "ఏ నిర్ణయానికీ రాజాలనంటూ ఇదేమైనా వేదవాక్యమా?" (ప్ర). "కాదు". (శం) "ఐతే సమస్య ఏమిటి?" (ప్ర). నీకు ప్రతిపక్షులు చాలామంది ఉన్నారు. వాళ్లంతా వేదబాహ్యులు. అంతేకాకుండా నువ్వు వేదాన్నే పట్టుకొని వ్రేలాడుతూ 'అద్వైతం, అద్వైతం' అంటూ మాట్లాడుతూంటావు. అందుచేత వాదంలో నీకు జయం లభించదేమోనని నా సందేహం." (శం) "నేను అద్వైతిని. నాకు ప్రతిపక్షులు చాలామంది ఉన్నారు. వాళ్లంతా ద్వైతులు అని కదా నువ్వు అంటున్నావు. ఇదే నాకు బలం. నేను వాళ్లందరినీ జయిస్తాను. ఇదిగో వాదం ప్రారంభిస్తున్నాను."

తాము స్థాపించిన అద్వైతసిద్ధాంతం విషయంలో శ్రీ శంకర భగవత్పాదులకున్న అచంచలమైన విశ్వాసాన్ని పై వాక్యాలు సూచిస్తున్నాయి. ఉపనిషత్తులలోను, తదితర వేదభాగాలలోనూ ఉన్న సిద్ధాంతాన్నే కదా తాము స్థాపిస్తూన్నది. దీనికి అడ్డు ఉండడానికి అవకాశం ఏమిటి అని వారి ధైర్యం.

ఈ ధైర్యంతోనే శ్రీ శంకరాచార్యులు ఔపనిషదమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ, వివిధ ప్రమాణ ప్రదర్శనపూర్వకంగా ద్వైతసిద్ధాంతాలలో ఉన్న అద్వైతవిరుద్ధభావాలని నిరాకరిస్తూ, తద్విరుద్ధం కాని అంశాలని స్వీకరిస్తూ భాష్యాలు రచించారు. అద్వైతాన్ని ప్రధానంగా ప్రతిపాదించే ఉపనిషత్తులలోనే అనేక ప్రక్రియాభేదాలు కనబడుతున్నాయి. వాటికన్నింటికీ శ్రీ శంకరాచార్యులు తమ భాష్యాలలో సమన్వయం చూపించారు. అయితే పూర్వం ఉన్న ద్వైతసిద్ధాంతాలన్నీ విస్మృతప్రాయాలైపోయినా క్రొత్తరకం ద్వైతులు బయలుదేరి శాంకరాద్వైత సిద్ధాంతంలో ఏవేవో దోషాలు చూపడం ప్రారంభించారు. శాంకరభాష్యాలకు వ్రాసిన వ్యాఖ్యానాలలో కొన్ని వ్యాఖ్యానాలు విషయ వివరణంతోపాటు ఇతరుల (నవద్వైతుల) ఆక్షేపాలకు సమాధానాలు కూడా ఇచ్చారు. ఇలాంటి వ్యాఖ్యానాలు, ఉపవ్యాఖ్యానాలు, స్వతంత్రగ్రంథాలూ అనేకం బయలుదేరాయి.

తొమ్మిదవ శతాబ్దానికి చెందిన వాచస్పతిమిశ్రులు **బ్రహ్మసూత్రభాష్యానికి భామతి** అను వ్యాఖ్యానం రచించారు. వీరు దీనిలో అద్వైత ప్రక్రియ సరిగ్గా అర్థం చేసుకొనడానికి ఉపకరించే కొన్ని ప్రక్రియలు ప్రతిపాదించారు. వీరు చెప్పినదానికి **భామతీ ప్రస్థానం** అనుపేరు ప్రసిద్ధిలోనికి వచ్చింది. పద్మపాదాచార్యవిరచితమైన **పంచపాదిక**కు ప్రకాశాత్మయతి (1200) **వివరణం** అను వ్యాఖ్య రచించి దానిలో కొన్ని ప్రక్రియలు ప్రతిపాదించారు. వీటికి **వివరణప్రస్థానం** అని పేరు. శాంకరభాష్యాలలో ఉన్న ప్రక్రియాభేదాలకి ఉపనిషత్తులే మూలమైతే ఈ ప్రస్థానాలలో ఉన్న భేదాలన్నింటికీ శాంకరభాష్యాలే మూలం. ఇంకా చిన్న చిన్న ప్రక్రియలు ఇతర వ్యాఖ్యానాలలోను, స్వతంత్ర గ్రంథాలలోనూ కూడా కనబడతాయి. బింబప్రతిబింబవాదం, మాయాఽవిద్యాభేదవాదం, మాయాఽవిద్యైక్యవాదం మొదలైన ప్రక్రియలన్నీ ఇలాంటివే. ఈ ప్రక్రియలన్నీ పరస్పర విరుద్ధాలులాగ కనబడుతున్నా వీటిలోని విరోధం ఆభాసమాత్రమే. అందుచేత అన్నీ గ్రాహ్యములే. పరమసిద్ధాంతాన్ని అర్థం చేసికొనడానికి ఉపకరించినంతవరకు వీటిని ఉపయోగించుకొని వీటిని పరిత్యజించవచ్చు అని వార్తికకారులైన సురేశ్వరాచార్యులు స్పష్టీకరించారు. (ఇవన్నీ గణితంలో ఒక సమాధానం రాబట్టడంకోసం ఉపయోగించే వేరు వేరు పద్ధతులవంటివి.)

"యయా యయా భవేత్పుంసాం వ్యుత్పత్తిః ప్రత్యగాత్మని

సాసైవ ప్రక్రియా జ్ఞేయా సాధ్వీ; సా చానవస్థితా."

అద్వైత సిద్ధాంతాన్ని "**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవ నాఽ పరః**" అని ఒక్క వాక్యంలో చెప్పడం అందరికీ తెలిసినదే. "బ్రహ్మ ఒక్కటే సత్యమైనది; జగత్తు మిథ్య. జీవునికీ బ్రహ్మకూ భేదం లేదు" అని ఒక్క మాటలో చెప్పినా దీనిని స్థాపించడానికే శాస్త్రం అంతా బయలుదేరింది. బ్రహ్మ శుద్ధమైనది, అద్వితీయము, నిర్గుణము. అయితే-ఈ బ్రహ్మమే జగత్తుకు కారణం. వాస్తవంలో జీవునికీ బ్రహ్మకూ భేదం లేదు అని బోధించిన ఉపనిషత్తులలోనే-ఈ సృష్టి ఎలా జరిగింది? జీవులు భిన్నంగా కనబడడానికి కారణం ఏమిటి? నిర్గుణమైన బ్రహ్మ జగత్తును ఎలా సృష్టించింది? అనే ప్రశ్నల కన్నింటికీ సరియైన సమాధానాలు చెప్పబడ్డాయి. బ్రహ్మ నిర్గుణమే అయినా మాయా సహాయంచేత సృష్టి జరిగింది. అవిద్యయే జీవుల సంసారానికి కారణం అని ఉపనిషత్తులలో చెప్పిన విషయాలే శ్రీ శంకరాచార్యులు తమ భాష్యాలలో వివరించారు. జగత్తుని సృజించిన పరమేశ్వరునికి రూపాదులు కూడా ఉన్నాయి అని ప్రతిపాదించిన మొట్టమొదటి దార్శనికుడు శ్రీ శంకరాచార్యులు. పురాణేతిహాసాదులలో ఈశ్వరునికి రూపాదు లున్నట్లు వర్ణన లున్నా శంకరులకు పూర్వం ఉన్న దార్శనికులలో ఈశ్వరుణ్ణి అంగీకరించినవారు కూడా ఈశ్వరునకు రూపాదు లంగీకరించలేదు.

ఇంక మాయ అంటే ఏమిటి? మాయ అవిద్య అనేవి వేరువేరా లేక ఆ రెండూ ఒకటేనా? మిథ్య అంటే ఏమిటి? ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలు వేరు వేరు వ్యాఖ్యాతలు, గ్రంథరచయితలు వేరువేరు పద్ధతులలో సమాధానాలు చెప్పారు. మాయ, అవిద్య, అజ్ఞానం మొదలైనవి అన్నీ పర్యాయపదాలు అని కొంద రంటే మాయ వేరు అవిద్య వేరు వాటి స్వరూప స్వభావాలు వేరు అని మరికొందరన్నారు. ఇవన్నీ మాయకు పేర్లు; అది ఈశ్వరాశ్రితం అని వివరణప్రస్థానం ప్రతిపాదిస్తే భామతీకారుడు "అనిర్వాచ్యమైన అవిద్యలు రెండు ఉన్నాయి. ఒకటి జగత్కారణము, మరొకటి పూర్వపూర్వసంస్కారరూపమైనది. నిజానికి ఎందరు జీవులున్నారో అన్ని అవిద్యలున్నాయి అని ప్రతిపాదించాడు గౌడబ్రహ్మానందాదులు". శుద్ధ సత్త్వోపహితమైన అజ్ఞానం మాయ, మలినసత్త్వోపహితమైనది అవిద్య; లేదా ఒకే అజ్ఞానం; విక్షేపశక్తిని బట్టి మాయ అనీ, ఆవరణశక్తినిబట్టి అవిద్య అని చెప్పబడుతుంది. ఏమైనా ఇది భావరూపం" అని ప్రతిపాదించారు. ఘటంలో ఉన్న ఆకాశం మహాకాశంకంటె భిన్నంగా కనబడుతున్నట్లు అవిద్యావచ్ఛిన్నమైన చైతన్యం జీవు డను పేరుతో బ్రహ్మకంటె వేరుగా కనబడుతున్నది అని కొందరు (**భామతీప్రస్థానం**) చెప్పగా ఈ భేదం బింబ సూర్య - జలప్రతిబింబసూర్యుల భేదం వంటిది అని మరకొందరంటారు (**వివరణప్రస్థానాదులు**). ఈ వాదా లన్నింటికీ ఉపనిషత్తులలోను, తదనుసారిశాంకరభాష్యాలలోను ఆధారాలున్నాయి.

"జగత్తు మిథ్య అని ప్రతిపాదించిన శ్రీ శంకరాచార్యులు జగత్తు చెవులపిల్లి కొమ్మువలె, ఆకాశ కుసుమంవలె అసలు లేనిది అని చెప్పడం లేదు; ఆత్మైకత్వజ్ఞానం కలిగే వరకూ ఇది సత్యమే అని వారి భావం" అను విషయం అద్వైతసిద్ధాంతంతో పరిచయం ఉన్నవారందరికీ తెలిసినదే. అయితే కొందరి వక్రవ్యాఖ్యానాలచేత ఈ విషయంలో, కొందరిలో కొన్ని భ్రాంతులు స్థిరపడిపోయాయి. వాటిని నివర్తింపచేసి మాయ, అవిద్య, మిథ్యాత్వం, సత్యత్వం మొదలైన వాటి స్వరూపాన్ని ఆధునికులకు కూడా అర్థమయే రీతిలో బోధించడం ఈనాడు ఎంతో అవసరమై ఉన్నది.

పందొమ్మిది అధ్యాయయాల ఈ **వేదాంతప్రబోధం**లో పరమపూజ్య శ్రీ స్వామీ పరమానందభారతి అద్వైతసిద్ధాంతానికి సంబంధించిన అనేకవిషయాలను, అడుగడుగునా విచారణీయాంశాలను సమర్థించే అనేకవాక్యాలు శాంకరభాష్యాలనుండి ఉదాహరిస్తూ సుస్పష్టంగా ప్రతిపాదించారు. ఈ గ్రంథాన్ని చదివినవా రెవరూ కూడా "శంకరభాష్యాలన్నీ శ్రీ స్వాములవారికి కరతలామలకంగా ఉన్నాయి" అనే విషయం

గుర్తించకుండా ఆశ్చర్యచకితులు కాకుండా ఉండజాలరు. వాస్తవమైన అద్వైతతత్త్వాన్ని తెలిసికొనడానికి ఇతర వాఖ్యోపవ్యాఖ్యలతో గాని, వాదగ్రంథాలతోగాని పని లేదు; శాంకరభాష్యాలను ఆమూలాగ్రంగా సావధానంగా పరిశీలిస్తే అనాయాసంగా, సుస్పష్టంగా ఆ తత్త్వాన్ని తెలిసికొనవచ్చు. 'వాచోవిగ్లాపనానికి' ఏ మాత్రమూ అవసరం ఉండదు అని చూపించడమే శ్రీ స్వాములవారి ప్రధానోద్దేశ్యం అన్నట్లు కనబడుతుంది.

సాధారణంగా వేదాంత ప్రకరణ గ్రంథాలలో ప్రతిపాదించే (1) అనుబంధచతుష్టయం (2) సాధన చతుష్టయసంపత్తి (3) గురుప్రాధాన్యం (4) అద్వైతులకు అంగీకార్యమైన ప్రమాణాలు, వేదాల అపౌరుషేయత్వము (5) జగత్కారణాన్నిగూర్చి ఇతరుల మతాలు మొదలైన విషయాలు మొదటి అయిదు అధ్యాయాలలో చర్చింపబడ్డాయి.

ఈ గ్రంథంలో ఆరవ అధ్యాయం మొదలు పన్నెండవ అధ్యాయం వరకు ఉన్న భాగం చాలా ప్రధానమైనది. దీనిలో శ్రీ స్వాములవారు అద్వైతసిద్ధాంతం విషయంలో సంభావ్యములైన వివిధశంకలకు సమాధానాలు లభించే విధంగా సిద్ధాంతాన్ని చాలావరకు శ్రీ శంకరాచార్యుల మాటలలోనే విశదీకరించారా అన్నట్లు స్పష్టీకరించారు. దీనిలో వీరి సర్వతోముఖ ప్రజ్ఞ మనకు గోచరం అవుతుంది.

ఆరవ అధ్యాయంలో బ్రహ్మ జగత్తుకు అభిన్ననిమిత్తోపాదానం, అనగా బ్రహ్మయే జగత్తుకు ఉపాదానకారణమూ నిమిత్తకారణము కూడ అను విషయం ప్రతిపాదించబడింది. బ్రహ్మ జగత్తుకు ఉపాదానకారణం అనగా జగత్తులో బ్రహ్మ అంతర్యామిగా ఉన్నది (జగత్తు వేరు; దానిలోపల బ్రహ్మ ఉన్నది) అని అర్థం కాదు; బ్రహ్మ సర్వజగద్వ్యాప్తం; సర్వజగత్స్వరూపం అనియే ఉపనిషత్సిద్ధాంతం అని విశదీకరింపబడింది. ఇలా చెప్పడంచేత బ్రహ్మను ఎక్కడనో చూడడం కాదు, ఉంగరంలో బంగారం చూచినట్లు, జగత్తులోనే బ్రహ్మను చూడాలి అని సూచించే **ఆత్మైవేదం సర్వమ్** అను శ్రుతివాక్యం అనుసరించబడింది. ఈ సందర్భంలో **కార్యము కారణముకంటె వేరు కాదు; కాని కారణము కార్యముకంటె వేరుగా ఉంటుంది** అను న్యాయాన్ని ప్రతిపాదించి, ఈ న్యాయం ప్రకారం **జగత్తు బ్రహ్మకంటె వేరు కాదు, కాని బ్రహ్మ జగత్తుకంటె వేరుగా ఉంటుంది** అని నిరూపించబడింది. ఆభరణ – తత్ప్రతిబింబాల దృష్టాంతం చూపి తద్వారా ఈ విషయం స్పష్టీకరించబడింది. ఒకదానికి మరొకటి కారణం అని చెప్పినపుడు వాటి కార్యకారణ– భావానికి నిమిత్తమైన, వాటిని కలిపే, ఒక పదార్థమును కూడా అంగీకరించవలసి ఉంటుంది. ఇక్కడ కార్యమైన జగత్తుకూ కారణమైన బ్రహ్మకూ సంబంధం ఏర్పరచేది ఒకటుంది; అదే మాయారూప ప్రకృతి. ఇదొక శక్తి. కార్యం పుట్టడానికి ముందూ, పుట్టి కొంతకాలం ఉండి నశించిన తరువాతా కూడా అది (కార్యం) కనబడకపోయినా శక్తిరూపంలో (కారణంలో) ఉంటుంది గాన అప్పుడు కూడా ఇది సత్తే (ఉన్నదే) అని అంగీకరించాలి అని ప్రతిపాదించబడింది.

ఏడవ అధ్యాయంలో బ్రహ్మకారణత్వ చర్చ చేబట్టి ప్రారంభంలోనే శ్రీ స్వాములవారు – **సదేవ సోమ్యే దమగ్ర ఆసీత్** (ఓ! సౌమ్యుడా! సృష్టికి పూర్వం ఇదంతా సద్రూపంలోనే, బ్రహ్మరూపంలోనే, బ్రహ్మగానే ఉండేది), అను ఛాందోగ్యోపనిషద్వాక్యం భాష్యానికున్న అర్థగాంభీర్యాన్ని విశదీకరించారు. "సృష్టికి పూర్వం 'సత్' (బ్రహ్మ) మాత్రమే ఉండేది" అని చెప్పడంచేత బ్రహ్మకంటె వేరుగా జగత్తుగాని జీవుడుగాని లేరు అని చెప్పినట్లే కదా? సృష్ట్యనంతరం మాత్రం వాటికి (జీవజగత్తులకు) సత్‌కంటె భిన్నంగా అస్తిత్వం ఎలా ఉంటుంది? ఇది అద్వైతానికి చాలా కీలకమైన వాక్యం అంటూ వీరు బ్రహ్మ–జగత్తులలో వలెనే జీవబ్రహ్మల విషయంలో కూడా ఒక న్యాయాన్ని ప్రతిపాదించారు. **జీవుడు బ్రహ్మకంటె వేరుకాదు; కాని బ్రహ్మమాత్రం**

జీవునికంటె వేరైనది. ఈ సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొన్నట్లయితే, అద్వైతులు చెప్పే జీవబ్రహ్మ సంబంధాన్ని, జగద్బ్రహ్మ సంబంధాన్ని బట్టి (1) భోక్త భోగ్యమూ ఒకటే అని చెప్పవలసి ఉంటుంది కదా? (2) బ్రహ్మ జగత్తును సృష్టించడం ద్వారా తనకు అహితం చేసికొన్నది అవుతుంది కదా? (3) సాధనాలు సహకారి కారణాలూ లేకుండా సృష్టి ఎలా జరుగుతుంది? (4) ఈ సృష్టి ఏమి ప్రయోజనం ఉద్దేశించి చేసినట్లు? (5) పరమేశ్వరునికి కొందరి విషయంలో రాగం కొందరి విషయంలో ద్వేషం ఉంటుందని చెప్పవలసి వస్తుంది కదా? (6) ప్రళయంలో జగత్తు బ్రహ్మలో లీనమైపోయినప్పుడు దానిలో ఉన్న దోషాలన్నీ బ్రహ్మలో సంక్రమిస్తాయి కదా? (7) చేతనం నుంచి జడం ఎలా పుడుతుంది? (8) బ్రహ్మ జగదాకారంగా పరిణమిస్తే అది సావయవం అని చెప్పినట్లవుతుంది కదా? ఇత్యాద్యాక్షేపాలన్నింటికీ ఈ సూత్రం ద్వారా తగు సమాధానాలు లభిస్తాయని ప్రతిపాదించబడింది.

జడం చేతనంనుంచి పుట్టినా దానిలో చైతన్యం లేకపోవడానికి శ్రీ స్వాములవారు హైడ్రోజన్–ఆక్సిజన్‌ల కలయికవల్ల పుట్టిన జలంలో ఆ రెండింటి లక్షణాలూ లేకపోవడాన్ని దృష్టాంతంగా చూపారు. శ్రీ శంకరాచార్యులైతే ఒక అడుగు ముందుకు వెళ్లి – "సకల జగత్తుకూ బ్రహ్మయే కారణం అని దృఢంగా నమ్మిన బ్రహ్మవాదికి చైతన్యం లేనిదానిని దేనిని చూపుతావు?" అని ప్రశ్నించారు. **"కిం హి యచ్చైతన్యే నానన్వితం తద్ బ్రహ్మప్రకృతికం దృష్టమితి బ్రహ్మవాదినం ప్రత్యుదాహ్రియేత? సమస్త జగతః బ్రహ్మ ప్రకృతికత్వాభ్యుపగమాత్"** (సూ.భా. 2.1.6).

ఎనిమిదవ అధ్యాయంలో మాయను గూర్చిన విచారణ చేయబడినది. "జగద్–బ్రహ్మరూప కార్యకారణాల మధ్య సంధాయకంగా ఉన్న శక్తియే మాయ అని చూసి ఉన్నాం. మాయ బ్రహ్మాధీనము. బ్రహ్మనే ఆశ్రయించి బ్రహ్మకు లొంగి ఉంటుంది. ఇది బ్రహ్మరూపమా తదన్యమా అని నిశ్చితంగా చెప్పడానికి శక్యం కాదు. అందుచేత ఆవిధంగా అనిర్వచనీయం. జీవుడు మాయకు వశంవదుడు. జీవుని కర్మఫలభోగంకొరకే ఈ సృష్టి జరుగుతున్నది" అని చెప్పి ఉపనిషదుక్తమూ, భాష్యకారసంమతమూ అయిన సృష్టిక్రమమూ పంచీకరణాదికమూ కూడా ఈ అధ్యాయంలో విశదీకరింపబడ్డాయి.

తొమ్మిదవ అధ్యాయంలో బ్రహ్మ లక్షణాలుగా చెప్పబడ్డ సత్యజ్ఞానాది భావరూప విశేషణాలు, పాపరాహిత్య–జరారాహిత్యాద్యభావరూపవిశేషణాలు వివరించబడ్డాయి. బ్రహ్మ సత్యం, దానినుండి పుట్టిన, దాని వికారమైన జగత్తు అసత్యం. ఇక్కడ శ్రీ స్వాములవారు ఈ శబ్దాల అర్థాలను శ్రీ శాంకర తైత్తిరీయోపనిషద్భాష్యంలోని వాక్యం ఉదాహరించి విశదీకరించారు. – **"యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం న వ్యభిచరతి తత్సత్యమ్; యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం వ్యభిచరత్ తదనృతమ్"** (తై.భా. 2.1.1). (ఏనాటికీ మార్పు చెందకుండా ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండేది సత్యం. అనేకమైన మార్పులు చెందుతుండేది అసత్యం). అంతేకాని అసత్యం అనగా అసలే లేనిదని అర్థం కాదు. ఈ విషయం గుర్తుంచుకుంటే శాంకరసిద్ధాంతం విషయంలో ఉన్న అపోహలన్నీ తొలగిపోతాయి.

కార్యం కారణాభిన్నం. అందుచేత కార్యాన్ని కారణరూపంలో చూడడం యుక్తం. కాని వ్యవహారంలో కార్యాన్ని కారణంకంటె భిన్నంగానే చూడడం జరుగుతున్నది. ఇలా చూడబడే కార్యం మిథ్య. ఇది సత్యకార్యంకంటె భిన్నమైనది. ఇది ద్రష్టయొక్కబుద్ధిలోనే ఉంది. దీని జ్ఞానం మిథ్యాజ్ఞానం.

మనం వెనుక చూచినట్లు అసత్యజగత్తును కారణదృష్టితో చూస్తే అది బ్రహ్మాభిన్నం. అందుచేత అది తత్త్వాన్యత్వాలచేత అనిర్వచనీయం. మిథ్యాజగత్తు బ్రహ్మాభిన్నం కాదు. అందుచేత అది అనిర్వచనీయం

కాదు. శాంకరభాష్యానుసారం శ్రీ స్వాములవారు సత్యత్వ–అసత్యత్వ–అనిర్వచనీయత్వ మిథ్యాత్వాదుల స్వరూపం ఇదం ప్రథమంగా విశదీకరించి ఎన్నో భ్రాంతుల తొలగించారు. ఈవిధంగా మరుమరీచిక (ఎడారిలో, లేక ఎక్కువ సూర్యప్రకాశం ఉన్న దీర్ఘమైన తారురోడ్డు మొదలైన వాటిమీద, ప్రసరించి ఉన్న సూర్యకాంతి) అనిర్వచనీయం కావచ్చునేమోగాని మరు మరీచికాజలం మాత్రం అనిర్వచనీయం కాదు అని శ్రీ స్వాములవారు ప్రతిపాదించారు. అయితే – ఆ జలమూ, శుక్తిరజతాదికమూ కూడా "తత్త్వాతత్త్వాభ్యామ్ అనిర్వచనీయం' కాకపోయినా **'సత్త్వాసత్త్వాభ్యామ్ అనిర్వచనీయం'** కావచ్చునేమో.

పై వివరణమును అనుసరించి పారమార్థికసత్య–వ్యావహారికసత్య–ప్రాతిభాసికసత్యాలను ప్రతిపాదించి పిమ్మట బ్రహ్మయొక్క జ్ఞానరూపత్వ – సర్వజ్ఞత్వ–అనంతత్వాలు విశదీకరింపబడ్డాయి.

పదవ అధ్యాయంలో నిర్గుణబ్రహ్మ స్వరూప ప్రతిపాదనం చేయబడింది. **ఉపనిషత్తులలో** బ్రహ్మ సవిశేషముగాను నిర్విశేషముగాను (సగుణముగాను నిర్గుణముగానూ) కూడా వర్ణించబడింది. వీటిని సరిగా సమన్వయం చేసికొనే విధానం ప్రతిపాదింపబడింది. ఈ ప్రకరణంలో జగత్తు సత్తా అసత్తా అను విచారణము, అధ్యారోపాపవాద స్వరూప ప్రతిపాదనమూ భాష్యకారమతానుసారంగా చేసి చివరకు బ్రహ్మయొక్క నిర్గుణత్వం స్థాపించబడింది.

పదకొండవ అధ్యాయంలో జీవస్వరూప స్వభావాదులను గూర్చిన చర్చ చేయబడింది. కర్తృత్వము, భోక్తృత్వము, జ్ఞాతృత్వము అనే త్రివిధమిథ్యాజ్ఞానం జీవునికి అవిద్యవల్లనే కలుగుతున్నది. అవిద్య జీవునిలో ఉంటుంది. జీవాశ్రితం. జీవుని శరీరాదులు మాత్రం మాయాకార్యాలు. జీవునికి సంబంధించిన స్థూల–సూక్ష్మ–కారణశరీరాల స్వరూపం వివరించబడింది. పంచవృత్తియైన ప్రాణం చేసే పనులు చెప్పబడ్డాయి. నిజానికి అన్ని ఇంద్రియాలకూ ఆయా పనులు చేసే శక్తిని ఇచ్చేది ప్రాణశక్తియే. ఇది వాయుమాత్రం కాదు. వాయువులోని శక్తివిశేషం.

మాయ అవిద్య అనేవి రెండూ వేరువేరైనవి. మాయ బ్రహ్మాశ్రయమూ బ్రహ్మతాదాత్మ్యం కలదీ అయితే అవిద్య జీవునికి సంబంధించినది అని శ్రీస్వాములవారు **పన్నెండవ అధ్యాయంలో** సంయుక్తికంగా సప్రమాణంగా ప్రతిపాదించారు. అవిద్య జీవాశ్రితమని శ్రీ శంకరాచార్యులు ఒకచోట సూచించి ఉన్నారు – "కస్య పునరయమప్రబోధ ఇతి చేత్ – యస్త్వం పృచ్ఛసి తస్య త ఇది వదామః. నన్వహమీశ్వర ఏవోక్తః శ్రుత్యా? యద్యేవం ప్రతిబుద్ధోఽసి; నాస్తి కస్యచిదప్రబోధః" (సూ.భా. 4.1.3). ("ఈ అజ్ఞానం ఎవరిది?" ఎవరిది అని అడుగుతూన్న నీదే; నీలోనే ఉంది అని చెపుతాం". "నేను ఈశ్వరుడను అని శ్రుతి చెప్పింది కదా?". "అలాగా! అయితే నీకు జ్ఞానం కలిగిందన్నమాట. ఇంక ఎవరికీ కూడ అవిద్య లేదులే!"). ఎంతమంది జీవులో అన్ని అవిద్యలు. జీవుడు తన బ్రహ్మ భిన్నత్వాన్ని తెలిసికొనకపోవడమే అవిద్య. ఇదే అజ్ఞానం. దీనివల్లనే జీవునకు అనేక సుఖదుఃఖాదులు వివిధ జన్మలు కలుగుతున్నాయి. అవిద్యయే అధ్యాసకు కారణం. తన విషయంలో సరియైన జ్ఞానం లేకపోవడమే అధ్యాస. అయితే ఈ అధ్యాసకు మాయాకార్యమైన శరీరాదికం ఆధారం. తాను కాని శరీరాదికాన్ని తాను అనుకుంటున్నాడు కదా జీవుడు? అవిద్య భావరూపం కాదు. అభావరూపమే. ఇది అనాది. ఈ అనాద్యవిద్యకు వశుడై జీవుడు కర్మలు చేస్తాడు, వాటి ఫలం అనుభవించడానికి జన్మనెత్తుతాడు. వీని కర్మఫలానుభవం కొరకే జగత్సృష్టి జరుగుతున్నది. ఈవిధంగా జగత్సృష్టికి అవిద్యయే పరంపరయా కారణం. ఈసందర్భంలో శ్రీస్వాములవారు – అక్కడక్కడ భాష్యకారులు జగత్తు అవిద్యాజన్యం అన్నదాని భావం విశదీకరించారు. ఈవిధంగా జగత్తు అవిద్యాజన్యం కాదు; అది మాయాజన్యం. అందుచేత

ఒక సాధకునికి విద్య కలిగినా జగత్తు నశించదు; యథాప్రకారం యథాపూర్వంగానే ఉంటుంది. శ్రీ స్వాములవారు చేసిన వివరణం వల్ల మిథ్యాత్వాన్ని పురస్కరించుకొని ఎన్నో ఆశంకలు చేసేవారికి తగిన సమాధానం లభిస్తుంది.

పదమూడవ అధ్యాయంలో అవస్థాత్రయ నిరూపణం చేయబడింది. స్వాప్నజ్యోతిస్సు ఆత్మదే అని ప్రతిపాదించి సుషుప్తి బ్రహ్మాత్మత్వాస్వాదానికి ఎలా ఉపకరిస్తుందో చూపబడింది. సుషుప్తిలో అవిద్య ఉంటుందా ఉండదా అని విమర్శించి అవిద్య ఉంటుంది కాని అధ్యాస ఉండదు అని నిర్ధారణ చేయబడింది.

పధ్నాల్గవ అధ్యాయంలో తురీయ స్వరూపచర్చ చేయబడింది. సాక్షిత్వమే జీవుని యథార్థ స్వరూపం అని కొందరి అభిప్రాయం శ్రుతి విరుద్ధమని ప్రతిపాదించి చిత్తవృత్తి నిరోధరూపమైన కేవలయోగం మోక్షసాధనం కాదు; అద్వితీయాత్మ స్వరూప సాక్షాత్కారం ఒక్కటే మోక్షసాధనం అని నిరూపించబడింది. ఆత్మజ్ఞానానంతరం త్రిపుటి ఉండదు అని శ్రుతి చెప్పినా ఇది (త్రిపుట్యభావం) శూన్యవాదుల శూన్యవాదం వంటిది కాదు, విజ్ఞానవాదుల త్రిపుటీ నిరాకరణం వంటిది కాదు; జగత్తు నీకంటె వేరుకాదు; అందుచేత నీలో వ్యవహారం కొంచెం కూడా ఉండదు అని మాత్రమే శ్రుతి త్రిపుటిని నిరాకరించింది. అందుచేత ఈ విషయం సరిగ్గా అర్థం చేసికొనకుండా **అద్వైతులు ప్రచ్ఛన్న బౌద్ధులు అని చెప్పినవారు అప్రచ్ఛన్నమూర్ఖులు** అని విశదీకరింపబడింది.

బౌద్ధుల క్షణికవాదాన్నీ, శూన్యవాదిబౌద్ధుల శూన్యవాదాన్నీ, "విజ్ఞానమే బాహ్యపదార్థరూపంలో కనబడుతుంది. అందుచేత జగత్తు స్వప్నసదృశం" అనే విజ్ఞానవాదిబౌద్ధుల విజ్ఞానవాదాన్నీ ఖండించి విజ్ఞానంకంటె భిన్నంగా జగత్తు ఉన్నదనీ, అది స్థిరం అనీ, స్వప్నజగత్సదృశం కాదనీ బ్రహ్మసూత్ర భాష్య ద్వితీయాధ్యాయంలోని సముదాయాధికరణ - అభావాధికరణాలలోను, బృహదారణ్యకోపనిషద్భాష్యా దులలోనూ స్థాపించిన భాష్యకారుల వాదాలను జాగర్తగా అర్థం చేసికొంటే శ్రీస్వాములవారి మాటలలోని యాథార్థ్యం స్పష్టం అవుతుంది.

పదిహేనవ అధ్యాయంలో ప్రధానంగా పంచకోశ విమర్శచేసే సందర్భంలో వ్యష్టి-సమష్టి స్వరూపాల నిర్ధారణ చేయబడింది. మోక్షసాధన-మోక్ష స్వరూపాదులు **16వ అధ్యాయంలో** ప్రతిపాదించబడ్డాయి. మోక్షం కర్మజన్యం కాదు; కర్మ-జ్ఞానాలకు సముచ్చయం కుదరదు అని కూడా ప్రతిపాదించబడింది. సంన్యాసం వేదోక్తమే అను విషయం **17వ అధ్యాయంలోను, 18,19 అధ్యాయాలలో** ఉపాసనా-కర్మస్వరూపాలూ, ప్రసక్తానుప్రసక్తంగా వర్ణాశ్రమాది విషయాలు విశదీకరింపబడ్డాయి. జ్ఞానం ఒక్కటే మోక్షానికి మార్గం. కేవలభక్తి మోక్షసాధనం కాదు అని చెప్పే సందర్భంలో రాక్షసాదుల భక్తి ఏవిధంగా మోక్షోపయోగి కాలేదో ఉదాహరణంగా చూపబడింది.

తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ అని ఉపనిషత్తులో చెప్పినట్లు తాము చేసిన నిరంతరమనన నిదిధ్యాసరూప తపస్సుకు ఫలంగా లభించిన ఆత్మజ్ఞానానికి అక్షరరూపం ఇచ్చిన పరమపూజ్యులు శ్రీ పరమానందభారతీ స్వాములవారికి ఆధ్యాత్మికతత్త్వజిజ్ఞాసువైన ఆస్తికలోకం అధమర్ణమై ఉన్నది.

16-8-2007

పుల్లెల శ్రీరామచంద్రుడు

శతాధిక గ్రంథ నిర్మాత

మహామహోపాధ్యాయ, వేదాంత శిరోమణి, వేదాంత విశారద

ఎమ్.ఎ., పిహెచ్.డి (సంస్కృతం), ఎం.ఎ. (ఆంగ్లము), ఎం.ఎ. (హిందీ)

సమీక్షణలు

–స్వామీ మహేశానంద గిరి

ప్రస్థానత్రయ భాష్యకారులైన ఆదిశంకరులు స్థాపించిన శ్రీ శృంగేరీ మఠపరంపరకు చెందిన శ్రీ పరమానందభారతీ స్వామివారు ఈ గ్రంథ రచయిత. వీరు సాంప్రదాయ సంన్యాసులైనందువల్ల ప్రామాణికమైన అద్వైతవాది. వీరి గ్రంథాన్ని ఆమూలాగ్రం పరిశీలన చేసిన ఎవరికైనా ఇదే అభిప్రాయం బలపడుతుంది. సంవత్సరకాలం నుండి వీరితో నాకు పరిచయం వుంది. ఏ కాలంలో అయినా చాలా అపురూపమైన ప్రధాన లక్ష్యం కలిగిన వీరి తాత్త్విక అన్వేషణ నాకు చాలా ఆనందకారణమైంది. అందువల్ల ఈ గ్రంథం ప్రకటింపబడాలని ఆశిస్తాను. ఎందుకంటే ఈ గ్రంథ ప్రచారంవల్ల అనేక తత్త్వ చింతకులు విశేష లాభం పొందగలరని నా ప్రగాఢమైన విశ్వాసం.

శంకరాచార్యులవారి భాష్యం సుస్పష్టమయినా, గంభీరమయినందువలన, సాధకుల దృష్టి భేదం వలన వేరువేరు అర్థాలు వ్యాప్తి చెందాయి. సిద్ధాంతం ఒకటే అయినా దానిని ప్రకటించే పద్ధతులలోనే విభిన్నత కనిపిస్తుంది. ఏయే ప్రక్రియలవల్ల సాధకునికి బ్రహ్మానుభవం దృఢమవుతుందో ఆ ప్రక్రియలే శ్రేష్ఠమని, ఆ కారణంగా ఇతర ప్రక్రియలలో వారికి దోషాలు స్ఫురిస్తాయి. బ్రహ్మసిద్ధి శాస్త్రలక్ష్యం కనుక దీని ప్రాప్తి ఏ ప్రక్రియల వల్ల కలుగుతుందో అవి స్వీకరించదగినవే అని భగవాన్ శ్రీ సురేశ్వరాచార్యులవారు స్పష్టంగా చెప్పారు. అందువల్ల అవన్నీ కూడా సంప్రదాయాన్ని అనుసరించే వున్నాయి. 'సిద్ధాంతలేశ సంగ్రహము' అనే గ్రంథంలో శ్రీ అప్పయ్యదీక్షితులవారు ఈ అనేక ప్రక్రియలను సంగ్రహంగా వివరించారు. జ్ఞానం వల్ల అవిద్యా నివృత్తి అవుతుందనటంలో సందేహం లేదు. అయితే అజ్ఞాన స్వరూప విచారణలోనే భేదాభిప్రాయాలన్నీ వస్తాయి. అజ్ఞానం కారణకోటితో చేరినందువల్ల ఇది అభావం కావడానికి అవకాశం లేదు. అది అభావ విలక్షణము అని చెప్పి 'వివరణాచార్య ప్రకాశాత్మ శ్రీచరణులు' దీన్ని భావరూపమని చెప్తున్నారు. ఈ అభిప్రాయమును తరువాత వచ్చిన ఆచార్యులు అందరూ దీనిని ఆమోదించారు. కాని ఈ ప్రబంధంలో దీనిని అభావరూపమని చెప్పారు. అక్కడక్కడా శ్రీ శంకర భగవత్పాదులు కూడా "అవివేక నిబంధనో భ్రమః" అని అన్నారు. ఈ అర్థంలోనే దీనిని స్వీకరించవలెను.

జగదుత్పత్తికి కారణం బ్రహ్మ అనడంలో ఆచార్యులందరిదీ ఏకాభిప్రాయమే! అయితే ఎలా ఉత్పన్నమయిందన్న విషయంలోనే భేదాలన్నీ వస్తున్నాయి. కొందరు మాయ, అవిద్యలు రెండూ ఒకటే అంటున్నారు. కొందరు భిన్నమని చెప్తున్నారు. కొందరు అవిద్య ఒక్కటే కాని దీని అవస్థలు అనేకంగా ఉన్నాయని చెప్పి జీవభేదాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఇంకా కొందరు అవిద్య అనేక విధాలని ఆరోపిస్తున్నారు. ఈ విధంగా అనేకమంది గౌరవనీయులైన ఆచార్యులలో మతభేదాలు ఉన్నాయి. ఆ ఆచార్యులు – వారి అనుయాయులు వాదోపవాదాలతో అనేక గ్రంథాలు వ్రాశారు. నిజానికి ఇవన్నీ వేదాంత సంప్రదాయంలో అమూల్యసంపద. మాయామయమైన ఈ జగత్తులో ఏదీ నిర్దుష్టంగా నిరూపించలేం; కొన్ని చోట్ల శాస్త్ర వాక్యములను తీసుకుని, కొన్నిచోట్ల యుక్తులను తీసుకుని సమన్వయము చేస్తారు. దేనివల్ల సాధకునికి సంశయనివృత్తి అయి జ్ఞానం కలుగుతుందో దానిని ఆమోదించవలసి వస్తుంది.

ఈ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకుని విద్వాంసులైన ప్రబంధకారులు మాయ–అవిద్యల భేదాన్ని యుక్తమైనదిగా భావిస్తున్నారు. 'ఆచార్య అనుభూతి స్వరూప' గారు మొదలైన సాంప్రదాయకులు, అనుభవజ్ఞులు అయిన ఆచార్యులు దీనినే చెప్తున్నారు.

'అవిద్యా' నివృత్తి అయిన తరువాత కూడా 'మాయ యొక్క వృత్తిరూపమైన ప్రారబ్ధం' వుంటూనే వుంటుంది! జీవన్ముక్తి ప్రసంగం దీనితో సమన్వయం అవడంవల్ల ఇది సమంజసమే! ఇలా మాయ–అవిద్యల భేదం నిర్ణయించకపోతే జీవన్ముక్తి తరువాత కూడా అవిద్యా లేశం ఉన్నదనే ఆమోదించవలసి వస్తుంది. ఒకరు ముక్తులయితే అందరూ ముక్తులవరు; ఆత్మజీవులలో సూర్యబింబ–ప్రతిబింబ భావాన్ని పెట్టుకుంటే కూడా జీవుల అనేకత్వమునకు అనేక దర్పణములు కావాలి. అందువల్ల, అవిద్యా భేదముతో అనేక జీవత్వం గ్రహించడం సులభమవుతుంది. ఇక, మాయ యొక్క ఏకత్వంవల్ల అనావశ్యకముగా ఈశ్వరునిలో అనేకత్వ కల్పనకు కూడా అవకాశం వుండదు. ఇది తార్కికులకు కొంత బాధగా ఉన్నా, సామాన్యుని విచారణకు అనుకూలంగా వుంటుంది. స్వయంగా శ్రీ భగవాన్ భాష్యకారులే "అదృశ్యత్వాధికరణం'లో ఇలా స్పష్టం చేశారు. "అవ్యాకృతమ్ ఈశ్వరాశ్రయమ్ తస్యైవోపాధి భూతమ్।" ఈ ప్రక్రియ ప్రకారం 'ఆకాశాది' పంచభూతసృష్టి ఈశ్వరాశ్రిత మాయాకార్యం – అంతఃకరణ సంబంధమై సమస్త సృష్టి జీవాశ్రితమైన అవిద్యాకార్యం. మహాభూతాలలో మాయాకార్యం వల్ల కారణరూపంగా ఈశ్వరుని ప్రవేశం జరుగుతూనే వున్నది. ఈ విధంగా కళల జ్ఞానాన్ని మించి తత్త్వవేత్తల దృష్టి ప్రసరించినప్పటికీ, ఇప్పటి తరాల వారికి ముందటి విధంగానే భావన కలుగుతోంది. అవిద్యలో ఏకత్వం భావించేవారికి కూడా – అవిద్యాకారణమైన ఘటపటాది రూపముల తాదాత్మ్య అభావం వల్ల, అంతఃకరణ తాదాత్మ్యం నిశ్చయించడం కోసం, జీవేశ్వరుల ఉపాధిరూపమైన అవిద్యలో భేదమును ఆమోదించవలసి వస్తుంది.

కేవలం ప్రస్థానత్రయ భాష్యాధారంతో విచారణ చేయాలనే తలంపుతోనే గ్రంథకర్త వ్రాశారు. భాష్యము స్పష్టంగానే ఉన్నా కూడా ఎక్కడెక్కడ భాష్యముయొక్క అవగాహన కోసం పూర్వాపర విచారణ చేయవలసి వస్తుందో, ఆయా చోట్లలో ప్రక్రియా భేదాలకు అవకాశం ఉన్నది. ఇలా ఒక్క ప్రకరణం 'ఆనుమానాధికరణం'లో ఉన్నది – "అవిద్యాత్మికా హి బీజశక్తిః, అవ్యక్త శబ్ద నిర్దేశ్యా పరమేశ్వరాశ్రయా మాయామయీ మహాసుప్తిః।" ఇక్కడ బీజశక్తి అవిద్యారూపమే అనిపిస్తున్నది; కాని, ఇందులో సాంఖ్యుల కల్పితమైన 'ప్రధానాని'కి వేదాంతంలోని మాయకి భేదం చెప్పబడే ప్రసంగం. అందువల్ల ఇక్కడ స్పష్టమయ్యే అర్థం ఏమిటంటే విద్యవల్ల 'బంధం' అనే భావనివృత్తి జరగడం కారణంగా, అవిద్యే దాని స్వభావము లేక లక్షణము అని స్పష్టంగా తెలుస్తున్నది. 'రత్నప్రభాకరుడు' ఇలా అన్నాడు – "తస్యాః పరపరికల్పిత సత్య స్వతంత్ర ప్రధానాత్ వైలక్షణ్యమాహ అవిద్యేత్యాదినా" అందువల్ల లక్షణభేదమే ఇక్కడ చెప్పబడుతున్నది. షడ్దర్శనాలను ఆమూలాగ్ర పరిశీలన చేసిన 'వాచస్పతి' అవిద్యలో – ప్రతి ఒక్క జీవభేదాన్ని ఈ సందర్భంలో ఆమోదించారు. "ప్రధానా భేదేఽ పి చైతదవివేకఖ్యాతి లక్షణావిద్యా సదసత్త్వ నిబన్ధనౌ బంధమోక్షౌ।" అని చెప్పి ఆఖరున – "అవిద్యా మాత్రేణ చైకత్వోపచారో అవ్యక్తమితి।" అని చెప్పారు. ఈ ఏకత్వము అవిద్యా లక్షణము – ఔపచారికము లేక గౌణము అని ఇలా స్పష్టము చేశారు. ముందు ముందు 'మాయామయీ' అనే పదంతో అభేదవాదులకు కూడా బలం కలుగుతోంది. ఇలాగే అనేక చోట్ల చూడవచ్చు. అయితే మనం ఒక విషయం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. అందరూ ఆమోదించిన విషయం – జ్ఞానం వల్ల అజ్ఞాన నివృత్తి; అజ్ఞాన నివృత్తే మోక్షము; సోపాధిక బ్రహ్మమే కారణ బ్రహ్మము, నిర్వికార బ్రహ్మమే వాస్తవము. సూక్ష్మవిచారము చేసే తత్త్వవేత్తలకు ఇక్కడ భేదము కనబడుతుంది. అర్థభేదము తక్కువగా కనబడుతుంది. ఇటువంటివి పూర్వమే చాలా జరిగాయి. ఇక క్రొత్తగా విచారణ ఏమీ లేదు. "అతః", శబ్దజాలం మహారణ్యం చిత్తభ్రమణ కారణమ్। అతః ప్రయత్నాత్ జ్ఞాతవ్యం తత్త్వజ్ఞాత్ తత్త్వమాత్మనః।" (వివేక చూడామణి). బహుశః ఈ గ్రంథకర్తకు పరిచయమైన విద్వాంసులు

భేదప్రక్రియకు విరోధులయి వుంటారు. అందువల్ల వీరు భేదప్రతిపాదనను బలంగా చెప్తున్నారు. వీరి ఈ అభిప్రాయము సరియైనదే అనిపిస్తున్నది. ఎందుకనగా ఏదైనా ఒక ప్రక్రియ దృఢమైన తరువాతనే దానిని గ్రహించడానికి ఇతర ప్రక్రియలు సహకరిస్తాయి.

ప్రబుద్ధులైన మన స్వామిజీ వేదాంత ప్రచారంలో ఎక్కువ శ్రద్ధ కలిగినవారు. శ్రీ శంకరాచార్యులు బౌద్ధులను, తార్కికులను, సాంఖ్యయోగులను, మీమాంసకులను మొదలైన అనేక మతములకు సంబంధించినవారిని ఎదుర్కోవలసి వచ్చేది. అందువల్ల వారి వివిధ సంస్కారములను సరిచేయడానికి వారి వారి భాష, సిద్ధాంతములతోనే ఖండించవలసిన అవసరం ఉండేది. అయితే, ఇప్పటి సాధకులలో ఇటువంటి సంస్కారములు లేవు. వర్తమానంలో ప్రచారంలో ఉన్న అనేక అభిప్రాయాలను వారి వారి నిర్ణయాలతోనే ఖండించవలసి వస్తున్నది. ఆధునిక విజ్ఞానాన్ని పైవిధంగా వినియోగించడంలో స్వామిజీ చాలా నేర్పును చూపారు. అనేక వైజ్ఞానిక విషయాలను, ముఖ్యంగా గణితంలో – దృష్టాంతాలను ఉదహరించి, వేదాంతానికి పుష్టిని చేకూర్చారు. విజ్ఞానవేత్తలను – దార్శనికులను సమ్మేళనపరచి స్వామిజీ ఈ కార్యమును చక్కగా చేస్తున్నారు. కాని వైజ్ఞానికుల ఆలోచనాపరిధి ఎప్పుడూ బాహ్యాజగత్తులోనే వుంటుంది; కనుక వారి విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగానే ఉండాలి; లేకుంటే ఎక్కడో ఒకచోట మోసగింపబడతాము. వారి అభిప్రాయాలను ఖండించడంవల్ల వారికీ కొత్తదృష్టి ఏర్పడుతుంది; సాధకుల భ్రమలు కూడా తొలగిపోతాయి. ఈవిధంగా ప్రయత్నం చేయడంలో ఈ వ్యాఖ్యాత సఫలత్వం పొందాలని భగవాన్ భాష్యకారులను ప్రార్థిస్తున్నాము.

స్వామిజీ దీర్ఘాయుష్మంతులవుదురుగాక! ఇటువంటి గ్రంథరచనలలో పూర్ణ సఫలత్వాన్ని పొందుదురుగాక!

స్వామి మహేశానందగిరి

శంకరమఠం

ఆబూ పర్వతము, రాజస్థాన్

– స్వామీ త్రిభువనదాస్

అందరు జీవులకి ఒకే కోరిక ఉంటుంది. అదే దుఃఖనివృత్తి – ఆనంద ప్రాప్తి. ఇది స్వాభావికమైన అభిలాష. ఆత్యంతిక దుఃఖనివృత్తి రూప పరమానందమే ముముక్షువుల లక్ష్యము. మోక్షము పొందాలని వాంఛించేవారే ముముక్షువులు. మోక్షసిద్ధికి ఒకే ఒక సాధనము జ్ఞానము. శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు అయిన ఆచార్యుని ద్వారా వేదాంత వాక్య శ్రవణం చేయడమే జ్ఞానానికి సహకారము. ఇందుకోసమే ప్రస్థానత్రయ భాష్యములు రచింపబడ్డాయి. ఇప్పటివరకూ ఈ విధమైన భాష్యాలన్నింటిలో సర్వాధిక ప్రసిద్ధి, ప్రచారము కలిగినది శ్రీ శంకరాచార్యులు రచించిన – అద్వైత సిద్ధాంతానురూపమైన 'ప్రస్థానత్రయ భాష్యము' ఒక్కటే ఎన్న తగ్గది. వేదాంత ప్రసంగాలలో విద్వాంసులు కూడా సాధారణంగా భాష్యంలో చెప్పిన లక్షణాలను వదలి ప్రకరణ గ్రంథాలలోని లక్షణాలనే చెపుతూ వుంటారు. ఉదాహరణకు 'యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం న వ్యభిచరతి తత్సత్యం। యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం వ్యభిచరత్ అనృతం।" (తై॥ భా॥ 2-1-1) అని శంకర భగవత్పాదులు వివరించినవీ, ఖండించడానికి వీలులేనివీ అయిన భాష్య లక్షణాలను విసర్జించి ఇతర గ్రంథాలలోని లక్షణాలను స్వీకరిస్తున్నారు. ఇది చాలా బాధాకర విషయం. భాష్యకర్త వివరించిన లక్షణాలనే స్వీకరించవలసి వున్నది. "బ్రహ్మసూత్ర భాష్యం" పైన "పంచపాదిక", "భామతి", "రత్నప్రభ" "న్యాయనిర్ణయం" మొదలైన అనేక ప్రసిద్ధ వ్యాఖ్యానాలున్నాయి. ఈ వ్యాఖ్యానాలన్నింటిలో కూడా అనేక మతభేదాలున్నాయి. మాయామయమైన ఈ జగత్తులో ఏ పక్షంలోకూడా సత్యానికి అవకాశం లేనందువల్ల అద్వైత తత్త్వాన్ని అవగాహన చేసుకోవడంలో, వివిధ ప్రక్రియలను స్వీకరించడం అవసరమే! కాని, వ్యావహారిక సత్యదృష్టిలో వేదాంతులు అన్యమతాలను ఖండించే సందర్భాలలో అన్యమత అయథార్థతను – అసత్యతను, స్వమత యథార్థతను – సత్యతను నిర్ణయిస్తూ వుంటారు. ఈ విధంగా వేదాంతవేత్తలైన టీకాకారులు వ్రాసిన భిన్న భిన్న విధాలైన ఆపేక్షిక సత్యాలను వేదాంతులు స్వీకరిస్తూనే వున్నారు. వస్తుతః భాష్య విరుద్ధార్థాలను ప్రతిపాదించడం లేదు. భాష్యంలోని పూర్వాపరాలను కూలంకషంగా పరిశీలన చేసి నిర్ణయించిన ప్రకృష్టమైన అర్థమే భాష్యార్థము.

"జ్ఞానాదేవతు కైవల్యమ్" "తమేవ విదిత్వా అతి మృత్యుమేతి" మొదలైన శ్రుతులలో ప్రతిపాదించిన మోక్షసాధనము "బ్రహ్మజ్ఞానమే". ముముక్షువులు ఆధ్యాత్మికాది తాపత్రయ సంతప్తులై, సాధన చతుష్టయ సంపత్తి సంపాదించి జ్ఞానం పొందాలనుకుంటారు. ఇందుకొఱకే పరమాత్మ జగత్సృష్టి చేశాడు. "యది హి నామరూపే న వ్యాక్రియేతే, తదా అస్య ఆత్మనో నిరుపాధికం రూపం ప్రజ్ఞానఘనాఖ్యం న ప్రతిఖ్యాయేత॥" (బృ॥ భా॥ 2-5-19)– ఇలా నామరూపాత్మకమైన జగత్తు సృష్టింపబడకపోతే ఆత్మయొక్క ప్రజ్ఞానఘనము, నిరుపాధికము అయిన రూపము తెలియబడేది కాదు అని భాష్యంలో స్పష్టం చేశారు. జ్ఞానం వల్ల అజ్ఞానుల – అజ్ఞాన నివృత్తి కొఱకే జగత్సృష్టి జరిగింది. శుద్ధాత్మస్వరూపంలో బ్రహ్మ అకర్త అయినందువల్ల ప్రపంచ నిర్మాణానికి దానిలో ప్రవృత్తి వుండదు. మాయా ఉపాధి శుద్ధాత్మకు ప్రవర్తకము. అనగా బ్రహ్మకు సృష్టికార్యం చేయడానికి మాయా ప్రవృత్తి కలిగిస్తుంది. ఈ సృష్టి ప్రయోజనము అవిద్యా నివృత్తే. అవిద్యా అభావము వల్ల సృష్టి లేనేలేదు, అంటే సృష్టి కారణము కేవలమయిన మాయవల్లకాదు; అవిద్యా కామకర్మ సహితమైన మాయవల్ల అని నిశ్చయము. "నాసౌ యోగమాయా మదీయా సతీ మమేశ్వరస్య మాయావినః జ్ఞానం ప్రతిబధ్నాతి." ఈపై గీతావాక్యము (3-25)నకు ఉపక్రమభాష్యంలో ఇలా వ్యాఖ్య చేశారు. మాయ జ్ఞానమునకు

ఆవరణ కాదు – కాని “అజ్ఞానేన ఆవృతం జ్ఞానం వివేక విజ్ఞానం తేన ముహ్యంతి।” (గీ॥ 5–25) అని – అవిద్యే జ్ఞాన ఆవరణ అన్నారు. జ్ఞానావరణము – జ్ఞాన అనావరణము అని పరస్పర విరుద్ధములైన ఈ రెండు పదముల అర్థము ఒకటి కాదు. అందువల్ల మాయ – అవిద్య అనే పదములు రెండూ పర్యాయవాచకములు కాదు.... “అవిద్యాలక్షణా ప్రకృతిః మాయా ప్రవర్తతే” (గీ॥భా॥ 5–25). ఈ విధముగా అవిద్యా లక్షణమైన ప్రకృతియే సృష్టి ప్రవర్తకము. గీతాభాష్యము (7–25)లో అహంకారము – అనగా అవిద్యాసంయుక్త అవ్యక్తమే ప్రవర్తకము అన్నారు. భాష్య ప్రకారము, అవిద్యా లక్షణ ప్రవృత్తి అనగా, అవిద్యా సంయుక్త అవ్యక్తము (ప్రకృతి అంటే మాయ). ఈ విధమైన మాయ – సృష్టి క్రియలో ఈశ్వరునకు ప్రవర్తకము. గీతాభాష్యకారులు తమ భాష్యములో (7–24) అవిద్యా సంయుక్త అవ్యక్తము అనే పదమును ప్రయోగించి, అవిద్య–అవ్యక్తము (మాయ), ఈ రెండు పదములు పర్యాయ వాచకములు కావని నిషేధించారు. అయితే, అహంకారమునకు, అవిద్యా సంయుక్త అవ్యక్తము అని ఎందుకు వ్రాశారు? అని శంక కలుగవచ్చు. విషము కలిసిన అన్నమును, విషము అన్నట్లే (అజ్ఞానము) అహంకార వాసన మూలకారణంగా కలిగిన అవ్యక్తమును ‘అహంకారము’ అన్నారు.

శంకరభాష్యములో అనేకచోట్లలో – ‘అవిద్యా లక్షణ ప్రకృతి’ అన్నారు. ‘అవిద్యా సంయుక్త అవ్యక్తము’ అన్న పదమునకు ‘అవిద్యాత్మికా’ అని ఎందుకు వ్రాయలేదు? అనే శంకకు సమాధానము – స్త్రీలక్షణములతో కూడిన పురుషుడిని, ‘స్త్రీ లక్షణ పురుషుడు’ అనే అంటారు కదా! అదేవిధముగా, ‘అవిద్యా లక్షణ ప్రకృతి’ అనగా, ‘అవిద్యా సంయుక్త ప్రకృతి’. అందువలననే, భగవత్పాదులు ‘అవిద్యా స్వరూప’ అనిగాక – ‘అవిద్యాలక్షణా ప్రకృతి’ అని పదప్రయోగము చేశారు. ఈవిధముగా అవిద్య లేక మాయ జగత్కారణము అని చెప్పే సమయములలో ‘అవిద్యా సహిత మాయ’ జగత్ప్రవృత్తకము అనే అవగాహన చేసుకోవాలి. దేహేంద్రియ రూపముగా పరిణమించి జీవభావముతో స్వరూపజ్ఞానమును విస్మరింపజేసినందువల్ల (ప్రతిబంధకము అయినందువల్ల) అవిద్యా సంయుక్త మాయనే అవిద్య అని అనవచ్చు. బ్రహ్మజ్ఞానమువల్ల, అవిద్యా నివృత్తి అవుతుంది కాని, ఈశ్వరాశ్రిత మాయా నివృత్తి కాదు.

అందువల్ల ఇతరులచే చెప్పబడిన జ్ఞానియొక్క వ్యవహారం ఈశ్వరాశ్రిత మాయవల్ల జరుగుతుంది – “జీవన్ముక్తి” దశలో అవిద్యాలేశాన్ని కూడా ఈదృష్టితో ఆమోదించనవసరము లేదు. జగత్తు ఈశ్వర సంకల్ప స్వరూపమే! “ఆత్మనః స్థావర జంగమం జగదిదం అగ్ని విస్ఫులింగవత్ వ్యుచ్చరతి అనిశం వర్తతే స్థితికాలే ప్రలీయతే!” (బృ॥ భా॥ 2–1–20) ఈశ్వరుడు నిత్యుడు. అతని ప్రకృతి కూడా నిత్యమే! “నిత్యేశ్వరత్వాత్ ఈశ్వరస్య తత్ ప్రకృత్యోరపి యుక్తం నిత్యత్వేన భవితుమ్, ప్రకృతిద్వయవత్వమేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వమ్।” (గీ॥ భా॥ 3–19), “గౌరనాద్యంతవతీ సా జనిత్రీ భూతభావనీ।” (మంత్రికోపనిషత్ 9–2), “యత్ తత్ త్రిగుణమవ్యక్తమ్ నిత్యం సదసదాత్మకమ్ ।” (భా॥ 3–26–10), “అనాద్యనన్త మవ్యక్తమ్ నిత్యమ్ కారణమవ్యయమ్। (భా॥ 12–4–18) “నిత్యం తత్పరం బ్రహ్మ నిత్యాచ ప్రకృతిః స్మృతాః” (బ్రహ్మవైవర్త పురాణం 1–28–30), “ప్రకృతిం సత్యమిత్యాహుర్వికారో అనృతముచ్యతే” (బ్రహ్మాండపురాణం ఉత్తరార్థం 3–89), ముక్తావస్థలో మాయ (ప్రకృతి) లేని కారణంగా “అన్తే విశ్వమాయా నివృత్తిః” అని పై అనేక శ్రుతులు వివరించాయి. వేదాంత సిద్ధాంతానుసారముగా మాయ – తత్కార్యమైన జగత్తు వస్తుతః బ్రహ్మకన్న భిన్నము కాదు. “సదేవ సోమ్యేదమ్ అగ్ర ఆసీత్ ఏకమేవ అద్వితీయం” అని ఛాందోగ్య శృతి వర్ణించినది.

పూజ్యపాదులు శ్రీ పరమానన్ద స్వాములవారు ఈ 'వేదాంత ప్రబోధ' గ్రంథకర్త. శృంగేరీ పీఠాధిపతులు, బ్రహ్మీభూతులు అయిన శ్రీ అభినవ విద్యాతీర్థస్వామివారి కృపాపాత్రులు వీరు. కేవలాద్వైత ప్రచారకులు, సంప్రదాయనిష్ఠులు, బ్రహ్మ విద్వరిష్ఠులు, ఈ గ్రంథకర్త ప్రధానలక్ష్యము – భాష్యంలో ప్రతిపాదించిన విధానములను సరళమైన శైలిలో వివరించడమే! ఆ కారణంగా గ్రంథంలో ప్రమాణ ప్రకరణమును సంక్షిప్తముగా వివరించారు. అనుబంధ చతుష్టయములో చెప్పబడిన విషయము, ప్రయోజనము, అధికారి ఈ మూడింటి సంబంధమును కూడా గ్రంథములో ఇతరత్రా వర్ణించారు. అనుబంధ చతుష్టయమునకు గల పరస్పర సంబంధమును వివరించారు. సిద్ధాంతముయొక్క (సమ్యగ్విచారణ) కొఱకు ప్రతిపక్షుల అభిప్రాయములను సంక్షేపముగా ప్రకటించారు. కార్యకారణ – అనన్య న్యాయములను సంపూర్ణ అవగాహన కోసము చక్కని కౌశలంతో ప్రతిపాదించారు. దీనివల్ల కార్యకారణ విలక్షణమైన నిర్విశేష జ్ఞప్తి మాత్ర బ్రహ్మ స్వరూప విజ్ఞానము సులభంగా అర్థమవుతుంది.

ఇతర ద్వైత విలక్షణ వివరణలవల్ల బ్రహ్మ ప్రతిపాదన – త్రివిధ సత్యముల ప్రతిపాదన, లక్షణములతో, విశేషణములతో వివరించారు. బ్రహ్మ నిర్గుణత్వము, మాయ – అవిద్యల వేరు వేరు నిరూపణ (ఉచితవిధంగా) విశ్లేషించారు. బ్రహ్మ సత్యత్వము, మాయ – తత్కార్యమైన జగత్తు యొక్క అనిర్వచనీయత్వము, అజ్ఞతవల్ల ద్వితీయ చంద్రదర్శనము వంటి జగత్తుయొక్క మిథ్యాత్వము, పరబ్రహ్మ సర్వజ్ఞత్వము, నామరూపముల నానాత్వములకు – పరబ్రహ్మతో ఏకత్వమునకు అవిరోధము, రజ్జుసర్ప ఉపమానము లేకుండా బ్రహ్మయొక్క నిర్విశేషత్వము, మాయయొక్క నిత్యత్వము, సర్వాత్మ భావమోక్షము, అవిద్యయొక్క అభావరూపత్వము, అనుపలబ్ధి అప్రమాణత్వము యొక్క, అభూత పూర్వప్రతిపాదన, అవస్థాత్రయ వివరణలో సుషుప్తికాలంలో బ్రహ్మలో జీవునియొక్క స్థితి; తురీయము, పంచకోశములు, మోక్షము, సంన్యాసము, ఉపాసన, కర్మ – ఇవన్నీ ఈ గ్రంథములో చక్కగా నిరూపించబడినాయి.

భగవత్పాదీయ

స్వామీ త్రిభువనదాస్

మంగళం కుటీరము, గంగాలైను
స్వర్గాశ్రమము, ఋషికేశ్
ఉత్తరాఖండ్.

– స్వామీ శాంతి ధర్మానంద సరస్వతీ

సృష్టి–దృష్టివాదము ఆధారముగా రచింపబడిన ఈ గ్రంథము ఎంతో ఉపయోగకరమైనది. ఈ వాదనలో అనేక భ్రాంతులున్నాయి. ఇప్పటికీ ఈ విషయంలో విచార సాంకర్యం నుంచి విముక్తులు కాలేదు. ఏ ఒక్క విషయములోను స్పష్టత లేదు. ముఖ్యంగా కార్యకారణభావము మాయ, అవిద్య, సత్యము, అసత్యము, మిథ్య మొదలైన పదాలకు – ప్రత్యేక పదానికి ప్రత్యేక అర్థము స్పష్టం చేసే గ్రంథమేదీ వ్రాయబడినట్లు కనబడుట లేదు.

పూజ్య స్వామీజీ ఇటువంటి దృష్టితో లోతుగా పరిశ్రమ చేసి ఈ గ్రంథం రచించి సాధకులకు చాలా ఉపకారం చేశారు. 'అనుపలబ్ధి ప్రమాణం' చాలా గొప్పగా వివరించారు వేదాంత పరిభాష, వృత్తి ప్రభాకరము, విచార చంద్రోదయము ఇంకా ప్రకరణ గ్రంథములలో అనేక నవ్య నైయాయిక గ్రంథములలో వేదాంతంలో ఆరు ప్రమాణాలున్నాయనే భ్రాంతి గురించి ప్రచారం జరిగింది. "షడితి భాట్ట వేదాంతినౌ।" భాష్య వార్తిక వచనముల ఆధారంతో ఈ వాదన భాష్య విరుద్ధమని శ్రీ స్వామీజీ నిరూపించారు.

కార్యకారణ – అనన్యత్వ న్యాయమును, పూర్వార్ధ ఉత్తరార్ధములలో విభజనచేసి ఈ గ్రంథములో రూపించిన విధంగా ఇతర టీకాకారులు సరియైన చర్చ చేయలేదు. బృహదారణ్యఘట భాష్యంలో భాష్యకారులు ఏవిధంగా చర్చ చేశారో ఆ విధానం స్పష్టీకరణ ఈ గ్రంథంలో వివరించారు. కార్యము యొక్క సత్యాసత్య విచారణ చేసి జగత్తు 'బ్రహ్మదృష్టి'తో సత్యము – స్వదృష్టితో అసత్యము అని చూపించారు. బ్రహ్మజ్ఞాన ప్రాప్తి అనంతరము ప్రారబ్ధకర్మను అనుసరించి 'బాధా సామానాధికరణ వృత్తి' వల్ల బ్రహ్మజ్ఞానికి జగత్తుయొక్క వృత్తి అనుభవం కలుగుతున్నది – అని పై వివరణవల్ల అనాయాసంగా సిద్ధాంతం స్పష్టంగా నిరూపణము అవుతున్నది. అవచ్ఛేద వాదము – వివర్తవాదము చాలా చక్కగా ఉన్నది; దీనివల్ల సావయవత్వ – పరిచ్ఛిన్నత్వ సంబంధముల ఆక్షేపము స్వతఃగా దూరమవుతున్నది. జగత్కారణమైనప్పటికి బ్రహ్మ నిర్విశేషమని నిరూపించబడినది... మాయ నిత్యము, అనిర్వచనీయము. కాని, అది బ్రహ్మ నుండి వేరుగా లేనందువల్ల అద్వైతము సిద్ధిస్తున్నది. భగవద్గీత, బ్రహ్మసూత్రముల ఆధారముతో ఈ నిర్ణయము చేయబడినది; యుక్తియుక్తముగా ఈ నిర్ణయము చేయడము వలన అది సంప్రదాయ విరుద్ధము కాదు. "బ్రహ్మ సత్యము" అనే శీర్షికతో ఇలా వ్రాశారు – "జగత్తు బ్రహ్మముకన్న భిన్నము కాకున్ననూ, దానిని బ్రహ్మ స్వరూపముగా గుర్తించక స్వతంత్రముగానే వ్యవహరిస్తున్నారు" ఇటువంటి వాక్యములు "బ్రహ్మమయమిదం జగత్!" అను శ్రుతి వాక్యానుసారముగానే ఉన్నవి. ఈవిధంగా సత్యము, అసత్యము, మిథ్య, అనిర్వచనీయము మొదలైన శబ్దముల అర్థమును విడివిడిగా చెప్పి సిద్ధాంతరూపము స్పష్టము చేయబడినది.

ఈ గ్రంథముద్వారా వేదాంత అర్థమును గ్రహించడము చాలా సులభతరము. 'అవిద్యాలేశ'మను విషయ విమర్శ సర్వసమ్మతముగా నున్నది. 'అజాతవాద' ప్రకారము ముక్తుడైన జ్ఞానికి జగత్తు లేనేలేదు; ఇక, కర్మకర్తృత్వము, ప్రారబ్ధము, అవిద్యాలేశము – అనే పదాలకు స్థానము ఎక్కడ ఉన్నది? ఈ విధమైన కల్పన అనుచితము.

మా దృష్టిలో ఈ గ్రంథమున క్రింది విషయాలు న్యూనతగా అనిపిస్తున్నాయి.

అపరావిద్యానుష్ఠానము లేకుండా పరావిద్యకు అధికారి కాలేడు కనుక అపరావిద్యను శ్రేష్ఠమైనది కాదని నిందచేయడము సరైనది కాదు.

గురులక్షణములలో, శ్రోత్రియ పదమునకు అర్థము అసంపూర్ణముగా నున్నది. ఎందుకనగా స్మృతిని అనుసరించి శ్రోత్రియుడు జన్మతః బ్రాహ్మణుడై వుండాలి. మనుష్య నిర్మితమైన గ్రంథాలలో గుణదోషములు రెండూ ఉంటాయి. భగవత్పాద శ్రీ శంకరాచార్యులు సాక్షాత్తు దేవాదిదేవుడైన మహాదేవుని అవతారము. వారి కృతులలో కూడా దోషాన్ని గమనించేవారున్నారు. ఇక మిగిలినవారి గ్రంథముల గురించి చెప్పేదేమున్నది? అందువల్ల గురుపరంపరా సంప్రదాయముతో ఈ గ్రంథమును చదివి శాస్త్రానుసారము తత్త్వగ్రహణము చేయగలరు.

నారాయణ స్మృతిః।

స్వామీ శాంతి ధర్మానంద సరస్వతీ

సత్యం సాధనా కుటీరము
గంగాలహరి, గోహరీ మాఫీ, రాయ్‌వాలా,
తహశీల్ ఋషీకేశ్, డెహరాడూన్

సంకేత సూచిక

అ॥	–	ఈ గ్రంథములోని అధ్యాయము
అ॥భా॥	–	అధ్యాస భాష్యము
ఈశా॥	–	ఈశావాస్యోపనిషత్
ఈశా॥భా॥	–	ఈశావాస్యోపనిషద్భాష్యము
ఋ॥సం॥	–	ఋగ్వేద సంహితము
ఐత॥	–	ఐతరేయోపనిషత్
ఐ॥ఆ॥	–	ఐతరేయ ఆరణ్యకము
ఐ॥భా॥	–	ఐతరేయోపనిషద్భాష్యము
కఠ॥	–	కఠోపనిషత్
కఠ॥భా॥	–	కఠోపనిషత్ భాష్యము
కేన॥	–	కేనోపనిషత్
కేన॥భా॥	–	కేనోపనిషద్భాష్యము
కౌ॥	–	కౌషీతకీ ఉపనిషత్
గీ॥	–	భగవద్గీత
గీ॥భా॥	–	భగవద్గీత భాష్యము
ఛాం॥	–	ఛాందోగ్యోపనిషత్
ఛాం॥భా॥	–	ఛాందోగ్యోపనిషత్ భాష్యము
జా॥	–	జాబాలోపనిషత్
తై॥	–	తైత్తిరీయోపనిషత్
తై॥ఆ॥	–	తైత్తిరీయ ఆరణ్యకము
తై॥నా॥	–	తైత్తిరీయ నారాయణకము
తై॥బ్రా॥	–	తైత్తిరీయ బ్రాహ్మణము
తై॥భా॥	–	తైత్తిరీయోపనిషద్భాష్యము
తై॥సం॥	–	తైత్తిరీయ సంహిత
ప్రశ్న॥	–	ప్రశ్నోపనిషత్

ప్రశ్న॥భా॥	–	ప్రశ్నోపనిషద్భాష్యము
బృ॥భా॥	–	బృహదారణ్యక భాష్యము
బృ॥	–	బృహదారణ్యకోపనిషత్
సూ॥భా॥	–	సూత్రభాష్యము
మాం॥	–	మాండూక్యోపనిషత్
మాం॥భా॥	–	మాండూక్యోపనిషద్భాష్యము
ముం॥	–	ముండకోపనిషత్
ముం॥భా॥	–	ముండకోపనిషద్భాష్యము
శ్వే॥	–	శ్వేతాశ్వతరోపనిషత్

పీఠికా ప్రకరణము

వేదాంత విచారణ ప్రారంభము సాధన చతుష్టయ సంపత్తితోనే అని సంప్రదాయము. దీనిద్వారా సంక్షేపముగా గ్రంథ పరిచయము జరుగుతుంది. వేదాంత విచారణకు ఫలితము మోక్షమే అయినా అది పొందడానికి ముఖ్యసాధనముగా 'సాధన చతుష్టయ' సంపత్తి తప్పనిసరి. సాధన చతుష్టయ సంపత్తి పూర్ణముగా కలిగినవారు కూడా శాస్త్రమును స్వతంత్రముగా అధ్యయనము చేసి మోక్షమును పొందజాలరు. గురుసన్నిధిలో శాస్త్రాధ్యయనము చేసినందువలన లభ్యమయిన ఆత్మజ్ఞానము ద్వారా మాత్రమే మోక్షప్రాప్తి కలుగుతుంది. ఏ విషయజ్ఞానమయినా ప్రమాణములద్వారా పొందగలరు. విషయములను రెండు భాగములుగా విభజించవచ్చు – 1) లౌకికవిషయము 2) అలౌకిక విషయము. లౌకిక విషయములను నాలుగు ప్రమాణాలతో తెలుసుకొనవచ్చు; అవి 1) ప్రత్యక్ష ప్రమాణము, 2) అనుమాన ప్రమాణము 3)ఉపమాన ప్రమాణము, 4) అర్థాపత్తి ప్రమాణము. మోక్షప్రాప్తి ఏ జ్ఞానమువల్ల కలుగుతున్నదో ఆ ఆత్మ స్వరూపజ్ఞానము అలౌకిక విషయము. అనగా ఇంద్రియములద్వారాగాని, బుద్ధిద్వారాగాని ఆత్మస్వరూపము తెలియబడదు. అనగా అది బుద్ధికి, ఇంద్రియములకు అతీతమైనది. అపౌరుషేయములైన వేదములద్వారానే దానిని తెలుసుకోగలము. ఆ వేదములే పంచమ ప్రమాణము. సామాన్య జనులకు వేదప్రమాణ్యము సంశయాత్మకముగా ఉంటుంది. వేదము సనాతన ఋషుల బుద్ధిగత భావన అని; ఋషులుకూడా మానవులే గనుక వారి భావనలో దోషములు ఉండవచ్చని సామాన్యుల భావన. కాని, వేదము మానవుని బుద్ధికి అతీతమైనది అనగా అపౌరుషేయము. ఈ విచారము ఖండించ వీలులేని తర్కములతో ఈవిధంగా నిర్ణయించాలి. మోక్షప్రాప్తికి సాధన సంపత్తి, గురువు, వేదము అనివార్య సహకారులని చెప్పటమే ఈ ప్రకరణ ఉద్దేశ్యము.

ఈ ప్రకరణము చివరలో ఇంకొక విషయము ప్రసంగవశమున చెప్పబడినది. అదే అనుపలబ్ధి ప్రమాణము. ఇది ఆరవ ప్రమాణముగా వేదాంత గ్రంథాల్లో ప్రచారముగా ఉన్నది. కాని, దీని ఉపయోగము శాస్త్రములో ఎక్కడా లేదు. శంకరభాష్యంలో పరోక్షముగాను, సురేశ్వరాచార్యుని 'సంబంధ వార్తికము'లో ప్రత్యక్షముగాను దీని అప్రమాణ్యమును వ్రాశారు. ఈ చర్చ 'అనుపలబ్ధి ప్రమాణము' గురించి స్పష్టీకరణకోసము చేయబడినది.

గ్రంథ విషయానుక్రమణిక

పీఠికా ప్రకరణము

సమర్పణ

శ్లో॥ శ్రుతిస్మృతి పురాణానామాలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాద శంకరం లోకశంకరమ్ ॥

శ్లో॥ శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణమ్ ।
సూత్రభాష్యకృతౌ వందే భగవంతౌ పునః పునః ॥

పరబ్రహ్మ స్వరూపుడైన నారాయణుడిని, ధర్మసంస్థాపన చేయడం కోసం అనేక అవతారాలు ఎత్తి దుష్టసంహారం చేసి చేసి విశ్రాంతిలేక మరొక్కసారి అవతారం దాల్చకుండా ఉండేటప్పుడు తమ అప్రతిహతమైన జ్ఞానంతో వైదిక పరంపరను పునరుద్ధరించిన సాక్షాత్తు శంకరస్వరూపుడే అయిన శ్రీశంకరాచార్యులవారిని, నావంటి అల్పజ్ఞుడిని కూడా ఆ పరంపరలోనే చేర్చుకున్న శ్రీశృంగేరీ జగద్గురువులైన శ్రీమదభినవ విద్యాతీర్థమహాస్వాములవారిని – స్మరించి, భజించి, నమస్కరించి వ్రాయబడిన ఈ అల్పగ్రంథం, ఈ మహనీయుల పాదపద్మములలో అర్పింపబడిన, వారి వనంలో వికసించిన ఒక పుష్పం.

Blank page

అధ్యాయము - 1

అనుబంధ చతుష్టయము

ప్రతి ఒక్క శాస్త్ర గ్రంథము అనుబంధ చతుష్టయముతోనే ప్రారంభమవుతుంది. విషయము, ప్రయోజనము, సంబంధము, అధికారి అనే నాలుగు అంశములు ఇందులో ఉన్నవి. ఇవి తెలుసుకున్న (అను) తరువాతనే పాఠకునికి తదనంతర గ్రంథము చదవడానికి (బధ్నాతి) ప్రేరణ కలుగుతుంది. అందువలననే దీనిని 'అనుబంధము' అన్నారు. ఈవిధంగా వీని వివరణతోనే గ్రంథ ప్రారంభము జరగడం సాంప్రదాయికంగా వస్తున్నది. (తై॥ భా॥ 2-9 శాంతిపాఠము)

(1-1) విషయము :


అన్ని శాస్త్ర గ్రంథములలోను ప్రతిపాదించిన అర్థమే విషయము. అనగా దేని గురించి చర్చ జరుగుతున్నదో అదే విషయము. ఈ గ్రంథములో జగత్తు – బ్రహ్మ – జీవుల గురించినదే విషయము'. ఈ మూడు వేఱువేఱు అని సాధారణముగా అందరి అభిప్రాయము. శ్రుతిలో కూడా ఈవిధమైన వాక్యములు కనిపిస్తున్నాయి. అవి కర్మకు ఉపాసనకు సంబంధించినవి. ఇటువంటి వాటిని 'అవాంతర వాక్యములు' అంటారు. ఎందుకంటే ఇవి భిన్నత్వాన్ని చెప్తున్నాయి. స్థూలదృష్టితో చూస్తే జీవ జగత్తులు భిన్నముగా కనబడుతున్నాయి; కాని, శాస్త్ర ఆధారముతో విచారణచేసిన తరువాత జగత్తు – జీవుడు, బ్రహ్మము కన్న వేఱుగా లేవని తెలుస్తున్నది. వ్యవహారములో వేఱుగా భావించినప్పటికీ స్వరూపములో కేవల బ్రహ్మమే! (స్వరూపము – దీని అర్థము (5-1) అధ్యాయములో తెలుపబడినది.) శ్రుతిలో ఈ విషయమే ప్రతిపాదించిన వాక్యములు ఉన్నాయి. వీనిని 'మహావాక్యములు' అంటారు. ఇవి సామాన్య దృష్టిని నిరాకరిస్తున్నాయి. 'బ్రహ్మము' కంటే గొప్పదైన అన్యవస్తువు ఏదీ లేదు, కనుక దానిని 'బ్రహ్మము' అన్నారు (బృహత్తమత్వాత్ బ్రహ్మ తై॥ భా॥2-1-1) 'బ్రహ్మ' శబ్దము నపుంసకలింగము. దీనినే 'పరబ్రహ్మము' అని కూడా అంటారు. 'బ్రహ్మ' శబ్దము పుంలింగము. ఇది ఒక దేవత. ఇతనే చతుర్ముఖ బ్రహ్మ. శ్రుతి ఇతనిని 'హిరణ్యగర్భుడు' అన్నది.

(1-2) ప్రయోజనము :

గ్రంథ పఠనమువలన పాఠకుడు పొందే లాభమే 'ప్రయోజనము'. అనాదిగా ప్రతియొక్కడూ జగత్తు కంటే, బ్రహ్మ కంటే, ఇతర జీవులకంటే, తనను వేఱుగా భావిస్తూనే ఉన్నాడు. ఈ భేదబుద్ధితోనే వ్యవహారము చేస్తున్నాడు. ఈ భేదభావము కారణంగా పాప–పుణ్యములు, సుఖ–దుఃఖములు, లాభాలాభములు, మానావమానములు మొదలైన ద్వంద్వములతో సమస్త సంసారము నిండియున్నది. సాంసారిక వ్యవహారంలో నాలుగు ప్రయోజనములు ఉన్నవి; అవి ధర్మము, అర్థము, కామము, మోక్షము – ఇవి నాలుగు పురుషార్థములు. ఇహ–పర లోకములలో సుఖప్రాప్తి, దుఃఖనివారణ జరగాలనే ఆశను 'కామము' అంటారు. ఈ ఆశలను పూర్తిచేయగలిగే సాధనమే 'అర్థము'. ఒక్కొక్క వ్యక్తియొక్క సుఖ–దుఃఖముల పరిధి జీవనములో వేఱువేఱుగా ఉంటుంది. సుఖము అనుకొన్న ప్రతీవిషయములోను దుఃఖాంశ ఎంతో కొంత వుండక తప్పదు; కొంతకాలానికి ఈ సుఖము అంతరిస్తుందన్న భయమైనా ఉంటుంది. ఈవిధంగా సుఖమనేది

దేశతః కాలతః వస్తుతః సాపేక్షము, అశుద్ధము, తాత్కాలికము. ఇందువల్ల తన శక్త్యనుసారము దోషములేని సుఖాన్ని ఇహ–పరాల్లో పొందడానికి మానవుడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఇటువంటి ప్రయత్నానికి ఆవశ్యకమైన వ్యష్టి – సమష్టి (వీని అర్థము అ॥ 14–6లో వివరించబడినది). నియమమే 'ధర్మము'. ఒకే పదార్థము ఒకప్పుడు సుఖాన్ని ఒకప్పుడు దుఃఖాన్ని ఇస్తున్నది. కనుక 'ధర్మ జిజ్ఞాస' ఉత్పన్నమయినది. అందువల్ల సుఖానికి సరైన స్థితిని చేకూర్చేదే 'ధర్మము'; ఇది కూడా సాపేక్షమే. అశాశ్వతమైన ఇటువంటి సుఖాలకు అతీతమై, నిరపేక్షమై, శాశ్వతమై, దోషరహితమై, నిరతిశయమైన ఆనందమే మోక్షము.

'అపరావిద్యా' 'పరావిద్య'ల ద్వారా ధర్మ–అర్థ–కామ మోక్షప్రాప్తి జరుగుతుందని శ్రుతులలో ప్రతిపాదించబడినది. ఇహ–పర లోకాల్లో కామప్రాప్తికి తగినది 'అపరావిద్య'; ఇదికర్మ–ఉపాసనా మార్గములలో శ్రుతిలో ఉన్నది. మోక్షముకోసము 'పరావిద్య'ను అభ్యసించాలి; ఇది శ్రుతులలో జ్ఞానకాండలో ఉన్నది. ఈ గ్రంథ అధ్యయనము తరువాత మోక్షకారణమైన పరావిద్యను పొందడమే 'ప్రయోజనము'.



(1–3) సంబంధము :

అధికారి– విషయము, విషయము–ప్రయోజనము, అధికారి – ప్రయోజనము ఇలా అన్నింటినీ నిర్ణయించడమే సంబంధము. ఇక్కడ అధికారి స్వరూపమే బ్రహ్మము అయినందువల్ల తన స్వరూపమే అధికారి – విషయ సంబంధము అయినది. అధికారికి, మోక్షమనే ప్రయోజనానికి మధ్య వ్యవధాన రూపమైన అజ్ఞానము ఉంటుంది. ఆ వ్యవధాన నివారణమే అధికారికి – ప్రయోజనమునకు ఉన్న సంబంధము. బ్రహ్మ విషయమును గ్రహించడమే మోక్షము. అందువల్ల బ్రహ్మజ్ఞానమే, విషయ – ప్రయోజనములయొక్క సంబంధము. ఈ మూడింటిని మూడుకోణము లలో తెలియజేస్తున్న త్రిభుజాకార చిత్రము క్రింద చూపబడినది. అధ్యయనమునకు పూర్వము ఈ మూడూ ఇలాగే విడివిడిగా ఉంటాయి. శ్రద్ధగా అధ్యయనము చేయగా చేయగా బ్రహ్మయొక్క స్పష్టమైన జ్ఞానము కలుగుతుంది. బ్రహ్మాత్మైకత్వ జ్ఞానము కలుగగానే ఈ త్రిభుజాకారము నశిస్తుంది.

(1–4) అధికారి :

కేవలము గ్రంథ పఠనమువలన, అధికారము లేకుండా పాఠకులకు మోక్షప్రాప్తి కలుగదు. ఏ గ్రంథమువలననైనా లాభము పొందాలంటే యోగ్యత ఉండాలి. ఉదా : మీమాంసా శాస్త్రంలో వైదిక కర్మాధికారం ఇలా చెప్పారు : "అర్థీ సమర్థో విద్వాన్ శాస్త్రేణ అవిపర్యుదస్తః" కర్మ ఇచ్ఛ కలిగినవాడు, సమర్థుడు, కర్మ రహస్యము తెలిసినవాడు, శాస్త్రములలో నిషేధింపబడనివాడు మాత్రమే కర్మాధికారి అవగలడు. ఈ గ్రంథము వలన లాభము పొందడానికి అటువంటి విశేషాధికారం కావలసివుంటుంది. అధికారం అనగా అనేక సౌలభ్యాలున్న ఒక పదవి కాదు; ఇక్కడ అధికారము అనగా విషయమును గ్రహణచేయగల యోగ్యత, దానివల్ల లాభము పొందగల పాత్రత.

పైన చెప్పినవిధంగా ఏ శాస్త్రాధ్యయమునకైనా ఆయా శాస్త్రములకు తగిన యోగ్యత కలిగిన వ్యక్తి అధికారి – ఈ గ్రంథము మోక్షశాస్త్రము కనక, మోక్షాధికారికే మోక్షము లభ్యమవుతుంది. కాని, మోక్షాసక్తి కలిగినవారు చాలా తక్కువ; జగత్సంబంధమైన విషయాలే ఆనందము కలిగిస్తాయని వారి విశ్వాసము. ఇటువంటి దృష్టి కలిగినవారి సంఖ్యే అధికము. వీరికి 'మోక్షమ'నే శబ్దము వినగానే, భయము కలుగుతుంది. అపరిమిత ఆనందమైన మోక్షము బ్రహ్మ స్వరూపము కనక, ఆ దృష్టితో జగత్తుకి సంబంధించినది లేశమాత్రము కూడా ఉండదని వీరి భయము.

అయితే బ్రహ్మ అనుభవమునకు మనము ఏవిధమైన ప్రయత్నం చేయాలి? వేదోక్త కర్మల ఆవశ్యకత ఉన్నదా? ధర్మ జిజ్ఞాస చేయాలా? భయపడి ఈవిధమైన ప్రశ్నలు వేసేవారికి శ్రీ శంకరభగవత్పాదులు సూటిగా సమాధానము చెపుతూ "లేదు" అన్నారు. కాని, సాధన చతుష్టయ సంపత్తి తప్పదు. అయితే కర్మ – ధర్మ జిజ్ఞాసలకంటే ఇది సంపాదించడము చాలా కఠినము. గతజన్మలలో ఇవన్నీ (కర్మ ఉపసానలు) చేసి, అధికారియైన వారికి, ఈజన్మలో సాధన చతుష్టయము త్వరలో లభ్యమవుతుంది. ఇప్పుడు మళ్ళీ ఆరంభించవలసిన అవసరము లేకుండానే తనంత తానే సాధన చతుష్టయ సంపత్తి దొరకుతుంది. "న కర్మణామ్ అనారంభాత్ నైష్కర్మ్యం పురుషో¬శ్నుతే।" కర్మ చేయకుండా మోక్షప్రాప్తి కలుగదు. (గీ॥ 3-4). "పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశో¬పి సః)" పూర్వాభ్యాసము వలన మోక్షసిద్ధి వైపుగా మానవుడు ఆకర్షింపబడుచున్నాడు. (గీ॥ 6-44).

ప్రశ్నలు :

1. అనుబంధ చతుష్టయము అని దేనిని అంటారు?
2. పురుషార్థములు ఏవి? చతుర్విధ పురుషార్థములు అని వేనిని అంటారు?
3. బ్రహ్మజిజ్ఞాసువులకు ఏవిధమైన ప్రయత్నము వుండాలి?

అధ్యాయము - 2

సాధన చతుష్టయ సంపత్తి

1) నిత్యానిత్య వస్తువివేకము, 2) ఇహాముత్ర ఫలభోగ విరాగము, 3) శమాది షట్క సంపత్తి, 4) ముముక్షుత్వము – ఇవి నాలుగు సాధన చతుష్టయ సంపత్తి.

1) నిత్యానిత్య వస్తువివేకము :

ప్రతిఒక్కరి మనస్సులో సంకల్ప – వికల్ప రూప మహాప్రవాహము నిత్యమూ ప్రవహిస్తూ వుంటుంది. "సంకల్ప వికల్పాత్మకం మనః।" ఏ కార్యమునకైనా ప్రవృత్తి జనకమైన కల్పనను "సంకల్పము" అంటారు. ఆ నిశ్చయము స్థిరరూపంగా లేకుండా సంశయము రావడమే "వికల్పము". ఇలా సంకల్ప – వికల్పములలో ఏది సరియైనది – ఏది కాదు అని నిశ్చయించేది "బుద్ధి". "నిశ్చయాత్మికా బుద్ధిః।" ఈ నిర్ణయము జరిగిన తరువాత సరియైన దానిని స్వీకరించి, మిగిలినదానిని విడిచిపెట్టడము "వివేకము" మోక్షమునకు ఎటువంటి వివేకము కావాలన్నది ప్రశ్న. నిత్యము, నిర్దోషము, నిరతిశయము అయిన ఆనందమే "మోక్షము"; కాని, జగత్తులో లభించే ఆనందాలన్నీ మోక్షానందానికి విరుద్ధమైనవి, అల్పమైనవి. దోషయుక్తమైనవి. ఎందుకనగా ఈ ఆనందాలు ఏదో ఒక జగత్సంబంధి వస్తువు కారణంగా ఉన్నవి. జగత్సంబంధి వస్తువులు అశాశ్వతములన్నది నిర్వివాదాంశము. కాని, వస్తువులు ఉన్నంతవరకు, వానితో సంబంధించిన ఇంద్రియ ఆనందము అనుభవించడము కూడ అసంభవము. ఇది ఆశ్చర్యకర విషయము. ఇంద్రియములద్వారా వస్తువులో పొందే ఆనందము అల్పకాలములోనే నశించిపోయే స్థితి భగవంతుని లీల. ఆనందమ నశించగానే వాటిమీద ఆసక్తి కూడా నశిస్తున్నది. అందువల్ల మోక్షాసక్తి కలిగినవారు జగత్తు అనిత్యమని తెలుసుకోవాలి. ఇలా మోక్షాసక్తి దృఢమైన కొలది జగత్తు మీద ఆసక్తి సహజంగానే తగ్గిపోతుంది.

శ్రుతి బ్రహ్మ నిత్యమని ప్రతిపాదిస్తున్నది. ఈమాట మరువకూడదు. మెల్లమెల్లగా బ్రహ్మము నందు మానవుని ఆసక్తి విశ్వాసము బలపడుతూ ఉంటాయి. ఇదే "నిత్యానిత్య వస్తు వివేకము". పాపియైన వ్యక్తిలో ఈ వివేకము ఉండదు. "యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్య కర్మణామ్ తే ద్వంద్వమోహనిర్ముక్తాః భజన్తే మాం దృఢవ్రతాః।" పుణ్యకర్మల వల్ల వాని పాపము క్షీణించి ద్వంద్వకర్మలనుంచి విడుదల పొంది, నన్ను (బ్రహ్మను) దృఢముగా భజిస్తాడు – (గీ॥ 17–28) ఇది స్వయముగా భగవంతుని వాక్యము. ఈ విధముగా పుణ్యకర్మల వల్ల భగవంతుని అనుగ్రహము కలిగినవానికి వివేకము కలుగుతుంది. అందువల్ల మోక్షాకాంక్ష కలిగినవారు పుణ్యకర్మలవల్ల, సత్సాంగత్యము వలన నిత్యానిత్యవస్తు వివేకమును సంపాదించాలి.

2–2) ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము :

ఇహ = ఈ జగత్తులో, అముత్ర = దేహ పతనానంతరము పొందగలమనే స్వర్గాది లోకములలో, అర్థ = విషయముల, ఫలభోగ = సుఖభోగముల, విరాగము = ఆసక్తిని విడువవలెను. ఇదే వైరాగ్యము. నిత్యానిత్య వస్తు వివేకము కలిగిన కొలదీ వైరాగ్యము పెరుగుతూ వస్తుంది. శబ్ద సుఖమునకు వశమయి లేడి, స్పర్శ సుఖమునకు ఏనుగు, రస సుఖమునకు మత్స్యము, దృశ్య సుఖమునకు దీపపురుగు, గంధ సుఖమునకు వశమయి భ్రమరము – ఇవి అన్నీ తమతమ ఇంద్రియానందములకొరకు ప్రాణములు

పోగొట్టుకుంటున్నాయి. ఇక, పంచేంద్రియ ఆనందములను సంపాదించాలని ప్రయత్నించే మానవుని గురించి చెప్పేదేమున్నది? (వివేకచూడామణి 78 శ్లో.) స్వతంత్రముగా మనస్సు చేసే సంకల్పమును నియమించే దానిని "మనీష" అంటారు; ఇటువంటి సమర్థత కలిగినవాడు "మనీషి". ఇంద్రియ సుఖములనే సర్వస్వమనుకొని, నిత్యానిత్యవస్తు వివేకము లేక మానవుడు దానవుడుగా మారుతున్నాడు. ఇహసుఖములేకాక జ్యోతిష్టోమాది క్రతువుల వల్ల పొందగలమనుకునే స్వర్గాది (అముత్ర) సుఖములు కూడా అనిత్యములే! 'తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం, క్షీణే పుణ్యేమర్త్యలోకం విశంతి' మానవులు విశాలమైన స్వర్గాది లోకములలో సుఖభోగములు అనుభవించి, పుణ్యము క్షీణించగానే తిరిగి మర్త్యలోకము (భూలోకము) ను పొందుతున్నారు. (గీ॥9-12) ఇందువల్ల మోక్షాసక్తి కలిగిన పురుషుడు జీవితావశ్యక విషయముమీద అధిక ఆసక్తిని పొందరాదు. అభావ వైరాగ్యము, శ్మశాన వైరాగ్యము, ప్రసూతి వైరాగ్యము మొదలైన తాత్కాలిక విరక్తికాక, సహజమైన వైరాగ్యమును పొందాలి.

2-3) శమాది షట్క సంపత్తి :

శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము - ఈ ఆరు గుణముల సమూహమును సంపాదించడమే శమాది షట్క సంపత్తి.

1) శమము : కామము (ఇచ్ఛ) సంకల్ప ప్రభవము; అనగా సంకల్పము వలననే పుడుతుంది. (గీ॥ 6-24) ఆ తరువాత కామ్య వస్తువులమీద ఆసక్తి, వాని గుణముల చర్చ, వాటితో రమించే బుద్ధి, వాటిపై విశ్వాసము, వాటిని గురించి మాట్లాడటము, ఈవిధంగా పెరిగి పూర్తిగా ఆయా విషయాలలో లీనమైపోతుంది మనస్సు; ధ్యేయమునుండి దూరమైపోయి విడిపోతుంది. కామమువల్ల ధ్యేయము పూర్తిగా మరుగునపడుతుంది. లక్ష్యాన్ని పొందాలంటే మనస్సును కామము నుండి తప్పించి ధ్యేయము నందు స్థిరపరచి ఉంచాలి. మనస్సుయొక్క దృఢతను 'శమము' అంటారు. అంతర ఇంద్రియమును వశపరుచుకోవడమే **శమము**.

2) దమము : బాహ్యేంద్రియములు వశపరచుకొనుటే దమము. "పరాంచిఖాని వ్యతృణత్ స్వయంభూః ।" భగవానుడు ఇంద్రియములను బహిర్ముఖముగానే నిర్మించాడు. "తస్మాత్ పరాజ్ పశ్యతి నాన్తరాత్మన్ ।" అందువల్ల మానవుడు అంతరాత్మను కాక బాహ్య వస్తువులనే దర్శిస్తున్నాడు. (కఠ॥ 2-1-1) మోక్షార్థి అయినవాడు ఈ కారణముగా జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను బలపూర్వకముగా మనస్సుతో నియమించి, భగవంతునిమీద దృష్టిని పెంపొందించుకోవలెను. ఇదే దమము. దీని వశము వలన శమము వృద్ధి పొందుతుంది.

3) ఉపరతి : ఇంద్రియములద్వారా, విషయభోగము కలుగుతున్నది. అందువల్ల కామిత విషయములు ప్రాప్తిస్తాయి. 'కామ-కామి' అనగా విషయములలో కామము (ఇచ్ఛ) కలవాడు ఎల్లప్పుడూ కర్మాసక్తి కలిగినవాడుగా ఉంటాడు (గీ॥ 2-70). దీనికి విరుద్ధముగా మోక్షకామి కర్మలనుండి ఉపరమించి భగవంతునిలో ఆసక్తుడై ఉంటాడు. దీనినే ఉపరతి అంటారు. మోక్షాసక్తుడు కాలక్రమములో ఉపరతివలన సంన్యాసి అవుతాడు.

4) తితిక్ష : మానవుడు మూడు విధముల తాపములతో దహింపబడుతూ వుంటాడు. ఇదే 'తాపత్రయము'. దేహ తాపము - "ఆధ్యాత్మిక తాపము" (వర్షము - ఎండ మొదలైన) ప్రకృతిజనిత

తాపములు. "ఆధిదైవిక తాపము" తేలు, సింహము వంటి ఇతర జీవుల వలన కలిగే తాపము "ఆధి భౌతిక తాపము". ఇవన్నీ తన ప్రారబ్ధకర్మవలన సంభవిస్తూ వుంటాయి. సామాన్య మానవుడు ఈ తాపములను తప్పించుకునే ప్రయత్నము చేసి, ఫలించకపోతే ద్వేషాన్ని పెంచుకుంటాడు. కాని, మోక్షాభిలాషి వేటినీ ద్వేషదృష్టితో చూడడు; వీటిని సహిస్తూ మోక్షమార్గములో త్వరగా ముందుకు పోతాడు. ఈ సహనశక్తే "తితిక్ష".

5) శ్రద్ధ : దీనిని గ్రహించాలంటే రెండు విషయాలను గుర్తులో ఉంచుకోవాలి. పరమపురుషార్థమైన మోక్షమును అనుమాన ప్రమాణముతో నిశ్చయించజాలరు; ఎందుకంటే అది మనస్సుకంటే పరమైనది. దానిని శ్రుతి ద్వారానే నిశ్చయించాలి. ఇది మొదటి విషయము, దీని వివరము అధ్యాయము 4-6లో చెప్పాము. ఇక రెండవ విషయము : మేధావి, గుణవంతుడు అయినప్పటికీ స్వతంత్రముగా వేదమును అవగాహన చేసుకోజాలడు. అందుకు గురువు ఆవశ్యకత ఉంటుంది. దీనికి కారణము అధ్యాయము 4-6లో వివరించాము. దీనివలన మోక్షాభిలాషికి "శ్రుతి, గురువు" ఈ రెండింటి సాహత్యము వలనకాక ఇంకొక మార్గము లేనేలేదు; గురువాక్యములలో, వేదవాక్యములలో విశ్వాసము ఉండితీరాలి. ఇది శ్రద్ధ. శ్రత్ = సత్యము, ధా = ధారణ, అనగా సత్యధారణమునకు అవసరమైన విశ్వాసమే శ్రద్ధ. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్।" శ్రద్ధ కలిగినవానికి జ్ఞానము లభ్యమవుతుంది.

6) సమాధానము : మనస్సును గురువునందు సమ్ ఆధానమ్ ఉంచడమే సమాధానము. బలపూర్వకముగా మనస్సును కలుషితముగా వ్యవహరింపచేయడమే సాధారణముగా కనబడుతుంది. గురువు విషయంలో, భగవంతుని విషయంలో ఇలా కాకుండా వేఱుగా వుంటుంది. వీరిపైన సరియైన భావనవల్ల మనస్సు విషయ విముఖమై ఏకాగ్రదృష్టితో శాంతిని పొందుతుంది. ఈ విధంగా, భగవంతునియందు గురువునందు సమవర్తన కలిగి స్థిరపడిన మనస్సు స్థితినే సమాధానము అంటారు.

2-4) ముముక్షుత్వము :

మానవ జీవితములో అధికభాగము దుఃఖమే కనబడుతున్నది. వివేకహీనులై మానవులు ఈ దుఃఖమును భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు; వారి అభిప్రాయములో మృత్యువు దుఃఖ నాశనమునకు కారణమగుచున్నది. ఈ దుఃఖములకు మూలము ఈ జన్మలోను, క్రిందటి జన్మలలోను చేసిన పాపములే! శిక్షాకాలము పూర్తికాకుండా జైలునుండి పారిపోయే ప్రయత్నము చేసిన ఖైదీవంటివారు దుఃఖానుభవము పూర్తిగా అనుభవించకుండా ఆత్మహత్య చేసుకున్న మానవులు. వారికి శిక్ష ఇంకా ఎక్కువవుతుంది. అందువల్ల దుఃఖములను సహిస్తూ జీవితమును భగవద్ధ్యానములో గడపడమే జన్మసార్థకత. ఈ తత్త్వమును గ్రహించిన ముముక్షువు (మోక్షముమీద తీవ్ర ఆసక్తి కలవాడు) జగత్తును దుఃఖస్వరూపముగా భావించి, జగత్తును నిరాకరించి, మోక్ష విచారణ చేస్తాడు. సమస్త బంధములనుండి, సమస్త దుఃఖములనుండి పూర్తిగా నివృత్తి పొందడమే మోక్షము. ఇది మృత్యువు తరువాత పొందబడే స్వర్గాది లోకముల వంటిది కాదు. ఆ విధమైన అశాశ్వతము కూడా కాదు; ఎందుకనగా, జీవించి ఉండగానే పొందబడేది మోక్షము. ఇది శాశ్వతము. నిత్యానిత్య వస్తు వివేకము, వైరాగ్యము, శమాది షట్ సంపత్తి కలిగి వేదాంత శ్రవణము ద్వారా మోక్షప్రాప్తి పొందాలి.

2-5) సందేహము - సమాధానము :

సందేహము : పైన చెప్పిన సాధన సామగ్రి పరావిద్యకు అవసరము. కాని భగవద్గీతలో వాసుదేవుడు ఇలా అన్నాడు - "ఇదం తే నాతపస్కాయ, నాభక్తాయ కదాచన, న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యో¬భ్యసూయతి ।" "ఎవడు తపస్సు చేయనివాడో (మేధావికానివాడో - యాస్క నిరుక్తం 1 - 1 -3), భక్తుడు కాడో, గురు శుశ్రూష చేయనివాడో, వాసుదేవునిపై విరోధము కలవాడో - వాడు గీతాధ్యయమునకు అనధికారి". (గీ॥18-67). దీని అర్థము భక్తుడు, మేధావి అయినవానికి మాత్రమే మోక్షాధికారము ఉన్నదని కదా! అయితే, ఈ గుణములను కూడా సాధన సంపత్తిగా భావించాలా?

సమాధానము : ఈ గుణములన్నీ సాధన చతుష్టయములో కలసే ఉన్నవి. భక్తి, శుశ్రూష, అనసూయత్వము ఇవి ఉపరతి, శ్రద్ధ, సమాధానములలో, మేధ - వివేకములో, అంతర్నిహితముగా ఉన్నవి. అయినప్పటికి ప్రధానముగా శమాది గుణములవలన వైరాగ్యము కలిగినవాడు, తపస్సు వలన వివేకము కలిగినవారు మేధావి అయిన మాత్రమే గీతాధ్యయమునకు అధికారి - అని చెప్పబడినది.

ఆ విధముగా సాధన చతుష్టయమును విడివిడిగా పైన చెప్పినప్పటికీ - భక్తివలన శమాది సంపత్తి - శమాది సంపత్తివల్ల వైరాగ్యము - వైరాగ్యమువల్ల వివేకము - వివేకమువల్ల జ్ఞానము దృఢమవుతున్నవి. ఇది అనుభవ విషయము. అందువల్ల సాధనా మార్గములో భక్తి ప్రథమ సోపానము. మోక్షప్రాప్తి తరువాత మిగిలిన మూడూ స్వభావముగా మారిపోతాయి. ముముక్షుత్వము ముక్తత్వము అవుతుంది; ముక్తస్థితిలో క్రమక్రమముగా కర్మలన్నింటితో సంగము విడిపోతుంది. అలా విడిపోయినా స్వేచ్ఛాచారి కాదు. ఎందుకనగా కర్మలకు కారణమైన అజ్ఞానము పూర్తిగా నశిస్తుంది. ఉదా : రాత్రి చూడగలిగిన నూతిలో పగలు పడడము జరుగదు. (ఐ॥ భా॥ అవతరణిక).

2-6) మోక్షము ఎవరెవరికి?

ఈ విధమైన వివరణ వలన మోక్షాధికారి లక్షణములను గ్రహించినట్లయితే సాధన చతుష్టయ సంపత్తి మానసికమని తెలుస్తున్నది. ఇందులో ఏ ఒక్కటీ కూడా స్థూలశరీర సంబంధికాదు. సాధన చతుష్టయ సంపత్తి కలిగినవారు ఏ వర్ణమువారైనా, ఏ ఆశ్రమమువారైనా - "జ్ఞానమాత్రే యద్యపి సర్వాశ్రమిణాం అధికారః ।'' (ముం॥ భా॥ పీఠిక) స్త్రీలు, అద్విజులు కూడా బ్రహ్మ విద్యాధికారులే! ఉదా : విదురుడు, ధర్మవ్యాధుడు ద్విజులు కారు. యోగినియైన సులభ, యాజ్ఞవల్క్యుని పత్ని మైత్రేయి, వచక్నుని పుత్రి గార్గి వీరందరు స్త్రీలు. "స్త్రియో వైశ్యాస్తథా శూద్రాఃతే¬పి యాన్తి పరాంగతిమ్ (గీ॥9-32).ఇంతేగాక, విధురులైన ద్విజులు కూడా - పురుష సామాన్యులకు విహితమైన జప, ఉపవాస, దేవతారాధనాది ధర్మవిశేషముల ద్వారా పరావిద్య అనుగ్రహము పొందవచ్చు. "విధురాదీనాం అవిరుద్ధైః పురుషమాత్ర సంబంధిభిః జపోపవాస దేవతారాధనాదిభిః ధర్మవిశేషైః అనుగ్రహో విద్యాయాః సంభవతి" (సూ॥ భా॥ 3-4-38). కాని వైదిక కర్మలకు అనేక నియమములున్నవి. (వాని వివరణ ఈ సందర్భమున అనవసరము.) ఇంకొక విశేషము - దేవతలు కర్మాధికారులు కానప్పటికీ మోక్షాధికారులే! ఇదే విధముగా ఋషులకు కూడా మోక్షమునకు అధికారము ఉన్నది. ఇంద్రుడు మొదలైన దేవతలు, నారదుడు, భృగువు మొదలైన ఋషులు, విశ్వావసువు మొదలైన గంధర్వులు, మార్కండేయుడు, నచికేతుడు

మొదలైన బ్రహ్మచారులు, అనాశ్రములైన రైక్వుడు-సంవర్తుడు - వీరందరూ బ్రహ్మవిద్యాధికార సార్వత్రికత్వమునకు ఉదాహరణములు. (సూ॥ భా॥ 2-3-33, 38 - బృ॥ 1-4-10 - ఛాం॥ 8-7-2 - మోక్షధర్మ = 318)

ఏ వర్ణాశ్రమ ధర్మములను అనుసరించే ముముక్షువులకైనా సాధన సంపత్తి మాత్రము ఆవశ్యకము (ముం॥ 1-2-12). బ్రాహ్మణునకు మోక్షమే జన్మలక్ష్యమై ఉండాలి. అందువలననే వానికి - ముముక్షువు కానప్పటికీ - వాని వర్ణాశ్రమ ధర్మములలో వివేక వైరాగ్యములను, శమాది సంపత్తిని తప్పనిసరి విధులుగా నిర్ణయించారు. బ్రహ్మవిద్య అభ్యసించని బ్రాహ్మణుని శ్రుతి బ్రహ్మబంధువని నిందించింది : ఈతడు బ్రాహ్మణ బంధువే కాని బ్రాహ్మణుడు కాదు.

ప్రశ్నలు :

1. సాధన చతుష్టయములో ఏఏ సాధనలు కలసి వున్నాయి?
2. సంకల్ప - వికల్పములు అనగా ఏవి?
3. బుద్ధి చేసే పని ఏది?
4. అంతఃకరణముయొక్క ఏ సామర్థ్యమును వివేకము అంటారు?
5. విషయసుఖము యొక్క స్వరూపము ఏమిటి?
6. నిత్యానిత్యవస్తు వివేకమునకు అర్థము ఏమిటి?
7. ఈ వివేకము ఎవరికి కలుగుతుంది?
8. వివేకమును ఎలా సంపాదించాలి?
9. ఫలభోగ విరాగమునకు అర్థము ఏమిటి?
10. శాస్త్రములో వైరాగ్యమునకు పర్యాయపదము ఏమిటి?
11. మనీష అంటే అర్థము ఏమిటి?
12. మోక్షాసక్తుడు ఎటువంటి జీవితము గడపాలి?
13. షట్ సంపత్తి అనగా ఏవి?
14. శమలక్షణము ఏమిటి?
15. దమము ఏ సాధనతో వస్తుంది?
16. ఉపరతి అనగా అర్థము ఏమి?
17. తితిక్ష సాధన ఏ ప్రకారము చేయాలి?
18. శ్రద్ధ అంటే ఏమి? శ్రద్ధ దేనిమీద వుండాలి?

19. శ్రద్ధతో ఏమి కలుగుతుంది?
20. గురువు సాన్నిధ్యములో ఏమి పొందగలము?
21. మోక్షము యొక్క స్థితి ఏమిటి?
22. ముక్తుడైన వ్యక్తి ఎలా వ్యవహరిస్తాడు?
23. భగవద్గీత, పరావిద్యలో అధికారిత్వము ఎవరికి యివ్వలేదు?
24. బ్రాహ్మణుని జీవిత ఉద్దేశ్యము ఏమిటి?
25. బ్రహ్మబంధువని ఎవరిని చెప్పారు?

అధ్యాయము - 3

గురువు

ఈ అధ్యాయములో గురువు ఆవశ్యకత, గురువు లక్షణములు, గురు శిష్య సంబంధము మొదలైన విషయములు చెప్పబడినవి.

3-1) గురువు ఆవశ్యకత :

మోక్షవిద్యను గురువుద్వారానే తెలుసుకోగలమని చెప్పబడినది. (అ॥ 2-3-4). ఆ విషయము ఇక్కడ వివరించబడుచున్నది. ఏ విద్యకైనా ఆ విద్యలో ఉత్తములైనవారి మార్గదర్శనము అవసరము అని అందరికీ తెలుసు. వైద్యులైనా, న్యాయవాదులైనా, వ్యాపారులైనా ఈ మార్గాన్నే అనుసరిస్తారు. అటువంటి పద్ధతిలో మోక్షమార్గం గురించి వేఱే విధానం ఏముంటుంది? తేలికగా అభ్యసించగలిగిన లౌకిక విద్యల విషయంలో ఒక సామెత ఉన్నది – "ఈ విద్యలను అభ్యసించడము ఏమంత కఠినము కాదు. ఇవి బ్రహ్మవిద్య కనకనా?" అని. దీనినిబట్టి అన్ని విద్యలకన్న బ్రహ్మవిద్య కష్టతరము అని తెలుస్తున్నది. "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే। యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః।" (గీ॥ 7-6) "వేలమందిలో ఏ ఒక్కరో ఈ విద్యాసిద్ధికి ప్రయత్నిస్తారు. ప్రయత్నించిన వారిలో ఏ ఒక్కరో నా యథార్థ స్వరూపమును తెలుసుకుంటున్నారు. ఇది భగవద్వచనము. తనని తాను గుర్తించడమే బ్రహ్మవిద్య; అందువల్ల అది చాలా క్లిష్టమయినది. అజ్ఞానవశులై మానవులు తమని తాము వేఱుగా గ్రహిస్తున్నారు. వీరు గ్రహించినదానికి, వాస్తవమైన దానికి ఊహించలేనంత విశేష అంతరము ఉన్నది. తన స్వరూపమును లౌకిక ప్రమాణములతో నిశ్చయించశక్యము. ఇటువంటి బ్రహ్మవిద్యను గ్రహించుటకు గురువు కృప, ఈశ్వరానుగ్రహము తప్పనిసరిగా అవసరము; ఇందులో ఆశ్చర్యము ఏమీలేదు. అయితే ఈనాటి కొందఱు విద్వన్మూర్ఖులైనవారు దీనిని నిరాకరిస్తున్నారు. వారి అభిప్రాయములు ఏమాత్రము సరికావు. ఎంత బుద్ధిమంతులైనప్పటికీ వేదాంత గ్రంథములను తమకు తాముగా అధ్యయనము చేసి తత్త్వమును గ్రహించడానికి సమర్థులు కారు. శాస్త్రజ్ఞులైనప్పటికీ బ్రహ్మజ్ఞానమును గురించి స్వతంత్ర పరిశీలనము చేయరాదు. "శాస్త్రజ్ఞోఽపి స్వాతంత్ర్యేణ బ్రహ్మజ్ఞానాన్వేషణం న కుర్యాత్" (ముం॥ 1-2-12). "ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపత్।" (ఛాం॥ 4-9-3) – ఆచార్యుని ద్వారా పొందిన విద్యమాత్రమే సాఫల్యాన్ని పొందుతుంది. "ఆచార్యవాన్ పురుషో వేద।" (ఛాం॥ 6-14-2) – ఆచార్యుని పొందిన పురుషుడే దీనిని గ్రహించగలడు. "గురు" శబ్దములోని రెండు అక్షరములు సార్థకములు. గు = అజ్ఞానరూప అంధకారమును, రు = నాశనము చేయువాడు. అనగా అజ్ఞానమును తొలగించువాడే గురువు.

3-2) గురువు లక్షణములు :

ఏ లక్షణములు చూచి గురువును బ్రహ్మవిద్య కొఱకు ఎన్నుకోవాలి? అనేదానికి శ్రుతి ఈ విధంగా సమాధానము చెప్పింది. ''తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్।''–బ్రహ్మవిద్యార్థము సమత్పాణి అయి బ్రహ్మనిష్ఠుడైన శ్రోత్రియుని వద్దకు వెళ్ళుము. (ముం॥ 1-1-12) శ్రుతిని అధ్యయనము చేసి దానిని అనుసరించి నడచువాడు 'శ్రోత్రియుడు.' కేవలము బ్రహ్మ తన లక్ష్యముగా గలవాడు 'బ్రహ్మనిష్ఠుడు.' సంప్రదాయమునసరించి శ్రుత్యర్థము తెలుసుకోవడం వలన శ్రోత్రియుడు తన మనస్సుకు తోచినవిధముగా వ్యాఖ్యానము చేయడు. సంప్రదాయము అనగా మతాంతర భావములకు లోబడక సృష్టి ప్రారంభమున మరీచి మొదలైనవారు వివరించిన మార్గము.

ఈ విధమైన శ్రుత్యర్థములో విరోధాభాసములేవీ లేకుండగా ఒకేవిధమైన భావము ప్రకటింపబడుతున్నది. ఈ వ్యాఖ్యానములో శిష్యుడు అడిగినవి, అడగనివి అనేక ప్రశ్నలకు సమాధానము దొరికి వానికి సందేహ నివృత్తి కలుగుతుంది. ఒకవేళ గురువు బ్రహ్మనిష్ఠుడు కాకపోతే అతని బోధ చిలుకపలుకులవుతుంది. వివిధ సంస్కారములతో ప్రశ్నించిన శిష్యుల భిన్నభిన్న ప్రశ్నలకు అనుభవజ్ఞుడే సరియైన సమాధానము చెప్పగలడు గాని కేవల గ్రంథము పఠించినవాడు చెప్పలేడు. "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః" తత్త్వదర్శియైన జ్ఞాని నీకు ఉపదేశము ఇవ్వగలడు - అని చెప్పబడినది (గీ॥ 4-34). ఇది భగవానుని వాక్యము. జ్ఞాని = శాస్త్రార్థము తెలిసినవాడు. తత్త్వదర్శి = తత్త్వము యొక్క యథార్థ స్వరూపము తెలిసినవాడు. ఈ విధముగా తెలిసిన తత్త్వదర్శి నుండి పొందిన ఉపదేశము సఫలము అవుతుందిగాని ఇతరము కాదు.

పైన చెప్పినవిధంగా కృతార్థుడైన వ్యక్తి నిశ్చింతతో ప్రసన్నేంద్రియుడై ఆనందముగా ఉంటాడు. ఇటువంటి శిష్యుడైన సత్యకాముని చూసి, గురువైన హారిద్రమతుడు ఇలా అన్నాడు -"బ్రహ్మవిదివ వై సోమ్య భాసి।" (ఛాం॥ 4-9-2) సోమ్య! బ్రహ్మవిదునివలె కనపడుతున్నావే? సోమ్య = చంద్రునివలె ప్రసన్నత కలిగినవాడు. శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు అయిన గురువు - సమదర్శి, అహంకార మమకార వర్జితుడు, శీతోష్ణములు సుఖదుఃఖములు మానావమానములు మొదలైన ద్వంద్వములకు అతీతుడు, ఇచ్ఛలేనివాడు, అపరిగ్రహము కలవాడు, శుచి, కార్యదక్షుడు, కరుణామయుడు, డంభము దర్పము లేనివాడు. ఇటువంటివాడు విద్యను కపటము లేకుండా బోధ చేయును. ఇటువంటి బోధకుని వలన అన్ని సందేహములు నివృత్తమగును. సర్వజ్ఞ కవి ఇలా అన్నాడు "సురతరువు (కల్పవృక్షము) కేవలము వృక్షము కాదు; సురభి కేవలము గోవు కాదు, పరుసవేది కేవలము ఱాయి కాదు; గురువు కేవలము మానవుడు కాదు. విష్ణుస్వరూపాన్ని తెలుసుకున్న గురువు స్వయంగా విష్ణుస్వరూపుడే! అందువల్ల అతనిమీద పూర్ణమైన శ్రద్ధ కలిగివుండాలి." "ఇటువంటి సద్గురువులకు సాధన చతుష్టయ సంపన్నుడు, సంప్రదాయానుసారి ఐన శిష్యుడిని సంసార సముద్రమును తరింపచేయడమే కర్తవ్యము" (ముం॥ 1-2-13). "న్యాయత ఉపసన్నాయ యోగ్యాయ జానతా విద్యా వక్తవ్యైవ।" (ప్ర॥ భా॥ 6-1) - న్యాయయుక్తముగా వచ్చిన యోగ్యుడైన శిష్యునికి జ్ఞానియైన గురువు తెలిసిన విద్యను ఉపదేశించాలి.

3-3) సద్గురు ప్రాప్తి : అతని సేవ

ఇటువంటి గురువును పొందలేక పోవుటకు కారణముగా రెండు అజ్ఞానములు ఉన్నాయి. (1) మోక్షము పొందుటకు శాస్త్రీయమైన మార్గము తప్ప ఇంకొక మార్గము లేదని తెలియకపోవుట - "నాన్యః పంథా అయనాయ విద్యతే।" (శ్వే॥ 3-8) "ఈ ధ్యేయమును పొందుటకు ఇంకొక మార్గము లేదు." (2) సాధన సంపత్తి కలిగి మోక్షమును పొందాలి అనుకునే వ్యక్తి తనకు తానే ప్రయత్నించాలి అని తెలియకపోవడము. "ఉద్ధరేదాత్మనాత్మానం" (గీ॥ 6-5) - "తనను తానే ఉద్ధరించుకోవాలి". ఈ రెండు అజ్ఞానముల నుండి దూరమైనవానికి ఈశ్వరానుగ్రహమువలన సద్గురుప్రాప్తి కలుగుతుంది. సద్గురువు ప్రాప్తి కలిగిన తరువాత వారి సేవ ఎలా చెయ్యాలో శ్రుతి చెప్తున్నది. సమిధలు సమర్పించి నమస్కారము చెయ్యాలి. సమిధలనగా కర్మోపయోగి ద్రవ్యములు. కర్మనుండి విముక్తి కలిగి మోక్షము పొందాలనుకునేవాడు తనకు కర్మలవల్ల ప్రయోజనము లేదని గ్రహిస్తాడు. సమిధలనే సంకేతముతో తన సమస్త కర్మలను గురువుద్వారా లభించిన జ్ఞానాగ్నిలో భస్మము చేయాలనుకుంటాడు. ఆ అర్థముతోనే సమిధలు సమర్పిస్తాడు. "యథైధాంసి సమిద్ధోగ్నిః భస్మసాత్ కురుతేऽర్జున । జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా।" (గీ॥

4-37) – చక్కగా జ్వలిస్తున్న అగ్ని కాష్ఠములను భస్మము చేయునట్లు, జ్ఞానాగ్ని సర్వకర్మలను దహించివేయును అని భగవానుడు అన్నాడు. గురువు ఎడల ఎటువంటి భయభక్తులు, వినమ్రత ఉండాలో పురాణేతిహాసాలు కూడా చెప్పాయి. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।" (గీ॥ 4-34). బ్రహ్మమును తెలుసుకొనుటకు వినయముతో సాష్టాంగ నమస్కారము చేసి సంశయరాహిత్యము చేయగల ప్రశ్న వేయవలెను. ప్రణిపాతము సంపూర్ణ శరణాగతిని, పరిప్రశ్న వినయమును, సూచిస్తున్నవి. ఇవిగాక, గురువు ఏ విద్యను బోధిస్తాడో దాని సిద్ధికొరకు గురుసేవ చాలా ఆవశ్యకము. సంన్యాసి కానటువంటి శిష్యుడు గురువుకు దక్షిణ సమర్పించాలి (తై॥ 1-11).

3-4) హెచ్చరిక

తెలియని ఒకానొక ముముక్షువు అజ్ఞానముతో అయోగ్యుడైన గురువును స్వీకరించాడని అనుకుందాం. కొన్నాళ్ళకు, గురువుకు శాస్త్రజ్ఞానం ఉన్నప్పటికీ అతడు సాధనసంపత్తి ఏ మాత్రం లేనివాడనీ, పైగా శాస్త్రార్థమును బోధించడంలో, దాన్ని అనుసరించడంలో, సంప్రదాయ పద్ధతి విస్మరించాడనీ, యథార్థ స్వరూపము తెలిసినప్పుడు ఏమాత్రము సంశయించకుండా ఆ గురువును శిష్యుడు వర్జించాలి. "అసంప్రదాయవిత్ సర్వశాస్త్రవిదపి మూర్ఖవదేవ ఉపేక్షణీయః ।" (గీ॥ 13-2). ఇదే విషయమును శ్రీ వ్యాసమహర్షి స్పష్టంగా ఇలా చెప్పారు – "గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః । ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే ।" – దురహంకారి, కార్యాకార్య విచక్షణ లేనివాడు, అపమార్గములో నడిచేవాడు అయినవానిని, గురువైనప్పటికీ తప్పక విడిచిపెట్టాలి. (శాంతిపర్వము : 5-77)

ప్రశ్నలు :

1. బ్రహ్మవిద్యను కఠినము అని ఎందుకు అన్నారు?
2. బ్రహ్మవిద్యలో గురువు మార్గదర్శనము ఎందుకు?
3. శ్రోత్రియుడు ఎవరు?
4. బ్రహ్మనిష్ఠుని లక్షణములు ఏమిటి?
5. సర్వజ్ఞకవి గురువు లక్షణములు ఏవని చెప్పాడు?
6. సద్గురువు ఎప్పుడు దొరుకుతాడు?
7. గురుసేవ ఎలా చేయాలి?
8. ఎటువంటి గురువువద్ద బ్రహ్మవిద్య అభ్యసించాలి?

అధ్యాయము - 4

ప్రమాణములు

ఇప్పటివరకు ముముక్షు – గురువుల లక్షణములను చెప్పుకొన్నాము. ఇక అనుబంధ చతుష్టయములో చెప్పబడిన జగద్ – బ్రహ్మ – జీవులను గురించి శాస్త్రములో ఏ విధంగా వివరించబడినది, ఆ వివరణతో ముముక్షువునకు ఏవిధముగా సమ్యక్‌జ్ఞానము లభిస్తున్నది అనే విషయము వివరించుకొందాము.

4–1) త్రిపుటి

ఏ విషయంలోనైనా యథార్థజ్ఞానాన్ని 'ప్రమ' అంటారు. ప్ర = ప్రకర్ష, మ = కొలుచుట; అనగా విషయముయొక్క మూలము వరకు ప్రవేశించి నిశ్చయాత్మక జ్ఞానము పొందుట అని. ఈ నిశ్చయజ్ఞానమే ప్రమ.

ఇటువంటి ప్రమ గలిగిన వ్యక్తి 'ప్రమాత'. 'ప్రమ'ను కలుగజేసే విశిష్ట కరణమే ప్రమాణము. 'ప్రమ' యొక్క విషయమే 'ప్రమేయము'.

ఉదా : ఒక ఘటమును చూసి 'ఇది ఘటము' అని తెలుసుకొనేవాడే 'ప్రమాత'. దేనితో చూస్తున్నాడో ఆ కన్నులు 'ప్రమాణము'. 'ప్రమ'ను కలిగించే కరణమే ప్రమాణము – 'ప్రమా కరణం ప్రమాణమ్'. ఘటము ప్రమేయము. 'ఇది ఘటము' అనే నిశ్చయ జ్ఞానమే 'ప్రమ'

ఈ ప్రమాత – ప్రమాణ – ప్రమేయ విభాగమే 'త్రిపుటి'. కేవలము 'తెలుసుకోవడము' అనే విషయము మాత్రమే కాక భోక్త – భోగము – భోజ్యము, ధ్యాత – ధ్యానము – ధ్యేయము, సాధకుడు సాధన – సాధ్యము మొదలైన అన్నిటినీ 'త్రిపుటి' అంటారు.

వివిధ విషయాల నిశ్చయ జ్ఞానము వివిధమైన ప్రమాణాలతో లభిస్తుంది. ఆ ప్రమాణములు 5 విధములు. 1) ప్రత్యక్షము, 2) అనుమానము, 3) ఉపమానము, 4) అర్థాపత్తి, 5) ఆగమము. ప్రతీ ఒక్క ప్రమాణము గురించి సంక్షేప వివరణము ఇపుడు తెలుసుకుందాము.

4–2) ప్రత్యక్ష ప్రమాణము

జగత్తులోని అసంఖ్యాకమైన విషయాలన్నీ కూడా ఈ ఐదు క్రింది వర్గములలోనికే వస్తాయి. అవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. ఈ ఐదింటిని విడచి జగత్తులో ఇంకే విషయము లేదు. శరీరములోని పంచేంద్రియముల ద్వారా వీటి గ్రహణ కలుగుతుంది. ఈ జ్ఞానేంద్రియములు శ్రోత్రము, త్వక్కు, నేత్రము, జిహ్వ, ఘ్రాణము. ఇంద్రియములకు విషయములతో సన్నికర్ష (సంపర్కము) ఏర్పడగానే బుద్ధిలో విషయము యొక్క నిశ్చయజ్ఞానము ఏర్పడుతుంది. ఈ విధమైన జ్ఞానోత్పత్తిని కలిగించే కరణమును "ప్రత్యక్ష ప్రమాణము" అంటారు.

జ్ఞానము కలిగించే సామగ్రిలో (కరణములో) ఏ విధమైన దోషము ఉన్నప్పటికీ నిశ్చయజ్ఞానము కలుగదు; అంతేగాక సంశయజ్ఞానమే (సంశయ గ్రహణము), మిథ్యాజ్ఞానమే (అన్యథా గ్రహణము) కలుగుతాయి. ఏ దోషము లేనట్లయితే సమ్యక్‌జ్ఞానము (నిశ్చయజ్ఞానము) కలుగుతుంది. విషయము ఏ మాత్రము తెలియకపోవడమే అజ్ఞానము (అగ్రహణము, అవిద్య) అంటారు.

ఉదా : నడిచే దారిలో ఒక త్రాడు పడివుందనుకోండి. గాలివల్ల అది కొద్దిగా కదులుతూ వుంటుంది. మందంగా ప్రకాశము దానిమీద పడుతూ వుంటుంది. ఇలాంటి పరిసరము వలన కొద్దిదూరము నుంచి ఆ త్రాడు, సర్పమనే అనిపిస్తుంది. అది త్రాడు విషయంలో కలిగిన 'మిథ్యాజ్ఞానము'. రజ్జు – సర్పములలో కల సాదృశ్యమే మిథ్యాజ్ఞానమునకు కారణము. ఇది రజ్జువా? లేక ఇంకొక వస్తువా? అని ఆలోచించడము 'సంశయ జ్ఞానము'. భయపడుతూ, దీపముతో దగ్గరగా వెళ్ళి చూడడము, చప్పట్లు కొట్టడము, కర్రతో దానిని కదిపి చూడడము ఇదంతా చేసిన తరువాత అది త్రాడు మాత్రమేనని తెలుసుకొంటాము. దీనిని రజ్జు విషయములో 'సమ్యక్‌జ్ఞానము' అంటారు. రజ్జువు విషయములో ఈ పై చెప్పిన ఏ విషయము గురించి భావన చేయకపోవడమే అజ్ఞానము.

4–3) అనుమాన ప్రమాణము

ప్రత్యక్ష ప్రమాణము (జ్ఞానేంద్రియముల వలన కలిగినది) వలననే కాక ఇతర ప్రమాణముల ద్వారా కూడా 'ప్రమ' యొక్క ఉత్పత్తి కలుగుతూ వుంటుంది. ఉదా : దూరములో పొగను చూసి అక్కడ అగ్ని ఉందని తెలుసుకొంటాము. ఏ కరణం వల్ల ఈ ప్రమ కలుగుతుందో దానిని 'అనుమాన ప్రమాణము' అంటారు. "అనుమితి కరణమ్ అనుమానమ్ ।" వ్యాప్తి జ్ఞానముచేత అనుమితి కలుగుతుంది. అందువల్ల వ్యాప్తిజ్ఞానమే అనుమాన ప్రమాణము.

ఉదా : వంటశాలలో ధూమము – వహ్ని (అగ్ని) కలిసి వుండడము చూస్తాము. 'యత్ర యత్ర ధూమః తత్ర తత్ర వహ్నిః।' – ఎక్కడెక్కడ ధూమము వుంటుందో అక్కడ అగ్ని వుంటుంది అనే సంబంధమును వ్యాప్తి అంటారు. తరువాత పర్వతము పైన ధూమము చూడగానే వ్యాప్తి స్మరణకు వస్తుంది. ఇక్కడ ధూమము వ్యాప్యము, వహ్ని వ్యాపకము. ఈ స్మరణాత్మక జ్ఞానముచేత "పర్వతః వహ్నిమాన్।" పర్వతము మీద అగ్ని వున్నది అనే అనుమితి కలుగుతుంది. సామాన్యజనులు జ్ఞానవృద్ధికి ఈ అనుమాన ప్రమాణమును ఉపయోగిస్తారు.

వ్యాప్తి యొక్క అవాస్తవిక జ్ఞానము వలన కలగడంచేత ఒక్కొక్కప్పుడు అనుమితి జన్యజ్ఞానము భ్రమ కావచ్చును. అందువల్ల అనుమాన ప్రమాణముతో తెలుసుకున్న విషయము సరియైనదా, కాదా అనేది ప్రత్యక్ష ప్రమాణముచేత నిశ్చితమవుతుంది.

ఉదా : పొగమంచును చూసి ధూమమని అనుకోవచ్చు; కాని ప్రత్యక్షముగా చూడడము వల్ల అది పొగకాదని నిశ్చయము కలుగుతుంది. అనగా అనుమాన ప్రమాణముపైన ప్రత్యక్ష ప్రమాణముయొక్క అంకుశము వుంటుంది; ఐతే, ఇటువంటి అంకుశము ప్రత్యక్ష ప్రమాణము మీద ఉండదు. అందువల్ల ప్రత్యక్ష ప్రమాణమును 'నిరంకుశ ప్రమాణము' అంటారు. ఈ విధముగా అనుమాన ప్రమాణముతో నిశ్చయించిన విషయమును ప్రత్యక్ష ప్రమాణమునకు విరుద్ధమయితే నిరాకరింపవచ్చు; కాని ప్రత్యక్ష ప్రమాణముతో నిశ్చయమయిన విషయము అనుమాన ప్రమాణముతో నిరాకరింపబడదు.

4–4) ఉపమాన ప్రమాణము

'ఉపమితి' కరణమును 'ఉపమాన ప్రమాణము' అంటారు – "ఉపమితి కరణం ఉపమానమ్ ।" ఉదా : 'గవయము' అనే ఒక అరణ్యప్రాణి గోవులాగే వుండే నల్లని ఆవు. నగరంలో ఆవును చూసిన వ్యక్తి అడవిలో అటువంటి ప్రాణి కనబడగానే "అయం పిండః (జంతుః) గో సదృశః।" ఈ జంతువు ఆవువలె ఉ

న్నది అను జ్ఞానము కలుగుతుంది. తరువాత "అనేన సదృశీ మదీయ గౌః" - దీనివంటిదే నా గోవు అనే ఉపమితి ప్రమ కలుగుతుంది.

ఇక్కడ ఉపమితి జనించడానికి కరణము 'గవయము'లో నిశ్చితమైన గోసాదృశ్యజ్ఞానము. దీనిని 'ఉపమాన ప్రమాణము' అంటారు. నిశ్చయముగా గోవును తెలియడము వలన గవయమునందు కలిగిన గోసాదృశ్యజ్ఞానమే ఉపమితికి కరణము. ఇదే ఉపమాన ప్రమాణము. ఇక్కడ గోవు ఉపమానము, 'గవయ' ఉపమేయము. ఉపమాన - ఉపమేయములకు కొన్ని విషయాలలోనే సాదృశ్యము ఉంటుంది. ఉదా: నాగసర్పము జలసర్పము ఒకలాగే వుంటాయి. కాని నాగసర్పమునకు విషము వుంటుంది; జలసర్పమునకు విషము వుండదు. (సూ॥భా॥ 2-2-10).

4-5) అర్థాపత్తి ప్రమాణము

పగలు భోజనము చేయని వ్యక్తి స్థూలకాయుడై ఉన్న ఎడల రాత్రి భోజనము చక్కగా చేస్తున్నాడని భావము. ఇక్కడ రాత్రి భోజన విషయము చెప్పకపోయినా ఊహించి తెలుసుకోగలము. రాత్రి భోజనముయొక్క జ్ఞానము అర్థాపత్తి ప్రమ. ఈ ప్రమకు కరణమైన ప్రమాణమును కూడా 'అర్థాపత్తి' అంటారు. పగలు భోజనము చేయని వ్యక్తియొక్క స్థూలత్వము వలన రాత్రి భోజనము చేస్తున్నట్లు జ్ఞానము కలుగుతున్నది. అందువలన పగలు భోజనము చేయని వ్యక్తియొక్క స్థూలత్వ జ్ఞానము అర్థాపత్తి ప్రమాణము అవుతుంది. "అర్థస్య ఆపత్తిః యస్మాత్ ప్రమాణాత్ తత్ అర్థాపత్తి ప్రమాణమ్ ।" - వింటున్న, చూస్తున్న విషయాలకి, అర్థమవడములో ఆపత్తి (విభేదము) వస్తున్నప్పుడు, ఆ భేదమును ఇంకొక అర్థముతో నివారించటమును "అర్థాపత్తి ప్రమాణము" అనవచ్చు.

4-6) ఆగమ ప్రమాణము

దీనిని "శబ్ద ప్రమాణము" అని కూడా అంటారు. ఇక్కడ 'శబ్దము'నకు "ఆప్తవాక్యము" అని అర్థము. "ఈ మార్గము కాశీ వెళ్తుంది" అనగానే కాశీకివెళ్ళు మార్గము అని గుర్తు తెలుస్తుంది. ఇది లౌకిక శబ్దము; ప్రస్తుత విచారణ విషయము ఇది కాదు. 'లౌకిక' వాక్యాలలో వక్తయొక్క భ్రమ, ప్రమాదము, విప్రలిప్స (ఏదో ఉద్దేశ్యముతో సరికాని లేక అసంపూర్ణమైన సూచన ఇచ్చుట) మొదలైన దోషాలతో యథార్థము కానటువంటి జ్ఞానము కలుగుతుంది. అయితే ఇప్పుడు అలౌకిక శబ్ద విచారణ చేస్తున్నాము: అనగా 'ఆగమ' శబ్ద విచారణ చేస్తున్నాము. 'వేద' 'శ్రుతి' శబ్దములు, 'ఆగమ' శబ్దమునకు పర్యాయపదములు. ధర్మాధర్మములు గాని, ప్రకృతిని అధిగమించిన విషయములు గాని అచింత్యమైనవి కావడమువల్ల మానవుడు నిశ్చయించజాలడు. (భీష్మపర్వము 5-12). మనోవాక్కులకు మించిన విషయముల జ్ఞానము వేదము మీద ఆధారపడి వున్నది.

అలౌకిక విషయములను బోధ చేసే శక్తి వేదమునకు వున్నది. దానికి కారణము - భగవంతుని నిశ్వాసమువలె సహజముగా సృష్టి ప్రారంభములో కేవలము పరమేశ్వరుని నుండి జనించినది వేదము. ఆ వేదములు, 'అలౌకిక' విషయముల గురించి బోధ చేయగలవు. ఎందుకనగా, అవి పురుష నిర్మితములు కావు. వేదములు నాలుగు - 1) ఋగ్వేదము, 2) యజుర్వేదము, 3) సామవేదము, 4) అథర్వణవేదము - "అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదః అథర్వాంగిరసః।" (బృ॥ 2-4-10). ఇవి అపౌరుషేయములు. ఇతర అన్ని ప్రమాణములకన్న గొప్పదైన ప్రమాణము వేదము. ఇది

స్వతంత్ర ప్రమాణము. ఈ విషయమును నిశ్చయించుటకు అనుమాన ప్రమాణముతో పనిలేదు. "న చ అనుమానగమ్యం శాస్త్రప్రామాణ్యమ్। (సూ॥ భా॥ 1-1-4). కాని, దేహాత్మబుద్ధితో చదివేవారి సౌలభ్యము కోసము వేదముయొక్క అపౌరుషేయత్వము దిగువ నిరూపించబడినది.

ముఖ్యముగా వేదము 5 కారణముచేత మనుష్యకృతము కాదని తెలుస్తోంది.

1) ఇందులో ఎక్కడా కర్తయొక్క నామము కనపడుట లేదు. ఎవరైనా కర్త ఉన్నట్లయితే ఎక్కడో ఒక చోట అయినా అతని ప్రస్తావన వచ్చివుండేది.

2) ఇందులో సప్తస్వరములు ఉన్నవి. ప్రత్యేక అక్షరమునకు స్వరము, మాత్ర నిశ్చయింపబడి వున్నవి. ఏ మార్పూ లేకుండా అవి ఈ నాటికీ నిలచి వున్నవి. ఒక వేళ ఇవి మానవనిర్మిత విధానమే అయితే, ఇలా మార్పు లేకుండా వుండేవి కావు.

3) వేదము సమస్త విషయజ్ఞానములకు గని వంటిది. దీని విస్తారము మన ఊహకు అందనిది. ఎవరో ఒక కర్తవల్ల, ఇంత విపులమైన గ్రంథము రచింపబడుట అసంభవము.

4) ఒక వేళ అనేక కర్తలవల్ల, అనేక కాలాల్లో రచింపబడి ఉండవచ్చనే ఆరోపణకు అవకాశము లేదు. అనేకులు రచించిన కృతులలో వారి వారి విరుద్ధ భావనలు ఉంటాయి, ఏకాభిప్రాయము ఎన్నడూ ఉండదు. కాని, వేదములో ఏకాభిప్రాయము ఉండడము వల్ల అనేక కర్తలచేత రచింపబడినది కాదు.

5) వేదములలో అనేక విషయములు వివరింపబడినవి. అవి మానవునికి తెలియనివి. ఆ విషయజ్ఞానము మానవునకు ఇప్పుడిప్పుడే లభించింది. ఉదా : అథర్వ వేదములో పృథ్వీమీద సప్తద్వీపములు ఉన్నవి అని వున్నది. కాని, 1911 సం॥వరకు కేవలము 6 ద్వీపములే ప్రజలకు తెలిశాయి. తరువాత 'అంటార్టికా' ద్వీపమును తెలుసుకున్నారు. పురాణాల్లో దీనిని 'శాకద్వీపము' అంటారు. ఒకవేళ వేదము మనుష్యకృతమే అయితే మిగిలినవి తెలుసుకున్నప్పుడే ఈ ద్వీప విషయము కూడా తెలియజేసేవారు. ఇలాగే అనేక విషయములు ఉదహరించవచ్చు.

ఇక, సంశయము కలిగించేవి లేక విరుద్ధముగా కనపడేవి అయిన, వేద వాక్యముల విషయములో ఏమి చెప్పాలి? వాటిని ఎలా పరిహరించాలి?

జటిలమైన ఏ శాస్త్ర విషయములోనైనా విచారణ చేసే సమయంలో ఉపయోగించే వాక్కులో (వాణిలో) ఒక అనివార్యదోషము ఉంటూనే ఉంటుంది. సమగ్ర దృష్టితో నిశ్చయమైన అర్థాన్ని ప్రకటించాలనుకునే ఉచ్చారణ కర్తయొక్క ఇచ్ఛను పూర్తి చేసే శక్తి వాక్కుకు లేదు. అందువలన అల్పశక్తితో ఏకదేశీయంగా (ఒకే అంశాన్ని) మాత్రమే బోధించేదిగా ప్రవృత్తమవుతుంది. సమగ్రమైన అర్థమును బోధించే వాక్కు పలకడం వక్తకు సాధ్యంకాదు; ఇది అందరికీ తెలిసిన విషయమే! వాక్కును ప్రయోగించే వక్త తన వాక్యముతో శ్రోత దృష్టిని సమగ్రమైన అర్థమువైపు మళ్ళించడము తప్ప ఇంకేమీ చేయలేదు. సమగ్రార్థమువైపు వెళ్ళేటప్పుడు ఒక విషయము ఇంకొక విషయముతో వేఱవుతూ వుంటుంది. ఉదా: ఇంటికి వెళ్ళేటప్పుడు ఆ ఇంటి దిశను అనుసరించి మార్గము మారుతూ ఉంటుంది. అదేవిధంగా సహజంగా అర్థాన్ని అనుసరించి వాక్యవృత్తి కూడా మారుతూ వుంటుంది. అందువల్ల శ్రుతియొక్క అర్థమును నిర్ణయించడము కష్టమవుతుంది.

ఈ కారణముగా శ్రుత్యర్థమును సమగ్రముగా గ్రహించిన సంప్రదాయకర్తలైన మహర్షులు శ్రుత్యర్థమును నిశ్చయము చేసేటందుకు ఒక క్రమమును నిర్ణయించారు. పూర్వ మీమాంసా శాస్త్రములో

ఒక నియమము ఉన్నది. శ్రుతి, లింగము, వాక్యము, ప్రకరణము, స్థానము, సమాఖ్య – ఇవి ఒకచోట చేరినప్పుడు సమన్వయములో ముందుగా ఉన్నవి దుర్బలమవుతూ వుంటాయి – "శ్రుతి లింగ వాక్య ప్రకరణ స్థాన సమాఖ్యానాం సమవాయే, పారదౌర్బల్యం అర్థవిప్రకర్షాత్ ।" (జైమిని సూత్రములు 3-3-13). అన్యప్రమాణములతో అవసరము లేనిది 'శ్రుతి'; శబ్దముయొక్క సామర్థ్యము 'లింగము'; సమగ్రార్థమును వివరించే పదసమూహము 'వాక్యము'; అంగమునకు అంగికి అవసరమైన ప్రమాణము 'ప్రకరణము'; ఒకే చోట ఉండేది 'స్థానము'; యౌగిక శబ్దము 'సమాఖ్య'. ఇవన్నీ ఒకే విషయంలో ఉండగా, పరస్పర విరుద్ధమయితే, ఒకదాని కంటె దాని తరువాతది దుర్బలమవుతూ వస్తుంది. ఎలాగనగా శ్రుతికి విరుద్ధమయితే వాక్యమునకు, వాక్యమునకు విరుద్ధమైతే ప్రకరణమునకు, ప్రకరణమునకు విరుద్ధమైతే స్థానమునకు, స్థానమునకు విరుద్ధమైతే సమాఖ్యకు, బలహీనత కలుగుతుంది. దీనికి కారణము ఏమనగా పై విషయములు తమతమ పూర్వ ప్రమాణములతో అర్థమును తెలియబరుస్తూ ఉండడముచేత అర్థగ్రహణకు కొంత విలంబము జరుగుతుంది. ఇటువంటి నియమాలను పాటిస్తూనే శ్రుత్యర్థము గ్రహించవలసి వుంటుంది.

ఈ విధముగా వేదము పౌరుషేయము కాదని నిశ్చయము. ఇటువంటి వేదవాక్యములను, కల్పము మొదట్లో జన్మించిన బ్రహ్మమానసపుత్రులైన మరీచ్యాది సప్తఋషులు, తరువాత వారి వంశీయులయిన మహర్షులు తమ తమ పూర్వజన్మ తపస్సువలన, ఈశ్వరానుగ్రహమువలన స్మరణకు తెచ్చుకోగలిగారు (సూ॥ భా॥ 1-3-30). వీరిని 'మంత్రద్రష్టలు' అన్నారు; వీరు మంత్ర రచయితలు కారు. వీరు ఏ పరంపరను ప్రారంభించారో అదే పరంపరానుగతముగా వేదము బోధింపబడుతూన్నది. ఈ విధంగా ధర్మాధర్మములు, ప్రకృతికి అతీతమైన బ్రహ్మస్వరూపము, జీవస్వరూపము మొదలైన వాటిని వేదము ద్వారానే బోధిస్తూ ఉన్నారు.

4-7) మీమాంసకుల విభిన్న ప్రమాణము

మీమాంసకుల మతములో 'అనుపలబ్ధి' అనే ఇంకొక ప్రమాణము ఉన్నది. ఉన్న వస్తువును 'ఉన్నది' అని తెలుసుకోవడంలో ఏ ప్రమ కలుగుతుందో దానిని 'ఉపలబ్ధిప్రమ' అంటారు. లేని వస్తువును అది లేదు అని గ్రహించడం 'అనుపలబ్ధి ప్రమ'. ఈ ప్రమయొక్క కరణము 'అనుపలబ్ధి ప్రమాణము' ఉదా: పాత్రలో జలముయొక్క అభావమున్నది (జలములేదు). ఇక్కడ అభావముయొక్క 'ప్రతియోగి' జలము; పాత్ర 'అనుయోగి'. ఈ 'అభావము' ఈ 'అనుపలబ్ధి ప్రమాణము' వల్ల తెలియబడుతూన్నది.

చాలామంది వేదాంతులు ఈ ప్రమాణమును తమ గ్రంథములలో చేర్చుకున్నారు. పరమార్థ విచారములో వేదాంతులకు, మీమాంసకులకు చాలా విభేదమున్నదని అందరకూ తెలుసు. అయినప్పటికీ 'వ్యవహారంలో వేదాంతులు మీమాంసకులను ఆమోదిస్తున్నారు' అని ఒక సామాన్య కథనము వున్నది. దీని ఆధారంగా కొంతమంది వేదాంతులు ఈ అనుపలబ్ధి ప్రమాణమును ఆమోదిస్తున్నారు.

కాని ఇది సమంజసము కాదు. ఉన్న వస్తువుయొక్క సమ్యక్జ్ఞానము దేనివల్ల నిర్ణయింపబడుతున్నదో అదే ప్రమాణము. 'ఉపలబ్ధి ప్రమాణము'చేత ఏ వస్తువుయొక్క జ్ఞానము కలుగదో ఆ వస్తువుయొక్క 'అభావము'ను చెపుతాము – "ఉపలబ్ధి లక్షణ ప్రాప్తస్య అనుపలబ్ధేః అభావో వస్త్వంతరస్య ।" (సూ॥ భా॥ 2-2-17). సంశయజ్ఞానముయొక్క లేక మిథ్యాజ్ఞానముయొక్క ఉత్పత్తికి కారణమైనదానిని ఎవరూ ప్రమాణముగా స్వీకరించరు. అటువంటి పరిస్థితిలో ఇక వస్తువే లేకుండగా వస్తువుయొక్క 'ప్రమ'గాని దాని 'ప్రమాణము'గాని ఎక్కడ వుంటుంది? ఏ ప్రమాణము లేనందువల్ల వస్తువుయొక్క 'నాస్తిత్వము' (అభావము)

నిశ్చయమవుతూ ఉండగా, దాని నాస్తిత్వమునే 'ప్రమేయ' రూపముగా కల్పనచేసి, ఆ ప్రమేయమునకు ఇంకొక ప్రమాణము కల్పన చేయడము 'కల్పనాభారము' అవుతుంది. ప్రమాణముయొక్క ప్రవృత్తి, అప్రవృత్తి ద్వారా వస్తువు ఉండడము లేకపోవడము నిశ్చయించవచ్చు. అంతేగాని వస్తువు ఉండడము లేకపోవడం వల్ల ప్రమాణముయొక్క ప్రవృత్తిగాని, అప్రవృత్తిగాని నిశ్చయము కావు – "యతః ప్రమాణ ప్రవృత్తి అప్రవృత్తి పూర్వకౌ సంభవాసంభవౌ అవధార్యేతే, న పునః సంభవాసంభవ పూర్వికే ప్రమాణ ప్రవృత్యప్రవృత్తీ" (సూ॥ భా॥ 2-2-28). ఇంతేకాక ఈ 'అభావ ప్రమ' ఇతర 'ప్రమ'లవలె సహజమయినది కాదు; ఎందుకనగా అది ప్రతియోగి జ్ఞానము తరువాతనే కలుగుతుంది. శ్రీ శంకర భగవత్పాదులు కూడా ఉపలబ్ధి ప్రమాణములతో 'కర్మ సముచ్చయమును నిరాకరణ చేస్తూ (బృ॥ భా॥ 3-3-1), ఇతర లోకములను పరీక్షించి వాటి నిస్సారతను నిరూపిస్తూ కూడా (ముం॥భా॥ 1-1-12) పైన చెప్పిన 5 ప్రమాణములనే ఇచ్చారు; ఈ అభావములకు అనుపలబ్ధి ప్రమాణమును చెప్పలేదు. వేదాంతములో ఎక్కడా కూడా ఈ ప్రమాణము గురించి చెప్పలేదు. ఇక ఈ ప్రమాణమును గురించి చర్చ వదలి, కేవలము శ్రీ సురేశ్వరాచార్యులు చెప్పిన మాటలు మాత్రము ఉదాహరించి ముగించుకొందాము.

శ్లో॥ మానాభావస్య మానత్వం మేయాభావస్య మేయతా ।
న్యాయం న సహతే¬తీవ యథా తదధునోచ్యతే ॥ (సంబంధవార్తికము – 938)

మానాభావముయొక్క ప్రమాణత్వము, మేయాభావము (అనుపలబ్దము) యొక్క మేయత్వము న్యాయసమ్మతము కావు. వాని విషయములో ఇలా చెప్పబడింది.

శ్లో॥ బోధకం యదబుద్ధస్య తన్మానం ఇతి హి స్థితిః ।
న చ ప్రమాణతాస్తిత్వం ఈదృక్ తస్మాన్న యుజ్యతే ॥ (సంబంధ వార్తికము – 939)

ఏది తెలియని వస్తువును తెలియజేస్తుందో అదే ప్రమాణము. మానాభావమునకు ఇది సరిపోదు. అందువల్ల అనుపలబ్ధి, ప్రమాణము కాదు.

ఈ విధముగా అయితే వ్యవహార విషయములో వేదాంతము మీమాంసా శాస్త్రమును ఆమోదిస్తున్నదని చెప్పడము సరికాదా? ఇలా చెప్పడము కొంత హద్దువరకు సత్యమే! కాని పూర్తిగ సరికాదు. ఉదా : "నిత్యకర్మ చేయడము వలన ఫలితము లేదు. చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది" అని మీమాంసకులు అంటారు; ఇది పరమార్థ విషయము కాదు; వ్యవహార విషయము మాత్రమే! అయినా, వేదాంతము ఇలా చెప్తున్నది – "నిత్యకర్మ చేయడము వలన ఫలితము ఉన్నది. ఒకవేళ సంన్యాసములో చేయకపోయినా దోషము లేదు" (ముందు ఈ విషయమును 17-4 అధ్యాయములో చూడవచ్చు.) ఈ విధముగా మీమాంసకులకు వేదాంతులకు అభిప్రాయ భేదమున్నది. ఈ ప్రకారము అనేక దృష్టాంతములు ఉన్నవి. అనుపలబ్ధి ప్రమాణమును మీమాంసకులు స్వీకరించారు కనక వేదాంతులు కూడా స్వీకరించాలని చెప్పటము సరికాదు.

ప్రశ్నలు :

1. త్రిపుటి అనగానేమి?
2. ప్రమాత ఎవరు?
3. ప్రమ అనగా ఏమి?
4. ప్రమేయము అంటే ఏమిటి?
5. ప్రమాణములు ఎన్ని విధములు? అవి ఏవి?
6. ప్రత్యక్ష ప్రమాణము యొక్క లక్షణము ఏమిటి?
7. అనుమాన ప్రమాణము ఎప్పుడు ఉపయోగింపబడుతున్నది?
8. ఉపమాన ప్రమాణములో ఏ అంశములు ముఖ్యము?
9. అర్థాపత్తికి అర్థము ఏమిటి?
10. ఆగమ ప్రమాణమును ఎందుకు ఆమోదించాలి?
11. ఏ విషయములద్వారా వేదము అపౌరుషేయమని సిద్ధమవుతున్నది?
12. వేదములో సంశయాస్పదమయినవి – పరస్పర విరుద్ధములైనవి, వాక్యములను చూపించిన కారణము ఏమిటి? వాటి పరివారము ఎలా చేయాలి?
13. అనుపలబ్ధి ప్రమాణము అనగా ఏమి?
14. సురేశ్వరాచార్యులు అనుపలబ్ధి ప్రమాణమును ఎందుకు ఆమోదించలేదు?

జగత్ప్రకరణము

ఈ ప్రకరణములో జగత్తు స్వరూపము వివరించబడినది. ఈ విషయంలో అనేక భిన్నమైన వాదాలను చెప్తూ వాని తర్కములతో వానినే పరాజయము పాలు చేశారు. తన స్వరూపముతో జగత్తు బ్రహ్మగానే ఉన్నది అనే వేదాంత సిద్ధాంతమును సమర్థిస్తూ, వేదవిరుద్ధమైన ఆక్షేపణలకు ఆవశ్యకమైన సమాధానము ఇవ్వడమైనది.

ఈ దృష్టితో పూజ్యులైన భాష్యకారులచే ప్రతిపాదించబడిన 'కార్యకారణ అనన్యత్వ న్యాయము' చాలా గంభీరము, సుందరము, వీర్యవంతము అయినది. ఈ న్యాయములో జగత్తు కార్యము, బ్రహ్మము దానికి కారణము. శ్రుతి అనుసారముగా అవ్యక్త బ్రహ్మయొక్క వ్యక్తరూపము జగత్తు. ఏ వికారము ద్వారా బ్రహ్మ జగత్తురూపముగా వ్యక్తమవుతున్నదో ఆ వికారము వాచారంభణము – నామధేయమాత్రము. శ్రోతలకు ఈ రెండు వర్ణనలద్వారా జగత్తు – బ్రహ్మముల సంబంధము పూర్తిగా స్పష్టముగా అవగాహన కాదు. సంశయములు కలుగుతాయి – జగత్తు బ్రహ్మముకంటే వేఱయినదా? లేక అభిన్నమా? కాక రెండూనా? దీనికి శ్రుతి అభిప్రాయము ఏమిటి?

దీనిని నిశ్చయించడానికి ఒక విషయమును మనస్సులో ఉంచుకోవాలి : శ్రుతిలోని ఏ వాక్యమునూ 'ఏకదేశీయము'గా కాక అన్ని వాక్యములనూ 'సమన్వయ' పద్ధతిలో గ్రహించడమనే ఒకే ఒక్క మార్గము ఉన్నది. ఎందుకంటే శ్రుతిలో భ్రమ, ప్రమాదము, విప్రలిప్స మొదలైన దోషాలు ఎక్కడా వుండవు. ఈ ఏకమాత్ర మార్గముయొక్క దిశను పూజ్యులైన భాష్యకారులు "కార్యకారణ అనన్యత్వన్యాయము"తో సూచించారు. ఏ అర్థములో జగత్తు బ్రహ్మకంటె భిన్నమయినది? ఏ అర్థములో అభిన్నము? ఏ అర్థములో రెండువిధములుగా కూడా ఉన్నది? వీటన్నిటి స్పష్టీకరణ ఒకే ఒక వాక్యముద్వారా ఒకేసారి తెలియబడుతుంది. ఈ న్యాయము వేదాంతమునకు పునాది కావడమువల్ల అధికక్రమతో దీని స్పష్టార్థమును తెలియజేయడమైనది. ఆఖరున కార్యజగత్తును గురించి, దానికి అత్యంత విలక్షణమైన కారణ బ్రహ్మముతో సంబంధమును కలిగిస్తున్న 'మాయ'ను గురించి చర్చించడమైనది.

ఇంక జగత్తుయొక్క సృష్టి–లయముల నిరూపణ జరిగింది. భాష్యములో ప్రతిపాదింపబడిన మాయను మూడువిధములుగా వర్ణించారు – (1) బ్రహ్మకు ఉపాధి (బ్రహ్మ భిన్నమైనది), (2) అనిర్వచనీయము (భిన్నమా అభిన్నమా అని చెప్పటానికి సాధ్యము కానిది), (3) బ్రహ్మాభిన్నము. ఈ మూడింటికి ఈ ప్రకరణములో సమన్వయము చేయబడినది.

అధ్యాయము - 5

అన్య సిద్ధాంతములు

క్రిందటి అధ్యాయములో విషయ విచారణకు అవసరమైన ప్రమాణములను గురించి వివరించడమైనది. ఇప్పుడు ఆ ప్రమాణములను వినియోగించి గ్రంథ విషయములైన జగద్ – బ్రహ్మ – జీవుల స్వరూపమును నిశ్చయించవలసి వున్నది. మొదట జగత్తుయొక్క విచారణ చేయబడుతున్నది.

5–1) జగత్తుకు ఒక అప్రత్యక్ష కారణము వున్నది

స్వరూపము అనగా తనయొక్క రూపము. ఇది ఎన్నడూ తనను విడిచి ఉండదు. కాని, జగత్తు ఎప్పుడూ పరిణామశీలము అని మనకు స్పష్టముగా తెలుసు. దీనివలన ఏ ప్రత్యక్షరూపముతో జగత్తు మనకు తెలియబడుతూన్నదో అది దాని స్వరూపము కానేకాదు. ఏదో ఒక మూలవస్తువు లేకుండా పరిణామమవుతున్న వస్తువు స్వతంత్రముగా వుండదని మనందరికీ తెలుసు. అంటే, దానిని ఇలా చెప్పవచ్చు: ఒకానొక మూలవస్తువు తన స్వరూపములో తాను వుంటూ, జగత్తురూపముగా అనేక ఆకారములను పొందుతున్నది అని ఊహించవచ్చు. ఇక్కడ ఆకారమునకు అర్థము కార్యము. మనము కేవలము ఆకారములను చూడగలుగుతున్నాము. కాని, జగత్తుకు ఆధారమయిన మూలవస్తువును ప్రత్యక్ష ప్రమాణముతో తెలుసుకోలేకపోతున్నాము; దానిని ఇతర ప్రమాణములతోనే నిశ్చయించవలసి ఉన్నది.

ఉదా : మంచుగడ్డ నీరుగా మారుతుంది. నీరు ఆవిరిగా మారుతుంది. మంచు, నీరు, ఆవిరి – ఇవి మనకు ప్రత్యక్షముగా కనపడే పదార్థములు. ఈ మూడు పదార్థముల సంభవమునకు ఇంకొక పదార్థము ఉండవలెను; అది ప్రత్యక్షము కాదు; దానిని నిశ్చయించుటకు భౌతిక శాస్త్ర విజ్ఞాన సహాయము కావాలి.

5–2) రెండు కారణములు

ఏ కార్యమునకైనా రెండు కారణములు కావాలి. 1) ఉపాదాన కారణము, 2) నిమిత్త కారణము. **ఏ వస్తువు తన స్వరూపములో వుంటూనే, అనేక రూపములలో ప్రకటింపబడుతూ వుంటుందో దానిని 'ఉపాదానము' అంటారు. ఆ రూపములు ఆ కారణముయొక్క కార్యములు.** అందువల్ల ఉపాదాన కారణమే కార్యముయొక్క స్వరూపము.

ఉదా : 1) ఘటము, ఇటుక మొదలైనవి కార్యములు. వాని ఉపాదాన కారణము మట్టి (మృత్తిక). కార్యము ఒక రూపమునుంచి ఇంకొక రూపముగా మారుతుంది. కాని, కారణమైన మన్ను అలాగే వుంటుంది. అందువల్ల మన్ను ఆ కార్యములకు ఉపాదాన కారణము; అనగా కార్యముల స్వరూపము.

ఉదా : 2) ఆభరణముల ఉపాదాన కారణము స్వర్ణము. అనగా స్వర్ణమే ఆభరణముల స్వరూపము.

ఉపాదాన కారణము తనకు తానుగా కార్యరూపమును పొందకపోవచ్చు. **కార్యరూపమును పొందుటకు నిమిత్తముగా ఇంకొక కారణముయొక్క సహాయము అవసరము; ఆ కారణమును 'నిమిత్త కారణము' అంటారు.**

ఉదా : 1) మట్టిని, ఘటము మొదలైన ఆకారములుగా తయారుచేయు నిమిత్తకారణము – కుమ్మరి.

2) స్వర్ణమును ఆభరణములుగా మలచేవాడు కంసాలి.

ఈ రెండూకాక **'సహకారి కారణము'** అనే ఇంకొక కారణమును కూడా శాస్త్రము చెప్తున్నది. **దేని సహాయము వలన నిమిత్త కారణము, ఉపాదానమును కార్యరూపముతో పొందిస్తున్నదో దానిని "సహకారి కారణము" అంటారు.** కుండ తయారుచేయుటకు దండము, చక్రము – స్వర్ణమును ఆభరణములుగా చేయుటకు సుత్తి, కూటము (అలంకారాదులు తయారుచేయు దిమ్మె) మొదలైనవి సహకారి కారణములు. నైయాయికులు ఉపాదాన కారణమును **"సమవాయికారణము"** అని చెప్తారు. వారి అభిప్రాయం ప్రకారము సృష్టికి ముందు లేని కార్యము, 'సమవాయము' అనే ఒకానొక సంబంధముతో కారణము నుండి క్రొత్తగా ఉత్పత్తి అవుతుంది; తిరిగి లయకాలములో నశిస్తుంది. వేదాంతులు దీనిని ఆమోదించరు. వీరు కార్య–కారణములకు తాదాత్మ్య సంబంధమును చెప్తారు. ఈ విషయము తరువాత (అ॥ 6–5)లో చెప్పబడును.

ఇక, జగత్తు స్వరూప నిర్ణయము చేయుటకు దాని ఉపాదాన కారణమును నిశ్చయము చెయ్యాలి. అదే విధముగా నిమిత్త కారణమును కూడా తెలుసుకోవాలి. ఈ సందర్భంలో వేదాంత సిద్ధాంతమును చెప్పే ముందు – కేవలము అనుమాన ప్రమాణము మొదలైన ప్రమాణములను ఉపయోగించి సిద్ధాంతములను చేసే అనేక ఇతర మతముల సారాంశము చెప్పబడుతున్నది.

5–3) బౌద్ధవాదము

బౌద్ధులలో 'శూన్యవాదు'లని ఒక శాఖ వున్నది; "జగత్తు అసలు లేనేలేదు; లేనిదానికి నిమిత్త కారణము లేదు, ఉపాదాన కారణము లేదు; దాని స్వరూపము 'శూన్యము'." అని వీళ్లంటారు.

ఇది చాలా అసంబద్ధ విషయము. ఏ నాడూ, ఎవ్వరూ దీనిని ఆమోదించరు. అందువల్ల ఈ వాదమును ఇక్కడ విచారణ చేయవలసిన పని లేదు. బౌద్ధుల ఇంకొక శాఖకు చెందిన 'విజ్ఞానవాదు'లైన బౌద్ధులు ఇలా చెప్తున్నారు. – "అనాది సంస్కారములవల్ల ఈ బాహ్యజగత్తు కనపడుతూ వున్నది; కాని వస్తుతః లేదు."

సంశయము : అందరికీ బాహ్యవస్తుజ్ఞానము కల్గుతున్నది కదా! మరి, జగత్తులేదని చెప్తే విశ్వాసము ఎలా కలుగుతుంది?

సమాధానము : జగత్తు వున్నదనే అనుభవము కలుగుతూనే వున్నది. ఇది (అనుభవం) సత్యమే అయినప్పటికీ కేవలము మన అనుభవమే ఆధారముగా చేసి జగత్తు వున్నది అని చెప్పుటకు వీలులేదు.

ఉదా : స్వప్నములో బాహ్యజగత్తు లేదు. కాని ఉన్నట్లు మనకు భాసిస్తున్నది. ఈ దృష్టాంతము వలన జగత్తు లేనేలేదు అని చెప్పవచ్చు; అందువల్ల దానికి కారణములు వెదికే అవసరము లేదు.

పైవిధముగా చెప్పడము కూడా సవ్యముగా లేదు. మన అనుభవమునకు తెలియబడే జగత్తును నిరాకరించడానికి వీలులేదు. "ఉన్నట్లు భాసిస్తున్నది" అనే వారి ఈ వాక్యములోనే బాహ్యజగత్తుకు అస్తిత్వము వున్నది అనే విషయము స్పష్టమవుతున్నది. అంతేకాకుండా దాని అస్తిత్వమును అనుసరిస్తూ అందరూ వ్యవహారమును నడుపుతున్నారు. ఇంకొక విశేషము – లోపలి ఆకలి తీర్చుకోవడానికి క్షుద్రకీటకము నుంచి పండితుని వరకు అందరూ ఏదో ఒక ఆహారముకోసము ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆహారము దొరకని ప్రదేశానికి వెళ్ళనే వెళ్ళరు.

ఇక, బాహ్యజగత్తును, స్వప్నజగత్తుతో పోల్చి నిరాకరణ చేయడము కేవల తర్కాభాసమే! బాహ్యజగత్తుకు స్వప్నావస్థకు చాలా భేదము వుంది. "స్వప్నంలో స్నేహితుడు కనపడ్డాడు. ఇప్పుడు వెళ్ళి వాడిని ప్రత్యక్షముగా కలవాలి" అని అంటూ వుంటాము. బాహ్యవస్తువుకు స్వప్నవస్తువుకు భేదము తెలుసుకున్నప్పుడే మనము అలా అనగలము. ఈ ఉదాహరణము వల్ల ఇలా నిశ్చయముగా తెలియవస్తున్నది - బాహ్యజగత్తు వున్నది; దానికి కారణము అవశ్యము తెలుసుకోవాలి.

5-4) మీమాంసకుల వాదము

జగత్కారణ విషయములో పైన 'నాస్తికుల' వాదము గురించి చెప్పడమైనది. వేదాన్ని అనుసరించే 'మీమాంసకులు' ఇలా చెప్తున్నారు - "ఈ జగత్తుకు ఉత్పత్తిలేదు; అనాదికాలముగా ఇది ఇలాగే ఉన్నది" ఇలా చెప్పడములో జగత్తుకు ఏదో అప్రత్యక్ష కారణము వున్నది అని వెదుకనవసరము లేదు. కాని, ఇది సరికాదు. వారు వేదప్రమాణమును పాటించేవారే కనక వేదముల ఆధారముతోనే జగత్కారణము తెలుసుకోవలసి వున్నది. వేదము స్పష్టముగా చెప్తున్నది - ఈ జగత్తు యొక్క సృష్టి జరిగినది; ఈ సృష్టింపబడిన జగత్తుకు ఏదో అప్రత్యక్ష కారణము కూడా ఉన్నది. "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవా¬ద్వితీయమ్" మొదట ఇది సత్‌గానే ఉన్నది; ఒక్కటిగానే ఉన్నది; ఇతరము ఏమీలేదు (ఛాం॥ 3-2-1) "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్।" - ప్రథమంలో ఇది ఒక్కటైన ఆత్మగానే ఉండేది. (ఐ॥ 1-1-1). దీనివల్ల జగత్తు సృష్టింపబడినది అని స్పష్టమయినది.

ఇంతేకాదు; జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ రూపచక్రము నిరంతరమూ తిరుగుతూ వుంటుంది. దీనిని గురించి శ్రుతి ఇలా చెప్తున్నది. "అనేన జీవేనాత్మనాను ప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" - ఈ జీవాత్మరూపములో ప్రవేశించి నేనే నామరూపాత్మక విభాగమును చేయుచున్నాను (ఛాం॥6-3-2). ఇలా చెప్పడములో జీవుడు ఈ నామరూప విభాగమునకు పూర్వమే ఉండాలని తెలుస్తున్నది; అలా కాకపోతే, భవిష్యత్తులో సృష్టింపబడే జీవులగురించి "అనేన జీవేన" అని నిర్దేశించి చెప్పడం కుదరదు. అందుచే జీవులకు ఆధారమైన వ్యవహార జగత్తు వాస్తవికముగా ఉన్నదని మనం ఒప్పుకోవాలి.

ఈ విషయాన్ని శ్రుతి ఇలా తెలియజేస్తున్నది - "యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశంతి" (తై॥ 3-1-3). భూతములు దేనివల్ల జన్మిస్తున్నాయో, జన్మించి జీవిస్తున్నాయో, దేనిలో పోయి పూర్తిగా లయమవుతున్నాయో అది బ్రహ్మ. ఈ వాక్యము బ్రహ్మను గురించిన జ్ఞానమును (బ్రహ్మము ఉన్నదని) మనకు కలిగిస్తోంది. ఈ జగత్సృష్టిని గురించి ఇంకొక చోట ఇలా ఉపమానము చెప్తున్నారు - "యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ ।" సాలెపురుగు దారముతో వల నిర్మించి, తిరిగి మ్రింగివేసినట్లు (ముం॥1-1-7). ఈ విషయంలో ఋగ్వేదసంహిత చాలా స్పష్టంగా ఇలా చెప్పింది - "సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్, దివం చ పృథివీం చాంతరిక్షమథోస్వః" సూర్యచంద్రులను, ద్యులోకమును, పృథ్విని, అంతరిక్షము, స్వర్గము మొదలైన లోకములను యథాపూర్వముగా సృష్టించాడు. (ఋగ్వేదసంహిత 10-19-3). అందువలన జగత్సృష్టి స్థితి లయములు ఉన్నవి అని చెప్పాలి.

ఈనాటి వైజ్ఞానికులు కూడా మీమాంసకుల ఈ దృష్టిని చర్చించి ఎన్నో చర్చలు జరిగిన తరువాత, ఈ జగత్తు ఇదేవిధముగా ఎల్లప్పుడూ వుంటుందనే సిద్ధాంతాన్ని నిరాకరించారు. వారు ఈ విషయమును కూడా గమనించారు: ఎన్నో నక్షత్రాలు పుట్టి, తాము పుట్టిన స్థానము నుంచి క్రిందికి మహావేగముగా

ప్రయాణిస్తూ మధ్యలో నశించిపోతున్నాయని. దీని విషయంలో శ్రీ శంకర భగవత్పాదులు భగవద్గీత భాష్యములో ఇలా వివరించారు – "లోకత్రయం ప్రవ్యథితం ప్రచలితమ్" లోకత్రయము కూడా ప్రవ్యధితమ్, ప్రచలితమ్ చెదిరిపోతున్నది (గీ॥భా॥ 11–20). పురాణాల్లో కూడా ఇటువంటి వర్ణనలు అనేకము ఉన్నాయి. కాని వైజ్ఞానికులకి ఏ మాత్రమూ జగత్తు అంతా ఒకసారి లయమవుతున్నదనే విషయం తెలియడము లేదు. ఇప్పుడిప్పుడే వైజ్ఞానికులు ఈ విషయంలో ఆలోచన ప్రారంభించారు. ఐతే జగత్కారణాన్ని నిర్ధరించటములో వైజ్ఞానికులచే ఇప్పటివరకు నిశ్చయించబడినంత విషయాన్ని స్వీకరిస్తే చాలు.

5–5) వైశేషికుల వాదము

ఇక ముందు జగత్తుయొక్క సృష్టి స్థితి లయములను ఆమోదిస్తూ సిద్ధాంతములను సంక్షేపముగా నిరూపిస్తాము. మన ప్రాచీన భౌతికశాస్త్ర విజ్ఞానవేత్తలే 'వైశేషికులు'. వారి సిద్ధాంతములు చాలావరకు ఈనాటి వైజ్ఞానికుల భావములతో కలుస్తూ వుంటాయి. వైశేషికుల అభిప్రాయము ఇది: మనము తెలుసుకుంటున్న ఈ స్థూలజగత్తు పృథ్వి, జలము, తేజస్సు, వాయువు, ఈ నాలుగు భూతముల పరమాణువులతో తయారైనది. గంధము, రసము, రూపము, స్పర్శ అనే గుణములతో కూడిన స్థూలమైనది పృథ్వి. రసము, రూపము, స్పర్శ అనే గుణములతో కూడిన జలము సూక్ష్మమైనది. రూపము, స్పర్శ ఈ రెండు గుణముల తేజస్సు సూక్ష్మతరమయినది. స్పర్శతో కూడిన వాయువు సూక్ష్మతమమైనది. నాలుగు భూతములయందు ఆఖరులో విడదీయరానంత సూక్ష్మమైనది పరమాణువు. జగత్తుయొక్క ప్రళయ సమయములో ఈ పరమాణువుయొక్క అవయవములు ఇంక వేఱుచేయడానికి వీలులేనంతగా విడిపోతాయి. ఈ ప్రకారముగా ప్రళయములో ఈ నాలుగింటి పరమాణువులు మాత్రమే వుంటాయి. ఈ పరమాణువులే జగత్తుయొక్క మూలకారణము. పైన చెప్పిన పృథ్వి మొదలైన నాలుగు భూతముల గుణముల తారతమ్యమునే ఈ పరమాణువులు కలిగియుంటాయి. తిరిగి సృష్టి సమయములో ఈ నాలుగింటి సంయోగము వలన పృథ్వి మొదలైన స్థూలభూతములు తయారవుతూ ఉంటాయి.

ఉదా : ఇటుక, సున్నము మొదలైన వాటి సంయోగము వల్ల గోడ తయారైనట్లు గంధము, రసము మొదలైన గుణములతో కూడిన నిరవయవ (అవయవము లేని) పరమాణువులు స్థూలజగత్తుగా తయారవుతున్నాయి. పరమాణువులు నిత్యమైనవి.

వైశేషికుల ఈ పై సిద్ధాంతము అనేక కారణముల వల్ల సరైనది కాదు. వారి అభిప్రాయము ప్రకారము 1) సృష్టి, 2) ప్రళయము, 3) పరమాణు సంయోగము, 4) పరమాణు లక్షణములు – ఒక్కటీ సమంజసముగా లేవు. ఈ క్రింద వీని సంక్షేప విచారణ చేస్తున్నాము.

1) పరమాణువులు జడమైనందువల్ల చైతన్యముయొక్క సహాయము లేకుండా పృథ్వ్యాది భూత సమూహమును తమంత తాము సంయోగము చెంది సృష్టి చేయజాలవు. ఈ దోషమును దూరము చేయడానికి వీరు (వైశేషికులు) తర్కముతో ఇలా చెప్తున్నారు: సృష్టికి పూర్వము కర్త – భోక్త అయిన ఒక ఆత్మ ఉన్నది. ఈ ఆత్మే పరమాణువుతో భూత సముదాయముల సమ్మేళనమునకు నిమిత్తకారణమని వీరి వాదము. కాని, ఇలా తర్కించడము సత్యము కాదు. ఆత్మకు ఈ పరమాణు సముదాయ సంయోగమును చేయుటకై శరీరాది ఉపకరణముల ఆవశ్యకత ఉన్నది; అయితే, సృష్టికి పూర్వము ఆత్మకు శరీరాది సాధనములు ఉండుటకు వీలులేదు. అందువల్ల పరమాణు సంయోగమునకు ఆవశ్యకమైన ప్రయత్నము ఆత్మ చేయజాలదు.

2) ప్రళయము విషయములో కూడా వైశేషికులు చెప్పినది యుక్తికి సరిగ్గా లేదు. ఒకవేళ ప్రళయమునకు పూర్వమే ఆత్మకు శరీరము మొదలైనవి ఉంటే ఆత్మ ప్రళయమునకు తగిన ప్రయత్నము చేసి వుండగలిగేది. దీనికి కూడా ఇంకొక అభ్యంతరము వున్నది. ఈ జగత్తుయొక్క నిర్మాణము ఆతని భోగముకొఱకే అయివున్నది. జగత్తు–శరీరము ఇవి తన భోగము కొఱకే అయివుండగా, ఆత్మ వీటి ప్రళయము కొఱకు ప్రయత్నము చేయదు.

3) ఇక, పరమాణువుల సంయోగమన్న భావన కూడా ఉచితముగా లేదు. ఒక పరమాణువుతో ఇంకొక పరమాణువు పూర్ణముగాగాని, భాగముతోగాని సంయోగము చెందాలి; ఇంతకంటే ఇంకొకవిధంగా జరగదు కదా! రెండు నిరవయమైన పరమాణువుల పూర్ణ సంయోగమువలన ఇంకొక నిరవయవ ద్రవ్యమే ఉత్పత్తి అవుతుంది; కాని స్థూలజగత్తుయొక్క సృష్టి సంభవము కాదు. అలాకాక కొంత భాగముతో సంయోగము అనుకుంటే పరమాణువునకు అనేక అవయవములు ఉన్నట్లు ఒప్పుకోవాలి; అప్పుడు పరమాణువులకు అవయవములు లేవనే సిద్ధాంతమునకు విఘాతము కలుగుతుంది.

4) పరమాణువులు స్పర్శాది గుణములతో కూడినవి. నిత్యమైనవి. ఇలా చెప్పడము కూడా పరస్పర విరుద్ధమైనది. ఎందుకనగా, మన అనుభవములో స్పర్శాది గుణములతోవున్న సమస్త వస్తువులు అనిత్యమైనవి; నిత్యముకావు. ఉదా : స్పర్శాది గుణములు కలిగిన వస్త్రము తంతువుయొక్క కార్యము, తంతువు ప్రత్తియొక్క కార్యము. ఇదే విధంగా పరమాణువు కూడా స్పర్శాదిగుణములు కలిగివుంటే, అది కార్యమే గాని మూలకారణము కాదు. ఈ విధంగా పరమాణువులే కార్యముగా తెలియవలసి వస్తున్నది. అలా అయితే పరమాణువు కూడా అనిత్యమే. (సూ॥ భా॥ 2-2-11-17).

ఈపైన చెప్పినదంతా శంకరభాష్యసారమే. శ్రీ శంకర భగవత్పాదులు వైశేషికుల సిద్ధాంతములను ఎక్కువగా ఖండించారు. ఆఖరున – "ఈ పరమాణు కారణవాదము శ్రుతి విరుద్ధముగా సారహీన తర్కముతో నిర్మించబడినది. మనువు మొదలైన ఘనులు ఎవ్వరూ దీనిని ఆమోదించలేదు; కనక శ్రేయస్సును కోరేవారు ఎవరైనా దీనిని (వైశేషికుల వాదమును) అనాదరించాలి" అని చెప్పారు. కొంతమంది ఆధునికులు శంకరభాష్యముయొక్క తాత్పర్యం తెలియక వైశేషికుల సిద్ధాంతములను శ్రీ శంకరులవారు ఇంతగా ఖండించడమువలననే మనదేశంలో విజ్ఞానప్రవృత్తి నశించిందని అంటారు. కాని, వైశేషికులు చెప్పిన పరమాణువులను శ్రీ శంకర భగవత్పాదులవారు నిరాకరించలేదు. ఒక్క చోట "ఆకాశములో విభిన్నధర్మములు ఉండవు; అదేవిధముగా పరమాణువులలో భిన్నత్వము లేదు. పృథ్వీ పరమాణువు గంధ గుణము కలిగిన పృథ్వియొక్క అత్యంత సూక్ష్మ అవయవము. అదీ గంధ స్వరూపమే! దీనిలో గంధవత్వము (గుణము) యొక్క కల్పన చేయరాదు– "ధర్మభేదా నైవ సంత్యాకాశే। తథా పరమాణ్వాదపి। పరమాణుర్నామ పృథివ్యా గంధఘనాయాః పరమసూక్ష్మో అవయవః గంధాత్మక ఏవ న తస్య పునర్గంధవత్వం నామ శక్యతే కల్పయితుమ్।" (బృ॥ భా॥ధ-3-30) అని చెప్పి పరమాణువులను ఒప్పుకున్నారు. అయితే "పరమాణువులే జగత్తుకు మూలకారణము" అన్న వారి వాదమునూ వారు చెప్పిన అణువుయొక్క లక్షణములను కూడా నిరాకరించారు.

5-6) తార్కికుల వాదము

ఈ వైశేషికులు, యోగులు, పాశుపతులు, మొ॥ ఇంకా కొన్ని మతములవారు ఈశ్వరుడున్నాడని అంగీకరిస్తున్నారు. అయితే వీళ్లు అతడు ఉన్నాడని కేవలము తర్కము ద్వారానే నిరూపిస్తున్నారు. కాని

వేదాన్ని అనుసరించి కాదు. ఈ వాదములన్నీ సాంఖ్యమతములోని కొంత భాగమును ఆశ్రయించి వారు చెప్పిన సిద్ధాంతములే! దీని ప్రకారము ఇలా వున్నది – జగత్తులో పురుషుడు, ప్రకృతి, ఈశ్వరుడు – ఈ మూడు విభాగములే ఉన్నాయి. ఈ మూడూ స్వతంత్రములు, అనంతములు కూడా అయి వున్నవి. వీనిలో విశేషముగా ప్రకృతి జడము, ఈశ్వరుడు సర్వజ్ఞుడు – అని వారు ఉంటారు.

పురుషుడు	ప్రకృతి	ఈశ్వరుడు
స్వతంత్రుడు, అనంతుడు	స్వతంత్రము, అనంతము, జడము	స్వతంత్రుడు, అనంతుడు, సర్వజ్ఞుడు

ఏ ప్రకృతిని వీరు నిర్దేశిస్తున్నారో అది జగత్తునకు ఉపాదాన కారణము. ఈశ్వరుడు నిమిత్తకారణము; పురుషుడు భోక్త. ఇది వారు తమ తర్కముతో నిర్ణయిస్తున్నారు; అయినా, వైదికులతో వాదము వచ్చినప్పుడు వేద ప్రమాణములను కూడా ఉపయోగిస్తున్నారు; కాని వేదములను స్వతంత్ర ప్రమాణములుగా అంగీకరించడము లేదు. అందువలన వీరి సిద్ధాంతములను – "ఉష్ట్రలగుడ న్యాయము" ప్రకారము నిరాకరించవలసి వస్తుంది. ఈ న్యాయము ఏమనగా కట్టెలను మోసుకువెళ్తున్న ఒంటె, అలసినందువల్ల నడవడము మాని కూర్చుంటే, దాని యజమాని అది మోస్తున్న కర్రతోనే దానిని అదిలిస్తాడు. అదే విధముగా వారి తర్కముతోనే వారిని తిరస్కరించవలసి వస్తుంది. అది ఈ ప్రకారము:

జడమైన ప్రకృతి తనకు తానే జగత్తుగా పరిణతి చెందజాలదు; కాని ఈపని ఈశ్వరుడు చేయగలడు. ఇలా చెప్తే ప్రకృతి "స్వతంత్రము" అనడానికి వీలులేదు.

పురుషుడు, ప్రకృతి, ఈశ్వరుడు ఈ ముగ్గురూ వేరువేరు. అంతము లేనివారు. వీరిలో ఈశ్వరుడు సర్వజ్ఞుడు–ఇది కూడా సరియైనది కాదు. "ఎన్ని పురుషులకోసం సృష్టి కావాలి? సృష్టి కోసం ప్రకృతి ఎంత కావాలి?" ప్రకృతి–పురుషుల రూపాన్ని నిశ్చయము చేసే శక్తి ఈశ్వరునిలో లేకుంటే అతడు సర్వజ్ఞుడు కాదు. ఒకవేళ ఈ దోష నివారణకోసము – "అతడు నిశ్చయించగలడు" అని చెప్తే ఇంకా కొన్ని దోషములు ఆపాదించవలసి వస్తుంది. 1) "వీరు ఎంత ఉన్నారు" అని నిశ్చయించాడంటే ప్రకృతి–పురుషుల అనంతత్వము అసంభవము. 2) పురుషుల సంఖ్య అనంతమని కాక 'ఇంతమాత్రమే' అని నిర్ణయిస్తే – కాలాంతరములో వారు అందరూ ముక్తులయినట్లయితే, ఎవరికోసము ఈ జగత్తుయొక్క సృష్టి జరుగుతుందో ఆ పురుషులే వుండరు; అప్పుడు ఈశ్వరుని కార్యమే ఆగిపోతుంది. సృష్టి కార్యమువల్లనే ఈశ్వరునికి సర్వజ్ఞత్వమనే బిరుదు వచ్చింది; ఇక ఆ కార్యమే లేకపోతే ఆయనకి సర్వజ్ఞత్వమే పోతుంది. ఈ విధముగా తార్కికుల సిద్ధాంతము ఏమాత్రం స్వీకరింపతగినది కాదు (సూ॥భా॥ 2–2–37–41).

5–7) సాంఖ్యవాదము

ఒక సాంఖ్యవాదమును గురించి భగవద్గీతలో ఉన్నది. అది కాని యింకొక సాంఖ్యవాదము గురించి మనము ప్రస్తుతము చర్చిస్తున్నాము. ఇది కపిల ప్రణీతము. వాదోపవాదములు చేయడములో దీనిని మించిన వాదము యింకొకటి లేదు. పైపైని చూచినట్లయితే ఈ సాంఖ్యవాదము వేదాంతముతో సమానముగానే వుంటుంది. మామూలు జనులకు దీనికీ వేదాంతమునకూ భేదము కనపడదు. అందువల్ల శ్రీ శంకర భగవత్పాదులు దీనిని ప్రత్యేకముగా – "ప్రధానమల్ల నిబర్హణ న్యాయము"తో ఖండించారు. అనగా ప్రధానమల్లుడు మిగిలిన మల్లులందరిని జయించాడు. కనక వేతే ఇంకొక మల్లుడు ఈ ప్రధానమల్లుడిని

జయించినట్లయితే (నిబర్హణ చేసినట్లయితే) అతడు అందరు మల్లులను జయించినట్లే! వాదులందరిలో సాంఖ్యుడే ప్రధాన మల్లుడు. శాంకరభాష్యములో సాంఖ్యనిబర్హణ చాలా చోట్ల జరిగింది. అయితే ఇక్కడ అవసరమయినంత వరకే చెప్పబడినది. సాంఖ్యులకు తర్కము ముఖ్య ఆధారము; వేదము కాదు. వేదాంతులతో తర్కించే సమయాల్లో వీరు వేదవాక్యాలనే ఉదహరిస్తూ తమ వాదాన్ని సమర్థించుటకు ప్రయత్నములు చేస్తారు.

వారి వాదము ఇలా వుంటుంది: జగత్తులో జడము, చేతనము తప్ప ఇంకేమీ లేదు. ఈ జగత్తులో మన అనుభవముతో తెలియబడేది ఏమంటే, జడమునుండి చేతనముగాని, చేతనమునుండి జడముగాని జనించవు. కావున జడజగత్తుయొక్క ఉపాదానము జడము మాత్రమే అవుతుంది. సత్త్వము, రజస్సు, తమస్సు – ఈ త్రిగుణములతో కూడినది జగత్తు; అందువల్ల జగత్తుకు ఉపాదానకారణము త్రిగుణాత్మకముగానే ఉండాలి. ఇదే ప్రధానము (ప్రకృతి), ఇక చేతనమే పురుషుడు (జీవుడు). ప్రతీ శరీరములో ఒక పురుషుడు ఉంటాడు. ఇతడు కేవలము నిష్క్రియుడు, నిర్గుణుడు, ప్రవృత్తిరహితుడు, అసంగుడు (దేనితోనూ సంబంధము లేనివాడు). అయితే భోక్త. ఈ పురుషుల భోగముకొరకే ప్రధానము జగత్తుగా పరిణమిస్తున్నది. అది దాని స్వభావం. దాని త్రిగుణములలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు సృష్టి జరుగుతున్నది. తిరిగి త్రిగుణముల సామ్యావస్థ వచ్చినప్పుడు ప్రళయము సంభవిస్తున్నది; ఈ ప్రకారముగా వారి మతములో ఈశ్వరుడే లేడు. క్రింద చెప్పిన కారణముల వలన వీరి మతము సరికాదు.

1) ప్రధానము జడమగుట వలన స్వభావముచేత అనగా తనంతతానుగా, జగదుత్పత్తి చేయజాలదు. ఇక వారి వాదము – నీరు తనంతతాను ప్రవాహరూపమైనట్లు ఈ ప్రధానము స్వయముగా జగద్రూపముగా మారుతున్నది. కాని, నీరు స్వభావముచేతనే ప్రవహించుట లేదు. దానిని ప్రవహింపచేయుటకు హేతువుగా పల్లము (నీరు ప్రవహించే వాలు) వుండాలి; మానవుడు తాను పల్లమును చేసి నీటిని ప్రవహింప చేస్తున్నాడు. అంతేగాక, ఆధునిక కాలములో వీటిని యంత్ర సహాయముతో క్రిందినుంచి మీదికి ప్రవహింపచేస్తున్నాడు. అందువల్ల నీటియొక్క ప్రవాహమునకు చేతనముయొక్క ప్రవృత్తి కారణము. జడత్వము ఉన్నచోట ప్రవృత్తి వుండదు; ప్రవృత్తి ఉన్నచోట జడత్వము లేదు. "మట్టి కుండగా మారడానికి కుమ్మరియొక్క ప్రవృత్తి కారణము; అలాగే ప్రధానము యొక్క పరిణామమునకు పురుషుని చేతనత్వమే కారణము కావచ్చు" అనడం కుదరదు. సాంఖ్యుల మతప్రకారము పురుషుడు ప్రవృత్తి రహితుడు. అందువల్ల ఈ విధమైన తర్కమునకు ఏ మాత్రము అవకాశము లేదు.

2) ప్రధానము జడము కదా? కనక ఏ కారణముకొరకు జడమైన ప్రధానము జగద్రూపముగా మారుతుంది" అను ప్రశ్న ఉదయిస్తుంది. "తనకు ఏ ప్రయోజనము లేనప్పటికీ పురుషుని భోగమే ప్రధానమునకు లాభము." ఇలా చెప్పడానికి వీలులేదు; ఎందుకనగా పురుషుడు అసంగుడు కనుక అతనికి భోగప్రసక్తి లేదు. "కాలక్రమములో పురుషుడిని మోక్షము పొందింపజేయుట జగత్తు ప్రయోజనము" అవడానికి కూడా కుదరదు. అతడు అసంగుడు. అయినందువలన మోక్షము పొందడము అనే భావము అసంభవము. ఇలా అనేక కారణాలవల్ల సాంఖ్యవాదము సరియైనదిగా లేదు.

5-8) ఆధునిక వాదము

చాలామంది తెలివైనవాళ్ళు కూడా ఆధునిక విజ్ఞాన ప్రభావమువలన జగత్కారణము జడప్రకృతి అనే

నమ్ముతున్నారు. ఈ కోణములో వీరు సాంఖ్యవాదనను పునరుద్ఘాటిస్తున్నారు. సాంఖ్యులకీ, వీరికీ మధ్య కొద్ది భేదమే వుంది. సామాన్యుల అవగాహనకు సులభమైన నీటి ప్రవాహమును సాంఖ్యులు ఉదాహరణగా చెప్పారు; ఆధునికులు సామాన్యులకు అందుబాటులోలేని దృష్టాంతములను చెప్తారు. ఇది వారి ఆక్షేపము:

"వాయువు యొక్క జడ పరమాణువులు తమ స్వభావముతో నిరంతరము చలిస్తూ పురుషుడి భోగమునకు కారణముగా వున్నాయి; లేక అణువులు తమస్వభావముతో విస్ఫోటము పొంది పురుషునికి భోగకారణములుగా అవుతున్నవి; ఇలాంటి పరిస్థితిలో జడమైన ప్రధానము తన స్వభావముతో కార్యరూపము పొందడానికి అభ్యంతరము ఏముంటుంది?"

సమాధానము : పైన చెప్పినది సరి అయితే, తమ స్వభావముతో వాయుపరమాణువులు నిరంతరము ఒకేవిధంగా సంచరిస్తూ వుండాలి; కాని అలా వుండడము లేదు. ఉష్ణమును తగ్గించి వాయు చలనమును వైజ్ఞానికులు తమకు అనుకూలముగా నియంత్రిస్తూ వున్నారు. ఈ పద్ధతిలో వాయు గమనము ఉష్ణశక్తి వల్ల, ఉష్ణశక్తి చేతన శక్తివల్ల, నియంత్రణ చేయబడుతున్నాయి. అందువల్ల ఈ ప్రవృత్తికి మూలకారణము చేతనమే అని చెప్పబడుతున్నది.

దీనికి ఆధునిక వైజ్ఞానికులు సందేహము ఇలా వెలిబుచ్చుతారు. "వాయుగమనము పూర్తిగా అరికట్టడము చేతనమునకు సాధ్యముకాదు. ఉష్ణశక్తి నిమ్నతమమైనప్పుడు వైజ్ఞానికులు ఏమీ చేయజాలరు. ఆ సమయములో కూడా అణువులు మాత్రము తమ ప్రవృత్తితోనే వర్తిస్తూ వుంటాయి. అది అణువుల సహజ స్వభావము కదా?"

సమాధానము : వాయు గమనమునకు కారణమైన ఉష్ణశక్తిని నిమ్నతమ స్థితి వరకు నియంత్రించే అవకాశము వైజ్ఞానికుల చేతనశక్తికి వున్నప్పుడు, ఇంతకంటె మించిన ప్రవృత్తికి ఈశ్వరుని చేతనశక్తి కారణము అని చెప్పడము ఉచితము.

అణు విస్ఫోటనమునకు కూడా ఇదే సమాధానము.

దృష్టాంతములను వదలివేసి ఆలోచిద్దాము. జడత్వము గురించి వైజ్ఞానికులు ఇలా వివరిస్తారు : జడము స్వయముగా గమనము చేయలేదు; చలిస్తూ ఉంటే, తన మార్గమును ఇంకొకవైపుకు మరలించలేదు. తన స్థితిని ఏవిధంగా మార్చడానికైనా జడమునకు బాహ్యమునుండి ఏదో ఒక బలము కావాలి. ఇలా నిర్ణయించిన వైజ్ఞానికులు తిరిగి ఇంకొకవిధముగా జడమైన పరమాణువులు స్వభావముతో చలిస్తున్నవని చెప్పడము వారి సిద్ధాంతమునకే విరుద్ధముగా వున్నది; అలా చెప్పడము తమ వాదమునే తాము ఖండించుకోవడము. జడ ప్రకృతి కార్యకలాపాలన్నిటికీ చేతనశక్తి కారణము అని చెప్పక తప్పదు; ఈ విషయము వేలమంది వైజ్ఞానికులు ప్రయత్నించినా నిరాకరించలేరు.

5-9) ఈ విమర్శలో తర్క స్థానము

పైన అనేక సిద్ధాంతాల దోషాలను చెప్పి, జగత్కారణమునకు ఇప్పుడు వేదాంత సిద్ధాంతమును వివరించాలి. ఈ సందర్భములో ముఖ్యముగా తెలుసుకోవలసినది వేద ప్రమాణము తప్ప ఇంక ఏ ప్రమాణము జగత్కారణమును సరిగ్గా నిర్ణయించలేదు; ఎందుకనగా, జగత్తు ప్రత్యక్షమైనప్పటికీ జగత్కారణము ప్రత్యక్షముగా లేదు. అందువల్ల ప్రత్యక్ష ప్రమాణము ఈ నిర్ణయమునకు పనికిరాదు. జగత్తుయొక్క మూలమునకు చిహ్నము (గుర్తు) లేదు కనుక అనుమానమునకు, అర్థాపత్తికి అసలే అవకాశము లేదు. ఈ

మూల కారణము స్వరూపములో ఒక్కటిగానే ఉన్నది. అందువలన ఆకాశమునకు, సముద్రమునకు ఏ ఉపమానమును ఎలాగైతే చెప్పలేమో అలాగే జగత్కారణమైన దానికి కూడా చెప్పలేము. వేదములే దీనిని నిర్ణయించగలవు. ధర్మాధర్మముల నిర్ణయమునకు వేదములే ఆధారమైనట్లు ఈ నిర్ణయమునకు కూడా వేదములే ఆధారము (సూ॥ భా॥ 2-1-6). వేదములు జగత్కారణమును చాలా జటిలమైనదిగా చెప్తున్నాయి. ఈ జటిలత్వమును వేదములు ఇలా చెప్తున్నాయి – "కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్ ఇయం విసృష్టిర్యత ఆబభూవ" – ఈ విచిత్ర సృష్టి ఎలా జరిగిందో ఎవరికి తెలుసు? ఎవరు దీనిని సరిగ్గా చెప్పగలరు? (ఋ॥ సం॥ 10-129, 6-7)? "నైషా తర్కేణ మతిరాపనేయా" – దీనిని తెలుసుకోగల బుద్ధి, తర్కము వల్ల రాదు (కఠ॥ 1-2-9) అని వేదము హెచ్చరిస్తున్నది. బ్రహ్మము అతి గంభీరము అయినందువల్ల దీనిని శ్రుతిద్వారా తెలుసుకోవాలిగాని తర్కమువలన సాధ్యముకాదు. "శ్రుత్యవగాహ్యామేవ ఇదమతి గంభీరం బ్రహ్మ, న తర్కావగాహ్యమ్" (సూ॥ భా॥ 2-1-31).

5-10) తర్కమునకు సరిహద్దు

ఏ జటిల కార్య-కారణములకు కూడా సమగ్ర రూపమును నిర్ణయించుట తర్కమునకు సాధ్యముకాదని మనకు తెలుసు. కార్యసమూహముల విభాగములన్నీ ఒకేచోట మనకు దృష్టి గోచరము కావు; మనకు తెలిసిన కొంత భాగాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని మనము తర్కముతో కార్య-సమూహమును ఆలోచిస్తున్నాము; ఆ తర్కముతో కొన్ని భాగముల సమస్య పరిష్కరింపబడవచ్చు; కాని, కాలాంతరములో ఇంకా క్రొత్త విభాగములు మనకు ఎదురుపడతాయి; వాటితోపాటు ఈ తర్కమే క్రొత్త సమ్యసలని తెచ్చిపెడుతుంది. ఆ సమస్యల పరిష్కారము కోసము తర్కములో మార్పులు, కొంత విస్తారము చేయవలసి వుంటుంది. అందువల్ల కొంత ప్రయోజనము ఉన్నా, మొదటికంటే విషయము ఇంకా జటిలమవుతుంది. ఈ విధంగా తర్కాన్ని అనేకముగా పెంచుకుంటూ వెళ్ళవలసి వస్తుంది. అయినా సమస్యకు పూర్తిగా పరిష్కారము లభించదు. ఇదే తర్కములోని పెద్దదోషము. (సూ॥ భా॥ 2-1-11).

ఆధునిక వైజ్ఞానిక దృష్టాంతములలో ఈ విషయము స్పష్టముగా వున్నది. నాలుగైదు శతాబ్దములకు పూర్వము వస్తువులలోని వివిధ లక్షణములను తెలియపరచడముకోసము అన్ని వస్తువులు పరమాణువులనుంచే వచ్చాయని ఊహిస్తూ వుండేవారు. ఈ ఆధారంతో వస్తువుల కొన్ని గుణములు తెలిశాయి కూడా! కాని, దీనితోపాటు ఈ ఊహ క్రొత్త-క్రొత్త సమస్యలను తెచ్చి పెట్టింది. ఇంతేకాక, అప్పటివరకు దృష్టికిరాని కొన్ని సమస్యలను, వాటి స్వతంత్రరూపంలో ప్రకటించింది. వీటి అన్నిటిని ఎదుర్కోవడములో అనుమానములో (ఊహ) కొన్ని మార్పులు తెచ్చారు. పరమాణువులను మించి వాని కేంద్రములలో ఇంకా అనుసంధానము చేయవలసి వచ్చింది. అప్పుడు కొన్ని సమస్యలకు సమాధానమూ దొరికింది. కాని, ఇంకా సమస్యలు జటిలముగా అయినా, పూర్తిగా సమాధానము దొరకలేదు. అనుమానము ఇలా పెరుగుతూనే వుంటుంది – దీనికి అంతము లేదు.

5-11) పూర్ణతర్కము

అనుమానములకు (ఊహలకు) అంతములేనంతవరకు తర్కమునకు అంతము లేదు. తర్కమునకు అంతము ఎక్కడ? ఈ ప్రశ్నకు సమాధానము అనుమానాది ప్రమాణముల లక్షణములను తెలుసుకొని, తర్కము అంతము లేకుండా ఎందుకు ఉన్నదని మూలకారణమును తెలుసుకున్నప్పుడు దొరుకుతుంది. ప్రత్యక్షము, అనుమానము, అర్థాపత్తి, ఉపమానము ఈ ప్రమాణములన్నీ కూడా నానాత్వము మీదనే ఆధారపడి

వున్నాయి. వీటన్నింటిలో ప్రమాణ–ప్రమాతృ – ప్రమేయములు అనే త్రిపుటి ఉన్నది. ఇంతేగాక ప్రమేయములు అసంఖ్యములు. ఏ ప్రమాత కూడా ప్రమేయములన్నింటినీ ఒకేసారి తెలుసుకోలేడు. తన యోగ్యతను అనుసరించి కొంత కొంత తెలుసుకుంటాడు. కనక ఏ స్థాయిలోను ఈ ప్రమాణములతో వున్న తర్కము పైన చెప్పినట్లు కొంతవరకు వివరించడము అనేదాని లోపలే వుంటుంది. అన్ని ప్రమేయములను ఒకేసారి ఎవడైతే తెలుసుకోగలడో అతడే సమగ్ర సిద్ధాంతమును గురించి చెప్పగలడు. సర్వజ్ఞ పరమాత్మునకుగాక ఇంకెవరికీ అటువంటి సామర్థ్యములేదు. అతడే వేదము ద్వారా దీనిని తెలియజేశాడు. "న హి ఈదృశస్య శాస్త్రస్య, ఋగ్వేదాది లక్షణస్య, సర్వజ్ఞ గుణాన్వితస్య సర్వజ్ఞాద్ అన్యతః సంభవఃఅస్తి (సూ॥ భా॥ 1–1–3)। అందువల్ల పరమాత్మద్వారా ఆవిర్భవించిన వేదములనే అన్నిప్రమాణములకంటే అధిక శక్తివంతమైనవిగా వైదికులు భావించి, వేదములనే శరణుపొందారు. (వేదములు పరమాత్మవలననే ఆవిర్భవించాయి. అధ్యా॥ 4–6)

ఆగమ ప్రమాణమును గురించి ఏదైతే చెప్పామో అది అంతా త్రిపుటిలోనికే వస్తుంది; కాని దీనిని మించి వేదములకు విశేష మహత్త్వము వున్నది. త్రిపుటిని మించి చెప్పిన విషయమును ప్రత్యక్షాది ప్రమాణములు స్పర్శించనుకూడా లేవు; అక్కడ వేదము దానిని నిరూపించగలదు. ఆ విషయమును వివరించుటకు వేదమును మించి ఇంక ఏ ప్రమాణమునకు సాధ్యముకాదు. త్రిపుటిని మించిన తత్త్వము ఉండదని కొందఱి అభిప్రాయము. తమ అనుభవమును తాము పరిశీలన చేసినట్లయితే ఈ విషయము వీరికి అవగతమవుతుంది. ఉదా: ఎవరినైనా నీవు ఎవరని ప్రశ్నించినట్లయితే, అతడు దేహభావనతోనే తాను ఫలానావారి పుత్రుడనని సుళువుగా సమాధానము చెపుతాడు. కాని "నిన్నటి నీ కలలో నీవెవరవు?" అని ప్రశ్నిస్తే చిక్కులో పడతాడు. కలను గుర్తుకు తెచ్చుకుని, "నేను ఫలానా" అని ఎలాగో సరిపెడతాడు. ఇక, "నీ గాఢనిద్రలో నీవు ఎవరు?" అని ప్రశ్నిస్తే అక్కడ తానే నిద్రిస్తున్నానని అనుకుంటున్నాడని తెలిసినా, అది ఎవడో ఎలా వుంటాడో చెప్పజాలడు. విచారణ చేసి చెప్పడానికి ఆ సమయంలో తాను మనస్సుకు అతీతంగా ఉన్నానని తెలుస్తుంది. కాని, ఆ స్థితి త్రిపుటిలేనిదే; చర్చించి చెప్పుటకు శక్యమైనది కాదు. ఇలా తన స్వరూపమునే తాను తర్కముతో తెలుసుకోవడము సాధ్యము కాదు. అటువంటప్పుడు మనస్సు పుట్టకముందు వున్న జగత్కారణమును మనస్సుతో ఎలా తర్కించడము? కనుక వేదములను శరణు పొందక తప్పదు. బ్రహ్మము గంభీరమయినది కనుక శ్రుతివలననే తెలుసుకోవాలి. – "ఇదమతి గంభీరం బ్రహ్మ, న తర్కావగాహ్యం, శ్రుత్యవగాహ్యమేవ।" (సూ॥ భా॥ 2–1–31).

ఈ పై చెప్పిన విషయమునకు అర్థము – జగత్కారణమునకు మూలము తెలుసుకోవాలంటే వేదము చెప్పినట్లు ఆలోచన లేకుండా ఒప్పుకోమని కాదు. శ్రుతి ఇంకొకచోట ఇలా చెప్పింది – "శ్రోత్రవ్యః మన్తవ్యః" 'వినాలి. ఆలోచించాలి' అని. దేహాత్మ బుద్ధులకు తమ బుద్ధిమీద వున్న విశ్వాసము వేదముమీద వుండదు. అందువల్ల వైదిక సిద్ధాంతములను కూడా తమ బుద్ధిద్వారానే గ్రహించడానికి ప్రయత్నిస్తారు. ఈ విధమైన వ్యక్తులను కూడా ఉద్ధరించాలనే ఉద్దేశముతో కరుణామయులైన సూత్రకారులు, భాష్యకారులు కూడా తర్కాన్ని ఎంతవరకు ఉపయోగించాలో అంతవరకూ ఉపయోగించారు. కాని, దానిని ఆధారము చేసుకుని తర్కముతోనే సిద్ధాంత నిరూపణ చేయాలనుకునేవారి అభీష్టము నెరవేరదు. 'శుష్కతర్కము ప్రయోజనకారి కాదు; శ్రుతిని అనుసరించిన తర్కమును ఆశ్రయించాలి–" యద్యపి శ్రవణ వ్యతిరేకేణ మననం విదధత్ శబ్ద ఏవ తర్కమపి ఆదర్తవ్యం దర్శయతి ఇత్యుక్తమ్, నానేన మిషేణ శుష్కతర్కస్య అత్ర ఆత్మలాభః సంభవతి । శ్రుత్యనుగృహీత ఏవ హి అత్ర తర్క అనుభవాంగత్వేన ఆశ్రీయతే" (సూ॥ భా॥ 2–1–6).

తర్కమునకు అంతములేదని ముందే చెప్పబడింది. అయినప్పుడు ఇక తర్కము వలన ప్రయోజనము ఏమి వుంటుంది? అంటే శుష్కతర్కమును వదలి సరియైన తర్కమును స్వీకరించాలని హెచ్చరిక. మనపూర్వులు కొందఱు మూర్ఖులయితే మనమూ మూర్ఖులము కావాలని నిర్ణయము ఎక్కడా వుండదు – "న హి పూర్వజో మూఢ ఆసీదితి ఆత్మనాపి మూఢేన భవితవ్యమ్ ఇతి కించిదస్తి ప్రమాణమ్ ।" (సూ॥ భా॥ 2-1-11)- అయితే తర్కము అపౌరుషేయమైన శ్రుతినే అనుసరించి వుండాలి; వేద విరుద్ధముగా వుండరాదు. వేద విహిత తర్కముతోనే స్వానుభవము కలుగుతుందని నిశ్చయము చేయడము తాత్పర్యము. ఎందుకనగా, శ్రుత్యర్థము స్వానుభవములోనే పరిసమాప్తి కావాలి. తర్కముమీద వ్యామోహము తగ్గించుకొని, వైదిక సిద్ధాంతములను అభ్యాసపూర్వకముగా అవగాహన చేసుకున్నట్లయితే వేదముల పరిపూర్ణమైన అవగాహన కలుగుతుంది.

ప్రశ్నలు :

1. మారిపోతున్న ఆకారములలో మనము ఏమి అనుమానించగలము?
2. ఉపాదాన కారణము ఏమిటి?
3. నిమిత్తకారణమునకు అర్థము ఏమిటి?
4. శూన్యవాది ఎవరు?
5. విజ్ఞానవాదులనబడే బౌద్ధులు ఏ వాదమును ఆమోదిస్తారు?
6. తమ వాదన సమర్థించుకోవడానికి వారు ఏఏ ఉదాహరణలు యిస్తారు?
7. వారి వాదములో తర్కాభాసము ఏమిటి?
8. జగత్సృష్టి విషయములో మీమాంసకుల వాదము ఏమి?
9. దాని విషయములో వేదము ఏమి చెప్పినది?
10. సృష్టి విషయములో ఏఏ ఉపనిషత్తులు, ఎలా – ఎలా చెప్పాయి?
11. ఈ కోణములో ఈనాటి వైజ్ఞానికుల సలహా ఏమిటి?
12. వైశేషికులు ఎవరు? వారి సిద్ధాంతము ఏమిటి?
13. వైశేషికుల సిద్ధాంతము ఎందుకు సరిగా లేదు?
14. నైయాయికులు ఎవరు? వారి సిద్ధాంతము ఏమిటి? అది ఎందుకు సరిగా లేదు?
15. సాంఖ్యమత వాదము ఏమిటి?
16. 'ప్రధానమల్ల నిబర్హణ' అర్థము ఏమిటి?

17. సాంఖ్యుల మతము ఏ కారణములవల్ల సమ్మతము కాలేదు?

18. జగత్కారణము విషయములో ఆధునిక వైజ్ఞానికుల వాదము ఏమిటి? అది ఎందుకు సరిగాలేదు?

19. జగత్కారణము విషయములో తర్కము ఎందుకు ప్రయోజనకారి కాదు?

20. తర్కము యొక్క పరిధి ఎంతవరకు? దానిలో గొప్ప దోషము ఏమిటి?

21. తర్కముయొక్క పరిధిని ఉదాహరణముతో స్పష్టము చెయ్యండి?

22. ప్రమాణములు దేనిమీద ఆధారపడి ఉన్నవి?

23. ఆగమ ప్రమాణము పరిపూర్ణము అవడానికి కారణము ఏమిటి?

24. త్రిపుటిలోకి రాని తత్త్వమునకు ఉదాహరణ ఇవ్వండి.

25. వేదాంతములో తర్కముయొక్క ఉపయోగము ఎందుకు, ఎలా చేయాలి?

అధ్యాయము - 6

వేదాంత సిద్ధాంతము

పూర్వాధ్యాయము మొదట్లో (అధ్యా. 5-1) ఈ జగత్తుకు ఏదో ఒక అప్రత్యక్ష కారణము ఉన్నదని నిశ్చయించడము జరిగింది. ఆ కారణమే బ్రహ్మము. "జన్మాద్యస్య యతః" - దేనివల్ల జగత్తు సృష్టి-స్థితి-సంహారములు జరుగుచున్నవో అదే బ్రహ్మము (సూ॥ 1-1-2). ఇది బ్రహ్మ పదమునకు వ్యాఖ్య. ముందటి అధ్యాయములో (5-2) నిమిత్త కారణము, ఉపాదాన కారణము అని రెండు కారణములు చెప్పబడినవి. ఈ అధ్యాయములో శ్రుతి (వేదము)ని అనుసరించి బ్రహ్మమే జగత్కారణమని నిరూపించబడుతున్నది.

(6-1) బ్రహ్మమే జగత్తుకు నిమిత్త కారణము

మనము సాంఖ్యమతమును ఖండించే సమయములో ఇలా జగత్తులో ఏ కార్యమును చేయుటకైనా ప్రవృత్తి చేతనములోనే కనబడుతుంది - అని నిశ్చయింపబడినది. ఉదా : కుండయొక్క సృష్టికి ప్రవృత్తి కలిగినది కుమ్మరికి, ఆభరణములను తయారుచేయుటకు ప్రవృత్తి కంసాలికి కలిగినది. ఇదే విధముగా జగత్తులో సమస్త కార్యముల సృష్టికొరకు ప్రవృత్తి చేతనములోనే కలిగి వుండాలి; ఆ ప్రవృత్తి కలిగిన చేతనమే జగత్తుకు నిమిత్త కారణమని ఆమోదించాలి; అదే 'బ్రహ్మము'. "ధాతా యథాపూర్వం అకల్పయత్।" - ఈశ్వరుడు పూర్వకల్పములను అనుసరించి తిరిగి సృష్టి చేసినాడు. (ఋ॥ సం॥ 10-190-3) అని శ్రుతి చెప్తున్నది. ప్రతియొక్క కల్పమునకు పూర్వము బ్రహ్మము ఒక్కటే ఉన్నది; ఇంకొకటి ఏదీ లేదు. "సో¬కామయత బహు స్యాం ప్రజాయేయేతి ।" - "నేను అనేక ప్రకారములుగా జన్మిస్తాను అని 'బ్రహ్మ' ఆలోచించింది." (తై॥ 2-6-4). బ్రహ్మమునకు ఎప్పుడూ ఎవరివల్లా ఏమీ ప్రయోజనము లేదు; అటువంటి సమయంలో దానికి ఈ సృష్టి గురించిన సంకల్పము ఎందుకు కలిగింది? ఈ జీవులందరి కోసమే బ్రహ్మమునకు ఈ సంకల్పము కలిగింది. "సర్వవేదాంతేషు చ ఈశ్వరహేతుకా ఏవ సృష్టయో వ్యపదిశ్యంతే । తదేవ చ ఈశ్వరస్య ఫలహేతుత్వం యత్ స్వకర్మాను రూపాః ప్రజాః సృజతీతి" (సూ॥ భా॥ 3-2-41) - అన్ని వేదాంతములలోను (ఉపనిషత్తులలో) ఈశ్వరుడే సృష్టి కారణుడని చెప్పబడినది. జీవులందరి కర్మలను అనుసరించి ప్రజలను సృష్టించటమే ఈశ్వరుని ఫలహేతుత్వము (కర్మఫలములు ఇచ్చుట). జీవులందరు అనేక కర్మలుచేసి, ఆ కర్మబీజములను తీసుకుని ప్రళయకాలములో ఈశ్వరునిలో లయమును పొందుతున్నారు. ఆ కర్మఫలమును జీవులచే అనుభవింపచేయుటకు ఈ కల్పములలో జగత్తును ఈశ్వరుడు సృష్టించవలసి వస్తున్నది. తనకు అవసరము లేకపోయినా పిల్లవానికొరకు తండ్రి ఆటవస్తువులను తెచ్చియిస్తున్నట్లు - ఈశ్వరునికి ఏ అవసరము లేకపోయినా, జీవభోగము కోసమై - అతడు ఈ సృష్టిని చేస్తున్నాడు. "సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామాని కృత్వా¬భివదన్యదాస్తే ।" - ఆ ధీరుడు (బ్రహ్మ) అన్ని రూపములను నిర్మించి వాని వానికి నామములను పెట్టి పిలుస్తున్నాడు. (తై॥ ఆరణ్యకము 3-12). "స ఈక్షత లోకాన్ను సృజా ఇతి।" - అతడు లోకములను సృష్టించెదనుగాక అని సంకల్పించెను (ఐ॥ 1-1-1). "స ఈక్షాం చక్రే।" అప్పుడు (బ్రహ్మము) అది సృష్టిని గూర్చి విచారణ చేసింది (ప్ర॥ 6-2)

ఇప్పుడు ఇలా ప్రశ్నించవచ్చు - "సృష్టి ప్రారంభ సమయంలో బ్రహ్మము ఒక్కటే కదా వున్నది? ఇక విచారణ ఏమని చేసేది?" దానికి సమాధానము - పూర్వము జీవులు చేసిన కర్మల గురించి విచారణ

చేసినది అని. ఉదా : ఏ శిల్పి అయినా ఇలాగే విచారించి శిల్పమును ప్రారంభిస్తాడు. బ్రహ్మ కూడా విచారణ చేసి సృష్టి ప్రారంభించింది. అందువలన బ్రహ్మ జగత్తుకు నిమిత్త కారణము.

6–2) బ్రహ్మమే జగత్తుకు ఉపాదాన కారణము

బ్రహ్మము జగత్తునకు నిమిత్తకారణమని మనకు తెలిసింది. అయినా, జగత్తుయొక్క స్వరూపమును తెలుసుకోవాలనే ఇచ్ఛ ఇంకా పూర్తికాలేదు. ఆభరణముకంటె వేఱుగా వున్న కంసాలిని తెలుసుకోగానే ఆభరణ స్వరూపమును తెలుసుకోజాలము. బంగారమును తెలుసుకుంటే ఆభరణ స్వరూపము తెలుస్తుంది. అలాగే జగత్తుకు ఉపాదాన కారణము తెలిస్తే దాని స్వరూపము తెలుస్తుంది. ఏఏ సామగ్రితో బ్రహ్మ ఈ జగత్తును సృష్టించిందో తెలుసుకోవాలి. ఆ సామగ్రిని శ్రుతి పరోక్షముగా, ప్రత్యక్షముగా కూడా తెలియజేసింది.

ఒకప్పుడు ఈ జగత్తును చూసి శౌనక మహర్షి, అంగిరస మహర్షిని ఇలా ప్రశ్నించాడు – "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి?" – భగవన్! దేనిని తెలుసుకుంటే అన్నింటిని తెలుసుకోవచ్చు? (ముం॥ 1–1–3)? దానికి సమాధానము అంగిరసుడు ఇలా చెప్పాడు : "యథా పృథివ్యాం ఓషధయస్సం భవంతి తథాక్షరాత్ సంభవతీహ విశ్వమ్ ।" – ఎలాగైతే భూమిమీద ఓషధులు (వృక్షములు – మొక్కలు మొ॥) మొలుస్తున్నాయో అలాగే అక్షరుడైన బ్రహ్మమునుండి ఈ కనిపిస్తున్న విశ్వమంతా ప్రభవిస్తున్నది. అందువలన బ్రహ్మమును తెలుసుకుంటే అంతటిని తెలుసుకోవచ్చు (ముం॥1–1–7). ఇంకొకచోట ఆరుణి తన పుత్రుడైన శ్వేతకేతువును ఇలా అడిగాడు – "తమాదేశమప్రాక్ష్యో యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతం అవిజ్ఞాతం విజ్ఞాతమ్ ।" – ఏది వింటే వినవలసినవి అన్నీ వినపడతాయో, దేనిని మననం చేస్తే మననం చేయవలసినవి అన్నీ మననం చేసినట్లవుతుందో, దేనిని తెలుసుకుంటే తెలుసుకోవలసినవి అన్నీ తెలుస్తాయో, ఆ ఆదేశమును విన్నావా? (ఛాం॥ 6–1–3). అది శ్వేతకేతువు విని ఉండలేదు. అందువలన తండ్రి తిరిగి ఇలా చెప్పాడు – "యథా సౌమ్యైకేన మృత్పిండేన సర్వం మృన్మయం విజ్ఞాతం స్యాత్, వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం ।" – హే సోమ్య, ఒక మట్టిముద్దను తెలుసుకోవడము వలన మట్టితో చేసిన అన్ని వస్తువులను తెలుసుకోగలుగుతున్నాము. కార్యము వాక్కుతో ఆరంభించే పేరు. మట్టిమాత్రమే సత్యము. ఈ ఉదాహరణ తరువాత ఇలా చెప్పాడు – "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్।" – 'హే సోమ్య! మొదట అద్వితీయమైన సత్యము ఒక్కటే ఉన్నది, (ఇదే వెనుక చెప్పిన ఆదేశము). (ఛాం॥ 6–2–1). ఈ ప్రకారమైన అనేక దృష్టాంతములతో బ్రహ్మ కేవలము నిమిత్త కారణము కాక జగత్తుకు ఉపాదాన కారణముగా కూడా వున్నది అని నిశ్చయమవుతున్నది. భాష్యకారులు "ప్రకృతి భావేన, అధిష్ఠాతృ భావేన చ ఉభయ స్వభావస్య ఈశ్వరస్య ఆచార్యేణ ప్రతిష్ఠాపితత్వాత్ ॥" (సూ॥ భా॥ 2–2–37) అని దీనినే చెప్పారు.

పైన చెప్పిన సంవాదములతో జగత్స్వరూపమును తెలుసుకుంటే బ్రహ్మను తెలుసుకోవచ్చని అవగాహన కలుగుతున్నది. అనగా జగత్తు బ్రహ్మము కంటె వేఱుకాదు, ఇలా గ్రహించడమువల్ల పై ప్రశ్నోత్తరాలకు సమన్వయము కుదురుతుంది. అప్పుడు బ్రహ్మమే జగత్తుకు ఉపాదాన కారణమని గుర్తిస్తాము. ఎలాగంటే ఉపాదాన కారణమును గ్రహిస్తే జగత్తుయొక్క కార్యములను తెలుసుకుంటాము.

ఇంతేగాక ప్రత్యక్షరూపముగా కూడా శ్రుతి చెప్తున్నది – "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి… సత్యమభవత్ యదిదం కించ" (తై॥ 2–6–4) – నేను అనేకరూపములుగా ప్రకటింపబడతాను అని సంకల్పించి, బ్రహ్మ జగద్రూపముగా తానే అయినది. మనము ఎదురుగా గ్రహించేదంతా బ్రహ్మమే. ఈ

విశ్వమంతా బ్రహ్మమే! – "బ్రహ్మైవేదం పురస్తాత్। బ్రహ్మవేదం విశ్వమ్।" (ముం॥ 2-2-11). ఈ విధంగా బ్రహ్మమే ఉపాదాన కారణమని నిశ్చయమయినది. ఇంతకు పూర్వమే బ్రహ్మము నిమిత్తకారణమని తెలుసుకున్నాము. అందువల్ల బ్రహ్మమే జగత్తుకు అభిన్న నిమిత్తోపాదాన కారణమని గ్రహించవలసి వున్నది.

6-3) ఉపాదానత్వమా? లేక అంతర్యామిత్వమా?

ఇప్పుడు ఇంకొక సందేహమునకు అవకాశము ఉన్నది. పైన చెప్పినట్లు, గురుశిష్య సంవాదములో బ్రహ్మమునకు ఉపాదానత్వము ఎలా సంభవము? "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్" (తై॥ 2-6-6) – జగత్తును సృష్టించి తాను అందులో ప్రవేశించినది – ఇలా శ్రుతి చెప్పింది. "బ్రహ్మము, తనకంటె వేఱుగా వుండి తన వశములో ఉన్న ప్రకృతిని ఉపాదాన కారణముగా చేసి, తాను నిమిత్తముగా వుండి సర్వమును సృష్టించింది. తరువాత తాను అందులో ప్రవేశించింది" అని. ఇలా పై వాక్యములను అవగాహన చేసుకున్నట్టయితే బ్రహ్మమునకు అంతర్యామిత్వము ప్రతిపాదించినట్లవుతున్నది; అనగా జగత్తు బ్రహ్మముకంటె అన్యథా అని భావన.

ఇటువంటి సందేహానికి అవకాశమే లేదు. ఎలాగంటే ఉపాదానమే కార్యములో అంతటా నిండి వున్నది. ఆభరణములో బంగారము ప్రవేశించి వున్నట్లు జగద్రూపకార్యము అంతటా పరమాత్మ ప్రవేశించి వున్నాడు. ఈవిధముగా తైత్తిరీయ శ్రుతి మంత్రమును అర్థం చేసుకోవాలి. అప్పుడు ఉపాదానమునే అంతర్యామిగా తెలుపుతున్నారు. ఇలా ఆమోదించడములో అడ్డంకి ఏమీ ఉండదు కదా! ఆ విధముగాకాక, తడిసిన బట్టలో నీరు నిండినట్లు బ్రహ్మముకూడా తనకంటె అన్యకార్యములో తాను ప్రవేశించింది అని చెప్పినట్లయితే అనేక ఇతర శ్రుతివాక్యములతో అభిప్రాయభేదము వస్తుంది.

1) తడిబట్టయొక్క ఉపమానములో బట్ట నీటికంటె వేఱుగా వున్నది. అయితే, సృష్టికి పూర్వము ప్రకృతి బ్రహ్మకంటె వేఱుగా ఉన్నదని శ్రుతి చెప్పలేదు. "ఏకమేవాద్వితీయమ్" (ఛాం॥ 6-2-1) – అద్వితీయముగ ఒక్కటే ఉన్నది అని శ్రుతి చెప్పినది. "నాన్యత్ కించన మిషత్" (ఐ॥ 1-1-1) – క్రియాశీలమైనది ఇంకొకటి ఏదీ లేదు, అని కూడా చెప్పింది. 2) తైత్తిరీయశ్రుతి – "అందులో ప్రవేశించింది" అని చెప్పి తరువాత వాక్యములో యిలా అన్నది "యదిదం కిం చ తత్సర్వం అభవత్" (తై॥ 2-3-7) – ఉన్నదంతా అదే అయింది. అయితే, బట్టలో నీరు ప్రవేశించినప్పుడు నీరు బట్ట కావడము లేదు. అలాగే బ్రహ్మ జగత్కార్యంలో ప్రవేశించినట్లయితే కార్యరూపమును పొందజాలదు. 3) తైత్తిరీయ శ్రుతిమంత్రము, బ్రహ్మ అనంతస్వరూపమని, అంతటా నిండి వున్నదని చెప్తున్నది (తై॥ 2-1-1). ఒకవేళ కార్యము బ్రహ్మమునకు వేఱుగా వుండేటట్లయితే అది అభిన్నముగా ఉండజాలదు; అటువంటి బ్రహ్మమును 'అనంతము' అని శ్రుతి ఎలా చెప్పగలదు? కార్యముకంటె భిన్నముగా ఉన్న బ్రహ్మమును 'అనంతము' అని చెప్పడానికి వీలులేదు.

ఈ విధంగా అనేక కారణములవల్ల "బ్రహ్మము కేవలము అంతర్యామియేగాని ఉపాదానము కాదు" అని చెప్పడము కుదరదు. బ్రహ్మము ఉపాదానమే! కార్యదృష్టితో అయినట్లయితే 'అంతర్యామి' అని కూడా చెప్పవచ్చు.

6-4) వాచారంభణము – నామధేయము

పైన చెప్పిన (6-2) విషయములో ఇంకొక సందేహము వస్తున్నది. ఉపాదాన కారణము తెలుసుకున్న మాత్రమున అన్ని కార్యములు ఎలా తెలుస్తాయి? ఒకదానిని తెలుసుకుంటే రెండవది ఎలా తెలుస్తుంది?

సమాధానము : ఈ శంక సరియైనదే! ఒకదానికంటె రెండవ వస్తువు వేఱుగా వున్నట్లయితే ఈ సంశయము సత్యమే! కాని, కార్యము ఉపాదానముకంటె వేఱుగా లేదు. కనుక కారణమును (ఉపాదానమును) తెలుసుకొనుటవల్ల కార్యము పూర్తిగా తెలియబడుతుంది (ఛాం॥ భా॥ 6-1-6). కార్యమును, అనగా వికారమును కేవలము ఇంద్రియములచేత గుర్తించడమే కార్యజ్ఞానము కాదు; కార్యస్వరూపమైన ఉపాదాన కారణము యొక్క జ్ఞానమే కార్యజ్ఞానము. ఒక కార్యముద్వారా దాని మూలకారణ జ్ఞానము కలిగినట్లయితే, ఆ కారణముతో సంబంధించిన అన్ని కార్యముల జ్ఞానము కలుగుతుంది. కార్య-కారణ సంబంధము, దృష్టాంత - దార్ష్టాంతికముల సంబంధము వంటిదే. (సూ॥ భా॥ 1-4-23)

ఉదా : గణితములో గుణించే క్రమము తెలుసుకున్నట్లయితే అన్ని ప్రశ్నలకు గుణితముతో సమాధానము వస్తుంది. గుణించడము తెలిసినవాడు 'ఏ సమస్యను యిచ్చినా యిది నాకు తెలియదు' అనడు. సమస్యలు అనంతము. ఒకప్పుడు 8 x 3 అవవచ్చు. ఒకప్పుడు 13 x 29 కావచ్చు. అయితే గుణిత పద్ధతి ఒక్కటే. ఆవులను లెక్కించవలసి వచ్చినప్పుడు ఇదే క్రమము పాటించి సమాధానము చెప్పగలము. ఆవులు తెల్లనివయినా, నల్లనివయినా ఒకే పద్ధతిలో గుర్తించగలము. గోవులు ఎన్ని రంగులయినా వాటి గోత్వము ఒకటే. ఈ విధంగానే నామధేయములన్నింటినీ గ్రహించాలి. 'వాచారంభణం' అనగా గోత్వమును మనకు బోధ చేయడం కోసం ఉపయోగించే వాక్కుకు ఆధారముగా 'గోవు' అన్నారు - "వాచారంభణం, వాగారంభణం, వాగాలంబనం ఇత్యేతత్।" (ఛాం॥ భా॥ 6-1-4) దానికి ఇంతకంటె అర్థము ఏమీ లేదు. తాత్పర్యమంతా గుణితమును బోధపరచడము లోనూ, గోవులను బోధపరచడములోను ఉన్నది. అదే విధంగా కారణమును తెలుపడముకోసం అవసరమైన కార్యమే 'వాచారంభణము'. అన్ని నామములు వాచారంభణ మాత్రములే. వాని ద్వారానే మనము కారణమును తెలుసుకుంటున్నాము. ఈ నామరూపముల విభజన (సృష్టి) చేయకపోతే, ఆత్మయొక్క ప్రజ్ఞాన ఘనమనే నిరుపాధికమైన తత్త్వాన్ని మనము గ్రహించలేము- "యది హి నామరూపే న వ్యాక్రియేతే తదా అస్యాత్మనో నిరుపాధికం రూపం ప్రజ్ఞానఘనాఖ్యం న ప్రఖ్యాయేత।" (బృ॥ భా॥ 2-5-11). పరమార్థ దృష్టితో బ్రహ్మమును తెలియపరచుటకంటె నామరూప విభజనకు ప్రయోజనము ఇంకేమీ లేదు; కేవలము కారణమును బోధించుటకు మాత్రమే. "వాచారంభణం వికారో నామధేయమ్ మృత్తికేత్యేవ సత్యమ్।" (ఛాం॥ 6-4-1). రూపము (వికారము) కాని, నామము కాని మట్టిని తెలుసుకోవడము కొరకే; మట్టిమాత్రము సత్యము.

6-5) కార్య-కారణ అనన్యత్వము

పైన చెప్పిన వివరణవలన కార్య-కారణములకుగల సంబంధము చాలా విచిత్రమైనదని స్పష్టము. క్రింద చెప్పబోయే వివరణతో ఇది ఇంకా స్పష్టం అవుతుంది. ఇంతగా వివరించడము ఎందుకనగా ఈ కార్య-కారణ సంబంధము వేదాంత సిద్ధాంతమునకు మూలాధారము.

1) **ఉపాదాన కారణము నశిస్తే కార్యమే వుండదు.** ఉదా : దారము పూర్తిగా విడదీసినచో ఇక వస్త్రము ఉండదు; అలాగే ప్రత్తిపోగు అనే కారణమును విడదీసిన ఎడల దారము వుండదు. దీని అర్థము, కార్యము కారణముకంటే అన్యము కాదు. కాని, కార్యము లేకపోయినా కారణము వుంటుంది. ఉదా: వస్త్రము లేకపోయినా దారము వుంటుంది. దారము లేకపోయినా ప్రత్తిపోగు వుంటుంది. అనగా కారణము కార్యముకంటె వేఱుగా వుంటుంది. "అనన్యత్వేపి కార్యకారణయోః కార్యస్య కారణాత్మత్వం న తు కారణస్య కార్యాత్మత్వమ్ ।" (సూ॥ భా॥ 2-1-9). ఈ రెండు చమత్కారమైన వాక్యములద్వారా "కార్య-కారణ అనన్యత్వ న్యాయము" చెప్పబడినది. (సూ॥ భా॥ 2-1- అధి 6).

క్రింద, ఈ యుగ్మ వాక్యములను పెద్ద అక్షరములతో చూపిస్తున్నాము.

6-5-క)

కార్యము కారణముకంటె వేఱుకాదు - పూర్వార్థము
కాని
కారణము కార్యముకంటె వేఱుగా ఉంటుంది - ఉత్తరార్ధము

బ్రహ్మ కారణము - జగత్తు దాని కార్యము. అందువల్ల ఈ వాక్యములను క్రింది విధంగా తెలుసుకోవాలి.

6-5-ఖ)

జగత్తు బ్రహ్మముకంటె వేఱుకాదు - పూర్వార్థము
కాని
బ్రహ్మము జగత్తుకంటె వేఱుగా ఉంటుంది - ఉత్తరార్థము

అనగా బ్రహ్మము జగత్తుయొక్క స్వభావము. కాని జగత్తు బ్రహ్మము యొక్క స్వభావము కాదు - "బ్రహ్మ స్వభావో హి ప్రపంచః న ప్రపంచ స్వభావం బ్రహ్మ ।" (సూ॥ భా॥ 3-2-21). బ్రహ్మ జగత్తుయొక్క స్వరూపము కాని, జగత్తు బ్రహ్మయొక్క స్వరూపము కాదు. **ఈ యుగ్మ వాక్యములు వేదాంత సిద్ధాంతమునకు చాలా ముఖ్యము. వేదాంత సిద్ధాంతమును చక్కగా అవగాహన చేసుకోవాలంటే ఈ వాక్యముల స్పష్టమైన జ్ఞానము అత్యవసరము.**

2) ఆభరణములు స్థితి కాలములో ప్రత్యక్షముగా సువర్ణముతో కలిసే వుంటాయి. వేఱుగా కనపడవు. అనగా కార్యము - కారణముకంటె వేఱుకాదు. స్థితికాలములోనే సువర్ణము ఆభరణములకంటే వేఱుగా వున్నదని ఎలా తెలుస్తుంది? దీనిని తెలుసుకోవాలంటే ఉదాహరణ చూడండి. దర్పణములో ఆభరణముల ప్రతిబింబములను చూచినట్లయితే, అక్కడ సువర్ణము లేదు; ఆభరణముల నామ రూపములు మాత్రమే కనపడతాయి. వాటికి సువర్ణ స్పర్శ కూడా లేదు. ఈ ఉపమానముతో మనకు కారణముతో కార్యము భిన్నమని తెలుస్తోంది. భాష్యకారులు దీనిని ఇలా వ్యక్తము చేస్తున్నారు: "సర్వం చ నామరూపాది సదాత్మనైవ సత్యం వికారజాతం, స్వతస్తు అనృతమేవ" - కారణరూపముతో కలసివున్నప్పుడు నామరూప వికారములు సత్యములే; కాని, స్వతంత్రముగా అనృతమే (ఛాం॥ 6-3-2).

3) "స్థితికాలములో, కార్యము కారణముకన్న వేఱుకాదని స్పష్టమయినది. కాని, కార్యము ఉత్పత్తికి పూర్వము - నశించిన తరువాత కార్య-కారణ అనన్యత్వము ఎలా వుంటుంది?" ఆ సమయములో కూడా అనన్యత్వము ఉన్నదనే చెప్పాలి. అది ఎలాగంటే, స్థితి కాలములో కార్యము ఉన్నట్లు మన అనుభవములో తెలుస్తున్నది కనుక, కార్యమునకు పూర్వము అది మనకు కనిపించనప్పుడు కూడా ఉండే వుండాలి. ఏది లేదో, దాని సృష్టి సంభవము కాదు కదా? అలాగే మన అనుభవములో ఉన్నది నశించిన తరువాత కనపడకపోయినా అది లేదు అనడము కుదరదు. ఉన్నదానికి ఎప్పుడూ నాశనము లేదు. అది లయకాలములో కారణముతో ఏకమై ఉన్నందువల్ల కనపడడము లేదు. "అయితే, కనపడే సమయములో కారణముతో ఏకమై లేదా" అంటే, అప్పుడు కూడా ఒకటిగానే ఉన్నది. "ఇలా అయితే, కార్యమునకు స్థితి-లయకాలములలో భేదము ఎలా వుంటుంది?" స్థితిలో **'వేఱుగా ఉన్నట్టు'** కనపడుతూ ఉన్నది; అనగా, 'కార్యము ఉత్పన్నమయినది' అన్నదానికి అర్థము సృష్టి అయినది అని కాదు - కారణముకంటె **'వేఱైనట్టు'** కనపడుతున్నది అని. ఇక, కార్యము నశించినది అంటే, **'వేఱుగా ఉన్నట్లు'** కనబడినదే కారణముతో ఏకము అయినదని అర్థము. "ప్రాగుత్పత్తేః అవ్యాకృత నామరూప భేదమ్ ఆత్మైక శబ్ద ప్రత్యయ గోచరం.

జగత్ ఇదానీం వ్యాకృత నామరూప భేదత్వాత్ అనేక శబ్దప్రత్యయ గోచరం ఆత్మైక శబ్దప్రత్యయ గోచరం చ।" (ఐ॥ భా॥ 1-1-1). సృష్టికి పూర్వము ఈ జగత్తు అవ్యాకృతముగా "ఆత్మ" అనే ఒకే శబ్దప్రత్యయమునకు విషయమై ఉన్నది. అదే జగత్తు సృష్టికి తరువాత వ్యాకృతమై అనేక ప్రత్యయములకు, "ఆత్మ" శబ్ద ప్రత్యయమునకు కూడా విషయమై ఉన్నది. ఏ విధముగా కారణము భూత-భవిష్యత్-వర్తమాన కాలములలో ఎలా వున్నదో, అదే విధముగా కార్యము కూడా భూత - భవిష్యత్ - వర్తమాన కాలములలో ఉన్నది. మూడు కాలములలో కార్య-కారణములకు అనన్యత్వమే ఉన్నది. "యథా ఇదానీమపి ఇదం కార్యం కారణాత్మనా సత్, ఏవం ప్రాగుత్పత్తేరపి। న హి ఇదానీమపి ఇదం కార్యం కారణాత్మానమ్ అంతరేణ స్వతంత్రమేవ అస్తి।" (సూ॥ భా॥ 2-1-7) - 'ఇప్పుడు ఏ విధంగా కార్యము కారణరూపముతో సత్యమైవున్నదో, అదే విధంగా ఉత్పత్తికి పూర్వము కూడా సత్యమై ఉన్నది, ఇప్పుడు కూడా కార్యము కారణమును విడిచి స్వతంత్రముగా లేదు" "యథా చ కారణం బ్రహ్మ త్రిషు కాలేషు సత్త్వం న వ్యభిచరతి, ఏవం కార్యమపి జగత్ త్రిషుకాలేషు సత్త్వం న వ్యభిచరతి ।" (సూ॥ భా॥ 2-1-16) - కారణరూప బ్రహ్మము ఎలాగైతే మూడుకాలములలో ఉన్నదో, అదే విధంగా కార్యరూపమైన జగత్తు కూడా మూడు కాలములలో ఉన్నది. "కార్యాకారో ऽపి కారణస్య ఆత్మభూత ఏవ అనాత్మభూతస్య అనారభ్యత్వాత్।" - కార్యముయొక్క ఆకారము కూడా కారణ స్వరూపమే అయివున్నది. అది కారణస్వరూపము కానిచో దాని సృష్టి కాబోదు. "న చ విశేష దర్శనమాత్రేణ వస్త్వన్యత్వం భవతి, న హి దేవదత్తః సంకోచితహస్తపాదః ప్రసారితహస్తపాదశ్చ విశేషేణ దృశ్యమానో ऽపి వస్త్వన్యత్వం గచ్ఛతి ।" (సూ॥ భా॥ 2-1-18). విశేష (కార్యరూప) దర్శనమువల్ల వస్తువు వేఱుకాదు. కాళ్ళు చేతులు ముడుచుకుని ఉన్నా, విస్తరించి వున్నా, దేవదత్తుడు వేఱుకాదు. ఇదే విధముగా కార్యమునకు కారణము 'ఆత్మ'గా స్వరూపముగా ఉన్నది. కార్యమునకు కారణముతో తాదాత్మ్య (అభేదము) సంబంధము ఉండడము వల్ల కార్య-కారణ సంబంధమును తాదాత్మ్య సంబంధము అంటాము. "(కార్యకారణ సంబంధః) "బ్రహ్మవాదినః కథమితి చేత్? తస్య తాదాత్మ్యలక్షణసంబంధోపపత్తేః।" - బ్రహ్మవాది దృష్టిలో కార్య-కారణముల సంబంధము ఎలా? వానికి తాదాత్మ్య లక్షణ సంబంధమే వుంటుంది. (సూ॥ భా॥ 2-2-38). అందువలన, కార్య స్వరూపము తెలిసుకొన్న బ్రహ్మవాదులు స్వరూపములో లేని విశేషములను, కార్యములో చూస్తున్నప్పటికీ, వారి "కార్యము కారణముకన్న వేఱుకాదు" అనే జ్ఞానము బాధింపబడదు. కార్య విశేషములు వారిని బాధించవు. ఈ విధముగా కార్య కారణములలో భేదము ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, అభేద జ్ఞానము బాధింపబడకపోవుటచేత, తాదాత్మ్యమును "భేదసహిష్ణు అభేదము" అంటారు.

4) సందేహము : అనన్యత్వ న్యాయమున పూర్వార్ధ కార్యమును గురించి 'కార్యము ఎప్పుడూ నష్టము కాదు; మూడు కాలములలోనూ వుంటుంది' అని పైన చెప్పబడినది. ఉత్తరార్ధ కార్యమును గురించి 'కార్యము ఒక వేళ నశించినప్పటికీ కారణము వుంటుంది' అని కూడా చెప్పబడినది. అనగా నశించే కార్యము, నశించని కార్యము అని పరస్పరము భిన్నముగా రెండు విధములుగా వున్నవా?

సమాధానము : అవును, కార్యము రెండు విధములుగా ఉన్నది. ఒకటి నశించే ఘటము, రెండవది నశించని ఘటము. మట్టితో కలసి కనపడే శ్రుతిలో చెప్పబడిన ఘటము మొదటిది. ఇది ప్రళయకాలములో ప్రత్యక్షముగా కనపడకపోయినా అవ్యక్తరూపముగా మట్టిలో వుండనే వుంటుంది - ఇది అసత్యమైనది. అంటే, స్థితికాలములో వ్యక్తముగాను, లయకాలములో అవ్యక్తముగాను ఉంటుంది. అంటే, పరివర్తనశీలమైనది. (అ॥ 9-4 చూడండి) ఇది మట్టే గనుక, మట్టిలో కలిసే వుంటుంది కనుక ఇది నశించదు. ఈ విషయం పరిశీలన చేసి మట్టిని తెలుసుకున్న వానికి ఘటాది విషయిక శబ్ద బుద్ధులు నశించి, మట్టి మాత్రమే అని

గ్రహణ కలుగుతున్నది - "మృద్వివేక దర్శినాం తు ఘటాది శబ్దబుద్ధీ నివర్తేతే।" (ఛాం॥ భా॥ 6-2-3). తర్కశాస్త్రములో చెప్పిన విధముగా - మట్టితో తాదాత్మ్య సంబంధము లేకుండా స్వతంత్రరూపముతో కనిపించే ఘటము నశించేది. అది దర్పణములో కనబడే ప్రతిబింబరూపము లాగా మిథ్య. దీనినే కేవల వికారము మరియు నామధేయము అని చెప్పి ఉపేక్షించారు. ముమ్ముందు అవిద్యా కల్పిత కార్యమని చెప్పి ఏ కార్యమును విడిచిపెడతారో అదే ఈ స్వతంత్రమైన కార్యము. అనగా సద్రూపముగా అన్ని నామవికారములు సత్యమే. అవే, స్వతంత్ర రూపములుగా మిథ్య. (సత్యాసత్యములు పారిభాషిక శబ్దములు - వీని వివరణ వెనుక (అధ్యా. 9.4) చెప్పాము.)

5) ఇక ముందు "కార్య-కారణ అనన్యత్వ న్యాయము' ఆధారముగా ఇది స్పష్టము చేయబడినది: పై వాక్యములో పూర్వార్ధ భాగములో చెప్పిన (పూ) కార్యము శ్రుత్యుక్తమని; ఉత్తరార్ధ భాగములో చెప్పిన (ఉ) కార్యము అభావరూపమని ప్రతిపాదించెదము.

1	✓	o	స్థితి కాలము
2	x	o	
3	o	x	లయ కాలము
4	o	✓	

చిత్రం (క)

కార్యములో నాలుగు వికల్పములు వున్నవి. అది 1) కారణరూపములోనే ఉన్నది 2) కారణరూపములో లేదు, 3) కార్యరూపములోనే ఉన్నది, 4) కార్యరూపములో లేదు, వీనిలో ఏది సరియైనది అని నిశ్చయం చేయాలి. 1, 2 లలో మరియు 3, 4లలో ఒకదానిని స్వీకరిస్తే (✓) రెండవది స్వీకరించబడదు(x) అను విషయం స్పష్టం.

స్థితికాలములో (పూ) కార్యమునకు (1) మాత్రమే స్వీకరింపబడుతుంది. ఎందుకనగా కార్యము - కారణ రూపములో ప్రత్యక్షముగా ఉన్నది. లయ కాలములో (ఉ) కార్యమునకు (4) మాత్రమే స్వీకరించాలి; ఎందుకనగా కార్యరూపములో లేకపోవడము వలననే లయము సిద్ధిస్తుంది - ఇంకొక విధముగా కాదు. ఈ విధంగా స్థితి - లయ కాలములలో ఈ రెండు కార్యముల వితరణము చిత్రము ద్వారా స్పష్టముగా తెలుస్తున్నది.

చిత్రం (క) లో మిగిలిన నాలుగు స్థానములలో కార్యముయొక్క పంపిణి అనన్యత్వ న్యాయములో అంతర్గతముగా ఉన్న విషమత్వము ఆధారముగా సిద్ధిస్తున్నది. ఆ విషమత్వము ఏమంటే (పూ) కార్యము కారణముకంటె 'అనన్యము'గా ఉన్నది, కాని (ఉ) కార్యము కారణము కంటె 'అన్యము'గా ఉన్నది. ఈ రెండింటి పంపిణిలో నాలుగు వికల్పములున్నవి (చిత్రము 'గ') : అవి (య) (ర) (ల) (వ) చిత్రములలో సూచింపబడినవి. (య)- (ర)లలో లయకాలములో (3)ను స్వీకరించారు. అనగా లయకాలములో కార్యము కార్యరూపములోనే ఉంటుంది. ఇందువల్ల లయము సిద్ధించదు. ఇందువలన ఈ రెండు వికల్పములను నిరాకరించడమైనది. వికల్పము (ల)లో కూడా నిరాకరించబడుతోంది. ఎందుకనగా, రెండు కార్యముల పంపిణి ఒకటే అవడం వల్ల పైన చెప్పిన 'అనన్యత్వ న్యాయము' యొక్క విషమత్వము సిద్ధించడము లేదు - కారణముతో రెండు కార్యముల యొక్క సంబంధము ఒక్కటిగానే వున్నది. కాని (వ)లో లయము సిద్ధిస్తున్నది, మరియు విషమత్వము కూడా సిద్ధిస్తున్నది. ఇందువలన ఇది ఒక్కటే 'సమన్వయకర్త'.

		(య) (పూ)	(య) (ఉ)	(ర) (పూ)	(ర) (ఉ)	(ల) (పూ)	(ల) (ఉ)	(వ) (పూ)	(వ) (ఉ)
స్థితి కాలము	1	✓	✓	✓	X	✓	✓	✓	X
	2	X	X	X	✓	X	X	X	✓
లయ కాలము	3	✓	X	✓	X	X	X	X	X
	4	X	✓	X	✓	✓	✓	✓	✓

చిత్రం (గ)

కాని, ఇందులో కూడా లయకాలముయొక్క (పూ) (ఉ) కార్యములలో 'అనన్యన్యాయము'లోని విషమత్వము లేదు. ఇది ఎలా సమర్థించగలము? అంటే ఇక్కడ దాగివున్న విషమత్వమును ఇలా చూడవచ్చు: (పూ) కార్యముయొక్క స్థితికాలంలోను లయకాలంలోను క్రమముగా (1) మరియు (4) స్వీకరింపబడినది. ఇందువల్ల లయకాలములో 'కార్యము తనరూపంలో లేదు' అంటే అర్థము – 'కారణ రూపములో ఉన్నది' అని. అనగా (పూ) కార్యము "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" – అను శ్రుతివాక్యమును అనుసరించిన కార్యము. అందువలన ఇది స్థితికాలములో కారణరూపముతోనే వ్యక్తము అవుతుంది. కార్యముయొక్క ఈ లక్షణాన్ని భాష్యకారులు ఇలా బోధపరుస్తున్నారు. "కార్యాకారోఽపి కారణస్య ఆత్మభూత ఏవ, అనాత్మభూతస్య అనారభ్యత్వాత్ ।"– కార్యరూప ఆకారము కూడా కారణముయొక్క స్వరూపమే అయి ఉంటుంది; అది దాని స్వరూపము కాక పోతే సృష్టింపబడదు. (సూ॥భా॥ 2–1–18). కాని (ఉ) కార్యమును (4) గా స్వీకరించారు – (1) గా స్వీకరించలేదు. ఇందువల్ల (పూ) కార్య విషయంలో ఏవిధంగా (4) యొక్క అర్థంతో సమన్వయము చేసి చెప్పారో – ఆ విధముగా (ఉ) కార్యంలో కార్యమునకు స్థితికాలములో అర్థాపత్తికంటె ఇతర అర్థమును చెప్పజాలము. ఇప్పుడు ముందు చెప్పిన (1) మరియు (4) లలోని అర్థమే మిగిలి వుంటుంది. అనగా, స్థితికాలములో (ఉ) కార్యము ప్రత్యక్ష అనుభవమునకు విరుద్ధముగా కారణరూపములో లేదు; అంతేగాక లయకాలములో ఏ రూపములోను లేదు. ఇందువల్ల ఎప్పుడూ కారణముతో సంబంధములేని ఈ కార్యము 'అభావము'గానే ఉన్నది. భాష్యకారులు దీనిని ఇలా బోధించారు – "కార్యమాకాశాదికం బహుప్రపంచం జగత్, కారణం పరబ్రహ్మ। తస్మాత్ కారణాత్ పరమార్థతో అనన్యత్వం, వ్యతిరేకేణ అభావః కార్యస్య।" – ఆకాశాది అనేక ప్రకారములైన జగత్తు కార్యము కారణము పరబ్రహ్మ. పరమార్థ దృష్టితో ఆ కార్యము కారణముకంటె అనన్యము; కారణము నుండి వేఱుగా అయిన కార్యమనేది ఉండనే ఉండదు. (సూ॥ భా॥ 2–1–14).

6) కార్యము ఉత్పత్తికి పూర్వమే ఉంటుంది; లయమునకు తరువాత కూడా వుంటుంది – అనే ఈ విధమైన అనుభవము ఎవరికీ ఉండదు. అందువల్ల, కార్యము ప్రస్తుతము మాత్రమే ఉన్నది అని ఎందుకు చెప్పకూడదు? కారణములోనే ఉన్న ఒకానొక 'విశేషమాయాశక్తి' వల్ల కార్యము వర్తమానములోనే ఉత్పత్తి ఎందుకు కాకూడదు?

అలా అవడానికి వీలులేదు. ఉత్పత్తికి పూర్వము, లయమునకు తరువాత కూడా కార్యము కనపడనప్పటికీ దానికి అభావము లేదు. అభావమని చెపితే ప్రస్తుతము ఉన్న కార్యము అభావము నుంచే

వచ్చింది, అభావమే అవుతుంది – అని అర్థము వస్తుంది. ఈ విషయము ముందే చెప్పబడింది. "కథమసతః సజ్జాయేత?" – అసత్తువల్ల సత్ ఎలా సంభవిస్తుంది? (ఛాం॥ 6-2-2). ఇలా చెప్పి శ్రుతి అసద్వాదమును నిరాకరించింది. ఏ శక్తి కూడా ఉన్న వస్తువును నశింపజేయజాలదు. అంతేగాక, లేని వస్తువునకు అస్తిత్వమును తీసుకురాలేదు. ఇందువల్ల కార్యమునకు – కారణమునకు మధ్య ఇంకొక శక్తి ఉన్నదని స్వీకరించుటకంటే, తిన్నగా అన్ని కార్యములను కారణముతో కలిపివేయవచ్చును. అయితే సౌలభ్యము కోసం శక్తిని ఆమోదించినా కార్యము శక్తికంటె వేఱుగా లేదు; శక్తి కారణముకన్న వేఱు కాదు అనీ. ఈ విధముగా బ్రహ్మమునకు – జగత్తుకు మధ్య ప్రకృతి శక్తిని (మూలప్రకృతి లేక మాయ) చెప్పినప్పటికీ – జగత్తు ఈ శక్తి కన్న, ఈ శక్తి బ్రహ్మ కన్న వేఱు కాదు అని చెప్పవలసి ఉంటుంది. "కారణస్య ఆత్మభూతాశక్తిః శక్తేశ్చ ఆత్మభూతం కార్యమ్।" (సూ॥ భా॥ 2-1-18). ఆ శక్తి బ్రహ్మయే; అదే నేను. ఎందుకనగా శక్తి – శక్తిమంతుడు వేఱు కాదు – "సా శక్తిః బ్రహ్మైవ అహం । శక్తి శక్తిమతోః అనన్యత్వాత్ ।" (గీ॥ భా॥ 14,27). నా స్వరూపమైన నాదే అయిన మాయ – "మమ స్వరూపభూతా మదీయా మాయా॥" (గీ॥భా॥ 14-3). మూలప్రకృతినిగా దేనిని ఒప్పుకుంటున్నారో, అదే మేము ఆమోదించే బ్రహ్మ – "యా మూలప్రకృతిః అభ్యుపగమ్యతే తదేవ చ నో బ్రహ్మ ।" (సూ॥ భా॥ 2-3-1)

ఈ విధంగా శక్తి – శక్తిమంతుల అనన్యత్వములో శక్తీ (మాయా), అట్లే జీవ-బ్రహ్మల అనన్యత్వములో జీవుడూ, ఇద్దరూ సద్రూపములో సత్యము – తమది మాత్రమే అయిన రూపములో అసత్యము; ఎందుకనగా అన్ని వికారములు వాచారంభణ నామధేయములు మాత్రమే!- "సర్వం చ నామరూపాది సదాత్మనైవ సత్యం వికారజాతం స్వతస్తు అనృతమేవ వాచారంభణం వికారో నామధేయమ్ ఇత్యుక్తత్వాత్ । తథా జీవో¬పీతి ।" (ఛాం॥ భా॥ 6-3-2). ఇక్కడ సూచించిన జీవ-బ్రహ్మ అనన్యత్వము జీవప్రకరణములో స్పష్టము అవుతుంది.

ప్రశ్న : ఘటము – ఆభరణము, వీనిలో మృత్తికా, సువర్ణముల అనన్యత్వము స్పష్టము; కారణముకంటె వేరై కార్యము ఉండనే ఉండదు. ఈ విధముగా ఉండేటప్పుడు పరిశ్రమతో ఈ విషయమును నిశ్చయించడములో ఉద్దేశ్యము ఏమిటి?

సమాధానము : దృష్టాంతములో కార్యకారణ అనన్యత్వము ప్రత్యక్షము. దార్ష్టాంతికములో కూడా బ్రహ్మ ప్రత్యక్ష విషయము అయితే జగద్ – బ్రహ్మలయొక్క అనన్యత్వము సులభముగా అవగాహనకు వస్తుంది. కాని, కార్యజగత్తు మాత్రమే ప్రత్యక్షమైనందువల్ల – దాని బ్రహ్మతో సంబంధమా? లేక ఇంకొక దానితో సంబంధమా అనే విషయము నిశ్చయము చేయలేము – "సతి హి ఇంద్రియ విషయత్వే బ్రహ్మణః ఇదం బ్రహ్మణా సంబద్ధం కార్యమితి గృహ్యేత । కార్యమాత్రమేవ తు గృహ్యమాణం కిం బ్రహ్మణా సంబద్ధం కిమన్యేన కేనచిద్వా సంబద్ధమితి న శక్యం నిశ్చేతుమ్ ।" (సూ॥ భా॥ 1-1-2). ఈ కారణంచేత జగత్తును విచారణ చేసేవారు వేఱువేఱు విధాలుగా కల్పనలు చేసి, జగత్తుకు బ్రహ్మతో సంబంధమును తీసివేసి, స్వతంత్ర అస్తిత్వమును చెప్తున్నారు; దానివల్ల అజ్ఞానులైనజీవులు జగత్తును స్వతంత్రమనే అనుకుంటున్నారు. ఇందువల్ల ప్రత్యక్ష దృష్టాంతములద్వారా ఈ విధమైన జగత్తుయొక్క కల్పితత్వమును తెలియబరచడము కోసం ఆభరణములను, ప్రతిబింబ విషయమును దృష్టాంతముగా చెప్పారు.

ప్రశ్నలు :

1. బ్రహ్మ జగత్తుకు నిమిత్తకారణమని ఎలా నిశ్చయమవుతున్నది?
2. బ్రహ్మలో సృష్టి ప్రవృత్తి ఎందుకు కలుగుతున్నది?
3. బ్రహ్మ జగత్తుకు ఉపాదానకారణమని శ్రుతి ఎలా బోధిస్తున్నది?
4. అభిన్న నిమిత్తోపాదాన కారణము అనగా ఏమిటి?
5. బ్రహ్మ జగదంతర్యామియా లేక జగదుపాదానమా? వివరించండి.
6. వాచారంభణము వికారము నామధేయము, వీటిని వివరించండి.
7. రెండు విధముల కార్యములు ఏవి? వాటిలో భేదము ఏమిటి?
8. కార్య–కారణముల మధ్య అనన్యత్వ సంబంధమును విశ్లేషణ చేయండి.
9. కార్యము కారణముతో భిన్నము ఎందుకు కాదు?
10. కారణము కార్యముతో ఎందుకు భిన్నము?
11. లయకాలములో కార్యము కారణముతో భిన్నము కాదని ఎలా నిశ్చయమవుతున్నది?
12. స్థితికాలములో కారణము కార్యము కన్న వేఱని ఎలా నిశ్చయమవుతున్నది?
13. స్థితి లయములలో, అనన్యత్వమును గురించి భేదమును స్పష్టం చేయండి?
14. కార్యము విషయములో తార్కికుల అభిప్రాయము ఏమి?
15. కార్యము విషయములో శ్రుతి అభిప్రాయము ఏమిటి?
16. తాదాత్మ్య సంబంధము అనగా ఏమి?
17. కార్యము మరియు కారణములలో, కారణశక్తి సంబంధము ఏమిటి?

అధ్యాయము 7

బ్రహ్మ కారణత్వ చర్చ

ఐదవ అధ్యాయములో జగత్కారణత్వమును గురించి అనేక సిద్ధాంతములను పేర్కొన్నాము. వాటిని ప్రతిపాదించి, వాటి తర్కముతోనే అవి నిరాకరింపబడినవి. ఆరవ అధ్యాయములో బ్రహ్మమే జగత్కారణమని నిరూపణ చేయబడింది. ఇప్పుడు ఈ సిద్ధాంతమునకు విరుద్ధమైన ఆక్షేపములకు సమాధానము చెప్పాలి. అందువల్ల "స్థూణా నిఖనన న్యాయము"తో (అనగా రాటను భూమిలో బలంగా పాతిపెట్టేటప్పుడు, దానిని అటూ ఇటూ కదిపి పూర్తిగా గట్టిపడేటట్లు చేస్తారు) బ్రహ్మ కారణత్వము యొక్క దృఢీకరణకోసము తార్కికుల ఆక్షేపములను పదేపదే ఎత్తిచూపి సమాధానము చెప్పబడుతున్నది.

7-1) జ్ఞాపకము ఉంచుకోవలసిన మాట

"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్" - హే సోమ్య! సృష్టికి పూర్వము జగత్తు సత్ మాత్రమే అయి ఉండినది. అది అద్వితీయమైన ఒక్కటే. (ఛాం॥ 6-2-1). ఇది పైన చెప్పిన సిద్ధాంతమునకు మహత్వపూర్ణమైన వాక్యము. ఎక్కువభాగము ఈ వాక్య ఆధారముతోనే కార్య-కారణ అనన్యత్వము (అధ్యా॥ 6-5లో క) మరియు దానితో బ్రహ్మ-జగత్తుల అనన్యత్వము (అధ్యా 5-6లో ఖ) ప్రతిపాదించబడినవి. ఈ శ్రుతి వాక్యమును విచారిస్తే ఇంకొకభావము కూడా తోస్తున్నది. సృష్టికి పూర్వము బ్రహ్మము ఒక్కటే ఉన్నట్లయితే ఇప్పుడు ఉన్నదంతా కూడా బ్రహ్మముతో అనన్యము (అభిన్నము) గానే ఉన్నది అనేది ఆ భావము; అప్పుడు కార్యరూప జగత్తు కూడా అనన్యమే అవుతుంది; కార్యము కానటువంటి జీవుడు కూడా అనన్యమే. దీనికి విస్తృతమైన వ్యాఖ్య జీవప్రకరణములో చేయబడుతుంది. ఈ అధ్యాయములో ఆవశ్యకమైన జీవ-బ్రహ్మ అనన్యత్వముచేత మూడవదైన యుగళ వాక్యము ప్రతిపాదింపబడుచున్నది.

(7-1 క)

జీవుడు బ్రహ్మమునుండి వేఱుకాదు - పూర్వార్ధము

కాని

బ్రహ్మము మాత్రము జీవునికంటె వేఱైనది - ఉత్తరార్ధము

శంఖారావము వంటి ఈ వేదాంతమునకు సంబంధించిన వాక్యములను జ్ఞప్తిలో ఉంచుకున్నట్లయితే ఏ ఆక్షేపములకయినా సులభముగా సమాధానము చెప్పవచ్చు. ఆ ఆక్షేపములు లౌకికమైనవైనా, వైదిక విషయపరమైనవైనా రెండింటికీ సమాధానము చెప్పే సామర్థ్యము వేదాంతమునకు ఉన్నది. ఎందుకనగా పూర్వమే చెప్పబడిన (అధ్యా॥ 5-10) తర్కగత దోషములు నానాత్వము ఆధారపడి వున్నవి. కాని, వేదాంతములో ఈ దోషము ఎప్పుడూ ఉండదు. అది ఏకత్వముమీదనే ఆధారపడివున్నది. ఇప్పుడు ఇతర వాదములలోని ఆక్షేపములను వారి పరిహారములను చెప్తున్నాము.

7-2) భోక్తృ-భోగ్య అభేదమున ఆక్షేపము

ఆక్షేపము : బ్రహ్మమే జగత్తుయొక్క ఏకమాత్ర కారణము అయినట్లయితే బ్రహ్మకంటె వేఱుగా ఏమీ ఉండదు; అనగా భోగ్య జగత్తు బ్రహ్మమే అవాలి; భోక్తయైన జీవుడు కూడా బ్రహ్మమే! అప్పుడు భోగమును పొందే భోక్త, భోగింపబడే భోజ్యము (అన్నము మొదలైనవి), వీనిలో ఏమీభేదము ఉండదు. కాని, వీనిలో భేదము వున్నదని అందరి అనుభవముల వలన తెలుస్తున్నది. ఇందువల్ల వేదాంతములో చెప్పిన బ్రహ్మ కారణత్వము ప్రత్యక్ష అనుభవమునకు విరుద్ధము. (సూ॥భా॥ 2-1-13)

ఆక్షేప పరిహారము : ఈ ఆక్షేపము సరికాదు. ఎందుకనగా, జగత్తు-జీవుడు ఇద్దరూ కూడా స్వరూపములో ఒక్కటే. అయినప్పటికీ, వ్యవహారములో వేఱుగానే ఉన్నారు. భోగము అన్నది కేవలము వ్యవహారము మాత్రమే. స్వరూపము కాదు. ఉదా : సుత్తికి ఇనుపదిమ్మకు కూడా ఉపాదాన కారణము ఇనుము మాత్రమే; స్వరూపములో రెండూ ఇనుముకంటె వేఱుకాదు. అయినప్పటికీ కనపడినప్పుడు సుత్తి ఇనుపదిమ్మ కాదు; ఇనుపదిమ్మ సుత్తి కాదు; రెండూ వేఱువేఱుగానే కనపడతాయి. అందువల్ల వ్యవహారములో రెండింటికి భేదము ఉన్నదని చెప్పడంలో ఆటంకము ఏమీలేదు. ఒకటి కొట్టడానికి పనికి వస్తుంది; ఒకటి కొట్టబడుతూ వుంటుంది. సుత్తి - దిమ్మెల స్వరూపమైన ఇనుములో కొట్టడమూ లేదు; దెబ్బలు తినడమూ లేదు. ఈ విధంగానే భోక్తయైన జీవుడు, భోగ్యమైన జగత్తు కూడా స్వరూపములో బ్రహ్మమే అయినా వేఱువేఱుగా భాసిస్తూ వుంటారు. ఈ ఇద్దరి భేదవ్యవహారము ఎల్లప్పుడూ వుంటూనే వుంటుంది.

7-3) హితాకరణముయొక్క ఆక్షేపము

ఆక్షేపము : అంతా బ్రహ్మమే అయినట్లయితే, ఈ జగత్తులో దుఃఖభోగి అయిన జీవుడు కూడా బ్రహ్మమే కావాలి. జీవ-బ్రహ్మల అభేదమువల్ల జీవుడే సృష్టికర్త అవుతున్నాడు. అప్పుడు తనకు అహితమయిన సృష్టిని జీవుడే స్వయముగా చేస్తున్నాడు అనవలసి వస్తుంది. కాని, ఇది అసంభవము. కనుక బ్రహ్మముకంటె అభిన్నమైన జీవుడిని ఆమోదించే జగత్కారణ సిద్ధాంతము సరియైనది కాదు. (సూ॥భా॥ 2-1 అధి॥7).

ఆక్షేప పరిహారము : దుఃఖితుడైన జీవుడు, బ్రహ్మ తానే అయినప్పటికీ బ్రహ్మ జీవునికంటె వేఱైవున్నది. (అధ్యా॥7-1 క) స్వరూపములో ఒకటైనప్పటికీ బ్రహ్మలో ఉన్నటువంటి శక్తి, జీవునిలో ఎప్పటికీ ఉండదు. ఇందులో సందేహానికి అవకాశము లేదు. దీని విషయములో అనేక దృష్టాంతాలు చూపించబడ్డాయి. ఉదా : విజ్ఞానశాస్త్రమును అనుసరించి వజ్రము ఇంగాలమే. (కార్బన్) బొగ్గు కూడా ఇంగాలమే. అంటే బొగ్గు వజ్రముకంటే స్వరూపములో వేఱుకాదు; అయినప్పటికీ వజ్రము బొగ్గుకంటె చాలా విలువైనది. ఇదే విధముగా, బ్రహ్మ జీవునికంటె చాలా శ్రేష్ఠము. సృష్టి-స్థితి-లయములు జీవునికంటె వేఱైన బ్రహ్మయొక్క కార్యములు; జీవునికి వీనితో ఏమీ సంబంధము లేదు. "న జగతః యథోక్త విశేషణం ఈశ్వరం ముక్త్వా అన్యతః సంసారిణో వా ఉత్పత్త్యాది సంభావయితుం శక్యమ్।" - పైన చెప్పిన విశేషణములతో కూడియున్న ఈశ్వరునికే సాధ్యము, కాని, సంసారియైన జీవునికి జగత్తుయొక్క ఉత్పత్తి మొదలైనవి ఎంతమాత్రము సాధ్యము కావు. (సూ॥భా॥ 1-1-2). "న చ గిరినదీ సముద్రాదిషు నామరూపేషు అనీశ్వరస్య జీవస్య వ్యాకరణ సామర్థ్యమస్తి।" - వివిధములైన గిరి, నది, సముద్రము మొదలైన నామరూపములను విభజించగలిగే సామర్థ్యము అనీశ్వరుడైన జీవునిలో ఎంతమాత్రము లేదు. (సూ॥భా॥ 2-4-20). ఇంతేగాక, సగుణ బ్రహ్మోపాసన చేసి అణిమాది సిద్ధులను పొందిన ముక్తజీవులకు కూడా సృష్ట్యాది కార్యములలో అధికారము

లేదు. ఈ అధికారము నిత్యసిద్ధుడైన ఈశ్వరునిది మాత్రమే- "జగదుత్పత్త్యాది వ్యాపారం వర్జయిత్వా అన్యదణిమాద్యాత్మకమ్ ఐశ్వర్యం ముక్తానాం భవితుమర్హతి। జగద్వ్యాపారస్తు నిత్యసిద్ధస్య ఈశ్వరస్యైవ।" (సూ॥ భా॥ 4-4-17). అందువల్ల ఈ ఆక్షేపము ఉచితము కాదు.

శంక : కాని, శ్రుతి ఇలా చెప్తున్నది. 'ఈ జీవాత్మ రూపంలో ప్రవేశించి నామరూప విభజన చేస్తాను' అని దేవత ఆలోచించింది. - "సేయం దేవతైక్షత అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణీతి" (ఛాం॥ 6-3-2). అందువల్ల ఈ శ్రుతి ఆధారముగా, నామరూప విభజన జీవుని కర్మ అవుతుందా?

సమాధానము: అంటే అలాగున కాదు. ఇక్కడ 'జీవాత్మరూపములో' అనేదాని సంబంధము 'అనుప్రవేశము' అనే శబ్దముతో ఉన్నది. అది 'నామరూప విభజన'తో సంబంధించి లేదు. అందువల్ల ఈ ఆక్షేపము కూడా సరియైనది కాదు.

7-4) సహకారి కారణ రాహిత్యమున ఆక్షేపము :

ఆక్షేపము : చేతనము ఏ కార్యమైనా చేయాలంటే దానికి సహకారి సామగ్రి అవసరమని మనము అనుభవముతో తెలుసుకుంటున్నాము. కుమ్మరి మట్టితో వస్తువులను తయారుచేయాలంటే దండము, చక్రము మొదలైన వాని సహకారముతో చేస్తాడు. కంసాలి సుత్తి, కూటము మొదలైన వాటి సహకారముతో ఆభరణములు చేస్తాడు. కాని, బ్రహ్మకు సృష్టిచేయడములో ఇటువంటి సామగ్రి ఏదీ లేదు. అందువలన బ్రహ్మ జగత్కారణము కాలేదు. (సూ॥భా॥ 2-1, అధి 8). (రాబోవు బ్రహ్మ ప్రకరణములో బ్రహ్మకు ఇటువంటివి ఏమీ లేవని తెలుస్తుంది.)

ఆక్షేప పరిహారము : అందరికీ సహకారి కారణముల అవసరము వుండాలని నియమము ఏమీలేదు. ఇవి లేకుండానే పనులు జరుగుతూ వుంటాయి. ఉదా : ఏ వస్తువులనైనా చూడవలసి వచ్చినప్పుడు కన్ను, ప్రకాశము, మనస్సు - వీటి మూడింటి అవసరము ఉంటుంది; అంధకారములో సంచరించే జీవులకు కన్ను, మనస్సు వుంటే చాలు. యోగులకు కేవలము మనస్సు మాత్రమే చాలు; ఎందుకంటే వారు మనోబలముతోనే అన్నీ చూస్తారు. (బృ॥ భా॥ 1-4-2).

వస్తువుల ఉత్పత్తిలో కూడా ఇదే సిద్ధాంతము వర్తిస్తుంది. రొట్టెలు తయారుచేయడానికి ఇప్పటి జనులు పీట-కఱ్ఱ ఉపయోగిస్తున్నారు. కాని, కొందరు అనుభవముతో కేవలము చేతులతోనే తయారుచేస్తారు. ఇతిహాసాలలో మనకు తెలుస్తోంది - యోగులు, దేవతలు, తపస్సిద్ధులు ఏ సహకారము లేకుండానే సృష్టులు అనేకము చేశారు. సహకారి కారణములు లేకుండానే సాలెపురుగు తన గూడును నిర్మించుకుంటుంది. ఇదేవిధంగా ఏ సహకారి కారణములు లేకుండానే బ్రహ్మ జగత్తును సృష్టించింది. ఈ విషయములో ఆక్షేపణ చేయడానికి వీలులేదు.

7-5) కరణ రాహిత్యమున ఆక్షేపము :

ఆక్షేపము : పైన చెప్పిన ఉదాహరణములవల్ల, బ్రహ్మకు సహకారి కారణముల అవసరము లేకపోయినా, జ్ఞానేంద్రియములు - కర్మేంద్రియములతో కూడిన శరీరము అవసరము. కాని, బ్రహ్మకు "అచక్షురశ్రోత్రమవాగమనః" - కళ్ళు, చెవులు, వాక్కు, మనస్సు - ఇవేవీ లేవు. (బృ॥ 3-8-8). అనగా బ్రహ్మకు శరీరమే లేదు. (సూ॥ భా॥ 2-1 అధి॥ 10). (రాబోవు బ్రహ్మ ప్రకరణ అధ్యా॥ 10-1లో బ్రహ్మకు శరీరము లేదు అని చెప్పబడినది.)

ఆక్షేప పరిహారము : బ్రహ్మకు శరీరము లేదు అని ఏ శ్రుతి చెప్తున్నదో, అదే శ్రుతి, బ్రహ్మ జగత్కారణమని కూడా చెప్తున్నది. దానిని అలాగే ఆమోదించాలి. శ్రుతిలో ఒక వాక్యమును స్వీకరించి, ఇంకొక వాక్యమును విడిచిపెట్టడము ఉచితము కాదు. ఇక్కడ "అర్ధకుక్కుటీ న్యాయము" (అనగా కోడిలో సగభాగము పిల్లలు పెట్టుటకు విభజించి మిగిలిన సగము తినుటకు ఉపయోగించడము) కుదరదు. ప్రాణులు అందరి లాగ బ్రహ్మకు కరణములు ఏవీ లేకపోయినా, అతనివల్ల జరిగిన మహాద్భుతమైన సృష్టి గురించి శ్రుతి చాలా వర్ణన చేసింది. ఈ సందర్భములో జీవుల అల్పపరిమితిపట్టి బ్రహ్మకు కూడ పరిమితి కల్పించుట సమంజసము కాదు. ఈ విషయములో అనుమానము ద్వారా ఆక్షేపము చేయడము ఉచితము కాదు. 'శరీరము లేని ఆత్మ సృష్టి చేయజాలదని చెప్పి వైశేషిక వాదమును ఖండించబడినది' (అ॥ 5-5 చూడండి.) అనగా అక్కడ వైశేషికుల పక్షములో ఆతనిని అనుమాన సిద్ధుడయిన ఈశ్వరుని, అనుమానముతోనే ఖండించటమైనది. వేదాంత మతములో బ్రహ్మను వేదప్రమాణముతోనే ఆమోదిస్తున్నాము. అందువల్ల ఈ వేదాంత మతములో వేదము ఆధారముగా దోషములు చూపబడాలి గాని అనుమానముతో చూపరాదు.

7-6) ప్రయోజన రాహిత్యమున ఆక్షేపము

ఆక్షేపము : ఏదో ఒక ప్రయోజనము ఉంటేనే చేతనమునకు కార్యములో ప్రవృత్తి కలుగుతుంది. లేకపోతే కలుగదు. ఇలా అయితే ఏ ప్రయోజనము కోసము బ్రహ్మ సృష్టి కార్యమును చేసింది? తన తృప్తికోసమే సృష్టిని చేసింది అంటే సృష్టికి ముందు అతడు అతృప్తుడు అనే అర్థము వస్తున్నది. బ్రహ్మము ఆప్తకామము. అందువల్ల పైన చెప్పినది దీనికి విరుద్ధముగా ఉన్నది. ఒకవేళ అకారణముగానే సృష్టి చేసింది అంటే, అకారణముగా కార్యములను చేసేవారిని పిచ్చివారని అనుకోవాలి. ఈ విధముగా అయితే ఈ సృష్టికార్యము పిచ్చివాని పని అని అనుకోవలసి వస్తుంది. అలా అనుకుంటే బ్రహ్మయొక్క సర్వజ్ఞత్వమునకు భంగము వస్తుంది; దీనివలన బ్రహ్మకు జగత్కారణత్వము లేదు. (సూ॥ భా॥ 2-1, అధి॥ 11).

ఆక్షేప పరిహారము : ఇది ఇలా కాదు. ముందటి కల్పములోని జీవులు, ప్రళయకాలములో తమ కర్మలతో కూడా బ్రహ్మములో కలిసిపోయారు. వారి కర్మఫలమును భోగము కోసమే బ్రహ్మ జగత్తును సృష్టించింది. అంతేగాని, తన కొఱకు కాదు. అన్ని కార్యకరణములతోను, విషయాకారములతోను పరిణమించి త్రిగుణాత్మకమైన ప్రకృతి పురుషుని భోగ-మోక్షముల కొఱకు దేహేంద్రియ రూపమును పొందింది - "ప్రకృతిశ్చ త్రిగుణాత్మికా సర్వకార్యకరణ విషయాకారేణ పరిణతా పురుషస్య భోగాపవర్గార్థ కర్తవ్యతయా దేహేంద్రియాది ఆకారేణ సంహన్యతే।" (గీ॥ భా॥ 13-0 అవతరణికా). ఆప్తకామమైన బ్రహ్మకు ఏ లాభమూ లేనప్పటికీ జీవుల కర్మఫలభోగము కోసమే సృష్టి జరిగింది. ఇందువల్ల సృష్టి నిష్కారణము కాదు; సకారణమైనదే. అందువల్ల బ్రహ్మయొక్క సృష్టి పిచ్చితనము కూడా కాదు.

7-7) వైషమ్య నైర్ఘృణ్య ఆక్షేపము

ఆక్షేపము : జగత్సృష్టిలో చాలా వైషమ్యములు (అసమానతలు) ఉన్నవి. కొందఱు జీవులు సుఖజీవనము చేసే అవకాశము వుంటుంది; పశువులు మొదలైన అనేక జీవులు చాలా దుఃఖమును పొందుతున్నాయి; ఇంక కొందఱు సుఖ-దుఃఖముల మిశ్రమకర్మను అనుభవిస్తున్నారు. ఇందువలన బ్రహ్మమునకు పక్షపాతము (వైషమ్యము) ఉన్నదని ఆరోపిస్తున్నారు. ఇంతేగాక, ప్రళయప్రారంభకాలములో అందరు జీవులు మహాదుఃఖమును అనుభవించవలసి వస్తున్నది. కనక బ్రహ్మలో కేవలము పక్షపాతమే కాక నైర్ఘృణ్యము (క్రూరత్వము) కూడా ఉన్నదని చెప్తున్నారు. ఇందువల్ల బ్రహ్మ జగత్కారణము కాదు. (సూ॥ భా॥ 2-1, అధి॥ 12).

ఆక్షేప పరిహారము : జీవుల కర్మల ఫలితముగా సుఖములో అనేక అంతరములతో సృష్టి జరిగింది. ఈ విధముగా జీవుల కర్మలే సుఖములో అంతరములకు కారణము. ఇందువల్ల బ్రహ్మకు ఈ విషయములో దోషము ఆరోపించరాదు. సాపేక్షముగానే ఈశ్వరుడు విషమసృష్టిని చేస్తున్నాడు. ఏమి అపేక్షిస్తాడు? ధర్మాధర్మములను అపేక్షిస్తాడు. అనగా, ధర్మాధర్మముల అపేక్షతో చేసిన సృష్టిలో విషమత్వము ఉంటూనే ఉంటుంది; ఇది ఈశ్వరుని అపరాధము కాదు - "సాపేక్షో హి ఈశ్వరః విషమాం సృష్టిం నిర్మిమీతే। కిమపేక్షతే ఇతి చేత్ ధర్మాధర్మౌ అపేక్షతే। అతః, సృజ్యమాన ప్రాణి ధర్మాధర్మాపేక్షా విషమా సృష్టిః, ఇతి నాయం ఈశ్వరస్య అపరాధః।" (సూ॥ భా॥ 2-1-34). అన్ని వేదాంతాల్లో ఈశ్వరుని "సృష్టి నిర్మాత" అని చెప్పారు. తమతమ కర్మలను అనుసరించి జీవులను ఈశ్వరుడు సృష్టిస్తున్నాడు. ఇది అతని 'ఫలప్రదత్వము'- "సర్వ వేదాంతేషు చ ఈశ్వరహేతుకా ఏవ సృష్టయో వ్యపదిశ్యంతే। తదేవ చ ఈశ్వరస్య ఫలహేతుత్వం యత్ స్వకర్మానురూపాః ప్రజాః సృజతీతి ।" (సూ॥ భా॥ 3-2-41) ఉదా : పనిచేసేవారికి వారి వారి పనులకు సరిపడిన వేతనము ఇస్తారు. కాని అందరికీ సమానముగా వేతనము ఇవ్వడము సమంజసము కాదు. ఆ విధముగానే అనేక విచిత్ర కర్మలతో కూడివున్నందు వలన సమాన సృష్టి చేయడము అనేది సమంజసము కాదు. ప్రళయము కూడా సమష్టి కర్మానుసారమే జరుగుతుంది. అందువల్ల ఈ ఆక్షేపమునకు ఆధారము లేదు.

7-8) వైలక్షణ్యము యొక్క ఆక్షేపము

ఇది రెండు భాగములు.

ఆక్షేపము (1): కార్యము నష్టమైనప్పుడు ఉపాదానముతో కలసి పోతుంది. అనగా ప్రళయ సమయములో జగత్తులోని అన్ని వైలక్షణ్యములు బ్రహ్మలో కలిసిపోతున్నాయి. అందువల్ల ఆ సమయములో బ్రహ్మ స్వరూపమే చెడిపోతుంది. అందువల్ల బ్రహ్మ జగత్కారణము కాజాలదు. (సూ॥ భా॥ 2-1-4)

ఆక్షేప పరిహారము : ఆభరణములు బంగారములో లీనమైనప్పుడు, వాని వికారములు బంగారమునకు వర్తించవు. అలాగే, ఏ కార్యములయినా తమ ఉపాదానములో లీనమైనప్పుడు దానిని చెడగొట్టవు; ఇదికాక, స్థితికాలములో కూడా దానిని దోషయుక్తము చేయవు. ఆభరణములలో చిన్నది, పెద్దది, వదులైనది, తయారు చేయబడినది, విరిగి పోయినది మొదలైన వైలక్షణ్య దోషములు ఉన్నవి; కాని, ఇవి బంగారమునకు లేవు. బంగారమును చిన్నది, పెద్దది, తయారుచేయబడినది, విరిగిపోయినది అని ఆభరణరూపముగా ఉన్నప్పుడు కూడా ఎవ్వరూ చెప్పరు. స్వేదజములు, ఉద్భిజ్జములు, అండజములు, జరాయుజములు అని నాలుగు విధములైన శరీరములు ఎంతోకాలముగా తమకు కారణమైన పృథివిలో లయమవుతున్నప్పుడు కూడా పృథ్వి చెడలేదు. ఇది ఉపాదాన కారణము యొక్క లక్షణము. (అధ్యా॥ 5-2). ఇందువల్ల జగత్తు లయమైనప్పుడు బ్రహ్మము వికారమును పొందదు.

ఆక్షేపము (2) : బ్రహ్మ చేతనము కనుక అతడు 'నిమిత్తకారణ'మని ఆమోదిస్తున్నాము. కాని, జడమైన జగత్తుకు అది ఉపాదాన కారణము కాజాలదు. ఎందుకనగా, చేతనము నుండి దానికి విరుద్ధమైన జడ జగత్తు ఉత్పత్తి కావడము అసంభవము. కార్యము తన కారణముతో విలక్షణముగా వుండదు. కారణములో వున్న గుణములే కార్యములో అనుగతముగా ఉంటాయి. కాని, కార్యజగత్తులో కారణబ్రహ్మ లక్షణములు లేవు. ఇందువల్ల బ్రహ్మ జగత్తుకు ఉపాదానము కాదు. (సూ॥ భా॥ 2-1, అధి.3).

ఆక్షేప పరిహారము : ఈ ఆక్షేపమును మూడు విధములుగా విభజించవచ్చు.

అ) బ్రహ్మలో ఉండే అన్ని లక్షణములు జగత్తులో అనుగతముగా లేవు. అందువల్ల అది ఉపాదానము కాదు.

ఆ) ఏ ఒక్క బ్రహ్మ లక్షణము కూడా జగత్తులో కనపడుట లేదు. అందువల్ల అది ఉపాదానము కాదు.

ఇ) బ్రహ్మలోని చైతన్య లక్షణము జగత్తులో అనుగతముగాదు. అందువల్ల అది ఉపాదానము కాదు.

ఇందులోని ప్రతి ఒక్క ఆక్షేపమునకు సమాధానము ఈ విధముగా ఉన్నది.

అ) కారణములోని అన్ని లక్షణములు ఒకవేళ కార్యములో ఉన్నట్లయితే, కార్యమునకు కారణమునకు అంతరము ఏమీ వుండదు. ఇలా అయితే, కార్యము తన అస్తిత్వమును ప్రకటించుకొనజాలదు. అందువల్ల కారణములోని అన్ని లక్షణములు కార్యములోకి రావడము సంభవము కాదు. ఈ ప్రకారము కారణబ్రహ్మలోని అన్ని లక్షణములు జగత్తుకు వుంటే జగత్తుకు బ్రహ్మకు భేదము ఏమీ ఉండదు; జగత్సృష్టి అనేదే జరుగదు. ఇందువల్ల ఈ ఆక్షేపము న్యాయసంగతము కాదు.

ఆ) బ్రహ్మయొక్క ఒక్క లక్షణము కూడా జగత్తులో ప్రకాశించుట లేదు – ఈ ఆక్షేపములో కొంత సత్యము ఉన్నది. ఒకవేళ కారణములోని ఏ ఒక్క లక్షణమూ కార్యములో ఉండకపోతే కారణత్వము సిద్ధము కాదు. ఉదా : పానకము ఒక కార్యము; నీరు, పంచదార దానికి ఉపాదానములు. పానకములో నీటి లక్షణము స్పష్టముగా తెలుస్తున్నది. అందువల్ల నీరు ఉపాదానమని ప్రత్యక్షముగా తెలుసుకోగలము. కాని, పంచదార అనే వస్తుయొక్క స్పర్శ ఇసుక లాగ త్వక్కుకుగాని, దాని తెల్లదనము నేత్రమునకుగాని తెలియవు. అప్పుడు పానకమునకు ఉపాదానము పంచదార అవునా? కాదా? అని తెలుసుకోలేము. (ఛాం॥ 6-13-2). కాని, పంచదార యొక్క తియ్యదనము అనుభవమునకు రాగానే దాని ఉపాదానత్వమును ఒప్పుకుంటాము. (ఛాం॥ 6-13-1). ఇదే ప్రకారము, బ్రహ్మముయొక్క ఏదో ఒక లక్షణము జగత్తులో అనుస్యూతమవడము అవసరము. అయితే, బ్రహ్మములోని ఏ లక్షణము జగత్తులో ఉన్నది అని ప్రశ్న.

దానికి సమాధానము ఇలా చెప్పవచ్చు: బ్రహ్మ ఒక నిశ్చిత రూపముతో **'ఉన్నది'**; కాని, జగత్తు పరిణామశీలమై **'ఉన్నది'**. బ్రహ్మము జ్ఞానస్వరూపమై **'ఉన్నది'.** కానీ జగత్తు జడమై **'ఉన్నది'**. ఇలా వర్ణించబడుటవల్ల **'ఉన్నది'**. (అస్తిత్వము లేక సత్త) అనే కారణబ్రహ్మ లక్షణము కార్యజగత్తులో అనువర్తిస్తుంది. "బ్రహ్మణో¬పి సత్తాలక్షణః స్వభావః ఆకాశాదిషు అనువర్తమానో దృశ్యతే।" – సత్తారూపమైన బ్రహ్మ లక్షణము ఆకాశాది భూతములలో అనుగతముగా కనపడుతున్నది. (సూ॥ భా॥ 2-1-6). "బ్రహ్మ స్వరూప అనుగమాయ చ ఆకాశాది అన్నమయాంతం కార్యమ్।" – ఆకాశాది భూతముల నుండి అన్నమయాది (స్థూలశరీరము) శరీరములవరకు కార్యములో బ్రహ్మ స్వరూపము అనువర్తిస్తూనే ఉన్నది. ఇందువలన బ్రహ్మముయొక్క ఏ ఒక్క లక్షణమూ జగత్తులో లేదనే ఆరోపణము సరిగ్గా లేదు.

ఇ) జగత్తు బ్రహ్మయొక్క కార్యమని ఆమోదిస్తే, బ్రహ్మయొక్క చైతన్య లక్షణము జగత్తులో ప్రకాశించాలి. కాని, అలా ప్రకాశించడము లేదు; ఇది మూడవ ఆరోపణ. దీనికి మా ప్రత్యాక్షేపము – చైతన్యగుణము కార్యములో ఉండాలన్న నియమము ఎలా వచ్చింది? ఎలాగైతే పానకములో పంచదారయొక్క స్పర్శగుణము లేనప్పటికీ పంచదారయొక్క ఉపాదానత్వము తెలియబడుతున్నదో అదే విధముగా జగత్తులో బ్రహ్మముయొక్క చైతన్యలక్షణము లేకపోయినప్పటికీ బ్రహ్మయొక్క ఉపాదానత్వము దాని సత్తా లక్షణము ద్వారా తెలియబడుతున్నది. ఈ విధముగా పై ఆక్షేపము అర్థము లేనిది.

(7-9) చేతనము నుంచి జడమా?

జ్ఞానరూపమైన బ్రహ్మనుండి జడ జగత్తు ఉత్పత్తి ఎలా జరుగుతుంది? అనే సందేహము ఉండనే ఉంది. అందువల్ల శ్రుతి ఆధారముతో జ్ఞానస్వరూపమైన బ్రహ్మను జడమైన జగత్తుకు ఉపాదానమని ఆమోదించినప్పటికీ దానిమీద విశ్వాసము కలుగుట కష్టము. కారణమైన దానినుండి దానికి విరుద్ధకార్యము ఎలా సంభవిస్తుంది? అనే ప్రశ్న అందరి మనస్సులలో కలుగుతుంది. దీనికి ఆధునిక విజ్ఞానములోని అందరికీ తెలిసిన ఒక దృష్టాంతముతో సమాధానమును చెప్పవచ్చు. విజ్ఞాన దృష్ట్యా, నీటికి ఉపాదానము ఉదజని (హైడ్రోజన్) అనే ఒక వాయువు, మరియు ఆమ్లజని (ఆక్సిజన్) అనే ఒక వాయువు. ఇందులో ఉదజని అగ్నిస్పర్శ కలగగానే మండే వాయువు. రెండవదైన ఆమ్లజని మంటను ఎక్కువ చేసే గుణము కలది. కాని, వాటి కార్యమైన నీటిలో రెండు గుణములలో ఒకటి కూడా కనపడడము లేదు. మండే వస్తువును నీటిలో వేస్తే ఆరిపోతుంది. ఈ దృష్టాంతములో ఉపాదానములో లేని ద్రవత్వము నీటిలో ఉన్నది. ఉపాదానములో ఉన్నటువంటి జ్వలించే తత్త్వము నీటిలో లేదు. అంతేగాక అగ్నిని ఆర్పివేసే విరుద్ధ స్వభావమైన గుణము కూడా నీటిలో ఉన్నది. దీనివల్ల తెలుస్తున్నది ఇది: కార్య కారణములలో ఒకదానిలో ఉన్న గుణము రెండవదానిలో లేకపోవచ్చు, దానికి విరుద్ధ గుణములు కూడా వుండవచ్చు. ఇందులో ఆశ్చర్యము ఏమీలేదు. ఇదే విధముగా జ్ఞాన స్వరూపమైన బ్రహ్మము ద్వారా జడ జగత్తు నిర్మించబడినది; ఇలా శ్రుతి చెప్పినదానిలో విరోధము లేదు.

7-10) సావయవత్వము యొక్క ఆక్షేపము

ఆక్షేపము : శ్రుతి జగత్తును వర్ణిస్తూ బ్రహ్మయొక్క మహత్వమును ఈవిధముగా చెప్తున్నది. "ఏతావానస్య మహిమా, అతో జ్యాయాంశ్చ పూరుషః పాదోఽస్య సర్వా భూతాని త్రిపాదస్యామృతం దివి।" - అతని మహిమ ఇంత గొప్పది; పురుషుడు దీనికంటే (జగత్తు) చాలా గొప్పవాడు. సర్వభూతములు ఇతని ఒక పాదము మాత్రమే! మిగిలిన మూడు పాదములు ద్యులోకములో వున్నవి. (ఛాం॥ 3-12-6). అనగా బ్రహ్మయొక్క ఒకపాదము (4వ భాగము) జగత్తుగా పరిణమించినది; బ్రహ్మ జగత్తుకంటె చాలా పెద్దది. ఇలా నాలుగు భాగాలుగా ఉన్న బ్రహ్మను, శ్రుతి ఇంకొక చోట 'నిరవయవ' మని వర్ణించింది. ఈ రెంటిని సమన్వయము చేసి బ్రహ్మ జగత్కారణము అని నిర్ణయించడము అసాధ్యము. అందువలన బ్రహ్మను జగత్కారణము అని చెప్పే సిద్ధాంతము యుక్తియుక్తము కాదు (సూ॥ భా॥ 2-1, అధి॥ 9).

ఆక్షేప పరిహారము : బ్రహ్మే జగత్తు అయి ఉన్నది; జగత్తుకంటె ఎక్కువగా కూడా ఉన్నది - ఇలా చెప్పే సమయంలో **'అయి ఉన్నది', 'ఎక్కువగా కూడా ఉన్నది'** అనే శబ్దములకు అర్థము తెలుసుకుంటే సమస్య తేలిక అవుతుంది. దీనిని బంగారము అంగుళీయకము అనే దృష్టాంతముతో అవగాహన చేసుకోగలము. ఉదా: బంగారములో అంగుళీయకము అనే ఆకారము కనపడుతున్నది. ఆకారము వున్నా అది బంగారము మాత్రమే; ఆకారము లేకపోయినా బంగారమే! ఆకారముతో బంగారములో భేదము ఏమీ రాలేదు. ఏ సంఖ్యను ఒక్కటితో చేర్చినా, తీసివేసినా, అది మారలేదో ఆ సంఖ్య శూన్యము (సున్న) కదా! అదే విధంగా ఆకారమును బంగారములో చేర్చినా, తీసివేసినా బంగారము మారదు; అనగా ఎప్పుడూ ఉన్న బంగారము ఒకటి అనే సంఖ్య అయితే దాని సాపేక్షముగా వచ్చి పోయే ఆకారము శూన్యము. అందువల్ల ఇంకా ఆకారముకన్న బంగారము పెద్దది. 'బంగారము అంగుళీయకముగా అయి ఉన్నది; దానికంటె పెద్దదిగా కూడా ఉన్నది.' అని చెప్పినందువల్ల బంగారములో ఒక భాగము అంగుళీయకముగా

ఉన్నది, మిగిలిన భాగము యథాతథముగా ఉన్నది – అని భావించరాదు. ఒకవేళ అలా అర్థము చేసుకున్నట్లయితే, అంగుళీయకము యొక్క ఆకారము పోయిన తరువాత బంగారముయొక్క పరిమాణము తగ్గిపోవలసి ఉంటుంది, కాని అలా జరగడము లేదు. ఈ దృష్టాంతముతో దార్ష్టాంతికమును వివరిస్తున్నారు. ఛాందోగ్య శ్రుతివాక్య ప్రకారము బ్రహ్మ జగత్తుగానూ అయి ఉన్నది, జగత్తుకన్న పెద్దదిగానూ అయివున్నది. ఇది (అధ్యా॥ 6–5 క) యుగళవాక్యమున రూపాంతరము. బ్రహ్మములో ఒక భాగము జగత్తు – మిగిలిన భాగములు యథాతథముగా ఉన్నవి అని ఆ శ్రుతి వాక్యమునకు అర్థము చెప్పరాదు. అలా చెప్తే బ్రహ్మకు అవయవములు ఉన్నవి అనే అర్థము వస్తుంది కనక ఆ విధంగా చెప్పరాదు. ఎందుకనగా అది నిరవయవము; ముందు రాబోయే దాని (అ॥ 7–12)లో దీనిని ఇంకా స్పష్టము చేశారు.

7–11) ఎవరి సిద్ధాంతమును ఆమోదించాలి?

ఆక్షేపము : సాంఖ్యము, యోగము మొదలైన స్మృతులకు వేదాంత సిద్ధాంతము విరుద్ధముగా వుంటుంది. ఈ స్మృతులన్నీ మహాపురుషులు వ్రాశారు. సాంఖ్యశాస్త్రమును వ్రాసిన కపిలుడు నారాయణుని అవతారమని భావిస్తారు. వారు వ్రాసిన సాంఖ్య శాస్త్రమును ప్రమాణముగా భావిస్తే బ్రహ్మను జగత్తుకు కారణముగా స్వీకరించలేము.

ఆక్షేప పరిహారము : పైవిధంగా చెప్పడము ఉచితముగా లేదు. మనువు, వ్యాసులు, ఆపస్తంబులు మొదలైన మహాత్ములందరూ తమ స్మృతులలో బ్రహ్మ కారణత్వమునే వ్రాశారు. సాంఖ్య స్మృతి కర్త కపిలుడిని అందరూ నారాయణ అవతారమని ఆమోదించలేదు. ఇతిహాసములో అనేకమంది 'కపిలు'లు ఉన్నారు. అందువల్ల ఈ సిద్ధాంతమును ఆమోదించవలసిన అవసరము లేదు. శ్రుతి సమ్మతమైన సిద్ధాంతమును ఆమోదించక తప్పదు. ఏ స్మృతులు వేదబాహ్యములో అవి నిరర్థకములు. "యావేదబాహ్యాః స్మృతయః సర్వాస్తా నిష్ఫలాః॥" (మనుస్మృతి 12:25). స్మృతులలో ఏ అంశములు వేదవిరుద్ధము కావో వాటిని మాత్రము ఆమోదించాలి. ఒక వేళ అది ఇతర స్మృతులకు విరుద్ధమైనప్పటికీ, దానినే అంగీకరించాలి. అయితే శ్రుతికి విరుద్ధమయిన స్మృతులు స్వీకరించే యోగ్యత లేనివి – అని జైమిని మహర్షి చెప్పాడు. మూలము తెలియని స్మృతులు శ్రుతికి విరోధము కానప్పుడు – దానికి మూలము శ్రుతి మాత్రమే అని అనుమానించ వస్తుంది– శ్రుతి – "విరోధేత్వనపేక్షం స్యాదసతిహ్యనుమానమ్।" (జైమిని సూ॥ 1–3–3).

7–12) ఉపాధి : కార్య – కారణ – అనన్యత్వ వాదముతో పైన చెప్పిన ఆక్షేప సమాధానములలో కొంత జటిలత ఉన్నది. దానిని 'ఉపాధి' అనే పారిభాషిక శబ్ద ప్రయోగము ద్వారా సులభముగా అవగాహన చేసుకోవచ్చు.

1) అంగుళీయకము అనే ఆకారము బంగారమును గుర్తించుటకు సహకారి. 'అంగుళీయక' శబ్దము ఒక నామధేయము. అంగుళీయకము ద్వారా బంగారము గమనించబడుతోంది; ఇలా గమనించినప్పటికీ బంగారము యొక్క జ్ఞానము పూర్తిగా స్వతంత్రము. బంగారము అంగుళీయకము ద్వారా మాత్రమే గుర్తింపబడటము లేదు. ఆ జ్ఞానము కంకణముల ద్వారా గాని, మాలల ద్వారా గాని, ఇంకే ఆభరణముల ద్వారానైనా గాని కలుగగలదు. ఈ విధంగా బంగారమున భాగము కాకుండా బంగారమును ప్రత్యేకించి తెలియజేసే అంగుళీయకము బంగారమునకు 'ఉపాధి' అంటారు. అనగా, ఒక వస్తువులోని భాగము కాక, ఆ వస్తువును వేఱుగా తెలియజేసే ఇంకొక వస్తువును, మొదటి వస్తువుయొక్క 'ఉపాధి' అంటారు. అది

తెలుసుకొనబడే వస్తువుకు (ఉప) దగ్గరగా వుంటూనే, దానిలో తన ధర్మమును (అధి) ఆరోపించి చూపిస్తున్నది కనుక అది 'ఉపాధి' అవుతుంది.

2) అంగుళీయకము బంగారముతో కలిసి ఉన్నట్టు ఉపాధులు ఎప్పుడూ వస్తువుతో కలిసే వుండాలని నియమము ఏమీ లేదు. విడిగా కూడా ఉండవచ్చు. ఉదా : స్ఫటిక లింగము తనకు తానుగా ఉన్నప్పుడు కనపడదు. ఒక ఎఱ్ఱని పుష్పము దాని వెనక ఉంచినప్పుడు దాని అస్తిత్వమును తెలుసుకోగలము. అంటే ఎరుపురంగు ద్వారా స్ఫటికలింగమును తెలుసుకొంటాము. ఎర్రని పుష్పము లింగమునకు 'ఉపాధి'. దాని సంబంధము వల్ల అది ఎఱ్ఱగా కనపడినప్పటికీ నిజముగా అది ఎర్రగా లేదు; ఎందుకంటే నీలపుష్పమును దాని దగ్గర ఉంచితే నీలముగా కనపడుతుంది. ఇలా ఒకే లింగము అనేక ఉపాధుల ద్వారా వివిధ వర్ణములుగా కనపడడమువల్ల అది పారదర్శకమైన స్ఫటిక లింగము అని స్పష్టమవుతున్నది. కళ్ళకు లింగము కనపడనప్పటికీ, బుద్ధివల్ల దానిని స్ఫటికము అని తెలుసుకుంటున్నాము.

స్ఫటికలింగము యొక్క జ్ఞానము మనకు ఉపాధి వల్ల కలుగుతోంది. ఉపాధి ప్రయోజనము ఇదే. అయితే ఉపాధి విషయంలో జాగరూకతతో ఉండాలి: మనకు కనిపించని లింగమును కనుపింపజేస్తున్నది అనే ప్రయోజనము ఉపాధి వల్ల ఉన్నది. అయితే వేఱే విధముగా కనుపింపచేసే ప్రమాదము కూడా దీనివల్ల ఉన్నది. ఇందువల్ల వస్తువును గుర్తించిన తరువాత వస్తు స్వరూపమును నిర్ణయించేటప్పుడు ఉపాధిని విడిచిపెట్టాలి.

3) పైన రెండు విధములైన 'ఉపాధు'లను గురించి చర్చించాము (క). బంగారమును తెలిపే అంగుళీయకము (ఖ). స్ఫటిక లింగమును చూపగలిగే రంగుపువ్వు. దీనికి కారణము ఇది: మన మొదటి ధ్యేయము - బ్రహ్మమును గుర్తించుట, రెండవది బ్రహ్మ స్వరూపమును నిశ్చయించుట. శ్రుతిని అనుసరించి బ్రహ్మ జగత్కారణము - నిర్విశేషము కూడా! దానిని నేరుగా తెలుసుకోలేము. ఎలాగైతే అంగుళీయకము ద్వారా బంగారమును గుర్తిస్తున్నామో అలాగే జగద్వికారముల ద్వారా కార్య-కారణ సంబంధముతో బ్రహ్మను గుర్తిస్తున్నాము. ఇలా తెలుసుకో గలుగుతున్న బ్రహ్మను 'సవిశేషము' అంటున్నాము. కాని శ్రుతిని అనుసరించి చెప్పినప్పుడు అది నిర్విశేషమే. అందు ఈ సవిశేషత్వమును నిరాకరించడము కోసము స్ఫటిక లింగము - రంగుల పువ్వు మొదలైన దృష్టాంతములు సహకరిస్తాయి. (అధ్యా. 10-4 చూడండి).

పై ఆలోచనలో జాగర్తగా తెలుసుకోవలసిన విషయము: (7-12)

ఉపాధి వస్తువుతో కలిసి ఉన్నట్లు తోచినా కలిసిలేదు.

వస్తువులో కనబడినప్పటికీ వస్తువులో లేదు.

4) అంగుళీయక ఉపమానముననుసరించి, జగత్తుయొక్క నామరూపము బ్రహ్మకు ఉపాధి. వాటి ద్వారానే బ్రహ్మను గుర్తించగలుగుతున్నాము. అవి లేకపోతే గుర్తించలేము. బ్రహ్మ జగద్రూపమును ధరించక పోతే దాని స్వరూపము మనకు తెలియబడేది కాదు. "యది హి నామరూపే న వ్యాక్రియేతే తదా అస్యాత్మనో నిరుపాధికం రూపం ప్రజ్ఞానఘనాఖ్యం న ప్రతిఖ్యాయేత (బృ॥భా॥ 2-5-19). అందువల్ల మనము నామ, రూపములకు కృతజ్ఞులమై వుండాలి. అయితే నామ రూపములతో గుర్తించే బ్రహ్మమునే బ్రహ్మ స్వరూపముగా అనుకోకూడదు. అది కేవలము బ్రహ్మయొక్క బాహ్యస్వరూపము మాత్రమే. శాస్త్ర ప్రమాణములతో ఇంకా చక్కగా పరిశీలన చేసి కనపడే బాహ్య స్వరూపమును విడచి, బ్రహ్మ నిజస్వరూపమును నిశ్చయించాలి.

ఉపాధి ద్వారా అయ్యే లాభముగాని ప్రమాదము గాని మనకే, బ్రహ్మకు కాదు. బ్రహ్మకు దానివల్ల అంతరము ఏమీ ఉండదు. జగత్తులో బ్రహ్మ ఉన్నప్పటికీ బ్రహ్మలో జగత్తు లేదు. బ్రహ్మ యొక్క ఈ స్వరూపమే దాని చమత్కారము; యోగము, సంపత్తి, వైభవము కూడా!– "మత్స్థాని సర్వభూతాని, న చ మత్స్థాని భూతాని, పశ్యమే యోగమైశ్వరమ్! (గీ|| 7–4–5). ఈ విషయమును చక్కగా తెలుసుకొంటే వెనుక (అ|| 7–8–1), (అ|| 7–10 లలో) ఇచ్చిన సమాధానములను తేలికగా ఇలా చెప్పవచ్చు : "జగత్తు యొక్క వైలక్షణ్యము త్రికాలములలో కూడా బ్రహ్మను ఏ విధముగానూ బాధించదు", "బ్రహ్మ జగత్తుగా అయిన జగత్తును అధిగమించి కూడా ఉన్నది" అనే వాక్యముల అర్థము "జగత్తు బ్రహ్మకు ఉపాధి" అని.

ప్రశ్నలు :

1. ఏ శ్రుతివాక్య ఆధారముతో కార్య–కారణముల అనన్యత్వము స్థాపించబడుతున్నది?
2. భోక్తృ–భోజ్య అభేదము యొక్క ఆరోపము ఏ ప్రకారము నిరాకరణ చేయబడుతున్నది?
3. హితాకరణ ఆక్షేపము ఏమిటి? దానిని ఏ విధముగా ఎదుర్కొన్నారు?
4. 'జగత్సృష్టికి బ్రహ్మ దగ్గర సహకారి కారణములు లేవు. అందువల్ల బ్రహ్మ జగత్కారణము కాలేదు.' ఈ ఆక్షేపమునకు సమాధానము ఏమిటి?
5. 'బ్రహ్మకు అవయవములు లేవు కనుక జగత్కారణము కాలేదు' – ఈ ఆక్షేపమునకు సమాధానము ఏమిటి?
6. ప్రయోజన రాహిత్య, ఆక్షేపములో సారము ఏమిటి?
7. 'బ్రహ్మకు పక్షపాతము వున్నది, నైర్ఘృణ్యము కూడా ఉన్నది' ఈ ఆక్షేపము న్యాయ సంగతమా, కాదా?
8. 'లయము అవడమువల్ల కార్యము తన ధర్మంతో కారణమును దూషితము చేయదు' ఎలా?
9. వైలక్షణ్యమునకు అంతర్గతముగా మూడు ఉపప్రశ్నలు ఏమిటి? వాటికి సమాధానము ఏమిటి?
10. 'చేతన బ్రహ్మ నుండి జడ జగత్తు పుట్టడానికి ఏమీ ఆటంకము లేదు' దీనికి దృష్టాంతము ఏమిటి?
11. 'బ్రహ్మ జగత్తు అయినది కూడా; జగత్తుకంటె అధికము కూడా!' దీనిని స్పష్టము చేయండి.
12. స్మృతి సిద్ధాంతమును ఎప్పుడు ఒప్పుకోవాలి? ఎప్పుడు ఒప్పుకోకూడదు?
13. ఉపాధి అంటే ఏమిటి? దానివల్ల లాభము ఏమిటి? హాని ఏమిటి?
14. 'కారణము 'ఒకటి' అయితే వికార శూన్యము' దీని అర్థము ఏమిటి?
15. 'ఉంగరము – బంగారము, పారదర్శక లింగము – పుష్పము' ఈ రెండు దృష్టాంతముల ఆవశ్యకత ఏమిటి?
16. 'ఉపాధి ద్వారానే బ్రహ్మను గుర్తించగలము' దీనికి దృష్టాంతము ఏమిటి?

అధ్యాయము - 8

మాయ

క్రిందటి అధ్యాయములో బ్రహ్మమే జగత్తుకు అభిన్ననిమిత్త ఉపాదాన కారణమని చెప్తూ, దానికి విరోధి ఆక్షేపములకు సమాధానము కూడా చెప్పడమైనది. ఇప్పుడు జగత్తు యొక్క సృష్టి-స్థితి-లయముల క్రమమును చెప్పవలసి ఉన్నది. ఇది చాలా కఠినమైన పని, పూర్వము చెప్పిన కార్యము (నీరు) మరియు కారణము ఉదజని, ఆమ్లజని దృష్టాంతముతో, ఈ జగత్ స్వరూప విచారణను ప్రారంభము చేస్తున్నాము.

8-1. ఒక దృష్టాంతము

జ్వలనము అనిలత్వము కలిగిన ఉదజని (హైడ్రోజన్) ఆమ్లజని (ఆక్సిజన్) - ఇవి ఈ లక్షణములు లేని నీటికి ఉపాదానములు. కాని, అవి తమ అనిలత్వము, జ్వలనము అనే లక్షణములను దాచిపెట్టుకుని కార్యరూపమైన నీరుగా ప్రకటింపబడడానికి, విద్యుత్తు యొక్క సహాయము అవసరము. ఇది భౌతిక శాస్త్రము నిశ్చయించిన విషయము. ఇదే విధముగా కార్యమునకు దానికి విలక్షణములైన కారణములతో సంబంధము చెప్పే ఏ శాస్త్రములయినా, కారణముతో పాటుగా ఏదో ఒక విశేషశక్తిని గూర్చి కూడా చెప్తున్నవి. ఉదా: కర్మకు, తద్విలక్షణమైన దాని ఫలమునకు మధ్య 'అపూర్వము' అనే ఒక తత్త్వము మీమాంసకులు ఉన్నదని అంటున్నారు. విద్యుత్తు కానీ, అపూర్వము కానీ శాస్త్రజ్ఞుల కల్పనామాత్రము కాదు, ఇవి వాస్తవికమైనవి.

8-2. మాయ అంటే ఏమిటి?

బ్రహ్మను జగత్కారణముగా స్థాపించిన వేదాంత శాస్త్రములో కూడా ఇలా ఉన్నది. జ్ఞాన స్వరూపము, దేశకాలములకు అతీతము, కర్మరహితము, అకర్త అయిన బ్రహ్మ - తద్విలక్షణముగా జడము, దేశకాలములచే పరిమితము, కర్మసహితము అయిన జగత్తుకు కారణమైనది. అందువల్ల బ్రహ్మలో కూడా ఏదో ఒక విచిత్రశక్తి ఉన్నదని అంగీకరించవలసి వున్నది. **ఇలా బ్రహ్మస్వరూపమును దాచిపెట్టి, ప్రకారాంతములో బ్రహ్మమునే చూపించే బ్రహ్మశక్తిని "మాయ" అంటారు.** "మాయా నామ బహిరన్యథా ఆత్మానం ప్రకాశ్య, అన్యథైవ కార్యం కరోతి సా మాయా" (ప్ర॥భా॥ 1-16) (సంసారులలో 'వంచన' రూపముగా వున్నదానిని, భాష్యకారులు 'మాయ'గా వర్ణించిన వ్యాఖ్యతో శక్తిరూపమైన ఈ 'మాయ'ను కూడా తెలుసుకోవచ్చు. ఎందుకనగా తమ అధిష్ఠానమును వేఱు రూపముతో చూపడమనేది రెండింటిలో సమానముగా వున్నది.) ఈ మాయను ఆమోదించకపోతే పరమేశ్వరునిలోని స్రష్టృత్వము ప్రకటింపబడదు- "న హి తయా వినా పరమేశ్వరస్య స్రష్టృత్వం సిధ్యతి, శక్తి రహితస్య తస్య ప్రవృత్త్యనుపపత్తేః" (సూ॥భా 1-4-3). పరమేశ్వరునికి తన రూపములో ఉదాసీనత - మాయను ఆశ్రయించి ప్రవర్తకత్వము ఉంటుంది - "పరమాత్మనః స్వరూపవ్యపాశ్రయం ఔదాసీన్యం, మాయా వ్యపాశ్రయం చ ప్రవర్తకత్వం" (సూ॥భా॥ 2-2-7). ఈ విధముగా కారణరూప బ్రహ్మకు, కార్యరూప జగత్తుకు మధ్యలో మాయాశక్తిని అంగీకరించినప్పటికీ ఆ మాయాశక్తి బ్రహ్మమే. దీని విషయము (అ॥ 6-5(6)లో ఇలా చూడవచ్చు." ఎందుకనగా సృష్టికి పూర్వము బ్రహ్మము మాత్రమే ఉన్నది.

8-3. మాయా శబ్ద పర్యాయములు

'మాయా' శబ్ద ప్రయోగము శ్రీశంకరాచార్యులతోనే ఆరంభమైనదని కొందరు అంటారు. ఇది సరియైనది కాదు, శ్రుతి-స్మృతులు కూడా ఈ శబ్ద ప్రయోగముతోనే బ్రహ్మ-శక్తిని బోధిస్తున్నవి. "ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" - ఇంద్రుడు (బ్రహ్మ) తన మాయలతో అనేక రూపములుగా కనిపిస్తాడు. (బృ॥ 2-5-19) మాయాం తు ప్రకృతిం విద్యాత్, మాయినం తు మహేశ్వరమ్" - ప్రకృతిని మాయగా, పరమేశ్వరుని మాయావిగా తెలుసుకోవలసి ఉన్నది. (శ్వే॥ 4-10). "దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా"- గుణమయమైనది నా యొక్క దైవీమాయ (గీ॥ 7-14). ఇటువంటి పూజనీయమైన మాయను కొన్ని పురాణములలో పరమాత్ముడనే వర్ణించారు. ఇందువల్లే స్త్రీల పేరు 'మాయ' అని వుంటుంది. దీనినే ప్రకృతి, వైష్ణవ మాయ. మూల ప్రకృతి, ఆకాశము, అక్షరము, అవ్యక్తము మొదలైనవిగా తలుస్తారు. వైష్ణవీం స్వాం మాయాం మూల ప్రకృతిం వశీకృత్య!" - తన వైష్ణవీమాయగా వున్న మూల ప్రకృతిని వశము చేసుకుని (గీ॥భా॥ అవతరణిక) "ఏ తస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చ" - ఓ గార్గీ! ఈ అక్షరములోనే ఆకాశము నిండి వున్నది. (బృ॥ 3-8-11). "అక్షరాత్ పరతః పరః" -పరమైన అక్షరమునకంటె పరమైనది. (ముం॥ 2-1-2) అక్షరుడు నశించనివాడు. జగత్తు వలె నశించేవాడు కాదు. "మహతః పరమ్ అవ్యక్తమ్" మహత్తుకంటే పరమైనది అవ్యక్తము. (కఠ॥1-3-10).

8-4. 'అపరా ప్రకృతి'-'పరాప్రకృతి'

అపరా ప్రకృతి-పరాప్రకృతి అని రెండు విధములుగా మాయను భగవానుడు వర్ణించాడు. (గీ॥ 7-4-5). అపరాప్రకృతి వేషములో కనపడే బ్రహ్మమే జగత్తు - పరాప్రకృతి వేషములో కనపడే బ్రహ్మమే జీవుడు. అపర అనగా శ్రేష్ఠము కానిది, పర అనగా శ్రేష్ఠమైనది. ఈ పరాప్రకృతి సమస్త జగత్తును ధరిస్తున్నది. మాయా ఉపాధితో గుర్తింపబడుతున్న బ్రహ్మమే ఈశ్వరుడు, అపరబ్రహ్మ, హిరణ్యగర్భుడు అని పిలువబడుతున్నది.

పంచ తన్మాత్రలు, సమష్టి మనసు, సమష్టి బుద్ధి, సమష్టి అహంకారము - ఈ ఎనిమిది తత్త్వములతో కూడినది అపరాప్రకృతి. సమష్టి మనసు, బుద్ధి, అహంకారములతో కూడుకొని భగవంతుడు పంచతన్మాత్రలను జగదాకారముగా పరిణమింప చేస్తున్నాడు. జీవుల అవిద్యా, కామ (ఇచ్ఛ) కర్మలతో ప్రేరణను పొంది, తన మాయతో జగత్తు సృష్టికి కారణమైన అవిద్యాయుక్తమైన మాయే భగవంతుని 'అహంకారము' అనబడుతున్నది. ఈ ప్రకృతి - జగత్ సృష్టి-స్థితి-లయములేకాక జీవుల కర్మలతో కూడిన సమస్త జగద్వ్యవహారములతో అపరాప్రకృతి అని పిలువబడుతున్నది. ఇది త్రిగుణాత్మికము. జీవుల అవిద్యతో కూడినది కనుక,అది అపర.

సృష్టిలో అంతర్గతముగా నిర్మించబడిన శరీరములో జీవరూపముగా ప్రవేశించి, తనను ప్రకటించుకునే భగవంతుని శక్తి 'పరాప్రకృతి'. శ్రుతి ఇలా అన్నది. "అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి॥" ఈ జీవరూపముతో ప్రవేశించి నామరూపముల విభజన చేయుదునుగాక. (ఛాం॥ 6-2-2). ఈ వాక్యములో నామరూపముల విభజనకు కారణము అపరాప్రకృతి; జీవరూపముతో శరీరములో అనుప్రవేశము చేసే అతని శక్తి పరాప్రకృతి; ఇది పరా, అనగా శ్రేష్ఠమైనది, కావడానికి కారణము దీనిలో ఆవిద్యా సంబంధమైన వ్యవహారము కొంచెము కూడా లేదు. సమస్త జీవుల శరీరములలో ఉన్న ప్రాణము కూడా ఉపాధిరూపంలో

ఉన్నటువంటి - ప్రాణరహితుడు, మనో రహితుడు, కేవల నిష్క్రియుడు, అయిన పరమాత్ముని గుర్తించే చిహ్నము మాత్రమే. అన్ని వ్యవహారములకు అతీతముగా శాస్త్ర ప్రమాణములతో మాత్రమే తెలుసుకోదగినవాడైన పరమాత్ముని అనుభవాన్ని తనలోనే, గాఢనిద్రలో, జీవుడు పొందగలడు. అందువల్ల ఇది శ్రేష్ఠము. దీని నిశ్చయము తరువాత - 'అవస్థాత్రయము' అనే అధ్యాయములో చేయబడినది.

8-5. మాయ బ్రహ్మకు అధీనము

ఈశ్వరుని మాయచేతనే జగత్తు నిర్మింపబడినది. దాని ద్వారా జీవుడు తన కర్మఫలమును అనుభవిస్తున్నాడు. మాయా మోహముతో సత్కర్మలు దుష్కర్మలు చేస్తూ ధర్మాధర్మములను ప్రోగు చేసుకుంటున్నాడు. 'ఈ ప్రకారముగా జీవుడు మాయకు అధీనుడు' (గీ॥ 7-43). అయితే, మాయ ఈశ్వరునికి (బ్రహ్మకు) అధీనము (గీ॥ 6-25). 'ధర్మహాని జరిగినప్పుడు అధర్మము ఎక్కువయినప్పుడు ఈశ్వరుడు లోకహితము కొఱకు మానవులు మొదలైన రూపముతో పుట్టినట్లు ప్రకటింపబడుతూ వుంటాడు.' (గీ॥ 4-6). ఇలా శరీరధారణ చేసినప్పటికీ, ధర్మాధర్మములు జీవుల జ్ఞానశక్తికి అవరోధములైనట్లు ఈశ్వరుని జ్ఞానశక్తికి అవరోధములు కావు (గీ॥ 7-24), అందువల్ల ఈ మాయ, సాంఖ్యులు అనుమానముచేత కల్పించిన ప్రధానము వంటి స్వతంత్రమైనది కాదు.

8-6 చతుర్ముఖ బ్రహ్మ

ఈ విధంగా స్వరూపముతో అకర్త అయిన బ్రహ్మ, మాయోపాధి వల్ల జగత్కారణము అయినది. అనగా ఈశ్వరుడే జగద్వ్యవహారమును నిర్వహణ చేస్తున్నాడు. ఇది తెలుసుకోవడము కఠినము. పురాణములలో కథల ద్వారా దీనిని బాగా బోధపరిచారు. పరబ్రహ్మమే నారాయణుడు. అతడు అమృతములోనే ఉంటాడు. క్షీరసాగరములో సంసార రూప సర్పములమీద పవళించి వుంటాడు. అతనిని అవి ఏమీ చేయవు. అతను అనంతశయనుడు, ఎల్లప్పుడూ అకర్తగానే వుంటాడు కదా? కళ్ళు తెరుచుకుని పడుకున్నాడు; అంటే అది నిద్ర కాదు, పరమాత్మ ఎన్నడూ నిద్రపోడు. నారాయణునికి సృష్టి చేయాలని సంకల్పము కలగగానే, అతని నాభినుండి ఒక కమలము వచ్చినది. ఆ కమలములో సృష్టి కార్యనిర్వాహకుడయిన చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించాడు. ఇతడే పైన చెప్పిన ఈశ్వరుడు. భవిష్యత్కాలములో సృష్టి స్థితి లయములను సమముగా నిర్వహణ చేసేవాడు. ఇతడు జడమైన పురుష శరీరమును సృష్టి చేయగా శ్రీమన్నారాయణుడు అందులో ప్రవేశించినందువల్ల చైతన్యము వస్తున్నది. అందువల్ల అన్ని కర్మల సామర్థ్యము నారాయణునిదే అంటారు. దీనివల్ల నారాయణుడే జగత్కారణమని నిశ్చయమయింది. ఈ విధమైన వర్ణన వ్యవహారంలో కూడా కనపడుతుంది - కష్టపడేది కూలీలు, మేస్త్రీ అయినా ఇల్లు గృహస్థు కట్టాడు అనే అంటాము.

పరమేశ్వరుడు లేని ప్రదేశము ఏదీ వుండదు. అప్పుడు, అతడు ప్రవేశించాడు-అన్నదానికి అర్థము ఏమిటి? దానికి సమాధానము ఇది - ప్రాణధారణ వల్ల, అతని అస్తిత్వమును అవగాహన చేసుకోగలుతున్నాము. కనక ఔపచారికముగా 'ప్రవేశిస్తున్నాడు' - అని చెప్తున్నారు.

8.7 సృష్టిక్రమము

ఇక ఈ సృష్టి క్రమము గురించి తెలుసుకోవాలి. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి - ఈ పంచ తన్మాత్రలతో జగత్తు రచింపబడినది. తన్మాత్ర అనగా కేవలము అది ఒకే గుణము కలది. ఆకాశ తన్మాత్రములో కేవలము శబ్ద గుణము, వాయు తన్మాత్రలో కేవలము స్పర్శ గుణము, అగ్ని తన్మాత్రలో

కేవలము రూపగుణము, జల తన్మాత్రలో కేవలము రస గుణము, పృథ్వి తన్మాత్రలో కేవలము గంధగుణము ఉంటాయి. మొట్టమొదట ఈ పంచతన్మాత్రలు, సమష్టి మనసు, సమష్టిబుద్ధి, సమష్టి అహంకారము ప్రకటింపబడ్డాయి. ఇవే రాబోయే జగత్తునకు బీజము. సమష్టి బుద్ధిని 'మహత్తత్త్వము' అంటారు. ఈ ఉపాధి ద్వారా కనపడే బ్రహ్మమే 'హిరణ్య గర్భుడు.' ఇతనికి సమష్టి బుద్ధిలో 'తనది' అనే అభిమానము ఉంటుంది. ఈ జగద్బీజమే ప్రథమ శరీర రూపములో వికసిస్తుంది. ప్రథమ శరీరిని ప్రజావతి, బ్రహ్మ, విరాట్పురుషుడు అని కూడా అంటారు. ఇతడు జరుగబోయే సృష్టి స్థితి సంహారముల నిర్వాహకుడు. ఇతని ఒక్క దినములో సృష్టి స్థితి, ఇంకా రాత్రిలో ప్రళయము జరుగుతూ వుంటాయి. కృత–త్రేతా–ద్వాపర–కలి ఈ యుగములు నాలుగు కలసిన కాలమును 'మహాయుగము' అంటారు. ఇటువంటి సహస్ర మహాయుగ పర్యంత కాలము 'కల్పము'. ఈ 'కల్పము' ప్రజాపతికి ఒక దినము..

ప్రతీ సృష్టిలోను జడ జగత్తు నిర్మించి, దానిలో దేవతల నుండి కీటకముల వరకు ఉన్న జీవులకు వారివారి కర్మానుసారము శరీరములను ఇవ్వడము ప్రజాపతి కార్యము. ప్రాణులలో ఉన్న సూక్ష్మ శరీరము ఈవిధముగా తయారుచేయబడినది. పంచప్రాణములలో వాయు తన్మాత్ర మాత్రమే ఉన్నది. పంచజ్ఞానేంద్రియములైన శ్రోత్ర, త్వక్క్, నేత్ర, రసన, ఘ్రాణములలో క్రమముగా కేవల ఆకాశ, వాయు, తేజో, జల, పృథ్వీ, తన్మాత్రలు ఉన్నాయి; కర్మేంద్రియములలో అవి ఇలా వున్నాయి – వాక్కులో కేవల అగ్ని తన్మాత్ర, హస్తములో కేవల వాయు తన్మాత్ర, పాదములలో కేవలము ఆకాశ తన్మాత్ర, పాయువులో కేవల పృథ్వీ తన్మాత్ర, ఉపస్థలో కేవలము జల తన్మాత్ర. అంతఃకరణములో ఐదు తన్మాత్రలు కలసి వున్నాయి.

దీని తరువాత ఇంద్రియములు గ్రహించలేని పంచతన్మాత్రలను మిశ్రమము చేసి, ఇంద్రియ గ్రాహ్యమైన పాంచభౌతిక బాహ్యజగత్తును బ్రహ్మ నిర్మించాడు. బాహ్య జగత్తుయొక్క ఈ సమ్మేళనమును 'పంచీకరణము' అంటారు. దీని వివరణ తైత్తరీయ భాష్యము (2–12) లో ఉన్నది. పంచ తన్మాత్రల నుండి పంచీకృత భూతములు ఆవిర్భవించినవి. వాటి క్రమము ఇలా ఉన్నది: మొదట ఆకాశము ఉత్పన్నమయినది. ఇది శబ్ద గుణము కలది, అంతేగాక ఉత్పన్నమయే అన్ని వస్తువులకు అవకాశము ఇస్తూ వుంటుంది. ఇది వాయు తన్మాత్రతో కలసి, తనదైన స్పర్శముతో ఆకాశ గుణమైన శబ్దమును కలుపుకుని (పంచీకృత) వాయువుగా పరిణమిస్తుంది. ఆ వాయువు అగ్ని తన్మాత్రతో కలుస్తుంది. అగ్ని యొక్క రూపగుణము పై రెండు గుణములతో కలసి (పంచీకృత) అగ్ని అవుతుంది. ఈ అగ్ని జల తన్మాత్రయైన రసగుణమును మిగిలిన మూడు గుణములతో కలుపుకుని (పంచీకృత) జలముగా పరిణమిస్తుంది. ఇక ఈ జలం పృథ్వీ తన్మాత్రతో కలుస్తుంది. తన గంధ గుణము మిగిలిన నాలుగు గుణములతో కలసి (పంచీకృత) పృథ్వీరూపము అవుతుంది. ఈ మహా భూతములను ఛాందోగ్య మంత్రములో ఇలా చెప్పారు. "అది తేజస్సును సృష్టించింది. అది జలమును సృష్టించింది" అని (ఛాం॥ 6–2–3). "అధికారస్తావత్ తత్తేజో¬ సృజత, తదపో¬సృజత ఇతి మహాభూత విషయే వర్తతే", (సూ॥ భా॥ 2–3–12). ఇలా పంచీకృతములు అయినప్పటికీ మహాభూతములు తమ బ్రహ్మ స్వభావమును విడువలేదు. ఉదా: జలతత్త్వముతో ప్రారంభించి సృష్టిని బోధించే సమయములో శ్రుతి ఇలా చెప్తున్నది. "తా ఆప ఐక్షంత బహ్వ్యః స్యామ ప్రజాయే మహి" (ఛాం 6–2–4, సూ భా 2–3–7–13)– జలము (అప్) నేను అనేక రూపములుగా అవుతాను; పుడతాను అని ఆలోచించినది. ఆలోచన చేయడం బ్రహ్మలక్షణమే కదా? ఈ పృథ్వి నుంచి మొక్కలు – వృక్షములు, వాటి నుంచి అన్నము. అన్నము నుండి వీర్యము, ఇలా పరిణామమును పొందిన తరువాత – శిరస్సు, పాణిపాదములు అన్ని అవయములతో పురుషుడు, ప్రాణులు జన్మిస్తున్నారు. (తై॥ 2–1–2). పృథ్వి నుంచి

ఆవిర్భవించిన జడశరీరములు కలిగిన సృష్టి క్రమమును "త్రివృత్కకరణము" అంటారు. (సూ॥ భా॥ 2-4-29,22). చతుర్ముఖ బ్రహ్మ మొదలుకొని అన్ని ప్రాణులు తమ కర్మానుసారము శరీర ధారణ చేస్తున్న వెనుకటి కల్పములోని జీవులే!

ఇలా పంచీకరణము చేసి, నామ రూపములను నిర్మించుటకు తగిన ప్రవృత్తి బ్రహ్మకు తన అహంకారము వల్ల కలిగినది. ఈ బ్రహ్మను 'ఈశ్వరుడు' అంటారు. అవ్యక్తములో ఉన్న జీవుల అవిద్య ఈ ప్రవృత్తికి కారణము. అవిద్య కారణముగా జీవులు జగత్తును-తమకంటే, బ్రహ్మకంటె వేఱుగా భావించి, రాగద్వేషములకు లోబడి కర్మలు చేస్తూ వుంటారు. వారి ఆ కర్మఫలభోగము కొఱకు ఈశ్వరుడు జగత్తును సృష్టిస్తాడు. స్వరూపములో ఉదాసీనుడే అయినప్పటికీ, ఏడ్చే పిల్లవానికి తండ్రి బొమ్మలు ఇచ్చినట్లు, జీవుల అవిద్యవల్ల ప్రేరితుడై సృష్టికార్యమును చేస్తూ వుంటాడు - "అవిద్యా ప్రత్యుపస్థాపిత నామరూప మాయావేశ వశేన సంభవతి ప్రవృత్తిః" - (సూ ॥ భా॥ 2-2-2). ప్రవృత్తి అహంకార లక్షణము కావడము వల్ల ఈ అవిద్యతోకూడిన అవ్యక్తమునే అహంకారము అంటారు. విషము కలిపిన అన్నమును విషము అనే అంటారు. అదే విధముగా విషము వంటి అవిద్య (అహంకార శబ్దముతో చెప్పబడేది), అన్నమువంటి అవ్యక్తముతో కలసినప్పుడు 'అహంకారము' అనబడుతున్నది. "అహంకార ఇతి అవిద్యా సంయుక్తమ్ అవ్యక్తం। యథా విషసంయుక్తమ్ అన్నం విషమిత్యుచ్యతే, ఏవం అహంకార వాసనావత్ అవ్యక్తం మూలకారణమ్ అహంకార ఇత్యుచ్యతే। ప్రవర్తకత్వాత్ అహంకారస్య । అహంకార ఏవ హి సర్వస్య ప్రవృత్తి బీజం దృష్టం లోకే।" - (గీ॥భా॥7-4). ఈ విధముగా కార్యప్రవృత్తికి కారణము జీవుల అవిద్యే అయినప్పటికీ, కార్య సామర్థ్యము కలది అవ్యక్తము మాత్రమే, అంటే పరమేశ్వరునిదే! ఈ ప్రకృతి అవిద్యతో కూడినది కనుక 'అపర' అనగా శ్రేష్ఠము కానిది.


8-8) ప్రళయము

సృష్టింపబడిన ఈ జగత్తు, ప్రళయకాలము వరకు జీవుల భోగమునకు సాధనముగా ఉంటుంది. కల్పాంతములో దీని ప్రళయము జరుగుతుంది. ప్రళయక్రమము సృష్టి క్రమమునకు వ్యతిరేకము. ఇది నిచ్చెన ఎక్కడము దిగడము వంటిది. అనగా పంచీకృతమైన భూతములు ఏ భూతముల నుంచి ఉత్పన్నమయినవో తమకు కారణమైన ఆ భూతములలో లీనమైపోతాయి. ప్రాణులు పృథ్విలో, పృథ్వి జలములో, జలము అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశములో, ఆకాశము పరబ్రహ్మలో లీనమైపోతాయి. (సూ॥భా॥ 2-3-14). ఈ విధంగా జగత్తు బ్రహ్మ నుండి ఉత్పన్నమగుట కారణమువల్ల 'తజ్జ' అని, దానిలోనే లయమగుట వల్ల 'తల్ల' అని, స్థితికాలములో దానిలోనే ఉన్నప్పుడు 'అనన', అంటే వ్యవహారము చేస్తూ ఉన్నప్పుడు 'తదన' అని అంటారు. అందువలన శ్రుతి దానిని 'తజ్జలాన్' అంటుంది. దీని అర్థము - త్రికాలములలో జగత్తు బ్రహ్మమే అయి ఉన్నది. (ఛాం॥ 3-14-1)

8-9) మాయ నిత్యము

ముందే చెప్పాము: జీవుల భోగము కోసమే జగత్తు సృష్టింపబడినది. దీనికి ఇంకొక ప్రయోజనము ఏమీలేదు. క్రిందటి కల్పములో చేసిన జీవుల కర్మఫలభోగము కొఱకే ఈ కల్పములో జగత్తు సృష్టి జరిగింది. అలాగే, రాబోయే కల్పములలో జగత్సృష్టి, ఈ కల్పమున జీవుల కర్మఫలభోగము కోసమే అవుతుంది. కల్పములకు ఆది లేదు. అంతము లేదు. అందువల్ల ప్రథమ కల్పము అని చెప్పదగినదే లేదు. ఎవడో ఒక జీవుడు కర్మఫలముల సంబంధమును విడిచి ముక్తుడవుతున్నాడు. అతనికి జన్మ వుండదు. ఇక, వానికి జగత్తుతో ఆవశ్యకత లేదు. ఇది సత్యమే; కాని, జీవులు అసంఖ్యాకులు. శత సహస్ర అయుత న్యర్బుద

అసంఖ్య జీవులు వానిలో ఉన్నారు – "శతం సహస్రమయుతం న్యర్బుద మసంఖ్యేయం స్వమస్మిన్ నివిష్టమ్।" (అథర్వసంహిత 10–7–24) అందువల్ల ఎంతమంది జీవులు ముక్తులయినా ఇంకా అనేక జీవులు ఉంటూనే ఉంటారు. వారికోసము కల్పములు జరుగుతూనే వుంటాయి. ఈ దృష్టితో కల్పములు అనంతములు. వీనికి అంతములేదు. ఇలా కల్పములు అనాదికాలము నుండి అనంతకాలము వరకు జరుగుతూనే వుంటాయి. చిత్రము : 8–1)



(చిత్రం 8–9 క) **సృష్టి, స్థితి, లయముల అనాద్యనంతత్వము.**

స్థావర జంగమరూపమైన ఈ జగత్తు ఆత్మ నుండి నిప్పురవ్వల వలె ఎల్లప్పుడు విస్తారము చెందుతూనే వుంటుంది. స్థితి లయములు జరుగుతూనే వుంటాయి – "ఆత్మనః స్థావరజంగమం జగదిదం అగ్ని విస్ఫులింగవత్ వ్యుచ్చరతి అనిశం, వర్తతే స్థితికాలే, ప్రలీయతే।" (బృ॥భా॥2–1–20). అందువల్ల జగత్సృష్టికి ఆవశ్యకమైన మాయ కూడా నిత్యమైనదే! అనగా, ఇది అనాదికాలము నుండి అనంతకాలము వరకు ఉంటుంది. ఈశ్వరుడు ఎల్లప్పుడూ వుంటాడు. కనుక అతని ప్రకృతులు కూడా నిత్యమై వుంటాయి. ఈ రెండు ప్రకృతులతో కలసి ఉండడమే ఈశ్వరుని ఈశ్వరత్వము – "నిత్యేశ్వరత్వాత్ ఈశ్వరస్య తత్ప్రకృత్యోరపి యుక్తం నిత్యత్వేన భవితుం; ప్రకృతి ద్వయవత్వమేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వం।" (గీ॥భా॥ 13–19). భగవంతుడు జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజస్సులతో సదా కూడి వుంటాడు– "స చ భగవాన్ జ్ఞానైశ్వర్యశక్తిబలవీర్యతేజోభిః సదా సంపన్నః" – (గీ॥భా॥అవతరణిక). ఈ అన్ని విశేషములు నశించనివి (అక్షరములు). నిత్యసిద్ధుడైన ఈశ్వరునికి సృష్టి, స్థితి, సంహారముల నిత్యజ్ఞానము వుంటుంది అని చెప్పేది ఏమిటి?– "కిము వక్తవ్యం తస్య నిత్యసిద్ధస్య ఈశ్వరస్య సృష్టి స్థితి సంహృతి విషయం నిత్యజ్ఞానం భవతి ఇతి ।"(సూ॥భా॥ 1–1–5). ఈ అక్షరము అచలము. అందువలన ధృవమైనది, అనగా నిత్యము– "అచలం యస్మాత్ అచలం తస్మాత్ ధృవం నిత్యమ్ ఇత్యర్థః।" (గీ॥భా॥12–3), మాయ సృష్టికాలములో జగదాకార రూపము ధరిస్తుంది– "ప్రకృతిశ్చ త్రిగుణాత్మికా సర్వకార్యకరణ విషయాకారేణ పరిణతా" (గీ॥భా॥ 13–0, సంబంధ భాష్యం). ప్రళయకాలములో అవ్యక్తరూపమును పొందుతుంది. ఈ విధముగా మాయయొక్క నిత్యత్వము "పరిణామి నిత్యత్వము." కాని బ్రహ్మ నిత్యత్వము "కూటస్థ నిత్యత్వము"– "కూటస్థం నిత్యం

బ్రహ్మ సర్వవిక్రియా ప్రతిషేధాత్।" "(సూ॥భా॥2-1-14) - అనగా బ్రహ్మ ఏ విధమైన పరిణామము లేకుండా నిత్యముగా వుంటుంది. ఈ విషయము బ్రహ్మ ప్రకరణములో సవిస్తారంగా వివరింపబడినది.

ప్రశ్న: అష్టవిధప్రకృతి సృష్టికి పూర్వము ఉన్నదా? లేదా? ఒకవేళ ఉన్నది అంటే సృష్టికి పూర్వము బ్రహ్మ - ప్రకృతి ఇద్దరూ ఉండడం వల్ల "సదేవ ఆసీదేకమేవాద్వితీయం" - అనే శ్రుతికి విరోధము వస్తుంది. అలాకాక లేదు అంటే - ప్రకృతి నిత్యత్వమునకు భంగమవుతుంది.

సమాధానము: "ప్రళయకాలములో ప్రకృతి 'సత్' తో (ఏకముగా) అభిన్నముగా ఉన్నది అని చెప్పడముతో నిత్యత్వమునకు భంగము కలుగదు.

ప్రశ్న: అలా కాదు. స్థితి కాలములో జగత్తు సూర్యుడు, చంద్రుడు, ఘటము, పటము అనే నానా శబ్ద బుద్ధులకు 'సత్' అనే ఒకే శబ్ద బుద్ధికి కూడా విషయమై వుంటుంది. కాని, ప్రళయ కాలములో ఇలా అనేక శబ్ద బుద్ధులకు అవకాశములేదు. 'సత్' ఒకటే ఉంటుంది. ప్రళయకాలంలో జగత్తు 'సత్' కారణముతో అభిన్నమైతే కార్యరూపముగా ఉండదు. ప్రళయములో అష్టవిధప్రకృతి "ఇది" అనే శబ్దబుద్ధికి విషయము అయితే, అప్పుడు 'సత్' ఒక్కటే ఉన్నది అనే శ్రుతికి విరుద్ధము అవుతుంది. ఒకవేళ సృష్టికి పూర్వంప్రకృతి లేకపోతే దానికి అనిత్యత్వము వస్తుంది.

సమాధానము: కాని, ఇలా కాదు. ప్రళయములో 'సన్' మాత్రము ఉన్నది. అప్పుడు 'ప్రకృతి' శబ్దబుద్ధులకు అవకాశము లేకుంటే కూడా ప్రకృతి లేదని చెప్పుటకు వీలులేదు. దీనికి దృష్టాంతము ఉన్నది:- జీవుని సుషుప్తిలో అవిద్యా కామ-కర్మములు వుంటాయి అనేది నిశ్చయము. అవి ఎలా వుంటాయి? జీవునిలో అవ్యక్తరూపములో ఉంటాయి. అవి జాగ్రత్ స్వప్నములలో వ్యక్తమవుతూ వుంటాయి. మొదట అవ్యక్త స్థితిలో వున్నా, జాగ్రత్ - స్వప్నములలో దాని కార్యములుండుటను పట్టి సుషుప్తిలో అవిద్య అస్తిత్వము నిశ్చయమవుతుంది. బుద్ధితో జీవాత్మ సంబంధము సుషుప్తి-ప్రళయములలో శక్తిరూపముగా ఉండి తిరిగి జాగ్రత్‌లో సృష్టిలో వ్యక్తమవుతూ వుంటుంది; ఏది కూడా ఆకస్మికముగా ఎక్కడనుంచి రాలేదు - "అయమపి బుద్ధి సంబంధః శక్త్యాత్మనా విద్య మాన ఏవ సుషుప్తి ప్రలయయోః పునః ప్రబోధప్రసవయోః ఆవిర్భవతి ....న హి ఆకస్మికీ కస్యచిత్ ఉత్పత్తిః సంభవతి" (సూ॥ భా॥ 02-3-31) ఈ విధముగా ప్రళయకాలములో ప్రకృతి శబ్దమునకు, బుద్ధికి విషయము కాకపోతే కూడా, సృష్టికాలములో దాని కార్యమును చూసి ప్రళయములో ప్రకృతి యొక్క అస్తిత్వమును నిశ్చయము చేయవలసి వస్తున్నది. ఒకవేళ అది మొదట వుండకపోతే, సృష్టి జరగనే జరగదు. త్రికాలములలో నామరూపముల అస్తిత్వము ఇలాగే నిశ్చయమవుతున్నది. (అధ్యా॥ 6-5-3) ప్రళయకాలములో జగత్తు తనశక్తిని మినహాయించుకునే లీనమవుతుంది. శక్తి మూలరూపమునుండి ఆవిర్భవిస్తుంది. లేదంటే సృష్టి ఆకస్మికమనే దోషము కలుగుతుంది - "ప్రలీయమానమపి చ ఇదం జగత్ శక్త్యవశేషమేవ ప్రలీయతే, శక్తి మూలమేవ చ ప్రభవతి, ఇతరథా ఆకస్మికత్వ ప్రసంగాత్। (సూ॥ భా॥ 1-3-30) అందువల్ల ప్రళయకాలములో 'సత్' ఒకటే ఉన్నప్పటికీ ప్రకృతి నిత్యము. సద్రూపముగా నామ రూపముల నిత్యత్వము నిశ్చయమైన తరువాత దాని కారణమైన ప్రకృతి అనిత్యము ఎందుకు అవుతుంది? అది నిత్యమే!

8-10) మాయ అనిర్వచనీయము

పై అనుచ్ఛేదములను జాగ్రత్తగా అధ్యయనము చేసినట్లయితే ఒక సందేహము వస్తుంది. ఆ అనుచ్ఛేద (అ॥8-2) పరిభాషలో మాయ ఇలా చెప్పబడింది: - బ్రహ్మశక్తి మాయ అనగా బ్రహ్మనుండి ఎప్పుడూ విడిగా వుండదు- "శక్తి శక్తిమతోః అనన్యత్వాత్।" (గీ॥ భా॥ 14-27) ఈశ్వరుడు ఎవరు? ఈ విషయము చెప్తూ (అధ్యా॥ 8-4) మాయ బ్రహ్మకు ఉపాధి అని చెప్పారు. అనగా బ్రహ్మకంటే వేఱుగా వుంటూ, దానిని గుర్తించే చిహ్నము మాత్రమే. ఈ రెండు వ్యాఖ్యలు ఒకటితో ఒకటి కలవడము లేదు; పరస్పర విరోధముతో ఉన్నవి. అప్పుడు-మాయ బ్రహ్మతో కలిసి వున్నదా? లేక వేఱుగా ఉన్నదా? అని సందేహము వస్తుంది. ఈ సందేహ నివృత్తికి మనము ఒక సంగతి గమనించాలి. ప్రత్యక్షముగా కార్యము అనుభవములోకి వస్తుంది కనక దానిని వివరించడానికి ఏ శాస్త్రము అవసరము లేదు. కాని, దానికి అప్రత్యక్ష కారణము ఏదైతే వున్నదో దాని విమర్శకు శాస్త్రము అవసరము. కార్య కారణముల మధ్యనుండే సంబంధము శాస్త్రము ద్వారానే చెప్పబడుతున్నది. ఏ శాస్త్రమును చూసినా, ప్రత్యక్ష కార్యమునకు - తద్విలక్షణమైన అప్రత్యక్ష కారణముతో సంబంధమును వివరించడమే ఆ శాస్త్రములోని క్లిష్టమైన భాగము. ఈ కార్య- కారణ సంబంధము విచిత్రమైనది. మణిమాలలో మధ్య మణిని కుడి-ఎడమలలో ఎటునుంచైనా లెక్కించవచ్చు. దానిని 'మధ్యమణి న్యాయము' అంటారు. మాయ కూడా అటువంటిదే. ఇది కార్యము వైపునుంచి చూస్తే కార్యరూపములో, కారణమువైపు నుంచి చూస్తే కారణరూపములో కనపడుతుంది.

ఈ ప్రకారము, ఏ సిద్ధాంతములోనైనా కార్య-కారణముల మధ్యనుండే శక్తి గురించి అది కారణమా- దానికంటే భిన్నమా, అని స్పష్టముగా చెప్పలేము. కారణ బ్రహ్మకు - కార్యజగత్తుకు మధ్యన ఉండే మాయ లక్షణము కూడా ఇటువంటిదే. బ్రహ్మనుండి అభిన్నముగా గాని, భిన్నముగా గాని శక్తి (మాయ) యొక్క నిరూపణము చేయలేము. ఆ కారణముచేతనే భాష్యకారులు దీనిని 'అవ్యక్తము' అన్నారు. "అవ్యక్తా హి సా మాయా తత్త్వాన్యత్వనిరూపణస్య అశక్యత్వాత్।" (సూ॥ భా॥ 1-4-3) - బ్రహ్మమేనా? బ్రహ్మముకంటే అన్యమా; దీనిని వాక్కు ద్వారా వ్యక్తము చేయడము అశక్యము. కనక ఇది 'అవ్యక్తము'.

ఇంత మాత్రమే కాదు; మాయ నామరూపములుగా పరిణమించిన తరువాత నామ రూపములకు దీని లక్షణములే వుంటాయి. ఈ విషయము కార్యకారణ అనన్యత్వమును బోధించే యుగళవాక్యములో అంతర్గతము. కార్యము-కారణముకంటె వేఱుకాదు (పూర్వార్ధము). అయితే, కారణము కార్యముకంటె భిన్నము (ఉత్తరార్ధము). ఉత్తరార్ధములో కార్యము దాని కారణము కంటె భిన్నమని స్పష్టముగా ఉన్నది. అందువల్ల ఉత్తరార్ధములో చెప్పిన కార్యమునకు "తత్త్వాన్యత్వ నిరూపణాశక్యత్వ" మనే మాట కూడా పుట్టదు. ఇందువల్ల అది అనిర్వచనీయము కాదు. కాని పూర్వార్ధములో అలా లేదు. అక్కడ కార్యము - కారణము రెండూ తెలుస్తున్నవి. కార్యమే కారణ రూపములో ఉన్నదని తెలుస్తున్నది; వ్యవహారము కార్యములో కనబడుతున్నది - కారణములో లేదు; ఇది కూడా తెలుస్తున్నది. ఈ విధముగా, కార్యమును స్వరూపము - వ్యవహారము అనే ద్వివిధ దృష్టితో చూడగలము. దీనివల్ల కార్యమును చూడగానే "ఇది కారణముతో కలసివున్నదా? లేక భిన్నమా? అని నిశ్చయించి చెప్పలేము. ఉదాహరణకు, వ్యవహార దృష్టితో, కుండ మట్టి కంటె వేరుగా వుంది; స్వరూపదృష్టితో మట్టితో కలిసే వుంది. అనగా ఘటము 'అనిర్వచనీయము'. ఇదే దార్ష్టాంతికములో - నామరూప విషయములో "ఇవి బ్రహ్మమా? లేక బ్రహ్మకంటె వేఱుగా వున్నవా?" అనే ప్రశ్నకు సమాధానమును నిశ్చయముగా చెప్పలేము. ఇదే, దాని 'అనిర్వచనీయత్వము'. భాష్యకారులు

ఇలా అన్నారు– “కిం పునస్తత్ కర్మ యత్ ప్రాగుత్పత్తేః ఈశ్వరజ్ఞానస్య విషయో భవతి ఇతి? తత్త్వాన్యత్వాభ్యామ్ అనిర్వచనీయే నామరూపే అవ్యాకృతే వ్యాచికీర్షితే॥” (సూ॥భా॥1-1-7), – సృష్టికి పూర్వము ఈశ్వర జ్ఞానమునకు విషయమైనది ఏది? బ్రహ్మయా? లేక దాని కన్న వేఱైనదా? అని నిశ్చయముగా చెప్పలేని (పూర్వార్ధము), అప్పుడు అవ్యాకృతముగా ఉండి తరువాత వ్యాకృతము కాబోయే నామ – రూపములు. ఈ వాక్యములో నామరూపముల వర్ణన కేవలము శాస్త్రదృష్టితో చేయబడినది; ఈ వాక్యము కేవలము ‘అనన్యత్వన్యాయము’లో చెప్పబడిన పూర్వార్ధ కార్యమును గురించి మాత్రమే వున్నది, కాని ఉత్తరార్ధములో చెప్పిన కార్యమును గురించి కాదు. సర్వజ్ఞుడైన ఈశ్వరుని స్వరూపముగా (పూర్వార్ధము), అవిద్యాకల్పిత (ఉత్తరార్ధము), బ్రహ్మ అయినదా? లేక దానికి అన్యమైనదా?– అని చెప్పడానికి వీలులేని (పూర్వార్ధము), సంసార ప్రపంచమునకు బీజరూపమైన (ఉత్తరార్ధము) నామ రూపములను ఈశ్వరుని మాయ, శక్తి, ప్రకృతి అనే పేర్లతో శ్రుతి స్మృతులలో చెప్పబడినది – “సర్వజ్ఞస్య ఈశ్వరస్య ఆత్మభూతే ఇవ అవిద్యాకల్పితే నామరూపే తత్త్వాన్యత్వాభ్యామ్ అనిర్వచనీయే సంసార ప్రపంచ బీజభూతే సర్వజ్ఞస్య ఈశ్వరస్య మాయాశక్తిః ప్రకృతిః ఇతి చ శ్రుతిస్మృత్యోరభిలప్యేతే।” (సూ॥ భా॥ 2-1-14). అవిద్యాకల్పిత నామరూప లక్షణ భేదములతో (ఉత్తరార్ధము) బ్రహ్మమా? లేక అన్యమా? అని చెప్పుటకు వీలులేనిదీ (పూర్వార్ధము), తరువాత వ్యాకృతమయ్యేదీ అవ్యాకృతము ద్వారా బ్రహ్మ, పరిణామము మొదలైన సర్వవ్యవహారములకు ఆస్పదమై వున్నది– “అవిద్యాకల్పితేన చ నామరూప లక్షణేన రూపభేదేన వ్యాకృతావ్యకృతాత్మకేన తత్త్వాన్యత్వాభ్యామ్ అనిర్వచనీయేన బ్రహ్మ పరిణామాది సర్వవ్యవహారాస్పదత్వం ప్రతిపద్యతే।” (సూ. భా 2-1-27), నామరూపములను శాస్త్రదృష్టి–వ్యవహారదృష్టి రెండింటితో చూసే ఈ వాక్యములలో (పూర్వార్ధము – ఉత్తరార్ధము) రెండు కార్యములను గురించి వివరణము వున్నది.

ఈ విధంగా **మాయ (లేదా నామరూపముల) విషయములో ఇది బ్రహ్మమా, లేక దాని కంటె అన్యమా? అని నిశ్చయరూపముతో చెప్పడానికి వీలులేని మాయనే (నామరూపములనే) ‘అనిర్వచనీయము’ అన్నారు.** నిర్వచనీయము అనగా నిర్దిష్ట వర్ణన చేయదగినది; అనిర్వచనీయము అనగా నిర్దిష్ట వర్ణనతో చెప్పలేనిది. భాష్యకారుల ప్రతిపాదనలో మాయ లేక నామరూపముల అనిర్వచనీయత్వమంటే, దాని యొక్క నిరూపణ చేయడములో ఉన్న తత్త్వాన్యత్వ సందిగ్ధత మాత్రమే! ఇది ఎప్పుడూ స్మరించవలసిన విషయము.

8-11) మాయా స్వరూపము బ్రహ్మానన్యము

కార్యదృష్టితో చూస్తే మాయ బ్రహ్మయొక్క ఉపాధి అయినప్పటికీ స్వరూపదృష్టిచేత అది బ్రహ్మతో అనన్యము; మాయా కార్యమైన సమస్త జగత్తు బ్రహ్మతో అనన్యమే అని నిశ్చయమయిన తరువాత, బ్రహ్మశక్తి అయిన మాయ, బ్రహ్మతో అనన్యము కాకుండా ఎలా వుంటుంది? అనన్యమే! ఈ విషయము భాష్యకారులు ఇలా బోధిస్తున్నారు– “నను అవ్యాకృతం స్వయమేవ వ్యాక్రియత ఇత్యుక్తమ్। కథమిదమిదానీమ్ ఉచ్యతే పర ఏవ ఆత్మా అవ్యాకృతమ్ వ్యాకుర్వన్ ఇతి। నైష దోషః పరస్యాపి ఆత్మనః అవ్యాకృత జగదాత్మత్వేన వివక్షితత్వాత్” (బృ॥ 1-4-7). –అవ్యాకృతము తానే వ్యాకృతమైనదని వెనుక చెప్పబడింది కదా? ఇప్పుడు పరమాత్ముడే అవ్యాకృతమును వ్యాకృతము చేసి అందులో ప్రవేశించాడు అని చెపుతున్నారు. అది ఎలా జరుగుతుంది? ఇందులో దోషమేమీ లేదు. పరమాత్ముడే అవ్యాకృత జగదాత్మ కావడము వల్ల రెండు విధములుగానూ చెప్పవచ్చు. శంకర భాష్యములోని వ్యాక్యములు ఇలా వున్నాయి– ‘కారణస్య ఆత్మభూతాశక్తిః శక్తేశ్చ ఆత్మభూతం

కార్యమ్"– శక్తి యొక్క స్వరూపము కారణము; కార్యముయొక్క స్వరూపము శక్తి – సూ. భా॥ 2–1–18). "సా శక్తిః బ్రహ్మైవ అహమ్ శక్తిశక్తిమతోః అనన్యత్వాత్।" ఆ శక్తి బ్రహ్మే. అది నేనే. ఎందుకంటే శక్తి శక్తిమంతుడు వేఱు కాదు. (గీ॥ భా॥ 14–27). "మమ స్వరూప భూతా మదీయా మాయా"– నా స్వరూప భూతమయినది నా మాయ (గీ॥ భా॥ 14–3). యా మూల ప్రకృతిః అభ్యుపగమ్యతే తదేవ చ నో బ్రహ్మ।"– దేనిని మూలప్రకృతి అంటున్నారో అదే మా బ్రహ్మ. (సూ॥ భా॥ 2–3–9). "ప్రకృతి ద్వయమత్వమేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వం" – ఈ రెండు ప్రకృతులతో కలసి వుండడమే ఈశ్వరుని ఈశ్వరత్వము. (గీ॥ భా॥ 13–19). ఇంతేకాదు; మాయయొక్క పర్యాయ వాచకమైన శబ్దమైన 'అక్షరము'ను శ్రుతి బ్రహ్మకు కూడా పర్యాయ వాచకముగా చెప్పినది. అక్షరమే "అదృష్ట ద్రష్ట, అశ్రుత శ్రోత" మొదలైనవి కూడా. (బృ॥ 3–8–11). ఈ అక్షరుడైన పరమాత్మలో– "స పరే అక్షరే ఆత్మని సంప్రతిష్ఠతే" (ప్ర॥ 4–9) మొదలైనవి కూడా ఉన్నవి. ఇంత మాత్రము జ్ఞప్తిలో వుంటే ముందు సిద్ధాంతము చక్కగా అవగాహనకు వస్తుంది.

ప్రశ్న : ఈ అధ్యాయమున ఒక అనుచ్ఛేదములో (అధ్యా. 8–4) "మాయ బ్రహ్మ యొక్క ఉపాధి – అనగా బ్రహ్మము కంటే అన్యము" అని చెప్పబడినది. ఇంకొక చోట (అధ్యా॥ 8–10) దీనిని 'అనిర్వచనీయము'– బ్రహ్మగా వున్నది అని కాని బ్రహ్మము కంటే వేఱుగా వున్నది – అని కాని చెప్పడానికి వీలులేనిది అన్నారు. దాని తరువాత (అధ్యా॥ 8–11) మాయ బ్రహ్మకంటె అనన్యము అన్నారు. బ్రహ్మమునకు సంబంధించిన ఈ మూడు వర్ణనలు పరస్పర విరుద్ధముగా వున్నవి. వీని సమన్వయము ఎలా చేయాలి?

సమాధానము : ఇక్కడ మాయయొక్క ఉపాధిత్వము – అనిర్వచనీయత్వము సాధకుని బుద్ధిని అనుసరించి, 'పురుషాధీనము'గా వర్ణించబడినది. ప్రథమముగ అతడు మాయను ఉపాధి అనుకుంటాడు. ఈ దృష్టితో మాయ ఈ జగత్తుకు ఉపాదానము – బ్రహ్మ నిమిత్త మాత్రము. ఇందువల్ల బ్రహ్మకంటె మాయ భిన్నమైనది. మరియు మాయ బ్రహ్మకు ఉపాధి. సాధకునికి సులభగ్రాహ్యము అగుట కొఱకు ఉపదేశము ఇక్కడనుంచే ప్రారంభమవుతుంది. అధ్యయనము చేయగా కొంత ముందుకు వెళ్ళి, బ్రహ్మశక్తియైన మాయకు బ్రహ్మకంటె అనన్యత్వమును విని తన పూర్వపు జ్ఞానముతో దీనిని సరి పోల్చుకుంటాడు; మాయ, బ్రహ్మ – వీని సంబంధములో ఇది బ్రహ్మగానే ఉన్నదా? లేక దానికంటే అన్యమా? అని – సంశయము కలుగుతుంది. ఈ సంశయజ్ఞానమునకు విషయమే 'అనిర్వచనీయత్వము'. ఇంకా ముందుకు వెళ్ళిన తరువాత ఉపాధి బుద్ధిని పూర్తిగా వదలివేసి, మాయ స్వరూపమనే దృష్టిలో వుంచుకొని బ్రహ్మతో దానికున్న 'అనన్యత్వము'ను గ్రహించాలి. **ఇలా మాయ యొక్క ఉపాధిత్వ జ్ఞానము, దాని స్వరూపము యొక్క అయథార్థజ్ఞానమై ఉన్నది. అనిర్వచనీయత్వము దాని స్వరూపముయొక్క సంశయజ్ఞాన విషయము. అనన్యత్వము దాని స్వరూపముయొక్క యథార్థజ్ఞానము. నామరూపముల విషయమును కూడా ఇలాగే వున్నది.**

జగత్ప్రకరణము యొక్క తాత్పర్యము

జగత్తులో మనము కార్యముయొక్క నానాత్వమును చూస్తున్నాము. ఇది దాని స్వరూపము కాదు. దాని ఉపాదన కారణమే దాని స్వరూపముగా చెప్పబడుతున్నది. ఇలా నిర్ణయము చేసేముందు – పరమాణువు, ప్రధానము మొదలైన కారణములను చెప్పే మిమాంసకులు, సాంఖ్యులు ఇత్యాదుల వాదములను, ఇదే విధముగా ఆలోచించే ఆధునిక వైజ్ఞానికుల వాదములను పరిశీలన చేశాము. ఇంతేగాక, నానాత్వమును అంగీకరించే ఏ సిద్ధాంతము కూడా అన్ని ఆక్షేపములనూ ఎదుర్కోలేదు. ఈ విషయములో అనేక సిద్ధాంతముల

అసమర్థత కూడా విచారించాము. ఇవన్నీ వదలి, మనము శ్రుతి సిద్ధాంతమును ఇలా చూస్తున్నాము – జగత్తునకు అభిన్న నిమిత్తోపాదాన కారణము బ్రహ్మ. దీనిమీద తార్కికుల ఆక్షేపములు వచ్చినా, వాటిని కూడా నివారించుట జరిగింది. ఇలా నిశ్చయము చేయబడినది– ఈ జగత్తు నామ రూపాత్మకమై అనేక వివిధత్వములతో వున్నప్పటికీ, తన స్వరూపములో అది బ్రహ్మమే! నిర్గుణ బ్రహ్మయొక్క మహాశక్తే మాయ! ఇది త్రిగుణాత్మకము, బ్రహ్మాధీనము, నిత్యము, అనిర్వచనీయము. స్వరూపములో అది బ్రహ్మకంటె అనన్యము. ఇది ఆకాశాది క్రమముతో జగత్తును సృష్టిస్తున్నది. సృష్టికి విరుద్ధక్రమములో లయమును చేస్తున్నది. సృష్టి – స్థితి – లయముల చక్రము ఆదియును అంతము లేనిది. మాయ యొక్క పరిణామరూప జగత్తుకు బ్రహ్మతో గల సంబంధమే కార్య – కారణ అనన్యత్వము. అనన్యత్వ న్యాయములో చెప్పబడిన ఒకే కార్య శబ్దమును పూర్వార్ధములో శ్రుతిని అనుసరించి, ఉత్తరార్ధములో లోకపద్ధతిని అనుసరించి ప్రయోగము చేసి భగవాన్ భాష్యకారులు ఒక చమత్కారమును చేశారు. అజ్ఞానకాలములో జగత్తును ముముక్షువు చూస్తున్న భేదబుద్ధితో ప్రారంభించి, అనిర్వచనీయముగా చెప్పడము ద్వారా చివర దానిని, అవ్యవహార్య బ్రహ్మమని బోధించడము జరిగింది.

ప్రశ్నలు :

1. కార్యకారణముల మధ్య ఒక శక్తిని ఎందుకు స్వీకరించాలి? ఒక దృష్టాంతమును చెప్పి స్పష్టము చేయండి.
2. మాయకు అర్థము ఏమిటి? మాయ, బ్రహ్మశక్తి అని ఎలా నిశ్చయమవుతున్నది?
3. మాయకు పర్యాయపదములు ఏవి?
4. భగవద్గీతలో మాయను ఎన్నివిధములుగా చెప్పారు?
5. అపరాప్రకృతి అంగములు ఏవి? 'అపరా' అనే విశేషణమునకు కారణము ఏమిటి?
6. మాయోపాధికుడైన బ్రహ్మకు ఏఏ పేర్లు ఉన్నాయి?
7. 'అహంకారము' అనగా ఏమి?
8. పరాప్రకృతి అంటే ఏమిటి? ఏ కారణమువల్ల దానిని 'పరా' అన్నారు?
9. మాయతో మోహితులై జీవులు ఏమి చేస్తున్నారు?
10. మాయ, బ్రహ్మకు అధీనమని ఎలా చెప్తారు?
11. బ్రహ్మే జగద్వ్యవహారమును నిర్వహణ చేస్తున్నది – పురాణములలో దీనిని ఎలా వర్ణించారు?
12. తన్మాత్రలు ఏవి?
13. బాహ్య జగత్తు పంచీకరణము ఎలా అవుతున్నది?
14. పరమాత్మ శరీరములో ప్రవేశించాడు – ఇలా చెప్పడములో సంశయము ఏమిటి? దాని పరిహారము ఏమిటి?
15. తన్మాత్రల అర్థము ఏమిటి?

16. సూక్ష్మశరీరతత్త్వములలో పంచతన్మాత్రల పంపకము ఎలా అవుతున్నది?
17. ప్రళయక్రమము ఎలా అవుతుంది?
18. 'తజ్జలాన్' యొక్క అర్థము ఏమిటి?
19. 'మాయ అనిత్యము' అని చెప్పడములో దోషము ఏమిటి?
20. పరిణామ నిత్యత్వము – కూటస్థ నిత్యత్వమునకు అర్థము ఏమిటి?
21. 'ప్రళయకాలములో కూడా మాయ వుంటుంది' – దీనిని సమర్థించండి.
22. 'మధ్యమణిన్యాయము' అంటే ఏమిటి?
23. 'మాయ అనిర్వచనీయము' దీని వర్ణన ఎలా చేస్తారు?
24. నామరూపముల అనిర్వచనీయత్వము ఎలా నిశ్చయించాలి?
25. శంకరభాష్యములో, మాయ–బ్రహ్మల సంబంధముయొక్క వర్ణన ఎలా చేశారు?
26. మాయ (లేక నామరూపముల) ఉపాధిత్వము, అనిర్వచనీయత్వము, మరియు బ్రహ్మానన్యత్వములను ఎలా సమన్వయము చేయాలి?
27. జగత్ప్రకరణము యొక్క సారము సంక్షేపముగా వ్రాయండి.

బ్రహ్మ ప్రకరణము

వెనుకటి అధ్యాయములో జగత్ప్రకరణమును విశ్లేషణ చేసి, నిశ్చయము ఇలా చేశారు– జగత్తును బాహ్యరూపములో చూస్తే గ్రహ - నక్షత్రములు గుహలు - పర్వతములు, నదులు - సముద్రములు, వీటితో కూడి వివిధ రూపములలో కనిపిస్తున్నప్పటికీ అది స్వరూపములో 'బ్రహ్మ' మాత్రమే. అనగా, కనపడే ఏ కార్యములోనయినా వాచారంభణ వికారముల మీద దృష్టి పెట్టకుండా, వాని సారమును గ్రహించినట్లయితే వాటి అన్నింటిలో 'బ్రహ్మ' మాత్రమే ఉన్నదని తెలుస్తుంది. ఇందువల్ల జగత్తులోనే వున్న బ్రహ్మను జగత్తునుంచి విడిగా చూడాలి. కాని బాహ్య వికారముల చింతన వదలడము అంత సులభము కాదు. పరమాత్ముడు ఇంద్రియములను బహిర్ముఖముగా నిర్మించాడు. అందువల్ల మానవుడు బాహ్యముగానే చూస్తాడు. "పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః తస్మాత్ పరాజ్ పశ్యతి।' (కఠ॥ 2-1-1). దీనికి అతిరిక్తముగా, బ్రహ్మ, కార్య జగత్తుకు విలక్షణము. ఈ వైలక్షణ్యము ఎటువంటిదో మనకు తెలియదు. అందువల్ల బ్రహ్మము ఎదురుగా ఉన్నప్పటికీ మనము గుర్తించలేము. అనుమానముతో మనము ఈ వైలక్షణ్యమును గ్రహించలేము. శాస్త్రము, కార్య ప్రపంచమునుండి వేఱు చేసి బ్రహ్మను గుర్తించే క్రమము చెప్తుంది. మొదట దానిని జీవుని నుండి వేఱు చేస్తుంది. ఇలా వేఱు చేసిన బ్రహ్మను 'సవిశేషము' అంటారు. తరువాత కార్యప్రపంచము నుండి భిన్నమయిన బ్రహ్మయొక్క బోధ కోసము, బ్రహ్మను సత్యము–జ్ఞానము–అనంతము అని మూడు లక్షణములతో చెప్తున్నది. ఆఖరున ఉపాధి నిరపేక్షమై, తన మహిమలోనే వున్న బ్రహ్మను, నిశ్చయము చేస్తుంది. ఇదే 'నేతి, నేతి' అని చెప్పబడే బ్రహ్మ. దీని నిస్సందిగ్ధ జ్ఞానము రానంతవరకు, "తత్త్వమసి" – అది నీవే, అని వెయ్యి సార్లు జపించినా ఆత్మజ్ఞానము రాదు. (సూ॥ భా॥ 3-2-21). దీనిని తెలుసుకోవడము కఠినముగా భావించేవారు – విరక్తులైన సాధకులు – కూడా జ్ఞానమార్గమునుండి వెనుకకు వచ్చి, చిత్త వృత్తి నిరోధము వంటి కర్మలను అనుసరిస్తారు. ఇందువలన ఆ బ్రహ్మయొక్క యథార్థబోధ కోసము పూజ్యులైన భాష్యకారులు చాలా సూక్ష్మమైన విశ్లేషణ చేశారు. దాని సారము ఈ అధ్యాయములో వివరించాము.

అధ్యాయము - 9

బ్రహ్మ యొక్క పృథక్కరణము

ఈ అధ్యాయములో విశేషణములచేతను సత్యత్వ జ్ఞానత్వ అనంత లక్షణములచేతను బ్రహ్మను (ఇతరములనుండి) వేరు చేస్తున్నాము. సత్యము, అసత్యము, మిథ్య, వ్యావహారిక సత్యము, ప్రాతిభాసిక సత్యము - వీని స్పష్టమైన నిరూపణము, శంకర భాష్య ఆధారముతో పరబ్రహ్మ యొక్క సర్వజ్ఞత్వయొక్క నిరూపణము, దాని నిర్విశేషత్వమునకు హేతువు, ఇంకా అధ్యారోప అపవాదములు - ఇవి ఈ అధ్యాయములోని విషయములు.

9-1) విశేషణములు - లక్షణములు

ఏ వస్తువునైనా స్పష్టరూపముగా గుర్తించాలంటే, దానిని దాని జాతికి చెందిన ఇతర వస్తువులనుండి, వేరే జాతులకు చెందిన అన్ని వస్తువులనుండి విడదీయాలి.

ఒక వస్తువును దాని జాతికి చెందిన ఇతర వస్తువులనుండి విడదీసే గుణమును 'విశేషణము' అంటారు.

ఉదా:- నీలకమలమును ఇతర కమల పుష్పములనుండి వేరు చేసే గుణము, నీలవర్ణము. నీలవర్ణము నీలకమలము యొక్క 'విశేషణము'.

2) చతుష్పాద పశువులలో గోవును ఇతర గోవులనుండి విడిగా గుర్తింపజేసే దాని 'గంగడోలు' (మెడ దగ్గర వ్రేలాడే చర్మము) దాని 'విశేషణము.-

ఒక వస్తువును కేవలము దాని జాతికి చెందినవాటినుంచే కాక ఇతర జాతి వస్తువుల నుండి కూడా విడదీసే గుణమును 'లక్షణము' అంటారు.

ఉదా:- వాయువు, అగ్ని మొదలైన వస్తువుల అస్తిత్వము కొఱకు ఆకాశము వాటికి అవకాశము ఇస్తుంది. మిగిలిన భూతములకు 'అవకాశప్రదాయిత్వ' గుణము లేదు. అందువల్ల ఇది ఆకాశ లక్షణము.

2) నదులన్నీ ప్రవహించి వెళ్ళి ఆఖరున సముద్రములో కలుస్తాయి. ఇంక దేనికీ ఈ గుణము లేదు. అందువల్ల సముద్రమునకు ఇది లక్షణము.

9-2) బ్రహ్మ యొక్క భావరూప విశేషణము

బ్రహ్మను విశేషణములతో లక్షణములతో ఇతరములకంటె భిన్నముగా గుర్తించే ప్రయత్నము చేస్తున్నారు. మొదట విశేషణములను తీసుకుందాము. విశేషణమునకు అర్థము - అదే జాతిలో అన్య వస్తువులకు లేని విశేష గుణము. ఇప్పుడు మనుష్యజాతిని తీసుకుని విచారిద్దాము. మన జ్ఞానమును మనమే తెలుసుకుంటాము. దీనివల్ల మనలో పనిచేసే విశేష ప్రవృత్తి పుడుతుంది. సృష్టికర్తయైన బ్రహ్మలో కూడా జ్ఞానము వుంటుంది. ఎందుకంటే అది జగత్తుకు నిమిత్తకారణము. జ్ఞానము ఉండడము అనేది ఇద్దరిలో సమానము కనుక మనము - బ్రహ్మ ఒకే జాతికి చెందినవారము. ఇది చాలా ఆనందించవలసిన విషయమైనా, మనకు బ్రహ్మకు చాలా అంతరము ఉన్నది. మనము ఇల్లు కట్టుకుంటాము. బ్రహ్మ సర్వజగత్తునే సృష్టిస్తుంది. అందువల్ల మనము అల్పశక్తి కలవాళ్ళము; అది సర్వ శక్తిమంతము అయినది. నిజం చెప్పాలంటే

మనలో ఉన్న ఈ అల్పశక్తి కూడా ఆ బ్రహ్మదే; అట్లే మనలో కొన్ని విషయాల జ్ఞానం మాత్రం ఉన్నది; దానిలో అన్నిటియొక్క జ్ఞానము వుంటుంది. అందుచే మనము అల్పజ్ఞులము: అది సర్వజ్ఞము. మన ఈ అల్పజ్ఞత్వము కూడా దానివలననే వచ్చింది. మనము అనేక సంకల్పాలు చేస్తూవుంటాము; వాటిలో కొన్ని ఫలిస్తాయి-కొన్ని నిష్ఫలమవుతాయి. దాని ఇచ్ఛ మాత్రము ఏదీ వృథా కాదు; అందువల్ల అది 'సత్య సంకల్పము'; సరిగ్గా చెప్పవలసివస్తే చాలా సార్లు మన సంకల్పములు ఇచ్ఛలు దాని కృపవలననే నెరవేరుతున్నాయి. మాయోపాధితో కూడిన బ్రహ్మమే ఈశ్వరుడు. ఈశ్వరునితో పోలిస్తే మనము అకించనులము. భగవంతుడు సదా జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజస్సులతో కూడి వుంటాడు. అందుచేత అతనిని 'షడ్గుణ సంపన్నుడు' అంటారు. భూత భవిష్యత్ వర్తమానకాలములను తెలుసుకోగలిగే సర్వజ్ఞత్వమే అతని జ్ఞానము. చేతనము అయినవాడు అచేతనము అయిన ప్రకృతిని, నియమించే సామర్థ్యమే 'ఐశ్వర్యము'. అఘటితఘటనా సామర్థ్యము - ఇతరులు చేయలేని కార్యములను చేయగలగడము అతని శక్తి. ఏ విధమైన అలసట లేకుండా జగత్తును ధారణ చేస్తున్నాడు - ఈ సామర్థ్యమే బలము, ఎన్నడూ మార్పు చెందని అచలమైన సత్యత్వము అతని 'వీర్యము'. అన్నింటినీ జయించగలడు-అదే అతని తేజస్సు. ఇన్ని వున్న అతడు నిత్య శుద్ధ-బుద్ధ-ముక్త స్వరూపుడు. జన్మమరణరహితుడు. అయినా, లోకానుగ్రహము కొఱకు తన మాయతో కూడి అవతారములు పొంది జన్మించినట్లు కనపడతాడు. స్థూలదృష్టితో అతడు మనవంటివాడు అనిపిస్తాడు; ఇందువల్ల ఎవరైనా అతడు ఈశ్వరుడు కాడు-సర్వజ్ఞుడు కాడు, అని అన్నట్లయితే, వాడు నిజముగా మూర్ఖుడు "యా వాసుదేవే అనీశ్వరాసర్వజ్ఞాశంకా మూర్ఖాణామ్।" (గీ॥ భా॥ 4-5). ఈ విధంగా బ్రహ్మరూపుడయిన ఈశ్వరుడు సర్వజ్ఞత్వ - సర్వశక్తిత్వ - సత్యకామ, సత్యసంకల్పత్వములతో ప్రకాశిస్తూ వుంటాడు, అతని విశేషములు అనంతములు. పైన చెప్పిన అన్ని విశేషములు భావరూపములు. అనగా- "ఉన్నవి" అని తెలుస్తున్నాయి.

9-3) అభావరూప విశేషణములు

పైన చెప్పబడిన విశేషణములు కాక ఇతర విశేషణములు కొన్ని అతనికి మనకి భిన్నతను తెలియజేస్తున్నాయి. అవన్నీ అభావరూపములు. అవి 'లేవు' అని ప్రతీతమవుతున్నవి. అవి- అపహతపాప్మా= పాపపుణ్యములు లేనివాడు, అజరుడు, అమరుడు, శోకరహితుడు, ఆకలిదప్పికలు లేనివాడు- "అపహతపాప్మావిజరో విమృత్యుర్విశోకో విజఘత్సో అపిపాసః" (ఛాం॥ 8-1-5). కాని, జీవుడు ఇటువంటివాడు కాదు. ఈ విశేషములతో జీవుడు అతనికంటె భిన్నమయినవాడు అని తెలుస్తున్నది. ఇవి సర్వజ్ఞత్వము మొదలైన వాని వలె భావరూపములు కావు; అభావ బోధక శబ్దముల ద్వారా చెప్పబడినవి.

పై విధంగా బ్రహ్మను భావ-అభావ రూపవిశేషణములతో జీవుని కంటె భిన్నమైనదని చెప్పడమయినది. ఇకముందు లక్షణములతో దానిని వాని కన్న వేరైన వాటన్నిటితో వేఱు చేసి తెలుసుకోవలసివున్నది. శ్రుతి ఈ లక్షణములను సత్యము-జ్ఞానము - అనంతము అన్నది. అనగా ఏది సత్యమో - జ్ఞానమో- అనంతమో అదే బ్రహ్మ. (తై॥ 2-1-1). ఇవి మూడు పారిభాషిక శబ్దములు; కనక క్రింద వీటి మూడింటి అర్థము స్పష్టము చేయబడుతున్నది.

9-4) బ్రహ్మము సత్యము

ఈ విషయములో వెనుక (అధ్యా॥ 6 -4)లలో చెప్పబడిన విషయము జ్ఞప్తికి తెచ్చుకోవాలి. కార్యము, కారణమును తెలియజేసే ఒక వికారము. అది వాచారంభణము, నామధేయము; అంతకంటే దానికి ఏమీ

అర్థము లేదు. దీని ప్రయోజనము కేవలము కారణమును బోధచేయడమని పై అధ్యాయములలో చెప్పడము జరిగింది. కార్య వికారములు ముందులేవు; తరువాత ప్రకటింపబడ్డాయి. వాటిలో ఇంకా వేఱే వికారములు రావచ్చు. ఇలా కార్యమునకు ఒక రూపమనేది లేదు. కాని దాని ఉపాదానము ఎల్లప్పుడూ ఒకటిగానే ఉంటుంది. కార్యసృష్టికి పూర్వము, కార్య సృష్టి వున్నప్పుడు, అది నశించినప్పుడు కూడా, కారణము తన స్వరూపమును విడిచి వుండదు. అందువల్ల కారణము సత్యము; కార్యము అసత్యము. ఈ శబ్దముల వ్యాఖ్యను జ్ఞప్తిలో ఉంచుకోవాలి. "యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం న వ్యభిచరతి తత్సత్యం" – ఏదైతే ఏ రూపంతో ఒకసారి తెలియబడుతూ తరువాత ఆ రూపమును ఎప్పుడూ విడిచిపెట్టదో, అది సత్యము. "యద్రూపేణ యన్నిశ్చితం తద్రూపం వ్యభిచరత్, తదనృతమ్।" – ఏదైతే ఏ రూపముతో ఒకసారి తెలియబడుతూ తరువాత ఆ రూపమును విడిచిపెడుతుందో అది అసత్యము. (తై।। భా।। 2-1-1). జగత్తు కార్యము. బ్రహ్మ దాని ఉపాదానము. అందువల్ల జగత్తు అసత్యము – బ్రహ్మ సత్యము. అనగా పరివర్తనశీలమైనందువల్ల జగత్తు అసత్యము; మార్పులేనటువంటి బ్రహ్మ సత్యము. ఈ విధముగా బ్రహ్మ సత్యము అని చెప్పడములో తాత్పర్యము – అది అసత్యకార్య సమూహము కంటే వేరుగా వున్నది. అనగా బ్రహ్మ కారణము మాత్రమే. కార్యము కాదు.

బ్రహ్మ కూడా కార్యరూపమైతే దానికి ఇంకొక కారణము కావాలి. ఆ కారణము శూన్యము కాజాలదు. శూన్యము దేనికీ కారణము కాజాలదు. ఈ ప్రకారము బ్రహ్మకు ఒక కారణము, ఆ కారణమునకు ఇంకొక కారణము ఇలా చెప్తూ పోతే అనవస్థాదోషము సంభవిస్తుంది. ఆ దోష నివారణ కోసము మూల కారణమునే శాస్త్రము బ్రహ్మగా స్వీకరించింది – "యా మూలప్రకృతిః అభ్యుపగమ్యతే తదేవ చ నో బ్రహ్మ।" (సూ।। భా।। 2-3-9)

సంశయము :– బ్రహ్మను సత్యముగా తెలుసుకోవడము కోసము పైన చెప్పిన వ్యాఖ్య కాలము మీద ఆధారపడివుంది. కాలముకూడ అసత్యమని పై వ్యాఖ్య వల్లనే తెలుస్తున్నది. ఇలా ఆధారము అసత్యము అయినందువల్ల దేనిని నిశ్చయము చేయాలనుకుంటున్నామో ఆ బ్రహ్మ శూన్యము కావచ్చు, లేక ఏవిధంగానూ నిశ్చితము కాకపోవచ్చు.

సమాధానము :– అలా జరుగదు. భూత – భవిష్యత్ – వర్తమానములను మూడు కాల విశేషములు నిర్విశేషకాలమునకు గుర్తులు; ఇవి అసత్యములు. కాని, నిర్విశేష కాలము సత్యము; దీని ఆధారముతోనే బ్రహ్మ సత్యత్వమును నిరూపణ చేస్తున్నాము.

ఆక్షేపము :– బ్రహ్మతోపాటు ఈ నిర్విశేషకాలముకూడ సత్యము కనుక బ్రహ్మ, కాలముకంటె వేఱుగా కాజాలదు.

సమాధానము :– ఈ ఆక్షేపము స్వల్పము. ఇంతకంటె వేరైన పెద్ద ఆక్షేపమూ వున్నది. జడము కూడ ఎల్లప్పుడూ జడముగానే ఉండడము వల్ల తన జడత్వమును ఎన్నడూ విడిచిపెట్టదు. కనుక జడము కూడా సత్యమే. అప్పుడు బ్రహ్మను జడముకంటే కూడా వేఱుగా గ్రహించడం కుదరదు.

సంశయము :– అయితే ఈ ఆక్షేపమునకు పరిహారము ఏమిటి?

సమాధానము :– శ్రుతి బ్రహ్మయొక్క ఇతర లక్షణములను కూడా చెప్తున్నది. రెండవదైన 'జ్ఞానము' అను లక్షణము బ్రహ్మను నిరపేక్షకాలముకంటె – జడత్వముకంటె ఒకేసారి భిన్నమునుగా బోధిస్తున్నది. ఎందుకంటే ఆ రెండూ కూడా జ్ఞేయములే!

సంశయము :– నిరపేక్షకాలము – జడత్వము ప్రళయకాలములో ఎలా వుంటాయి?

సమాధానము :– బ్రహ్మలో అవ్యక్తరూపముగా వుంటాయి. సృష్టి సమయములో అవి కాలవిశేషముగాను జడ వస్తురూపముగానూ వ్యక్తమవుతూ వుంటాయి.

ఈ చర్చను సంక్షేపముగా ఇలా కూడా చెప్పవచ్చు. కాలమును కూడా వదలిపెట్టాలి. ఇలా వదలిపెడితే తరువాత ఏమీ లేకుండా పోదు. అన్ని అసత్యములను కాలములో మూటకట్టి, ఆ మూటను బ్రహ్మరూప సముద్రములో వదలివేసిన తరువాత దీని ద్రష్ట వుంటాడు. కాలము యొక్క అసత్యత్వమునకు సాక్షి అతడే! అతడే బ్రహ్మ; అందువల్ల బ్రహ్మ శూన్యము కాదు.

పైన చెప్పిన అసత్య కార్యము కంటే భిన్నముగా ఇంకొక కార్యము కూడ ఉన్నది. కారణముతో దానికి తాదాత్మ్య సంబంధము ఏమీ లేదు (అధ్యా 8–5) ఇది మిథ్య. తన స్వరూపముతో కార్యము కారణముతో అనన్యమైనప్పటికినీ కార్యమును స్వతంత్ర రూపముగా గుర్తించడము సహజము. బ్రహ్మతో అభిన్నమయినప్పటికీ ఈ జగత్తును ఎవరూ బ్రహ్మరూపములో చూడడము లేదు; స్వతంత్ర రూపముగానే చూస్తున్నారు. ఈ విధముగా జగత్తును స్వతంత్రరూపముగా చూచుట జగత్తుయొక్క 'మిథ్యాజ్ఞానము'. ఈ మిథ్యాజ్ఞానమునకు విషయమైనదే మిథ్యాజగత్తు. ఈ జగత్తు అజ్ఞాని బుద్ధిలో ఉన్నది; అది అతని కల్పన; అది బాహ్యమైనది కాదు.

ఈ మిథ్యాజగత్తు అనిర్వచనీయమైనది కాదు. ఎందువల్లననగా – ఇది బ్రహ్మకంటె వేఱైనది అవటంవల్లనే మిథ్య అయినది. 'జగద్ – బ్రహ్మ అనన్యత్వ న్యాయము' యొక్క ఉత్తరార్ధములో చెప్పబడిన జగత్తు మిథ్య అయితే, పూర్వార్ధములో చెప్పబడిన జగత్తు అసత్యము. ఇది కారణ దృష్టితో చూస్తే బ్రహ్మనుంచి అభిన్నము, వ్యవహారదృష్టితో చూస్తే భిన్నము. ఇందువల్ల అసత్యజగత్తులో అనిర్వచనీయత్వము కనపడవచ్చు; కాని మిథ్యాజగత్తులో కాదు. ఇలా సత్యము, అసత్యము, అనిర్వచనీయత్వము, మిథ్య – ఈ పదముల అర్థమును భాష్యమును అనుసరించి స్పష్టము చేయడంతో శంకర సిద్ధాంతము స్పష్టముగా వుంటుంది. సిద్ధాంత ప్రతిపాదనలో, నేర్పును చూపించే తర్కము అవసరము లేదు.

9–5) మూడు సత్యములు

ఏది పరమార్థములో ఉంటున్నదో అది సత్యము; వ్యవహారములో ఉన్నది అసత్యము – ఇది మాటిమాటికి చెప్తున్నాము. వ్యావహారిక జగత్తు మారుతూ వుంటుంది. ఇందువల్ల ఇది అసత్యమని శ్రుతి కూడా చెప్పింది. "వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్।" (ఛాం॥ 6–4–1). కాని సహజముగా పంచేంద్రియముల ద్వారా అనుభవమునకు వచ్చే విషయములనే జనులు సత్యమని చెప్తారు. కొంచెము నిలబడి ఆలోచిస్తే, బాహ్యజగత్తు మార్పు చెందుతుంది–అందువల్ల అసత్యమని తెలుస్తుంది. ఈ విధముగా జగత్తు యొక్క అసత్యత్వమును తెలుసుకున్నా వ్యవహార సమయములో అది గుర్తువుండదు. కనుక అది సత్యమని అనుకుంటారు. బుద్ధిమంతులు కూడా శాస్త్రవాక్యములను మరచిపోయి ఇలా వ్యవహారము చేస్తూ వుంటారు. అందువల్ల పరంపరాగతముగా ఈ శబ్దమును ఉపయోగించడములో సామాన్యజ్ఞానం గల జనులకు శాస్త్రము కొద్ది అవకాశము యిస్తూ, సత్యాసత్యముల విశ్లేషణను ముందుకు సాగిస్తూ వుంటుంది. ఇంద్రియానుభవములోకి వచ్చే అన్ని విషయాలను సత్యమని భావిస్తూ దానిని మూడు విభాగములుగా చేశారు:– 1) పారమార్థిక సత్యము 2) వ్యావహారిక సత్యము 3) ప్రాతిభాసిక సత్యము.

ఒక వైజ్ఞానిక ఉదాహరణతో ఈ మూడు సత్యములను స్పష్టము చేస్తాము. ఒక వస్తువు ఉన్నదనుకోండి. కటకము (లెన్స్) ద్వారా దాని నిజమైన ప్రతిబింబము తెరమీద పడుతుంది. ఆ సత్య ప్రతిబింబము కటకస్థానముమీదా తెరయొక్క స్థానముమీదా, తెరయొక్క ఋజుత్వకుటిలత్వాల మీద ఆధారపడి వుంటుంది. ఈ ప్రతిబింబమును రూపచిత్రముగా తీయవచ్చు. ఈ విధముగా సత్యప్రతిబింబము అందరి వ్యవహారములోకి రావచ్చు. ఇంతేగాక, వస్తువు యొక్క భ్రమజనక ప్రతిబింబము కూడా కొన్ని అవసరములలో కనపడవచ్చు. కొన్ని నిర్దిష్ట స్థానములలో దీనిని చూడగలము. ఇతర స్థానములలో దీనిని చూడలేము. దీని ప్రతిబింబము తీయబడదు. ఇది ఈ విధముగా వ్యవహారములోనికి రానప్పటికీ చూడడానికి పనికివస్తుంది.

పై దృష్టాంతములో, వస్తువు పారమార్థిక సత్యము, అది అందరికీ ఎల్లప్పుడూ ఒకే ప్రకారముగా ఉంటుంది. కాని, సత్యప్రతిబింబము వ్యావహారిక సత్యము. ఇది అందరి వ్యవహారములో ఒకటే అయినప్పటికీ, కటక స్థానమును, తెరస్థానమును అనుసరించి మారుతూ వుంటుంది. భ్రమజనక ప్రతిబింబము ప్రాతిభాసిక సత్యము: ఏదో ఒక నిర్దిష్ట స్థానములో భాసమైనప్పటికీ వ్యవహారమునకు రాదు.

9–6 పారమార్థిక సత్యము:

శాస్త్రములో పారమార్థిక సత్యమునకు అర్థము – ఎల్లప్పుడూ ఒక లాగే ఉండేది. తైత్తరీయ శ్రుతిలో బ్రహ్మకు ఏ ప్రథమ లక్షణము చెప్పబడినదో అదే సత్యమైన బ్రహ్మ. (అధ్యా ॥ 9–4). అది ఇంద్రియములతో తెలియదగినది కాదు. ఎప్పుడూ మారుతూ వుండేది మాత్రమే ఇంద్రియవేద్యము. ఈ విషయమును ఆధునిక విజ్ఞానశాస్త్రము కూడా నిశ్చయించింది. విజ్ఞానశాస్త్రము యొక్క పరిచయము లేని వాళ్ళు కూడా దానిని తను అనుభవముతో తెలుసుకోవచ్చు. తంబుర శ్రుతి స్థిరముగా వున్నప్పుడు మాత్రమే పాడేవాని శ్రుతిలోని భేదము తెలుస్తుంది. ఈ విధమైన దృష్టాంతముతో పారమార్థిక సత్యము ఇంద్రియవేద్యము కాదని తెలుస్తున్నది. అలాంటప్పుడు ఇంద్రియ వేద్యము కాకపోవటం వల్ల బహుశః బ్రహ్మ అస్తిత్వము లేని వస్తువని సందేహించుటకు కారణము ఏమీ లేదు. ఎందుకంటే ఒకవేళ జగత్తులో బ్రహ్మమే లేకుంటే ఈ జగత్తు ఎవరికీ వ్యవహారమునకు దొరకదు. "న హి నిరాత్మకం కించిత్ భూతం వ్యవహారాయ అవకల్పతే" (గీ॥భా॥ 9–4). అది వున్నదే; అన్ని అసత్యములకు కారణము కనుక అది అసత్యము కాదు, అదే బ్రహ్మ.

9–7) వ్యావహారిక సత్యము

పరివర్తన శీలమైన జగత్తు యొక్క విషయములను జ్ఞానేంద్రియములతో తెలుసుకోగలము. ఇంద్రియలోపములేనివారికి ఎవరికైనా ఈ జ్ఞానము ఒకే విధముగా వుంటుంది. రాయి ఎవరికైనా రాయి మాత్రమే. ఇలా జగత్తులో ఉత్పన్నమయ్యే సమానజ్ఞానము లౌకిక వ్యవహారమునకు ఆధారము. ఇలా ప్రతిసారి మార్పు చెందుతూ అందరి వ్యవహారములలోను ఉంటున్న జగత్తును వ్యావహారిక సత్యము అని శాస్త్రము చెప్పింది. మార్పు చెందుతుంటేనూ 'సత్యము' అనడానికి కారణము, దానికి ఉపాదానము అయిన బ్రహ్మకంటె అది వేరు కానిది అవడం.

9–8) ప్రాతిభాసిక సత్యము:

వ్యావహారిక సత్యముకన్న భిన్నమయిన ఇంకొక సత్యము కూడా ఉన్నది. ఉదాహరణకు 'మరీచిక' యొక్క అనుభవము – ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు ఎడారిలో దూరము నుంచి చూస్తే నీరు ఉన్నట్లు

కనబడుతుంది. దగ్గరకు వెళ్ళి చూస్తే నీరు ఉండదు; ఉన్నట్లు ఆభాస మాత్రమే కలిగింది. ఈ విధముగా దేశకాలానుసారము ఇంద్రియ అనుభవము మాత్రముగా వుండి, వ్యవహారమునకు యోగ్యముకాని సత్యము – ప్రాతభాసిక సత్యము. ప్రాతిభాసిక పదార్థములను 'సత్యము' అని చెప్పడానికి కారణము వానిలో కూడా సత్యరూపమైన బ్రహ్మే ఉన్నది. ఇంద్రియలోపములేని ఎవరికైనా అది నీరులాగే కనపడుతుంది. ఇలా కనపడడానికి కారణము ప్రకృతి నియమము. ఎండగా ఉన్నప్పుడు ఎడారిని నిర్దిష్టమైన దూరములో చూస్తేనే ఇలా కనబడుతుంది. అందువల్ల మరీచికకు కూడా బ్రహ్మ సత్తయే కారణము, చూసేవారి కల్పన కారణము కాదు. నీరు లాగా కనపడే మరీచికా జ్ఞానము భ్రమకాదు. అది ప్రాతిభాసిక సత్యముయొక్క యథార్థ జ్ఞానము. కానీ మరీచికను నీరు అనుకోవడము మరీచికయొక్క మిథ్యాజ్ఞానము. ఈ మిథ్యాజ్ఞానమునకు విషయమైన నీరు మిథ్య. ఇది భూమేనా? దానికంటే వేరైన నీరా? ఇలా అనుకునే అనిర్వచనీయత్వము మరీచికలో ఉండవచ్చు, మిథ్యయైన నీటిలో వుండదు. ఈ విధముగా వ్యావహారిక సత్యము మరియు ప్రాతిభాసిక సత్యము రెండింటికి, పారమార్థిక సత్యమైన బ్రహ్మ ఆధారము. కాని ప్రాతిభాసిక సత్యము వ్యావహారిక సత్య దృష్టితో అనృతము – అసత్యము. వ్యావహారిక సత్యము, పారమార్థికదృష్టితో అనృతము. దీనిని శ్రుతి ఇలా అన్నది – "సత్యంచానృతం చ సత్యమభవత్, యదిదం కిం చ తత్సత్యమిత్యాచక్షతే।" – (పారమార్థిక) సత్యమే, (వ్యావహారిక) సత్యము, మరియు అనృతము– (ప్రాతిభాసికము) అయింది. ఇక్కడ ఏదైతే ఉన్నదో, అదంతా అదే అయింది. దానిని (పారమార్థిక) సత్యము అంటారు. (తై॥భా॥2-6-7). దీనిని బృహదారణ్యక శ్రుతి ఇంకొక ప్రకారములో చెప్పినది:– "నామరూపే సత్యం తాభ్యామయం ప్రాణశ్ఛన్నః" – నామ రూపములు సత్యము. ఈ ప్రాణము వానిలో దాగి ఉన్నది. (బృ॥1-6-3), "తస్యోపనిషత్ సత్యస్య సత్యమితి ప్రాణావై సత్యం తేషామేష సత్యమ్।" – దాని ఉపనిషత్ సత్యమున సత్యము. ప్రాణములు సత్యము. ఆ ప్రాణములకు ఇది సత్యము. (బృ॥ 2-1-20).

9-9) బ్రహ్మము జ్ఞానము

1) ఇక రెండవ లక్షణమును గురించి విచారణ చేస్తున్నాము. సత్యము అనగా జడ జగత్తుకు కారణము అని తెలిసింది. అయితే, ఇది జడజగత్తు లాగే జడమే అవుతుందా అని ప్రశ్న. ఎలాగంటే జడమైన ఘటమునకు కారణమైన మన్ను కూడా జడమే. కాని, బ్రహ్మ జడము కాదు. జడ వస్తువు జగత్తుకు నిమిత్తకారణము కాజాలదు. ఈ విషయము తెలిసినప్పటికీ, బ్రహ్మ లక్షణ ప్రసంగము వచ్చినప్పుడు ఏ లక్షణమునుపట్టి బ్రహ్మ జడము కాదో దానిని చెప్పవలసి ఉన్నది. అనగా తన ఏ గుణముతో బ్రహ్మ మిగిలిన అన్ని జడముల నుండి వేఱుగా వున్నదో, దానిని చెప్పాలి. అందువల్ల శ్రుతి బ్రహ్మమునకు 'జ్ఞానము' అని ఆ రెండవ లక్షణమును చెప్పింది. దీని అర్థము తెలుసుకునే ముందు చాలా జాగ్రత్తగా వుండాలి. ఎందుకనగా సాధారణముగా మాట్లాడే భాషలో విషయాల గురించి వచ్చే బుద్ధి వృత్తినే 'జ్ఞానము' అంటారు. ఇక్కడ అలా కాదు, ఎందుకంటే ఆ జ్ఞానము విషయములతో పాటు మారుతూ వుంటుంది. ఉ దా:– ఒకసారి 'ఘట' జ్ఞానము, ఇంకొకసారి 'పట' జ్ఞానము కలుగుతూ వుంటుంది. గాఢ నిద్రలో ఏ విషయవృత్తి జ్ఞానమూ వుండదు. అందువల్ల వృత్తి జ్ఞానము అసత్యము. ఇది బ్రహ్మసత్యత్వమునకు విరుద్ధము. అందువల్ల ఇది బ్రహ్మ లక్షణము కాబోదు. బ్రహ్మభూతమైన రూపజ్ఞానము సత్యముగా కూడా వుండాలి. అందువల్ల ఇక్కడ జ్ఞానము ఘట జ్ఞానము – పట జ్ఞానము వలే వృత్తిజ్ఞానము కాదు, జ్ఞానము 'కేవల జ్ఞానము' – దీనినే "జ్ఞప్తి" అంటారు.

2) వృత్తిజ్ఞానమునకు – కేవల జ్ఞానమునకు సూక్ష్మమైన అంతరము ఇలా వున్నది:– ఘట జ్ఞానము, పటజ్ఞానము మొదలైన వృత్తిజ్ఞానమును విశేషజ్ఞానము అంటారు. ఇందులో "ఘటము" , "పటము" విశేషణములు. జ్ఞానము విశేష్యము. అందువల్ల "ఘటము" "పటము" మొదలైన విశేషణములు దేనికో ఆ విశేష్యమే ఈ జ్ఞానము. విశేష్యము లేకుండా విశేషణము వుండదు. కనుక అది ఎల్లప్పుడూ ఉండాలి. అంతేగాక, ఈ విశేష్యము ఎప్పుడూ మారదు. ఎప్పుడూ ఒకే రూపంలో ఉండడము వల్లనే దానికి విశేషణములు వస్తూ, పోతూ వున్నవి. గాఢ నిద్రలోనయితే విశేషణములకు అవకాశమే లేదు. కేవల జ్ఞానమే ఉంటుంది. (దీని విషయము ముందు 13.వ అధ్యాయంలో చెప్పబడుతుంది) అందువల్ల నిద్రనుంచి లేచి వ్యక్తి ఇలా చెప్తాడు :– "గాఢనిద్రలో ఏమీ తెలియలేదు" అని. ఈ విధంగా, "వస్తూ – పోతూ వున్న అసత్య విశేషణములు లేక సత్యస్వరూపముగా ఏ జ్ఞానము వున్నదో, ఆ స్వరూపభూత జ్ఞానము ఇక్కడ ప్రతిపాదించబడినది. ఇది ఏ మాత్రమూ జడము కాదు." (గీ॥భా॥2–16)

9–10) బ్రహ్మ సర్వజ్ఞము అవునా కాదా?

ఇలా, బ్రహ్మ స్వరూపములో అన్ని విశేష జ్ఞానములను నిషేధిస్తే, బ్రహ్మ సర్వజ్ఞము కాదుకదా? అని ప్రశ్న వస్తున్నది. దానికి సమాధానము చెప్తున్నారు – అన్ని విషయములను ప్రకాశింపచేసే జ్ఞానము ఎవరికి ఎల్లప్పుడూ వున్నదో అది సర్వజ్ఞమే. మళ్ళీ ఇలా ప్రశ్నించవచ్చు. "ప్రళయకాలములో ప్రకాశింపబడేది ఏదీ వుండదు. అప్పుడు బ్రహ్మ సర్వజ్ఞము ఎలా అవుతుంది?" ప్రకాశింపబడే వస్తువుయొక్క అనుపస్థితిలో కూడా అది సర్వజ్ఞమే! ప్రకాశింపబడే వస్తువు లేకపోయినా, సూర్యుడు ప్రకాశిస్తూనే వుంటాడు. అదే విధముగా తెలుసుకోగలిగిన విషయం ఏదీ లేనప్పటికీ బ్రహ్మ సర్వజ్ఞము అనడానికి అభ్యంతరము ఏమీ ఉండదు. జీవుడు సుషుప్తి కాలములో ఏమీ తెలుసుకొనుకోలేడు. ఈ కారణముగా వానిని అల్పజ్ఞుడు కాడు అని చెప్పజాలము; వాడు అల్పజ్ఞుడే. ఇంతేకాక, సృష్టికి పూర్వము ప్రకాశింపజేసే వస్తువు ఏమీ వుండదు, అందువలన, బ్రహ్మ అసర్వజ్ఞము అని చెప్పడము కూడా సరికాదు. ఎందుకంటే అప్పుడు అవ్యక్త నామరూపములు ఉంటాయి. అనగా వాటిని కూడా ప్రకాశింపజేసే బ్రహ్మ సర్వజ్ఞమే.

శంక : అలా అయితే, బ్రహ్మలో విశేషజ్ఞానమును ఎందుకు నిరాకరించారు?

సమాధానము : విషయములను ప్రకాశింపజేసే **వ్యవహారము** బ్రహ్మలో లేదు కనుక విశేషజ్ఞానమును నిరాకరించారు. ఎందుకంటే, ఇటువంటి వ్యవహారము కోసము బ్రహ్మకంటే విడిగా, ఇంకొక విషయమును కూడా ఆమోదించవలసివస్తుంది. అటువంటిది ఏదీ లేదు. అదిగాక, ప్రకాశింపజేసే సామర్థ్యము ఏదైతే వున్నదో అదే సర్వజ్ఞత్వము – అది స్వరూపమే. సర్వజ్ఞత్వము దాని స్వభావము "సః సర్వజ్ఞ స్వభావః।" – (ఐ॥భా॥1–1–1). పరమార్థములో సర్వజ్ఞత్వాది వ్యవహారములు సంభవము కాదు. "న పరమార్థతో అపాస్త సర్వోపాధి స్వరూపే ఆత్మని సర్వజ్ఞత్వాది వ్యవహారః ఉపపద్యతే।" (సూ॥భా॥ 2–1–14) కాని, ఎవనిలో అన్ని విషయములను ప్రకాశింపజేసే జ్ఞానము నిత్యమో అతనిని అసర్వజ్ఞుడు అనడము స్వవచన విరుద్ధము. "యస్య హి సర్వ విషయావభాసన క్షమం జ్ఞానం నిత్యమస్తి, సః అసర్వజ్ఞః. ఇతి విప్రతిషిద్ధం।" (సూ॥భా॥1–1–5). స్వయం జ్యోతిష్ట్వము మొదలు మోక్ష పర్యంతము సర్వ వ్యవహారము మనస్సు మొదలైన ఉపాధితో వుండడమువల్ల అవిద్యా విషయకము, ఆత్మ యొక్క – స్వయంజ్యోతిష్ట్వము ఏ ఘనమైన తార్కికుని వల్ల కూడా నిరాకరణ చేయబడదు. "స్వయంజ్యోతిష్ట్వాదివ్యవహారః ఆమోక్షాంతః సర్వో అవిద్యా విషయ ఏవ మన ఆద్యుపాధిజనితః। స్వయం జ్యోతిష్ట్వంతు సుదర్పితేనాపి తార్కికేణ న వారయతుం శక్యతే।"

(ప్రశ్నో॥ భా॥ 4-5). చూడడం మొదలైన ఈ వ్యవహారము అంతా ద్వైతము మాత్రమే. అది స్వరూపములో లేదు. అయితే బ్రహ్మలో దృష్టి కూడా లేదు అని కాదు. ఎందుకంటే దాని దృష్టి అవినాశనమైనది - "యత్ర ద్వైతమివ భవతి, తదితర ఇతరం పశ్యతి। యత్ర సర్వమ్ ఆత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్।" (బృ॥4-5-15). "పశ్యన్ వై తన్న పశ్యతి న హి ద్రష్టుః దృష్టేః విపరిలోపో విద్యతే అవినాశిత్వాత్।" (బృ॥ 4-3-23).

బ్రహ్మ జ్ఞానము అని నిశ్చయము చేయడముతో, అది జడము కాదు అనే నిశ్చయమే కాక అది ఒక్కటే అని కూడా నిశ్చయమయింది. ఎందుకంటే జ్ఞానము విషయమును ప్రకాశింపజేస్తుంది. ఒక జ్ఞానము ఇంకొక జ్ఞానమును ప్రకాశింప చేస్తుంది అని చెప్పడములో అర్థము లేదు. తెలుసుకోవడమే జ్ఞాన స్వభావము. జ్ఞానము కంటె ఇతరమైనవి అన్నీ జ్ఞేయములు. అనగా, బ్రహ్మకంటె అతిరిక్తమయినవి అన్నీ జ్ఞానమునకు విషయములే!

9-11) బ్రహ్మ అనంతము:

బ్రహ్మ సత్యము అని చెప్పడంవలన అది కార్య సమూహములన్నింటికంటె వేఱు అని తెలుసుకున్నాము. జ్ఞానము అని చెప్పడము వలన జడము కంటే వేఱని తెలుసుకున్నాము. కాని, కార్య జాతికీ, జడ జాతికి వేఱుగా ఇంకొక జాతి ఉన్నది. అది కార్యమునకంటె, జడమునకంటె కూడా వేఱైనది. అది జీవజాతి. (సూ॥భా॥ 2-2, అధ్యా 8, 2, 3-17). బ్రహ్మ జీవుని కంటె ముందు వున్నదని గ్రహించినప్పుడు అది అన్నింటికంటే భిన్నము అని తెలుస్తున్నది. ఎప్పుడైతే బ్రహ్మయొక్క భావాభావ రూప విశేషణములు చెప్పబడినవో అప్పుడే అది నిశ్చితమైనది. (అభ్యా॥ 7-3). అయితే, ఇక తెలుసుకోవలసినది - బ్రహ్మ యొక్క ఏ లక్షణము దానిని జీవులనుండి వేఱుచేస్తున్నది అని. వేఱుగా దీనియొక్క బోధచేయడానికి శ్రుతి 'బ్రహ్మ అనంతము' అని చెప్పింది. ఈ లక్షణముయొక్క ఆధారముతో బ్రహ్మను వేఱుగా తెలియజేసే క్రమము ఇలా వున్నది: జగత్తులో విషయములను వేఱు వేఱుగా తెలుసుకొనే జీవుడు-జ్ఞాత, విషయము-జ్ఞేయము, జీవునికి విషయసంబంధముతో వచ్చే జ్ఞానము-విశేష జ్ఞానము. ఇక్కడ జ్ఞాతయైన జీవుడు, జ్ఞేయ విషయమునకు జ్ఞాత కావడము వల్ల జ్ఞేయము కాజాలడు; విశేషజ్ఞానము కూడా కాజాలడు; ఎందుకంటే అది వచ్చిపోయేది కనుక. ఇలా జ్ఞాత (జీవుడు) - జ్ఞానము (వృత్తి) - జ్ఞేయము (విషయము) అనే త్రిపుటిలో అన్నీ వేఱు వేఱు అయినవి. ఒకదాని పరిధిని ఇంకొకటి ప్రవేశింపజాలదు. ఇది జీవులలో ఉన్న 'సాంతత్వము' (పరిచ్ఛిన్నత్వము). ఇటువంటి సాంతత్వము బ్రహ్మలో లేదు. అంటే బ్రహ్మ ఈ మూడింటిలోనూ, వ్యాప్తమైనది. ఎందుకనగా, జ్ఞేయ విషయమునకు బ్రహ్మ ఉపాదానము కావడము వల్ల జ్ఞేయము బ్రహ్మమే. కనుక; జ్ఞేయము బ్రహ్మకన్న వేఱు కాదు. (అధ్యా॥ 7-1). విశేష జ్ఞానములోని విశేష్యజ్ఞానము బ్రహ్మ. అందువల్ల జ్ఞేయ విషయమైనా, విశేషజ్ఞానమైనా, జ్ఞాతయైన జీవుడైనా, ఏదీ బ్రహ్మకన్న వేఱుకాదు. ఇది బ్రహ్మయొక్క అనంతత్వము. ఇంతేకాక సాంతత్వము దేశ, కాల, వస్తువులనుబట్టి రావచ్చు; ఏ వస్తువైనా దానికి పరిమితి వుంటుంది. కనుక దేశమునుంచి సాంతత్వమును పొందుతుంది. అది కార్యము అయినందువల్ల కాలమునుపట్టి దానికి సాంతత్త్వము వుంటుంది. ఎందుకనగా, కార్యము పుట్టకముందు లేదు - నశించాక కూడా ఉండదు. ఇది అన్యవస్తువుల కంటె వేఱుగా ఉండడమువల్ల వస్తుకృత సాంతత్వము కూడా వుంటుంది. ఘటము పటము కాదు, పటము ఘటము కాదు. కాని, బ్రహ్మలో ఈ మూడింటిలో ఏ ఒకదాని సాంతత్వము కూడా లేదు. దేశ పరిచ్ఛేద రహితమైన ఆకాశమునకు కూడ ఉపాదానము అగుట వలన బ్రహ్మకు దేశమునుపట్టి సాంతత్వము లేదు. జగత్కారణము అవడమువల్ల అన్ని కాలములలో ప్రకాశిస్తూ వుంటుంది. అందువల్ల

కాలకృతమైన అంతత్వము లేదు. అది అన్ని వస్తువులకు ఉపాదానము కనుక దానిలో వస్తుకృత సాంతత్వము లేదు. ఇది అనంతమనే మూడవ లక్షణముచేత

9–11 క

బ్రహ్మము కంటె భిన్నము ఏదీ లేదు – పూర్వార్ధము
కాని
బ్రహ్మ అన్నిటికంటే భిన్నము – ఉత్తరార్ధము

అని నిశ్చితమవుతున్నది.

9–12 జ్ఞానుల అనుభవము

బ్రహ్మలోని ఈ అనంతత్వమును ప్రహ్లాదుడు మొదలైనవారు గుర్తించారు. నేడు కూడా, దేశములోని అన్ని సంప్రదాయములవారు దీనిని ఆమోదిస్తున్నారు. తెలుగు భక్తుడైన త్యాగరాజస్వామి ఈ సిద్ధాంతాన్ని అనుసరించే సాక్షాత్కారము పొందారు. "అన్ని నీవనుచు అంతరంగమున తిన్నగా వెదకి తెలుసుకుంటినయ్యా!" – అన్నింటిలో చక్కగా విమర్శ చేసి, అనుభవమువల్ల మనస్సులో అంతటా నీవే ఉన్నావని తెలుసుకున్నాను. (త్యాగరాజ కీర్తన). 'గురు అర్జునదేవ్' కూడా తన "గ్రంథసాహెబ్" లో దీనిని ప్రబలముగా సమర్థన చేశారు.

"బ్రహ్మ దిస్ సే బ్రహ్మ సునియే బ్రహ్మ బ్రహ్మ బఖానియే ।
ఆతమ్ సారా జగత్ సారా ఔర్ నహీ జానియే॥

బ్రహ్మనే చూడండి. బ్రహ్మనే వినండి. అన్నిటినీ బ్రహ్మ బ్రహ్మ అనండి. జగత్తు అంతా పరమాత్ముడే వ్యాపించివున్నాడు. చక్కగా తెలుసుకోండి. అతని కంటె వేఱుగా ఏమీ లేదు.

మేరా తేరా ఛోడ్ పాయీ హోయియే సబ్ కీ తూల్ ।
ఘాట్ – ఘాట్ బ్రహ్మ పసారియా దేఖే సునే హుజూర్ ॥

అహంకార – మమకారములు విడిచిపెట్టండి. మట్టిలో ధూళిలాగా అందరితో కలిసి మెలసి వుండండి. ప్రతియొక్క దేహములో బ్రహ్మ మాత్రమే వ్యాపించి వుంది. అందరిలో ఆ పరమాత్మనే చూడండి, వినండి.

మహాజ్ఞాని మైసూరు శివరామశాస్త్రిగారు కూడా ఇదే విషయము వ్రాశారు. "అందరిని పరబ్రహ్మ అనాలి. రెండవది ఏమీ లేదని ధృడ నిశ్చయము కావాలి. ఎక్కడ, ఏది చూసినా – అవన్నీ ఆనంద స్వరూప పరబ్రహ్మ అనే తెలుసుకోండి."

ప్రశ్నలు:–

1. మనుష్యుడు బాహ్యవిషయములనే ఎందుకు చూస్తాడు?
2. విశేషణము అంటే అర్థము ఏమిటి? బ్రహ్మయొక్క రెండు విధముల విశేషణములు ఏవి?
3. బ్రహ్మ భావరూప విశేషణముల వర్ణన చేయండి.
4. దాని అభావరూప విశేషణములు ఏవి?

5. లక్షణము అంటే అర్థము ఏమిటి? బ్రహ్మ లక్షణములు ఎన్ని?
6. విశేషణములు – లక్షణములలో అంతరము ఏమిటి?
7. సత్యము – అసత్యము వీనిని ఎలా వ్యాఖ్యానిస్తారు?
8. బ్రహ్మ సత్యత్వ వ్యాఖ్యకు అసత్యకాలము ఆధారం కారాదు– ఈ ఆక్షేపానికి ఉత్తరమేమి?
9. మిథ్య జగత్తు అనిర్వచనీయం కాదు– ఎందుకు?
10. కటకము (లెన్స్) దృష్టాంతములో మూడు సత్యములు ఏవి?
11. పారమార్థిక సత్యము ఏమిటి? అది ఇంద్రియవేద్యము ఎందుకు కాదు?
12. శాస్త్రము దేనిని వ్యావహారిక సత్యము అంటున్నది?
13. ప్రాతిభాసిక సత్యము విషయములో శ్రుతి ఏమి చెప్పినది?
14. రూఢిలో 'జ్ఞాన' పదప్రయోగము – బ్రహ్మ లక్షణ జ్ఞానము, వీని రెండింటిలో అంతరము ఏమిటి?
15. బ్రహ్మ సర్వజ్ఞత్వము – సర్వజ్ఞత్వ వ్యవహారములో అంతరము ఏమిటి?
16. అనంతత్వము లక్షణము, బ్రహ్మను ఏజాతితో వేఱుచేస్తున్నది?
17. జ్ఞాని, బ్రహ్మకంటె వేఱు ఏమీ లేదని ఎలా చెప్తాడు?

అధ్యాయము - 10

నిర్గుణ బ్రహ్మ

జగత్తులోను, మనలోను వున్న బ్రహ్మను గుర్తించడము కోసము బ్రహ్మయొక్క విశేషణములు వెనుకటి అధ్యాయములో చెప్పబడినవి. బ్రహ్మను తెలుసుకోవడంలో విశేషణములే ప్రథమ సోపానము. ఇది కొంత సులభము. బ్రహ్మను మనకంటె గొప్పవానిగా విశేషణముల ద్వారా తెలుసుకోవడము తేలిక. సవిశేష బ్రహ్మ చింతన చేయడము సరళమైనది. ఇందువల్ల చాలా మంది ఆస్తికులు పూజలతో సత్కర్మలతో ఈ పని చేస్తుంటారు. దాని తరువాత లక్షణముల ద్వారా బ్రహ్మను అన్నిటి కన్నా వేరుగా గుర్తించుట రెండవ సోపానము. ఇది కఠినము. కాని, ఇది పూర్వము పరిచయమైన దానికన్న సమీపమునకు వస్తుంది. దాని దగ్గరకు వెళ్ళి, ఉత్తమాధికారి అయినవాడు పూజాదికముల నుండి ముక్తుడై, దానిని ధ్యానిస్తాడు. ధ్యానము పూజలు మొదలైన వానికన్న కష్టము. ఇందువల్ల ఈశ్వరుని సవిశేషముగా చాలాకాలము పూజాది కర్మలతో ఆరాధన చేసిన తరువాత ధ్యానము వైపు సాధకులు ప్రయత్నము చేస్తారు. శాస్త్రము దీనినే చెప్పింది – "ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే। యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే।" (గీ॥ 6-3). కాని, లక్షణములను గుర్తించినప్పటికీ బ్రహ్మ తెలియబడదు. జీవులందరిలాగా అది అల్పజ్ఞము కాదు; దుఃఖికాదు; జగత్తుతో సమముగా కార్యమూ కాదు, జడమూ కాదు. ఇలా ఎన్నో తెలుసుకున్నప్పటికీ దాని వాస్తవ స్వరూపము తెలియబడదు. ఉదాహరణకు – ఒక వ్యక్తి, ఉపాధి సంబంధముచేత ఒకరికి భర్తఅనిగాని, తండ్రియనిగాని తెలిసినా, కాదని తెలిసినా అతని స్వతః స్వరూపము ఏమిటో, అతను ఎవరో, తెలియబడదు. అందుచేత ఏ ఉపాధి సంబంధము లేకుండా బ్రహ్మ స్వరూపమును తెలుసుకోవాలి. అయితే వేదము కూడా ఉపాధి సంబంధము లేకుండా దానిని తెలియబరచలేదు. ఎందుకనగా, అది వాక్కుకు, మనసుకు పరముగా వున్నది. "యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ।" – వాక్కు, మనసు దేనిని పొందలేక తిరిగి వస్తున్నాయో, అదే బ్రహ్మ (తై. 2-4-1). ఈ వాక్కు (శబ్దము) కంటె పరమైన బ్రహ్మను వాక్కుతో తెలియపరచే ప్రయత్నము వేదము చేసే సాహసము. మనస్సుతో తెలుసుకోలేని బ్రహ్మను మనస్సుతో తెలుసుకునే ప్రయత్నము మన సాహసము. 'కొమ్ములున్న తెల్లని ఆవు' అని చెప్పగానే శబ్దము ననుసరించి ఆవును గుర్తించగలము. కాని అది 'సత్యము జ్ఞానము అనంతము' అని చెప్పినప్పుడు ఆ శబ్దములతో బ్రహ్మము తెలుసుకునే ప్రయత్నము చేయలేము. 'స్థూలారుంధతీ న్యాయము'తో – అనగా చాలా సూక్ష్మమైన అరుంధతీ నక్షత్రమును చూపించుటకు, దానిముందు వున్న ఒక పెద్ద నక్షత్రమును చూపించి, మన దృష్టిని అరుంధతీ నక్షత్రము వైపునకు మళ్లిస్తారు. అలాగే శబ్దములను విని వాటి వాచ్యార్థము నుంచి దృష్టిని ముందుకు తీసుకువెళ్లాలి.

దీనికి కారణము ఇది: సత్యము 'మార్పు లేనిది'. సత్యము యొక్క లక్షణము ద్వారా మనము బ్రహ్మను ఇంద్రియములతో తెలుసుకోవడము, లేక మనస్సుతో విచారించడము అంటే – మనము సత్యపదము యొక్క వాచ్యార్థమును తీసుకుంటున్నాము అని. వాచ్యార్థముద్వారా చేసే ప్రయత్నము సఫలముకాదు. ఎందుకనగా మార్పు ఉన్న విషయమును మాత్రమే ఇంద్రియములు మనస్సు గ్రహించగలవు. (అధ్యా॥ 9-7 చూడండి). ఇంద్రియములు, మనస్సు అనంత విషయములను కూడా గ్రహించజాలవు. ఇంక జ్ఞానలక్షణములతో కూడా గ్రహింపబడదు. అలా గ్రహించగలిగేది జ్ఞేయము అవుతుంది, జ్ఞానము కాదు

కనుక ఈ మూడు లక్షణముల వాచ్యార్థముతో బ్రహ్మ యొక్క స్వరూపమును తెలుసుకోలేము. అనగా ఈ పదముల వాచ్యార్థమును వదలి లక్ష్యార్థమును గ్రహించాలి.

ప్రశ్న: లక్ష్యమును బోధచేయుటకు లక్షణము చెప్పబడుతుంది. ఏ లక్షణము ద్వారా లక్ష్యవస్తువు తెలియబడడము లేదో అటువంటి లక్షణమును ఎందుకు చెప్పాలి?

సమాధానము: అలా కాదు. వేరెక్కడో ఉన్న దృష్టిని అక్కడనుంచి తొలగించుటకు కూడా లక్షణము చెప్పబడుతుంది. మన దృష్టిని అసత్యము, జడము, సాంతము అయిన విషయముల నుండి తొలగించడానికి బ్రహ్మకు 'సత్య జ్ఞాన అనంత' లక్షణములను చెప్పారు.

ప్రశ్న: బ్రహ్మఅస్తిత్వము నిశ్చయమయితే ఆ బ్రహ్మయొక్క బోధ ఈ క్రమంలో కలుగవచ్చు. కాని, బ్రహ్మ అస్తిత్వము నిశ్చయము కాలేదు. కనుక బ్రహ్మ యొక్క బోధ కలుగదు.

సమాధానము: ఇది సరికాదు. దాని అస్తిత్వము నిశ్చితమైనది. దాని జగత్కారణత్వమును చెప్పి, బుద్ధి గుహలో దానిని వెదుకమని శ్రుతి చెప్పినది. దాని జ్ఞానము వల్ల సర్వకామ ప్రాప్తిరూప ఫలము కూడ శ్రుతి చెప్పినందువల్ల దాని అస్తిత్వము స్పష్టము. వాచ్యార్థము విడిచి లక్ష్యార్థముద్వారా బ్రహ్మ తెలియబడుతుంది కూడా. అనగా, అన్ని అసత్యములనుండి, జడ వస్తువులనుండి, సాంత వస్తువులనుండి బుద్ధిని తొలగించడమువలన సూక్ష్మము, స్వచ్ఛము అయిన బుద్ధి బ్రహ్మను తప్పక గ్రహిస్తుంది. ఆత్మ అతి నిర్మలము, అతిస్వచ్ఛము, అతి సూక్ష్మము. అదే విధముగా నిర్మలమైన బుద్ధి-ఆత్మ చైతన్యాకారముతో భాసింపబడుతుంది- "అత్యంత నిర్మలత్వ అతి స్వచ్ఛత్వ అతి సూక్ష్మత్వ ఉపపత్తేరాత్మనః బుద్ధేశ్చ ఆత్మసమ నైర్మల్యాత్ ఉపపత్తేః ఆత్మ చైతన్యాకారాభాసత్వోపపత్తిః" (గీ॥భా॥ 8-50). ఇందువల్ల శ్రుతి అంటున్నది "మనసైవానుద్రష్టవ్యం" (బృ॥భా॥ 4-4-19). (అతి నిర్మల అతి స్వచ్ఛ అతి సూక్ష్మ) మనస్సుతో దానిని తెలుసుకోవాలి. (మలినమైన అస్వచ్ఛమైన, స్థూలమైన) మనస్సుతో అది ప్రాప్తించదు. "అప్రాప్య మనసా సహ" (తై॥ 2-4-1). మనస్సు యొక్క ఈ మలినత్వము అసత్యము, జడము, సాంతము అయిన విషయముల సంపర్కముతో వచ్చిన ఫలితము. ఈ విషయములన్నీ అబ్రహ్మ. అందువల్ల మనస్సును అన్ని అబ్రహ్మ పదార్థములనుండి విడదీసి బ్రహ్మదర్శనము కోసము శ్రుతి వివిధ ప్రయత్నములు చేస్తున్నది.

10-1) నిర్గుణ బ్రహ్మ

1) సవిశేష బ్రహ్మయొక్క వర్ణన చేసిన తరువాత శ్రుతి దానిని అత్యంత నిర్విశేషమని చెప్పింది. అది- "అస్థూలమ్, అనణు, అహ్రస్వమ్, అదీర్ఘమ్, అలోహితమ్, అస్నేహమ్, అచ్ఛాయమ్, అతమః, అవాయు, అనాకాశమ్, అసంగమ్, అరసమ్, అగంధమ్ అచక్షుష్కమ్, అశ్రోత్రమ్, అవాక్, అమనః, అతేజస్కమ్, అప్రాణమ్, అముఖమ్, అమాత్రమ్, అనంతరమ్, అబాహ్యం, న తదశ్నాతి కించన, న తదశ్నాతి కశ్చన।" (బృ॥ 3-8-8)- బ్రహ్మ స్థూలము కాదు, అణువు కాదు, హ్రస్వము కాదు, దీర్ఘము కాదు, ఎఱుపు కాదు. స్నిగ్ధము కాదు, ఛాయ కాదు, తమము కాదు, వాయువు కాదు, ఆకాశము కాదు, దేనితో సంగము లేదు, రుచికరమైనది కాదు, గంధము కాదు, దానికి కళ్ళు లేవు, చెవులు లేవు, వాక్కు లేదు, మనస్సు లేదు, తేజస్సు లేదు, ప్రాణము లేదు, ముఖము లేదు, కొలత లేదు, కొలవబడేది కాదు, లోపలనున్నది కాదు, బాహ్యము కాదు, అది దేనిని తినదు, ఎవరూ దానిని తినరు. "అశబ్దమ్, అస్పర్శమ్, అరూపమ్, అవ్యయమ్,

తథారసమ్, నిత్యమ్, అగంధవచ్చ।" (కఠ।। 1-3-15) - శబ్దరహితము, స్పర్శరహితము, రూపరహితము, వ్యయరహితము (మార్పులేనిది), రసరహితము, నిత్యము, గంధరహితము. "అపూర్వమ్ అనపరమ్ అనంతరమ్ అబాహ్యమ్।" (బృ।। 2-5-19) - అది వెనుక అనేది లేనిది, ముందు అనేది లేనిది, లోపల లేనిది, బయట లేనిది. "అకాయమ్, అవ్రణమ్, అపాపవిద్ధమ్।" (ఈ।। 8) - శరీరరహితము, వ్రణరహితము, పాపరహితము. "అతః ఆదేశః నేతి నేతి।" - ఇందువల్ల ఇది కాదు, ఇది కాదు అని చెప్పబడుతున్నది - (బృ।। 2-3-6).

2) ఈ విధముగా శ్రుతి బ్రహ్మను సవిశేషముగాను, నిర్విశేషముగాను వర్ణన చేసింది.

ప్రశ్న:- వీనిలో దేనిని గ్రహించాలి? దానిని ఎందుకు గ్రహించాలి?

సమాధానము:- ఎవరు గ్రహించవలెనో వారి మీద సమాధానము ఆధారపడి వుంటుంది. సాధన ప్రారంభదశలో వున్నవారు సవిశేష బ్రహ్మ దృష్టితో పూజాది కర్మలను చేయవలసి వుంటుంది. దానిని చేయగా చేయగా, వారి దృష్టి, కర్మల సంగమును వదలి, ధ్యానమువైపు మళ్లగా, వారు నిర్గుణ బ్రహ్మను తెలుసుకో గలుగుతారు.

ప్రయత్నము విషయము అలా వుంచి, బ్రహ్మ నిర్గుణమా, సగుణమా అని ప్రశ్న వేస్తే, చాలామంది బ్రహ్మ రెండు విధములుగా కూడా వుంటుంది అంటారు. ఇది తప్పు ఒకే బ్రహ్మ విషయములో విరోధము ఉండడానికి వీలు లేదు. వీనిలో ఏదో ఒకటిని ఆమోదించి, మిగిలిన శ్రుతులను దానికి విరోధము లేకుండా సమన్వయము చేయాలి. ఒక మతము వారి సమన్వయ క్రమము ఇలా వుంటుంది: "బ్రహ్మ సవిశేషమే! దీని విశేషణములు ప్రాకృతములు కాదు, అప్రాకృతములు. నిర్విశేష వాక్యములు ఈ దృష్టితో ఔపచారికములు." కాని, ఇలా చెప్పడము వల్ల అరసము, అగంధము మొదలైన వాటిని సమన్వయము చేయవచ్చు. అస్థూలము మొదలైన వాటిని కొంచెము కూడా సమన్వయము చేయలేము. అస్థూలము, అనణువు; అహ్రస్వము, అదీర్ఘము మొదలైన వాని ద్వారా బ్రహ్మ అప్రాకృత రూపములో స్థూలము, అణువు; హ్రస్వము, దీర్ఘము కూడా అనవచ్చు. ఇలా అర్థము చేసుకోవడంవల్ల తిరిగి దానిలో విరుద్ధ ధర్మములను స్వీకరించవలసివస్తుంది. ఏ కారణముచేత ప్రాకృత విరుద్ధ ధర్మమును విడిచిపెట్టామో, అదే కారణముచేత అప్రాకృత విరుద్ధ ధర్మములను కూడా విడిచిపెట్టాలి. అంతేగాక, అకాయము అనగా 'ప్రాకృత శరీరము లేదు, కాని అప్రాకృత శరీరము ఉన్నది' అని చెప్తే అవ్రణము అనగా 'ప్రాకృత వ్రణము లేదు, అప్రాకృత వ్రణము వున్నది,' అనియు, అపాపవిద్ధము అంటే 'దానిని ప్రాకృతపాపము స్పృశించజాలదు, కాని అప్రాకృతపాపము స్పృశిస్తుంది' అని ఇలా అర్థము చెప్పబడుతుంది. ఇది సమంజసము కాదని మనకు తెలుసు. ఇంతేకాక ఇలా అర్థము చెప్పడము 'నేతి నేతి' అని చెప్పే శ్రుతికి విరుద్ధము అవుతుంది. "హేయ గుణమును విడిచి కళ్యాణగుణములను మాత్రమే తీసుకోవాలంటే? - అది కూడా కుదరదు. ఎందుకంటే వ్రణము ఉన్నవానికి అది హేయము; కాని వ్రణమును ఆశ్రయించిన క్రిమికి అది కళ్యాణకరము. ఏ జీవి దృష్టిలో, ఒక విషయమును హేయము, కళ్యాణకరము అని నిర్ణయం చేయాలి? దీనికి అతిరిక్తముగా శ్రుతి ఇలా అన్నది- హేయగుణముతో ఉన్న విషయము కూడా బ్రహ్మమే!- "బ్రహ్మ కామమయో క్రోధమయో అధర్మమయః" (బృ।। 4-4-5). బ్రహ్మ కామమయము, క్రోధమయము, అధర్మమయము కూడా! "బ్రహ్మ దాశా బ్రహ్మ దాసా బ్రహ్మైవేమే కితవాః।"

చేపలు పట్టే బెస్తవాడు బ్రహ్మ, దాసులు బ్రహ్మ, జూదగాళ్లు కూడా బ్రహ్మమే. (అధర్వణ శ్రుతి, సూ॥ భా॥ 2-3-43).

3) దీనివల్ల స్పష్టమయినది ఏమిటంటే నిర్గుణ వాక్యములకు ఇలా సంకోచముతో చేసిన అర్థము సముచితము కాదు. ఇందువల్ల సవిశేష శ్రుతులను, నిర్విశేష శ్రుతులతో సమన్వయము చేసి, అర్థము చెప్పడముకంటే వేఱే మార్గము లేదు. అనగా బ్రహ్మ తన స్వరూపముతో నిర్గుణము మాత్రమే; ఉపాధి సంబంధముతో సగుణముగా కనపడుతూ వుంటుంది. నారదా! నన్ను ఎలా చూస్తున్నావో, అది మాయా సృష్టి. నన్ను ఈ విధముగా భావించరాదు. నేను అన్ని భూతగుణములతో కలిసి వున్నాను అని తెలుసుకోవద్దు- "మాయా హ్యేషా మయా సృష్టా యన్మామ్ పశ్యసి నారద। సర్వభూతగుణైర్యుక్తం మైవం మామ్ జ్ఞాతుమర్హసి।" (మోక్షధర్మము 339 - 45). ఇదే నిర్దోషమైన సిద్ధాంతము. అది రూపరహితమే! అని శాస్త్రము, మళ్ళీ మళ్ళీ చెప్తున్నది. "అరూపవదేవ తత్ప్రధానత్వాత్।" (సూ॥ 3-2-14). నిర్గుణబ్రహ్మమే పరబ్రహ్మము; సగుణబ్రహ్మ అపరము.

అయితే, పరము - అపరము అని బ్రహ్మ రెండు విధములుగా ఉన్నదా? అవును, రెండు విధములు (ప్ర॥ 5-2). కార్యము అవడమువల్ల అనృత నామ రూపములను నిరాకరించి, నేతి - నేతి అని దేనిని చెప్పారో అది పరబ్రహ్మ, నామరూపములను విడవకుండా, దేనినైతే వర్ణించారో అది అపరబ్రహ్మ. రెండుగా వర్ణించడము శ్రుతి విరుద్ధము కాదా- అంటే కాదు. బ్రహ్మ ఒక్కటే. అది పరబ్రహ్మ. దానిని తెలుసుకోలేనివారు, ఉపాధిద్వారా వర్ణింపబడిన ఈ సగుణబ్రహ్మను స్వీకరించి, కర్మ-ఉపాసనలను చేస్తూ వుంటారు. ఈ బ్రహ్మము అపరము. (సూ॥ భా॥ 4-3-14). పరబ్రహ్మ జ్ఞాతవ్యము; అపరబ్రహ్మ ప్రాప్తవ్యము. "పరంచేత్ జ్ఞాతవ్యం, అపరం చేత్ ప్రాప్తవ్యమ్।" (కఠ॥ భా॥ 1-2-16).

ఈవిధంగా బ్రహ్మ మన ఆలోచనలకు అందేది కాదు."నేతి నేతి" ప్రతిపాద్యము. ఇది కాదు, ఇది కాదు అనే ప్రతిపాదింపదగినది. బ్రహ్మ విషయములో "ఇదమిత్థమ్" అని ఏమీ చెప్పడానికి వీలులేదు. ఏదైతే చెప్తున్నామో అదంతా ఉపాధినిపట్టి చెప్పినదే. విజ్ఞానఘనుడు, ఆత్మ, బ్రహ్మ ఇత్యాది శబ్దములు కూడ ఉపాధిని పట్టి ప్రయుక్తములైనవే. - "అధ్యారోపిత నామరూపకర్మద్వారేణ బ్రహ్మ నిర్దిశ్యతే విజ్ఞాన ఘనః, బ్రహ్మ, ఆత్మా, ఇత్యేవమాది శబ్దైః" (బృ॥ 2-3-6). అయితే అది శూన్యమా? అంటే కాదు. ఎందుకనగా, ఏది చూస్తున్నామో అదంతా దానినుంచే వచ్చింది. ఇక, అది శూన్యము ఎలా అవుతుంది? అది ఉన్నదే! అది నిర్గుణము అవడము వల్ల దాని విషయము కొంచెమైనా తెలియచెప్పడము కష్టము.

4) అందువల్ల, ఏదో ఒక దృఢ ప్రయత్నముచేసి దానిని తెలుపడము కోసము శ్రుతి ఇంకొకసారి ప్రయత్నిస్తున్నది. బ్రహ్మను పరస్పర విరుద్ధ ధర్మములతో వర్ణన చేస్తున్నది. "అనేజదేకం మనసో జవీయో తద్ధావతః అన్యానత్యేతి తిష్ఠత్।" (ఈశా॥4)- అది కదలదు, అది ఒక్కటే, మనస్సుకంటె వేగవంతమైనది, తాను కదలకుండా పరిగెత్తే ఇతరులను దాటిపోతుంది. "తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే।" (ఈశా॥ 5). అది కదులుతుంది, కదలదు. అది దూరము, దగ్గర కూడా. "దూరాత్సుదూరే తదిహాంతికే చ" (ముం॥ 3-1-7) - అది అతిదూరముకంటె దూరము. ఇక్కడే దగ్గరగా వుంది. "అపాణిపాదో జవనోగ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః" (శ్వే॥ 3-19) - కాళ్ళు చేతులు లేకుండా వేగముగా వెళ్ళగలదు, పట్టుకోగలదు, కళ్ళు లేకుండా చూడగలదు, చెవులు లేకుండా వినగలదు. "బ్రహ్మ తేజోమయో అతేజోమయః కామ

మయో అకామమయః క్రోధమయో అక్రోధమయః ధర్మమయో అధర్మమయః॥" (బృ॥ 4-5-5) - బ్రహ్మ తేజోమయము-అతేజోమయము, కామమయము-అకామమయము, క్రోధమయము-అక్రోధమయము, ధర్మమయము-అధర్మమయము.

10-2) బ్రహ్మ నిర్విశేషత్వమునకు హేతువు

1) ఇన్ని విచిత్ర వర్ణనములద్వారా బ్రహ్మ నిర్గుణమని స్పష్టము అవుతున్నది. ఉదాహరణకు - స్ఫటిక మణి విషయములో అది ఒకసారి ఎరుపుగా ఉంటుంది, ఇంకొకసారి వుండదు. ఒకసారి నీలంగా వుంటుంది. ఇంకొకసారి ఉండదు అని ఎవరో చెప్పారు. అది వినేవారికి ఇలా స్పష్టమవుతుంది. ఈ స్ఫటికమణి తన స్వరూపములో పారదర్శకము కనక ఉపాధి సంబంధమువల్ల ఉపాధికి వున్న రంగునే చూపిస్తుంది. (అధ్యా॥ 7-12). ఈవిధముగానే బ్రహ్మకూడా తన నిరుపాధిక స్వరూపములో ఒకటిగా ఉన్నది; కదలదు; అక్కడా - ఇక్కడా కూడా ఉంటుంది. కాని, సోపాధిక కార్యదృష్టితో వేగముగా ప్రయాణిస్తుంది. ఎందుకంటే గతిశీలమయిన ఈ లోకము బ్రహ్మమే. తెలియనివారికి అది బహుదూరము. తెలిసినవారికి చాలా సమీపము. ద్యులోకముకన్న పైనఉన్న జ్యోతి, మరియు హృదయములో ఉన్న జ్యోతి, రెండూ బ్రహ్మమే. క్రోధబుద్ధి ఉపాధి వలన క్రోధమయము అవుతుంది; శాంతబుద్ధి ఉపాధివలన అక్రోధమయము (శాంతము) అవుతుంది. కోపిష్ఠి-శాంతుడు ఇద్దరూ బ్రహ్మమే. కాని, తన నిరుపాధిక స్వరూపములో అది క్రోధమయమూ కాదు, అక్రోధమయమూ కాదు. అది నేతి-నేతి అనగా ఇది కాదు - ఇదికాదు అనే ఆత్మ.

2) **ప్రశ్న :** బ్రహ్మ సర్వథా నిర్గుణము కావడము ఎలా సంభవము?

ఉత్తరము : అది మూలకారణము కనక నిర్గుణము అవడము సంభవమే. గుణములతో కూడి ఉన్న ఈ జగత్తు అంతా దానివల్లే ఉత్పత్తి అయింది. జగత్తులోని గుణములన్నీ దానివలననే వస్తున్నాయి, అంటే అది నిర్గుణమే కావాలి; సర్వవర్ణములతో కూడిన ప్రకాశము నిర్వర్ణము. అన్ని ఆకారములను ప్రాప్తింపచేసే మట్టి నిరాకారము. ఇదే ప్రకారముగా బ్రహ్మ నిర్విశేషము అనడానికి కూడా ఇదే కారణము. విశేషణము ఉపాధి అపేక్షతో ఉంటుంది. 'ఈ' జగత్తుకు సృష్టికర్త అయిన 'ఆ' బ్రహ్మ సర్వశక్తిమంతము మొదలైన రీతిలో "ఈ జగత్తు", "ఆ బ్రహ్మ" ఇలా ఎప్పుడు నిర్దేశిస్తాము? జగత్తును కార్యదృష్టితో చూసినప్పుడు మాత్రమే; కారణదృష్టితో కాదు. ఎందుకంటే కారణదృష్టితో జగత్తు బ్రహ్మకంటె వేఱుకాదు. అంటే, ఒక పరిస్థితిలో మనము జగత్తును బ్రహ్మకు ఉపాధి అనుకుంటున్నాము; కార్యకారణ అనన్యత్వము తెలిసిన తరువాత ఆ జగత్తు కూడా బ్రహ్మమే అని తెలుస్తుంది; ఉపాధి అంటే దానికంటె భిన్నమైన ఒక విశేషం. కాని మనకు ఇప్పుడు బ్రహ్మకంటె భిన్నము ఏమీ లేదని తెలిసింది. అప్పుడు బ్రహ్మకు ఏ ఉపాధీ ఉండదు. ఇంక విశేషణము ఎలా వస్తుంది? దీన్ని భాష్యకారులు దిగువ చెప్పే విధముగా స్పష్టము చేశారు.

ప్రశ్న : నామరూప ఉపాధుల అస్తిత్వమును స్వీకరిస్తే - "ఒక్కటే వున్నది, రెండవది లేదు" "ఇక్కడ నానాత్వము ఎంతమాత్రము లేదు" మొదలైన శ్రుతి వాక్యములకు విరోధము అవుతుంది; దీని సమన్వయము ఎలాగ?

సమాధానము : అలా కాదు, మన్ను మొదలైన దృష్టాంతములతో ఈ సంశయములకు పరిహారము చేశారు. నామరూపములు బ్రహ్మకంటె వేఱయినవా కావా అది తెలుసుకోవడము కోసము పరమార్థ దృష్టితో

పరిశీలన చేసినప్పుడు ఇలా అర్థమవుతుంది. వస్తుతః ఇది బ్రహ్మకంటె వేఱుకాదు. అది ఒక్కటే; రెండవది లేదు; దీనిలో నానాత్వము ఎంతమాత్రము లేదు. అప్పుడు ఈ శ్రుతి వాక్యములకు పరస్పర సమన్వయము కుదురుతుంది. కాని, స్వాభావిక అవిద్యచేత నామరూప ఉపాధి దృష్టి వస్తే, అప్పుడు వస్త్వంతర బుద్ధితో వ్యవహారము కలుగుతుంది - "నామరూపోపాధ్యస్తిత్వే 'ఏకమేవాద్వితీయమ్, నేహ నానాస్తి కించన' ఇత్యాది శ్రుతయః విరుధ్యేరన్ ఇతి చేత్? న॥ పరిహృతత్వాత్; మృదాది దృష్టాన్తైశ్చ! యదా తు పరమార్థ దృష్ట్యా అన్యత్వేన నిరూప్యమాణే నామరూపే మృదాది వికారవద్ వస్త్వంతరే తత్త్వతో న స్తః, తదా తదపేక్ష్య ఏకమేవాద్వితీయమ్, నేహ నానాస్తి కించన ఇత్యాది పరమార్థ తత్త్వగోచరం ప్రతిపద్యతే। యదా తు స్వాభావిక్యా అవిద్యయా నామరూపోపాధి దృష్టిరేవ చ భవతి స్వాభావికీ తదా సర్వో¬యం వస్త్వంతరాస్తిత్వ వ్యవహారః" (బృ॥భా 3-5-1). ఈ పరమార్థదృష్టి, ఉపాధి దృష్టి క్రమముగా కార్యకారణ అనన్యత్వ నిరూపణ వాక్యముల యొక్క పూర్వార్ధ - ఉత్తరార్ధ కార్యములలో దొరుకుతుంది. ఉత్తరార్ధ జగత్తులో అవిద్యాకల్పిత నామరూప పూర్వకమైన అహంకార-మమకారములు కలిగిన జీవుల వ్యవహార విషయములో, సవిశేష ఈశ్వరుడు శాసనము చేస్తున్నాడు. దీనిని పట్టి బ్రహ్మలో సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాది విశేషణములు కనిపిస్తున్నాయి. పూర్వార్ధ జగత్తులో బ్రహ్మాభిన్న నామరూపములను తమవిగానే భావించే ముక్తులలో 'ఈశిత్రీశితవ్య' వ్యవహారము సర్వజ్ఞత్వాది వ్యవహారము ఉండదు. ఎందుకంటే, జగత్తు వారికి 'ఆత్మభూతము' - "తదేవమ్ అవిద్యాత్మకోపాధి పరిచ్ఛేదాపేక్షమేవ ఈశ్వరస్య ఈశ్వరత్వం సర్వజ్ఞత్వం సర్వశక్తిత్వం చ। న పరమార్థతో విద్యయా అపాస్త సర్వోపాధి స్వరూపే ఆత్మని ఈశిత్రీశితవ్య సర్వజ్ఞత్వాది వ్యవహారః ఉపపద్యతే। తథాచోక్తం 'యత్ర నాన్యత్ పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమా', "యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్।' ఇత్యాదినా।" (సూ॥ భా॥ 2-1-47). ఈ విధముగా స్వరూపములో అంతా బ్రహ్మమే అవడమువల్ల, దానికంటే భిన్నమైన ఉపాధి ఏమీ ఉండదు. కార్యాకారము కూడా స్వరూపము లోనిదే. దాని స్వరూపము కానిది దానికి రావడము కుదరదు - "కార్యాకారో¬పి కారణస్య ఆత్మభూత ఏవ అనాత్మభూతస్య అనారభ్యత్వాత్।" (సూ॥భా॥ 2-1-18). ఈ విధముగా చెప్తే, కార్యాకారము కూడా తన స్వరూపముతో బ్రహ్మకు ఉపాధి కాలేదు. అక్కడ కేవలము బ్రహ్మ మాత్రమే ఉంటుంది. ఏకమేవాద్వితీయమైన, స్వరూపములో బ్రహ్మకు ఉపాధి ఎలా వుంటుంది? ఉపాధి ఎప్పుడు లేదో అప్పుడు బ్రహ్మ నిర్విశేషము మాత్రమే. ఇలా అది స్వరూపముచేత అప్రాణము, అమనస్సు - "అప్రాణోహ్యమనాః।" (ముం॥ 2-1-1). అయినప్పటికీ దానినుండి ప్రాణము, మనస్సు పుడుతున్నవి- "ఏతస్మాత్ జాయతే ప్రాణో మనస్సర్వేంద్రియాణి చ" (ముం॥ 2-1-3). ఈ విధముగా ఏ విశేషము లేకుండానే, ఈ జగత్తుకు కారణము అవడమువల్ల బ్రహ్మ ఉండనే ఉంది. "సర్వవిశేషరహితో¬పి జగతో మూలం ఇత్యవగతత్వాత్ అస్త్యేవ" (కఠ॥ భా॥ 2-3-12). ఇది ఎప్పుడూ మరువకూడదు.

10-3) జగత్తు సత్తా? అసత్తా?

1) **సంశయము :** జగత్తునుంచి బ్రహ్మవైపు వెళ్ళేటప్పుడు కార్యకారణ అనన్యత్వ న్యాయముచేత, జగత్తు బ్రహ్మకన్న వేఱుకాదని శ్రుతి చెప్పింది. అదే శ్రుతి బ్రహ్మ నిర్గుణము, నిరవయవము అని కూడా చెప్పినది. ఈ రెండిటిమీద మనకు శ్రద్ధ ఉన్నది. కాని, వీటికి విరుద్ధముగా ఆలోచిస్తే సంశయము కలుగుతుంది. నిరవయవమైన బ్రహ్మవల్ల సగుణము, సావయవము అయిన జగత్తు ఎలా ఉత్పన్నము అయింది?

పరిహారము : ఒక దృష్టాంతముతో దీనిని తెలుసుకోవచ్చు. రజ్జువులో సర్పము కనపడినప్పుడు, ఆ పాము బుద్ధి పరికల్పిత రజ్జు అవయవముల నుండి పుట్టింది. అలాగే నిరవయవ బ్రహ్మయొక్క బుద్ధి పరికల్పిత అవయవములనుండి జగదాకారము పుట్టవచ్చును – "నిరవయవస్య సతః కథం వికారసంస్థానం ఉపపద్యతే? నైష దోషః। రజ్జ్వాది అవయవేభ్యః బుద్ధి పరికల్పితేభ్యః సదవయవేభ్యో వికార సంస్థానోపపత్తేః।" (ఛాం॥ 6-2-2).

సంశయము : ఈ విధముగా అయితే నిరవయవ బ్రహ్మ సావయవ జగత్తు ఈ రెండింటినీ ఒప్పుకోవాలి.

పరిహారము : కాదు. నిరవయవబ్రహ్మ బోధ చేసే శ్రుతిని ఆమోదించినవారు, వాచారంభణశ్రుతిని కూడా ఆమోదించాలి. అప్పుడు జగత్తు ఉన్నప్పటికీ బ్రహ్మైకత్వము తెలుస్తుంది.

2) సంశయము : వాచారంభణ శ్రుతిని ఆమోదించినట్లయితే, సృష్ట్యాది వ్యవహార రహిత బ్రహ్మే మిగులుతుంది; అప్పుడు బ్రహ్మలో అవయవముల కల్పన చేయవలసిన అవసరము ఉండదు. అయితే ఇంకొక చోట శ్రుతి ఇలా చెప్తున్నది – "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి" – అనేక రూపములుగా అయ్యే సంకల్పమును అది చేసింది. వ్యవహార రహితమైన బ్రహ్మ తానే వాచారంభణ వికారముల రూపములో ఎలా ఏర్పడింది?

పరిహారము : మట్టిలో ఘటము, **రజ్జువులో బుద్ధి పరికల్పిత సర్పము పుట్టినట్లు,** బ్రహ్మలో వాచారంభణ వికారములు పుట్టాయి. "బహు స్యాం ప్రజాయేయ యథా మృద్ఘటాద్యాకారేణ యథా వా రజ్జ్వాది సర్పాద్యాకారేణ బుద్ధిపరికల్పితేన।" (ఛాం॥ 6-2-3).

ఆక్షేపము: **అప్పుడు పాము ఎలా వుండదో, అదే విధముగా జగత్తు కూడా వుండదు. జగత్తు అసత్ అని ఒప్పుకోవాలా?** – "అసదేవ తర్హి సర్వం యద్ గృహ్యతే రజ్జురివ సర్పాద్యాకారేణ?" (ఛాం॥భా॥ 6-2-3).

సమాధానము : కాదు. 'సత్తే', ద్వైత భావమువల్ల ఇంకొక విధముగా కనబడుతున్నది. కొంచెమైనా ఎప్పుడూ 'అసత్' కాదు. తార్కికులు 'సత్' కంటె వేఱుగా వస్తువుయొక్క కల్పన చేస్తున్నారు. సృష్టికి ముందు, ప్రళయము తరువాత దానిని 'అసత్' అంటున్నారు. మేము (వేదాంతులు) అలా చెప్పము. ఎప్పుడూ, ఎక్కడా 'సత్' కంటె వేఱైన నామమూ లేదు, రూపమూ లేదు. అందువల్లే రజ్జువును తెలుసుకోగానే సర్పము అనే నామరూప బుద్ధి, నివృత్తము అవుతున్నది. మట్టిని విచారిస్తే, ఘటముయొక్క నామరూప బుద్ధి నివృత్తము అవుతున్నది. ఇలాగే 'సత్'ను విచారణ చేసినందువల్ల జగత్తుయొక్క నామరూపముల బుద్ధి తొలగిపోతుంది. అనగా, కార్యము విద్యమానము అయినప్పుడు కూడా వ్యవహారము లుప్తమయిపోతుంది. "న। సత ఏవ ద్వైత భేదేన అన్యథా గృహ్యమాణత్వాత్ న అసత్త్వం కస్యచిత్ క్వచిత్। యథా సతోऽన్యద్ వస్త్వంతరం పరికల్ప్య పునః తస్యైవ ప్రాగుత్పత్తేః ప్రధ్వంసాచ్చోర్ధ్వం అసత్త్వం బ్రువతే తార్కికాః। న తథా అస్మాభిః కదాచిత్ క్వచిదపి సతోऽన్యత్ అభిధానమ్ అభిధేయం వా వస్తు పరికల్ప్యతే। సదేవ తు సర్వం అభిధానం అభిధీయతే చ యదన్యబుద్ధ్యా। యథా రజ్జురేవ సర్పబుద్ధ్యా సర్ప ఇత్యభిధీయతే, యథా వా పిండఘటాది మృదోన్యబుద్ధ్యా పిండఘటాది శబ్దేన అభిధీయతే। రజ్జువివేక దర్శినాం తు సర్పాభిధానబుద్ధీ నివర్తేతే యథా చ మృద్వివేక దర్శినాం ఘటాది శబ్ద బుద్ధీ। తద్వత్ సద్వివేకదర్శినాం అన్యవికారశబ్దబుద్ధీ నివర్తేతే।" (ఛాం॥ భా॥ 6-2-3).

10-4) రెండు బుద్ధిపరికల్పనములు

ప్రశ్న : ఇక్కడ రెండు బుద్ధి పరికల్పనలను చెప్పారు. నిరవయవ బ్రహ్మలో అవయవ కల్పన మరియు నామరూపముల కల్పన. ఇవి రెండూ ఒకటేనా? లేక వేఱు వేఱా?

సమాధానము : వేఱు వేఱుగానే ఉన్నవి. శ్రుత్యనుసారము బ్రహ్మ నిరవయము అయినప్పటికీ సావయవ జగదుత్పత్తి దానివల్లనే జరిగింది. ఈ సిద్ధాంతమును తెలుసుకోవడము కష్టమనుకునే మనలాంటి అల్పబుద్ధులైన జనులకు తెలుపడము కోసమే భాష్యకారులు రజ్జుసర్ప దృష్టాంతముతో బ్రహ్మలో లేని అవయవములను కల్పనచేసి, సమన్వయము కొరకు చెప్పారు. ఇందువలన ఇది మన బుద్ధి పరికల్పన అని తెలుస్తున్నది. కాని, రెండవది ఇలా కాదు. జగత్తు బ్రహ్మ నుంచి అనన్యము అయినప్పటికీ, బ్రహ్మలో సృష్టి వ్యవహారముయొక్క అభావమును చూపడము భాష్యకారుల వివక్ష. దీనికోసము మృత్తిక - ఘటము, రజ్జువు - సర్పము అనే రెండు దృష్టాంతములను ఇచ్చారు. మృద్ఘట దృష్టాంతము బ్రహ్మయొక్క జగత్కారణత్వమును, రజ్జుసర్ప దృష్టాంతము బ్రహ్మయొక్క అవ్యవహార్యత్వమును తెలియజేస్తున్నవి. దృష్టాంతములో సర్పములాగ నామరూపములు 'అసత్' కాదు అనే విషయమును ముందుగానే స్పష్టము చేశారు. (పైన చెప్పిన అనుచ్ఛేదమును చూడండి. అధ్యా॥ 10-3). ఇందువల్ల "సర్పాద్యాకారేణ బుద్ధిపరికల్పితేన" బుద్ధిపరికల్పిత సర్పములాగా - ఇలా చెప్పడమునకు అర్థము, జగత్తుయొక్క నామరూపములు మన బుద్ధిచేత పరికల్పితములని కుదరదు. ఈ బుద్ధి పరికల్పన అపరబ్రహ్మది, జీవునిది కాదు. ఎందుకనగా, "బహుస్యాం ప్రజాయేయ యథా రజ్జ్వాది సర్పాద్యాకారేణ బుద్ధిపరికల్పితేన।" -రజ్జ్వాదులలో బుద్ధి పరికల్పిత సర్పాది ఆకారములు ఎలా పుడుతున్నాయో అలాగే నేను నామరూపములుగా పుడుతున్నాను, అని బ్రహ్మము చెప్పినది. మనుష్యుడు తన భావమును తెలుపడం కోసము బుద్ధి పరికల్పిత శబ్దాత్మక వాక్కును సృష్టిస్తున్నాడు. అలాగే ఈశ్వరుడు తన స్వరూపమైన బ్రహ్మను తెలియజేయడానికి జగత్తును సృష్టిస్తున్నాడు. అందువల్ల అది బహుప్రకారములుగా ప్రభవించడానికి జగత్కారణుడైన ఈశ్వరుని బుద్ధియొక్క పరికల్పనము. "ఈక్షాం కృతవతీ... స్వబుద్ధిస్థం పూర్వసృష్ట్యనుభూత ప్రాణధారణం ఆత్మానమేవ స్మరంతీ।...నామరూపే వ్యాకరవాణి" (ఛాం॥ భా॥ 6-3-2)- తన బుద్ధిలో ఉన్నటువంటి, గత సృష్టిలో ప్రాణధారణ అనుభవమును పొందిన జీవాత్మను జ్ఞాపకము చేసుకుని సృష్టి చేస్తున్నాడు. ఈశ్వరుని మానస సంకల్పము ఇదే, జాగ్రత్తులో ఏ విషయము మనము చూస్తున్నామో అది సద్బ్రహ్మ ఈక్షణమువలన సంభవించిన తేజస్సు - నీరు - అన్నమయము - వీటి వికారము. "సదీక్షాభినిర్వృత్త తేజోబన్నమయత్వాత్ జాగరిత విషయాణామ్। (ఛాం॥ 8-5-4). భాష్యకారులు - బ్రహ్మ అవయవముల కోసము రజ్జు సర్పదృష్టాంతమును ఇస్తూ, నామరూపములకు మృద్ఘట ఉపమానమును రజ్జుసర్ప ఉపమానమును రెండింటిని ఇచ్చి, ఈ రెండు బుద్ధి పరికల్పనలకు భేదమును స్పష్టము చేశారు. (అ॥ 7-12-3 చూడండి.) మృద్ఘటములో మృత్తిక, ఘటము, ఆ రెండింటికి మధ్య కార్యకారణ భావము-మూడూ ప్రత్యక్షములు. ఇక్కడ మానవుని బుద్ధి పరికల్పన ఏమీ లేదు. అందువల్ల బ్రహ్మ కారణత్వమును తెలియచేయడము కోసము శ్రుతి "బహుస్యాం ప్రజాయేయ యథామృద్ ఘటాద్యాకారేణ।" అని చెప్పి ఆగిపోయింది. కాని, ఈ దృష్టాంతమును పట్టి ఇంకొక విధముగా ఆలోచించడము సంభవము: అదేమనగా 'ఘటరూప ఆకారము మృత్తికయొక్క పరిణామము (కార్యము); అదే విధముగా జగత్తు బ్రహ్మ పరిణామము". ఇది సరియైనది కాదు. బ్రహ్మకు పరిణామము పొందుతుందనే వ్యవహారము లేదు. ఇందువల్ల ఈ దృష్టాంతముతో కూటస్థబ్రహ్మను

తెలుసుకోజాలము. నిజానికి మృత్తికయొక్క పిండరూపమే ఘటరూపముగా పరిణతి చెందినది; కాని మృత్తికా సామాన్యరూపము పరిణతి చెందలేదు. అది కూటస్థమే. దీనిని ఎవరు తెలుసుకుంటారో, వారు ఈ దృష్టాంతముతో కూటస్థ బ్రహ్మను కూడా తెలుసుకుంటారు. కాని పిండ, ఘటాది ఆకారములతో మృత్ సామాన్యమును వేఱు చేసి తెలుసుకోవడము సులభము కాదు; ఇదే విధముగా జగదాకారములలో అనువర్తమానమైన బ్రహ్మను, వాటినుండి వేఱుచేసి తెలుసుకోవడము కూడా సులభము కాదు. అందువలననే రజ్జుసర్ప దృష్టాంతమును చెప్పారు; దానివల్ల సర్పము కేవలము బుద్ధి పరికల్పన, సర్పము కంటె భిన్నముగా ఉండే రజ్జువులో సర్పవ్యవహారము లేదు –అని సులభముగా తెలుసుకోవచ్చు. ఈ ప్రకారముగా స్పష్టము అవుతున్నది ఏమనగా – పరబ్రహ్మ జగత్కారణము అయినప్పటికీ అపరబ్రహ్మ వ్యవహారము, పరబ్రహ్మలో లేదు. అది కూటస్థమే. అందువల్లనే దృష్టాంతములో "యథా వా రజ్జ్వాది సర్పాద్యాకారేణ బుద్ధిపరికల్పితేన" అని చెప్పారు.

ఈ మొత్తము చర్చ వల్ల నిశ్చితమయినది ఏమనగా, కార్యకారణ అనన్యత్వమువలన 'జగత్తు బ్రహ్మకంటె అభిన్నము; అందువల్ల ఇది ఒక్కటే వున్నది; బ్రహ్మ నిరుపాధికము, అవ్యవహార్యము. ఈ ప్రకారము నిశ్చితమైన బ్రహ్మ జీవుని స్వరూపమే.' బౌద్ధికముగా ఇదంతా తెలిసినప్పటికీ అనాద్యవిద్యవల్ల జగత్తును తనకంటె వేఱుగా చూడడము స్వభావముగా వున్నది. అది ఎప్పటివరకూ విడిచిపెట్టదో, అంతవరకు తత్త్వము అనుభవమునకు రాదు. జగత్తును తనకంటె, బ్రహ్మకంటె వేఱుగా చూపే కారణము ఒకసారి నివృత్తి అయితే ఇక సంశయము రాదు. ఈ అవిద్యనుండి మనను విముక్తులను చేయడానికి పూజ్యులైన భాష్యకారులు 'స్థూణానిఖనన న్యాయ'ముతో మనకి పదేపదే అత్యంత దృఢత్వముతో, జగత్తుకు బ్రహ్మతో అభేదమును, బ్రహ్మకు జగత్తుతో భేదమును ప్రతిపాదిస్తున్నారు. అత్యంత కరుణామయులైన పూజ్యులైన భాష్యకారుల విషయములో మనము ఎంత కృతజ్ఞత చూపినా చాలదు.

10–5) అధ్యారోపము – అపవాదము : ప్రారంభములో ముముక్షువు, బ్రహ్మ జగత్తునకు నిమిత్తమాత్రుడని, జగత్తు బ్రహ్మకంటె వేఱుగా వున్నదని అనుకుంటాడు. ఇందువల్ల సవిశేష బ్రహ్మతో ప్రారంభించి, మెల్లమెల్లగా, సత్యజ్ఞానానంతములద్వారా, బ్రహ్మ స్వరూపముయొక్క బోధచేసి, ఆఖరున ముముక్షువులకు జగత్తునకు ఉపాదానకారణము బ్రహ్మ కావడమువల్లనే 'నేతినేతి' అని చెప్పబడే బ్రహ్మతో అభిన్నత్వమును ఉపదేశిస్తున్నారు. ఈ అభిన్నత్వ జ్ఞానముతో బ్రహ్మకు ముందు చెప్పబడిన సవిశేషత్వము విడిచిపోతుంది. ఈ పద్ధతిని శాస్త్రము 'అధ్యారోప –అపవాదము' అంటుంది. 'బ్రహ్మ ద్వారానే సృష్టి స్థితి లయములు జరుగుతున్నాయి. అయినా, బ్రహ్మ స్వరూపములో సృష్ట్యాదుల వ్యవహారము కొంచెము కూడా లేదు' అని శాస్త్రాధ్యయనము తరువాత మాత్రమే తెలుస్తుంది. మొదట్లో ఈ జ్ఞానము ఉండదు. బ్రహ్మయొక్క ఉపాదానత్వము ఎవరు తెలుసుకోలేరో, వారు అజ్ఞానముతో, జగత్తు స్వతంత్రమని తలచి, బ్రహ్మను దానికి కర్త అని తప్పక అనుకుంటారు. భ్రమవల్ల ఉత్పన్నమయిన ఈ జ్ఞానమును అనుసరిస్తూ, **జగత్తును బ్రహ్మకు ఉపాధిగా చూపి సృష్ట్యాది వ్యవహారమును, బహుభవనమును, అనుప్రవేశమును, సత్యసంకల్పాది గుణములను శాస్త్రము బ్రహ్మలో ఆరోపణ చేస్తున్నది – ఇది అధ్యారోపము.** ముందు కార్యకారణ వివేచన చేసి శాస్త్రము చెప్తున్నది ఏమనగా, ఏ జగత్తు స్వతంత్రమనే భ్రమ వున్నదో, అది, దాని ఉపాదానమైన బ్రహ్మకంటె భూత భవిష్యత్ వర్తమానకాలములలో ఎన్నడూ వస్తుతః భిన్నముగా లేదు, ఇలా గ్రహించగానే అసత్యనామరూపముల వ్యవహారము బ్రహ్మలోనే

ఉన్నదను భావము ఆగిపోతుంది; నామరూపములలో కూడా కేవలము సత్యస్వరూపుడైన బ్రహ్మ మాత్రమే కనిపిస్తుంది; బ్రహ్మకంటె వేఱైన జగత్తు, బ్రహ్మకు ఉపాధి కాలేదు అని కూడా తెలుస్తుంది. ఎప్పుడైతే ఉపాధి లేదో, ఇక స్వరూపములో విశేషణములు - లక్షణములు ఎక్కడివి? ఇది తెలియగానే, **అజ్ఞానముతో బ్రహ్మ స్వరూపములో అధ్యారోపము చేసిన అంత వ్యవహారమూ వదలిపోతుంది.** ఆ సమయములో అసత్యమైన జగత్తుతో వ్యవహారము చేస్తున్నప్పటికీ నిర్విశేష బ్రహ్మజ్ఞానము వుంటూనే వుంటుంది. ఈ ప్రకారము **ముందు చేసిన అధ్యారోపమును, స్వరూపజ్ఞానము ప్రాప్తించిన తరువాత, నిరాకరణ చేయడము 'అపవాదము'.** (బృ॥ భా॥ 2-1-20, 4-4-25, గీ॥ భా॥ 13-2). అధ్యారోపమునకు అర్థము - తత్కాలములో భేదమును స్వీకరించుట; అపవాదమునకు అర్థము - 'అధ్యారోపముతో స్వీకరించిన భేదమును నిషేధించుట'. ఈ సోపానములో జనులు సాధారణముగా మోసపోతూ వుంటారు. అందువల్ల అపవాదముచేత (నిషేధముచేత) విడిచిపెట్టబడిన విషయమును గూర్చి ఇలా చెప్పబడుచున్నది. బ్రహ్మ స్వరూపమును తెలుసుకోవడానికి పూర్వము, ముముక్షువు, జగత్తును కార్యదృష్టితో మాత్రమే చూస్తాడు. అతను కారణదృష్టితో ఒక్కసారి కూడా తెలుసుకోడు. శ్రుత్యర్థమును తెలుసుకున్న తరువాత, కారణదృష్టితో చూడడము నేర్చుకుంటాడు. అప్పుడు బ్రహ్మ స్వరూపములో అతనికి గల భ్రమలన్నీ తొలగిపోతాయి. జగత్తుయొక్క వ్యవహారము బ్రహ్మలో ఉన్నదనే భ్రామక కల్పన దూరమవుతుంది. ఇంద్రియములద్వారా జగత్తుయొక్క వివిధత్వమును చూస్తున్నప్పటికీ, బ్రహ్మ స్వరూపములో ఆ వైలక్షణ్యములకు ఏ స్థానములేదని దృఢ నిశ్చయము కలుగుతుంది. దీనికి దృష్టాంతము - మనము కళ్ళతో భూమి సమతలముగా ఉన్నదని చూస్తున్నా కూడా వైజ్ఞానిక దృష్టితో అది గోళాకారముగానే ఉన్నదని తెలుసుకొంటాము కదా? దీనిని కూడా అలాగే గుర్తించాలి.

బ్రహ్మ ప్రకరణముయొక్క తాత్పర్యము

జగత్కారణమైన బ్రహ్మ జగత్తుకంటె విలక్షణము. అందువలన దానిని తెలుసుకోవడము, తెలియచెప్పడము కూడా కఠినము. ఏదో ఒక అజ్ఞాత విషయమును తెలుసుకోవడము కొఱకు, ముందు తెలిసిన విషయముతోనే ప్రారంభించాలి. అందుకోసము, చిరపరిచితమైన జగత్తును బోధపరుస్తూ, ముముక్షువును మాయద్వారా బ్రహ్మ వరకు తీసుకువెళ్తున్నారు. అక్కడ ప్రవేశించగానే, మాయాసహితుడైన సవిశేష బ్రహ్మ పరిచయమవుతుంది. దాని తరువాత, సత్య - జ్ఞాన - అనంత లక్షణములతో లక్షితుడైన బ్రహ్మ పరిచయము కలుగుతుంది. **అన్ని విశేషణములు - అనన్యత్వ న్యాయ వాక్యము యొక్క ఉత్తరార్ధములో చెప్పిన జీవ-జగత్తులనుంచే వస్తున్నాయి. అన్ని లక్షణములు, అనన్యత్వ న్యాయవాక్యముయొక్క పూర్వార్ధములో చెప్పిన జీవ-జగత్తులనుంచే వస్తున్నాయి.** 'ఇది' అని అనుభవమునకు వస్తున్నదంతా వ్యావహారికము, మరియు ప్రాతిభాసికము అయిన సత్యము స్వరూపముచేత బ్రహ్మమే అని తెలుస్తుంది. అప్పుడు బ్రహ్మలో అధ్యారోపము చేసి వున్న అన్ని విశేషణములు, అపవాదముయొక్క విషయములు అయిపోతాయి. పారమార్థిక సత్యమైన, ఒక్క బ్రహ్మయే శేషిస్తున్నది. ఇది అత్యంత నిర్విశేషము - వాక్కుకు, మనస్సుకు అతీతము. ఎందుకంటే శాస్త్రము అధ్యారోపితమైన నామరూప కర్మల ద్వారానే విజ్ఞానమానందం బ్రహ్మ, విజ్ఞానఘనము, బ్రహ్మ, ఆత్మ ఇత్యాది శబ్దములతో బ్రహ్మను తెలియజేస్తున్నది. "అధ్యారోపిత నామరూప కర్మద్వారేణ బ్రహ్మ నిర్దిశ్యతే, 'విజ్ఞానమానందం బ్రహ్మ, విజ్ఞాన ఘన ఏవ, బ్రహ్మ ఆత్మా ఇత్యేవ మాది శబ్దైః" (బృ॥భా॥ 2-3-6). అయితే దీని అర్థమును, బ్రహ్మ విజ్ఞానఘనుడు కూడా

కాదు, బ్రహ్మ కూడా కాదు, ఆత్మకూడా కాదు అని గ్రహించకూడదు. అది ఒక్కటే ఉన్నందువల్ల, ఏ ఒక్క శబ్దముతోను దానిని తెలియచెప్పలేము.

ప్రశ్నలు :

1. మనస్సులో సవిశేషబ్రహ్మను చింతనచేయడము సులభము. ఎందువలన?
2. 'లక్షణముల ద్వారా బ్రహ్మను గుర్తించడము కఠినము?' దాని గురించి శాస్త్రము ఏమి చెప్తున్నది?
3. 'బ్రహ్మ స్వరూపమును తెలుసుకోవడము సులభముకాదు' ఇలా ఎందుకు చెప్పబడినది?
4. 'స్థూలారుంధతీ న్యాయము' అంటే ఏమిటి?
5. బ్రహ్మ లక్షణములను వాచ్యార్థముతో ఎందుకు తీసుకోరాదు?
6. బ్రహ్మ లక్షణములను ఎందుకు చెప్పారు?
7. బ్రహ్మ అస్తిత్వమును శ్రుతి ఎలా తెలియచేస్తున్నది?
8. శ్రుతి, నిర్విశేషబ్రహ్మ వర్ణన ఎలా చేసింది?
9. 'మనసైవానుద్రష్టవ్యం' మరియు 'అప్రాప్య మనసా సహ' ఈ వాక్యముల సమన్వయము ఎలా అవుతుంది?
10. క్రొత్త సాధకులు ఏ ప్రకారము బ్రహ్మను తెలుసుకోవాలి?
11. నిర్గుణబ్రహ్మ ఉపాసన ఎవరు చేయాలి?
12. శ్రుతిద్వారా విరుద్ధ ధర్మములతో వర్ణింపబడిన బ్రహ్మను మనము ఏమని తెలుసుకోగలము?
13. సవిశేష – నిర్విశేష సమన్వయము ఎలా చేయాలి?
14. బ్రహ్మ నిర్విశేషత్వమునకు హేతువు ఏమిటి?
15. భాష్యకారుల ద్వారా చెప్పబడిన రెండు బుద్ధి పరికల్పనలు ఏవి? వాటిలో భేదము ఏమిటి?
16. జగత్తు సత్తా? అసత్తా? ఈ చర్చ సారము ఏమిటి?
17. అధ్యారోపము – అపవాదము అనగా ఏమి?
18. బ్రహ్మ విశేషణములను చెప్పే కారణమైన అధ్యారోపము ఏమిటి? దాని అపవాదము ఎలా?
19. అధ్యారోప – అపవాదములు తెలిసిన తరువాత, ముముక్షువునకు ఏ సత్యము తెలియబడుతున్నది?
20. బ్రహ్మ ప్రకరణమునకు తాత్పర్యము సంక్షేపముగా వ్రాయండి.

జీవ ప్రకరణము

జగత్ప్రకరణములో 'జగత్తు స్వరూపము బ్రహ్మే' అని చెప్పి, వెనుకటి బ్రహ్మ ప్రకరణములో – బ్రహ్మ స్వరూపమును చెప్పడమయినది. అనుబంధ చతుష్టయములో చెప్పిన జగత్తు, బ్రహ్మ, జీవుడు మూడింటిలో ఇక జీవస్వరూపము విచారణకు మిగిలింది. దీనిని బోధపరచడములో జగత్తును తెలియచెప్పడముకంటె ఎక్కువ పరిశ్రమ చేయవలసి వుంటుంది. కారణము ఇది – జీవుడనగా అర్థము స్వయముగా నీవే. మనకంటె అన్య విషయమును చర్చ చేసే సమయములో నిష్పక్షపాతముగా ఉండగలము. కాని, స్వయముగా తన విషయములో ఇలా వుండడము కష్టము. జగత్కారణ విషయములో పరమాణువులు మొదలైన కారణాన్ని వెదికే ప్రవృత్తిగల వైజ్ఞానికులు కూడా, జీవుని విషయములో చూడడము, వినడము మొదలైన కార్యములతోనే వాని స్వరూపమును గ్రహించడము అనే ప్రమాదమును చేస్తున్నారు. కాని, వేదాంతము వేద ప్రమాణముతో జీవస్వరూపమును నిశ్చయము చేస్తున్నది. అలా ఎందుకు చేయవలసి వచ్చిందో కూడా చెప్తున్నది. జీవుడు తనని తాను ఏమని తెలుసుకుంటున్నాడో, ఆ మిథ్యాజ్ఞానముతో ఆరంభము చేసి, మెల్లమెల్లగా, అతనితో 'ఇది అనుచితము' అని చెప్పి, ఆఖరున, శ్రుతిని అనుసరించి, వాని స్వరూపము 'బ్రహ్మమే' అని తెలియజేసింది.

జీవుని ఈ మిథ్యాజ్ఞానము కర్తృత్వము, భోక్తృత్వము, జ్ఞాతృత్వము – ఈ మూడు ప్రకారములుగా వ్యక్తమవుతూ వున్నది. ఈ మిథ్యాజ్ఞానమునకు కారణము అవిద్య. "నా స్వరూపము ఏమిటి? మరణించిన తరువాత లోకాంతర గమనము ఉన్నదని శాస్త్రము చెప్తున్నది. అలా చెప్పినందువల్ల నేను పరిచ్ఛిన్నుడను, కాకపోతే నాకు లోకాంతరగమనము ఉండదు. అనగా నేను దేహపరిమితుడను మాత్రమేనా?" ఇలా సందేహము వస్తుంది. కాని, జీవుడు దేహ పరిమితుడు కాదు. ఎందుకంటే, కర్మవలన అతనికి ఏనుగు జన్మ వస్తే పెద్దవాడుగానూ, చీమజన్మ వస్తే చిన్నవాడుగానూ కావాలి. అలా అయితే, అతడు నిత్యత్వము లేనివాడు కావాలి. అందువల్ల అతడు దేహపరిమితుడు కాడు. "అయితే, నేను అణుపరిమితుడనా?" అది కూడా కాదు. అణుజీవుడు దేహములో ఒక భాగములో వుంటూ, దేహమంతా వ్యాపించే చలి – వేడి, వీని అనుభవమును పొందజాలడు. "సమగ్రముగా దేహమంతా వ్యాపించిన త్వగింద్రియముతో గ్రహించగలడు" అంటే అదీ కాదు. అలా అయితే, ముల్లు గ్రుచ్చుకోగానే ఆ బాధ శరీరమంతా వ్యాపించవలసి వస్తుంది. అలా జరగడము లేదు. ఎక్కడ ముల్లు గ్రుచ్చుకుంటే అక్కడే బాధ వుంటున్నది. "ఎలాగైతే దీపము గదినంతా ప్రకాశింపజేస్తుందో, అలాగే అణుమాత్రజీవుడు తన చేతనత్వముతో వ్యాపించి దేహమంతా అనుభవము పొందగలడు" అని చెప్పగలమా? ఈ దృష్టాంతము ఉచితము కాదు; ప్రకాశము దీపముకన్న భిన్నము కాదు. ప్రకాశము–దీపము రెండూ తేజో ద్రవ్యములు. తేజో ద్రవ్యములలో దీపము ఘనస్వరూపము, ప్రకాశము వ్యాపించిన స్వరూపము. గుణము – గుణినుంచి వేఱుగా ఉండదు. అందువల్ల "జ్ఞానస్వరూపుడైన అణుజీవుడు తన జ్ఞానగుణముతో దేహవ్యాప్తమైన చలిని–వేడిని అనుభవము పొందుతున్నాడు" అని చెప్పడము ఉచితముగా లేదు. అందువల్ల జీవుడు అణుపరిమాణము కలవాడు కాదు. ఇలా జీవుడు మధ్యమ పరిమాణము, అణుపరిమాణము కాకపోవడమువల్ల విభువు మాత్రమే. అనగా, సర్వత్ర తానే వ్యాపించి వున్నాడు. ఇది తెలుసుకోకుండా తనను దేహేంద్రియములద్వారా పరిచ్ఛిన్నుడిగా కల్పనచేసి తనను కర్తగా, జ్ఞాతగా, భోక్తగా భావిస్తున్నాడు. ఈ అజ్ఞానంయొక్క నివారణకోసము తనను క్రమముగా స్థూల సూక్ష్మ శరీరమునుంచి, జాగ్రత్ స్వప్న సుషుప్తి అనే అవస్థలనుంచి, పంచకోశములనుంచి వేఱుగా తెలుసుకుని "నేనే బ్రహ్మను" అని

గుర్తించాలి. శరీరము, అవస్థలు, కోశములు, ఇవన్నీ ఈశ్వరుని మాయాకార్యములు. జీవునిలో ఉన్న అహంకారము, మమకారము, మిథ్యాజ్ఞానము – ఇవన్నీ జీవుని అవిద్యాకార్యములు. అవిద్యా నాశనమువల్ల అవిద్యా కార్యములు నశిస్తాయి. అవిద్యానాశనముతో కాలక్రమములో, అనగా ఈ శరీరము మరణించిన తరువాత, మాయాకార్యమైన శరీరము తిరిగి ఉత్పత్తి కాదు. అందువల్ల కొంతమంది మాయ–అవిద్య పర్యాయపదములు అనుకుంటున్నారు. అయినా కూడా, ఎంత గొప్ప శాస్త్రవేత్త అయినా, మాయ–అవిద్యలలో ఏ ఒక్కదానిని విడిచిపెట్టి సిద్ధాంత ప్రతిపాదన చేయలేడు. ఇందువల్ల ఒకప్పుడు మాయ అని, ఒకప్పుడు అవిద్య అని అంటూ వుంటాడు. దీనితో భాష్యార్థ ప్రతిపాదనలో – "శ్రుతహాన్యశ్రుత కల్పనా" దోషము (విన్నదానిని విడిచి, విననిదానిని కల్పన చేయడము) వస్తుంది. శిష్యులలో భ్రమ కలుగుతుంది. అందువల్ల ఈ ప్రకరణములో మాయ మరియు అవిద్యల పృథక్కరణమునకు అగ్రస్థానము ఇచ్చాము.

అధ్యాయము 11

శరీరత్రయ శోధన

ఏదైనా జటిల యంత్రములోని వేఱు వేఱు భాగములు, వాటి సహకారముతో ఒక కార్యమును చేసినట్లయితే, అది ఇంకొక భోక్త కోసమే అవుతుంది. ఈ ప్రకారము స్థూల, సూక్ష్మ శరీరములు ఒకదానితో ఇంకొకదాని సహకారము తీసుకొని, కార్యమును భోక్త కోసము చేస్తున్నాయి. ఆ భోక్తే జీవుడు. (బ్ర॥ భా॥ 1-3-11). ఈ అధ్యాయములో స్థూల శరీరము, సూక్ష్మ శరీరము, కారణ శరీరము - అనే మూడు శరీరములనుండి జీవుడిని వేఱుచేసి చూపించబడుతున్నది.

సంశయము:- ఈ మూడు శరీరములనుండి వేఱుగా జీవుడని తెలుసుకొనేందుకు శ్రుతి అవసరము ఏమున్నది? వినేవాడు, చూచేవాడు, మననము చేసేవాడే జీవుడు. ఇలా అనుమాన ప్రమాణముతో నిశ్చయము ఎందుకు చేయలేము?

సమాధానము:- అలాకాదు. వినేటప్పుడు మననము చేయడము, మననము చేసేటప్పుడు వినడము కుదరదు. అనగా రెండు పనులూ చేసేవాడు ఒక్కడే అనే నిశ్చయము అనుమానముతో కాదు. ఇంతేగాక, మననము చేసే సమయములో, మననములోనే వ్యస్తచిత్తము కలవాడై వుండడము వల్ల, మననము చేసేవాడు ఎవరు-అని స్వయముగా నిశ్చయము చేయజాలడు. (బ్ర॥ భా॥ 1-3 తాత్పర్య నిర్ణయము). త్రిపుటి భేదములో అనుమానము పనిచేస్తుంది. త్రిపుటి రహితమైన గాఢ నిద్రలో జీవస్వరూపము అనుమానమునకు విషయము కాదు. ఆ కారణముగా దాని విచారణ శ్రుతి చేస్తున్నది.

జీవ స్వరూప నిశ్చయము దృక్‌దృశ్య వివేకముతో ఇలా చేస్తారు - శరీరమునకు బాహ్యముగా ఉన్న జగత్తుగాని, స్థూల శరీరముగాని, సూక్ష్మశరీరముగాని, ఈ అన్ని తత్త్వములూ, జీవునికి దృశ్యములు. వీటితో వేఱుగా వున్న జీవుని సాక్షిత్వము అతని స్వరూపము. అతడు యోగాభ్యాసము చేసి, చిత్తవృత్తి నిరోధముతో సమాధిని పొంది దీని పృథక్త్వమును అనుభవిస్తాడు. ఇలా కొందరి అభిప్రాయము కాని, ఇది శ్రుతి చెప్పిన నిష్క్రియాత్మ యొక్క సమ్యగ్దర్శనము కాదు. సమాధి నుంచి లేవగానే తిరిగి జగద్వ్యవహారము అంతా తప్పక వుంటుంది. ఈ దోష పరిహారము కోసము ఇంక కొంతమంది 'జగత్తు అవిద్యా కల్పితము, మిథ్య; అందువల్ల వ్యవహారము వాస్తవముగా లేదు' అంటారు. అయితే, జ్ఞాని వ్యవహారము చేస్తున్నట్లు కనపడుతుంది కదా? దీని సమన్వయము ఎలాగ-అనే సంశయానికి పరిహారము వారు ఇలా చేస్తారు - "జ్ఞానిలో కూడా అవిద్యాలేశము వుంటుంది. మరణముతో అది సమాప్తి కాగానే జ్ఞాని ముక్తుడు అవుతాడు; అప్పటివరకు అతనికి ముక్తి లేదు, జ్ఞానియందు కనపడే వ్యవహార విషయమును ఇలా కుదురుతుంది అని చెపితే, జగత్తుయొక్క మిథ్యాత్మత్వ కల్పన చేయడము వల్ల సిద్ధాంతానికి లాభమేమీ లేదు.

దానిని అలా ఉంచండి. శ్రుతి చెప్పిన నిష్క్రియాత్మ దర్శనక్రమము వేఱుగా వుంటుంది. ఈ క్రమములో మూడు సోపానములు 1) జగత్తు ద్వారానే బ్రహ్మ నిశ్చయము జరగాలి. ఇలా ఆ నిశ్చయించిన బ్రహ్మ సవిశేషము అవుతుంది. కాని, నిర్విశేషము కాదు. అందువల్ల కార్యకారణ అనన్యత్వముతో బ్రహ్మైకత్వమును నిశ్చయించాలి. ఈ బ్రహ్మ పరమార్థదృష్టితో నిరుపాధికము అవటమువల్ల నిర్విశేషమే. ఇటువంటి జ్ఞానముతో

జగత్తు విషయమైన ఉపాధి దృష్టి నశిస్తుంది. 2) శరీర శోధన, అవస్థాత్రయ శోధన, పంచకోశ శోధన – వీని ద్వారా జీవుని ప్రత్యగాత్మత్వమును నిశ్చయము చేయాలి. 3) దాని తరువాత 'తత్త్వమసి' మొదలైన వాక్యముల ద్వారా శ్రవణ మననములు చేసి, ప్రత్యగాత్మే బ్రహ్మ అని నిర్ణయము చేయాలి. తరువాత ఈ నిశ్చయము యొక్క నిదిధ్యాసనము చేసి, శ్రుతి చెప్పిన బ్రహ్మాత్మైకత్వ సమ్యగ్దర్శనమును పొందాలి. బ్రహ్మజ్ఞాని జగత్తును ఉపాధి దృష్టితో కాక స్వరూపదృష్టితో చూస్తాడు. శరీరముతో జగద్వ్యాపారమును చేస్తున్నప్పటికీ, అది నిష్క్రియాత్మ దర్శనమును బాధించదు. ఈ విధముగా **కార్యజగత్తుకు – కారణబ్రహ్మకు అనన్యత్వము ద్వారా నిర్విశేషబ్రహ్మైకత్వ నిర్ణయము, శరీరాది శోధన ద్వారా ప్రత్యగాత్మ నిర్ణయము, 'తత్త్వమసి' మొదలైన వాక్యములద్వారా బ్రహ్మాత్మైకత్వ నిర్ణయము – ఈ మూడు నిర్ణయములతో సమ్యగ్దర్శనము ప్రాప్తిస్తుంది.** అందువల్ల ఈ గ్రంథములో జగత్తు –బ్రహ్మ–జీవుడు, ఈ క్రమములోనే విచారము చేయబడింది.

11-1) స్థూల శరీరము

"శీర్యతే ఇతి శరీరమ్" – నశించేది కనుక శరీరము. ఇది కనపడే స్థూల శరీరము. హస్తపాదములతో కూడిన దీనినే ప్రతి వ్యక్తి తాను అనుకుంటాడు. నామము, జాతి, వర్ణము, ఆశ్రమము, లింగము మొదలైనవన్నీ స్థూల శరీరమునకు ఉన్నవి. అది అన్నము (ఆహారము) నుంచి పుట్టింది; దానితోనే పోషింపబడుతుంది. అందుకే దీనిని 'అన్నమయము' అంటారు. ఇది నవద్వారములు షడ్వికారములు సప్తధాతువులతో కూడి వున్నది. రెండు కళ్ళు, ముక్కున రంధ్రములు రెండు, రెండు చెవులు, నోరు, మూత్ర – పురీష ద్వారములు రెండు ఇవి నవద్వారములు. (అధ్యా 15-13) త్వక్కు, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రము (వీర్యము), లేక శోణితము (రజస్సు), ఇవే సప్తధాతువులు. అస్తి (గర్భములో పిండ రూపముగా వుండుట), జాయతే (పుట్టుట), వర్ధతే (పెరుగుట), పరిణమతే (వృద్ధిచెందుట), అపక్షీయతే (క్షీణించుట), వినశ్యతి (మరణించుట) –ఇవి షడ్వికారములు. పంచభూతములతో నిర్మించబడిన ఈ శరీరమునకు ఉపాదానము బ్రహ్మ. ఆకాశమునుండి అన్నమయము వరకు బ్రహ్మస్వరూపము అనుగతమయ్యే వుంటుంది – "బ్రహ్మ స్వరూపానుగమాయ చ ఆకాశద్యన్నమయాంతం కార్యం" (తై॥ 2-6-6). ప్రాణులలో ప్రాణమనస్సులతో చేతనము వస్తుంది. వృక్షములు మొదలైన వాటిలో ప్రాణము మాత్రమే వుంటుంది. కాని మనస్సు వుండదు. "ఓషధి వనస్పతిషు రసో దృశ్యతే, చిత్తమ్ ప్రాణభృత్సు. ప్రాణభృత్సుత్వేవ ఆవిస్తరాం ఆత్మా, తేషు రసోఽపి దృశ్యతే, న చిత్తమ్ ఇతరేషు–" (ఐతరేయ ఆరణ్యకమ్ 2-3-2-3). కాని స్థూల శరీర దృష్టితో, మానవునకు వృక్షములకు చాలా సామ్యము ఉన్నది. మానవ శరీరములోని రోమములే వృక్షములకు ఆకులు; వాని చర్మమే దానికి బైట బెరడు; అతని రక్తమే దాని రసము; అతని మాంసమే దానిలోపల భాగము; అతని లోని నాడులే దాని లోని ఈనెలు, అతని ఎముకలే దాని లోని కాండములు; అతని లోని మజ్జ దానిలోని గుజ్జు. (బృ॥ 3-9-28).

వెనుకటి జన్మలో చేసిన కర్మను అనుభవించడము కోసమే ఈశ్వరుడు జీవునికి స్థూల శరీరమును ఇచ్చాడు. ఇలా పూర్వజన్మము, అంతకుముందు జన్మములలో చేసిన కర్మల కారణముగా వచ్చింది. దీని వల్ల జన్మప్రవాహము అనాది అని తెలుస్తోంది. అందువల్ల 'ప్రథమజన్మకు కారణము ఏమిటి?' అనే ప్రశ్న లేనే లేదు. దుఃఖకారణమైన జన్మలు అనాది అని జీవుడు తెలుసుకుంటే, అటువంటి శరీరము మీద అతనికి జుగుప్స కలుగుతుంది. మనస్సు – జగత్తు వీటి వ్యవహారములనుండి విడిపోయి, భగవంతుని వైపు

ఆలోచిస్తుంది. కాలాంతరములో వాడు జ్ఞాని కూడా కావచ్చు. జ్ఞాని తన శరీరమును కేవలము కర్మానుభవము కోసమే వినియోగిస్తాడు. స్థూల శరీరమును అజ్ఞాని కర్మాఫలానుభవముతో పాటుగా, ఇంక కొన్ని కర్మలను చేసి ముందు జన్మలకు మార్గము ఏర్పరుచుకుంటాడు. పుణ్యకర్మలవల్ల దేవతా శరీరములు, పాపకర్మలవల్ల వృక్ష అథవా తిర్యక్ (జంతువుల) శరీరములు, మిశ్రఫలముల వల్ల మానవ శరీరము వస్తాయి. వృక్షాదులు కూడా జీవులే. బౌద్ధ, వైశేషికులు చెప్పినట్లు అచేతనములు కావు. (ఛాం॥ 6-11-2). ఈ మూడు విధములుగా ప్రతి ఒకజీవి పుణ్యపాపముల హెచ్చు తగ్గులతో అధికము - మధ్యమము-సామాన్యము అని సమూహములుగా విభజింపబడ్డది. వాని సింహావలోకనము ఈ పట్టికలో చూపబడినది.

పుణ్యము	దేవతా శరీరము	పాపము	వృక్ష - తిర్యక్ శరీరము	మిశ్రమము	మానవశరీరము
1) అత్యధికము	హిరణ్యగర్భుడు	అధికము	కాండము లేని వృక్షములు, పాము మొ॥నవి.	పుణ్యాధికము	ముముక్షువులు
2) మధ్యమము	ఇంద్రాదిదేవతలు	మధ్యమము	మామిడి మొ॥గు మొక్కలు	మధ్యమము	సాధారణులు
3) సామాన్యము	యక్షగంధర్వాదులు	సామాన్యము	తులసి మొ॥గు చిన్న మొక్కలు ఆవులు మొ॥వి.	పాపాధికము	మూఢజన్మలు

(11-1 క) కర్మానుసారము శరీరప్రాప్తి

11-2) నేను స్థూల శరీరము కాను

ఈ స్థూల శరీరములో దీనికి విపరీత ధర్మములు వున్న జీవుడు నివసిస్తున్నాడు. (సూ॥ భా॥ 3-3-54). కర్మఫల భోగము కొరకు ఇతనికి క్రొత్త క్రొత్త శరీరములు వస్తాయి. దీనిని భోగించే జీవుడు, తనను దీనికంటే వేఱు అని స్పష్టముగా తెలుసుకోవాలి. మానవుడు జీర్ణవస్త్రమును వదలి, క్రొత్త వస్త్రమును ధరిస్తాడు. అలా జీర్ణ శరీరమును వదలి జీవుడు క్రొత్త శరీరమును ధరిస్తాడు- "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో¬పరాణి, తథా శరీరాణి విహాయ జీర్ణాని అన్యాని సంయాతి నవాని దేహీ" (గీ॥ 2-22)-" వస్త్రములను మార్చినా మానవుడు తాను మారనట్లే, శరీరములు మారుతున్నా జీవుడు మారడు.

ఇది శాస్త్రముద్వారా తెలుస్తున్నది. ప్రత్యక్షముచేత, అనుమానముచేత కూడ శరీరమును చూసి ఈ లక్షణమును గ్రహించగలము. చిన్నతనములో, యౌవనములో, ముసలితనములో శరీరము మారినా కూడా 'నేను' అలాగే వున్నాను. ఇంతే గాక, రోగముతో శరీర అంగములు జీవునికి పనికిరానప్పుడు వైద్యుడు వానిని ఖండిస్తాడు. లోహము మొదలైన ఇతర ధాతువులతో చేసిన అంగములను అక్కడ సంధిస్తాడు. ఇంకొక జీవుని శరీరమునుండి తీసిన అంగమును ఇక్కడ ఏర్పాటు చేస్తాడు. ఇలా అన్ని మార్పులు జరిగినా కూడా మూల జీవుడు మాత్రము మారడు. పూర్వము లాగే వుంటాడు. శల్యచికిత్స కోసము శరీరమును స్పర్శరహితముగా చేస్తారు; జీవుని మానసిక సంబంధము ఆ సమయములో స్థూలశరీరముతో వుండదు. శరీరము కోసివేసినా కూడా వానికి ఏమాత్రము బాధకలుగదు. గాఢనిద్రలో కూడా పరిస్థితి చాలా వరకు

ఇలాగే వుంటుంది. ఈ విధముగా జీవుని కర్మఫలభోగమునకు ఉపకరణమాత్రమైన స్థూల శరీరమున కంటే జీవుడు భిన్నమని అసందిగ్ధముగా తెలుస్తున్నది. "నేను శరీరము కాను" అని అప్పుడు నిశ్చయమవుతున్నది.

11-3) సూక్ష్మ శరీరము

స్థూలశరీరము లోపల ఒక సూక్ష్మశరీరము వున్నది. ఇంద్రియములచేత ఇది తెలియబడదు. స్థూల శరీరము జడము; అందువల్ల తనకు తానుగా ఏపనీ చేయలేదు. దీని గతిశీలతకు ఏదో ఒక కారణము ఉండాలి. అది సూక్ష్మశరీరము. ఇంద్రియ విషయము కానందువల్ల దీనిని సూక్ష్మశరీరము అన్నారు. స్థూలశరీరములో ఉన్న జీవుడిని గుర్తించడానికి ఇది ఒక చిహ్నము (గుర్తు). అందువల్ల సూక్ష్మశరీరాన్ని 'లింగ శరీరము' అని కూడా అంటారు. నిద్రాసమయములో ఇది స్థూల శరీరమునుండి చాలావరకు లోపలకు వెళ్ళిపోతుంది. ఆ సమయములో స్థూలశరీరము యొక్క కార్యకలాపములు (చేష్టలు) ఎక్కువ భాగము ఆగిపోతాయి. పూర్తిగా ఎప్పుడైతే ఆగిపోతాయో అప్పుడు మృత్యువు వస్తుంది. జీవుడు, జాగ్రదవస్థలో చేసే కర్మలు అదృష్టరూపముగా (కనపడని విధముగా) సూక్ష్మశరీరములో స్థిరపడి వుంటాయి. సూక్ష్మశరీరము నశించదు. స్థూల శరీరము మరణించిన తరువాత, ఈ సూక్ష్మ శరీరము యథోచితకాలములో తన అదృష్టమును అనుసరించి ఇంకొక స్థూలశరీరమును ధరిస్తుంది.

ముందే చెప్పిన విధముగా ప్రాణము – ఇంద్రియములు – అంతఃకరణము, ఇవి సూక్ష్మశరీర తత్త్వములు. (అధ్యా॥ 8–7). వీని సంఖ్య విషయములో గ్రంథములు వేఱువేఱుగా చెపుతూ వున్నాయి. కాని వేదాంతములో ఈ సంఖ్య ప్రధానము కాదు కనక వానిచింత లేదు. సూక్ష్మ తత్త్వములు ఇవి – పంచ జ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచ ప్రాణములు, అంతఃకరణము. అంతఃకరణమునకు నాలుగు అంశములు ఉన్నవి. ఇవి అన్నీ కలసి మొత్తము 19 అయినవి. ఇవన్నీ అపంచీకృత తత్త్వములు. స్థూలశరీరము యొక్క ఉపాదానము లాగే సూక్ష్మశరీర ఉపాదానము కూడా బ్రహ్మమే. "అయం వై హరయః॥" (బృ॥ 2–5–19)– ఇంద్రియములు కూడా వాడే (బ్రహ్మ). జీవునికి వ్యతిరిక్తముగా ఉండే జీవుని ఉపకరణములు బ్రహ్మ నుంచి పుట్టుతున్నవి –"జీవవ్యతిరిక్తాని తత్త్వాని జీవోపకరణాని బ్రహ్మణో జాయన్తే।" (సూ॥ భా॥ 3, అధి॥సంబంధభాష్యము). జడ శరీరము (స్థూల శరీరము) యొక్క చేష్టలలో కొన్ని క్రియలు మన వశములో ఉంటాయి. కొన్ని వుండవు. సూక్ష్మశరీరము యొక్క 19 తత్త్వములను ఆధ్యాత్మికములు అని, వాటి క్రియలను ఆధిభౌతికములు అని, వాని దేవతలను ఆధి దైవికములు అని అంటారు. సూక్ష్మ శరీరము కూడా జడము అయినందువల్ల, స్వతంత్రముగా ఏమీ చేయజాలదు. చేతనస్వరూపమైన అధిదేవత దాని చేష్టలకు కారణము. ఈ సమస్త క్రియలు ఆ దేవతల యొక్క అనుగ్రహముతోనే జరుగుతాయి. (గీ॥ భా॥ 18–14).

ఇక, సూక్ష్మశరీరము యొక్క ప్రతీ తత్త్వమును విచారించుదాము.

11-4) అంతఃకరణము

1) జీవుని భోగమునకు సహాయకములుగా శరీరములో ఉన్న ఉపకరణములను 'కరణములు' అంటారు. వాటిలో చక్షురాది పంచ జ్ఞానేంద్రియములు బాహ్యకరణములు. ఇవి బాహ్యజగత్తు యొక్క విషయములను ప్రథమముగా గ్రహిస్తాయి. తరువాత జీవుని భోగము కోసము విషయములను అప్పగించే ముందు ఒక ఉ

పకరణము వాటిని విశ్లేషణ చేస్తుంది; అలా విశ్లేషించే లోపల వుండే కరణము –"అంతఃకరణము". ఆ అంతఃకరణములో పంచతన్మాత్రలు వుండడము వల్ల ఐదు విషయములను అది విశ్లేషణ చేయగలుగుతుంది. అంతఃకరణ అస్తిత్వమును నిశ్చయము చేసే క్రమమును శ్రుతి ఇలా అన్నది:- మనస్సు ఎక్కడో వున్నందువల్ల కనబడ లేదు, మనస్సు ఎక్కడో వున్నందువల్ల వినబడ లేదు. మనస్సుతోనే చూస్తాడు. మనస్సుతోనే వింటాడు. "అన్యత్ర మనా అభూవం, నాదర్శం। అన్యత్ర మనా అభూవం, నాశ్రౌషం। మనసా హ్యేవ పశ్యతి, మనసా హ్యేవ శృణోతి।" (బృ॥ 1-5-3). (న్యాయసూత్రము 1-1-6) ఇలా చెప్తున్నది- "యుగపత్ జ్ఞానానుత్పత్తిః మనసో లింగమ్।"- మనస్సు వున్నది అనడానికి గుర్తు ఎలాగంటే, అనేక జ్ఞానములు ఒకేసారి కలుగవు. ఏదైనా గ్రంథము చదువుతున్నప్పుడు, కళ్ళు ఆ అక్షరములను చూస్తూనే వున్నా కొన్ని వాక్యములు మన కళ్ళని తప్పించుకుంటాయి. మాట్లాడే మాటలు మన చెవులలో పడుతూనే వుంటాయి. కాని కొన్ని మాటలు చెవులు వినవు. దానికి కారణము అంతఃకరణము ఇంకొకవైపు లగ్నమయివుండడమే. అది ఇంకొకటిని ఆలోచిస్తూ వుండడము వల్ల ఈ పంక్తులను, మాటలను విశ్లేషించజాలదు. (సూ॥ భా॥ 2-3-32, బృ॥ 1-4-3).

2) అంతః కరణమునకు ఆవశ్యకమైన శక్తి ఆహారము నుండి వస్తున్నది. ఆహారములోని స్థూలభాగము మలముగా విసర్జింపబడుతుంది. మధ్యమ భాగము మాంసము అవుతుంది. అతి సూక్ష్మభాగము అంతఃకరణమునకు పోషకమైనది – "అన్నమశితం త్రేధా విధీయతే। తస్య యః స్థవిష్ఠో ధాతుః తత్పురీషం భవతి, యో మధ్యమస్తన్మాంసం, యో¬ణిష్ఠం తన్మనః।" (ఛాం॥ 6-5-1). అందువలన అంతఃకరణము భౌతికము. అన్నము తినకపోతే విషయగ్రహణము చేయడము, నిశ్చయము చేయడము, జ్ఞప్తికి తెచ్చుకోవడము ఇవన్నీ బలహీనమైపోతాయి. ఇంతేకాదు. అంతఃకరణ కార్యములన్నీ ఆహార గుణముల మీదే ఆధారపడి వున్నాయి. ఆహారములో ఉన్న సాత్విక, రాజస, తామస గుణములను అనుసరించి క్రమముగా సాత్త్విక, రాజస, తామస భావములకు అంతఃకరణములో పుష్టి కలుగుతుంది. అందువల్ల సాధకునికి సాత్త్విక ఆహారము తీసుకోవాలని చాలా నియమములు చెప్పారు. ఇంకా "శబ్దాది విషయముల జ్ఞానము కూడా అంతఃకరణమునకు ఆహారము. అందువల్ల కేవలము రాగ ద్వేష మోహ రహితమైన విషయాలనే స్వీకరించడము అంతఃకరణ శుద్ధికోసము ఆవశ్యకము" (ఛాం॥ భా॥ 7-23-2).

3) అంతఃకరణములో 4 అంశములున్నవి – మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. వీని స్థానములు వరుసగా కంఠము, ముఖము, నాభి, హృదయము (శారీరికోపనిషత్). వీనిలో సంకల్ప వికల్పములను చేసేది మనస్సు – "సంకల్ప వికల్పాత్మకం మనః" చేసిన సంకల్పములలో సరియైనది లేనిది నిశ్చయము చేసేది బుద్ధి- "నిశ్చయాత్మికా బుద్ధిః" స్మరణము చేసేది చిత్తము-"ధారణాత్మకం చిత్తమ్" నేను మనుష్యుడను, నేను స్త్రీని, నేను వస్తున్నాను, నేను వెళ్తున్నాను, ఈవిధముగా అనాత్మయైన శరీరమునందు ఆత్మబుద్ధిని చేయడము అహంకారము – "అహం కరోతీతి అహంకారః।" ఈ భావము బలమై, నేను ధనవంతుడను, నేను బుద్ధిమంతుడను అని అనుకోవడము దురహంకారమవుతుంది. ఈ నాలుగు అంగముల అధిదేవతలు – చంద్రుడు, చతుర్ముఖ బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు. ఏ పని అయినా సంకల్పముతో ప్రారంభము అవుతున్నది. సంకల్పము, నిశ్చయము, స్మృతి వీటి వల్ల "నేను ఈ పనిచేశాను" అనే భావము కలగగానే అంతఃకరణములో కర్మజన్య అదృష్టము చేరిపోతున్నది. తన మంచి సాధనతో ముముక్షువు జ్ఞానమును పొంది ముక్తుడు అయితే, ఆ జ్ఞానరూప ఫలముకూడా అంతఃకరణములోనికే వెళ్తుంది.

11-5) ఐదు ప్రాణములు

1) మనము తినే అన్నము అంతఃకరణమునకు పోషణ కారణమయితే, త్రాగే నీటిలో సూక్ష్మభాగము ప్రాణమునకు పోషకము. నీటిలో స్థూలభాగము మూత్రము అవుతుంది, మధ్యమ భాగము రక్తములో కలుస్తుంది, అతి సూక్ష్మభాగము ప్రాణమునకు పోషకమవుతుంది– "ఆపః పీతాస్త్రేధా విధీయంతే తాసాం యః స్థవిష్ఠో ధాతుస్తన్మూత్రం భవతి యో మధ్యమస్తల్లోహితం యో¬ణిష్ఠః స ప్రాణః" (ఛాం॥ 6-5-2). అన్నము తినకపోతే స్థూలశరీరము, అంతఃకరణము బలహీనమయిపోతాయి. కాని ప్రాణి మరణించదు. నీరు త్రాగుతూవుంటే మూడునెలలు వరకు ప్రాణములు నిలచే వుంటాయి. నీరు లేకపోతే కొంచెము కాలములోనే మరణిస్తుంది.

2) ప్రాణవాయువులు ఐదు; అవి– ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము. సాంఖ్యులు మొదలైన కొందరి అభిప్రాయము ప్రకారము స్థూలదేహములో వీని స్థానములు ఇలా వున్నాయి– "హృది ప్రాణో గుదే¬పానః సమానో నాభిసంస్థితః। ఉదానః కంఠదేశస్థో వ్యానస్సర్వశరీరగః"– ప్రాణమునకు స్థానము హృదయము; ఉచ్ఛ్వాస నిశ్వాసములు దీని కార్యము. అపానమునకు స్థానము గుదము. ఇది గుదమునకు గుహ్యమునకు సంకోచము వికాసములను కలిగిస్తూ మల మూత్ర శుక్ల శోణితములను విసర్జిస్తుంది. సమానము యొక్క స్థానము నాభి; ఇది పాచనము (జీర్ణము) చేస్తుంది. ఉదానమునకు స్థానము కంఠము; మ్రింగడము దగ్గడము దీని క్రియలు. వ్యానము సమస్త శరీరములో వ్యాపించి వున్నది. ఎముకలలోనూ, సంధులలోను, మర్మస్థానములలోను జరిగే క్రియలు దీని కార్యములు. కొందరు పైన చెప్పిన స్థానములనూ కార్యములనూ ఈ విధముగా ఆమోదిస్తున్నారు. అయితే ఇది శ్రుతి సమ్మతము కాదు. (ఛాం॥ 1-3-18).

3) శ్రుతిని అనుసరించి, వాయువు యొక్క అయిదు వృత్తి విశేషములు పంచప్రాణములు. ప్రాణవాయువు యొక్క స్థానము ముఖము. దీనిద్వారా నోరు, ముక్కు, కళ్ళు, చెవులు – వీనితోనే శ్వాస విడిచిపెట్టడము జరుగుతోంది. ఇది మిగిలిన 4 వాయువులకు రాజు వంటిది. (సూ॥ భా॥ 2-4-12). దీనిని ముఖ్య ప్రాణము అంటారు.

అపానవాయువు యొక్క స్థానము గుదము గుహ్యము. దీనిద్వారా మలమూత్ర విసర్జనము, శ్వాస తీసుకోవడము జరుగుతున్నది. దీని క్రియతోనే గంధమును గ్రహించడము జరుగుతున్నది. (బృ॥ 1-5-3, 3-2-5). కాని, బ్రహ్మసూత్ర భాష్యములో ఒక్కచోట మాత్రము – "ప్రాణః ప్రాగ్వృత్తిః ఉచ్ఛ్వాసాది కర్మా, అపానః అర్వాగ్ వృత్తిః నిశ్వాసాది కర్మా।" (సూ॥ భా॥ 2-4-12) అని ఉన్నది. దీని ప్రకారము ప్రాణ-అపానముల క్రియలలో విపరీత క్రమము వస్తున్నది. ఇది లిపికారుని దోషము అయి వుండవచ్చు.

హృదయమునకు కుడివైపున రంధ్రముల నుండి బయలుదేరి దేహమంతా వ్యాపించే నాడులు వ్యానవాయువుకు స్థానము. హృదయములోనున్న వీటి నాడుల సంఖ్య 101. ఇందులో ఒక నాడి మూర్ధము (తాలుపు) నుండి వస్తున్న సుషుమ్న ఒక్కొక్కనాడి వంద భాగములుగానూ, ఆ ఒక్కొక్కటీ 72,000 భాగములు గానూ విభజింపబడి శరీరము అంతటా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నాడీ మండలమంతా వ్యానవాయువుస్థానము. ప్రాణ-అపానముల మధ్య జరుగ క్రియ దీని క్రియ, అంటే శ్వాస తీసుకోవడము

వదలడము అను కార్యము మధ్య కార్యము, అనగా శ్వాస ఆపి వుంచుట, దీని కార్యము. మాట్లాడుట, బరువులు మోయుట, యజ్ఞమునకు అగ్ని మథించుట, ఈ విధమైన ఎక్కువ శ్రమతో కూడినవి దీని వల్లనే జరుగుతాయి. (ప్ర॥ 3-5-7, ఛాం॥ 1-3-3, 5).

మూర్ధములోని సుషుమ్న నాడి చివరి వరకు వ్యాపించి ఉదానవాయువు ఉన్నది. శాస్త్రనిర్మిత కర్మ చేసిన వారిని ఉత్తమ జన్మలకు, దానికి విరుద్ధముగా నిషిద్ధ కర్మలు చేసిన వారిని క్రిందిలోకములకు పంపించే పని ఈ ఉదానవాయువు యొక్క కర్మ. నిత్యమూ సుషుప్తిలో జీవులను ఆనందరూప బ్రహ్మ దగ్గరకు తీసుకువెళ్ళే పని కూడా దీనిదే. (ప్ర॥ 3-9-10).

నాభి సమానవాయువు స్థానము. త్రాగినదానిని, తిన్న ఆహారమును, శరీరమున అన్ని భాగములకు సమానముగా విభజించే కార్యము ఈ వాయువుయొక్క పని. (ప్ర॥ 3-5).

4) ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము వీని అధిదేవతలు క్రమముగా ఆదిత్యుడు, పృథ్వి, వాయువు, తేజస్సు, ఆకాశము (ప్ర॥ 3-8-9).

11-6) పంచ జ్ఞానేంద్రియములు

శ్రోత్రము, త్వక్కు, చక్షువు, జిహ్వ, నాసిక ఇవి ఐదు జ్ఞానేంద్రియములు. వీని ఆధిభౌతిక కార్యములు – శబ్దములను వినడము; కఠినము మృదువు, శీతలము ఉష్ణము మొదలైన స్పర్శల జ్ఞానము; రూపములను చూడడము, రుచిని గ్రహించుట, గంధమును గ్రహించుట. స్థూల శరీరములో వీని స్థానములు – చెవి, చర్మము (త్వచ), కళ్ళు, నాలుక, నాసిక. ఈ అంగములే ఇంద్రియములు కావు. ఇవి ఇంద్రియ గోళములు; అంటే ఇంద్రియ స్థానములు. క్రమముగా వీని అధి దేవతలు దిగ్దేవతలు, వాయువు, సూర్యుడు, వరుణుడు, నాసత్యుడు – దస్రులు (అశ్వినీ దేవతలు) అనే కవలలు. ఈ ఇంద్రియములు కేవలము తమకు సంబంధించిన విషయములనే గ్రహించగలవు. చెవులు చూడజాలవు, కళ్ళు వినజాలవు. ఒక యింద్రియము పనిచేసేటప్పుడు ఇంకొక యింద్రియము పనిచేయదు. ఒక జ్ఞానేంద్రియమునకు ఒక్క తత్త్వమే ఉండడము వల్ల (అధ్యా॥ 8-7) – ఒక సమయంలో అది తనకు సంబంధించిన ఒక్కపనిని మాత్రమే చేయగలదు. భక్ష్యమును తినేటప్పుడు దాని శబ్ద స్పర్శరూపరసగంధములను ఈ ఐదు విషయములు ఒక్క సమయములోనే మానవుని అనుభవమునకు రావు. విషయానుభవమునకు మనస్సు ఒక్కటే కారణము గనుక ఒక సమయములో ఒకే ఇంద్రియముతో అది సంబంధించి వుంటుంది. (పైన అ॥ 11-4-1ని చూడండి.)

శ్రుతిని అనుసరించి, సూక్ష్మ శరీర విషయములో వివరణ ఇవ్వడము అయింది. దాని సింహావలోకనము ఇక్కడ ఇచ్చిన పట్టికలో చూపబడినది. (11–7, క).

(11–7–క) సూక్ష్మశరీరము యొక్క శ్రుత్యుక్త వివరణము

ఆధ్యాత్మికము	స్థానము	ఆధిభౌతికము	ఆధిదైవికము
అంతఃకరణము			
మనస్సు	కంఠము	సంకల్ప – వికల్పములు	చంద్రుడు
బుద్ధి	ముఖము	నిశ్చయము చేయడము	బ్రహ్మ
చిత్తము	నాభి	జ్ఞాపకము ఉంచుకొనుట	విష్ణువు
అహంకారము	హృదయము	అహం – అభిమానము	రుద్రుడు
ప్రాణములు			
ప్రాణవాయువు	ముఖము	నిశ్వాసము	ఆదిత్యుడు
అపానవాయువు	గుదము–గుహ్యము	ఉచ్ఛ్వాసము	పృథ్వి
వ్యానవాయువు	నాడీ మండలము	శ్వాసని నిలిపివుంచుట	వాయువు
ఉదాన వాయువు	శిరస్సు నుండి పాదములు వరకు	సుషుప్తికూ రాబోయే జన్మలకూ తీసుకుపోవుట	తేజస్సు
సమాన వాయువు	నాభి	ఆహార వితరణము	ఆకాశము
జ్ఞానేంద్రియములు			
శ్రోత్రము	చెవులు	శబ్దము వినుట	దిగ్దేవతలు
త్వక్కు	చర్మము	స్పర్శ గ్రహించుట	వాయువు
నేత్రము	కళ్ళు	చూచుట	సూర్యుడు
జిహ్వ	నాలుక	రుచి గ్రహించుట	వరుణుడు
ఘ్రాణము	ముక్కు	గంధమును గ్రహించుట	అశ్వినీ దేవతలు
కర్మేంద్రియములు			
వాక్కు	ఛాతి, ముఖము	మాట్లాడుట	అగ్ని
పాణి	చేతులు	ఇచ్చి–పుచ్చుకొనుట	ఇంద్రుడు
పాదము	కాళ్ళు	నడచుట	ఉపేంద్రుడు
పాయువు	గుదము	మల విసర్జనము	మృత్యువు
ఉపస్థ	శిశ్నము–యోని	మూత్ర, శుక్ర–శోణితముల విసర్జనము	ప్రజాపతి

(11-7) పంచ కర్మేంద్రియములు

శరీరములో 5 కర్మేంద్రియములు ఉన్నవి - వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ. వీని ఆధిభౌతిక కార్యములు క్రమముగా - మాట్లాడుట, ఇచ్చుట పుచ్చుకొనుట, నడచుట, మలవిసర్జన, మూత్రము శుక్ర - శోణితములను విసర్జించుట. వీటికి అధిదేవతలు - అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మృత్యువు, ప్రజాపతి. కర్మేంద్రియములకు తినే పదార్థములలో నూనె, నెయ్యి మొదలైన స్నిగ్ధ పదార్థములనుండి బలము వస్తుంది. క్రొవ్వు గుజ్జు యొక్క స్థూలభాగము ఎముకలలోనికి, మధ్యమ భాగము మజ్జలోనికి, సూక్ష్మభాగము వాక్కుకు (అన్ని కర్మేంద్రియములకు) వెళ్తుంది - "తేజో¬శితం త్రేధా విధీయతే తస్య యః స్థవిష్ఠో ధాతుస్తదస్థి భవతి యో మధ్యమః స మజ్జా యో¬ణిష్ఠా సా వాక్" (ఛాం॥ 6-5-3). అందువల్ల నెయ్యి ఎక్కువగా తినే తెలుగు (ఆంధ్ర) బ్రాహ్మణులు వేదఘోష చేసేటప్పుడు స్ఫుటత్వము, మాధుర్యము వుంటాయి.

సూక్ష్మశరీరములోని 5 జ్ఞానేంద్రియములు, మనస్సు, వాక్కు, పాణి- ఈ ఎనిమిదిని శ్రుతి **గ్రహములు** అన్నది. పంచ జ్ఞానేంద్రియములతో గ్రహించే నిషిద్ధ శబ్ద స్పర్శ రూప రస గంధములు, పంచ జ్ఞానేంద్రియములకు క్రమశః **అతిగ్రహములు.** మనస్సు ఏ నిషిద్ధ కామములలో ప్రవర్తిస్తూ వుంటుందో అది మనస్సుకు అతిగ్రహము. వాక్కు అసహ్యము అసభ్యము అయిన ఏ శబ్దములను ఉచ్చరించుటకు ఆతురత పడుతూ వుంటుందో, అది వాక్కుకు అతిగ్రహము; చేసే నిషిద్ధకర్మములు పాణికి అతిగ్రహము- అంటారు. గ్రహములు - అతిగ్రహముల అధీనములో వుంటాయి. గ్రహాతిగ్రహములే జీవునికి మృత్యువు, అనగా బంధము అవుతాయి. (బృ. 3-3-2-9). ఈ మృత్యువునకు మృత్యువు అయినవాడు పరమాత్మ; అతనిని ఎవరు పొందుతారో వారికి మృత్యువే లేదు.

11-8) నేను సూక్ష్మశరీరము కాదు

నేను స్థూల శరీరమును కాను, అని చెప్పినట్లే, నేను సూక్ష్మశరీరమును కూడా కాను. లింగ శరీరము యొక్క తత్త్వములు జడములు. ఒకదానితో ఒకటి కలసి పనిచేస్తాయి. చేతన స్వరూపుడైన జీవుని భోగము కొఱకే అవి పనిచేస్తాయి. జీవుడు వానికంటె వేఱు. అందువల్ల లింగ శరీరము యొక్క అంగములైన ప్రాణము జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు పనిచేయడము లేక చేయకపోవడము, నశించడము జీవుడు చూస్తూ వుంటాడు. ప్రాణము చాలామటుకు జీవుని వశములో వుంటుంది. యోగులకైతే పూర్తి స్వాధీనములో వుంటుంది. దీనివల్ల ఈ అంగములు జీవుని భోగము కొఱకే ఉండే కరణములు అని మనకు స్పష్టముగా తెలుస్తున్నది. అందువల్ల వాటిని గుర్తించే జీవుడు వానికన్న వేఱు.

అంతఃకరణము విషయములో కూడా ఈ మాట సత్యము. అయినా కూడా దీనిని తెలుసుకోవడములో ఒక అడ్డంకి వున్నది. సంకల్పము, నిశ్చయము, స్మృతులు, అహంభావము ఇవన్నీ తనకు జ్ఞేయములైనందువల్ల 'నేను వీనికన్న వేఱు' అని నిశ్చయము అవుతున్నది. అయితే ఈ సాక్షిత్వము కూడా ఒక అహంకారరూపంగా సంకల్పరూపముగా అంతఃకరణ ధర్మముగానే భాసిస్తున్నది. 'నేను ఈ సంకల్పములకు సాక్షిని' అనేది కూడా ఒక మనోవృత్తి మాత్రమే. ఇందులో 'నేను' అనేది అహం వృత్తి కదా? అందువల్ల "నేను అంతఃకరణము కన్న వేఱుగా ఎలా వుంటాను? దానికంటే వేఱుకాను", అనే భావన వదలడము లేదు. ఈ సందేహము పోవాలంటే సుషుప్తి అనగా, గాఢనిద్ర అనుభవమును పరిశీలించాలి. సుషుప్తిలో జాగ్రత్-స్వప్నములందువలె ఏ జ్ఞానమూ వుండదు. అయినా, విశేష జ్ఞానము లేనిదానిని తెలుసుకుంటూ, సాక్షి రూపములో ఉండే

'నేను' ఉన్నాను. గాఢనిద్ర నుంచి లేచి – "విశ్రాంతిగా నిద్రపోయాను, కొంచెము కూడా ఏదీ తెలియలేదు" అంటాను. నిద్రా సమయములో 'నేను' లేకపోతే ఈ మాటలు ఎలా అనగలను? అందువల్ల సుషుప్తిలో అంతఃకరణము పనిచేయడము లేదని తెలుస్తున్నది. అందువల్ల జాగ్రత్స్వప్నములలోవలె అంతఃకరణము తనను తానే గుర్తించినదా' అనే సందేహము సుషుప్తి విషయములో వుండదు. ఎందుకనగా గాఢనిద్రలో, అంతఃకరణము తనను తాను గుర్తించడానికి అక్కడ అంతఃకరణమే వుండదు. ఇందులో సందేహము ఏమీ లేదు. సుషుప్తి కాలములో అంతఃకరణము యొక్క అనుపస్థితిని ఏ ఆత్మ అనుభవిస్తున్నదో అది అంతఃకరణము కన్న భిన్నముగానే వున్నది.

అందువల్ల అంతఃకరణము యొక్క అన్ని తత్త్వములు దృశ్యములే. వానికి ద్రష్టయైన ఆత్మ సూక్ష్మశరీరముకన్న భిన్నుడు" అని స్పష్టమైనది. దీనివల్ల "నేను సూక్ష్మశరీరము కాను" అని తెలుస్తున్నది.

11-9) కారణ శరీరము

ఈ ప్రకారము ఆత్మ స్థూల శరీరము కాదు; సూక్ష్మశరీరము కూడా కాదు. అతి సహజరీతిలో ఈ రెండు శరీరములను తానుగా అనుకున్న జీవుడు ఆ విధముగా ఎప్పుడూ లేడు. అనగా అతడు తనని తాను తెలుసుకోలేదు. ఇది అతని అజ్ఞానము. ఏది తాను కాదో, ఆ శరీరమును 'తానే' అనుకుంటున్నాడు. శరీరము యొక్క లింగము, జాతి మొదలైన వాటిని అనుసరించి "నేను స్త్రీని, నేను పురుషుడను, నేను బ్రాహ్మణుడను, నేను శూద్రుడను" అని ఈ విధముగా తెలుసుకోవడము జీవుని మిథ్యాజ్ఞానము. వీటిని అనుసరించి అతడు రాగద్వేషాది భావములను పొంది, వివిధ కర్మలచేత లిప్తుడు అవుతున్నాడు. చేసిన అనేక కర్మలవల్ల పుట్టిన అదృష్టము (కనపడని శక్తి) అంతఃకరణములో స్థిరపడుతుంది. అతడు దీనినంతటినీ ఒకే జన్మలో భోగించజాలడు. అందువల్ల ఇంకొక జన్మ ఎత్తవలసి వస్తుంది. ఈ విధముగా జనన – మరణ రూప సంసార చక్రములో పడేటందుకు కారణము అతని అజ్ఞానమే. ఇది కూడా (శీర్యతే) నశించే స్వభావము గలదగుటచే శరీరమే. అందువల్ల అజ్ఞానమును కారణశరీరము అంటారు. శుద్ధము, నిర్మలము అయిన ఆత్మకు దీనితో కూడా సంబంధము లేదని (ఈశా।। భా।। 8) –ముందు చెప్పబడనున్నది. (అధ్యా।। 12-9-1, చూడండి).

11-10) విద్య, కర్మ, పూర్వప్రజ్ఞ :

రాగ – ద్వేషాదులతో కూడిన జీవుడు తన జాగ్రదవస్థలో ఒక్క క్షణము కూడా విశ్రాంతిగా ఉండజాలడు. ఏదో ఒకటి తెలుసుకుంటూనే ఉంటాడు; ఏదో ఒకటి చేస్తూనే వుంటాడు. ఇలా తెలుసుకునే వాటిలో మంచి–చెడు ఏది తెలుసుకున్నా, దానిని 'విద్య' అంటారు. మంచియైనా, చెడు అయినా ఏది చేయబడుతుందో అది 'కర్మ'. ఈ రెండింటిలో విహితము (శాస్త్రము కర్తవ్యమని చెప్పినది), అవిహితము (విహితము కానిది), ప్రతిషిద్ధము (శాస్త్ర–నిషిద్ధము), అప్రతిషిద్ధము (నిషిద్ధము కానిది) అని నాలుగు విభాగములు ఉన్నవి. ఈ ప్రకారము వీటిని మంచివి – చెడువి – నిరర్థకమైనవి ఇత్యాది విధమున విభజన చేయగలము. ఇంతేగాక, తెలుసుకున్న విద్య, చేసిన కర్మ – రెండూ అంతఃకరణములో ఒక సంస్కారమును ఉత్పన్నము చేస్తున్నవి; దీనిని 'పూర్వప్రజ్ఞ' అంటారు. దీనినే 'వాసన' అని కూడా అంటారు. ఇవి, తరువాతి విద్యకు – తరువాతి కర్మకు ప్రేరకములు. అనగా ఈ మూడు కలసి ముందు జన్మలకు రూపరేఖలను నిశ్చయము చేస్తున్నాయి. "తం విద్యా కర్మణీ సమన్వారభేతే పూర్వ ప్రజ్ఞా చ" (బృ।। 4-4-2).

11-11) సంచితము - ప్రారబ్ధము - ఆగామి

జన్మలు అనాది కాలమునుండి వస్తూనే ఉన్నాయి. ప్రతి ఒక్క జన్మలో చేసిన కర్మఫలమును, ఆ జన్మలోనే అనుభవించడము కుదరదు. ఎందుకంటే వాటిని అనుభవించడానికి తగిన దేశము, కాలము లేక పరిస్థితులు దొరకవు. ఈశ్వరాజ్ఞ వల్ల ఎప్పుడెప్పుడు అవకాశము దొరుకుతుందో, అప్పుడే అనుభవించాలి. భోగముతో కర్మ క్షీణిస్తూ వస్తుంది. అలా క్షీణించగా మిగిలిన కర్మ "సంచిత కర్మ". వీటి అన్నిటి భోగము ఒక జన్మలో కాదు. కొన్ని పాపములు ఎలా వుంటాయంటే, వాటిని అనుభవించడానికి అనేక జన్మలు ఎత్తవలసి వుంటుంది. ఇది శాస్త్రము వల్ల తెలుస్తున్నది. సంచిత కర్మలో ఏ భాగము అనుభవించడానికి ఈ జన్మ వచ్చిందో ఆ భాగమును "ప్రారబ్ధకర్మ" అంటారు. ఈ జన్మలో చేసే కర్మ "ఆగామికర్మ". ఈ విధంగా అజ్ఞానియైన జీవునికి బహుశః అనుభవించి వదలివేసే కర్మ కంటే, ఈ జన్మలో ఆర్జించి ఉంచుకునే కర్మే ఎక్కువగా వుంటుంది. ప్రాయశ్చిత్తము మొదలైన కర్మలతో సంచితకర్మ ప్రారబ్ధకర్మ కొంత తగ్గవచ్చు. చేసే పుణ్యకర్మలను అనుభవించడానికి తిరిగి జీవుడు జన్మను పొందవలసే వుంటుంది. కేవలం సత్కర్మల వల్ల జన్మరాహిత్యము జరగదు.

11-12 మరణ క్రమము

ప్రతియొక్క జన్మలో ప్రారబ్ధానుసారము ఆయువు నిశ్చితమై వుంటుంది. ఇది, ప్రాయశ్చిత్తములవల్ల పుణ్యకర్మల వల్ల ఎక్కువ అవవచ్చు. పాపమువల్ల తగ్గిపోనూ వచ్చు. ఆయువు పూర్తికాకముందే ముసలితనము, జ్వరము మొదలైన వాటివల్ల శరీరము బలహీనము అవుతుంది. జీవుడు మంచము పట్టే స్థితి వస్తుంది. ఇక, ఆఖరు సమయము వచ్చినప్పుడు మర్మభేదమైన వేదనతో స్మృతి శిథిలమవుతుంది. ఆ సమయంలో స్వప్రయత్నముతో తన క్షేమము కొరకు ఏమీ చేయజాలడు. ఈ జన్మలో సంపాదించిన విద్య-కర్మ-పూర్వప్రజ్ఞల తోనే తరువాతి జన్మ యొక్క గతి నిర్ణీతమవుతుంది. (బృ॥ భా॥ 4-3-35). అందువల్ల సాధకులు ప్రయత్నించి చెడు మార్గములను వదలి విశిష్ట పుణ్యములను సంపాదించవలసిన అవసరము ఉన్నది. (బృ॥ 4-4-2).

మరణాసన్నుడైన వ్యక్తికి వాగింద్రియము మీద మొదట అడ్డు పడుతుంది. అది రాబోయే జన్మలోని వాక్కును అనుసరించి వృత్తిని పొంది అతని మనస్సులో ఐక్యము చెందుతుంది. ఇక్కడ వాక్కు సమస్త కర్మేంద్రియములకు ఉప లక్షణము- "పాణిపాదపాయూపస్థాఖ్యానాం సర్వేషాం ఉపలక్షణార్థా వాక్।" (బృ॥భా 1-4-7). అప్పుడు అతని మాట పడిపోతుంది. చక్షురాది జ్ఞానేంద్రియములు, తమ తేజోరూప అవయవములతో కూడా మనసులో అణగిపోతాయి. స్వప్నములో కూడా ఇలాగే జరుగుతుంది. కాని, ఇప్పుడు పూర్తిగా స్థూల శరీరములోని ఇంద్రియములు అన్నీ కలసిపోతాయి. దీని తరువాత ఇంద్రియములలో తేజోమాత్రలతో కూడిన మనస్సు హృదయములో కలుస్తుంది. అప్పుడు అన్ని ఇంద్రియ వ్యవహారములు ఆగిపోతాయి. (బృ॥ 4-4-1,2). ఆ తరువాత ఆగామి జన్మకు యోగ్యమైన వృత్తితో కూడి మనస్సు ప్రాణములో లీనమవుతుంది. (ప్ర॥ 3-10). ఆ పైన ప్రాణవృత్తి జీవాత్మలో కలుస్తుంది. అప్పుడు వాక్కు, మనస్సు, ప్రాణముల వృత్తులను తనలో తీసుకున్న జీవాత్మ ఏదో ఒక ద్వారమునుండి బయటకు నిష్క్రమిస్తాడు. (సూ॥ భా॥ 4-2-1-11). ఈ విధముగా జీవరహిత శరీరము మరణిస్తుంది; జీవుడు మరణించడు. (ఛాం॥ 6-11-3).

11-13 జనన క్రమము

శరీరము వదలిన తరువాత ఈ జీవుడు ఉపాసకుడయితే బ్రహ్మ లోకములకు, కర్మి అయినట్లయితే పితృలోకములకు, విశేష సత్కర్మలు చేసినట్లయితే స్వర్గాది లోకములకు, విశేష దుష్కర్మలు చేసినట్లయితే రౌరవాది నరకములకు వెళ్ళి, తిరిగివచ్చి మిగిలిన కర్మ ఫలమును ఈ లోకములో అనుభవిస్తాడు. (సూ॥భా॥ 3-1-8-17).

ఇంకొక శరీరమును ధరించడము జీవునికి తృణజలూక (గడ్డిపురుగు) నడక వంటిది. తృణజలూక ఇంకొక గడ్డిపరకను పట్టుకుని, తరువాత ముందు పట్టుకున్న గడ్డిని వదలిపెడుతుంది. అదే ప్రకారము, జీవుడు కూడా తన వాసనను అనుసరించి ఇంకొక శరీరమును నిశ్చయించిన తరువాత ఈ శరీరమును విడిచిపెడతాడు. (బృ॥ భా॥ 4-4-3). కాని, రాబోయే శరీరములోని తేజోమాత్రలను (సూక్ష్మ భూతములను), పూర్వ శరీరమునుండి తీసుకునే వస్తాడు. (సూ॥ భా॥ 3-1-1). ఈ లోకమునకు వచ్చేటప్పుడు వర్షరూపముగా వచ్చి ధాన్యములో ప్రవేశిస్తాడు. అక్కడినుండి పురుష శరీరములో వీర్యరూపముగా ప్రవేశించి, చివరకి తల్లిగర్భములోనికి ప్రవేశిస్తాడు. (ఛాం॥ భా॥ 5-10-1). క్రిందటి జన్మలోని విద్య - కర్మ - పూర్వప్రజ్ఞల పరిణామములతో, జీవుడు ఈ జన్మలో కామమయుడు-అకామమయుడు, క్రోధమయుడు - అక్రోధమయుడు, ధర్మమయుడు - అధర్మమయుడు, తేజోమయుడు - అతేజోమయుడు అయి మళ్ళీ పుడతాడు.

ప్రశ్నలు:-

1. శరీరమునకు అన్నమయమని పేరు ఎందుకు వచ్చినది?
2. నవద్వారములు ఏవి?
3. ఆరు వికారములను చెప్పండి.
4. సప్తధాతువులు అనగా ఏవి?
5. మనుష్యులు - వనస్పతులలో సమాన లక్షణములు ఏమేమి వున్నాయి?
6. జీవునికి స్థూల శరీరము ఎందుకు ప్రాప్తిస్తున్నది?
7. జ్ఞాని మరియు అజ్ఞానిలో అంతరము ఏమిటి?
8. పుణ్య-పాపములలో ఎక్కువ తక్కువలు ఏ ఏ శరీరములను ప్రాప్తిస్తుంది?
9. శరీరము మారినా, జీవుడు మారడని ఎందుకు చెప్పారు?
10. స్థూల శరీరము జీవుని భోగము కోసమేనని ఎందుకు చెప్పారు?
11. సూక్ష్మశరీరము ఏ ప్రకారము వుంటుంది? దానిని లింగశరీరము అని ఎందుకు అన్నారు?
12. నిద్రలో స్థూల-సూక్ష్మ శరీరములతో జీవుని సంబంధము ఏమిటి?
13. శరీర చేష్టలు ఎలా జరుగుతున్నాయి?

14. సూక్ష్మశరీర తత్త్వములు ఏమిటి?

15. ఏ స్థితిని మృత్యువు అంటారు?

16. ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము అనగా ఏవి?

17. కరణములు ఏమిటి?

18. అంతఃకరణముతో ఏ కార్యము జరుగుతున్నది?

19. మనము తినే ఆహారములో ఏఏ భాగములు ఏమేమి అవుతున్నాయి?

20. అన్నము తినకపోతే ఏమవుతుంది?

21. అంతఃకరణములో నాలుగు భేదములు ఏమిటి?

22. కర్మఫలము ఎక్కడ వుంటుంది?

23. పంచప్రాణములు ఏవి? ఏఏ ప్రాణములు శరీరములో ఏ ఏ భాగములలో వుంటాయి?

24. పంచప్రాణముల కార్యములు ఏమిటి? మనము త్రాగే నీటిలో ఏ ఏ భాగములు ఏమేమి అవుతున్నాయి?

25. పంచ జ్ఞానేంద్రియములు ఏమిటి? వాటి పనులు ఏవి?

26. ఒక జ్ఞానేంద్రియము పనిని ఇంకొకటి చేయలేదు. ఎందువల్ల?

27. జ్ఞానేంద్రియముల ఆధిదైవములు ఎవరు?

28. ఒక యింద్రియము పనిచేస్తుంటే, ఇంకొక యింద్రియము పనిచేయదు. దీనికి ఉదాహరణము యివ్వండి?

29. పంచ కర్మేంద్రియములు ఏవి?

30. మనము ఏ తేజస్సును (స్నిగ్ధపదార్థము) తింటామో, దాని ఏఏ భాగములు ఏమేమి అవుతున్నాయి?

31. గ్రహ – అతిగ్రహములు అంటే ఏవి? అవి జీవుడిని ఏమి చేస్తున్నాయి?

32. సూక్ష్మ శరీరముతో జీవుడు వేరని ఎలా చెప్తున్నారు?

33. జీవుడు అంతఃకరణముతో వేఱుగా వుండి సాక్షిరూపమయాడని ఎలా తెలుస్తున్నది?

34. కారణ శరీరము ఎలాంటిది? దీనికి ఆ పేరు ఎలా వస్తుంది?

35. విద్య – కర్మ – పూర్వప్రజ్ఞ అంటే ఏమిటి?

36. వాసనలు అంటే ఏవి?

37. సంచితము – ఆగామి – ప్రారబ్ధము అనే కర్మలు ఏమిటి?

38. సత్కర్మ కూడా బంధకారణమని ఎలా నిశ్చయమయినది?

39. మానవుని ఆయువు దేనిమీద ఆధారపడి వున్నది?
40. ఉత్క్రాంత కాలములో ఏం జరుగుతున్నది?
41. ముందు గతి దేనిమీద ఆధారపడివున్నది?
42. మరణించే సమయములో ఇంద్రియములు తమ సామర్థ్యమును ఎలా కోల్పోతున్నాయి?
43. జనన క్రమమును వర్ణించండి.

అధ్యాయము - 12

అవిద్య

క్రిందటి అధ్యాయములో అజ్ఞానమే కారణశరీరము అని చెప్పబడినది. ఇప్పుడు దాని వర్ణన వివరముగా చేయబడుతున్నది.

12-1) జీవుని భ్రమ

జీవుడు స్థూలశరీరముకంటె సూక్ష్మశరీరముకంటే వేఱుగా వున్నాడని చెప్పడము అయినది. అయినా కూడా, అత్యంత సహజముగా ప్రతి వ్యక్తి స్థూలశరీరాన్ని పట్టి తాను స్త్రీనని, పురుషుడనని, నపుంసకుడనని, కుంటి-గ్రుడ్డి, చెముడు, మూగ మొదలైన లక్షణములు కలవాడనని అనుకుంటూ వుంటాడు. ఇంకా, లోపలికి వెళ్ళి సూక్ష్మశరీరమైన బుద్ధి మొదలైన ఉపాధులతో, తనను తాను, సుఖినని దుఃఖినని బుద్ధిమంతుడనని మూర్ఖుడనని కామినని క్రోధినని యోగినని అజ్ఞానినని అనేకవిధములుగా భావిస్తాడు. ఇంతేగాక, ఇతర శరీరములతో తనకి సంబంధము కల్పించుకుని, తనను, తల్లిగా పుత్రినిగా -పుత్రుడినిగా అల్లుడిగా కోడలుగా మిత్రుడిగా శత్రువుగా తెలుసుకుంటూ వుంటాడు. దీనిని మించి శరీరరూపముతో ఏ విధమైన సంబంధము లేని ధనమువల్ల ధనికుడినని దరిద్రుడనని కూడా అనుకుంటూ వుంటాడు. కాని, ఈ అన్ని విశేషణములు ఉపాధి ద్వారా వచ్చాయని స్పష్టముగా కనపడుతున్నప్పటికీ దానిని ఎప్పుడూ ఆలోచించడు. వీటికన్నింటికీ సాక్షిగా చేతనరూపుడైన తాను, జడరూపమైన శరీరాదులను తెలుసుకునే వాడు కాక, అవన్నీ ఎలా కాగలడు?

పోనీ, ఒక వేళ ఎల్లప్పుడూ ఏదో ఒక దానిని తెలుసుకొంటూ, ఉండటంవల్ల నేను జ్ఞాతను అందామా- అంటే, జ్ఞాతృత్వమును తన స్వరూపము అనుకోవడము కూడా సరియైనది కాదు. దానికి కారణము ఇలా ఉన్నది - అధ్యా॥ 5-1 ని అనుసరించి, ఏ కాలములోను తనను విడిచిపెట్టని రూపము తన స్వరూపము. జగత్తు యొక్క స్వరూపము బ్రహ్మ అని ఈ ప్రకారమే నిశ్చయమయినది. కాని, సుషుప్తిలో జ్ఞాతృత్వము కూడా నివృత్తము అయిపోతుంది. అక్కడ ఉన్నవాడు; దృష్టికి ద్రష్ట అతనిని చూడజాలడు; శ్రుతికి శ్రోత - అతనిని వినలేడు, మతికి మంత-అతనిని మననము చేయలేడు; విజ్ఞాతకు విజ్ఞాత - అతనిని తెలుసుకోలేడు -"న దృష్టేర్ద్రష్టారం పశ్యేః న శ్రుతేః శ్రోతారం శృణుయాః న మతేర్మంతారం మన్వీథాః, న విజ్ఞాతే ర్విజ్ఞాతారం విజానీయాః। (బృ ॥ 3-4-2). అందువల్ల జ్ఞాతృత్వము కూడా అతని స్వరూపము కాదు. అలా అయితే -

12-2) జీవుని స్వరూపము ఎక్కడ తెలుస్తుంది?

సుషుప్తిలో తెలుస్తుంది. బాహ్యమైన సంపత్తి, ఇతర శరీరములు, స్థూల సూక్ష్మ శరీరములు, ఉపాధుల మూలముగా కల్పింపబడిన సంబంధములూ, ఇవి అన్నీ సుషుప్తి సమయములో పూర్తిగా విడిచిపెట్టి పోతాయి. నిరుపాధిక రూపములో ఆత్మమాత్రమే వుంటుంది. అప్పుడు ఆత్మకు ఏరూపమైతే వుంటుందో, అది మాత్రమే దాని స్వరూపము. అయితే, జాగ్రత్ స్వప్నములలో ఈ స్వరూపము వుండనప్పుడు, అదే దాని స్వరూపము అని ఎలా చెప్పగలము? ఈ సందేహము అనవసరము. ఎందుకనగా, సుషుప్తిలో ఏ స్వరూపము ఉంటుందో, అదే జాగ్రత్స్వప్నములలో కూడా ఉంటుంది. అయితే ఉపాధితో కూడి వుంటుంది. ఈ విధముగా చెప్పబడే భేదమైతే ఉపాధులలోనే తన స్వరూపములో లేదు.

గాఢ నిద్రలో, తాను ఉన్నానని కూడా తెలియదు. అయినాకూడా తాను శూన్యము కాదు. (అ॥ 11-1). ఎందుకంటే, నిద్రపోతున్న వ్యక్తి లేచిన తరువాత, నిద్రలోని తన అనుభవమును ప్రకటిస్తాడు. సుషుప్తిలో అతడు లేకపోతే, ఆ సమయములో ఉన్న అనుభవమును ఎలా ప్రకటించగలడు? అయినప్పటికీ అనాదికాలము నుంచి తనను ఉపాధి సహితముగానే గుర్తిస్తూ ఉన్నాడు. అందువల్ల నిరుపాధికరూపములో గుర్తించడము లేదు. ఉదాహరణకు, చుట్టుపక్కల ఉన్న ఇళ్ళలో తన ఇంటిని గుర్తించే వ్యక్తి, ఒకవేళ ఆ యిళ్ళు ఏవీ లేకపోతే తన యింటిని గుర్తించలేక దిగ్భ్రమ చెందుతాడు. గుర్తించాలంటే, తన ఇంటి లక్షణముల సమ్యజ్ఞానము కలిగివుంటేనే సంభవమవుతుంది. అలాగే నిరుపాధిక స్వరూపము యొక్క యథార్థ జ్ఞానము కలిగిన తరువాత ఉపాధి ఉన్నకాలములో కూడా ఈ జ్ఞానము తొలగిపోదు.

12-3) స్వరూప నిర్ణయము

గాఢ నిద్రలో ప్రకటింపబడిన జీవ స్వరూపమును ప్రత్యక్షప్రమాణముచేత నిశ్చయము చేయ శక్యముకాదు. ఎందుకంటే, సుషుప్తిలో ఉన్న జీవుడు జ్ఞానేంద్రియరూపముతో ఉన్న ప్రత్యక్ష ప్రమాణములైన జ్ఞానేంద్రియములను, జాగ్రదవస్థయొక్క గడపలోనే విడిచిపెట్టి వచ్చాడు. దానిని, అనుమానము ఉపమానము అర్థాపత్తి మొదలైన ప్రమాణములతో కూడా నిర్ధారణ చేయ శక్యముకాదు. ఎందుకంటే, వాటిని ఉపయోగించుటకు ఆవశ్యకమైన మనస్సు కూడా సుషుప్తి కాలములో లేదు. ఇంతే కాక, నిద్రించే జీవుని ఏ విధమైన గుర్తు కూడా లేదు కనక, జాగ్రదవస్థలో ఇంద్రియములు, మనస్సు ఉన్నప్పటికీ ఈ ప్రమాణముల వలన ప్రయోజనము ఏమీ లేదు. జీవుని స్వరూపము ఈ విధముగా చాలా రహస్యముగా ఉన్నదని తెలుస్తున్నది. అయితే కొందఱు ఆధునిక వైజ్ఞానికులు యంత్రసహాయముతో నిద్రావస్థలో ఉన్న వ్యక్తుల లోపల ఉన్న స్వరూపమును తెలుసుకునే ప్రయత్నము చేస్తున్నారు. దీని జ్ఞానము ప్రత్యక్షముచేత గాని, తర్కముచేత గాని పొందుట అసంభవము. "నైషా తర్కేణ మతిరాపనేయా।" (కఠ॥ 1-2-9). తర్కశాస్త్రముతో బుద్ధి కాలిపోయిన వారికి దీని గురించి చెప్పడము వ్యర్థము అని వ్యాసులు హెచ్చరిస్తున్నారు- "న వాచ్యం తర్కశాస్త్రదగ్ధాయ" (మోక్షధర్మము 247-18). అయితే ఎలా తెలుసుకోవాలి? జగత్ప్రకరణములో కూడా ఇటువంటి సందర్భమే వచ్చింది; దానిని జ్ఞప్తికి తెచ్చుకుందాము. (అధ్యా॥ 5-9). ప్రకృతికి మించిన ఏ వస్తువునైనా, ఆగమ ప్రమాణముతో తప్ప ఇంకే విధముగాను నిర్ణయించలేము. తన స్వరూపము కూడా ఇలాగే వుంటున్నది. ఇది ప్రకృతికి పరము. అది బ్రహ్మ నిష్ఠుడైన ఆచార్యుని మూలకముగా ఆగమము ద్వారానే తెలుసుకోగలము.

12-4) ఆగమముచేత ఉత్తరము

జగదుపాదనమును తెలియపరచే సమయములో అనుసరించిన మార్గముతోనే నిద్రావస్థలో జీవుని స్వరూపమును తెలియపరచేటప్పుడు కూడా శ్రుతి ఆశ్చర్యమును కలుగ చేస్తున్నది. గాఢనిద్రను సుషుప్తి అంటారు. సుషుప్తి సమయములో జీవుడు ఎక్కడ వుంటాడు? ఎలా వుంటాడు? వీనికి సమాధానముగా- "సతా సోమ్య తదా సంపన్నో భవతి స్వం అపీతో భవతి।" (ఛాం॥ 6-8-1)- అప్పుడు 'సత్'లో అణగిపోయి వుంటాడు. తన ఆత్మలో లీనమై ఉంటాడు. "పర ఆత్మని సంప్రతిష్ఠతే।" (ప్ర॥ 4-7) – పరమాత్మలో ఒక్కటై వుంటాడు. "అంతర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే।"- హృదయ ఆకాశములో నిద్రిస్తూ వుంటాడు. (బృ॥ 1-1-17). "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః।" (బృ॥ 4-3-21)- ప్రాజ్ఞాత్మ పరమాత్మతో ఆలింగితుడుగా వుంటాడు. ఈ విధముగా సుప్తజీవుడు ఎప్పుడైతే బ్రహ్మలో లయమవుతాడో, అప్పుడు బ్రహ్మతో ఒక్కటి గానే ఉంటాడు.

అందువల్ల ఇలా చెప్పగలము- సుషుప్తిలో నిత్యమూ అనుభవమునకు వచ్చేది, జీవుని నిజస్వరూపమైన బ్రహ్మమే లేకుంటే అతడు బ్రహ్మలో ఒకటిగా స్థిరపడలేడు.

జీవుడు సుషుప్తిలో మాత్రమే బ్రహ్మ అని దీని అర్థము కాదు. జాగ్రదావస్థలో కూడా అతడు బ్రహ్మే. దీనిని, ఛాందోగ్యోపనిషత్, తొమ్మిది సార్లు బ్రహ్మ లక్షణములను విస్తారముగా వర్ణించి చెప్పిన తరువాత ఒక్కొక్క సారి ఆఖరున జీవుని స్వరూపమును స్పష్టము చేస్తూ ఇలా చెప్పినది- "స య ఏషో¬ణిమైత దాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో" (ఛాం॥ 6-8-7) - అదే అణిమ. ఈ జగత్తుకంతటికీ అదే ఆత్మ; అది సత్యము; శ్వేతకేతూ! నువ్వు అదే ఆత్మ; "నాన్యో¬తో¬స్తి ద్రష్టా, నాన్యో¬తో¬స్తి శ్రోతా, నాన్యా¬తో¬స్తి మంతా నాన్యో¬తో¬స్తి విజ్ఞాతా" (బృ॥ 3-7-23). ఇతనికంటే వేరు ద్రష్ట లేడు; ఇతనికంటె వేఱు శ్రోత లేడు; ఇతనికంటె వేఱు మంత లేడు; ఇతనికంటె వేఱు విజ్ఞాత లేడు. "స వా ఏష మహాన్ అజ ఆత్మా యో¬యం విజ్ఞానమయః" (బృ॥ 4-4-22) - ఇది విజ్ఞానమయ ఆత్మయే (జాగ్రత్స్వప్నావస్థలలో విశేష జ్ఞానమును తెలుసుకునేవాడు పొందేవాడు); జన్మ లేనివాడు. ఇంతేగాక, బ్రహ్మాత్మైకత్వమునకు విరుద్ధమైన నానాత్వమును శ్రుతి నిందిస్తున్నది. "అన్యో¬సావన్యో¬హమస్మీతి న స వేద" (బృ॥ 14-10). నేను వేఱు- వాడు వేరు, అని చెప్పేవాడు తెలియనివాడు. "మృత్యోః స్సమృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" (బృ॥ 4-4-10) - ఎవరు ఇక్కడ నానాత్వమున్నట్టు చూస్తున్నాడో, వాడు మృత్యువునుండి మృత్యువును పొందుతున్నాడు. ఇలా అనేక శ్రుతి మంత్రములు దీనినే చెప్తున్నాయి. ముందు చేయబోయే విచారణలు ఈ విషయాన్నే ధృవపరుస్తాయి.

12-5) 'మమైవాంశ'ము యొక్క అర్థము

సంశయము : శ్రుతిలో ఈ విధముగా అభేదమును ప్రతిపాదించారు. కాని, కొన్ని స్థలములలో బ్రహ్మను జీవునినుండి వేఱుగా కూడా చెప్పారు. "సో¬న్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః।" - అతనిని వెదకాలి; అతనిని తెలుసుకోవాలి. (ఛాం॥ 8-7-1). "యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగాః వ్యుచ్చరన్తి ఏవమేవ ఆస్మాదాత్మనః........సర్వాణి భూతాని వ్యుచ్చరన్తి।" (బృ॥ 2-1-20, ముం॥ 2-1-1) - నిప్పు నుండి రవ్వలు ఎలా వస్తాయో, అలాగే ఈ ఆత్మనుండి సర్వ భూతములు వస్తున్నాయి. శ్రుతి ఈ విధముగా, జీవునికి బ్రహ్మతో సాదృశ్యము, అన్యత్వము కూడా చెప్పినది. "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (గీ॥ 17-7) - జీవలోకములో నా సనాతన అంశమే జీవుడు. ఇలా జీవుని అంశత్వము స్మృతిలో చెప్పబడినది. వీటి అన్నింటి సమన్వయము ఎలాగ?

పరిహారము : అధికారి భేదమును బట్టి శ్రుతి, తత్త్వమును క్రమముగా బోధపరుస్తున్నది. సవిశేష వాక్యములను, నిర్విశేష వాక్యములతో సమన్వయము చేసి బ్రహ్మ స్వరూప నిర్ణయము చేసినట్లు, ఇక్కడ కూడా చేయాలి. మొట్టమొదట ఏమనగా - బ్రహ్మను తెలియని వానికి, బ్రహ్మము తనకంటె వేఱు. అందువల్ల వానికి బ్రహ్మను వెదుకుట, తెలిసికొనుట సహజమే. ఇంకా, బుద్ధిరూప ఉపాధి సంబంధ దృష్టితో చూస్తే జీవుడు, అపరబ్రహ్మ అంశము, ఎందుకంటే, వాని వ్యష్టి బుద్ధి, అపరబ్రహ్మయొక్క సమష్టి బుద్ధి యొక్క అంశము. అయితే, ఈ అంశత్వము, శరీరములోని ఒక అంగము లాగా పరబ్రహ్మలోని ఒక అంశత్వము కాదు. ఎందుకంటే ఆ అంశము బాధబడితే అంగము కలవానికే బాధ కలుగుతుంది. అలాగే జీవులు బాధపడితే, బ్రహ్మే బాధ పడాలి. దుఃఖజీవులు అనంతముగా ఎప్పుడూ ఉంటారు. కనుక, బ్రహ్మకు దుఃఖము నిత్యము, అనంతము కావాలి. కాని, ఇది శాస్త్రసమ్మతము కాదు. "అలాగయితే, ఈ విధముగా,

చెప్పవచ్చా?– ఏ విధముగా నిప్పురవ్వలు నిప్పుకంటే వేఱుగా వున్నందువల్ల వాటి లఘుత్వ, క్షణికత్వ దోషములు నిప్పుకు ఉండవో, అలాగే జీవుని దుఃఖము బ్రహ్మకు ఉండదు." ఇది సమంజసము కాదు. ఎక్కడ నిప్పురవ్వలు ఉంటాయో అక్కడ నిప్పు ఉండదు. ఇలా జీవునికి, బ్రహ్మకు భేదమును చెప్పినట్లయితే, బ్రహ్మ అనంతత్వమునకు హాని కలుగుతుంది. బ్రహ్మ నిరవయవుడు కనక జీవుని అంశత్వము – నిప్పు రవ్వల ఉపమానముతో సరిపడదు. ఈ సమస్యకు సమాధానముగా– బాదరాయణ సూత్రము మార్గము చూపిస్తున్నది– "ప్రకాశాది వన్నైవం పరః" (సూ॥ 2–3–4)– ప్రకాశదులవలె పరమాత్మ (దుఃఖి) కాదు. వ్యాపకమైన ప్రకాశమునుగాని, ఆకాశమునుగాని అనేక ఆకారముల కిటికీలనుండి చూస్తే అది ఆ ఆకారముల రూపముగానే కనపడుతున్నది. ఆ ఆకారములు ప్రకాశముయొక్క లేదా ఆకాశముయొక్క అంశములే. కాని, కిటికీల వ్యవహారము వల్ల ప్రకాశమునకుగాని ఆకాశమునకుగాని హాని ఏమీ లేదు. ఈ విధముగానే జీవునికి బ్రహ్మతో ఉన్న సంబంధము తెలుసుకోవాలి. ప్రకాశమే బ్రహ్మ – దేహము, ఇంద్రియములు. బుద్ధి కిటికీలు. వీటిద్వారా చూడబడే బ్రహ్మయే జీవుడు. దేహేంద్రియబుద్ధితో తనను వేఱుగా అవిద్యద్వారా తెలుసుకుని జీవుడు దుఃఖానుభవమును పొందుతున్నా, బ్రహ్మకు దుఃఖముతో సంబంధం లేదు. అవిద్యా కార్యమైన బుద్ధితో సంబంధమును వదలినట్లయితే, జీవుడు దుఃఖరహితుడై బ్రహ్మరూపములో ఉండగలడు. ఈ ప్రకారము వస్తుతః బ్రహ్మ స్వరూపుడే అయిన జీవుడు అవిద్యవల్ల బ్రహ్మ కంటే వేఱుగా, లేక అంశముగా, కనపడుతున్నాడు. ఇందువల్ల శాస్త్రము, బ్రహ్మాత్మైకత్వమునే చెప్పి, దానిని బోధించడానికి నిప్పురవ్వల దృష్టాంతమును ఇచ్చి, ఆఖరులో ఏకత్వముతో ఉపసంహారము చేసినది. ఇలా ఉపక్రమ – ఉపసంహారముల సమన్వయముతో శ్రుతి యొక్క ఏకవాక్యతను తెలుసుకోవాలి. (సూ॥ భా॥ 2–1–1).

12–6) అవిద్య – అధ్యాసల నిర్వచనము

1) కార్యదృష్టితో జగత్తు అత్యంత విస్మయకరముగా నానాత్వముతో కనపడుతుంది. కాని, ఇదంతా దాని బాహ్యరూపమే. వాస్తవము కాదు. తన స్వరూపములో ఇది 'నేతినేతి' బోధ్య బ్రహ్మమే. ఈ విచారణ జగత్ప్రకరణములో చేశాము. జీవుని విషయము కూడా ఇలాగే. శరీరము మనస్సు మొదలైన ఉపాధి సంబంధము అంతా జీవునిలో కనపడుతున్న బాహ్యరూపము – అంటే జాగ్రత్తు, స్వప్నము, సుషుప్తి అవస్థలలో జీవుడు ఒక అవస్థనుండి వేఱే అవస్థకు వస్తూ, పోతూ బాహ్యరూపములో వుంటాడు. జాగత్స్వప్నములలో అంతఃకరణ సహాయముతో వివిధ విషయములను తెలుసుకుంటూ వుంటాడు. 'ఇది నాది, ఇది నాది కాదు' అనే భేద బుద్ధితో పుణ్య – పాపములను చేస్తూ వుంటాడు. వాటి ఫలస్వరూపముగా ఒక జన్మనుండి ఇంకొక జన్మకు పరిగెడుతూ వుంటాడు. కాని, అతడు తన నిరుపాధిక స్వరూపంలో బ్రహ్మగానే ఉన్నాడు. ఇది జీవునికి తెలియదు. వేదాంత శాస్త్రములో ఈ విధముగా – **తనను తాను బ్రహ్మనని తెలియకపోవడమే జీవుని అవిద్య అనబడుతున్నది. అజ్ఞానము, అగ్రహణము అంటే కూడా ఇదే. ఇదే అవిద్యకు స్పష్టమైన నిర్వచనము. అవిద్య అర్థము ఇదే. ఇంతకంటే వేఱే ఏమీ కాదు.**

2) ఈ అవిద్య తన విషయంలో అయథార్థ జ్ఞానమునకు కారణమవుతున్నది. ఈ అయథార్థ జ్ఞానమే అధ్యాస. అన్యథాగ్రహణము కూడా ఇదే. ఇలా అవిద్యా కార్యము అధ్యాస అనబడుతుంది. దీని ప్రభావముచేత జీవుడు, తనను నిర్వికార బ్రహ్మగా తెలుసుకోకుండా తాను ఏది కాదో, ఆ శరీరమును తాను అని

అనుకుంటున్నాడు. ఈ విధముగా **(అతస్మిన్) ఏదైతే అది కాదో దానిలో (తద్బుద్ధి) అది అనే బుద్ధిని, 'అధ్యాస' అంటారు.** ఎలాగైతే పిచ్చితనముతో చేసే పనిని 'పిచ్చితనము' అని అంటారో అలాగే అవిద్యతో కలిగే అధ్యాసను కూడా అప్పుడప్పుడు అవిద్య అనే అంటారు. ఈ అధ్యాస అన్ని దుఃఖములకు మూలము. ఒక జీవుడు తన యందువలె అన్య శరీరములలో కూడ ఉన్న బ్రహ్మను ఆశరీరములతో కలసి దానిని వేఱు వేఱుగా చూస్తాడు. అందువల్ల నిజముగా తానే సర్వత్ర ఉన్నప్పటికీ, శరీర ఉపాధుల ద్వారా ఈ విధముగా తనలో నానాత్వమును చూస్తూ, జీవుడు శోక మోహములలో మునిగిపోతాడు. దీనికి ఒక ఉదాహరణము – దర్పణమనే ఉపాధిలో వ్యక్తి తన ప్రతిబింబమును చూస్తాడు. అద్దము పగిలిపోతే, చూచే వాని ప్రతిబింబము అనేకముగా అవుతుంది. అద్దములో ప్రతిబింబమును చూస్తున్న పిచిక, పగిలిన అద్దములో అనేక ప్రతిబింబములను చూసి, భయపడుతుంది; భ్రమ పడుతుంది. అలాగే, తనను స్వయముగా బ్రహ్మ అని తెలుసుకోక, తనను శరీరముగా భావించే జీవుడు, శరీరరూప కార్యోపాధులలో బహుత్వమును చూసి, భయ మోహములను పొంది, సుఖ దుఃఖములను అనుభవిస్తున్నాడు.

3) ఈ విధముగా, తాను కాని శరీరములో తాననేబుద్ధి రూపములో ఉన్న అధ్యాసను తెలియచెప్పడము కోసము శాస్త్రము – రజ్జు సర్పము మొదలైన దృష్టాంతములను చెప్పినది. ఉదా:– సర్పము కానటువంటి రజ్జువులో సర్పబుద్ధి చేసిన మిథ్యాజ్ఞానమునే అధ్యాస అంటారు. ఇది నాలుగు విషయములమీద ఆధారపడి ఉన్నది. అంధకారము, రజ్జువు, రజ్జు–సర్పములకు సాదృశ్యము, సర్ప సంస్కారము (అధ్యాయం 4 -2 చూడండి). మిథ్యా సర్పమును, పరీక్షించగానే రజ్జువుయొక్క నిశ్చయాత్మక జ్ఞానము కలుగుతుంది. ఈ ప్రకారము దార్ష్టాంతికములో అవిద్య – అంధకారము, బ్రహ్మానందము–రజ్జువు, బ్రహ్మానందముతో విషయసుఖమునకు సాదృశ్యము – రజ్జు సర్ప సాదృశ్యము, విషయ సుఖ సంస్కారమే – సర్ప సంస్కారము. ఇక్కడ విషయసుఖ భోక్తృత్వమే జీవునికి మృత్యుహేతువయినది. దీనినుంచి ముక్తుడవడము కోసము, విషయ సుఖములను విమర్శించి, బ్రహ్మానంద స్వరూపమును తెలుసుకోవాలి. ఈ విషయము రాబోవు అవస్థాత్రయ విమర్శాధ్యాయములో చెప్పబడగలదు.

4) వేదాంత శాస్త్రమును మొదటసారి వినేవారికి మనస్సులో ఒక ప్రశ్న బయలుదేరవచ్చు. అధ్యాసకు కారణము అవిద్య అయితే అవిద్యకు కారణము ఏమిటి? ఈ ప్రశ్నలో ఏమీ సత్త్వము లేదు. ఉదా:– ఒక పిల్లవాడు, 3×4=22 అని తప్పు చెప్తాడు; దీనికి కారణము సరియైన సమాధానము తెలియకపోవడము. 3×4=12 అనేది సరియైన సమాధానము. సరియైన సమాధానము తెలియకపోవడమే వాని అజ్ఞానము. ఇలా చెప్పిన తరువాత ఎవ్వరూ కూడా, వానికి సరియైన జవాబు ఎందుకు తెలియలేదని ప్రశ్నించరు. అందువల్ల, ఈ విధమైన వ్యర్థప్రశ్నలను వదలి, అవిద్య నివారణకు ప్రయత్నించాలి.

12-7) అధ్యాసకు మాయా కార్యమే ఆధారము

ఏది అది కాదో, దానిని 'అదే' అని అనుకునే బుద్ధి 'అధ్యాస'. అనగా ఏది తాను కాదో, ఆ శరీరము తాననే బుద్ధి; శరీర సంబంధముతో తనను పతి–పత్ని అని అనుకునే బుద్ధి – భూమి యొక్క దృష్టితో తాను భూస్వామిని అనుకునే బుద్ధి ఇవన్నీ అధ్యాసలే. ఈ దేహమును కాని, ఇతర దేహములను కాని, భూమిని కాని – దేనినీ కూడా జీవుడు తాను తయారుచేసుకోలేడు. బ్రహ్మ తన మాయాశక్తితో జీవుని కర్మఫలభోగము కోసము ఈ అన్నిటిని నిర్మించినది. "కర్మాధ్యక్షుడు, సర్వభూతాధివాసుడు, సాక్షియైన చైతన్యము, పరమాత్మ అయిన ఈశ్వరుని అనుజ్ఞతో కార్యకరణ సంఘాతరూపమైన దేహముకంటె వేఱయిన తనను తాను గుర్తించక,

అవిద్యావస్థలో పడిపోతున్న, అవిద్యా రూప అంధకారముతో గ్రుడ్డివాడయిన, జీవునికి కర్తృత్వ భోక్తృత్వ రూపమైన సంసారము ఏర్పడుతున్నది. ఈశ్వరుని అనుగ్రహ కారణముగానే కలిగిన విజ్ఞానముతో మోక్షమును కూడా పొంద గలుగుతాడు – "అవిద్యావస్థాయాం కార్యకరణ సంఘాతావివేకదర్శినో జీవస్య అవిద్యా తిమిరాంధస్య సతః పరస్మాదాత్మనః కర్మాధ్యక్షాత్ సర్వభూతాధి వాసాత్ సాక్షిణః చేతయితుః ఈశ్వరాత్ తదనుజ్ఞయా కర్తృత్వ భోక్తృత్వ లక్షణస్య సంసారస్య సిద్ధిః। తదనుగ్రహ హేతుకేనైవ చ విజ్ఞానేన, మోక్షసిద్ధిః భవితుమర్హతి।" (సూ॥ భా॥ 2-2-41). ఇవన్నీ లేకపోతే కర్మఫల భోగమునకు అవకాశమేలేదు. ఇందువల్ల ఇలా చెప్పవలసి వుంటుంది. అవిద్యా కార్యరూపమైన అధ్యాసకు, మాయా కార్యమైన జగత్తు ఆధారము. జగత్తు కేవలము సంసారమునకే కాక, మోక్షమునకు కూడా ఆధారము. పుణ్యసంచయముతో, పాపమును నష్టముచేసినవారికి మోక్షప్రాప్తి కలుగుతుంది. ఈ పుణ్య సంచయము జగద్రూపాధారములేకుండా సంభవము కాదు. ఇంతేకాదు– బ్రహ్మ జగత్తును నిర్మించకపోతే అతని స్వరూపము మనకు తెలిసేదికాదు. "యది హి నామరూపే న వ్యాక్రియేతే, తదా అస్యాత్మనో నిరుపాధికం రూపం ప్రజ్ఞానఘనాఖ్యం న ప్రతిఖ్యాయేత।" (బృ॥ 2-5-19). అప్పుడు జగత్తు మాయాకార్యమని చెప్పబడుతున్నది; దాని ఆధారముతోనే జీవునిద్వారా జన్మ మొదలు మోక్ష పర్యంతము చేయబడుతున్న వ్యవహారము అవిద్యాకార్యము.

12-8) అధ్యాసవల్లనే హాని

పైన చెప్పినట్లు, అవిద్య వల్ల, అధ్యాస ఉత్పత్తి కలిగినప్పటికీ, అధ్యాసవల్లనే ప్రమాదము వున్నది. కేవలము అవిద్యవల్ల కాదు. దృష్టాంతము: గర్తము గురించిన అజ్ఞానముతో ప్రమాదము లేదు. ఏదో ఆశతో అంధకారములో దాని దగ్గరకు వెళ్ళడములోనే ప్రమాదము వున్నది – "అవిద్యా నైవ ప్రవర్తికా, వస్తు స్వరూప ఆవరణాత్మికా హి సా। ప్రవర్తక బీజత్వం తు ప్రతిపద్యతే అంధత్వమివ గర్తాది పతనహేతుః।" (బృ॥భా॥ (1-4-17). ఈ విధముగా స్వయముగా అజ్ఞానరూప అవిద్యవల్ల ప్రమాదము ఏమీలేదు. జీవుడు తత్కార్యరూప అధ్యాసతో – తాను కాని శరీరమును తాను అనుకుంటూ, నేను పురుషుడను – నేను స్త్రీని మొదలైన భేదములతో, వాసనానుసారము కర్మలను చేస్తూ, సంసారసాగరములో పడి, ఒక యోని నుండి ఇంకొక యోనిలోకి వెళ్తూ వుంటాడు. "న చ అవిద్యా కేవలా వైషమ్యస్య కారణం, ఏకరూపత్వాత్। రాగాది క్లేశ వాసనాక్షిప్తకర్మాపేక్షా తు అవిద్యా వైషమ్యకరీ స్యాత్।" (సూ॥ భా॥ 2-1-36)– ఒక అవిద్యావంతునికి, ఇంకొక అవిద్యావంతునికి కూడా తామెవ్వరో తమకు తెలియదు అనే అవిద్యలో భేదము లేకుండా ఉండడమే 'అవిద్యా ఏకరూపత్వము'. అది వైషమ్యమునకు కారణము కాబోదు. అయితే, వారి అధ్యాసలో వైవిధ్యము ఉన్నది. అది వైషమ్యానికి కారణము కావచ్చు. అవిద్య ఉన్నప్పటికీ, గుణసంగమే ముఖ్యమైన జన్మకారణము. "సత్యామపి అవిద్యాయాం……గుణేషు సంగః ప్రధానం కారణం జన్మనః।" (గీ॥భా॥ 13-29).

12-9) అవిద్య యొక్క అభావ రూపత్వము

1) శ్రీ శంకర భగవత్పాదులు పైన వివరించిన దానితో అవిద్యను గురించి ఒక విషయము తెలుస్తున్నది. ప్రత్యక్షంగా అనుభవమునకు వస్తున్న భావరూప కష్ట-పరంపరకు కారణమైన అధ్యాస భావరూపము; అనగా "ఉన్నది" అనే అంతఃకరణవృత్తి. అయథార్థ జ్ఞానములోవున్న జ్ఞానస్వరూపము భావరూపమే. కాని, అధ్యాస యొక్క మూలమైన అజ్ఞానము – జ్ఞానము లేకపోవడము – అస్తిత్వము లేని కుండ లాగా

అభావరూపమే. అందువల్లనే అజ్ఞానము భావరూప దుఃఖమునకు స్వతఃకారణము కాలేదు. శ్రీ భగవాన్ శంకరులు దీనిని స్పష్టముగా చెప్పే వున్నారు– "యది జ్ఞానాభావః యది సంశయ జ్ఞానం యది విపరీతం జ్ఞానం వా ఉచ్యతే అజ్ఞానమితి సర్వం హి జ్ఞానేనైవ నివర్త్యతే।" (బృ॥భా॥ 3-3-1)– జ్ఞానాభావమైనా సంశయజ్ఞానమైనా విపరీత జ్ఞానమైనా ఈ ప్రకారము అజ్ఞానముగా చెప్పబడేది ఏదైనా జ్ఞానము నుండి దూరమవుతుంది. "అవిద్యా విపరీత గ్రాహకః సంశయోపస్థాపకః అగ్రహణాత్మకో వా" (గీ॥భా॥ 13-2)– విపరీత జ్ఞాన జనకము, సంశయోత్పాదకము, అగ్రహణము, ఇవన్నీ అవిద్యలే. జనులు, తమలో ఆరోపింపబడిన అవిద్య వల్ల కామకర్మలు చేయగా, వాని వలన సంభవించిన దుఃఖములను అనుభవిస్తున్నారు. కాని, నిజముగా ఆ అవిద్య వారి ఆత్మలో లేదు – "లోకో హి అవిద్యయా స్వాత్మన్యధ్యస్తయా కామకర్మోద్భవం దుఃఖం అనుభవతి, న తుసా పరమార్థతః స్వాత్మని।" (కఠ॥భా॥ 2-2-11). ఈ అవిద్య ఆత్మకు స్వాభావిక ధర్మముకాదు – "సా చ అవిద్యా నా¬¬త్మనః స్వాభావికో ధర్మః।" (బృ॥భా॥ 4-3-20). ఆత్మ శుద్ధమైనది. దానిలో అవిద్యా కల్మషము లేనందువల్ల దానికి అవిద్యారూప కారణ శరీరములేదని చెప్పబడుతున్నది – "ఆత్మా శుద్ధం నిర్మలం అవిద్యామలరహితమితి కారణశరీర ప్రతిషేధః।" (ఈ॥భా॥8). ఇంతేకాదు. విద్యయొక్క ప్రాప్తితో అవిద్య సంపూర్ణముగా నశిస్తుంది – "విద్యాయాం హి సత్యాం ఉదితే, ప్రణాశం ఉపగచ్ఛత్యవిద్యా।" (గీ॥భా॥2-39). అది భావరూపమైతే, వినాశము ఉండదు. "న హి భావానాం వినాశః సంభవతి।" (సూ॥ భా॥ 2-2-22). "నాభావో విద్యతే సతః।" (గీ॥ 2-16). అది భావరూపమైతే, జ్ఞాని బుద్ధినుండి నిష్క్రమించిన భావరూప అవిద్య ఇంకెక్కడికయినా వెళ్ళి ఉండవలసి వస్తుంది. తిరిగి ఆ భావరూప అవిద్య తమలోకే వస్తుందని భయపడి, జ్ఞానులు ఎవరికీ తత్త్వోపదేశము చేయరు.

2. ఈ అవిద్య భావరూపమా? అభావరూపమా? ఇది నిశ్చయించడములో కొందఱు ఆలోచనాపరులు ఇలా అభిప్రాయపడతారు. ఘటమును తెలుసుకున్న వారే ఘట అభావమును కూడా తెలుసుకోగలరు. ఈ ప్రకారము ఎవరికి ఆత్మజ్ఞానము వుంటుందో అతడే ఆత్మ జ్ఞానాభావమును తెలుసుకోగలడు. అయితే ఆత్మజ్ఞానిలో జ్ఞానాభావము ఉండదు. కాని, అజ్ఞాని తన అజ్ఞానమును తెలుసుకుంటాడు. అభావరూప అజ్ఞానమును తెలుసుకోవడము సంభవముకాదు. అందువల్ల "అస్తి" అని ఏది ప్రతీతమవుతుందో అది భావము. ఈ అర్థములో అజ్ఞానము భావము. జ్ఞాన ప్రాప్తి వల్ల, అజ్ఞానము నష్టమవుతుంది. అందువల్ల జ్ఞానము అజ్ఞానమునకు విరోధి.

ప్రకృతమున ఈ దృష్టాంతము సరికాదు. దృష్టాంతములో ఘటాభావ–ఘట జ్ఞానములకు విరోధము లేదు. కాని దార్ష్టాంతికములో ఆత్మ జ్ఞానమునకు ఆత్మజ్ఞానాభావమునకు విరోధము వున్నది. దృష్టాంతములో త్రిపుటి వున్నది, దార్ష్టాంతికములో త్రిపుటి లేదు. అందువల్ల చాలా ప్రయాసతో దృష్టాంత–దార్ష్టాంతికములలో సాదృశ్యము కల్పింపబడినది. ఘటభావత్వమునకు విలక్షణమైన భావత్వమును అజ్ఞానమునకు 'ఉన్నది' అనే ప్రతీతిని ఆధారముగా తీసికొని చెప్పబడింది. కాని భావత్వము 'ఉన్నది' అనే ప్రతీతిచేత నిర్ణయింపబడదు. ప్రమాణముచేత నిర్ణయింపబడుతుంది. ప్రమాణముతో పరిశీలించిన తరువాత, 'ఉన్నది' అను ప్రతీతిలో గోచరించిన దాని అభావము కూడా నిశ్చయింపబడవచ్చు. ఏది, ఉపలబ్ధికి (ప్రత్యక్షాది) ప్రమాణములకు విషయము కాదో, అది వస్త్వంతరము యొక్క అభావము – "ఉపలబ్ధి లక్షణ ప్రాప్తస్య అనుపలబ్ధేః అభావో వస్త్వంతరస్య।" (సూ॥ భా॥ 2-2-17). ఇందువల్ల, అస్తి, ప్రతీతి యొక్క సామాన్య జ్ఞానము ఆధారము మీద అజ్ఞానమును భావమని ఆమోదించినప్పటికీ "అది క్షేత్రము (బుద్ధి) యొక్క ధర్మమే! అది ఏ మాత్రము

'క్షేత్రజ్ఞుని'లో (ఆత్మలో) లేదు". (గీ॥భా॥ 13-2), అని భాష్యకారులు నిశ్చయము చేశారు. శ్రుతిని అనుసరించి భావరూపము కేవలము ఆత్మదే అవడము వల్ల ఆత్మలో ఉన్నదంతా భావరూపమే పారమార్థిక సత్యమైన ఆత్మ భావరూపము; వ్యావహారిక సత్యమైన జగత్తు భావరూపము; ప్రాతిభాసిక సత్యమైన మరీచిక భావరూపమే! (అధ్యా॥ 9-7-9). ఇవన్నీ ప్రత్యక్షాది ఐదు ఉపలబ్ధి ప్రమాణముల విషయములు. వీనికంటె భిన్నమైనది అభావరూపము. అవిద్య ఈ శ్రేణిలోనికే వస్తుంది. అది ఏ ప్రమాణమునకూ విషయము కాదు.

సంశయము: "అజ్ఞానము అభావమయితే తెలుసుకొనేందుకు అవకాశము లేదు. కాని, అజ్ఞానము తెలియబడుతోంది. అందువల్ల అజ్ఞానము అభావ స్వరూపము కాదు - అంటే?"

సమాధానము: ఇది ఘట దృష్టాంతముతోనే స్పష్టమవుతున్నది. ఘటాభావము ఏమిటి? ఘటాకార బుద్ధివృత్తి వున్నప్పుడు బాహ్యముగా ఘటము లేకపోవడమే ఘటాభావము. ఘటముయొక్క అజ్ఞానము ఏమిటి? ఘట శబ్దముతో జన్యమైన జ్ఞానము ఘట సామాన్య జ్ఞానము. తదనుసారముగా ఘటాకార బుద్ధివృత్తి లేకపోవడమే ఘట అజ్ఞానము. ఈ విధముగానే గురువువల్ల విన్న ఆత్మశబ్దజన్య సామాన్య జ్ఞానముతో ఆత్మను ఒప్పుకొని, తదనుసారము ఆత్మయొక్క చైతన్యాకార బుద్ధివృత్తి పొందనివాడు తనలో అజ్ఞానమును చూస్తున్నాడు. అనగా, స్మరణాత్మక బుద్ధి వృత్తిని అనుసరించి బాహ్య వస్తువు కనపడకపోవడమే వస్తువుయొక్క అభావము. విన్న విషయములో దాని గురించి విశేషజ్ఞానరూప బుద్ధి వృత్తి లేకపోవడమే దాని జ్ఞానాభావము. మిథ్యా జ్ఞానములో జ్ఞేయము యొక్క అయథార్థమైన బుద్ధివృత్తి వుంటుంది. సమ్యగ్ జ్ఞానములో దాని యథార్థ బుద్ధివృత్తి వుంటుంది. కాని, వస్తువును తెలుసుకోక పోవడములో (అజ్ఞానములో) ఏ బుద్ధి వృత్తి ఉండదు.

3. ఇప్పుడు ఒక సందేహము రావచ్చు. "అవిద్య (జ్ఞానాభావము, అజ్ఞానము, అగ్రహణహము), అభావరూపమయితే దాని నుండి భావరూపము యొక్క అధ్యాస ఎలా కలుగుతుంది?" అధ్యాసకు కారణము అవిద్య అని చెప్పినప్పుడు, అవిద్య దానికి ఉపాదాన కారణమని అనుకోకూడదు. ఎందుకంటే అవిద్య అభావరూపము. కనుక, అవిద్య అధ్యాసకు 'వ్యాజము'. సహకారికారణము అని కూడా చెప్పవచ్చు. ఇది గుర్తించాలి. దీనిని తెలుసుకోవడానికి ఒక ఉదాహరణము: ఇంటిలో యజమాని లేనప్పుడు ఆ ఇంటిలో సాధువు, కాముకుడు, సోమరి, వచ్చి కూర్చున్నారనుకోండి. ఇలా ఇంట్లో ఇంకెవరెవరో వచ్చి కూర్చున్నారంటే దానికి యజమాని అభావమే కారణము. కాని, అతని అభావము నుంచి వీరందరూ అక్కడ జన్మించారని చెప్పడానికి వీలులేదు. యజమాని లేకపోవడము వారి రాకకు ఉపాదానమూ కాదు; నిమిత్తమూ కాదు; సహకారి కారణము మాత్రమే. ఇప్పుడు ఇంటిలో ప్రవేశించి ఎవరు వుంటున్నారో, వాళ్ళు యిల్లు తమదే అంటున్నారు. యజమాని రాగానే, వాళ్ళు అక్కడ ఉండరు. ఈ ఉపమానములో అజ్ఞాని బుద్ధి-ఆ యిల్లు. తనను బ్రహ్మ అని తెలుసుకున్న విద్య-యజమాని. ఈ విద్యయొక్క అభావమువల్ల, ఖాళీబుద్ధిలో తనను మూఢుడు మొదలైన లక్షణాలతో అనుకునే తామసభావము, తనను బుద్ధిమంతుడు మొదలైన విధముగా అనుకునే రాజస భావము, తనను భక్తుడు ఇత్యాది విధముగా అనుకునే సాత్త్విక భావము - భావములు అన్నీ వచ్చి కూర్చుంటాయి. ఈ అన్ని భావములు విద్య-కర్మ-పూర్వ ప్రజ్ఞను అనుసరించి త్రిగుణాత్మిక మాయతో భగవానుడు సృష్టించినవి. "యే చైవ సాత్త్వికా భావాః రాజసాస్తామసాశ్చ యే, మత్త ఏవేతి తాన్విద్ధి" (గీ॥ 7-12). "భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః" (గీ॥10-4). పరమాత్మనుండి

ఉత్పన్నమయిన కారణముగా, సాత్త్వికము మొదలైన వృత్తులు భావరూపములు. భావరూపములు కావడము వల్లనే, భావరూప సంసార సుఖ-దుఃఖములు వానివల్ల కలుగుతున్నాయి. తనను బ్రహ్మ అని తెలుసుకునే, "అహం బ్రహ్మాస్మి" అనే భావమూ ఒక సాత్త్వికవృత్తి - "అద్వైత జ్ఞానం మనోవృత్తి మాత్రం।" (ఛాం॥ భా॥ అవతణిక). యజమాని వలెనే అది బుద్ధిలో ప్రవేశించగానే, మిగిలిన భావములు ఇంక అక్కడ వుండవు. ఒక ఆభరణము ఇంకొొక ఆభరణముగా తయారైనట్లు, అంతవరకూ ఉండిన అన్యథాప్రత్యయము సమ్యక్ప్రత్యయముగా మారుతుంది. అది అన్యథా ప్రత్యయమే కానీ సమ్యక్ప్రత్యయమే కానీ - రెండూ అసత్యములే! ఎవని బుద్ధివృత్తి అన్యథాప్రత్యయములతో నిండి వుంటుందో అతడు అజ్ఞాని. సమ్యక్ప్రత్యయములతో ఎవని బుద్ధివృత్తి నిండి వుంటుందో అతడు జ్ఞాని - "యథా బుద్ధ్యాద్యాహృతస్య శబ్దాద్యర్థస్య అవిక్రియ ఏ వసన్ బుద్ధివృత్త్యా అవివేక విజ్ఞానేన అవిద్యయా ఉపలబ్ధా ఆత్మా కల్ప్యతే, ఏవమేవ ఆత్మానాత్మ వివేక జ్ఞానేన బుద్ధివృత్త్యా విద్యయా అసత్యరూపయైవ పరమార్థత అవిక్రియ ఏవ ఆత్మా విద్వాన్ ఉచ్యతే" (గీ॥ భా॥ 2-21).

12-10) బుద్ధియే ధర్మి - విద్యయే ప్రతియోగి

పైన చెప్పిన వివరణ యింకా దృఢపడడము కోసము దానిని రెండు పారిభాషక పదములతో తెలియజెప్పడానికి ప్రయత్నిస్తాము. ఎక్కడ అభావము వుంటుందో, దానిని అభావము యొక్క 'ధర్మి' అని, దేనిచేత ఆ అభావము పోతుందో అది దాని 'ప్రతియోగి' అని అంటారు. ఇంక భావప్రతియోగికమే అభావము. (తై॥భా॥ పీఠిక).

దృష్టాంతము: పాత్రలో పాలు లేకపోవడము, పాలయొక్క అభావము. పాత్ర ఈ అభావము యొక్క ధర్మి, పాలు ఈ అభావమును లేకుండా చేస్తాయి. పాలు ఆ అభావమునకు ప్రతియోగి.

ఈ విధముగా 'నేను బ్రహ్మను' అనే భావము (జ్ఞానము)ను 'విద్య' అంటారు. ఇది అవిద్యాది దోషములను దూరము చేస్తుంది-"య ఏవ అవిద్యాది దోషనివృత్తి ఫలకృత్ ప్రత్యయః స ఏవ విద్యా।" (బృ॥భా॥ 1-4-10). బ్రహ్మ సర్వాత్మకము కనుక, బ్రహ్మ విద్యకు అర్థము సర్వాత్మభావము. ఈ ప్రత్యయము బుద్ధిలో వుంటుంది. అవిద్యకు అర్థము, ఈ విద్య లేకపోవడము. అంటే ఈ విద్యకు ప్రతియోగి అవిద్య. అందువల్ల అది అభావము. బుద్ధి, అవిద్య యొక్క 'ధర్మి'. సర్వాత్మభావము విషయముగా గల విద్యే, అవిద్యకు ప్రతియోగి. సర్వాత్మభావమునకు వేఱుగా, వెంట్రుక కొన అంతభాగము కూడా 'ఇది నేను కాదు' అని తెలుసుకునేది అవిద్య - "యత్తు సర్వాత్మభావాత్ అర్వాగ్ వాలాగ్రమాత్రమపి అన్యత్వేన దృశ్యతే నాహమస్మి ఇతి, తదవస్థా అవిద్యా।" (బృ॥ భా॥ 4-3-20). ఇది ఆత్మకు స్వాభావిక ధర్మము కాదు. విద్య పెరుగుతున్న కొద్దీ అవిద్య తరుగుతూ వుంటుంది. ఆఖరున విద్య 'పరాకాష్ఠ'ను (సాక్షాత్కార రూపత్వమును) పొందుతుంది. అప్పుడు సర్వాత్మభావము సిద్ధిస్తుంది. అప్పుడు అది పూర్తిగా దూరమయిపోతుంది - "సా చ అవిద్యా నా¬¬త్మనః స్వాభావికో ధర్మః। యస్మాత్ విద్యాయాం ఉత్కృష్యమాణాయాం స్వయం అపచీయమానా సతీ కాష్ఠాం గతాయాం విద్యాయాం, పరినిష్ఠితే సర్వాత్మభావే, సర్వాత్మనా నివర్తతే।" (బృ॥భా॥ 4-3-90). బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానముతో, మిథ్యాజ్ఞానము నశిస్తుంది. -"మిథ్యాజ్ఞానాపాయశ్చ బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానాత్ భవతి।" (సూ॥ భా॥ 1-1-4). అందువల్ల, అవిద్య అంధకారరూపము. విద్యారూప ప్రకాశము లేకపోవడమని అర్థము. విద్య ప్రాప్తించగానే, అవిద్య పోతుంది.

కొంతమంది అంధకారమును భావరూపద్రవ్యము అంటారు. అది తమస్సు –నల్లగా వుంటుంది. దానిలో నడవడము మొదలైన క్రియలు ఉన్నవి. అదే విధముగా అవిద్య కూడా భావరూపమట! అయితే కంటి విషయములో కొంచెమయినా విజ్ఞాన శాస్త్రమును చదివి తెలుసుకుని వుంటే ఈ తర్కమునకు కంగారుపడరు. కళ్ళమీద పడిన ప్రకాశము యొక్క రంగును లోపలి స్నాయుమండలము తన లోపలికి తీసుకుంటుంది. దానివల్ల మనకు ఆ ప్రకాశము అదే రంగుతో కనపడుతుంది. వర్ణరహిత ప్రకాశములో అన్ని వర్ణములు (రంగులు) వుంటాయి. స్నాయుమండలము వాటి నన్నిటినీ తనలోనికి తీసుకుంటుంది. అందువల్ల ఆ ప్రకాశము వర్ణరహితముగానే వుంటుంది. అంధకారములో కళ్ళలోని స్నాయుమండలము తనలోనికి తీసుకునేందుకు ఏమి వుండదు. అందువల్ల అది నల్లగానే వుంటుంది. నలుపులో ఇంకొక రంగు ఏమీ వుండదు. అన్ని రంగులు వున్న ప్రకాశము యొక్క అభావమే నలుపు అని తెలుస్తుంది. అంధకారములో కళ్ళకు విశ్రాంతి వస్తుంది. ఎందుకంటే, అప్పుడు వాటికి పని ఏమీ వుండదు. అంధకారము భావరూపమైతే ఇటువంటి విశ్రాంతి దానికి దొరకదు. నల్లరంగు చూడడములో కళ్ళకు శ్రమ కలుగుతుంది.

పూర్వ పక్షము: ఎరుపు రంగు మొదలైన వాటికి ఆశ్రయమైన భావపదార్థములు ఎలా వుంటాయో, అలాగే నల్లరంగుకు ఆశ్రయమైన అంధకారము కూడా భావరూపమే– అంటే?

ఉత్తరపక్షము: అంధకారాశ్రిత కృష్ణవర్ణమునకు గుణమున్నదనడానికి ప్రమాణము ఏమిటి?

పూర్వపక్షము: కళ్ళు ప్రమాణము.

ఉత్తర పక్షము: అయితే, కళ్ళు మూసుకుంటే నల్లగా వున్న అంధకారము నల్లగా కనపడదా? కళ్ళు మూసుకున్నా, తెరచినా కూడా అంధకారము యొక్క వర్ణము నలుపు మాత్రమే. అందువల్ల అంధకారము యొక్క నలుపు వర్ణమునకు కళ్ళు ప్రమాణము కావు. నలుపు వర్ణమునకు ఆశ్రయమైన అంధకారము భావరూపముకాదు.

12–11) అవిద్య అనాది

ఈ జన్మలోని అవిద్య, కామము (వాసన), కర్మ–ఇవే ముందు జన్మకి కారణములు. ఈ అవిద్య ఎప్పుడు ప్రారంభమయినది– అని సందేహము. దీనికి ఆరంభము లేదు. ఈ జన్మకు కారణము పూర్వజన్మ యొక్క అవిద్యా కార్యము. పూర్వజన్మకు కారణము, దాని ముందు జన్మయొక్క అవిద్యా కార్యము. ఇలా విచారణ చేస్తే, అవిద్య అనాది అని తెలుస్తుంది. ఇప్పుడు శ్వేతవరాహకల్పము జరుగుతున్నది. (అధ్యా॥ 8–9 చిత్రము చూడండి). దీనిలో మొదటిసారి జన్మించిన జీవుడు కూడా, తన అవిద్యతో ఇదివరకటి కల్పముల జన్మలలో కర్మ చేస్తూ వున్నవాడే. ఆ ఫలమును అనుభవించుట కోసమే ఈ కల్పములో తిరిగి జన్మించాడు. ఈ తత్త్వమును విన్నాక కూడా అవిద్యకు ప్రారంభము వున్నది అనుకుంటే, వారిని యిలా అడగవలసి వస్తుంది – అవిద్య పుట్టుటకు ముందు వున్న బ్రహ్మ, తన జ్ఞానానంద స్వరూపమును పోగొట్టుకుని, అవిద్యను పొందుతుంది అని చెప్పవచ్చునా? ఇలా తన స్వరూపమును పోగొట్టుకొనే బ్రహ్మ, బ్రహ్మ ఎలా అవగలదు? అందువల్ల అవిద్య అనాది; విద్యవల్ల అది అంతమవుతుంది.

"తెలిసిన విషయమును మరచిపోవడము, మరచిపోయిన విషయాన్ని తిరిగి జ్ఞప్తికి తెచ్చుకోవడము మన అనుభవములో ఉన్నదే. ఆత్మవిద్య విషయములో కూడా ఇలా ఎందుకు జరగకూడదు?"

ఆత్మ విద్య విషయము ఇలా వుండదు. ఆత్మజ్ఞానము విషయజ్ఞానము వంటిది కాదు. విషయములను తెలుసుకోవడము, మరచిపోవడము, తిరిగి జ్ఞాపకము చేసుకోవడము అన్నీ వుంటాయి. ఇటువంటి అనాత్మ జ్ఞానము యొక్క పరిణామమును స్మరణాత్మక బుద్ధివృత్తి అంటారు. దేహాధ్యాస, బుద్ధి వరకు ప్రవేశించగానే ఆగిపోతుంది. అందువల్ల అది ఆత్మను స్పృశించడం కూడా ఉండదు. ఈ కారణమువల్ల అజ్ఞాని కూడా నిద్రలో (సుషుప్తిలో) తన నిరుపాధిక స్వరూపమును గుర్తించగలడు. ఈ సుషుప్త్యవస్థ అనుభవమును ఎప్పటికీ విస్మరించజాలడు. ఆత్మానుభవమును పొందని కారణముగా, మేలుకుని ఉన్నప్పుడు, గతానుభవమును అనుసరించిన బుద్ధిద్వారా దేహాధ్యాసను పొందుతున్నాడు. జ్ఞానికి, బుద్ధికి అతీతమైన నిరుపాధిక అనుభవము ఉంటుంది. ఆ అనుభవము జాగ్రత్తులో సర్వాత్మ భావాకార బుద్ధివృత్తిగా ప్రకటింపబడుతుంది. అనగా స్మరణాత్మక బుద్ధివృత్తి అనుభవ ప్రకటన మాత్రమే. శాకద్వీపము (అంటార్టికా) యొక్క అనుభవము ఎవరికి లేదో, వాడికి శాకద్వీపము యొక్క స్మరణాత్మక బుద్ధివృత్తి వుండదు.

12-12) వ్యష్ట్యవిద్య - సమష్ట్యవిద్య

ప్రశ్న: మాయ నిత్యమని ముందు చెప్పబడినది. (అధ్యా॥ 8-9) అంటే అది అనాది, అనంతము. మాయ అనాద్యనంతము అయితే, సృష్టి-స్థితి-లయములు కూడా అనాద్యనంతములు కావాలి. ఈ అనాద్యనంతమైన జగత్తు, అవిద్యా జీవులకొఅకే కనుక, అవిద్య కూడా అనాద్యనంతము కావలసి వున్నది. భాష్యకారులు కూడా ఇలా చెప్తున్నారు "ఆదిరహితము, అంతరహితము అయినది స్వాభావికమైన అధ్యాస- "అయం అనాదిరనంతో నైసర్గికో¬ధ్యాసః।" (అధ్యాస భాష్యము). ఇలా చెప్పినప్పుడు అవిద్యకు అంతము ఎక్కడ?

ఉత్తరము: అలా కాదు. జీవుడు ఎప్పుడు తాను బ్రహ్మ అని తెలుసుకుంటాడో, అప్పుడే వాని అవిద్య నశిస్తున్నది. శరీర పతనానంతరము ఇక వాడు జన్మను పొందడు. అనగా వానికి జగత్తుతో సంబంధము లేదు. కాని, మిగిలిన అజ్ఞానులకి తమ కర్మఫలము అనుభవించుటకు జగత్తుయొక్క ఆలంబనము తీసుకోవలసివున్నది. ఇటువంటి జనులు అనంతకాలము వరకు ఉంటారు. వారికోసము సృష్టి జరుగుతూనే వుంటుంది. ఈ విధముగా, ప్రవాహరూపములో అనంతకాలము వరకు అవిద్య వుండడమువల్ల, పూజ్యులైన భాష్యకారులు - "అనాదిరనంతో¬ ధ్యాసః"। అన్నారు. అనగా వ్యష్టిలో జ్ఞాన సామర్థ్యముతో అధ్యాస అంతము కావడమూ సత్యమే; సమష్టిలో అనంతమైన అధ్యాసవుండడము కూడా సత్యమే.

ఒకవేళ, కాలక్రమములో అందరూ ముక్తులయితే ఏమవుతుంది?

అలా అయితే, సృష్టి కార్యమున అగత్యము లేకుండా, మాయా కార్యము అనిత్యము కావలసివస్తుంది. దీని నుండి తప్పించుకునేందుకు, ఇలా కల్పన చేయవలసివుంటుంది - కొంతమంది జీవులు నిత్యసంసారులుగా వుంటారు. లేక జీవుల సంఖ్య అపరిమితముగా ఉన్నది. కొందఱు జీవులకు మాత్రము నిత్య సంసారిత్వమును కల్పన చేయడము వల్ల, ఈశ్వరునికి వైషమ్యనైర్ఘృణ్య దోషము వస్తుంది. (అధ్యా 7.7లో చూడండి). అందువల్ల ఆ కల్పనను విడిచి - జీవులు అపరిమిత సంఖ్య కలవారుగా ఉంటారు - అనే కల్పనను చేయడము సరిగ్గా వుంటుంది. శ్రుతి కూడా చెప్తోంది- "శతం సహస్రమయుతం న్యర్బుదమసంఖ్యేయం స్వమస్మిన్ నివిష్టమ్।" శత, సహస్ర, అయుత, న్యర్బుద, అసంఖ్య జీవులు పరమాత్మలో దాక్కొని వున్నారు. (అధర్వ సంహిత 10-7-24).

ఈ విధంగా బ్రహ్మ మరియు జీవుడు, ఇద్దరి అనాదిత్వమునూ అనంతత్వమునూ ఆమోదించడములో బ్రహ్మైకత్వమునకు ఏమైనా హాని కలుగుతుందా?

హాని ఏమిలేదు. బ్రహ్మైకత్వము కొఱకు జీవుల సాంతత్వమును ఆమోదించడముతో – ఇప్పుడు బ్రహ్మైకత్వము లేదు. అది జీవులందరూ ముక్తిపొందిన తరువాత వస్తుంది – అని చెప్పవలసి వస్తుంది. ఇది సరికాదు. ఎందుకంటే, బ్రహ్మైకత్వము కాలపరిమితితో రాదు. జీవుడు – జగత్తు కనపడుతున్నప్పటికీ, శ్రుతి సిద్ధాంత ప్రకారము బ్రహ్మ ఒక్కటే ఉన్నది. ఎందుకంటే జీవుడు– జగత్తు బ్రహ్మ కంటె వేఱుగా లేవు.

12–13) అవిద్య ఎవరిలో? మాయ ఎవరిలో?

ఇప్పుడు ఇక విచారము చేయవలసి ఉన్నది – అవిద్య లేక మాయ, బ్రహ్మదా? జీవునిదా? అవిద్య అంటే జ్ఞానాభావము. ఎవరికైనా తనకంటె అన్యమైన ఏ విషయములోనైనా అవిద్య వున్నదని అనిపిస్తే, ఆ అవిద్య అతనిదే అని స్పష్టము. అది గణితము యొక్క అవిద్య కావచ్చు. వ్యాకరణము యొక్క అవిద్య కావచ్చు. ఇంకేదైన అవిద్య కావచ్చు. కాని, ప్రస్తుతము అలా లేదు. ఇక్కడ జీవుని అవిద్య తన స్వరూపము (బ్రహ్మ)ను గూర్చినదే అవడమువల్ల, ఇలా ప్రశ్నించవచ్చు – 'ఇది జీవునిదా? లేక బ్రహ్మదా?' ఇదే విధముగా మాయ ఈశ్వరశక్తి అవడమువల్లను, జీవుడు వాస్తవమున ఈశ్వరుడే అవడము వలననూ దీనిని ఆమోదించని ద్వైతులు – "మాయ జీవునిదా?" అని ఆక్షేపిస్తారు. అందువల్ల, శంకర భాష్యమును అనుసరించి ఈ ప్రశ్నలకు జవాబు యివ్వవలసి ఉంటుంది.

కృష్ణుడు తనవంటి జన్మము కలవాడేనని అర్జునుని భ్రమ. ఈ భ్రమను దూరము చేస్తూ, అర్జునునికి తన తత్త్వమును భగవానుడు ఇలా స్పష్టముగా చెప్పాడు. నాకు నీకు అనేక జన్మలు గడిచాయి. నేను నిత్య శుద్ధ–బుద్ధ–ముక్త స్వభావము కలవాడను కనుకనే నేను వాటిని అన్నిటినీ ఎరుగుదును. నా జ్ఞానశక్తికి ఆవరణము లేదు. కాని అవి ఏవీ నీవు తెలుసుకోలేవు. ఎందుకంటే, నీ జ్ఞానశక్తి, ధర్మాధర్మదోషములచేత ఆవరింపబడి వున్నది. నేను, నా మాయవల్ల పుట్టినట్లు కనపడతాను. నువ్వు నీ కర్మవల్ల పుట్టావు. "బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున। తాని అహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ధర్మాధర్మాది ప్రతిబద్ధ జ్ఞానశక్తిత్వాత్। అహం పునః నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావత్వాత్ అనావరణ జ్ఞానశక్తిః। యస్యా వశే సర్వం జగత్ వర్తతే, తాం ప్రకృతిం స్వాం వశీకృత్య సంభవామి జాత ఇవ" (గీ॥భా॥ 5–5–6) శారీరునికంటె (జీవునికంటె) వేఱుగా అధికుడైవున్న, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావుడు అయిన బ్రహ్మ మాత్రమే జగత్స్రష్ట కాని, శారీరి (జీవుడు) అటువంటివాడు కాదు – "యత్ సర్వజ్ఞ సర్వశక్తి బ్రహ్మ నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావం శారీరాత్ అధికం అన్యత్ తత్ జగతః స్రష్టృ। శారీరస్తు అనేవం విధః।" (సూ॥భా॥ 2–1–22). జీవునికి ఈశ్వరునితో సమాన ధర్మములు ఉన్నప్పటికీ అవి, అవిద్యాది రూపవ్యవధానముచే (ఆచ్ఛాదితములై) కప్పబడివున్నాయి. "జీవస్య ఈశ్వర సమానధర్మత్వం విద్యమానమపి తత్ తిరోహితం అవిద్యాది వ్యవధానాత్ (సూ॥భా॥ 3–2–1). అనగా, అవిద్య జీవునిలో ఉన్నది, ఈశ్వరునిలో లేదు. మాయ ఈశ్వరునిలో ఉన్నది, జీవునిలో లేదు.

ప్రశ్న: మాయోపాధివల్ల బ్రహ్మ ఈశ్వరుడు అయితే కావచ్చును. కాని, అవిద్యోపాధితో బ్రహ్మ, జీవుడు ఎలా అయాడు? అవిద్యోపాధి కారణముగా బ్రహ్మ తాను భ్రాంతి పొందాడా? అవిద్యకు కర్త అయాడా?

ఉత్తరము: అలా అవలేదు. బ్రహ్మలో లేనటువంటి (అవిద్య) ధర్మము యొక్క అధ్యారోపమైతే బ్రహ్మలో అయినది. ఇలా అయినా కూడా బ్రహ్మ అవిద్యకు కర్త కాదు; భ్రాంతము కూడా కాదు; కాని, అవిద్యా కర్త–

భ్రాంతుడు అయిన జీవుడు బ్రహ్మకంటే భిన్నుడు కాదు. "కిం తర్హి? న బ్రహ్మ స్వాత్మని అతద్ధర్మాధ్యారోపణ నిమిత్తం అవిద్యాకర్తృ చేతి. భవత్వేవం నావిద్యాకర్తృ భ్రాంతం చ బ్రహ్మ। కిం తు నైవాబ్రహ్మ అవిద్యాకర్తా భ్రాంతః అన్య ఇష్యతే, (బృ॥భా॥ 1-4-10) జీవుడు బ్రహ్మ స్వభావుడు అయినప్పటికీ, బ్రహ్మ జీవస్వభావుడు కాదు. కర్తృత్వమునుగాని, కర్మనుగాని, భోక్తృత్వమునుగాని, బ్రహ్మ జనులకు సృజించలేదు – "న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః, న కర్మఫల సంయోగం।" (గీ॥ 5-14).

అందువల్ల విద్య ద్వారా అవిద్యా నివృత్తి అవడమువల్ల జీవుడు బ్రహ్మ అవుతాడు. ఇలా కూడా అనవచ్చు – జీవుడు విద్యాప్రాప్తి వల్ల బ్రహ్మగా అవుతాడు. ఈ వాక్యములను అటూ-ఇటూ మార్చి చెప్పరాదు. ఎలాగంటే – "అవిద్యాప్రాప్తి వల్ల బ్రహ్మ జీవుడవుతాడు. స్వరూపమును మరచి బ్రహ్మ జీవుడవుతాడు" ఇలా చెప్పరాదు. ఇది పూర్వ అవచ్ఛేదములో చెప్పబడినది. మనము విద్యను పొందగలము, దానిద్వారా ఉత్పన్నమయిన స్వరూపజ్ఞానము ఎప్పటికీ విస్మృతము కాదు. ఈవిధముగా, అవిద్యానివృత్తి చేయశక్యమగును; అవిద్య పొందబడదు.

దీనికి ఒక ఉదాహరణము – ఒక రాజకుమారుడు చాలా చిన్నతనములో పిల్లలతో ఆడుకుంటూ, దారితప్పి అడవిలోకి ఒక్కడే వెళ్ళిపోయాడు. తిరిగి దారి తెలియక నగరములోకి రాలేకపోయాడు. అలా, చిన్నతనములోనే తల్లితండ్రుల నుంచి విడిపోయిన వాడిని ఒక వ్యాధుడు పెంచి పెద్దచేశాడు. అక్కడ అతడు వ్యాధుడు గానే పెరిగాడు. వాడు పెద్దవాడు అయాక, ఒకరోజు రాజపురోహితుడు అతనిని కలసి, 'నువ్వు ఈ దేశానికి రాజువి' అని చెప్పాడు. వ్యాధుడు వెంటనే అతని మాట నమ్మలేదు. అయితే, పురోహితుడు మళ్ళీ ఇలా చెప్పాడు – "నీవు ఎవరిని తల్లి-తండ్రులు అనుకుంటున్నావో వారిలో రాజలక్షణాలు ఏమీలేవు. అవి నీలో ఉన్నాయి". ఇలా చెప్పగానే, ఆలోచించి వ్యాధుడు నిశ్చయము చేశాడు – "నేను స్వయముగా రాజునే!" అంతే, రాజు అయాడు.

ఇక్కడ – అవిద్యాప్రాప్తివల్ల రాజు, వ్యాధుడు అయ్యాడు అని చెప్పటము అనుచితము. అతడు మొదటినుంచీ రాజు మాత్రమే. అవిద్యా నివృత్తివల్ల వ్యాధుడు రాజుగా గుర్తింపబడ్డాడు. ఇలా చెప్పడము న్యాయమే కదా? ఈ ప్రకారము, మొదటి నుంచి బ్రహ్మగానే వున్న జీవుడు అవిద్యా నివృత్తివల్ల బ్రహ్మగా గుర్తింపబడ్డాడు. ఇది యథార్థము

12-14) జగత్సృష్టికి అవిద్యే ప్రేరకము:

అవిద్యతో కూడిన జీవుడు కర్మచేయడానికీ, కర్మఫల భోగము కోసము జగత్తును ఆలంబన చేసుకోవాలి. ఈ జీవుడు జగత్సృష్టిని స్వయముగా చేయజాలడు. ఈశ్వరుడే సృష్టికర్త. పరమేశ్వరుడే భూతయోని. శారీరి (జీవుడు) కాదు. అవిద్యచేత బ్రహ్మకంటె భిన్నమయినవాడని అనుకుంటూ, నామరూపముల మీద అభిమానముతో, వాటి ధర్మములను తనలో కల్పన చేసుకునే శారీరి (జీవుని)లో పరమేశ్వరుని దివ్యత్వము మొదలైన గుణములు ఉండడము అసంభవము –"పరమేశ్వర ఏవ భూతయోనిః నేతరః శారీరః....న హ్యేతత్ దివ్యత్వాది విశేషణం అవిద్యా ప్రత్యుపస్థాపిత నామరూప పంచ్ఛేదాభిమానినః తద్ధర్మాన్ స్వాత్మని కల్పయతః శారీరస్య ఉపపద్యతే।" (సూ॥ భా॥ 1-2-22). నానావిధ గిరి, నది సముద్రాది నామరూపముల వ్యాకరణ సామర్థ్యము, అనీశ్వరుడైన జీవునికిలేదు. "న చ గిరినదీ సముద్రాదిషు నామరూపేషు అనీశ్వరస్య జీవస్య వ్యాకరణ సామర్థ్యమస్తి।" (సూ॥భా॥ 2-4-10). సృష్టి సామర్థ్యము, మహా సిద్ధపురుషులకి కూడా

వుండదు. జగదుత్పత్త్యాది వ్యాపారము తప్ప, అణిమాది రూపమైన ఐశ్వర్యము వాళ్లకు ఉండవచ్చు. అయితే జగద్వ్యాపారము నిత్యసిద్ధుడైన పరమేశ్వరునికే సాధ్యము–"జగదుత్పత్త్యాది వ్యాపారం వర్జయిత్వా, అన్యదణిమాద్యాత్మకం ఐశ్వర్యం ముక్తానాం భవితు మర్హతి। జగద్వ్యాపారస్తు నిత్యసిద్ధస్య ఈశ్వరస్య, (సూ॥భా॥ 4-4-17). ఆప్తకాముడైన ఈశ్వరుడు సృష్టి ఎందుకు చేస్తున్నాడు? జీవుల కోసమే చేస్తున్నాడు. తన బుద్ధిలో ఉన్నటువంటి పూర్వసృష్టిలోని, ప్రాణధారణానుభవము గల జీవులను స్మరించి సృష్టి చేస్తున్నాడు. – "స్వబుద్ధిస్థం పూర్వసృష్ట్యనుభూతప్రాణధారణం ఆత్మానమేవ స్మరంతీ ఆహ నామరూపే వ్యాకరవాణి ఇతి।" (ఛాం॥ భా॥ 6-3-2). సాపేక్షుడయి, ఈశ్వరుడు విషమ సృష్టి నిర్మాణము చేస్తున్నాడు. ఏ అపేక్షతో చేస్తున్నాడు? ధర్మాధర్మముల ఆపేక్షతో చేస్తున్నాడు. ప్రాణుల యొక్క ధర్మాధర్మముల అపేక్షతోనే విషమసృష్టి జరుగుతుంది. "సాపేక్షో హి ఈశ్వరః విషమాం సృష్టిం నిర్మిమీతే। కిమపేక్షతే ఇతి చేత్? ధర్మాధర్మౌ అపేక్షతే ఇతి వదామః అతః సృజ్యమాన ప్రాణి ధర్మాధర్మాపేక్షా విషమాసృష్టిః।" (సూ॥భా॥ 2-1-34). అవిద్యావస్థలో కార్యకరణ సంఘాత రూపము నుంచి తనను వేఱుగా తెలుసుకోక, అవిద్యా అంధకారములో అంధుడయిన జీవునికి, కర్మాధ్యక్షుడు సర్వభూతాధివాసుడు సాక్షి చేతనుడు పరమాత్మ అయిన ఈశ్వరుని నుంచి, ఈశ్వరానుజ్ఞచేత కర్తృత్వ భోక్తృత్వ రూపమైన సంసారము సిద్ధిస్తున్నది. ఈశ్వరుని అనుగ్రహముతోనే వచ్చిన విజ్ఞానముతో మోక్షము సిద్ధిస్తున్నది.– "అవిద్యావస్థాయాం కార్యకరణసఙ్ఘాతావివేకదర్శినో జీవస్య, అవిద్యాతిమిరాంధస్య సతః, పరస్మాదాత్మనః కర్మాధ్యక్షాత్ సర్వభూతాధివాసాత్, సాక్షిణః చేతయితుః ఈశ్వరాత్, తదనుజ్ఞయా కర్తృత్వ భోక్తృత్వ లక్షణస్య సంసారస్య సిద్ధిః। తదనుగ్రహహేతుకేనైవ విజ్ఞానేన మోక్షసిద్ధిః భవితుమర్హతి। (సూ॥భా॥ 2-3-41). అన్ని వేదాంతములలో సృష్టి హేతుకత్వము ఈశ్వరునికే చెప్పబడినది. ఈశ్వరునికి ఫలహేతుత్వము, అనగా వారి కర్మలను అనుసరించి, ప్రజాసృష్టి చేయడము – "సర్వవేదాంతేషు చ ఈశ్వరహేతుకా ఏవ సృష్టయో వ్యపదిశ్యంతే। తదేవ చ ఈశ్వరస్య ఫలహేతుత్వం, యత్ స్వకర్మానురూపాః ప్రజాః సృజతీతి।" (సూ॥భా॥ 3-2-41). ప్రాణుల అవిద్యాది దోషబీజముల అపేక్షతో ఈ కళలన్నీ సృష్టింపబడి తిరిగి నామరూప విభాగమును విడచి, ఆ పురుషునిలో లీనమవుతున్నాయి – "ఏతాః కలాః, ప్రాణినాం అవిద్యాది దోషబీజాపేక్షయా సృష్టాః, పునః తస్మిన్నేవ పురుషే ప్రలీయంతే హిత్వా నామరూపాది విభాగమ్।" (ప్ర॥భా॥ 6-4). ఈ పై భాష్యవాక్యములతో స్పష్టమవుతున్నది. ఏమనగా– **జగత్కారణమైనది– మాయ; జీవుల అవిద్య మాయాధీశ్వరుడైన ఈశ్వరుడు సృష్టించడానికి ప్రేరకము.**

12-15) 'అవిద్యా కల్పితము'నకు అర్థము ఏమిటి?

1) అవిద్యవల్ల ఏ సంసారము వచ్చినదో, అది కూడా అవిద్యతో సమానముగా కల్పితమైనదే. ఒక జీవుడు, అవిద్యవల్ల ఒక స్త్రీని పత్ని అనిపిలుస్తాడు. అలా తన గృహస్థ జీవితము ప్రారంభము చేస్తాడు. ఇక ఆ స్త్రీ సంబంధి బంధువులు అందరికీ – బావ, మరదలు, అత్త, మామ, కోడలు మొదలైన పేర్లు వ్యాపిస్తాయి. అజ్ఞానియైన ఆ పురుషుడు వైరాగ్యముతో సంన్యాసి అయితే, ఆ సంసారమును విడిచిపెడతాడు. క్షణములో పుట్టిన పత్ని, బావ, మరదలు, అత్త, మామ, కోడలు – ఇవన్నీ క్షణములో వదలిపోతాయి. అంటే, ఈ సంసారము "ఉన్నది" అన్నవానికి సంసారము ఉన్నది; "లేదు" అన్నవానికి సంసారము లేదు. తనను అబ్రహ్మ, అసర్వము, అని అనుకోవడమువల్ల ఏర్పడిన సంసారము అవిద్యాకల్పితము.

వాది: ఈ విధమైన అవిద్యాకల్పిత అబ్రహ్మత్వ అసర్వత్వములు సంసారములోనే కాక, అన్యనామ రూపములలో కూడా ఉన్నవి. ఎందుకంటే బ్రహ్మ జ్ఞానస్వరూపము – జగత్తు జడము. అందువల్ల జగత్తు

అబ్రహ్మ. బ్రహ్మ సర్వస్వరూపము – ఘటాది రూప జగత్తు అసర్వము. అందువల్ల జగత్తు అవిద్యా కల్పితము.

ప్రతివాది: ఇలా చెప్పడము కుదరదు. ఒకవేళ అలా అయితే, నామరూపాత్మకమైన ఈజగత్తు బ్రహ్మవిద్యవల్ల నివృత్తికావాలి.

వాది: సరేనే! నివృత్తి అవుతుంది. అందువల్లనే శ్రుతి చెప్తున్నది–'జ్ఞాని ఇంకొకదానిని వినడు' ఇంకొక దానిని చూడడు అని "నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి।" (ఛాం॥7–24–1).

ప్రతివాది: అలా అయితే, అశరీరికి ప్రియము అప్రియము ఏమీ అంటవు– "అశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః।" (ఛాం॥ 8–12–1). ఈ వాక్యానుసారముగా జ్ఞాన ప్రాప్తి తరువాత మరణించినప్పుడే "న అన్యత్పశ్యతి, న అన్యచ్ఛృణోతి" అనే మాటలు చరితార్థములు కావాలి.

వాది: అది అలాగే జరగనీ; శరీరము వున్నంతవరకు అవిద్య ఉంటూనే వుంటుంది. అవిద్య సంపూర్ణముగా నశించినప్పుడే శరీరము నశిస్తుంది. ఇలా జ్ఞానికి శరీర నాశనము తరువాత విదేహ ముక్తి లభిస్తుంది. ఇదే యథార్థమైన ముక్తి.

ప్రతివాది: అలా అయితే, జ్ఞాని ప్రారబ్ధము నశించడంచేత మరణించాడా? లేక విద్యాఫలప్రాప్తి మరణించాడా? ఇది ఎలా నిశ్చయించడము? విదేహముక్తిని ఎవరైతే పొంది ఉన్నాడో – అతడు తన విద్యతో అన్ని నామరూపములను, అన్ని జీవుల శరీరములను తన శరీరముతో పాటు నష్టముచేసి ఉండేవాడు, కాని జగత్తు వున్నది – మిగిలిన జీవులు కూడా వున్నారు. ఇది ఎలా సంభవము? బ్రహ్మవిద్యవల్ల తెలుస్తున్న బ్రహ్మైకత్వము, ప్రత్యక్ష ప్రమాణమునకు విషయమా? లేక శాస్త్ర ప్రమాణ విషయమా? బ్రహ్మైకత్వము ప్రత్యక్ష ప్రమాణ విషయము కాదు. జగత్తులోని నానాత్వము ప్రత్యక్ష ప్రమాణ విషయము, బ్రహ్మైకత్వము ప్రమాణాన్తర (శాస్త్ర ప్రమాణ) విషయము. అందువల్ల బ్రహ్మైకత్వమును స్వీకరించుటకు, ప్రత్యక్ష ప్రమాణ విషయమైన నానాత్వము యొక్క అస్వీకారము ఆవశ్యకము కాదు. ఒక ప్రమాణము ఇంకొక ప్రమాణమునకు విరుద్ధము కాదు. ఎందుకంటే, ఒక ప్రమాణమునకు విషయము కానిదే ఇంకొక ప్రమాణమునకు విషయము అవుతుంది. – "న చ ప్రమాణం ప్రమాణాన్తరేణ విరుధ్యతే। ప్రమాణాన్తరా విషయమేవ హి ప్రమాణాన్తరం జ్ఞాపయతి।" (బృ॥భా॥ 2–1–20). దీనికి విరుద్ధముగా – "యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమ్ అవిజ్ఞాతం విజ్ఞాతమ్।" (ఛాం॥ 6–1–3), "ఇదం సర్వం యదయమాత్మా।" (బృ॥2–4–6), "బ్రహ్మైవేదమ్ అమృతం పురస్తాత్।" (ముం॥ 2–2–1), మొదలైన వందల శ్రుతులు, జగద్ బ్రహ్మల అభిన్నత్వమును ఉద్ఘోషిస్తున్నాయి. దానివల్ల జగత్తు యొక్క నానాత్వము – బ్రహ్మైకత్వము ఒకేసారి సిద్ధమవుతున్నవి. సర్వాత్మ భావప్రతిపాదక శాస్త్రము కూడా ఈ ప్రకారము సమన్వయమవుతున్నది. అందువల్ల బ్రహ్మైకత్వము కోసము, జగత్తును మిథ్య అనడము – వేదము అప్రామాణ్యము అనడముతో సమానము.

2) సంశయము: ఒకే వస్తువులో వున్న అవిరుద్ధమైన విశేషణములను విభిన్న ప్రమాణములతో తెలుసుకోవడము మన అనుభవములోనున్న విషయము. ఉదా: ఫలములో ఉన్న రూపము, రసము, గంధము, స్పర్శ ఇవి క్రమముగా కంటితో, రసనతో, ఘ్రాణముతో, చర్మముతో తెలుసుకుంటున్నాము. అయితే, ఇదేవిధముగా **ఒకే బ్రహ్మలో ఏకత్వ – నానాత్వములవంటి విరుద్ధ విషయములను కూడా విభిన్న ప్రమాణములచేత తెలుసుకోగలమా?**

పరిహారము: ఒకే ప్రమాణముతో కూడా ఇది సంభవము. ప్రత్యక్ష ప్రమాణముతో ఘటాది కార్యముల నానాత్వమును, మృత్తికారూప కారణము యొక్క ఏకత్వమును ఒకేసారి తెలుసుకోగలుగుతున్నాము. విభిన్న ప్రమాణములతో కూడా అలా తెలుసుకోవచ్చు. ఉదా: ఒక తిన్నని కర్రను కొంతభాగము నీటిలో ఏటవాలుగా ముంచినట్లయితే, ఆ తిన్నని కర్ర కళ్ళకు వంకరగా కనపడుతుంది. కాని స్పర్శకు అది తిన్నగానే వుంటుంది. దానివల్ల ఒక విషయము స్పష్టమవుతుంది – కర్ర స్వభావముతో తిన్నగానే వుంది, కాని జలము అనే ఉపాధితో కలసి వక్రముగా కనపడుతున్నది. ఇదే ప్రకారము, **జగత్తు ప్రత్యక్ష ప్రమాణముచేత నానాత్వముతో అనుభవములో కనవడినవ్పటికీ, శ్రుతి ప్రమాణముచేత ఏకత్వమును గ్రహించగలము. ఒకే విషయములో ఈ రెండు జ్ఞానములు యథార్థ జ్ఞానములే. అందువల్ల వీటిలో ఏది అతత్త్వము, ఏది తత్త్వము అని నిర్ణయించాలి. ఏది ఇంకొక విషయాపేక్ష లేకుండా తనంత తానే సిద్ధమవుతుందో అది తత్త్వము. అన్యాపేక్షచేత తెలుసుకోబడేది అతత్త్వము –** "యద్ధి యస్య నాన్యాపేక్షం స్వరూపం తత్ తస్య తత్త్వమ్ యదన్యాపేక్షం న తత్ తత్త్వమ్।" (తై॥భా॥ 2-7-7). **ఒకే బ్రహ్మలో వికారము యొక్క అపేక్షతో నానాత్వమూ, అన్యాపేక్ష లేకుండా ఏకత్వమూ తెలియబడుతుంటే నానాత్వము అతత్త్వము, ఏకత్వము తత్త్వము** – అని నిశ్చయమవుతుంది.

ఆక్షేపము: ఈ చర్చ అర్థము వికారము అవిద్యా కల్పితము అనే అవుతుంది. ఎందుకంటే ఏకత్వము కొఱకు వికారములను విడిచి పెట్టాలి కనుక.

సమాధానము: అలా కాదు. విడిచి పెట్టటమంటే అర్థమేమిటి? విద్యవల్ల దేని అవస్తుత్వము తెలుస్తున్నదో అది అవస్తువు. కంటిలో పువ్వులేని వాడు చూడని ద్వితీయచంద్రుడే అవస్తువు– "అన్యస్య చ అవిద్యాకృతత్వే విద్యయా అవస్తుత్వ దర్శనోపపత్తిః। తత్ హి ద్వితీయ చన్ద్రస్య అసత్త్వం యత్ అతైమిరికేణ చక్షుష్మతా న గృహ్యతే'" (తై॥ భా॥ 2-8-7). కాని విద్యావంతుడు కూడా జగత్తును చూస్తున్నాడు. అందువల్ల జగత్తు అవస్తువు కాదు. తన సంకల్పముతో నానాత్వరూపమైన బ్రహ్మయే జగత్తు అని శ్రుతి చెపుతున్నది.

సంశయము: ఎలాగైతేనేమి? బ్రహ్మైకత్వ సిద్ధి కోసము ఆఖరుకు వికారములను నిరాకరణ చేయవలసి వస్తున్నది. అందువల్ల బ్రహ్మ సంకల్పమని బోధించే శ్రుతి అర్థవాదము; వికారము అవస్తువు. ఇలా చెప్తే?

పరిహారము: ఎప్పటికీ కాదు. కేవలము అజ్ఞానికి ఉన్నట్లు అనిపించదాన్ని బట్టి సిద్ధించిన అజ్ఞానమును భావవస్తువు అనడము – జ్ఞానులైన పురుషులకు కూడా ప్రమాణ పూర్వకముగా తెలియబడే జగత్తును అవస్తువు అనడము – సర్వథా అనుచితము. ఈ జగత్తును అవస్తువు అని నిరాకరించడము వల్ల బ్రహ్మకూడా నిశ్చితము కాదు.

ఆక్షేపము: ఎందుకు కాదు? కల్పిత జగత్తుకు అధిష్ఠానమే బ్రహ్మ కదా?

పరిహారము: ఇది సరికాదు. కనపడే సర్పము అవిద్యచేత అధ్యస్తము (కల్పితము) అయితే, దాని పరీక్ష తరువాత ఆ అధిష్ఠానము రజ్జువా, భూఛిద్రమా, ఎద్దుయొక్క మూత్రధారా అని ప్రత్యక్షంగా నిశ్చయించవచ్చు. ఇదే ప్రకారము, ఒక వేళ బ్రహ్మ ప్రత్యక్ష విషయమైతే అది కల్పిత జగత్తుకు అధిష్ఠానమా, కాదా– అని నిశ్చయించవచ్చు. కాని, బ్రహ్మ ప్రత్యక్ష విషయము కాదు. కేవలము కార్య జగత్తు మాత్రము

కనబడుతున్నది. దీని అధిష్ఠానము, బ్రహ్మ అవుతుందా; వేఱే ఏదైనా అవుతుందా, అని నిశ్చయము దీనివల్ల కాదు– "సతి హి ఇంద్రియ విషయత్వే బ్రహ్మణః ఇదం బ్రహ్మణా సంబద్ధం కార్యమితి గృహ్యేత॥ కార్యమాత్రమేవ తు గృహ్యమాణం కిం బ్రహ్మణా సంబద్ధం కిమన్యేన కేనచిద్వా సంబద్ధమితి న శక్యం నిశ్చేతుమ్। (సూ॥ భా॥ 1-1-2). ఇదికాక, నిర్గుణ నిరవయవ బ్రహ్మ – సగుణ సావయవ కల్పిత జగత్తుకు అధిష్ఠానము ఏ విధముగాను కాజాలదు. ఎందుకంటే కల్పిత జ్ఞేయమునకు దాని అధిష్ఠానముతో సాదృశ్యము వుంటుంది. సాదృశ్యము లేకుంటే కల్పన చేయడము కుదరదు. శుక్తిలో – సర్పమును, రజ్జువులో–రజతమును కల్పన చేయడము అసంభవము. (అధ్యా॥ 4-2, 12-6, (3)) అలాంటప్పుడు నిర్వికార బ్రహ్మలో సవికార జగత్తును అన్ని ప్రాణులకు సమాన రూపంగా ఉండేటట్లు కల్పన చేయడం ఎలా కుదురుతుంది? అవదు.

సంశయము: అలా అయితే భాష్యకారులు చెప్పిన అవిద్యాకల్పిత జగత్తుకు అధిష్ఠానము ఏది?

పరిహారము: ఎదురుగా వున్న జగత్తే దాని అధిష్ఠానము, బ్రహ్మ దాని ఉపాదానము. ఇందువల్ల నామరూపములు బ్రహ్మవిద్యవల్ల నివృత్తములు కావు. అవి అబ్రహ్మ కావు. అసర్వము కూడా కావు కాని అజ్ఞానంవల్ల భాసిస్తూన్న అబ్రహ్మత్వ – అసర్వత్వమునే విద్యచేత నివర్తిస్తాయి. వాటి అబ్రహ్మత్వ – అసర్వత్వములు అవిద్యచేత కల్పితమవుతున్నాయి. కల్పితమైనవి, విద్యచేత నశిస్తాయి. ఇంతకు మించి పరమార్థ వస్తువును తయారు చేయడముగాని చెడగొట్టడముగాని బ్రహ్మవిద్య పని కాదు – "అవిద్యాకృత వ్యతిరేకేణ అబ్రహ్మత్వం అసర్వత్వం చ విద్యత ఏవేతి చేత్? న, తస్య బ్రహ్మవిద్యయా ఆపోహానుపపత్తేః॥ అబ్రహ్మత్వం అసర్వత్వం చ అవిద్యాకృతమేవ నివర్త్యతాం బ్రహ్మవిద్యయా। న తు పారమార్థికం వస్తు కర్తుం నివర్తయితుం వా అర్హతి బ్రహ్మవిద్యా।" (బృ॥ భా॥ 1-4-10). స్థూల రూపముతో వ్యక్తమయి జీవుని అనుభవములో ఉన్న నామరూపాలు అతని అవిద్యచే కల్పితములని చెప్పేటట్లయితే, సృష్టికి పూర్వమే వాటిని అవ్యక్తరూపంలోనే చూసే ఈశ్వరునికి – జీవుని అవిద్యకంటె ఎక్కువ అవిద్య వున్నదని ఆమోదించాలి – "అసంశ్చేద్ భవిష్యద్ఘటః ఐశ్వరం భవిష్యద్ఘటవిషయం ప్రత్యక్షజ్ఞానం మిథ్యా స్యాత్।" (బృ॥భా॥ 1-2-1), ఇది సర్వథా అనుచితము.

3) అందువల్లనే సమగ్ర శాస్త్రములో నామరూపాత్మక జగత్తు యొక్క వర్ణన రెండు విధములుగా చేయబడుతున్నది. ఒక చోట జగత్తును కల్పితము అని చెప్పబడింది. ఇంకొక చోట బ్రహ్మస్వరూపము అని చెప్పబడింది. ఈ రెండూ ఉచితమే. కేవల కార్యదృష్టితో చూడబడిన అనగా కారణబ్రహ్మకంటె స్వతంత్రమని చెప్పబడిన జగత్తు అవిద్యా కల్పితమే. ఈ సంసార వృక్షము – స్వప్నము, మరీచికా జలము, మృష, గంధర్వ నగరము – వీటివలె కనబడుతూ నశించే స్వరూపము కలది– "అయం వర్ణితః సంసార వృక్షః... స్వప్న మరీచ్యుదక మాయా గంధర్వ నగర సమత్వాత్ దృష్ట నష్ట స్వరూపో హి సః॥" (గీ॥ భా॥ 15-3). కారణదృష్టితో చూసినట్లయితే, అది బ్రహ్మమే. సత్‌ను గురించియే ద్వైతరూప విశేషమువల్ల అన్యథా జ్ఞానము కలిగుచున్నది. అందువల్ల ఏ వస్తువూ ఏ కాలములోనూ అవస్తువు అవదు – "సత ఏవ ద్వైతభేదేన అన్యథా గృహ్యమాణత్వాత్ న అసత్త్వం కస్యచిత్ క్వచిత్।" (ఛాం॥భా॥6-2-3). అన్ని నామరూపాది వికారముల సమూహము సద్రూపము (బ్రహ్మరూపము)తో సత్యము, అది తన రూపముతో అనృతము – "సర్వం చ నామరూపాది సదాత్మనైవ సత్యం వికారజాతం స్వతస్తు అనృతమేవ" (ఛాం॥భా॥6-3-2). రూపము కూడా

ఆకారముతో అనృతము, సన్మాత్రరూపముతో సత్యము. "రూపాణ్యపి ఆకార విశేషతోऽనృతమ్ స్వతః సన్మాత్రరూపతయా సత్యమ్।" (ఛాం॥భా॥8-5-4). ఎవరికోసమైనా అంతా అనాత్మ అయి, తరువాత ఆత్మ అవదు. అందువల్ల, అవిద్యతోనే అనాత్మత్వం కల్పించబడినది. వస్తుతః ఆత్మను విడిచి ఏదీ వుండదు. -"న చ అనాత్మా సన్, సర్వమ్ ఆత్మైవ భవతి కస్యచిత్। తస్మాత్ అవిద్యయైవ అనాత్మత్వం పరికల్పితం, న తు పరమార్థతః ఆత్మవ్యతిరేకేణ అస్తి కించిత్।" (బృ॥ 2-4-14).

4) సందేహము: శాస్త్రము ఈ జగత్తు బ్రహ్మ మానస ప్రత్యయము అని చెపుతున్నది. (భా॥ 8-5-4). అవిద్యతో కూడిన అవ్యక్తమే హిరణ్యగర్భ నామకుడైన ఈ బ్రహ్మయొక్క అహంకారము. (అధ్యా॥ 7-5). ఈ లోకము, ఇక్కడ చెప్పబడిన అవిద్యచేత కల్పింపబడగలదా?

సమాధానము: అలా కాదు. ఈ లోకములు అన్నీ హిరణ్యగర్భుని మానసప్రత్యయమువల్ల జన్యములు అనేది సత్యమే! అతడు, ఇంతకు ముందు తన మనస్సులో అప్రకట రూపముగా వున్న ఈ లోకాలను ప్రకటిస్తున్నాడు. జాగ్రదవస్థలో చూడబడే పదార్థములు సద్బ్రహ్మ సంకల్పమువల్ల పుట్టిన తేజో, అప్ (నీరు)-అన్నముల వికారములే- "జాగ్రద్విషయా అపి మానస ప్రత్యయాభినిర్వృత్తా ఏవ। సదీక్షాభిః నిర్వృత్త తేజో బన్నమయత్వాత్ జాగరిత విషయాణామ్" (ఛాం॥భా॥ 7-5-4). హిరణ్యగర్భరూప బ్రహ్మ-భృగువు, నారదుడు మొదలైనవారికి జన్మనిచ్చాడు. బ్రహ్మ నుంచి ఉత్పత్తి అవడము వల్ల వీరందరు బ్రహ్మ మానసపుత్రులు అని ప్రసిద్ధులు. ఈ హిరణ్య గర్భుడు ఎవరు? హిరణ్యగర్భుడనగా అవ్యాకృతము నుండి పుట్టి ప్రాణము అవిద్యా కామ కర్మ భూత సమూహము యొక్క బీజముయొక్క అంకురము. జగదాత్మ. బ్రహ్మయొక్క జ్ఞానశక్తి-క్రియాశక్తులచే అధిష్ఠింపబడిన జగత్తు యొక్క సామాన్య(సమష్టి) రూపము. "తతశ్చ అవ్యాకృతాత్ ప్రాణః హిరణ్యగర్భో బ్రహ్మణః జ్ఞానశక్తి క్రియాశక్తి అధిష్ఠిత జగత్ సాధారణః అవిద్యా- కామకర్మభూత సముదాయ బీజాంకుర జగదాత్మా అభిజాయతే।" (ముం॥భా॥ 1-1-8). ఇతని అహంకారము జీవుల అవిద్యా-కామ-కర్మ మొదలైన దోషములను తన లోపల దాచుకున్న అవ్యక్తము. ఈ అవిద్యా సంయుక్త అవ్యక్తమే అతని అహంకారము. అది పరమాత్ముని అష్టవిధ ప్రకృతి యొక్క ఒక అంగము (గీ॥భా॥7-4). అదే హిరణగర్భ పరమేశ్వరుడు. అనగా అవ్యక్తోపాధి ద్వారా లక్షితమైన బ్రహ్మ, అతనిలో అణగి ఉన్న జీవుల అవిద్యవలననే, ఈ అవ్యక్తము సృష్టి కార్యమునకు ప్రేరకము అవుతున్నది. దీని నిర్ణయము ముందే జరిగింది. (అధ్యా॥ 12-14). ఈ అవిద్యా సంయుక్త అవ్యక్తమునకు అహంకారము అనే నామము ఎందువల్ల వచ్చినదనగా అహంకారముతోనే ప్రవర్తకత్వము వస్తున్నది. దీని అర్థము - హిరణ్యగర్భుడు తన అవిద్యచేతనే జగత్తును కల్పించాడు - అని కాదు. ఎందుకంటే అతనికి అవిద్య లేదు - "ఈశ్వరస్య నిత్యనివృత్తావిద్యత్వాత్।" (సూ॥భా॥ 3-2-9).

5) **సంశయము:** శ్రుతి, మృద్ఘట ఉపమానమును ఇస్తూ బ్రహ్మను జగత్కారణముతో పాటుగా కూటస్థుడని చెప్తున్నది. అయితే మట్టినుండి ఘటము ఉత్పత్తి అయినట్లు, కూటస్థ బ్రహ్మనుండి జగత్తు ఉత్పత్తి కాదు. అందువల్ల జగత్తు అవిద్యా కల్పితమే అవాలి.

పరిహారము: ఇలా జరగదు. బ్రహ్మ కూటస్థమే బ్రహ్మజన్య సృష్టిప్రతిపాదక శ్రుతిని - కూటస్థ ప్రతిపాదక శ్రుతితో సమన్వయము చేయాలి. కాని, సమన్వయము చేయడము కొఱకు జగత్సృష్టిని అవిద్యా కల్పితము అని చెప్పే సాహసము చేయడము ఉచితము కాదు. ప్రాణాదిరూపమైన జగత్తు పరబ్రహ్మవలననే పుట్టింది అనేది వేదాంత మర్యాద - "పరస్మాచ్చ బ్రహ్మణః ప్రాణాదికం జగజ్జాయతే ఇతి వేదాంత మర్యాదా। (సూ॥భా॥1-

4-18). ఈ వ్యవహారము అతని స్వరూపమునకు విరుద్ధము కాదు. అన్ని వ్యవహారములు, సర్వవికారములు కూడా సద్రూపముతో సత్యములే -"సదాత్మనా సత్యత్వాభ్యుపగమాత్... సర్వవ్యవహారాణాం సర్వవికారాణాం చ సత్యత్వమ్।" (ఛాం॥భా॥6-3-2). అందువల్ల, రెండు శ్రుతులను సమన్వయము చేసి సృష్టిని - కూటస్థత్వమును రెండింటినీ ఆమోదించవలసివున్నది. ఇలా చెయ్యకపోతే -

క) సమన్వయమనే ప్రశ్నే ఉండదు. ఎందుకంటే ఇది శ్రుతి వాక్యములను నిషేధించినట్లు.

ఖ) శాంకర భాష్యము సృష్టిని ఆమోదించలేదు అన్నది సరియైనది కాదు. ఒక వేళ సృష్టి ప్రళయములను వేదాంతము ఒప్పుకోకపోయినట్లయితే సృష్టి ప్రళయములను ఆమోదించని మీమాంసకులను ఇన్ని ఊహాపోహలతో ఖండించడం జరిగేది కాదు.

గ) సృష్టిని అస్వీకారము చేస్తే, బ్రహ్మను తెలుసుకోవడానికి ఇంకొక మార్గమేలేదు. బ్రహ్మ యొక్క నిరుపాధిక రూపమును నిశ్చయము చేయడము కోసమే, నామ రూపముల సృష్టి జరిగినది. "యది హి నామరూపే న వ్యాక్రియేతే, తదా అస్యాత్మనో నిరుపాధికం రూపం ప్రజ్ఞాన ఘనాఖ్యం న ప్రతిఖ్యాయేత. (బృ॥భా॥ 2-5-19).

కూటస్థ ప్రతిపాదక శ్రుతివాక్యములు సృష్టి ప్రతిపాదకములు ఈ రెండెంటి సమన్వయము ఇలా వున్నది. సృష్ట్యాదులను ప్రతిపాదించే వ్యాక్యాలకు సృష్ట్యాదులను బోధపరచడము లక్ష్యము కాదు. కార్యకారణముల అనన్యత్వము ద్వారా నామరూపముల బ్రహ్మానన్యత్వమును తెలియజేయడమే దాని తాత్పర్యము. కార్యజగత్ - కారణబ్రహ్మల మధ్య వున్న రెండింటి అనన్యత్వము ఏమిటి? జగత్తు బ్రహ్మకంటె భిన్నము కాదు. కాని, బ్రహ్మ జగత్తుకంటె భిన్నము - ఇదే వాని అనన్యత్వము. ఈ యుగళవాక్య ఉత్తరార్ధములో వున్న జగత్తు, తార్కికులు చెప్పినట్లు - సృష్టికి పూర్వము, నశించిన తరువాత లేకుండా, వర్తమాన కాలములోనే ఉన్న కార్యము. అందువల్ల ఉన్నవనుకునే ఈ నామధేయములు వికారములు అన్నీ అనృతములు. స్వతంత్రములు కనుక బ్రహ్మకాదు, అవిద్యా కల్పితములు. ఈ జగత్తును పట్టి చూస్తే బ్రహ్మ, పరిణామ వ్యవహారమునకు కూడా ఆశ్రయమవుతున్నది - "అవిద్యా కల్పితరూప భేదేన బ్రహ్మ పరిణామాది సర్వ వ్యవహారాస్పదత్వం ప్రతిపద్యతే!" (సూ॥భా॥ 2-1-27) ఇందువల్ల కూటస్థ బ్రహ్మ దీనికంటె వేఱైనది. ఈ ప్రకారముగా పైన చెప్పిన యుగళవాక్యముల ఉత్తరార్ధములో చెప్పిన జగత్తును నిరాకరణము చేసిన తరువాత, పూర్వార్ధములో చెప్పిన జగత్తు మిగులుతున్నది. ఇది బ్రహ్మకంటె ఏ విధముగానూ వేఱు కాదు. ఈ జగత్తు స్థితి కాలములోను లయకాలములోను కూడా బ్రహ్మమే. 'ఇది' అనే బుద్ధి వున్నప్పుడు కూడా పరమార్థ దృష్టితో జగత్తు "ఏకమేవా ద్వితీయ బ్రహ్మ"మే! - "ఏకమేవాఽద్వితీయం పరమార్థతః ఇదం బుద్ధికాలేఽపి।" (ఛాం॥భా॥6-2-2). ఎందుకంటే కార్యాకారము కూడా కారణముయొక్క స్వరూపమే - "కార్యాకారోఽపి కారణస్య ఆత్మభూత ఏవ।" (సూ॥భా॥ 2-1-18). అనగా, యుగళ వాక్యముల పూర్వార్ధములో చెప్పిన జగత్తు బ్రహ్మకంటె కొంచెము కూడా వేఱు కాదు. అది బ్రహ్మమే! ఇందువల్ల ఇంద్రియముల ద్వారా జగత్తును గుర్తిస్తున్నప్పటికీ, పరమార్థదృష్టితో - జగత్తు సృష్టింపబడినది; లయిస్తున్నది - అనే వ్యవహారమునకు అవకాశమే లేదు- "పారమార్థికేన రూపేణ సర్వ వ్యవహారాతీతం అపరిణతం అవతిష్ఠతే।" (సూ॥భా॥ 2-1-27). ఒక అద్వితీయ సన్మాత్ర బ్రహ్మమాత్రమే మిగిలివుంటుంది. అక్కడ అన్ని ప్రమాణములు పరిసమాప్తిని పొందుతాయి - "తతః పరబ్రహ్మ ఏకమేవాద్వితీయం, తత్ర సర్వ ప్రమాణానాం నిష్ఠా।" (సూ॥భా॥2-1-25). ఇదే కూటస్థము. ఇంతగా చెప్పినప్పటికీ, ఎవరైనా మందమతి-

'ఈ జగత్తు ఎక్కడ నుంచి వచ్చింది?' అని అడిగితే, అతనికి పూర్వము చెప్పిన బ్రహ్మను గురించే మళ్ళీ చెప్పడము అనుచితము కాదు. అంత వ్యవహారమూ అవిద్యా కల్పితము అయినప్పటికీ – కూటస్థ బ్రహ్మయొక్క స్వరూపమే అయిన దాని వ్యవహార సామర్థ్యమును నిరాకరించజాలము, అని ముందే చెప్పాము. (అధ్యా॥ 9–10).

సంశయము: ఉపాదానకారణములో వికారముగా మారే వ్యవహారము–నిమిత్త కారణములో వికారమును ఉత్పన్నము చేయడము అనే వ్యవహారము ఉన్నది. ఇలా జగత్తు యొక్క అభిన్న నిమిత్తోపాదాన కారణ పరబ్రహ్మలో రెండు వ్యవహారములూ ఉంటాయి. అది ఇక కూటస్థము ఎలా అవుతుంది?

పరిహారము: వికారి (వికృతిని పొందేది) ప్రకృతి, బ్రహ్మ కాదు. వికారమును ఉత్పన్నము చేసేవాడు అపరబ్రహ్మ, పరబ్రహ్మ కాదు. అందువల్ల పరబ్రహ్మలో పరిణామము జరగడము – రూప, వికారముల ఉత్పత్తి జరగడము ఉండదు. అది కూటస్థమే.

సంశయము: అయితే, పరబ్రహ్మను జగత్తుకు అభిన్న నిమిత్తోపాదాన కారణము అని చెప్పడము ఎలా సంభవము?

పరిహారము: ఉపాదాన కారణమైన ప్రకృతికి – నిమిత్తకారణమైన అపరబ్రహ్మకు, పరబ్రహ్మతో అభిన్నత్వము ఉండడము వల్ల, పరబ్రహ్మను అభిన్న నిమిత్తోపాదాన కారణము అని చెప్పాము.

సంశయము: బ్రహ్మను, అభిన్న నిమిత్తోపాదానకారణము అని చెప్పడమువల్ల లాభము ఏమున్నది?

పరిహారము: అద్వితీయ కూటస్థ పరబ్రహ్మను తెలియపరచుటకు ఇది అపేక్షణీయము. అంటే, మనము ఎక్కడనుండి జిజ్ఞాసను ప్రారంభము చేశామో, అక్కడికే తిరిగి వచ్చాము. దీని అర్థము – అన్య ప్రమాణములతోనే శ్రుతి – సిద్ధాంతమును స్థాపించాలనుకోవడము దివాస్వప్నము వంటిది. ఇక్కడ తర్కమునకు స్థానము లేదు. బ్రహ్మ కూటస్థము – జగత్కారణము కూడా. ఈ శ్రుతి సిద్ధాంతమును తర్కముతో నిశ్చయము చేయలేము. రూపాదులు లేకపోవుటచే ప్రత్యక్షమునకు లింగాదులు లేకపోవటంచేత అనుమానమునకు చిక్కని బ్రహ్మ విషయములో నిర్ణయమును తర్కము ఎలా చేయగలదు? అందువలన, ఈ ప్రమాణములలో దీనిని నిశ్చయము చేయాలని అనుకోవడము దివాస్వప్నము. ముముక్షువు **శ్రుతి వాక్యములను స్వీకరించి, కార్యకారణముల అనన్యత్వము ద్వారాగాని, లేక, స్వానుభవముచేత నిశ్చయించిన దృష్టాంతములతోగాని, బ్రహ్మకూటస్థత్వమును జగత్కారణ ప్రతిపాదకత్వ వాక్యములతో సమన్వయము చేయాలి.** మనస్సు జీవునిలో లీనమయినప్పుడు, గాఢ నిద్రావస్థలో వ్యవహారము అంతా శమించి ఆ జీవుడు ఒక్కడే ఉండడము–స్వప్నములో ఆ మనస్సుతోనే ఆ జీవుడే స్వప్న జగత్తును సృష్టి చేసుకోవడము, ఇది అందరి అనుభవములో ఉన్నది. ఈ విధముగా పరబ్రహ్మను స్వరూపముతో కూటస్థుడని – ఉపాధి దృష్టితో జగత్కారణుడని చెప్పగలము. ఈ చెప్పడము శ్రుతికి విరోధమని భావించరాదు. – "యత్తు ఉక్తం పరినిష్పన్నత్వాత్ బ్రహ్మణి ప్రమాణాన్తరాణి సంభవేయురితి, తదపి మనోరథమాత్రమ్। రూపాద్యభావాద్ధి నాయమర్థః ప్రత్యక్షస్య గోచరః; లిఙ్గాద్యభావాచ్చ నానుమానాదీనామ్। ఆగమమాత్ర సమధిగమ్య ఏవ తు అయమర్థః ధర్మవత్......శ్రుత్యనుగృహీత ఏవ హి అత్ర తర్కః అనుభవాంగత్వేన ఆశ్రీయతే; స్వప్నాన్తబుద్ధాన్త యోరుభయోః ఇతరేతర వ్యభిచారాత్ ఆత్మనః అనన్వాగతత్వమ్, సంప్రసాదే చ ప్రపఞ్చ పరిత్యాగేన సదాత్మనా సంపత్తేః నిష్ప్రపంచ సదాత్మత్వమ్, ప్రపఞ్చస్య బ్రహ్మప్రభవత్వాత్

కార్యకారణానన్యన్యాయేన బ్రహ్మావ్యతిరేకః ఇత్యేవం జాతీయకః॥" (సూ॥భా॥ 2-1-6). ఇలా సమన్వయము చేయకుండా, కూటస్థ ప్రతిపాదక వాక్యముల ముఖ్యార్థమును స్వీకరించి, కారణత్వ ప్రతిపాదక వాక్యముల ముఖ్యార్థమును స్వీకరించకుండా ఉన్నట్లయితే, బ్రహ్మ అస్తిత్వమును తెలుసుకోలేము ఇంక, దాని కూటస్థత్వము ఎలా తెలుసుకోగలము; తెలుసుకోజాలము. ప్రత్యక్ష కార్యముతోనే అప్రత్యక్ష బ్రహ్మమును తెలుసుకోగలము. ఈ ప్రకారము శాస్త్రముద్వారా తెలుసుకున్న బ్రహ్మలో, జగత్కారణత్వము యొక్క అధ్యారోపము అవశ్యము ఉంటుంది. అదే శాస్త్రము కార్యకారణ అనన్యత్వముతో దానిని అపవాదము చేసి అవ్యవహార్య బ్రహ్మను బోధించి, దానితో ఆత్మ ఏకత్వమును తెలియజేసి, జీవునికి సంసారవిచ్ఛేదమును చేస్తున్నది.

6) పైన చెప్పిన విశ్లేషణము ఆధారముతో 'అవిద్యాకల్పిత' మనే పదమునకు నిశ్చితమైన అర్థము భాష్యముననుసరించి ఇలా వున్నది- 'నామరూపాత్మక' జగత్తుయొక్క వివేచనతో మనము ఏమి తెలుసుకున్నామనగా, జగత్తు స్వరూపము బ్రహ్మమే. ఈ జ్ఞానమే విద్య. ఈ విద్యకు ముందు కూడా వస్తుతః బ్రహ్మకంటె అభిన్నమయిన నామరూపములు మన దృష్టిలో అబ్రహ్మ అయివున్నవి. అనగా, అవిద్యా కాలములో మనకు తెలిసే నామరూపములు అవిద్యా కల్పితములు. అంటే, మన అవిద్య వాటికి ఉపాదాన కారణము - నిమిత్తకారణము అని అర్థము కాదు. అలా అయితే, నామరూపములు మన ఇష్టము వచ్చినట్లు ఎప్పుడో తయారుచేయబడేవి. 'అవిద్యా కల్పితము' అంటే అర్థము - బ్రహ్మతో భిన్నములుగా తెలియబడుతున్నవని. వానికి అపవాదము చేసినట్లయితే, జ్ఞానముతో వాటి కల్పిత అబ్రహ్మత్వము పోతుంది. అప్పుడు వాటి బ్రహ్మత్వము తెలియబడుతుంది. **అజ్ఞానులకు అబ్రహ్మగా కనపడే ఈ ప్రత్యక్ష జగత్తు అమృత రూపమైన బ్రహ్మ మాత్రమే. అబ్రహ్మ ప్రత్యయము త్రాడులో వున్న సర్పప్రత్యయము వలె పూర్తిగా అవిద్య మాత్రమే.** -"బ్రహ్మైవ ఉక్తలక్షణం ఇదం యత్ పురస్తాత్ అగ్రే అబ్రహ్మ ఇవ అవిద్యాదృష్టీనాం ప్రత్యవభాసమానం.... బ్రహ్మైవేదం విశ్వం సమస్తం... అబ్రహ్మ ప్రత్యయః సర్వః అవిద్యా మాత్రః రజ్జ్వామివ సర్ప ప్రత్యయః॥" (ముం॥ భా॥ 2-1-12) ఎలాగయితే పరస్త్రీరూపములో చూచిన శకుంతలను, తరువాతే దుష్యంతుడు ధర్మపత్నిగా చూచాడు. ఇక్కడ పరివర్తనము శకుంతలలో కాదు, శకుంతల విషయంలో దుష్యంతుని దృష్టిలో వున్నది. ఇదే విధముగా, విద్య తెలిశాక కూడా నామరూపములు అలాగే వుంటాయి. ఎక్కడికీ పోవు. వాటి విషయములో మన దృష్టికోణము మారుతుంది. అవి మొదట 'అబ్రహ్మ'గా కనిపిస్తాయి. తరువాత 'బ్రహ్మ'గా కనిపిస్తాయి. (అధ్యా.12-15(1)) చూడండి. ఉదా: సంన్యాస కారణముగా పత్ని, బావ, మరదలు, అత్త, మామ, కోడలు మొదలైన సంబంధములు అన్నీ పోతాయి. కాని వారిలో ఎవరూ మరణించలేదు.

12-16) జగత్కారణము మాయా? లేక అవిద్యా?

1) 6 నుండి 10 వరకున అధ్యాయములలో ప్రధానముగా ఈ రెండు మాటలు నిశ్చయమయాయి.

జగత్తు సృష్టి, స్థితి, లయములు మాయా కార్యములు.

నిర్గుణ బ్రహ్మలో జగద్వ్యవహారము అవిద్య - అధ్యారోపితము.

ఇక్కడ మొదటి విచారము నుండి రెండవ విచారము వరకు వచ్చే దారి "కత్తివాదర మీద నడచినట్లు" (కత్తి అంచు మీద నడచినట్లు) ఉన్నది. ఈ సూక్ష్మవిషయమును గ్రహించడము దుష్కరము. అందువల్ల మళ్ళీ 'అధ్యారోపము-అపవాదము' శీర్షికవున్న అనుచ్ఛేదమును అధ్యయనము చేయండి.

(అధ్యా॥10-3). దాని తరువాత, కొన్ని సందేహములు ఉత్పన్నము అవుతాయి. జగత్తు మాయా కార్యమా, ఇది అవిద్యా కార్యమా? ఈ రెండు విధములుగా చెప్పిన వాటిలో ఏది యథార్థము? ఒకటి సరిగ్గా వుంటే, రెండవది చెప్పే అవసరమేమి? ఒకవేళ రెండూ సరియైనవే అయితే, మాయ-అవిద్య సమానార్థకములా? ఈ సందేహములు వస్తాయి. అధ్యారోప - అపవాద క్రమము చక్కగా అవగాహనకు వస్తే, సందేహములకు అవకాశము లేనే లేదు. సందేహాత్మక చర్చలతో ముముక్షువు దిగ్భ్రాంతుడు అవుతాడు. అందువల్ల సిద్ధాంతము యొక్క ధ్రువీకరణము అవసరము. దీనిని తిరిగి విచారము చేయడము సమంజసము.

2) వైష్ణవీ మాయ జగత్తుకు ఉపాదానము, అవిద్య కాదు. అవిద్యాయుక్త జీవుల కర్మభోగము కోసము, బ్రహ్మ తన మాయాశక్తితో జగత్తును సృష్టించింది. జీవులు అసంఖ్యాకులు కావడము వల్ల, ఒకని అవిద్య పోయి, అతనికి పునర్జన్మ లేకపోయినా, ఇతర జీవుల కొరకు అనాది కాలము నుంచి అనంతకాలము వరకు ఈశ్వరుడు సృష్టిస్థితిలయ కార్యమును చేస్తూనే వుంటాడు. ఇటువంటి ఆశ్చర్యకరమైన జగత్తు అవిద్యవల్ల ఉత్పన్నము అవలేదు-దీనికి కారణము క్రింద వ్రాయబడినది:

అ. అందరు జీవులకు జగత్తు తమ సృష్టి కాదని బాగా తెలుసు (అధ్యా॥7-3).

ఆ. ప్రతియొక్క జీవి అవిద్య విభిన్నముగా ఉంటుంది. ఇన్ని అవిద్యల సమాహారముతో ఒకే జగత్తు ఎలా సృష్టింపబడుతున్నది?

ఇ. అవిద్యల సమాహారము లేకుండా, జీవులందరూ తమ తమ అవిద్యలతో తమ తమ జగత్తులను సృష్టించుకుంటే, ఎప్పుడూ ఘోరమైన సంఘర్షణ జరుగుతూనే వుండేది. అప్పుడు ఒక దయామయుడైన జీవుడు దుఃఖమయమైన ఈ సంసారము ఉండరాదని జగల్లయమును కల్పించవచ్చు. ఇంకొక వ్యసనపరుడైన జీవుడు ముక్తులకు కూడా జన్మను కల్పించవచ్చు. ఇలా కల్పనకు అంతమే ఉండదు. (సూ॥భా॥ 2-2-17).

ఈ. ఒక వేళ జీవుడు సృష్టి సామర్థ్యము ఉన్నవాడయితే, దుఃఖ కారణములను అన్నిటినీ తీసివేసి, సుఖప్రదముగానే సృష్టి చేసేవాడు. అప్పుడు సంసారమును తరించాలని గానీ, అవిద్యా నివృత్తి చేయాలని గానీ ఎవరికీ ఇచ్ఛ పుట్టదు.

ఉ. రాగాది క్లేశములతో కూడిన అధ్యాస యొక్క సహాయము లేకుండా దుఃఖ జనకము కాని క్షుద్రమూ అభావరూపమూ అయిన అవిద్య, ఆశ్చర్యమయమైన భావరూపము గల జగత్తుకు కారణము కాజాలదు.

ఊ. పూజ్యులైన బాదరాయణులు, బ్రహ్మ సూత్రములు మొదలైన కృతులు వ్రాసి ఏ విధముగా ధర్మప్రచారము చేశారో, ఆ విధముగా అవిద్యారహితులైన అందరు జ్ఞానులూ తమ ప్రారబ్ధములను అనుసరించి జగద్వ్యవహారమును చేస్తూ వుంటారు. ఈ ప్రకారము అనేక కారణములవల్ల జగత్తు మాయా కార్యమేనని చెప్పాలి. అవిద్యాకార్యమని ఎప్పుడూ చెప్పకూడదు.

12-17) బ్రహ్మ జ్ఞాని యొక్క దృష్టి విద్యకు దృష్టాంతము :

వస్తుతః జగత్తు అవిద్యా కల్పితము కాదు. అయితే, భాష్యములో అక్కడక్కడ జగత్తును అవిద్యా కల్పితమని ఎందుకు అన్నారు? దీనికి అర్థమును పైన అనుచ్ఛేదములో చెప్పాము. ఎవరికైనా అవిద్య వుంటే వుండనీ, లేకపోతే పోనీ - సృష్టికాలములో లేక ప్రళయ కాలములో కూడా జగత్తు బ్రహ్మ కంటె

అనన్యమే. (అధ్యా॥ 6-5). ఎవరిలో అవిద్య వుందో, వారికి అది వేఱుగా కనబడుతుంది; ఎవరిలో విద్య ఉంటుందో, వారికి అనన్యముగానే కనబడుతుంది. ఎప్పుడు పరమార్థ దృష్టితో నామరూపములు బ్రహ్మ కంటే వేఱవునా, కాదా, అని విచారము చేయడము జరుగుతుందో, అప్పుడు బ్రహ్మ కంటె వేఱుకాదని నిశ్చయమవుతుంది. "నేహ నానాస్తి కించన।" ఇక్కడ నానాత్వము కొంచెము కూడా లేదు - అనే శ్రుతితో అవిరోధము వస్తుంది. స్వాభావికముగా, ఎప్పుడైతే నామ రూపోపాధి దృష్టి కలుగుతుందో, అప్పుడే వస్త్వంతరాస్తిత్వముతో వ్యవహారము అంతా వుంటుంది - "యదా తు పరమార్థ దృష్ట్యా అన్యత్వేన నిరూప్యమాణే నామరూపే వస్త్వంతరే తత్త్వతో న స్తః తదా తదపేక్ష్య నేహ నానాస్తి కిఞ్చన ఇత్యాది పరమార్థ తత్త్వగోచరం ప్రతిపద్యతే । యదా తు స్వాభావిక్యా అవిద్యయా.... నామరూపోపాధి దృష్టిరేవ చ భవతి స్వాభావికీ తదా సర్వోఽయం వస్త్వంతరాస్తిత్వ వ్యవహారః।" (బృ॥భా॥ 3-5-1). ఇలా, అనన్యముగా చూచిన తరువాత కేవల నిర్గుణ బ్రహ్మమే మిగులుతున్నది. అవిద్యచేత జగదుత్పత్తి జరుగదు. కాని జగత్తుయొక్క అయథార్థ జ్ఞానము కలుగుతుంది. విద్యచేత జగత్తు నష్టముకాదు. కాని జగత్తుయొక్క అయథార్థ జ్ఞానము నివృత్తమవుతుంది. విద్యతో కూడా జగత్తు పుట్టదు, నివృత్తమూ కాదు - "న తు పారమార్థికం వస్తు కర్తుం నివర్తయితుం వా అర్హతి బ్రహ్మవిద్యా" (బృ॥భా॥ 1-4-10). ఇక అవిద్యవల్ల పుడుతుందా? ఈ విధముగా జగత్తు అవిద్యవల్ల ఉత్పన్నము కాలేదు - నష్టమూ కాలేదు. ఇలా అయితే, మరి దానిని అవిద్యా కల్పితమని ఎందుకు అన్నారు? అని ప్రశ్నించవచ్చు. అవిద్యావంతుడు, జగత్తును స్వతంత్రమని భావిస్తాడు. ఆ స్వతంత్రమైన జగత్తు అవిద్యాకల్పితమే. అందువల్ల, వారి తెలివినే ఆధారముగా తీసుకుని, విద్యోపదేశమును ఆరంభము చేశారు. ఈ క్రమముతో జగత్తును మాయాకార్యమని చెప్పారు. ముందుకు వెళ్ళాక అది బ్రహ్మతో అభిన్నమని చెప్పారు. విద్యాప్రాప్తి పొందిన తరువాత స్వతంత్ర జగత్తు నివృత్తి అయింది. అప్పుడు, పూర్వము తెలుసుకున్న జగత్తును అవిద్యా కల్పితమని చెప్పి దాన్ని నిరాకరించారు.

1. దీనికి దృష్టాంతము : ద్విచంద్ర జ్ఞానము: ఎవరి కంటిలో దోషము వుంటుందో వారికి చంద్రుడు రెండుగా కనపడతాడు. కళ్ళు సరిగ్గా అయిన తరువాత కల్పితచంద్రుడు ఉండడు. కేవలము సత్యమైన చంద్రుడే వుంటాడు. ఇప్పుడు ఒక చంద్రునితోనే వానికి వ్యవహారము జరుగుతుంది. (అజ్ఞానికి రెండు జగత్తులు ఉంటాయి. ఒకటి అవిద్యా కల్పితము - రెండవది శాస్త్రము చెప్పినది. విద్యాప్రాప్తి తరువాత, అవిద్యా కల్పిత స్వతంత్ర జగత్తు వుండదు. శాస్త్రము ద్వారా చెప్పబడిన జగత్తు మాత్రమే అనుభవమునకు వస్తుంది. అప్పుడు బ్రహ్మాభిన్న జగత్తుతోనే జ్ఞానికి వ్యవహారము జరుగుతుంది).

2. రెండవ దృష్టాంతము, శుక్తి-రజతము. అజ్ఞానముచేత శుక్తి రజతమువలె కనపడుతుంది. దానిని పరీక్షించిన తరువాత శుక్తి అని తెలుస్తుంది. దానితో, కల్పించబడిన రజతము పోతుంది. కేవలము శుక్తి వ్యవహారమే మిగులుతుంది. (అవిద్యవల్ల బ్రహ్మానన్య రూపమైన జగత్తు స్వతంత్రముగా కనపడుతుంది. శాస్త్ర అధ్యయనము తరువాత, జగత్తు బ్రహ్మానన్యమని తెలుస్తుంది. ఇప్పుడు అవిద్యా కల్పిత స్వతంత్ర జగత్తు నివృత్తమవుతుంది. జ్ఞానికి కేవలము బ్రహ్మానన్యమయిన జగత్తుతో వ్యవహారము మిగిలివుంటుంది.)

"జ్ఞానికి కేవలము బ్రహానన్యజగత్తుతో వ్యవహారము" అనే వాక్యము కేవలము ఇతరుల దృష్టితో చెప్పినది. బ్రహ్మాత్మైకత్వమును పొందిన జ్ఞానికి ఇక వ్యవహారము ఏమీ ఉండదు.

శాస్త్రములో చంద్రద్వయము, శుక్తి-రజతము, రజ్జు-సర్పము-ఇటువంటి దృష్టాంతములు వుంటాయి. **నామరూపాత్మక జగత్తును బ్రహ్మకంటే భిన్నముగా, అవిద్యచే తెలుసుకునే జీవుల కల్పన దూరము**

చేయడము కోసము ఈ దృష్టాంతములను చెప్పారు. కార్య-కారణ భావముతో నామరూపముల స్వరూపమును నిశ్చయము చేయడానికి ఈ దృష్టాంతములను చెప్పలేదు. ఇది జ్ఞప్తిలో ఉంచుకోవాలి. రజ్జు-సర్ప దృష్టాంతములో సర్పము వాస్తవములో లేదు-అలాగే, దార్ష్టాంతికములో నామరూపములు కూడా వాస్తవముగా లేవు అని చెప్పడము సరియైన విధము కాదు. ఈ విషయము మొదటే నిశ్చితము అయింది. (అధ్యా॥10-3). మృద్-ఘటములలో వున్నట్లు, రజ్జు-సర్పములలో కార్య-కారణ సంబంధము లేదు. ఒక వస్తువు, ఇంకొక వస్తువుగా కనబడినట్లు అన్యథా జ్ఞానము (భ్రమ) మాత్రమే ఉన్నది. కాని, ఇంత సరళమైన విషయమును కూడా ఒప్పుకోక ఒక చతురుడు ఇలా అనవచ్చు. 'దృష్టాంతములో కూడా కార్యకారణ సంబంధము ఉన్నది. సర్పము రజ్జువు నుండే వచ్చింది, రజ్జువులోనే వుంటుంది, రజ్జువులోనే లయమవుతుంది. అందువల్ల, రజ్జువే సర్పమునకు ఉపాదానము.' 'అయితే, సర్పమునకు రజ్జువు నిమిత్తకారణము ఏమిటి?' అని అతనిని అడగాలి. జడముగనుక రజ్జువు నిమిత్తకారణము కాదు. కాని, దార్ష్టాంతికములో బ్రహ్మ, జగత్తుకు అభిన్న నిమిత్తోపాదాన కారణము. అందువల్ల, భ్రాంతి విషయమైన సర్పమునకు అభిన్న నిమిత్తోపాదాన కారణము అనేది భ్రాంతుని బుద్ధిమాత్రమే. అంధకారము సహకారి కారణము. ఈ దృష్టాంతములలో కూడా, కార్యకారణ సంబంధము వుందని అనడము, తర్కాభాసము మాత్రమే.

12-18 "అవిద్యా లక్షణాప్రకృతి" :

శాస్త్రములో కొన్ని చోట్ల ప్రకృతిని అవిద్యాలక్షణ ప్రకృతి అని చెప్పారు. ఇక్కడ ఈ విశేషణము యొక్క అర్థమును నిశ్చయము చేస్తున్నాము. జీవుడు, దేహమును ఆత్మ అనుకుంటున్నాడు. నిజానికి అది దేహముకంటె వేఱుగా అకర్తగా వున్నది. అలా అయితే, శరీరము ద్వారా కర్మ ఎలా జరుగుతోంది? దీనికి పూజ్యులైన భాష్యకారులు ఇలా చెప్తున్నారు : స్వోభావః స్వభావః అవిద్యా లక్షణా ప్రకృతిః మాయా ప్రవర్తతే దైవీ హి ఇత్యాదినా వక్ష్యమాణా - స్వభావమువలన జరుగుతున్నది. స్వభావమంటే "దైవీ హ్యేషా" అనే శ్లోకములో చెప్పబడే అవిద్యాలక్షణ ప్రకృతి. (గీ॥భా॥5-14). పంచతన్మాత్రలు, మనస్సు, బుద్ధి, అహంకారము అనే శబ్దములతో చెప్పబడే అష్టవిధమైన 'అపరాప్రకృతి' ఒకటి, పరాప్రకృతి రెండవది. అహంకారము సృష్టికార్యమునకు ఆవశ్యకమైన ఈశ్వర ప్రవృత్తికి జనకమైనది. పూజ్యులైన భాష్యకారులు అవిద్యాసహిత అవ్యక్తమని దీనిని వ్యాఖ్యానించారు. ఎలాగైతే విషయుక్తమైన అన్నమును విషము అని అంటారో, అలాగే, అహంకార సంయుక్త అవ్యక్తమును అహంకారమని అంటారు. - "అహంకారః ఇతి అవిద్యా సంయుక్తమ్ అవ్యక్తమ్। యథా విషసంయుక్తమ్ అన్నం విషమ్ ఇత్యుచ్యతే, ఏవం అహంకార వాసనావత్ అవ్యక్తమ్ అహంకార ఇత్యుచ్యతే।" (గీ॥ 7-4). దీని పూర్తి చర్చ (అధ్యా॥ 8-7) లో వున్నది. అందువల్ల అవిద్యా లక్షణ ప్రకృతి ఈశ్వరుని ప్రవృత్తికి ఇక్కడ కారణము. అక్కడ జీవుని ప్రవృత్తికి కూడా ఇదే అహంకారమే కారణము. ఇక్కడ నామరూపాదులు ఈశ్వరకర్మ, అక్కడ ఘట ప్రాసాదాదులు జీవుని కర్మ. ఈ విధముగా అవిద్యా లక్షణ ప్రకృతి ఇద్దరి ప్రవృత్తికీ కారణము.

భగవంతుడు ఇది కూడా చెప్పాడు - ప్రకృతి గుణములతో అన్ని కర్మలు జరుగతున్నప్పటికీ, అహంకారముతో మూఢులైనవారు తామే కర్తలమని అనుకుంటారు - "ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః, అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే।" (గీ॥3-27). దీనివల్ల తెలుస్తున్నదేమనగా, జీవునిలో గాని ఈశ్వరునిలో గాని ఉన్న కర్మసామర్థ్యము ప్రకృతిదే అవుతుంది. జీవునిలో కనపడే అహంకారము

అతని అవిద్యవల్ల పుట్టినదే. ఇప్పుడు ఒక ప్రశ్న – 'ఈశ్వరునిలో కనపడే అహంకారము, ఈశ్వరుని అవిద్య అవదా?' ఇలా చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే, ఈశ్వరుడు సదా అవిద్యారహితుడు – "ఈశ్వరస్య నిత్యనివృత్తా విద్యత్వాత్।" (సూ॥భా॥3-2-9). నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావుడైన ఈశ్వరుని జ్ఞానశక్తికి ఆవరణము లేదు –"నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావత్వాత్ అనావరణః జ్ఞానశక్తిః।" (గీ॥భా॥4-5). అనగా ఈశ్వరుని అహంకారముగా ఉన్న అవిద్యా సంయుక్త అవ్యక్తములో ఉండే అవిద్య, జీవునిదే. ఈ విధముగా, జీవుని ప్రవృత్తికి అతని అవిద్య కారణము–ఈశ్వరుని ద్వారా జరిగే సృష్టికార్యమునకు ప్రవృత్తి కారణము కూడా అదే. ఈశ్వరుని ద్వారా చేయబడిన నామరూప వ్యాకరణమునూ, జీవుని కర్తృత్వమునూ చెప్పే సమయములో, భాష్యకారులు అవిద్యా లక్షణ ప్రకృతినే చెప్పారు. "భూతగ్రామ బీజభూతాత్ అవిద్యా లక్షణాత్ అవ్యక్తాత్।" (గీ॥భా॥4-20) – ప్రాణుల బీజభూత అవిద్యాలక్షణ అవ్యక్తము. "అవిద్యా లక్షణాం ప్రకృతిం అవష్టభ్య విసృజామి భూతగ్రామమ్।" – అవిద్యా లక్షణా ప్రకృతిని ఆశ్రయించి ప్రాణుల సృష్టిని చేస్తున్నాను. (గీ॥భా॥9-8). "అవిద్యా లక్షణా ప్రకృతిః సూయతే స చరాచరం।" (గీత॥9-10) – అవిద్యాలక్షణ ప్రకృతే చరాచర జగత్తును ప్రసవించింది. "అవ్యాకృతాత్ అవిద్యాలక్షణాత్ వ్యాకృత బీజాత్।" (కేన॥భా॥1-4). వ్యాకృత బీజమైన అవిద్యాలక్షణ అవ్యాకృతము కన్న (బ్రహ్మ వేఱు). ఇవన్నీ, ఈశ్వర సృష్టి విషయమును చెప్తున్నాయి. ప్రకృతౌ అవిద్యా లక్షణాయాం స్థితః ప్రకృతిస్థః – "అవిద్యాలక్షణ ప్రకృతిని తననుగా గుర్తించేవాడు 'ప్రకృతిస్థుడు' అనబడతాడు. "అవిద్యా లక్షణాం ప్రకృతిం నివర్తితాం విద్యయా॥" (గీ॥భా॥ 13-23) – అవిద్యా లక్షణ ప్రకృతిని విద్యతో నివారించుకొని. "భూతానాం ప్రకృతిః అవిద్యాలక్షణా అవ్యక్తాఖ్యా।" (గీ॥భా॥13-34)– అవ్యక్తమని పిలిచే భూతముల అవిద్యా లక్షణ ప్రకృతి. ఇలా జీవ సంబంధమైన ప్రకృతి చెప్పబడినది.

12-19 అవిద్యాత్మికా బీజశక్తి

య) విషయము: "మాయాం తు ప్రకృతిం విద్యాత్ మాయినం తు మహేశ్వరమ్।" (శ్వే॥4-10). "దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా।" (గీ॥7-14). ఇత్యాది వాక్యముల వల్ల మాయ ఈశ్వరీయ శక్తి అని నిశ్చయమవుతున్నది. జీవుల అవిద్యాది అనేక ప్రకారములైన సంసార బీజ దోషములు దీనిలో నిక్షిప్తమై వుంటాయి – "అవిద్యాద్యనేక సంసారబీజం అంతర్దోషవత్ మాయా।" (గీ॥భా॥12-3). బ్రహ్మకన్న భిన్నరూపములో ప్రతీయమానమవుతున్న నామరూపములను ముందు పెట్టిన జీవుని అవిద్యతో యుక్త మాయయొక్క ఆవేశమునకు వశుడై, ప్రవృత్తి రహితుడైన ఈశ్వరుడు సృష్టికార్యములో ప్రవృత్తుడవుతున్నాడు. "ప్రవృత్తిరహితోఽపి ఈశ్వరః సర్వం ప్రవర్తయేత్.....అవిద్యా ప్రత్యుపస్థాపిత నామరూప మాయావేశవశేన।" (సూ॥భా॥ 2-2-2). ప్రవర్తకము అహంకారమనే అవిద్యా సంయుక్త అవ్యక్తము – "అహంకారః ఇతి అవిద్యా సంయుక్తం అవ్యక్తం ప్రవర్తకత్వాత్ అహంకారస్య।" (గీ॥భా॥7-4). ఈ విధముగా, మాయా–అవిద్యలు సర్వదా అవినాభావ సంబంధముతో జగత్కారణముగా ఉన్నవి. ప్రకృతిలో ఉన్న అవిద్యయే, జీవుల సంసారమునకు కారణము – "ప్రకృతిస్థత్వాఖ్యా అవిద్యా సంసారస్య కారణం।" (గీ॥భా॥ 13-21) ప్రకృతితో అవిద్యారూప సంయోగమే సంసార కారణము – "ప్రకృత్యా అవిద్యా రూపః సంయోగః సంసారః।" (గీ॥భా॥13-20). మళ్ళీ మళ్ళీ, ఉదాహరిస్తున్న ఈ వాక్యములతో మాయ – అవిద్య ఏవిధంగానూ పర్యాయపదములు కావు అని స్పష్టమవుతుంది. కాని, కొంతమంది ఇవి పర్యాయపదములని అంటున్నారు. ఇందువల్ల, 'స్థూణానిఖనన న్యాయ'మునుబట్టి, ఆనుమానిక అధికరణము ఆధారముతో దీని విచారణ మరొకసారి చేస్తాము.

ర) 'అవ్యక్త' శబ్దమునకు మొదటి అర్థము

శరీరము ఇంద్రియములు మనస్సుతో కలిసి, జీవుడు భోక్త అయి, విషయములలో నిమగ్నుడు అవుతున్నాడు. అతనిని అక్కడ నుండి నివృత్తుడిని చేసి, పరమపురుషునితో అతని ఏకత్వమును బోధచేయడానికి కఠశ్రుతి ఒక రూపకమును యిచ్చింది. ఈ ఆత్మ రథికుడు, శరీరము రథము, బుద్ధి సారథి, మనస్సు కళ్ళెము, ఇంద్రియములు గుర్రములు, విషయములు ఇంద్రియ గోచరములు.

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు, బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ।
ఇంద్రియాణి హయానాహుః విషయాంస్తేషు గోచరాన్, ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః॥
(కఠ॥ 1-3, 3-4)

ఇందువల్ల వివేకముతో ఇంద్రియ నిగ్రహముతో, ఈ రథికుడు, ఆ పరమపురుషునితో అభేదమును పొందాలి. దీనికి శ్రుతి సాధనా మార్గమును చూపిస్తున్నది. ఈ సాధనామార్గములో ఇంద్రియముల కన్న ఇంద్రియార్థములు శ్రేష్ఠమైనవి. ఎందుకంటే శ్రుతి, ఇంద్రియములను గ్రహములు అని - ఇంద్రియార్థములను అతిగ్రహములని చెప్తున్నది. ఈ అర్థముల కంటే మనస్సు, మనస్సు కంటె బుద్ధి, బుద్ధికంటె మహాన్ ఆత్మ, వానికంటె అవ్యక్తము, అవ్యక్తము కన్న పురుషుడు - పరమై వున్నారు. అనగా సూక్ష్మతరములైన తత్త్వములుగా ఉన్నారు. పరమపురుషుడు సూక్ష్మతమముడు, అతనికంటె పరము ఏదీ లేదు.

"ఇంద్రియేభ్యః పరాహ్యర్థా, అర్థేభ్యశ్చ పరం మనః, మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః।
మహతః పరమవ్యక్తమ్ అవ్యక్తాత్పురుషః పరః, పురుషాన్నపరం కిఞ్చిత్ సా కాష్ఠా సా పరాగతిః।
(కఠ॥1-3, 10-11),

అందువల్ల ముముక్షువు, తనను ఒక్కొక్క మెట్టుమీద సూక్ష్మతర తత్త్వములో ఉపసంహారము చేస్తూ, ఆఖరున సూక్షతమమైన పరమ పురుషునితో ఏకత్వమును పొందవలెను.

పైన చెప్పిన రూపకమునకు - సాధనామార్గమునకు చాలా సామ్యము ఉన్నది. రెండింటిలో ఇంద్రియములు, ఇంద్రియార్థములు, మనసు, బుద్ధి సమానముగా వున్నవి. రూపకములో రథికుడైన ఆత్మే సాధనా మార్గములోని మహాన్ ఆత్మ. ఇక రూపకములో శరీరము - సాధనా మార్గములో అవ్యక్తము, మాత్రము మిగిలిపోయాయి. అవ్యక్త స్థానములో శరీరమును ఉంచినట్లయితే, సామ్యము పూర్తి అవుతున్నది. ఇక్కడ, భాష్యకారులు 'అవ్యక్త' శబ్దమును ఏది వ్యక్తము కాదో, అనే యౌగికార్థములో - అనగా, పదము యొక్క అవయవముల శక్తితో వచ్చే అర్థములో ప్రయోగము చేసి రెండు అర్థములను యిస్తున్నారు. మహాన్ ఆత్మ భోక్త జీవుడు అయినప్పుడు ఒక అర్థమును, అతడు హిరణ్యగర్భుడు అయినప్పుడు రెండవ అర్థమును చెప్తున్నారు. **మహాన్ ఆత్మ జీవుడు అనే అర్థము వస్తే, 'అవ్యక్త' స్థానములో, 'అవిద్య' పెట్టడము సార్థకము అవుతుంది.** ఎందుకంటే అదే కారణ శరీరము కనుక. 'అయితే, అవిద్య జీవుని కన్న పరము ఎలా అవుతుంది?' అవిద్యాధీనుడు అవడము వల్లనే, జీవుడు సుఖ-దుఃఖములకు భోక్త అవుతున్నాడు. అందువల్ల అవిద్య అతనికంటె పరముగానే ఉన్నది - "అవిద్యావత్త్వేనైవ జీవస్య సర్వః సంవ్యవహారః సన్తతో వర్తతే।" (సూ॥భా॥ 1-4-3). అవిద్యను విడిచిపెట్టగానే అతడు పరమపురుషునితో ఒకటైపోతాడు. ఇంద్రియార్థములతో ప్రారంభమైన ఈ రథయాత్ర, రథి అయిన జీవుడు అవిద్యను త్యజించనే - కృష్ణుడు

రథమునుండి దిగగానే రథము భస్మమైనట్టు - కారణశరీరము అనే రథము యొక్క నాశముతో సమాప్తమవుతుంది.

కాని, ఈ మొదటి అర్థముతో, కఠశ్రుతి వ్యాఖ్య కోసము పైన చెప్పిన సూత్రములను ఇచ్చిన భగవాన్ సూత్రకారుల ఉద్దేశ్యము పూర్తి కాదు. శ్రుతిలో చెప్పిన మహాన్ ఆత్మా, అవ్యక్తము, పురుష-ఈ శబ్దములకు సాంఖ్యుడు తన మహత్తత్వము, ప్రధానము, పురుషుడు అని అర్థము చేసుకుని, తన సిద్ధాంతము శ్రుతి సమ్మతముగా ఉన్నదని చెపుతాడు. ఇందువల్ల, సాంఖ్య సిద్ధాంతమును ఖండించడము కొఱకు, పూజ్యులైన సూత్రకారులు, ఏడు సూత్రముల 'ఆనుమానిక అధికరణము'ను రచించారు. సూత్రకారుల ఈ ఉద్దేశ్య సాఫల్యము కోసము భాష్యకారులు ఇలా చేశారు: రూపకము-సాధనా మార్గములలో ఉండే సామ్యముతో ముందే 'అవ్యక్త' స్థానములో 'శరీరము'ను పెట్టి అవిద్య అనే ఒక అర్థమును చెప్పారు. ఇప్పుడు అవ్యక్త శబ్దమునకు ద్వితీయార్థమును తీసుకున్నారు.

ల) 'అవ్యక్తము'నకు ద్వితీయార్థము :

'మహాన్ ఆత్మ'ను, హిరణ్యగర్భుడు అని చెప్పినప్పుడు 'అవ్యక్త' స్థానములో రూఢ్యర్థముతో ఉన్న అవ్యక్తమును, అనగా పరమేశ్వరాధీన మాయను తెలుసుకోవలసివుంటుంది. ఇది అన్ని శరీరములకు మూలకారణమైన భూత సూక్ష్మముల సమష్టి అవడము వల్ల 'శరీర' స్థానములో దీనిని ఉంచడము సార్థకమవుతుంది.

సంశయము: 'మహాన్ ఆత్మ, రథికుడుగాన మొదటి అర్థమున సాధనా మార్గములో చెప్పిన దానికి, ఆ భోక్తయైన జీవుడే రథికుడిగా ఉండడము సమంజసము. హిరణ్యగర్భుడు జీవుడు కానప్పుడు, రెండవ అర్థములో రథికుని స్థానములో అతనిని ఉంచడము ఎలా ఉచితము? సాధనామార్గములో ఇతనికి సంబంధము లేదు కదా!

సంశయము మీద ఆక్షేపము: హిరణ్యగర్భుడు జీవుడే. జన్మిస్తున్న హిరణ్యగర్భుడిని చూడండి: - "హిరణ్యగర్భం పశ్యత జాయమానమ్॥" (శ్వే॥4-92) అని శ్రుతి అతనికి జన్మను చెప్పింది. అతడు జీవుడు కాకపోతే జన్మ వుండదు. కనుక అతనిలో అవిద్య వున్నది. ఇతనికి సాధనా మార్గముతో సంబంధము ఉన్నది.

ఆక్షేప పరిహారము: అలా కాదు. జన్మ ఉన్నప్పటికీ హిరణ్యగర్భుని సమష్ట్యుపాధి బుద్ధి, అతి విశుద్ధము అవడము వల్ల అతడు ఈశ్వరుడే. జీవుల ఉపాధి అశుద్ధము అవడము వల్ల వారు సంసారులు. హిరణ్య గర్భుడు తన పాపములు అన్నిటినీ దగ్ధము చేశాడు - "సర్వాన్ పాప్మన ఔషత్॥" (బృ॥ 1-4-1). అతడు అందువల్ల ఈశ్వరుడు. ప్రారబ్ధము వల్ల సృష్టి నిర్వహణము చేస్తూ వున్నప్పటికీ అతనిలో అకర్తృత్వబుద్ధి వున్నది. ఇందువల్ల అతని విజ్ఞాన స్వరూపమును దేవతలందరూ 'జ్యేష్ఠబ్రహ్మ' అని ఉపాసిస్తూవుంటారు. ఎవడు, ఈ విజ్ఞాన స్వరూప బ్రహ్మను ఉపాసన చేసి, తిరిగి క్రిందనున్న అన్నమయాది శరీరములందు అధ్యాస చేయడో, అతడు తన పాపములన్నిటినీ ఈ శరీరములో నే వదలి, అన్ని కామములను పొందుతాడు. (తై॥ 2-4-1). ఈ ప్రకారము హిరణ్యగర్భునిలో అవిద్య లేదని తెలుస్తున్నది. అందువల్ల పైన ప్రశ్నించిన సంశయమునకు పరిహారమును చెప్పాలి.

పరిహారము : సాధనామార్గములో వెళ్ళేవాడు జీవుడే, హిరణ్యగర్భుడు కాదు. జీవుడు అడుగడుగునా సాధనామార్గములో వెళ్ళేటప్పుడు అతడు–ఇంద్రియార్థములను (విషయములను) ఇంద్రియములలో, ఇంద్రియములను మనస్సులో, మనస్సును బుద్ధిలో, ఉపసంహారము చేస్తాడు. దానికి తరువాతిదిగా హిరణ్యగర్భుని సమష్టి బుద్ధి వుంటుంది. ఈ హిరణ్యగర్భుడు ముందుగా స్వతః రథిగా ఉండి, సాధనతో ముందుకు వెళ్ళి, ఆ స్థానమును పొందాడు. అందువల్ల అతడు బోధాత్మక స్వరూపము కలవాడు – అతనిలో అవిద్య లేదు. కాని, వ్యష్టి జీవుల అవిద్య ద్వారా అతడు అబోధాత్మకుడు కూడా. అందువల్ల, హిరణ్యగర్భుడు బోధాబోధాత్మక మహాన్ ఆత్మ. (కఠ॥భా॥ 1–4–10) సాధక జీవుడు, కొంతముందుకు వెళ్ళి తన బుద్ధిని, ఈ హిరణ్యగర్భ బుద్ధిలో ఉపసంహారము చేసి, హిరణ్యగర్భునితో ఐకాత్మ్యమును పొందుతున్నాడు. అనగా, బోధాత్మకుడు అవుతున్నాడు. ఈ విధముగా, అక్కడ నుంచి ముందుకు వెళ్ళి అవ్యక్తములో, అక్కడి నుంచి కూడా ముందుకు వెళ్ళి, సూక్ష్మతమ పరమపురుషునిలో, సహజరీతిలో, ఉపసంహారమును పొందుతున్నారు.

సాంఖ్యులు : అవ్యక్తమనగా మాయే. ప్రధానముకాదు – అని ఎలా నిశ్చయమవుతుంది?

సిద్ధాంతి: ప్రధానము జడము, స్వతంత్రము. కాని, మాయ పరమేశ్వరుని అధీనము. అది సృష్టి చేయడము కొఱకు ఈశ్వరునిలో ప్రవృత్తి కలుగజేస్తున్నది.

సాంఖ్యులు : ఆప్తకాముడైన ఈశ్వరుడు సృష్టి ఎవరి కోసము చేస్తున్నాడు?

సిద్ధాంతి : జీవుల కోసము చేస్తున్నాడు. అవ్యక్తము అనే పేరుగల దాని మాయామయ మహాసుప్తిలో తమ స్వరూపమును తెలుసుకోలేక సంసారి జీవులు నిద్రపోతున్నారు. "పరమేశ్వరాశ్రయా మాయామయీ మహాసుప్తిః యస్యాం స్వరూప ప్రతిబోధరహితాః శేరతే సంసారిణో జీవాః।" (సూ॥భా॥ 1–4–3). ఇదే, అవ్యక్త నామమైన ప్రజాపతి నిద్రావస్థ – ఇందులోనే ప్రజలు జన్మిస్తున్నారు. "అవ్యక్తం ప్రజాపతేః స్వాపావస్థా। తస్మాత్ సర్వాః ప్రజాః ప్రభవన్తి (గీ॥భా॥8–18). ఈ భూతగ్రామ బీజమునే భాష్యకారులు అవిద్యాలక్షణ ప్రకృతి నామముతో పిలిచారు – "భూతాగ్రామ బీజ భూతాత్ అవిద్యా లక్షణాత్ అవ్యక్తాత్।" (గీ॥భా॥8–20)

సాంఖ్యులు : జీవుల కోసమే ఈ సృష్టి జరిగిందని ఎలా నిశ్చయము?

సిద్ధాంతి : ఈ బీజశక్తి అవిద్యాత్మిక – "అవిద్యాత్మికా హి బీజశక్తిః అవ్యక్త శబ్ద నిర్దేశ్యా।" జీవుల అవిద్యాది అనేక ప్రకారముల సంసార బీజ దోషములను తనలో వుంచుకుని, ఈ మాయ అవ్యాకృతాద్యనేక విధ శబ్దములతో పిలువబడుతున్నది – "అవిద్యాద్యనేక సంసార బీజ అన్తర్దోషవత్ మాయా అవ్యాకృతాది శబ్దవాచ్యా" (గీ॥భా॥12–3). ఈ జీవులకు, తమ కర్మ ఫలభోగము కోసము, ఈశ్వర రచితమైన శరీరమును ఆధారముగా చేసుకోవలసి వస్తుంది. కొంతమంది సంతత అభ్యాసమువల్ల, పరమాత్మ రూప జ్ఞానామృతమును పొందిన, సామర్థ్యముతో శరీరోత్పత్తికి బీజమైన అవిద్యను నశింపజేస్తున్నారు. వామదేవ ఋషి ఈ విధముగా ముక్తుడు అయ్యాడు – "సః వామదేవ ఋషిః.... ఆత్మానం విద్వాన్.... శరీర ప్రబన్ధస్య పరమాత్మ జ్ఞానామృత ఉపయోగజనిత వీర్యకృత భేదాత్ శరీరోత్పత్తి బీజావిద్యాది నిమిత్త ఉపమర్దహేతోః శరీర వినాశాత్... అమృతః సమభవత్।" (ఐ॥భా॥2–1–6). ఈ విధంగా, విద్యచేత అవిద్యా కామకర్మ బీజము దగ్ధమవడము వల్లనే ముక్తులకు పునర్జన్మ లేకుండా పోతుంది – "ముక్తానాం చ పునః అనుత్పత్తిః విద్యయా తస్యా

బీజశక్తేర్దాహాత్।" (సూ॥భా॥1-4-3). అముక్త జీవులు తమ కామకర్మబీజములతో అవ్యక్తములోనే ఉంటారు. జడమైన ప్రధానము, అముక్తులు-ముక్తులు, వీరిని విడివిడిగా తెలుసుకుని, అముక్తులకు శరీరము యిచ్చి, ముక్తులకు యివ్వకుండా-వివేకముతో కార్యనిర్ణయము చేయజాలదు. అందువల్ల, ఈశ్వరీయ మాయ మాత్రమే జగత్కారణము; ప్రధానము కాదు.

వ) అవిద్యా - 'మాయా' శబ్దాలు, పర్యాయములంటే దోషము :

ప్రశ్న: ఇక్కడ పైన చెప్పిన "అవిద్యాత్మికా హి బీజశక్తిః అవ్యక్త శబ్ద నిర్దేశ్యా।" అన్నదానిలో 'ఆత్మ' శబ్దము, మాయా - అవిద్యల అభేదమునే సూచిస్తున్నది. ఇంతేకాదు, 'తస్యా అన్యా అసంభూతిః ప్రకృతిః కారణమ్ అవిద్యా అవ్యాకృతాఖ్యా।" (ఈశా॥భా।12) - సంభూతికి అర్థము కార్యము. దానికంటె భిన్నమైనది అసంభూతి అనగా ప్రకృతి, కారణము, అవిద్య, అవ్యాకృతము. ఇలా చెప్పి, భాష్యకారులు అవిద్యను, ప్రకృతికి పర్యాయరూపముగా ప్రయోగము చేశారు. కాని, ఇప్పటివరకు వాటి సంయోగ సంబంధమునే చెప్పారు. ఇది ఎలా అవుతుంది?

సమాధానము: ఆత్మ శబ్దమునకు తాదాత్మ్య (అభేద)మను అర్థము సర్వత్ర స్వీకారము చేయడానికి వీలులేదు. ఉదా: 'రేఖాత్మక అక్షరము' అనేటప్పుడు రేఖ - అక్షరము ఈ రెండింటి అభేదము అని అర్థము కాదు. రేఖ చక్షుర్గ్రాహ్యము - అక్షరము శ్రోత్రగ్రాహ్యము. ఆత్మశబ్ద ప్రయోగమువల్ల అవిద్యాత్మికా పదమును అవిద్యా స్వరూప అర్థముతో తీసికొని మాయా- అవిద్యలలో అభేద సంబంధమును స్వీకరించడము వల్ల చాలా దోషములు వస్తాయి. 1) విద్యచే మాయారూప బీజశక్తి దగ్ధమవడము వల్ల ముక్తులకు పునర్జన్మ వుండదు. ముక్తుడైన వాడు ఈ జగద్బీజమును దగ్ధము చేసివేశాడు. ఇక, జగత్తు ఉండడానికి వీలులేదు. - "ఏకేన చ ఆదిముక్తేన పృథివ్యాది ప్రవిలయః కృతః ఇతి ఇదానీం పృథివ్యాది శూన్యం జగత్ అభవిష్యత్।" (సూ॥భా॥3-2-29). కాని, జగత్తువున్నది. 2) సృష్టికి పూర్వము ఉన్న ఈశ్వరుని ఈక్షణ విషయమైన ఈ జగద్బీజము దగ్ధమైనట్లయితే, రాబోయే సృష్టికి పూర్వం ఉన్న ఈశ్వరుని ప్రత్యక్షజ్ఞానము మిథ్యాజ్ఞానము అవుతుంది. - " అసంశ్చేద్ భవిష్యద్ఘటః ఐశ్వరం భవిష్యద్ఘట విషయం ప్రత్యక్షజ్ఞానం మిథ్యా స్యాత్।" (బృ॥భా॥1-2-1). 3) క్షేత్రనామకమైన శరీరము, అవ్యక్తమూలముతో పుట్టింది. ఇది ప్రాణుల కర్మ ఫలములకు ఆశ్రయము. - "అయం హి (శరీరమ్) అవ్యక్తమూల ప్రభవః క్షేత్ర సంజ్ఞకః సర్వప్రాణి కర్మఫలాశ్రయః।" (ముం॥భా॥3-1-1). ఒకని విద్యవలన అవ్యక్తమే నష్టమయితే, అన్ని ప్రాణుల శరీరముల బీజములు ఒకేసారి నష్టమవుతాయి. అందరూ ఒకేసారి ముక్తులవుతారు. కాని, ఇలా కావడములేదు. 4) ఈ ప్రకృతితో కలసి వుండడమే ఈశ్వరుని ఈశ్వరత్వము - "ప్రకృతి ద్వయమత్త్వమేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వమ్।" (గీ॥భా॥13-19). ప్రకృతి నష్టమయితే ఈశ్వరుని ఈశ్వరత్వము కూడా నష్టమవుతుంది. కాని, ఈశ్వరుడు ఎప్పుడూ ఈశ్వరుడుగానే వుంటాడు - "నిత్యేశ్వరత్వాత్ ఈశ్వరస్య।" (గీ॥భా॥13-19). 5) అవిద్యా ప్రకృతుల అభేదమును స్వీకరిస్తే, జీవ - ఈశ్వరులలో అభేదమే వుంటుంది. ఇలా అయితే, కఠ శ్రుతిలో చెప్పిన సాదనామార్గమే నిరర్థకము అవుతుంది.

ప్రశ్న: అయితే, భాష్యకారులు ఈశావాస్య మంత్రము 12 యొక్క భాష్యములో అవిద్యా పదమును ప్రకృతికి పర్యాయ రూపములో ఎలా వినియోగించారు?

సమాధానము: దాని మొదటి మంత్రములో 'అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే।" (ఈశా॥11) - అవిద్యతో మృత్యువును తరించి, విద్యతో అమృతమును పొందుతున్నాడు అని

ఉన్నది. ఇక్కడ అవిద్యకు అర్థము కర్మ, విద్యకు అర్థము ఉపాసన. అందువల్ల, దీని తరువాతి మంత్రమునకు భాష్యవాక్యములో, అవిద్యాపదమునకు ప్రకృతి అని అర్థము చెప్పడానికి అవకాశము లేదు. అయితే, ఏ అర్థములో చెప్పారు? ఇతరత్ర – "అవిద్యాద్యనేక సంసారబీజమ్ అన్తర్దోషవత్ మాయా।" (గీ॥భా॥ 12-3) – అవిద్యాద్యనేక సంసార బీజదోషములను తనలో వుంచుకున్న మాయ, అని భాష్యము చెప్పింది. దీనితో సమన్వయము చేసుకుంటే అర్థము స్పష్టమవుతుంది. విషయుక్త అన్నమును విషము అన్నట్లే, అవిద్యా దోషయుక్త మాయను అవిద్య అనవచ్చు. (అధ్యా॥ 8-7 చూడండి). ఈ అర్థముతోనే అవిద్యా లక్షణప్రకృతిని – అవిద్య అని కూడా అనవచ్చు. (అధ్యా॥ 12-18 చూడండి). ఇలా, ఈశావాస్య మంత్రము 12 యొక్క భాష్యములో వచ్చిన అవిద్యా శబ్దమునకు అర్థము అవిద్యాసంయుక్త ప్రకృతి అనే అవుతుంది.

జీవుల శరీరముల లాగే వారి అవిద్యలో కూడా నానాత్వమును స్వీకరించినట్లయితే, అప్పుడు ఒక జీవుడు ముక్తి పొందితే మాయకు నష్టము అయ్యే ప్రమాదము లేదు – పైన చెప్పిన దోషము కూడా లేదు. నానా విధములైన అవిద్య – ఏకరూపమైన మాయకు పర్యాయము కాజాలదు. అవిద్యను ఒకటిగా ఆలోచించి మాయతో పర్యాయమంటే పైన చెప్పిన దోషము ఉంటూనే ఉంటుంది.

శ) అవిద్యను ప్రకృతి కార్యము అనడములో దోషము

ప్రశ్న: మాయా అవిద్యలలో అంతరము లేనేలేదు అని కాదు. ప్రకృతియొక్క సత్త్వ ప్రధానమైన విక్షేపశక్తి మాయ. దీని కార్యము జగత్తు. అది ఈశ్వరునికి ఉపాధి. ప్రకృతియొక్క తమః ప్రధానమైన ఆవరణశక్తి కార్యము అవిద్య. అది జీవునికి ఉపాధి. అనగా, స్వరూపముతో ఇవి రెండూ ఒకటే అయినప్పటికీ, కార్య భేదముతో ఈశ్వరుని రెండు శక్తులు ఇవి. ఈ ప్రకారము అవిద్య, ప్రకృతియొక్క కార్యము అయినా కూడా, రెండింటినీ వేఱుగా అనుకోవాలని ఎందుకు అంటున్నారు?

సమాధానము: భాష్యము చెప్పిన విధముగా అదర్శనము తమోగుణ కార్యము (సూ॥భా॥2-2-10) అని సాంఖ్యులు చెప్తారు. ఇలాగే, మీ ద్వారా కల్పించబడిన అవిద్యా – ప్రకృతి సంబంధము వికార్య – వికారి భావ సంబంధమా, లేక జన్య – జనక భావ సంబంధమా? వికార్య – వికారి భావ సంబంధమును తీసుకున్నట్లయితే – 1) నామరూపముల సృష్టిని శ్రుతి ఎలా చెప్పినదో, అలాగే ప్రకృతినుండి అవిద్య యొక్క సృష్టిని కూడా ఆమోదించాలి. కాని, ఇలా చెప్పడము లేదు. 2) మాయాకార్యమైన నామరూపములు 'పారమార్థిక'ము– "పారమార్థికస్తు వియదాది సర్గః।" (సూ॥భా॥ 3-2-4). కాని, అవిద్య పారమార్థికము కాదు. "న తు సా పరమార్థతః స్వాత్మని।" (కఠ ॥భా॥2-2-1). 3) నామ రూపాత్మక జగత్తు మూడు కాలములలోను సత్త్వమును విడువదు– "జగత్ త్రిషుకాలేషు సత్త్వం న వ్యభిచరతి"। (సూ॥ 2-1-13). ఇందువల్ల దానికి నాశనము లేదు. కాని, విద్యతో అవిద్యానాశము జరుగుతుంది –"విద్యాయాం హి సత్యాం ఉదితే ప్రణాశం ఉపగచ్ఛతి అవిద్యా, (గీ॥భా॥2-69). 4) పారమార్థిక వస్తువు విద్యతో నష్టము కాదు –"న తు పారమార్థికం వస్తు నివర్తయితుం అర్హతి బ్రహ్మవిద్యా।" (బృ॥ 1-4-10). అయితే విద్యవల్ల, అవిద్య నష్టమవుతుంది– "య ఏవ అవిద్యాది దోష నివృత్తి ఫలకృత్ ప్రత్యయః స ఏవ విద్యా।" (బృ॥ 1-4-10). 5) ప్రకృతి కార్యమైన అవిద్య ఎప్పుడైతే ద్రవ్య స్వభావమైనది అవుతుందో, అప్పుడు, దాని నాశనము కర్మతో మాత్రమే అవుతుంది. ఎలాగంటే కంటిలో పువ్వు కర్మచేతనే నశిస్తుంది. దానికోసము బ్రహ్మాత్మైకత్వ జ్ఞానము అవసరము లేదు. ఈ జ్ఞానము వుండడమువల్ల ప్రయోజనము కూడా ఏమీ లేదు. అయితే అవిద్య, విద్యవలన కాక, ఇంకే విధముగానూ నశించదు అని శాస్త్రము చెప్తున్నది. 6) కార్యావిద్య

కారణ ప్రకృతితో అనన్యము - శక్తి (ప్రకృతి) శక్తిమంతుడైన ఈశ్వరునితో అనన్యము. ఇందువల్ల తన వ్యక్తరూపముతో అవిద్య ఈశ్వరునికే ఉపాధి అవుతుంది. ఇది ఈ కల్పనలోని వ్యాఘాతదోషము. 7) ఈ విధముగా అవిద్యోపాధి యుక్తుడైన ఈశ్వరునిలో విక్షేపశక్తి ఉండజాలదు -"న హ్యేతద్ దివ్యత్వాది విశేషణం.....శారీరస్య ఉపపద్యతే।" (సూ॥భా॥ 1-2-22) ఇది కూడా వ్యాఘాత దోషమే. 8) అవిద్యావరణ తన అవ్యక్తరూపముతో, అవ్యక్త నామరూపముల లాగా ఈశ్వరునితో నిత్యసంబంధము కలిగివుంటుంది . అందువల్ల అతడు నిత్యసంసారి అవుతాడు. అయితే ఇది సరికాదు. 9) ఈశ్వరాధీన ప్రకృతియొక్క ఒక అంశమైన విక్షేపశక్తి ఈశ్వరునికి ఉపాధి అయి, అతనికి సర్వజ్ఞత్వాది మంచి నామములను యిచ్చి - రెండవ అంశము తన కార్య ఆవరణతో జీవునికి ఉపాధి అయి వానికి మూర్ఖతాది చెడ్డపేరునూ - దుఃఖాదులనూ ఇస్తున్నది. దీనితో ఈశ్వరునికి స్వార్థవ్యసన దోష ప్రసక్తి.

అవిద్య మరియు ప్రకృతి వీనిలో జన్య -జనక భావ సంబంధమును స్వీకరించడానికి అవకాశము లేదు. ఇక్కడ జన్యము ఆవరణము, జనకము ఈశ్వరుడు. ప్రకృతి జనకము కాజాలదు. అది జడము - ఈశ్వరాధీనము కూడా. ఇప్పుడు ప్రశ్న పుడుతుంది - ఈశ్వరుని ప్రవర్తకత్వము వల్ల జీవునిలో అవిద్యారూప ఆవరణ వస్తుందా? లేక ఈశ్వరుని ప్రవర్తకత్వము లేకుండా జీవుడు తనకు తానే అజ్ఞానిగా ఉన్నాడా? మొదటి పక్షమయినట్లయితే 1) ఈశ్వరునికి క్రూరత్వ దోషప్రసంగము అవుతున్నది. 2) అవిద్య వల్ల జీవునికి కలిగే - కర్తృత్వాదులకు ఈశ్వరుడు కారణము కాదు -"న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః।" (గీ॥5-14). అనే భగవద్వచనముతో విరోధ ప్రసక్తి వస్తుంది. 3) బ్రహ్మ అవిద్యాకర్త కాదు- "నావిద్యాకర్తృ భ్రాంతం చ బ్రహ్మ।" (బృ॥భా॥ 1-4-10) అనే భాష్యసిద్ధాంతమునకు కూడా విరోధము వస్తుంది. ఇంతేకాదు 4) సృష్టి చేయాలనే ప్రవృత్తి ఈశ్వరునికి జీవుని అవిద్య వలననే వస్తుంది. అవిద్య కలుగచేయటానికి ప్రవృత్తి ఎందువల్ల వస్తుంది? అనేదానిని మీరు చెప్పాలి. అందువల్ల పరిశేషన్యాయముతో జీవుడు తనకు తానే అజ్ఞాని అయి వున్నాడని చెప్పాలి. ఈ విషయమును స్పష్టముగా భగవాన్ వ్యాసులు ఇలా చెప్పారు-

సహవాసం న యాస్యామి కాలమేతద్ధి వఞ్చనాత్।
వఞ్చితోఽస్మ్యనయా యద్ధి నిర్వికారో వికారయా॥ (మోక్షధర్మము - 307-33)

నిర్వికారుడనైన నేను వికారమే తన స్వరూపముగా గల ఈ ప్రకృతిచే వంచింపబడి వికారినివలె అయ్యాను. ఇక, దీనితో సంబంధము పెట్టుకోను.

న చాయమపరాధోఽస్యా హ్యపరాధో హ్యయం మమ।
యోఽహమత్రాభవం సక్తః పరాఙ్ముఖముపస్థితః॥ (మోక్షధర్మము - 307-34)

ఇందులో దాని అపరాధమేమీ లేదు. అపరాధము నాదే; పరాఙ్ముఖుడనై దానిలో ఆసక్తుడయినాను. ఈ విధముగా అవిద్య, ఈశ్వరుని ప్రకృతి కార్యమనే భాష్య విరుద్ధ కల్పనచే సిద్ధాంతమునకు కొంచెము కూడా ప్రయోజనము లేదు. ఇటువంటి కల్పనకు ఆవశ్యకత కూడా లేదు.

ష) అవిద్యాత్మికా 'విశేషణము' ప్రకృతియొక్క సమన్వయము

"మాయా అవిద్యలలో భేదమూ ఉండవచ్చు, అభేదమూ ఉండవచ్చు. సిద్ధాంతమును నిలుపకోవడము కోసము ఇలాంటి మాటలను స్వీకరించవలసి వస్తుంది."

రెండింటిలో అభేదమును స్వీకరిస్తే సిద్ధాంత ప్రక్రియ ఎలా కుదురుతుంది?

"విద్యవల్ల, అవిద్య-మాయ రెండూ నష్టమవుతాయి. అనగా జీవుని జీవత్వము, ఈశ్వరుని ఈశ్వరత్వము రెండూ నష్టమయి, జగత్తు కూడా నష్టమవుతుంది. ఎందుకంటే, అంతా అవిద్యా కల్పితము. ఈ ప్రకారము విద్యచేత కేవలము ఆత్మ మిగులుతుంది."

బహుశః ఇది అర్ధ సాంఖ్యము, అర్ధ బౌద్ధము కావచ్చు. కాని శ్రుత్యుక్త బ్రహ్మాత్మైకత్వము కాదు, దీనిలో బ్రహ్మ నిశ్చయమే జరగడము లేదు. మాయవల్ల నామరూపముల సృష్టి జరుగకపోతే, ప్రజ్ఞానఘనత్వమనే పరమాత్మ యొక్క నిరుపాధిక రూపమును తెలుసుకొనజాలము. "యదిహి నామరూపే నవ్యాక్రియేతే తరా అస్యాత్మనః నిరుపాధికం రూపం ప్రజ్ఞానఘనాఖ్యం నప్రతిఖ్యాయేత (బృ॥భా॥1-4-19)- మాయ తన స్వరూపముతో బ్రహ్మమే. శాస్త్రములో దీనిని అధ్యారోపితము అని చెప్పలేదు. బ్రహ్మలో అధ్యారోపితము కేవల మాయా వ్యవహారము (అధ్యా॥ 1-10-3). అంతేకాదు, అభేదము-భేదము వంటి సిద్ధాంత ఘాతుకములైన పరస్పర విరుద్ధ వచనములు సిద్ధాంత స్థాపకములు కావు.

"కాని, అవిద్యాత్మికా పదములో ఉన్న ఆత్మశబ్దము, మాయా-అవిద్యల భిన్నత్వమునకు బాధకమవుతున్నది."

అలా కాదు. ఈ సమస్యకు పరిష్కారము మహాత్ములు ఇలా ఇచ్చారు: జీవుని ఉపాధియైన శరీర ద్వయమే మాయకు స్థానము. అవిద్య వల్ల దానితో జీవునికి తాదాత్మ్యమున్నది. ఈ అవిద్య, విద్యతో నివృత్తమవుతుంది. అందువల్ల, అవిద్యా శబ్దముతో దేనినైతే చెప్తున్నామో, దానికి మాయతో తాదాత్మ్యము ఉండటమువల్ల మాయను అవిద్యాత్మికా అన్నారు -"జీవోపాధేః మాయా ప్రదేశస్య విద్యాపనోద్యతయా అవిద్యా శబ్ద వాచ్యస్య మాయా తాదాత్మ్యాత్ మాయా¬పి అవిద్యాత్మికేత్యర్థః।" (అనుభూతి స్వరూపాచార్యః- ప్రకటార్థ వివరణమ్. సూ॥ 1-4-3 యొక్క వ్యాఖ్యానము). బీజశక్తి వాస్తవికము అవడము వల్ల, విద్యతో దాని నాశనముకాదు. ఈ శంకను పోగొట్టుటకు, మాయను అవిద్యాత్మిక అన్నారు. ఎలాగంటే, ముక్తులకు తమ విద్యతోనే తమ శరీరముల యొక్క బీజము నాశనమవుతుంది -"బీజశక్తేః వస్తుత్వాత్ విద్యయా దాహో అనుపపన్నః ఇతి। అత ఆహ అవిద్యాత్మికా హీతి।" (చిత్సుఖాచార్య- భాష్యభావ ప్రకాశికా- బ్ర॥సూ॥ 1-4-3 యొక్క వ్యాఖ్యానము). అవిద్యా లక్షణము ఉన్న మాయను అవిద్యాత్మిక అన్నారు. జ్ఞానముతో ఎలా అవిద్యా నివృత్తి అవుతుందో, అలాగే మాయా-బ్రహ్మల భేదము కూడా నివృత్తి అవుతుంది. అనగా అవిద్యాలక్షణమే అవిద్యాత్మకత్వము. ముందు దీనిని అవిద్యా సంయుక్త అవ్యక్తమని అన్నారు. ఎందుకంటే, సంయోగ సంబంధము రెండు పదార్థములలోనే ఉంటుంది. అలా, అవిద్యకు అవ్యక్తమునకు భేదము స్పష్టముగా ఉన్నది - "అవిద్యా లక్షణా యస్యాః సా అవిద్యాలక్షణా అవిద్యాత్మికేతి శబ్దేన ప్రతిపాద్యతే! విద్యయా నివృత్తత్వం అవిద్యాయాః లక్షణం। యథా జ్ఞానాత్ అవిద్యాయాః బాధో భవతి తథైవ బ్రహ్మమాయాభేదస్యాపి బాధో భవతి। అతః అవిద్యాలక్షణా అవిద్మాత్మికా। అగ్రే అవిద్యా సంయుక్తమ్ అవ్యక్తం ఇతి ఉచ్యతే। తత్ర సంయోగో భిన్నపదార్థయోః సంభవతి। తేన అవిద్యాయాః అవ్యక్తాత్ భేదస్య స్ఫుటతా ప్రతిపాదితా।" (మహేశానందగిరి).

స) 'అవిద్యాత్మిక' యొక్క అర్థము అవిద్యా సంయుక్తము

"పైన చెప్పబడిన సమాధానములో అన్యత్వమును స్వీకరించి 'అవిద్యాత్మికా' పదములో భాసిస్తూ ఉన్న అభేదమునకు సమన్వయమును చేస్తున్నారు. ఇలా చెప్పడానికి భాష్యములో ఏమైనా ఆధారము వున్నదా?"

"అవిద్యా సంయుక్తమ్ అవ్యక్తమ్ అహంకారః", "అవిద్యాది అంతర్దోషవత్ మాయా", "ప్రకృతిస్థత్వాఖ్యా అవిద్యా సంసారస్య కారణమ్", "ప్రకృత్యా అవిద్యారూపః సంయోగః సంసారః", "అవిద్యా ప్రత్యుపస్థాపిత నామరూప మాయా", "అవిద్యా లక్షణా ప్రకృతి"ః - ఇత్యాది వాక్యముల పఠనము మీరు చేయలేదా? ఇది కాక యౌగికార్థములో ప్రయోగము చేయబడిన అవ్యక్త శబ్దము జీవునితో సంబంధము పొందేటప్పుడు అవిద్య, అదే హిరణ్యగర్భునితో సంబంధము పొందేటప్పుడు మాయ- ఈ విధముగా రెండు అర్థములను భాష్యకారులు ఈ సూత్రమున భాష్యములోనే వేఱు వేఱుగా చెప్పినారు. దానిని మీరు అధ్యయనము చేయలేదా? ఒకే చోట మాయా - అవిద్యలను ఈ విధముగా భిన్నముగానూ అభిన్నముగానూ చెప్పుట అనే వచన వ్యాఘాత దోషమును భాష్యకారులు తమ గ్రంథములలో చేస్తారా? దాని తరువాత కూడా - 'విద్' ధాతువు నుండి ఉత్పన్నమయిన 'విద్యా' శబ్ద వాచ్యమునకు విరోధియై వస్తుతంత్రమైన అవిద్యను, 'కృఞ్' ధాతువునుండి ఉత్పన్నమయిన ప్రకృతి శబ్ద వాచ్య పురుషతంత్ర ప్రకృతినీ పర్యాయపదములని చెప్పే దుస్సాహసముయొక్క ఉద్దేశము ఏమిటి? దీనివల్ల మీకు ఏమి లాభము? దీనిని విడిచిపెడితే మీకేమి నష్టము? చెప్పండి. 'అవిద్యాత్మిక' అనే శబ్దము ఈ చర్చకంతటికి కారణమని చెప్పడము సరిగ్గాలేదు. ఎందుకంటే - 'విషసంయుక్త అన్నమును విషము అన్నట్లుగా - అహంకార వాసనా సంయుక్త అవ్యక్తము అహంకారమే!' అనే ఈ భాష్య వాక్యముతో ప్రత్యక్షముగా తెలియబడుతున్నది ఏమనగా, విషసంయుక్త అన్నము విషమే అనగా విషాత్మక అన్నమే. అలాగే అహంకార వాసనా సంయుక్త అవ్యక్తము; అహంకారమే. అనగా అహంకారాత్మక అవ్యక్తమే! ఈ విధముగా, అవిద్యాది అంతర్దోషములుగల మాయ, అవిద్యాత్మక మాయయే.

12-20) మాయ-అవిద్య పర్యాయములు కాదు

పైన చెప్పిన వివేచనతో నిశ్చయమవుతున్నది ఏమంటే, మాయ - అవిద్య పర్యాయములు కాదు. దీని తాత్పర్యము ఇది - మాయ ఈశ్వరునిది, జీవునిది కాదు. అవిద్య జీవునిది, ఈశ్వరునిది కాదు. (గీ॥భా॥4-5). మాయా కార్యమయిన జగత్తు అందరికీ ఒక్కటే రూపము కలది. అవిద్యా కార్యరూపమైన అధ్యాస తన (వైయక్తికమైన) భావరూపమైన బుద్ధివృత్తి. ఈ అధ్యాస ఇతరులకు తెలియబడదు. మాయ పూజనీయమైనది. జగద్రూపముగా భగవంతుని దర్శనము చేయిస్తున్నది. 'మాయ' అనే పేరు మనము పిల్లలకు పెడుతున్నాము. కాని, అవిద్య నిందనీయము. సంసారరూపమున నరకమును చూపిస్తున్నది. అవిద్య నిందనీయము కనక మనము పిల్లలకు ఆపేరు పెట్టము. ఈ విధముగా మాయా - అవిద్యల మధ్య అన్న-విషములవలె అంతరము ఉంటున్నది. (గీ॥భా॥7-5). అయినప్పటికీ, ఈ రెండు శబ్దములు పర్యాయములని ఎలా వ్యాప్తి చెందినదో తెలియడము లేదు. స్వభావముగానే ముముక్షువులు వేదాంతార్థమును ఈ ప్రమాదకారణమువల్ల సరిగా తెలుసుకోలేక పోతున్నారు. ఇందువల్ల, మాయ అవిద్యల మధ్య అంతరము, శ్రుతి వాక్యములతో, శంకరభాష్య వాక్యముల సహాయముతో నిశ్చయము చేయబడినది. క్రింద ఇవ్వబడిన పట్టిక ద్వారా ఈ అంతరమును చక్కగా అవగాహన చేసుకోగలరు.

	మాయ	అవిద్య
1.	బ్రహ్మయొక్క శక్తి (8–2)	జీవుని బలహీనత (12–3)
2.	జీవునిలో లేదు (12–13)	బ్రహ్మలోలేదు (12–13)
3.	ఇది స్వరూపముతో బ్రహ్మకంటె అనన్యము (8–11)	ఇది స్వరూపములో లేనేలేదు. (12–9)
4.	స్వరూపము బ్రహ్మకంటె అనన్యము అవడము వల్ల భావరూపము (12–6)	స్వరూపముతో లేని కారణముగా అభావము (12–6)
5.	దీనికి ప్రతియోగి లేదు (12–10)	దీనికి ప్రతియోగి విద్య (12–10)
6.	దీనివల్ల జీవునికి హాని లేదు (8–5)	దీనితో జీవునికి సర్వ హాని (12–6)
7.	ఇది జీవునికి సహాయకారి.	ఇది జీవునికి ప్రమాదకరము.
8.	దీనిద్వారా బ్రహ్మను తెలుసుకోగలము (6–12,4)	ఇది బ్రహ్మను తెలుసుకుందుకు ఆటంకము (12–8)
9.	దీనిని దాటడమువల్ల మోక్షము. (గీ॥8–14)	దీని నాశనము వల్ల మోక్షము. (12–10)
10.	ఇది అనిర్వచనీయము (8–10)	ఇది నిర్వచనీయము (12–6)
11.	దీని కార్యము జగత్తు (8–2)	దీని కార్యము అధ్యాస (12–6)
12.	దీనితో జగత్సృష్టి–లయములు (8–2)	దీనితో జగత్సృష్టి–లయములు లేవు (12–8)
13.	దీనిలో నామరూపముల అస్తిత్వము (8–2)	దీనిలో సంసారమునకు అస్తిత్వము (12–8)
14.	ఇది పూజనీయము (గీ॥7–14)	ఇది నిందనీయము (12–20)
15.	ఇది అన్నము (గీ॥ 8–4)	ఇది విషము (గీ॥7–4)
16.	దీని పర్యాయ శబ్దములు – వైష్ణవీమాయ, ప్రకృతి, మూలప్రకృతి, అవ్యక్తము, అక్షరము (8–4)	దీని పర్యాయ శబ్దములు – అజ్ఞానము అగ్రహణము (12–6).
17.	దేనితోను నష్టముకాదు కనక నిత్యము (8–9)	విద్యవల్ల నష్టమవుతుంది కనుక అనిత్యము (12–10)

అధ్యాయము - 12

1. జీవునికి తన విషయములో ఏ తప్పు అభిప్రాయము వున్నది?
2. జీవునికి అన్ని ఉపాధులు ఎప్పుడు వదలిపోతాయి?
3. అనాదికాలమునుండి జీవుడు తనని ఎలా గుర్తిస్తున్నాడు?
4. జీవుని స్వరూపము ఆగమప్రమాణముతోనే ఎందుకు నిశ్చయము చేస్తున్నారు?
5. సుషుప్తిలో జీవుని స్థానము విషయములో శ్రుతి ఏమి చెప్తున్నది?
6. ఛాందోగ్యము మరియు బృహదారణ్యకము ఉపనిషత్తులలో జీవుని స్వరూపము ఎలా వర్ణన చేశారు?
7. జీవుని అవిద్య అంటే ఏమిటి?
8. అవిద్యవల్ల జీవుడు తనను ఏవిధంగా తెలుసుకుంటాడు?
9. జీవుడు బ్రహ్మయొక్క అంశము మరియు జీవుడు బ్రహ్మతో అనన్యము. ఈ వాక్యముల సమన్వయము ఎలా?
10. అధ్యాస అని దేనిని అంటారు?
11. అధ్యాస ద్వారా అయే అంశములను దృష్టాంతము ద్వారా స్పష్టము చేయండి.
12. జీవుని కర్మఫలభోగము కోసము బ్రహ్మ వేటిని నిర్మాణము చేసింది?
13. ఒకవేళ, బ్రహ్మ జగన్నిర్మాణము చేయకపోతే ఏమయేది?
14. జీవునికి దేనివల్ల ప్రమాదము?
15. అధ్యాస భావరూపమని, అవిద్య అభావరూపమని ఎలా తెలుస్తున్నది?
16. 'భావరూపము' అని దేనిని అంటారు? ఏ అర్థముతో జ్ఞానాభావము అధ్యాసకు కారణమవుతుంది?
17. ధర్మి – ప్రతియోగి, ఈ పారిభాషిక పదములను ఉదాహరణ ద్వారా వర్ణన చేయండి.
18. ఆత్మయొక్క స్వాభావిక ధర్మము ఏమిటి?
19. అంధకారము భావరూపము – ఈ మాట ఎందుకు సరికాదు?
20. అవిద్యను అనాది అని ఎందుకు ఆమోదించాలి?
21. విస్మృతి – స్మృతి ఏ విషయములవి?
22. వ్యష్టి అవిద్య – సమష్టి అవిద్య వీటిలో అంతరము ఏమిటి?
23. అవిద్య ఎవరిలో వుంటుంది?
24. అవిద్య జీవుని ధర్మము కాదు. దీనిని చర్చించండి.
25. సంసారము ఎలాగ అవిద్యా కల్పితము?

26. జగత్సృష్టికి దేనివల్ల ఈశ్వరునికి ప్రేరణ కలుగుతున్నది?
27. శ్రుత్యుక్త బ్రహ్మైకత్వము మరియు ప్రత్యక్ష నానాత్వములో భేదము వున్నదా? లేదా?
28. 'జగత్తు అవిద్యాకల్పితము' దీని అర్థము ఏమిటి?
29. బ్రహ్మ జగత్కారణము – బ్రహ్మ కూటస్థము. ఈ వాక్యముల సమన్వయము ఎలాగ?
30. అవిద్యా లక్షణా ప్రకృతికి అర్థము ఏమిటి?
31. అవ్యక్త శబ్దము యొక్క రెండు అర్థములు ఏవి?
32. కఠమంత్రములోని అవ్యక్త శబ్దమునకు అర్థము మాయే! ప్రధానము కాదు అది ఎందువల్ల?
33. 'మహాన్ ఆత్మ రథికుడు' – అని చెప్పడము వల్ల ఏ సంశయము వస్తున్నది?
34. 'హిరణ్యగర్భుడు' జీవుడా? ఈశ్వరుడా? దీనిని చర్చించాలి.
35. అవ్యక్తము మాయ, ప్రధానము కాదు. ఇది ఎలా నిశ్చయమవుతున్నది?
36. మాయను, అవిద్యను పర్యాయములు అనడములో దోషము ఏమిటి?
37. అవిద్య, ప్రకృతి కార్యము ఎందుకు కాదు?
38. అవిద్య–ప్రకృతి, వీనిలో జన్య–జనక సంబంధము చెప్పడమువల్ల దోషము ఏమిటి?
39. ఏ అర్థముతో భాష్యకారులు అవ్యక్తమును 'అవిద్యాత్మికా' అన్నారు?
40. 'అవిద్యాత్మికా'ను 'అవిద్యాస్వరూపము కలది' అనడములో దోషము ఏమిటి?
41. 'అవిద్యా సంయుక్త అవ్యక్తమే అవిద్యాత్మక అవ్యక్తము' దీనిని భాష్యకారులు ఎక్కడ, ఎలా సూచించారు?
42. అవిద్యా నివృత్తి అయిన జీవుడు ఏమవుతాడు?
43. అవిద్యను ఉపాదానముగా మరియు నిమిత్తముగా చేస్తే జగన్నిర్మాణము ఎందుకు జరుగదు?
44. శాస్త్రములో నామరూపాత్మక జగత్తుయొక్క రెండువర్ణనలు ఏ దృష్టితో యిచ్చారు?
45. జగత్తుకు ఉపాదానము మాయ; అవిద్యకాదు. దీనిని సమర్థించండి.
46. విద్యావంతుడికి, అవిద్యావంతుడికి, జగత్తు యొక్క అనుభవ విషయములో ఈ ఇద్దరికి అంతరము ఏమిటి?
47. 'ద్వి–చంద్ర' మరియు శుక్తి–రజత దృష్టాంతములలో ఏ విధమైన జ్ఞానము కలుగుతున్నది?
48. ఈ దృష్టాంతములలో కార్య–కారణ భావము లేదని ఎలా నిశ్చయమవుతున్నది?
49. మాయ–అవిద్యలలో భేదము ఏమిటి?
50. మాయ–అవిద్యలను పోల్చి చెప్పండి?

అధ్యాయము - 13

అవస్థాత్రయ చర్చ

తర్కముల ఆధారముతో వెనుకటి అధ్యాయములలో - ఆత్మ స్థూల సూక్ష్మ కారణ శరీరములనే పేరుగల దేహత్రయమునకు అతీతస్వరూపమని చెప్పబడినది. ఈ ప్రకారము తాను అనాత్మ కాదు అనేది తర్కముచేత అనేది తర్కముతో కొంత నిశ్చితము అయినప్పటికీ, ఆగమముల ద్వారానే తాను ఎవరినని తెలియబడుతున్నది. ఆగమముల ప్రకారముగా 'తానే బ్రహ్మ'. ఇప్పుడు ఈ అధ్యాయములో జీవుని జాగ్రత్తు-స్వప్నము-సుషుప్తి అనే అవస్థాత్రయముయొక్క చర్చచేసి, ప్రబలమైన తర్కముతో, 'నీవు స్వయంజ్యోతివి నిరతిశయానందాద్వైత స్వరూపుడవు.' (బృ॥భా॥ 4-3-1, సంబంధ భాష్యము) అని ఆగమములు చెప్పిన దానిని దృఢపరుస్తున్నాము.

13-1) జాగ్రత్తు

జీవుడు జాగ్రత్తు-స్వప్నము-సుషుప్తి అనే అవస్థాత్రయమును అనుభవిస్తూ వుంటాడు. గర్భస్థ శిశువు రోజులో 12 గంటలు సుషుప్తిలో, 9గంటలు స్వప్నములో, 3 గంటలు జాగ్రత్తులో గడుపుతూ ఉంటుంది. వయస్సు పెరుగుతున్నకొద్దీ నిద్ర తక్కువ అవుతూ వస్తుంది. జాగ్రదవస్థ విశేషమేమనగా- సూక్ష్మశరీరము యొక్క 19 తత్త్వములు స్థూల శరీరమును జాగృతము చేస్తూ వుంటాయి. (అధ్యా॥ 11-7లో పట్టిక చూడండి). ఈ విధముగా జీవుడు 19 తత్త్వములతో అనుభవమును పొందుతూ వుండడము వల్ల వీనిని 'ఏకోనవింశతి ముఖుడు' అనగా 19 ముఖములు కలవాడని అంటారు. జ్ఞానేంద్రియముల ద్వారా బాహ్యవిషయముల ప్రజ్ఞను పొందడమువల్ల అతడు 'బహిఃప్రజ్ఞ' కలవాడు. ప్రాప్తించిన ప్రజ్ఞవల్ల, స్థూలభోగములను అనుభవిస్తున్నాడు. కనుక 'స్థూలభుక్' అనబడుతున్నాడు. ఇక్కడ అతని స్థానము జాగ్రత్తు. కనుక అతడు 'జాగరిత స్థానుడు'- "జాగరిత స్థానో బహిఃప్రజ్ఞః సప్తాంగః ఏకోన వింశతి ముఖః స్థూలభుక్ వైశ్వానరః ప్రథమః పాదః।" (మాం॥3). జాగ్రత్తులో కళ్ళు తెరిచే వుంటాయి. నిద్రలో మూసుకుపోతాయి. అందువల్ల వీనిది 'నేత్రస్థానము' అని కూడా అంటారు. జాగ్రత్కాలములోని విషయములు - క్రియలు, అంతఃకరణములో వాసనారూపముతో నిలచి వుంటాయి. ఈ వాసనలే ఇతర క్రియలకు ప్రేరకములు. ఈ ప్రకారము అన్ని లౌకిక వైదిక కర్మలకు వాటి సుఖ-దుఃఖములు మొదలైన ఫలభోగములకు, ధర్మాధర్మములకు, బంధ-మోక్షములకు, జాగ్రత్తే ఆశ్రయము.

13-2) జ్యోతి

ఏ కార్యమైనా ప్రకాశము లేకుండా జరగదు. అయితే జాగ్రత్తులో జరిగే వ్యవహారము ఏ ప్రకాశముతో జరుగుతున్నది? ప్రాతఃకాలములో సూర్యుని ప్రకాశముతో, అతడు లేనప్పుడు రాత్రిలో చంద్ర-నక్షత్రముల ప్రకాశముతో, జరుగుతున్నది. అవి కూడా లేనప్పుడు అగ్నితో జరుగుతున్నది. అగ్నికూడా లేకపోతే ఎలా జరుగుతుంది? ఏ ప్రకాశముతో వ్యవహారము జరుగుతుంది? అంటే శబ్ద, స్పర్శ, రస, గంధములతో జరుగుతుందని సమాధానము. ఉదా: కుక్క అరుపుతో, శంఖనాదముతో, చీకటిలో కూడా మనము గ్రామమును గుర్తించి వెళ్ళగలము. స్పర్శతో అగ్గిపెట్టెను గుర్తించగలము. ఈ విధముగా, చెవులతో శబ్దము వినడము వల్ల, వస్తువును స్పర్శించడమువల్ల, రుచి-వాసన వీటివల్ల అంధకారములో కూడా వ్యవహారము

జరుగుతున్నది. దీనివల్ల, శ్రుతి అన్ని ప్రకాశములను 'జ్యోతి' అన్నది. "యద్యత్ కస్యచిదవభాసకం తత్తత్ జ్యోతిః శబ్దేన అభిధీయతే।" (సూ॥భా॥1-1-24)- అనగా జీవునికి దేనివల్ల ఏదైనా ప్రజ్ఞ కలుగుతున్నదో దానిని జ్యోతి అన్నారు. (బృ॥భా॥ 4-3-2,5).

అయితే, శబ్దాదులను జ్యోతి అని ఎలా అంటారు? వానివల్ల రూపజ్ఞానము కలుగదు కదా? దీనికి సమాధానము: దేనిచేత వస్తువు నిరూపింపబడుతోందో అదే రూపము- "రూప్యతే అనేన ఇతి రూపమ్" అందువల్ల, శబ్ద, స్పర్శ, రస, గంధములు కూడా రూపమే. ఈ కారణముగా రూపము జ్యోతి అయితే, శబ్ద, స్పర్శ, రస, గంధములు కూడా జ్యోతియే. సరే, శబ్దముతో రూప నిరూపణ జరగదు. ఈ ప్రకారము రూప నిరూపణము చేసే ప్రకాశముతో రసగంధముల నిరూపణ కూడా జరగదు. అనగా, ప్రతియొక్క వస్తువు, తనదైన ఒక జ్యోతిః ప్రకాశముచేతనే ప్రకాశింపబడుతున్నది. శబ్దజ్యోతి దాని ధ్వని గుణమును, స్పర్శ జ్యోతి దాని కఠినత్వము – మృదుత్వమును, రూపజ్యోతి దాని ఆకారమును, రసజ్యోతి దాని రుచి గుణమును, గంధజ్యోతి దాని గంధమును చెప్తున్నాయి. అప్పుడు, వస్తువు 'ఇలా ఉన్నది' అన్నదానిలో 'ఇలా' అనే పదము శబ్దాదులను తెలియచెప్తే, 'ఉన్నది' అన్నపదము దానిలోని జ్యోతిని చెప్తున్నది. ఇందువల్ల, శబ్దాదులన్నీ ఒక జ్యోతి ర్విశేషములే వీటిని జ్యోతి అనడము సమంజసమే!

13-3) స్వప్నము అనగా ఏమిటి?

జాగ్రత్తులో ఇంద్రియములు తమ స్థానములలో ఉండి, వ్యవహారము చేస్తున్నాయి. మెల్ల మెల్లగా దీనివల్ల జీవునికి అలసట వస్తుంది. (ఛా॥6-8-1). అప్పుడు జీవుడు జాగ్రత్తు యొక్క నేత్రస్థానమును విడచి హృదయ స్థానమును చేరుతాడు. అనగా, చక్షురాది ఇంద్రియములు స్థూల శరీరములోని తమ స్థానములను విడిచి మనస్సులోనికి వెళ్ళి కలిసిపోతాయి. అప్పుడు జీవునికి దర్శనాది బాహ్యవ్యవహారము ఆగిపోతుంది. కాని, మనస్సు తన పనిని మానదు (ప్ర॥4-2). ఇంద్రియముల వ్యాపారము ఆగిపోయినప్పుడు, కేవలము మనస్సు తన పనిని చేస్తూ ఉండి, విషయానుభవమును చేయడమే స్వప్నావస్థ- "ఇంద్రియాణాం ఉపరమే మనో¬నుపరతం యది। సేవతే విషయానేవ తద్విద్యాత్ స్వప్నదర్శనం॥" (మోక్షధర్మము - 275-24). కాని, ప్రాణము తన స్థానమును విడవకుండా స్థూల శరీరమును రక్షిస్తూ వుంటుంది. (ప్ర॥4-3-4). ఇందువల్ల నిద్రిస్తున్న శరీరము శవమువలె అమంగళకరముగా కనపడదు. మంగళకరముగానే వుంటుంది.

తన వాసనానుసారము మనస్సు, స్వప్నములో జీవునికి లోపల నుండే ప్రజ్ఞ (జ్ఞానము)ను కలిగిస్తూ వుంటుంది. అందువల్ల అతడు 'స్వప్న స్థానుడు' – 'అంతః ప్రజ్ఞుడు'. ఈ ప్రజ్ఞలు బాహ్య విషయరహితమైన మనస్సు యొక్క చలనమాత్రమే. ఇక్కడ కూడా జాగ్రత్తువలెనే 19 ద్వారములు ఉన్నవి. ఈ స్వప్నద్రష్ట కూడా 'ఏకోనవింశతి ముఖములు' కలవాడే. కాని, మనస్సు తప్ప మిగిలిన స్వప్నకాలీన సమస్త వస్తువులు వాసనామయములే. శరీరము ఇక్కడ పడుకుని ఉండి కూడా స్వప్నకాలములో ఎక్కడికైనా వెళ్ళగలదు. జాగ్రత్ శరీరము యొక్క జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు నిష్క్రియములైనప్పటికీ, స్వప్నశరీరములో సక్రియముగానే ఉంటాయి. ఇక్కడ శ్వాసోచ్ఛ్వాసములు క్రమబద్ధమైనప్పటికీ, అక్కడ కుంభకములో ఉండగలవు. గోపికలు అర్ధరాత్రిలో, తమ భర్తల దగ్గరే నిద్రపోతున్నప్పటికీ, కృష్ణుని వేణుగానమును విని- బట్టలు ఉతకడము, భోజనము చేయడము, పతి-పుత్రులకు భోజనము వడ్డన చేయడము, మొదలైన అన్ని వ్యవహారములు విడచి, కృష్ణుని వద్దకు అడవికి పరుగెత్తగలిగారు. స్వప్నములో ప్రాప్తించిన భోగములు

స్థూలభోగములు కావు. ఇవి స్థూలభోగముల కంటె–ప్ర=ప్రకర్ష, ఎక్కువగా, వివిక్త=పృథక్, వేఱయిన వాని మాత్రలు (అంశములు). ఇందువలన ఇతడు స్వప్నములో 'ప్రవివిక్తభుక్' – "స్వప్నస్థానో అంతఃప్రజ్ఞః సప్తాఙ్గః ఏకోనవింశతిముఖః ప్రవివిక్తభుక్ తైజసో ద్వితీయః పాదః।" (మాం॥4). దీనిని ఇంకొక దృష్టితో శ్రుతి 'ప్రవివిక్తాహారతర' అని చెప్తున్నది. (బృ॥4–2–3). దీని అర్థము ఇలా వున్నది – జాగ్రత్తులోని స్థూల శరీరికి అన్నములోని మధ్యమాంశము ఆహారము. కాని, స్వప్నములోని శరీరమైన మనస్సుకు అన్నము యొక్క అతిసూక్ష్మమైన అంశము ఆహారము. (అధ్యా॥ 11–4–2 చూడండి). ఈ ఆహారము అన్నములోని మధ్యమాంశము కన్న ప్రవివిక్తతరము – చక్కగా వేఱు చేయబడినది. అందువల్ల ఇతడు 'ప్రవివిక్తాహారతరుడు'.

13–4) స్వప్న జగత్తు

జాగ్రత్తులోని అన్ని వ్యవహారములు స్వప్నములోనూ జరుగుతూ వుంటాయి. అక్కడ ఇంకొక జగత్తు వున్నది. గుఱ్ఱములు, రథములు, మార్గములు – అన్నీ ఉన్నాయి. కాని, ఇవన్నీ స్వప్నము వచ్చేవానికి మాత్రమే కనపడతాయి. ఇతరులకు కనపడవు. 'అయితే, ఈ స్వప్నము ప్రాతిభాసిక సత్యమా?' (అధ్యా॥ 9–9) కాదు. ప్రాతిభాసిక సత్యములో ఈశ్వరుడు సృష్టించిన జగత్తుకు సంబంధము వున్నది. ఇక్కడ అది ఏ మాత్రమూ లేదు. స్వప్న సృష్టి మాయ – అబద్ధము. దానిలో పరమార్థ వాసన కొంచెము కూడా లేదు– "మాయైవ సన్ధ్యే సృష్టిః న పరమార్థస్య గంధోఽప్యస్తి" (సూ॥భా॥3–2–3). "పారమార్థికస్తు నాయం సన్ధ్యాశ్రయః సర్గో వియదాది సర్గవత్।" (సూ॥భా॥ 2–3–4). అనగా, ఎవరు నిద్ర పోతున్నారో, వారి అంతఃకరణ వృత్తిజన్య వాసనలే స్వప్నజగత్తుకు మాత్రలు (ఉపాదానము). స్వప్న సృష్టిలో, ఈశ్వరుని పంచభూత సంబంధమైనది భోజ్యముగా లేదు. దేనితోనూ నియంత్రింపబడని మనస్సు స్వతంత్రముగా ఉండడము వల్ల స్వప్నములో చేసిన పుణ్య–పాపములతో జీవునికి ఏమీ సంబంధము లేదు. దీనిని 'రాసపఞ్చకము' ఆఖరున భాగవతము ఇలా చెప్పినది – "తేజీయసాం న దోషః।" – తేజీయునికి ఈ దోషములు లేవు. 'తేజీయ'=తేజస్వితరము. బహిప్రజ్ఞ తేజస్వి అయితే అంతఃప్రజ్ఞ తేజస్వితరుడు, అనగా 'తేజీయాన్' అని. అక్కడ పుణ్య–పాపములను కేవలము చూస్తూ వుంటాడు. చేయడు. "దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ।" (బృ॥భా॥4–3–15). ఇంతేకాదు. అక్కడ భోగించే సుఖ దుఃఖములు కేవలము వాసనామయములు. ఎందుకంటే అక్కడ ఇంద్రియములు నిష్క్రియములు. తన శరీరములోనే ఉండి జీవుడు స్వప్నలోకములో పుణ్య పాపములను చూస్తాడు. (బృ॥భా॥ 2–1–18). అందువల్ల, శ్రుతి, స్వప్నలోకమును జీవసృష్టి అంటుంది. అక్కడ రథములు లేవు. రథవాహకులు లేరు, మార్గములు లేవు. కాని, రథములను, వాహకులను, మార్గములను సృష్టిస్తున్నాడు– "న తత్రరథాః న రథయోగాః న పంథానో భవంతి అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే।" (బృ॥4–3–10).

స్థూలశరీర వ్యాపారము జాగ్రత్‌లో వుంటుంది – స్వప్నములో ఉండదు. కాని, మనోవ్యాపార దృష్టితో మాత్రము జాగ్రత్, స్వప్నములకు అంతరము ఏమీలేదు. జాగ్రత్తులో ఈశ్వర రచితమైన జగత్తు, మనోవ్యాపారమును నియమిస్తూ వుంటుంది. ఏదో ఆలోచిస్తూ–దారిలో నడుస్తున్నప్పటికి తనను తాను మరచి నడవడు. ఎదుట వస్తున్న వాహనములు వాని మనస్సును దారివైపు లాగుతూ వుంటాయి. కాని స్వప్న కాలములో బాహ్యేంద్రియముల వ్యాపారము ఉండదు. బాహ్య జగత్తుయొక్క వ్యాపారము ఆగిపోవడము వల్ల, నియమించడము వుండదు. మనస్సు తన ఇష్టము వచ్చినట్లు కార్యములు చేస్తూవుంటుంది. అందువల్ల, స్వప్నములో కార్త్స్న్యము ఉండదు. అంటే, దేశ కాలముల సంబంధము, కార్య–కారణసంబంధము అనే

పూర్ణత్వము ఉండదు. ఇప్పుడు మనుష్యుడుగా ఉన్నవాడు ఒక్కసారిగా వృక్షముగా మారవచ్చు; వృక్షము మరుక్షణములో జంతువుగా మారవచ్చు. స్వప్నము జాగ్రత్తుయొక్క స్మృతిమాత్రమే అయినప్పటికీ, జాగ్రత్తులో చూసిన వస్తువునే చూడాలని నియమము ఏమీ లేదు. జాగ్రత్తులో చూసిన వస్తువు యొక్క స్మృతిని గత జన్మ వాసనలతో కలుపుకుని తన స్వప్నములో చూస్తూ వుంటాడు. పక్షియొక్క స్మృతిని, మనుష్యుడను అనే స్మృతితో కలిపి, స్వయముగా ఎగురుతున్నట్లు కలలో చూస్తాడు. గోపికల స్వప్నరూప గానములో, ఏడు సంవత్సరముల బాలుడైన కృష్ణుడు తాంబూలము వేసుకుంటాడు. తన వయస్సుకు మించిన చర్యలు చేస్తాడు. అర్ధరాత్రిలో కూడా కమలములు వికసిస్తాయి. కాని, కల్పనకు మించి దానిని దేనినీ కూడా స్వప్నములో చూడలేము. స్వప్న లోకము అబద్ధము. జాగ్రత్‌లోని జగత్తు సత్యము. (అధ్యా॥9–4 చూడండి).

13–5) స్వప్నము ఇహ–పరముల సంధి

స్వప్నములు ఎక్కువభాగము జాగ్రత్ స్మృతులుగా వుంటాయి. అయితే జీవుడు జాగ్రత్ స్మృతి నుంచి ఇంకా ఎక్కువగా చూస్తూ వుంటాడు. ఈ జన్మలో ప్రాప్తించిన విద్య– కర్మ–పూర్వప్రజ్ఞల ఆధారముతో, చనిపోయిన తరువాత వెళ్ళే స్థానములైన పరలోకములను కూడా చూస్తూ వుంటాడు. పరలోకములోని సుఖదుఃఖములను ప్రత్యక్షముగా అనుభవించడము కుదరదు, కేవలము వాటి దర్శనము మాత్రము అవుతుంది. (బృ॥4–3–9). ఇంతేకాదు. తన ఈ జన్మలోనే ముందు రాబోయే జన్మల ఘటనల సూచనలు కూడా స్వప్నములో తెలుస్తాయి. స్త్రీని గురించిన చింతే లేని వ్యక్తి, తన కర్మయొక్క సిద్ధికి సూచకముగా స్వప్నములో స్త్రీని దర్శించవచ్చు. (ఛాం॥ 4–2–7,8). స్వప్నములో నల్లని దంతముల కలిగిన నల్లని పురుషుని చూసినట్లయితే ఆ స్వప్నము చూసిన పురుషునికి మృత్యు సూచకము. (ఐతరేయ ఆరణ్యకము – 3–2–4). ఇక్కడ కనపడిన స్త్రీ, నల్లని వ్యక్తి, యిద్దరూ కూడా వాసనారూప శరీరములే. కాని, వారివల్ల సూచించబడిన కర్మసిద్ధి – మృత్యువు మాత్రము సత్యములే. అసత్యములు కావు.

13–6) స్వప్న ప్రపంచకర్త ఎవరు?

ఇప్పుడు స్వప్నకర్త ఎవరు అని చర్చించబడుతున్నది. దీని విషయములో వేఱు వేఱు శ్రుతులలో వేఱువేఱు విధముల వర్ణనలు కనపడుతున్నాయి. “అథ రథాన్, రథయోగాన్ పథః సృజతే। (బృ॥ 4–3–10). –(ఇవి లేకపోయినా) రథములను, రథయోగములను, మార్గములను సృష్టి చేస్తున్నాడు. అని చెప్పి బృహదారణ్యక శ్రుతి జీవుడిని స్వప్నకర్త అన్నది. “య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః, తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే।” (కఠ॥ 2–2–8) – నిద్రపోయేటప్పుడు వేఱు వేఱు కామములను నిర్మాణము చేసి ఏ పురుషుడు జాగృతుడై వుంటాడో, అతడే శుభ్ర బ్రహ్మ, అమృతుడు”. ఇలా కఠశ్రుతి పరమాత్ముడినే స్వప్నకర్త అంటున్నది. స్వప్నములో అన్ని ఇంద్రియములు పరమదేవుడైన మనసులో లీనమై వుంటాయి”. (ప్ర॥ 4–2). “స్వప్నములో ఈ దేవుడు యిటువంటి మహిమ యొక్క అనుభవమును పొందుతూ వుంటాడు” – “అత్రైష దేవః స్వప్నే మహిమానం అనుభవతి।” (ప్ర॥4–5). ఇలా చెప్పి ప్రశ్నోపనిషత్తు మనస్సుకు విషయ–విషయి రూపములో స్వప్నకర్తృత్వ పదమును యిచ్చింది. ఇందువల్ల, ‘స్వప్నకర్త’ ఎవరు అన్నది నిశ్చయము చేయవలసే వుంది. రాబోయే అనుచ్ఛేదములో ఆ చర్చ చేయబడుతుంది.

ఆగమ ప్రమాణమున విషయమును చర్చించినప్పుడు (అధ్యా॥ 4-6-4) వేదములలో ఎక్కడా విరోధము లేదు, అని ప్రతిజ్ఞచేయబడింది. ఈ లక్షణమును గ్రహించి వైదికులు వేదమును నిరంకుశ స్వతంత్ర ప్రమాణమని ఆమోదించారు. పైన చెప్పిన శ్రుతులలో కర్తను భిన్న భిన్నముగా చెప్పడమువల్ల ఆ శ్రుతుల సమన్వయమును భాష్యకారులు ఎలా చేశారో చూద్దాము.

జీవుడినే కర్తగా ఆమోదించవలసి వస్తుంది. ఎందుకంటే, "సృజతే", సృష్టి చేస్తాడు, అని శ్రుతి చెప్తున్నది. జగత్తులో జీవకృతమైన కర్మజన్య వాసనలే నిద్రలో స్వప్న రూపముగా మనకు ఎదురు వస్తున్నాయి. అందువల్ల ఇలాగే చెప్పాలి. "కాని అప్పుడప్పుడు వానికి కోరని స్వప్నములు కూడా వస్తూ వుంటాయి. స్వప్నముల మీద అతనికి నియంత్రణ ఏమీ లేదు. అటువంటి స్వప్నములకు జీవుడు స్వప్నకర్త ఎలా అవగలడు?' అవును. నియంత్రణ లేదు. ఎందుకంటే, వాని వాసనలను అనుసరించి, స్వప్నములను చూపించేవాడు ఈశ్వరుడే. 'అప్పుడు ఈశ్వరుడే స్వప్నకర్త ఎందుకు కారాదు?' ఇలా చెప్పడము సరిగాలేదు. ఒకవేళ, ఎవరైనా ఎక్కువగా తిని కడుపు నొప్పితో బాధపడుతూ వుంటే-దానికి కారణము వాని శరీరములో వున్న వైశ్వానరుడు, అని చెప్పగలమా? చెప్పలేము. కడుపునొప్పిని అతడు ఎప్పుడూ కోరడు. దాని మీద అతనికి నియంత్రణ కూడా లేదు, అయినా, అతడే కర్త. అధికముగా తిన్న తరువాత, కడుపునొప్పి మీద అతనికి నియంత్రణ లేదు; కాని, సంయమముతో వుంటే, కడుపు నొప్పిరానే రాదు. ఈ విధముగా, జీవుడు సత్కర్మ చేస్తూ వుంటే, అతనికి దుఃఖదాయకమైన స్వప్నములు రానే రావు. 'అయితే, శ్రుతి, మనస్సుకు కర్తృత్వమును బాధ్యత ఎందుకు యిచ్చింది?' అంటే, మనస్సు అనే ఉపాధితోనే జీవునికి స్వప్నము వస్తున్నది. నిరుపాధిక రూపములో అతడు అకర్త. రోకలితో దంచేవాడు వేతే వున్నా, రోకలి బాగా దంచుతున్నది అంటాము. అలాగే, ఉపాధియైన మనస్సునే స్వప్నకర్త అంటాము. ఇది వేదముల ప్రవచన శైలి, వక్త ఎలాగైతే సందర్భమును అనుసరించి మాటలను ఉపయోగిస్తాడో అలాగే వేదము కూడా సందర్భానుసారముగా చెప్తుంది. ఇది తెలియని మూర్ఖులు దానిలో విరోధమును చూస్తారు.

13-7) స్వప్నజ్యోతి దేహానిదా?

ఈ అధ్యాయమున, రెండవ అనుచ్ఛేదములో, జాగ్రద్వ్యవహారములో ఉపయోగపడే జ్యోతిని గురించి చర్చ జరిగింది. అప్పుడు ప్రకాశము ఆదిత్యునిది, లేక ఇంద్రియములది. కాని, స్వప్నములో వీటికి వేటికీ స్థానము లేదు. అక్కడ సూర్యుని ప్రకాశము లేదు; చంద్రుడు నక్షత్రములు విద్యుత్ వీటి వేటియొక్క ప్రకాశము కూడా లేదు; ఇంక అగ్ని ఎలా వస్తుంది? -"న తత్ర సూర్యోభాతి, న చంద్ర తారకం నేమా విద్యుతో భాంతి కుతోయమగ్నిః?" (కఠ॥ 2-2-16). అయినప్పటికీ జాగ్రత్కాలములో వలెనే, స్వప్నములో కూడా జీవునికి అన్ని ప్రజ్ఞలు ఉన్నాయి. అయితే, స్వప్నములోన జ్యోతి ఎటువంటిది? స్వప్న పదార్థములను ప్రకాశింపచేసేది ఎవరు? చిత్రపటములలో సూర్యాదులను చూడడానికి కారణమైన వెలుగు బయటనుంచి కాక, చిత్రమందిరము లోపలనే వుంటుంది. అలాగే, స్వప్నములోని ప్రకాశము కూడా దేహము బయటనుండి కాక, లోపలే వుంటుంది. ఇప్పుడు ఇంకొక ప్రశ్న-ఈ ప్రకాశము దేహమునకు సంబంధించినదా? వేరైనదా? కళ్ళలోని స్నాయువులకు (సూక్ష్మనాడులకు) వత్తిడి కలిగిస్తే, లోపలి ప్రకాశము కనపడుతుంది. ఇది అందరి అనుభవము. ఈ విధముగా స్వప్న ప్రకాశము కూడా దేహములోనిదే అని నాస్తికుల వాదము.

13-8) స్వప్న ప్రకాశము దేహానిది కాదు

నాస్తికుల వాదము తప్పు. అంధుడు కాకముందు చూచిన ఏ దృశ్యమునైనా, అంధత్వము వచ్చిన తరువాత కూడా కలలో చూడగలడు. అప్పుడు అతని కళ్ళుకాక, ఇంకెవరో చూశారు అని చెప్పవలసి వస్తుంది. ఇలా, మొదట కళ్ళతో చూచినదానిని ఇప్పుడు కళ్ళులేకుండా చూస్తున్నాడు. ఈ ప్రకారము, ఈ జ్యోతి కళ్ళకు సంబంధించి లేదు. కళ్ళకు సంబంధించి లేదు. కనుక దేహమునకు సంబంధించి లేదు.

నాస్తికుడు: ఇంద్రియములతో చూసిన విషయము మనస్సులో వాసనారూపముగా ఉండిపోయినది. స్వప్నములో ఈ వాసన విషయరూపముగా వచ్చినది. అప్పుడు ఇంద్రియములు లేవు. కనుక మనస్సే విషయము – విషయి అనే రెండు పాత్రలు ధరించి, చూచే విషయిగా అయ్యి వ్యవహారము చేస్తున్నది. అప్పుడు, స్వప్నజ్యోతి దేహసంబంధమయినది అని చెప్పవలసివస్తుంది.

వేదాన్తి: నీవు చెప్పినట్లు – ద్రష్ట, కళ్ళకంటె వేరుగానే ఉన్నాడు. కాని, నువ్వు మనస్సును ద్రష్ట అంటున్నావు. అది సరికాదు. ఎందుకంటే, మనస్సు కూడా దృశ్యమే; ద్రష్ట కాజాలదు. మనస్సు ద్రష్ట అయితే, దృశ్యమును తెలుసుకొనేందుకు ఇంకొక కరణము కావలసి వస్తుంది. (సూ॥భా॥ 2–3–38). ఇంతేకాదు, మనస్సు సుషుప్తిలో వుండదు. ఇది అందరికీ తెలిసిన విషయము. కాని, మనస్సు తనని తాను, 'నేను లేను' అని చెప్పలేదు కదా? మనస్సు యొక్క అనుపస్థితిని ఎవరో ఒకరు గ్రహించాలి. అతడే ద్రష్ట. మనస్సుయొక్క ఉపస్థితి – అనుపస్థితి ఎవరి అనుభవగోచరమో, అతడు నిజమైన ద్రష్ట. మనస్సు అతనికి దృశ్యమవడం వల్ల అది జడము. ఇందువల్ల స్వప్న జ్యోతి మనస్సుది కాదు. (బృ॥భా॥ 4–3–6).

13-9) స్వప్నజ్యోతి ఆత్మది

ఇది ఆత్మదే. ఏదైతే, ఏమీ లేని సుషుప్తిలో ఏమీ లేదని తెలుసుకుంటోందో అదే ఆత్మ. అనగా, అది తనయొక్క జ్యోతి వలననే ప్రదీప్తమవుతున్నది. ఇంకొక దానివల్ల కాదు. ఇదే ఆత్మయొక్క స్వయంజ్యోతిష్ట్వము. ఇది ఆత్మ స్వరూపమే. అయితే, స్వయం జ్యోతిష్ట్వ వ్యవహారము జాగ్రత్స్వప్నములలో బుద్ధ్యాది ఉపాధుల సంబంధముతోనే కలుగుతుంది. (అధ్యా॥ 9–12) ఈ జ్యోతివల్ల బుద్ధి దీప్తమయి, ఆలోచనలను నిశ్చయము చేస్తున్నది. దీనికంటె భిన్నమయిన మనస్సు దీనితో విషయములు గ్రహిస్తున్నది. దానికంటె వేఱయిన ఇంద్రియములు ఆ జ్యోతి వలననే, స్వయముగా చేతనములని అనిపించే విధముగా ప్రకాశింపజేయబడుతున్నాయి. దానికంటె ముందు ఆదిత్యాది జ్యోతులు అన్నీ కూడా ఈ ప్రకాశము చేతనే ప్రకాశింపజేయబడుతున్నాయి. (బృ॥భా॥4–3–7). "తమేవ భాన్తమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి" (కఠ॥ 2–2–15)– దాని ప్రకాశముననుసరించే అన్నీ మెరుస్తున్నాయి. దాని ప్రకాశములోనే అన్నీ కనబడుతున్నాయి. దాని విషయము ఈ విధంగా నిర్ణయించబడినది. మనలోని మనస్సు ఏ విషయములోనైనా మగ్నమయితే, ఆదిత్యుడు కూడా కనపడడు. ఆదిత్యుని ప్రకాశము కూడా మనస్సులోని ప్రకాశముచేతనే కనపడుతుంది. మనస్సు ఆత్మప్రకాశముచేత కనపడుతున్నది. అందువల్ల అన్ని ప్రకాశములకు మూలము ఆత్మ ప్రకాశము. దీనికి దృష్టాంతము: చంద్రుని ప్రకాశముచేత మనము చూస్తున్నాము అంటే దాని అర్థము మనము సూర్యప్రకాశముచేత చూస్తున్నాము అనే. ఎందుకనగా, సూర్యుని ప్రకాశముచేతనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు.

13-10) ఇంద్రియములతో విశేషజ్ఞానము:

ఆత్మ ప్రకాశము లేని సమయమే వుండదు. అంటే, అది అంధకారములో కూడా ఉంటుంది. అలా అయితే, అంధకారములో పనులు ఎందుకు చేయరు?

అంధకారములో శబ్ద, స్పర్శ, రస, గంధముల సహాయముతో పనులు చేస్తున్నారు.

అలాకాదు. అంధకారములో ఆత్మజ్యోతితో ఘటము యొక్క రూపమును ఎందుకు చూడలేము?

ఆత్మజ్యోతితోనే అంధకారములో ఘటము యొక్క శబ్ద, స్పర్శములను తెలుసుకోగలుగుతున్నాము. కాని, ఘటరూపమును గుర్తించుటకు, ఆదిత్యాదులు నేత్రములు – వీని అవసరము ఉంటుంది. ఆత్మ నిత్య చైతన్య (జ్ఞాన) స్వరూపము అవడము వలన ఘ్రాణాది ఇంద్రియములు వ్యర్థములేనా? కాదు. గంధాది విషయములను విభాగించడానికి వాని అవసరము తప్పదు– "నిత్య స్వరూప చైతన్యత్వే ఘ్రాణాద్యానర్థక్యమ్ ఇతి చేత్, న। గంధాది విషయవిశేష పరిచ్ఛేదనార్థత్వాత్।" (సూ॥ 2-3-18, ఛాం॥ 8-12, 3-4). అయినా కూడా ఆ ప్రకాశముతోనే రూపమును గుర్తిస్తాము అని చెప్పడానికి వీలు లేదు. ఎందుకంటే మనస్సు పనిచేయనప్పుడు ఆదిత్యుని ప్రకాశములో కూడా ఘటము కనపడదు. దీనివల్ల, బాహ్య జడజ్యోతి సహాయముతో ఘటరూపము కనపడినప్పటికీ దానితో మాత్రమే అది కనపడినది అని చెప్పడానికి వీలులేదు.

వీని అన్నింటి సారాంశము ఇది – ఈ అధ్యాయమున రెండవ అనుచ్ఛేదములో చూపించినట్టు 'వస్తువు ఇలా ఉన్నది' అనే విశేషజ్ఞానములోని 'ఇలా' అనే విశేషణమునకు ఆదిత్యాదుల, ఇంద్రియముల విశిష్టజ్యోతి కావాలి. కాని, 'ఉన్నది' అనే 'సత్తా' అనునామము గల ఫలానా వస్తువు యొక్క నిర్విశేషమైన గుర్తింపు ఆత్మజ్యోతివలననే కలుగుతున్నది.

ఈ విధముగా చెప్పినప్పటికీ, 'ఆత్మజ్యోతి వేఱుగా ఉన్నది. దానికంటె వేఱుగా జ్యోతులు కూడా ఉన్నాయి' అని అనుకోవడానికి వీలులేదు. ఉపాధులచేత సవిశేషముగా కనపడే అన్యజ్యోతులు కూడా ఆత్మజ్యోతి మాత్రమే! దానికంటె వేఱు కాదు. దీని విషయములో ఇలా యుగళవాక్యమును చెప్పవచ్చు.

13-10 క)

బాహ్యజ్యోతులు ఆత్మజ్యోతి కంటె వేఱు కాదు (పూర్వార్ధము)
కాని
ఆత్మజ్యోతి బాహ్యజ్యోతులకంటె వేఱు (ఉత్తరార్ధము).

ఈ యుగళ వాక్యములను (అధ్యా॥9-11 క)తో సరిపోల్చి చూడండి. బాహ్యజ్యోతి జగత్తు, ఆత్మజ్యోతి బ్రహ్మ. అందువల్ల ఈ యుగళ వాక్యములు ఆ యుగళ వాక్యముల రూపాంతరములు.

13-11) ఆత్మ అపరిచితము కాదు.

మన లోపలి బుద్ధియైనా, దానికంటె కొంత బాహ్యమైన మనస్సు అయినా, దానికంటె బాహ్యములయిన ఇంద్రియములైనా, వీటి అన్నిటికన్నా బాహ్యమై ఇతరులు చూస్తున్న స్థూలశరీరమైనా, ఇవన్నీ ఆత్మజ్యోతితో ప్రకాశించి చైతన్యమును పొందుతూ ఉన్నాయి. ఆత్మజ్యోతి నిర్విశేషమయినది. మిగిలినవన్నీ సవిశేషములు. అది ఎలా అని దృష్టాంతములతో తెలుపుతాము: నిరాకారమైన మట్టిలో కుండ ఆకారము అవ్యక్తరూపంలో ఉండనే ఉన్నది. అయితే ఎందుకు కనబడదు. అంటే, దీనికంటె వేఱైన మట్టి దీనిని దాచిపెట్టి ఉంచుతున్నది.

అందుచేతనే మట్టి నిరాకారమైనది. ఈ వేత్తైన మట్టినే తొలగించినప్పుడు అవ్యక్తముగా ఉన్న ఘటము వ్యక్తమవుతున్నది. ఇలాగే, నిర్వర్ణ ప్రకాశములో అన్ని వర్ణములు ఉన్నప్పటికీ ప్రతియొక్క వర్ణమును వేరే వర్ణముల ప్రకాశములు దాచిపెడుతున్నవి. అందువల్ల అది నిర్వర్ణము. అది రంగు–రంగుల వస్తువుల మీద పడినప్పుడు, ఆ వస్తువులు తమ రంగులను తప్ప, నిర్వర్ణమైన ప్రకాశములోని వేరే అన్ని రంగులను మ్రింగి వేస్తున్నవి. కేవలము తమ రంగు కలిగిన ప్రకాశమును బయటకు విడిచిపెడుతున్నవి. అందువల్ల ఆ వస్తువు ఆ రంగుతోనే కనపడుతుంది. ఉదాహరణకు: చెట్ల ఆకులు సూర్యప్రకాశములోని అన్ని రంగులను మ్రింగివేసి కేవలము పచ్చరంగునే బయట కన్పింప చేస్తున్నవి. అందువల్ల, ఆకుపచ్చరంగుతోనే కనిపిస్తున్నవి. అనగా, ఆకుపచ్చ నిర్వర్ణప్రకాశము యొక్క వికారము. ఈ విచారణ భౌతికశాస్త్ర అధ్యయనము తెలుస్తున్నది. ఈ విధముగా బుద్ధి మొదలైన కరణములు, ఆత్మజ్యోతిలో ఉన్న తమకు సంబంధించిన ప్రకాశముతో మాత్రమే చైతన్యవంతములు అవడమువల్ల, అవి ఆత్మజ్యోతికంటె వేఱుగా, విశేషముగా కనపడుతాయి. సవిశేషముగా కనపడినప్పటికీ, ఏదో విధంగా అక్కడ స్వయముగ తానే వున్నాడని ప్రతీవానికి సులభముగా తెలుస్తున్నది. ఇందువల్ల ఆత్మ –"ఆబాలగోపవిదిత" – (లలితా సహస్రనామము). పిల్లలు, ఆవులను మేపుకునే గొల్లవాళ్ళు, అందరికీ పరిచితమైనది. ఒకసారి బుద్ధితో, ఇంకొకసారి ఇంద్రియములతో, ఒకసారి స్థూలదేహముతో అధ్యాస ఉన్నప్పటికీ – దేహములో అనేకులు లేరు, కేవలము తాను ఒక్కడే ఉన్నాడు – అని అందరికీ తెలుసు. అయినా కూడా, వస్తువులలో ప్రతిఫలించిన సవిశేష వర్ణమును సులువుగా గుర్తిస్తున్నా, నిర్విశేష శుద్ధ ప్రకాశమును గుర్తించుట కష్టము. " అవభాస్యా బుద్ధిః అవభాసకం తదాత్మజ్యోతిః। అవభాస్యా వభాసకయోః వివేకతో¬నుపలబ్ధిః ప్రసిద్ధా।" (బృ॥ 4–3–7)– ఆత్మచేతనముతో చేతనాయుక్తముగా కనబడుతున్న బుద్ధ్యాది ఉపాధులను స్వయముగా గుర్తిస్తూ, వాటిని ఆమోదిస్తూ, ఆత్మ నిర్విశేషము అవడమువల్ల, తన నిర్విశేషరూపమును గుర్తించజాలక జీవుడు దుఃఖభోగి అవుతున్నాడు.

13–12) స్వప్నము వలని సౌకర్యము

పైన చెప్పినట్టు అందరూ ఆత్మాస్తిత్వమును తెలుసుకునే వున్నారు. కాని, ఉపాధులతో దానిని గుర్తించడమువల్ల, ఉపాధి ధర్మములనే దానికి ఆరోపిస్తున్నారు. బుద్ధి ధర్మముతో కూడి వుంటే ధర్మమయుడిగా, అధర్మముతో కూడి ఉంటే అధర్మమయుడిగా తనని భావిస్తున్నాడు. ఇదే విధముగా తనని తేజోమయుడు – అతేజోమయుడు, కామమయుడు – అకామమయుడు, ధర్మమయుడు – అధర్మమయుడు, క్రోధమయుడు – అక్రోధమయుడు, అని అనుకుంటున్నాడు. (అధ్యా॥ 10–1(4)). ధర్మమయుడు కూడా అతడే; అధర్మమయుడు కూడా అతడే. అయితే, అతడు ధర్మమయుడూ కాదు – అధర్మమయుడూ కాదు. శరీరము పురుష రూపమయితే పురుషుడనని, స్త్రీ రూపమయితే స్త్రీనని అనుకొంటారు. పురుషుడైనా అతడే, స్త్రీయైనా అతడే. కానీ, అతడు పురుషుడూ కాదు, స్త్రీకూడా కాదు. (అధ్యా॥ 9–3). అందువల్ల, స్వయంజ్యోతిష్టు నామకమైన తన సహజ స్వరూపమును తెలుసుకోవడము కోసము బుద్ధి మొదలైన అన్ని ఉపాధులను విడిచిపెట్టాలి. స్వప్నావస్థను చర్చించేటప్పుడు ఇదే చేశాము. అప్పుడు ఇంద్రియములు లేకపోవడంవల్ల, తన నిర్విశేష స్వయంజ్యోతిష్టు స్వరూపము తెలిసినది. జాగ్రదవస్థలో తనలో జ్యోతివున్నప్పటికీ, ఆదిత్యాది జ్యోతిస్సు కోలాహలములో, దాని మూక నిర్విశేష స్వరూపమును గుర్తించడము కష్టమయినది. స్వప్నములో, ఎప్పుడైతే ఈ కోలాహలము అణచివేయబడినదో, అప్పుడు గుర్తించడము సులభమైనది. ఈ విధముగా

మనకు స్వప్నావస్థను ప్రసాదించి, తన జ్యోతితో మనలోని అంధకారమును పోగొట్టి, తన స్వరూపమును పరిచయము చేసుకోవడమును సులభతరము చేసిన అంతరాత్మకు మన అనంత ప్రణామములు.

13-13) సుషుప్తి

జాగ్రత్తులో స్థూల సూక్ష్మ శరీరముల ద్వారా, స్వప్నములో కేవలము మనస్సు ద్వారా జీవుడు కర్మ చేస్తూ, దానిని భోగిస్తూ వుంటాడు. ఇదంతా చాలా అలసటతో కూడిన పని. పెద్ద పక్షి, ఆకాశములో ఎగురుతూ అలసిపోయినప్పుడు, విశ్రాంతి కోసము తన గూటికి వస్తుంది. ఇదే విధముగా జీవుడు కూడా అలసటను పోగొట్టుకోవడానికి సుషుప్తిలోకి వెళ్తాడు. (బృ॥ 4-3-19) ఛాం॥ 6-8-2). సుషుప్తి లక్షణముల ఆధారముతో శ్రుతి వానికి కొన్ని పేర్లు పెట్టింది. ఈ దశలో జీవుడు 'సుషుప్తిస్థానుడు.' జాగ్రత్తు - స్వప్నావస్థలలో, మనస్సు యొక్క చంచలత్వము వల్ల తయారైన అనేక వృత్తులు (జ్ఞానములు) - రాత్రి అంధకారములో ఏకీభూతమయిన జగత్తువలె - సుషుప్తిలో ఏకీభూతమయి వుంటాయి. అందువల్ల సుషుప్తాత్మ 'ఏకీభూతుడు.' అన్ని భిన్నభిన్న జ్ఞానములు చంచలత్వమును వదలి ఘనీభూతమయినందువల్ల ఈ జీవుడు 'ప్రజ్ఞానఘనుడు.' ఈ అవస్థలో దుఃఖమునుండి దూరమై ఆనందపూర్ణుడైనందువల్ల, ఇతడు 'ఆనందమయుడు' అవుతున్నాడు. (ఆనంద స్వరూపుడు కాదు). ఏ విధమైన ఆటంకములు లేకుండా ఆనందము యొక్క అనుభూతి పొందుతూ వుంటాడు. ఇందువల్ల, ఇతడు 'ఆనందభుక్'. జాగ్రత్తు మరియు స్వప్నావస్థలలో ఏ చేతనము ఉత్పత్తి అవుతున్నదో, దానికి యిది ద్వారము. అందువల్ల వీడు 'చేతోముఖుడు'. ఏది అయింది - ఏది అవబోతున్నది, ఇవి అన్నీ తెలుసుకోగలుగుతున్నాడు కనుక 'ప్రాజ్ఞుడు'. -"యత్ర సుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి తత్సుషుప్తమ్। సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానన్దమయో హ్యానన్దభుక్ చేతోముఖః ప్రాజ్ఞః తృతీయః పాదః।" (మాం॥ 5).

13-14) సుషుప్తిలో జీవుడు ఎక్కడ వుంటాడు?

హృదయములోని ఆకాశములో పడుకొని ఉంటాడు - "ఏషోన్తర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే।" (బృ॥ 2-1-17). గాఢనిద్రలో జీవుడు సూర్యసంబంది తేజస్సుతో కలసి 'హితా' నామక నాడిలో వుంటాడు. (ఛాం॥ 8-6-3)" ఈ నాడులు 72,000. పురీతత్ హృదయమును కప్పివుంచే ఆవరణము. రావిచెట్టు ఆకులో వున్న నాడులవలె, ఈ నాడులు హృదయమునుండి బయలుదేరి 'పురీతత్'ను చుట్టుకుని, దేహమునందంతటా వ్యాపించివున్నాయి- "తదా నాడీషు సృప్తో భవతి। హితానామ నాడ్యో ద్వాసప్తతిః సహస్రాణి హృదయాత్ పురీతతం అభిప్రతిష్ఠంతే తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే।" (బృ॥2-1-19). 'కౌషీతకీ ఉపనిషత్' ప్రకారం జీవుడు, ప్రాణముతో ఒక్కటిగా అణగిపోయి వుంటాడు- "తదాప్రాణైకధా భవతి।" (కౌ॥4-1). బ్రహ్మ సూత్రములలో ఇలా నిశ్చయింపబడింది - బృహదారణ్యకములో చెప్పిన హృదయాకాశమైనా (సూ॥1-3-14), కౌషీతకిలో చెప్పిన ప్రాణమయినా (సూ॥ 1-1-28), ఛాందోగ్యములో చెప్పిన నాడి అయినా (సూ॥ భా॥ 3-2-7), ఇవి అన్నీ బ్రహ్మమే. అందువల్ల సందర్భానుసారముగా, సుషుప్తి స్థానమును నాడి, హృదయము, ప్రాణము -అని చెప్పినా, తాత్పర్యము బ్రహ్మను చెప్పడమే.

13-15) అద్వితీయావస్థ

సుషుప్త్యవస్థలో ఒక అంశము చాలా విస్మయకరమైనదిగా వున్నది. జాగ్రత్‌లోగాని, స్వప్నములోగాని, ఇతరుల అనుభవమును మనము అడిగే తెలుసుకోవాలి. ఉదా:- రోగిని అడిగితే తప్ప, వైద్యుడికి అతని

బాధ ఎక్కడ ఉన్నదో తెలియదు. అలాగే, స్వప్నానుభవమును కూడా వారిని అడిగి తెలుసుకోవాలి. కాని, **గాఢనిద్ర విషయములో తాను గాఢనిద్ర పోయానని అతడు చెపితే మనకు అతని అనుభవము వినగానే తెలుస్తుంది. వేఱే అడిగే పనిలేదు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయము. ఇది ఎలా సంభవము?**

ఇంకొకని సుషుప్త్యనుభవము ఏమని వానిని అడుగగానే తనకు తెలవడం, వాడు తానే అయితేనే సాధ్యం. అంటే, అందరి సుషుప్తిలో స్వయముగా తానే వుండడమువల్ల ఇలా తన అనుభవము వుంటున్నది. ఇంకే విధముగా చెప్పినా ఈ ప్రశ్నకు సరైన సమాధానము కాదు. జాగ్రత్‌లో శరీరేంద్రియ మనస్సుల ద్వారా, స్వప్నములో కేవలము మనస్సు ద్వారా మనము రూపాదుల ప్రజ్ఞ (జ్ఞానము)ను పొందుతున్నాము. ఉపాధి వేఱుగా ఉండడమువల్ల జీవులకు తమ తమ విశేష జ్ఞానములు కూడా వేఱుగానే వుంటాయి. అందువల్ల వారి అనుభవము అడిగి తెలుసుకుంటేనే తెలుస్తున్నది. జాగ్రత్ – స్వప్నములలో ఇలా విశేష జ్ఞానమునకు కారణమైన వుండే రూపాది విషయములు ఇంద్రియములు అంతఃకరణము అవిద్యచేత, భిన్నముగా కనబడతాయి. కాని, సుషుప్తి కాలములో అవిద్యా జనితమైన భిన్నత్వమును విడచి, బ్రహ్మలో ఏకీభూతము అవుతాయి. ఆ సమయములో జీవుడు బ్రహ్మతో అభిన్నముగా వుండడము వల్ల శరీర సంబంధము ద్వారా జాగ్రత్–స్వప్నములలో భాసించే – 'నేను', 'నీవు' అనే అంతరము పూర్తిగా విడిపోతుంది. స్వయముగా ఒక్కడే వుంటాడు. "యద్ హి తద్విశేషదర్శనకారణమ్ అంతఃకరణం చక్షుః రూపం చ తదవిద్యయా అన్యత్వేన ప్రత్యుపస్థాపితమాసీత్। తదేతస్మిన్ కాలే ఏకీభూతమ్ ఆత్మనా పరేణ పరిష్వఙ్గాత్।.... అయం తు సర్వాత్మనా సంపరిష్వక్తః స్వేన పరేణ ప్రాజ్ఞేనాత్మనా ప్రియయేవ పురుషః। తేన న పృథక్త్వేన వ్యవస్థితాని కరణాని విషయాశ్చ। తదభావాత్ విశేష దర్శనం నాస్తి।" (బృ॥ భా॥4–3–23). అనగా, అందరి సుషుప్తి అవస్థలో వుండేది స్వయముగా తానే. అందువల్ల, ఇతరుల సుషుప్తి అవస్థను వేఱే అడిగే అవసరము లేకుండానే మనము గ్రహిస్తాము. అంటే శరీరము ఇంద్రియములు అనే ఉపాధులను విడిచిపెట్టిన తరువాత, ఒకరికి ఇంకొకరితో భేదము ఏమీ లేదు. 'నేను', 'ఇతరుడు' – అనే ఈ విధమైన భేదరూప సంసారము ఏమీ వుండదు. పిల్లలైనా – వృద్ధులైనా, రాజులైనా – భిక్షుకులైనా, విద్యావంతులైనా – అవిద్యావంతులైనా, పురుషులైనా – స్త్రీలయినా, సుఖావస్థ అందరిదీ ఒక్కటే. –"కుమారో వా మహారాజో వా మహా బ్రాహ్మణో వా అతిఘ్నీమ్ ఆనందస్య గత్వా శయీత।" (బృ॥2–1–19). ఇక్కడ ఆనందము 'అతిఘ్నీ'. అనగా దుఃఖమును పూర్తిగా నశింపజేసేది. సుషుప్తిలో దుఃఖము వుండడము సంభవము కాదు. ఈ అవస్థలో ఉండే దాని స్వరూపము కామరహితము – పుణ్యపాపములను విడిచి అభయముగా ఉంటుంది. "తద్వా అస్యై తదతిచ్ఛన్దా అపహతపాప్మా అభయం రూపమ్।" (బృ॥ 4–2–20).

కాని, ఈ అవస్థ మారగానే ఆనందము పోతుంది. అన్ని కరణములనూ విడిచి సుషుప్త్యవస్థను పొందగా కలిగిన ఏకత్వము – దేహ వాసనాబలము వల్ల కరణముల సంబంధము కలుగుతూనే వచ్చిన స్వప్న, జాగ్రత్తులలో సమాప్తి అయిపోతుంది. ఏ మహారాజత్వమును విడిచిపెట్టాడో ఆ మహారాజత్వము తిరిగిపొందుతున్నాడు. వదలివేసిన భిక్షుకత్వమును తిరిగిపొందుతున్నాడు. ఈ ప్రకారము పులి, సింహము, తోడేలు, పంది, కీటకము, మిడత, ఈగ, దోమ, వంటి నామరూపములను, విడిచిపెట్టిన వాటిని, అలాగే

తిరిగి పొందుతున్నాడు.- "త ఇహ వ్యాఘ్రో వా సింహో వా వృకో వా వరాహోవా కీటో వా పతంగో వా దంశో వా మశకో వా యద్యద్ భవంతి తదా భవంతి" (ఛాం॥ 6-9-3). ఇదే ఈ అవస్థలో దోషము.

13-16) ఇదే పరమానందము

సుషుప్తిలో జీవుడు ఏ ఆనందమును పొందుతున్నాడో అది పరమానందము. దీనికి ఎక్కువగాని, దీనితో సమానముగాని ఇంక ఏ ఆనందమూ లేదు. ఇక్కడ జీవుడు నీటివలె స్వచ్ఛముగా వుంటాడు. అద్వితీయుడుగా వుంటాడు. ఇదే అభయము. ఇదే పరమాత్మ . జీవునికి ఇదే పరమగతి, పరమసంపత్తి, పరమలోకము, పరమానందము. -"సలిల ఏకో ద్రష్టా ద్వైతో భవతి.... ఏషా¬స్య పరమాగతిః ఏషో¬స్య పరమా సంపత్ ఏషో¬స్య పరమో లోకః ఏషో¬స్య పరమ ఆనందః" (బృ॥ 4-3-32).

శ్రుతిలో నిద్రానందమును గురించి చెప్పిన వర్ణనను అవగాహన చేసుకోవడము అంత సులభము కాదు. ఈ మాటల మీద విశ్వాసము సులభంగా కుదరదు. ఏ ప్రయత్నమూ లేకుండానే ప్రాప్తించే ఈ నిద్రానందము, బహుశః చాలా చులకన అయింది. 'ఒకవేళ ఎక్కువగా చెప్పాలంటే నిద్రానందము దుఃఖరహితము కావచ్చు కాని, పరమానందము ఎలా అవుతుంది? దుఃఖ అభావమే, ఆనందము అని చెప్పడానికి వీలులేదు కదా? ఆనందమైతే ఒక భావరూప అనుభవము. ఆనందము విషయములతోనే పొందగలమని ప్రత్యక్ష అనుభవము. ఒక ఆనందము కన్న ఇంకొక ఆనందము అధికముగా వుండడము కూడా ప్రత్యక్షమే. అలాగే, పరమానందము కూడా ఏదో ఒక విషయము వలననే వచ్చి వుండాలి. సుషుప్తిలో జీవుడు అన్ని విషయములనుండి వేరై వుంటాడు. అప్పుడు, సుషుప్తానందము పరమానందము ఎలా అవుతుంది?' ఈ విధముగా సందేహము రావడమనేది ఆశ్చర్యకరముకాదు. దీనికి సమాధానము అధ్యారోప - అపవాదములద్వారా చెప్పవలసి ఉన్నది.

13-17) ఆనంద మీమాంస

బాహ్య విషయ సంపర్కముతోనే సుఖప్రాప్తి అవుతుంది అనే (అధ్యారోపము) ప్రత్యక్ష నిర్ణయమును ఆమోదించుదాము. కాని, నిత్యానిత్య వస్తువివేకమును బోధ చేసేటప్పుడు (అధ్యా॥ 2-1), విషయ సంపర్కము పొందిన కొంచెము సమయములోనే సుఖము సమాప్తి అవుతుంది అని చెప్పబడినది. ఇది కూడా ప్రత్యక్ష విషయమే. తరువాత, కొంత సమయము వరకు తిరిగి ఆ వస్తు సంపర్క విషయములో ఇచ్ఛ కలుగదు అన్నది కూడా ప్రత్యక్షమే. ఒకవేళ, విషయ సంపర్కముతోనే సుఖము తప్పక దొరుకుతుంది అంటే, పై మూడు ప్రత్యక్ష అనుభవముల సమన్వయము ఎలా చేయాలి? అనగా, విషయ సంపర్కము ఉండగానే సుఖసమాప్తి ఎలా అవుతున్నది? సుఖసమాప్తి అయాక, అదే విషయ సంపర్కమునకు ఇచ్ఛ మరొకసారి ఎందుకు కలగడము లేదు?

ఈ సమాధానములో దేహాత్మవాది ఇలా అంటాడు- "ఇక్కడ సమన్వయము యొక్క సమస్యే లేదు. ఎందుకంటే, వస్తుస్థితే అలా వున్నది కనుక. సంపర్క సమయములో సుఖము దొరుకుతూ వుంటుంది. దీని పరిధిని విస్తరించడానికి ఏదో మార్గమును వెదికి కనుక్కోవాలి. దీనికోసము జీవితములో ప్రయత్నము చేయాలి. అదే సార్థకము. ఇంతకంటె ఏ ప్రయత్నము కూడా వ్యర్థము."

ఏ ప్రయత్నమూ లేకుండా గాఢనిద్రలో వచ్చిన అనుభవము సుఖమే కదా!

"అది దుఃఖాభావమే కాని సుఖముకాదు."

ఇలా చెప్పడానికీ వీలులేదు. ఎందుకనగా – చాలా సమయము వరకు నిద్రకొఱకు, భోజనము కొఱకు, సుఖదాయక విషయ సంపర్కము కొఱకు, అవకాశము రానప్పుడు – ఆఖరుకు ఒకేసారి అవన్నీ ప్రాప్తిస్తే – జనులు విషయసుఖమును తిరస్కరించి భోజన సుఖము, దానిని తిరస్కరించి నిద్రాసుఖము – ఈ క్రమములో సుఖములను ఎన్నుకుంటారు. విషయ సుఖము, భోజనము అన్నీ వున్నప్పటికీ, నిద్రాసుఖము దొరకని వాడు, మిగిలిన అన్నిటినీ వదలి నిద్రమాత్రలు మ్రింగి, నిద్రపోతాడు. ఈ విధముగా విషయ సుఖము కంటె ప్రాణధారణ సుఖము, ప్రాణధారణ సుఖము కంటె నిద్రాసుఖము అధిక మహత్త్వము కలవి అని నిశ్చయమవుతున్నది. ఇంతేకాక, ఎప్పుడైతే నిద్ర చెడి పోతుందో అప్పుడు మానవుడు సుఖమునిచ్చే స్త్రీ, పుత్ర, సంపత్తి ఇత్యాదులన్నిటినీ తిరస్కరించడము మనకు ప్రత్యక్షానుభవము. దీనివల్ల, నిద్రలో కేవలము దుఃఖాభావము కాక, సుఖము వున్నదని మనకు తెలుస్తున్నది.

"విషయములు లేకుండా సుఖము ఎలా వస్తుంది?"

స్వప్నములో విషయములు లేకుండా సుఖప్రాప్తి ప్రత్యక్షము. అందువల్ల సుఖప్రాప్తికి విషయముల అవసరము లేదు.

"అక్కడ విషయవాసనే విషయముగా వున్నది."

విషయవాసనలేని సుషుప్తిలో పరమ సుఖము కలుగుతున్నది.

"అప్పుడు, విషయములకు – సుఖమునకు ఏమీ సంబంధము లేదని తెలుస్తున్నది. ఇదే సత్యమైతే, విషయ సంపర్కము ఉన్నప్పుడు వచ్చే సుఖప్రాప్తికి కారణము ఏమిటి?"

ఈ ప్రశ్న సార్థకము. దీనికి శాస్త్రము ఏమి సమాధానము చెప్తున్నదో, దాని సత్యావలోకనమునకు అతిసూక్ష్మమైన ఆత్మావలోకనము అవసరము. విషయముల సంపర్కమువల్ల ఒకప్పుడు సుఖము కలగవచ్చు. ఒకప్పుడు కలగకపోవచ్చు. అందువల్ల విషయముల వలన సుఖము వున్నదా, లేదా అని నిర్ణయించడము కుదరదు. అయితే, విషయరహిత సుషుప్తిలో సుఖము నిశ్చితముగా ఉన్నది. దీనివల్ల, సుఖమునకు– విషయములకు సంబంధము లేదని నిశ్చమవుతున్నది. దీనిని గుర్తించక, జీవుడు తన అనాద్యవిద్యవల్ల వచ్చిన వాసనలను అనుసరించి, విషయములను కోరుతున్నాడు. ఎప్పుడు వాటిని పొందుతాడో, అప్పుడు ఆ విషయ సాన్నిధ్యము వల్ల ఆ సమయములో ఆ విషయముతో తాదాత్మ్యమును పొందుతున్నాడు. అప్పుడు తనకంటె అన్యము ఏదీ వానికి కనపడదు. (దీనిని గురించి ముందు అధ్యా॥ 13–23లో చెప్పబడినది. ఇది ఎలా సంభవము అని.) ఇందువల్ల, కనీసము ఆ సమయములోనైనా తన స్వరూపము మీది తెర తొలగుతుంది. తన స్వరూపము యొక్క ఆనందము ఆకాస్త సమయములో దొరుకుతుంది. ఏ పుణ్యకర్మవల్ల ఇది లభించినదో, అది క్షణికము కనుక, ఆ సుఖము కూడా క్షణికమే. వెంటనే ఆ తెర మూసివేస్తున్నది. నానాత్వ భావము తిరిగి వచ్చి చేరుతున్నది. అందువల్ల, విషయ సంపర్కము వలన పొందే సుఖమునకు కారణము– స్వరూపమును ఆవరించిన ఆవరణ తొలగిపోవడము కాని, విషయము కాదు. అయినప్పటికీ విషయ సుఖము అనే నెపముతో ఈ సుఖమును పొందుతున్నాము కనుక దీనిని విషయసుఖమనే (తై॥భా॥2–5–4) అంటాము. ఇలా లౌకిక ఆనందము కూడా బ్రహ్మానందములో ఒక అంశమే! దీనితో ప్రారంభములో చెప్పిన –విషయ సంపర్కము వలననే సుఖము వస్తున్నదనే – అధ్యారోపమునకు అపవాదము అయినది.

13-18) ఆనందము యొక్క అంతస్తులు :

ఆనందానుభవము యొక్క ఈ విమర్శతో ఇలా నిశ్చయమయినది. సుషుప్తిలో అన్ని ఉపాధులు తొలగిపోయినందువల్ల, నానాత్వబుద్ధి పూర్తిగా నశిస్తుంది. కేవల ఆత్మ మిగులుతున్నది. సుషుప్తిలోన ఈ లక్షణమే ఆ సమయములో పరమానందము పొందడానికి కారణము. ఎందుకంటే, ఆత్మయొక్క స్వరూపము ఆనందము. అంటే, పరమానందము గాఢ నిద్రలో మాత్రమే ఉంటుందని అర్థము కాదు. తన స్వరూపమును తెలుసుకోవడముతో ఎవని నానాత్వబుద్ధి నశిస్తుందో, వాడు జాగ్రత్తులో గానీ - స్వప్నములో గానీ ఆ పరమానందమునే పొందుతున్నాడు. ఇది సాధారణముగా ఒకేసారి జరగదు. మెల్ల మెల్లగా అవుతూ వస్తుంది. తన స్వరూపము మీద ఆవరణ తొలగినంతవరకు ఆనందము ఎక్కువ అవుతూ వుంటుంది. దీనికి కారణము - ఎలా ఎలా ఆవరణ తొలగిపోతుందో, అలాగే అంతవరకు ఉన్న భేదబుద్ధి తక్కువగా అవుతూ వుంటుంది. బాహ్యజగత్తుతో తాదాత్మ్యము పెరుగుతూ వస్తుంది. మానవులు, మనుష్య గంధర్వులు, దేవ గంధర్వులు, పితరులు, ఆజానజ దేవతలు, కర్మ దేవతలు, దేవతలు, ఇంద్రుడు, బృహస్పతి, ప్రజాపతి, చతుర్ముఖ బ్రహ్మ, వీరి ఆనందములు ఒక అంతస్తు నుండి పై అంతస్తుకు పెరుగుతూ వెళ్ళడము ఈ క్రమములోనే జరుగుతుంది. వీరి అందరి ఆనందము, పరమానందములోని అంశమాత్రమే. ఎవరైతే, శ్రుతి అర్థమును తెలుసుకుంటాడో, పాపరహితుడో, అకామహతుడో, వాడు ఈ పరమానందమును ఇక్కడే పొందుతాడు. కామహతుడు=కామముచేత పీడింపబడనివాడు. అకామహతుడు= కామముతో పీడింపబడనివాడు. ఆత్మవిదుడైన వాడు, అంటే అన్నింటిలో తననే చూచుకునే వాడు, ఏ విధమైన కామముచేత పీడింపబడడు. (బృ॥భా॥4-3-33, తై॥భా॥ 2-8-3)

13-19) దుఃఖ స్వరూపము

ఈ దిశలో మనము దుఃఖస్వరూపమును విశ్లేషణ చేయవలసివున్నది. దుఃఖము ఒక మిథ్యా ప్రత్యయము (వృత్తి). అవిద్యా, కామ, కర్మల వల్ల ఉత్పన్నమయిన వాసనలచే ఏదైన విషయసుఖము ప్రాప్తించినప్పుడు, లేక ఆ పొందిన సుఖము వదలిపోయినప్పుడు దుఃఖమనే బుద్ధి ప్రత్యయము ఉత్పన్నమవుతుంది. విషయ సుఖము అనగా, విషయసాన్నిధ్యసమయములో తన స్వరూపమునకు ఉన్న ఆవరణ నివారణము అవడమే. దీనిని జ్ఞప్తిలో ఉంచుకుని దుఃఖ మిథ్యాత్వమును ఇంకొక విధముగా కూడా చెప్పవచ్చు - దుఃఖమునకు అర్థము స్వరూపము యొక్క ఆవరణమే. (ఛాం॥8-12-1). దీనికి ఒక నిశ్చిత స్వరూపము అని ఏదీ లేదు. వాసనల అనుసారము వస్తూ వుండడము వల్ల ఇది ఒక మిథ్యా ప్రత్యయము. ఇలా చూచినట్లయితే, విషయ సుఖము యొక్క లక్షణమూ ఈ విధముగా ఉండడము వల్ల అది కూడా మిథ్యా ప్రత్యయమే. అయినా, విషయ సుఖ-దుఃఖములలో ఒక అంతరము వున్నది. విషయ సుఖములో - 'ఆ విషయము నుంచి వచ్చినది' అనేది మిథ్యా ప్రత్యయమే అయినప్పటికీ, సుఖము తన స్వరూపముదే. కాని, దుఃఖములో స్వరూప సంబంధము లేదు. 'దెబ్బలు తగిలినప్పుడు కాలినప్పుడు, స్పష్టముగా బాధయొక్క దుఃఖము తెలుస్తూ వుంటే, బాధతో స్వరూపమునకు సంబంధము లేదని ఎలా చెప్పగలము?' సంబంధము లేదు అనే చెప్పాలి. ఎందుకంటే, బాధపడే వ్యక్తిని 'బాధ ఎక్కడ?' అని అడిగితే, 'ఇక్కడ' - అని ఆ ప్రదేశమును శరీరములో చూపిస్తాడు. అయితే సుఖానుభవములో ఇలా జరుగుట లేదు. అందుకే, దుఃఖమునకు స్వరూపముతో సంబంధము లేదు అని స్పష్టము. 'ఇక్కడ' అని ఇతరులకు చూపించే స్థానము తన స్వరూపము అవదు. 'అప్పుడు దుఃఖము ఎందుకు వస్తుంది?' దేహాధ్యాసతో జీవుడు దీనిని అనుభవిస్తున్నాడు. దెబ్బ

తనకే తగిలిందని అనుకుంటున్నాడు. అందువల్ల దుఃఖము వస్తుంది. ఈ అధ్యాస నిద్రలో లుప్తమయిపోతుంది. దెబ్బమాత్రము అలాగే వుంటుంది. అయినా, జీవుడు ఆ సమయములో దుఃఖానుభవమును పొందడు. అందుకే, శస్త్ర చికిత్స చేసేటప్పుడు మత్తుమందు యిస్తారు.

13-20) సుషుప్తిలోని రూపమే తన స్వరూపము

ఈ విధముగా, ఉపాధి సంబంధము లేకుండా – దుఃఖరహితము కామరహితము ఏకమేవాద్వితీయము అయిన ఏ రూపము సుషుప్తిలో వున్నదో, అదే జీవుని సత్యమైన స్వరూపము. స్వరూపమునకు అర్థము – తనదే అయిన రూపము. ఏ రూపము తనను ఎప్పుడూ విడిచిపెట్టదో, అదే తన రూపము. (అధ్యా॥5-1). సుషుప్తిలో తండ్రి-తండ్రికాదు, తల్లి-తల్లికాదు, దేవుడు-దేవుడు కాదు, దొంగ-దొంగ కాదు, భ్రూణఘ్నుడు-భ్రూణఘ్నుడు కాదు, చండాలుడు-చండాలుడు కాదు, పుల్కసుడు-పుల్కసుడుకాదు, సంన్యాసి -సంన్యాసి కాదు, తాపసి-తాపసి కాదు. ఇక్కడ జీవునికి పాపపుణ్యములతో సంబంధము లేదు. (బృ॥8-6-3). ఇక్కడ అతడు అశరీరి. అనగా, శరీరముతో సంబంధము లేనివాడు. అందువల్ల అతనిని ప్రియము అప్రియము ఇవేవీ స్పర్శించవు- "అశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః" (ఛాం॥8-12-1). ఇక్కడ ఇంకొక సందేహము రావచ్చు- అశరీరత్వము కూడా స్వరూపము అవదు. ఎందుకంటే, ఒక సమయములో (జాగ్రత్ స్వప్నములలో) ఇది దూరము అవుతుంది. సశరీరత్వము వస్తుంది-ఈ సందేహమునకు అవకాశము లేదు. ఎందుకనగా, స్వరూపములోని అశరీరి ఆత్మే జాగ్రత్తులో శరీరమనే ఉపాధితో సశరీరిగా కనపడతాడు; అయినా, అప్పుడు కూడా వాడు సశరీరి కాదు. బాహ్యదృష్టికి విశిష్టముగా కనిపించినప్పటికీ, స్వప్న జాగ్రత్తులలో కూడ స్వరూపమునకు ఏమీ హాని లేదు. ఈ విధముగా సుషుప్తిలో తనదైన ఏ స్వరూపము ఉన్నదో అది బ్రహ్మమే!

13-21) తానే బ్రహ్మ

ఏడవ అధ్యాయములో చెప్పాము (7-1, క), జీవుడు బ్రహ్మ నుండి వేఱుకాదు – బ్రహ్మ జీవునికన్న వేఱు అని. పునర్జన్మ కాలములో శరీరములో ప్రవేశిస్తున్న జీవుని గురించి శ్రుతి దీనినే అందముగా ఇలా చెప్పినది. వస్తున్న రాజుగారిని, సూతుడు గ్రామాధికారులు 'ఇదిగో వచ్చేశారు, వచ్చేశారు, చూడండి, వచ్చేస్తున్నారు' – అంటూ, నీళ్ళు ఆహారము బస యిచ్చి స్వాగతము చెప్తారు. అలాగే, ప్రవేశిస్తున్న జీవుడిని, అన్ని భూతములు కూడి "బ్రహ్మ వస్తున్నది. చూడండి, వచ్చేస్తున్నది" అంటూ వుంటాయి. – "తద్యథా రాజానమాయాన్తం సూతగ్రామణ్యం అన్నైః పానైః ఆవసథైః ప్రతికల్పంతే అయమాయాతి అయమాగచ్ఛతి ఇతి ఏవం హైవం విదం సర్వాణి భూతాని ప్రతికల్పంత ఇదం బ్రహ్మేయాతి ఇదమాగచ్ఛతీతి।" (బృ॥4-3-37). ఇదే అర్థమును (అధ్యా॥9-11)లో చూడవచ్చు. అక్కడ జీవుడు, స్థూల-సూక్ష్మ-కారణ శరీరములనే ఉపాధులతో కూడి వుంటాడు. కాని, జీవుని నిరుపాధికమైన స్వరూపమును చెప్తుండే, ప్రస్తుత సందర్భములో అలా కాదు. ఇక్కడ అతడు సర్వోపాధి వినిర్ముక్తుడు. అన్ని ఉపాధులను విడిచిపెట్టి ఉన్నాడు. వాడే బ్రహ్మ! వాడు బ్రహ్మమే! "నేను ఎవడో వీడు వాడే. వీడు ఎవడో వాడు నేనే –"యో¬హం సో¬సౌ, యో¬సౌ సో¬హం।" (ఐ॥ ఆరణ్యకము 2-2-4). పూజ్యదేవతా! నీవే నేను, నేనే నీవు- "త్వం వా అహమస్మి భగవో దేవతే¬హం వై త్వమసి।" (జాబాలశ్రుతి). ఆ ఆత్మ నీవే! –"స ఆత్మా తత్త్వమసి।" (ఛాం॥6-9-7). ఎవడు

ఇదివేఱు-నేను వేఱు అనే భావనతో ఇతర దేవతోపాసన చేస్తున్నాడో, వాడు తెలియనివాడు. వాడు ఆ దేవతలకు పశువువంటివాడు - "యో అన్యాం దేవతాం ఉపాస్తే అన్యో¬సౌ అన్యో¬హమ్ అస్మీతి న స వేద యథా పశురేవం స దేవానాం।" (బృ॥1-4-10) ఇత్యాదులను చెప్పి, శ్రుతి భేదదృష్టియొక్క అత్యంత నిందచేసినది. అనగా, సుషుప్తిలో అనుభవమునకు వచ్చే నిరుపాధిక జీవుడే బ్రహ్మ. కార్యకారణా నన్యన్యాయముతో ఎలాగైతే అవ్యవహార బ్రహ్మను నిశ్చయిస్తున్నామో, అలాగే జీవస్వరూపమును కూడా నిశ్చయించాలి. ఎందుకనగా, భాష్యకారులు యిలా చెప్తున్నారు - నామ రూపాది వికార జాతములు అన్నీ సద్రూపముతో సత్యములు స్వతంత్ర రూపముతో అసత్యము. ఎందుకంటే వికారము వాగారంభణ కోసము ఉండే పేరు అని శ్రుతి చెప్పింది. **ఇలాగే జీవుడు కూడా** - "సర్వం చ నామరూపాది సదాత్మనైవ సత్యం వికారజాతం స్వతస్తు అనృతమేవ వాచారంభణం వికారో నామధేయమ్ ఇత్యుక్తత్వాత్। తథా జీవో¬పీతి।" (ఛాం॥భా॥6-3-2) అందువల్ల జీవ-బ్రహ్మానన్యత్వము ద్వారా జీవుని యథార్థ-అవ్యవహార్య స్వరూపమును తెలుసుకోవాలి. జీవుడు బ్రహ్మ కన్న వేఱు కాదు, కాని బ్రహ్మ జీవుని కన్న వేఱు - "పరమాత్మనో జీవాదన్యత్వం ద్రఢయతి, జీవస్య తు న పరస్మాదన్యత్వమ్।" (సూ॥భా॥1-3-19). ఇదే జీవబ్రహ్మల అనన్యత్వము. ఈ యుగళవాక్య ఉత్తరార్ధములో చెప్పిన జీవుడు స్వతంత్రుడు, బ్రహ్మతో సంబంధము లేనివాడు, వస్తుతః వాడు లేనే లేదు. కాని, పూర్వార్ధములో చెప్పిన జీవుడు ప్రాణధారణాది వ్యవహారములతో కనిపించినప్పటికీ బ్రహ్మకంటె వేఱుకాదు. వీనికంటె అన్య ద్రష్ట లేదు. వీనికంటె వేఱు శ్రోత లేదు. వీనికంటె అన్య మంత లేదు. వీనికంటె వేఱు విజ్ఞాత లేడు. "నాన్యో¬తో¬స్తి ద్రష్టా నాన్యో¬తో¬స్తి శ్రోతా నాన్యో¬తో¬స్తి మన్తా నాన్యో¬తో¬స్తి విజ్ఞాతా।" (బృ॥3-7-23) ఇత్యాది శ్రుతి మంత్రములు దీనినే చెప్తున్నాయి. కాని, శ్రుతి బ్రహ్మను కూటస్థుడని కూడా అంటున్నది. ఇందువల్ల శారీరిక వ్యవహారమును చూచి, సాధకునికి-నేను బ్రహ్మనా, లేక బ్రహ్మకంటె వేఱా, అనే సంశయము రావడము సహజము. కాని, శరీరరూప ఉపాధి సంబంధముచేతనే తనలో వ్యవహారము కనపడుతున్నది. నిరుపాధిక రూపములో లేదు. ఇది సుషుప్తి అనుభవముతో తెలుస్తున్నది. ఈ విషయమును స్మృతిలో ఉంచుకుని, విద్యచేత తన స్వరూపములో ఉపాధి సంబంధమును నిరాకరిస్తే 'అహం బ్రహ్మాస్మి।' అని నిశ్చయమవుతున్నది. నిదిధ్యాసనతో ఇది దృఢమయిన తరువాత, వ్యవహార సమయములో కూడా మనస్సుకు బ్రహ్మాత్మైకత్వ జ్ఞానమునుండి చ్యుతి ఉండదు. తరువాత వీనిలో వ్యవహార ఛాయ కూడా ఉండదు. అనగా ఉపాధి రహితుడైన తానే బ్రహ్మ అని తెలుసుకోవాలి. ఇది శ్రుతి యొక్క ఉపదేశము. "నేనే బ్రహ్మ" అనే విషయములో ఎంత బుద్ధిమంతుడైనా విచారణ చేసి ఉపపత్తిని చెప్పజాలడు. అంటే, 'నేనే బ్రహ్మ' అన్నది తర్కముతో నిశ్చయము చేయడము సాధ్యము కాదు. కాని, శ్రుతి ఏది చెప్తున్నదో, దానిని యుక్తితో ఇలా తెలుసుకోగలము.

13-22) బ్రహ్మాత్మైకత్వమునకు యుక్తి

యుక్తితో "నేను బ్రహ్మే, నేనే బ్రహ్మ" అనే శ్రుతి వాక్యములను సమ్యగ్విచారము చేసేటప్పుడు, క్రింది రెండు అంశములను స్మరణలో ఉంచుకోవడము అవసరము.

అ) పైన చెప్పిన వాక్యములలో 'నేను' అనే దాని అర్థము సుషుప్తిలో నిశ్చయమైన నా నిరుపాధిక స్వరూపము, కాని, జాగ్రత్స్వప్నములలో అనుభూత సోపాధికరూపము కాదు.

ఆ) బ్రహ్మ, సత్యము-జ్ఞానము-అనంతము (అధ్యా॥9).

ఈ నేను ఈ బ్రహ్మ లక్షణములతో ఉన్నవాడినా, కాదా? నీవు బ్రహ్మమా, కాదా? అని, యుక్తితో విచారణ చేయాలి.

సత్యమంటే ఎల్లప్పుడూ ఒకటిగానే వుండడము. (అధ్యా॥ 9-4). దేశములో, కాలములో, వస్తువులలో, జ్ఞాత అనుభవములో ఒకే ప్రకారముగా ఉండనిది, ఏదైనా అసత్యం అవుతుంది. అసత్యత్వము ఇంకే విధముగానూ అవదు. ఎవరికైనా, ఏ కాలములోనైనా, ఏ దేశములోనైనా, సుషుప్తి అనుభవము ఒకే విధముగా ఉంటుంది. దేశ-కాల-జ్ఞాతల భేదము వుండే అవకాశము లేదు. ఇక సుషుప్తిలో వస్తు సంబంధమే లేదు. ఇది సత్యత్వ లక్షణము.

ఇప్పుడు (అధ్యా 9-10)లో చెప్పిన 'జ్ఞాన' శబ్దార్థమును స్మృతికి తెచ్చుకోవాలి. అది ఏ విషయము యొక్క వృత్తిజ్ఞానమూ కాదు. అది నిర్విశేష జ్ఞప్తి స్వరూప భూతజ్ఞానము. సుషుప్తిలో సవిశేషవృత్తి జ్ఞానము ఉండనే వుండదు. కాని, జ్ఞప్తి రూప ఆత్మజ్యోతి మాత్రము వుంటుంది. అది లేకపోతే, లేచిన తరువాత - 'నాకు ఏమీ తెలియలేదు' అని చెప్పజాలము. అందువల్ల బ్రహ్మ యొక్క జ్ఞాన లక్షణము సుషుప్త్యాత్మలో కనిపిస్తున్నది.

సాంతత్వము, దేశ-కాల-వస్తు పరిచ్ఛేదముచేత కాని జ్ఞాత యొక్క విభిన్న ప్రకారములైన అనుభవములతోనే కాని వస్తుంది. ఇంకొక విధముగా రాదు. (అధ్యా॥9-6) కాని, సుషుప్త్యవస్థలో వీటిలో ఏ ఒక్క ఉపాధీ లేని కారణముగా ఆనన్త్యము స్వతఃసిద్ధము.

ఈ విధముగా, సుషుప్తి కాలములో బ్రహ్మైకత్వము సిద్ధిస్తున్నది. దీనిని ఇంకొక విధముగా కూడా గమనించవచ్చు.

1. సుషుప్తిలో బాహ్యాభ్యంతరములలోని సమస్త కార్యప్రపంచము కన్న ఆత్మ భిన్నముగా వుండడము అందరికీ అనుభవమే.

2. తన ఆనంత్య లక్షణముతో బ్రహ్మ-జీవునికంటె కాని, సమస్త కార్య ప్రపంచముకంటె కాని, వేఱుగా వుండడము శాస్త్రనిశ్చయము.

3. అన్నిటికంటె వేఱుగా వున్న బ్రహ్మ తన జ్ఞాన లక్షణముతో ఏకమేవాద్వితీయముగానే వున్నది (అధ్యా॥ 9-10 చూడండి).

ఇందువల్ల, సుషుప్తిలో అన్నిటికంటె వేఱుగా వున్న జీవుడు బ్రహ్మతో వేఱుగా ఉండడు, బ్రహ్మగానే వుంటాడు. అనగా, సుషుప్తిలో "నేను-బ్రహ్మ" అని రెండుగా వుండలేదు. అంటే "నేనే బ్రహ్మ".

సుషుప్తిలో ఈ విధముగా బ్రహ్మాత్మైకత్వమునకు యుక్తి చెప్తే కొన్ని ప్రశ్నలు వస్తాయి. స్వతఃజ్ఞాన స్వరూపుడు అయినప్పటికీ ఏమీ ఎందుకు తెలుసుకోజాలడు? తనని తాను కూడా ఎందుకు తెలుసుకోజాలడు? ఈ ప్రశ్నలకు ఉత్తరము చెప్పాలి.

13-23) విశేష జ్ఞానము ఎందుకు లేదు?

పూర్వకాలములో ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడము కోసము ఇంద్రుడు ప్రజాపతి దగ్గరకు వెళ్ళి

ప్రశ్నించాడు. దానికి సమాధానముగా ప్రజాపతి సుషుప్తాత్మను గురించి చెప్పాడు. ఆ సమయములో ఇంద్రుడు పై ప్రశ్ననే అడిగాడు. "తనకు తాను తెలియడము లేదు. మరేమీ కూడా తెలియడము లేదు. వినాశనమును పొందాడు. ఇక్కడ నాకు ఏదీ భోగ్యవస్తువు కనపడడము లేదు" – "నాహ ఖల్వయమేవం సంప్రత్యాత్మానం జానాతి అయమహమస్మీతి నో ఏవేమాని భూతాని వినాశమేవాపీతో భవతి, నాహమత్ర భోగ్యం పశ్యామి॥" (ఛా॥8-11-1). అతి పుణ్యశాలి బుద్ధిశాలి అయిన ఇంద్రునికే ఇటువంటి సందేహం కలిగిందంటే, మనవంటి సామాన్య మానవులకు యిటువంటి ప్రశ్న పుట్టడములో ఆశ్చర్యము ఏమీ లేదు. ఇందువల్ల, సుషుప్తిలో ఏమీ తెలియకపోవడానికి కారణము చెప్పవలసే వున్నది.

ఈ విశ్లేషణమును మనము దృష్టాంతములతో తెలుసుకుందాము. వస్త్రము యొక్క పొడవు కొలబద్ధతో కొలుస్తాము, ఒక వస్తువు బరువును తూకపురాయితో తూచి తెలుసుకుంటాము. కొలబద్దతో బరువును తెలుసుకోలేము. తూకపు రాయితో వస్త్రమును కొలవలేము. ఇందువల్ల, **కొలిచే కరణమూ కొలవబడే వస్తువూ, స్వరూపములో ఒకటే,** అని తెలుస్తున్నది. ఇంక, కొలిచే కొలబద్ద, కొలవబడే వస్తువు రెండూ 'దీర్ఘత్వము' అనే దాని వికారములు. కొలిచే తూకపు రాయి, కొలవబడే వస్తువు రెండూ 'బరువు' అనే దాని వికారములు. దీనివల్ల ఇలా నిశ్చయమవుతున్నది – **కొలిచే కరణము, కొలవబడే వస్తువు రెండూ స్వరూపములో ఒకటే అయినా వికార-దృష్టితో వేరు వేరు. కొలత అనే వ్యవహారము వికారములోనే వుంటుంది, బరువు-దీర్ఘము అనేవి స్వరూపములో లేవు.** ఇదే ప్రకారము, జ్ఞేయవస్తువు యొక్క ఆకారమును పొందిన అంతఃకరణముతో జ్ఞేయమును తెలుసుకుంటున్నాము. ఈ అంతఃకరణమే కాని, చక్షురాది ఇంద్రియములే గాని, జ్ఞేయమైన రూపములే గాని, ఇవన్నీ తమ స్వరూపములో బ్రహ్మయే అయినా, వికారదృష్టితో భిన్నముగా వున్నవి. సుషుప్తిలో జీవుడు పరమాత్మను ఆలింగనము చేసుకుని వుంటాడు. కనుక ఇవన్నీ తమ భిన్నత్వమును విడచి జ్ఞాతృ సమేతముగా – ఏది అన్నింటికి భిన్నముగా వున్నదో, దేనికి ఏమీ భిన్నము కాదో – ఆ బ్రహ్మలో ఉపశాంతి పొందుతాయి. దేనినైనా తెలుసుకోవాలంటే, అది వానికన్న వేఱుగా వుండాలి. కాని, సుషుప్తిలో ఈ భిన్నత్వము లేదు. ఏకత్వమే ఉన్నది. (బృ॥ 4-3-23). అందువల్ల ఏమీ తేలుసుకోలేడు. దీని విషయములో శ్రుతి, అధిక ప్రేమతో పరస్పరాలింగనములో ఉన్న స్త్రీ-పురుషులను దృష్టాంతముగా చెప్తున్నది. ఆలింగనమునకు పూర్వము ఇద్దరూ వేఱువేఱుగా ఉన్నారని ఇద్దరికీ తెలుసు – కాని, ఆలింగన సమయములో వారు తమకంటె వేఱుగా ఏమీ గుర్తించరు. స్వయముగా, సుఖముగా ఉన్నారో – దుఃఖముతో ఉన్నారో, అదీ గుర్తించరు. వారిద్దరూ అభిన్నముగానే ఉంటారు. సుషుప్తిలో కూడా అదే విధముగా వుంటుంది– "తద్యథా ప్రియయా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేదనాన్తరమ్, ఏవమేవాయం పురుషః ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేదనాన్తరమ్॥" (బృ॥ 4-3-21).

ప్రశ్న:– ఇతరుడు కూడా ఉన్నప్పుడు, 'నేనొక్కడే ఉన్నాను' అని తెలుసుకోవడము అయథార్థ జ్ఞానము కాదా?

సమాధానము :– కాదు. వానికి అయథార్థజ్ఞానము కలగడము సంభవముకాదు. ఎందుకనగా, తనకంటె అన్యునిగా ఇంకొకరు ఉన్నారని తెలుసుకోవడములోనే వారిలో కామము సంభవించినది.

ప్రశ్న:– అప్పుడు మనస్సు ఇంక ఎక్కడో వుండడమువల్ల, అది ఇంకొకరిని తెలుసుకోలేకపోతున్నది అని చెప్పాలి.

సమాధానము:– ఇది కూడా సంభవముకాదు. ఎందుకంటే, మనస్సు వేటిలో లగ్నమయివుందో కనీసము దానిని తెలుసుకోవాలి. కాని, సుషుప్తిలో అలా కూడా ఏదీ తెలుసుకోలేదు. "సుషుప్తే అగ్రహణం అన్యాసక్తవత్ ఇతి చేత్? న, సర్వాగ్రహణాత్।" (తై॥భా॥ 2-8-5).

ప్రశ్న:– సుషుప్తిలో ఏమీ తెలియకపోవడానికి కారణము స్పష్టము కాకపోవడమువల్ల ఆ సమయములో, 'నేను మాత్రమే' ఉన్నాను – అని తెలుసుకోవడము అయథార్థజ్ఞానమే అవుతుంది – అంటే?

సమాధానము:– కాదు. జాగ్రత్తు, స్వప్నములలో వేతే ఏదో తెలుసుకునే వ్యవహారము తన స్వరూపములో లేదు.

ప్రశ్న:– ఇలాగే ఎందుకు చెప్పాలి? సుషుప్తిలో వేరే ఏమీ తెలియకపోవడము నా స్వరూపము కాదు – అని ఎందుకు తెలుసుకోకూడదు?

సమాధానము:– కాదు. మూడు అవస్థలలో 'నీవే' ఉన్నప్పటికీ సుషుప్తిలో ఇంకొక విషయ ఆపేక్ష లేకుండా 'నీవే' వుంటావు. ఇందువలన అది నీ స్వరూపము. కాని, జాగ్రత్ – స్వప్నములలో వికారముల, కరణముల అపేక్షతో నీలో విశేషజ్ఞాన వ్యవహారము కనపడుతున్నది. అందువల్ల అది నీ స్వరూపముకాదు. (అధ్యా॥ 12-15 (2)).

ప్రశ్న:– సుషుప్తిలో మనస్సు – ఇంద్రియములు నిష్క్రియముగా ఉంటాయి. అందువల్ల ఏమీ తెలియబడదు. అని చెపితే?

13-24) తన జ్ఞానము కూడా ఎందుకు లేదు?

విశేషజ్ఞానమునకు, మనస్సు – ఇంద్రియములు ఆవశ్యకము అన్నది నిజమే! (అధ్యా॥ 13-10). అయినప్పటికీ సుషుప్త్యనుభవమునకు ఈ కారణము సరిపడడము లేదు. ఎందుకంటే, 'మనస్సు నిష్క్రియమైనందువల్ల ఏమీ తెలుసుకోలేదు,' అని చెప్పినందువల్ల, మనస్సుకు జ్ఞాతృత్వము వుండాలి. కాని, మనస్సు జ్ఞాత కాజాలదు అని ముందే నిశ్చయమయింది. మనస్సు జ్ఞేయమే, జడమే. ఇంతేకాదు, జాగ్రదవస్థలో – నా కళ్ళు నిష్క్రియమయ్యాయి నేను వినలేను– ఇలా అనుభవము ఉన్నట్లే, మనస్సు నిష్క్రియమైతే, అది జీవునికి అనుభవములోనికి రావాలి. అయితే రాదు. జీవునికి తన అస్తిత్వమే అనుభవమునకు రాదు. ఈ పరిస్థితి వివరణ కూడా, శ్రుతిలో చెప్పిన ఏకత్వమును ఆమోదించినప్పుడే దొరుకుతుంది. జీవుడు అవిద్యాకల్పిత ఉపాధులను విడిచి – ఏది అన్నింటితో వేతైనా, ఏమి దేనితోనూ వేఱు కాదో– ఆ బ్రహ్మలో ఒకటిగా అవుతాడు (అధ్యా – 9-11,క). అంటే బ్రహ్మ అయి ఉంటాడు. ఇలా అతడు ఒక్కడే ఉండడమువల్ల ఇంక ఏమీ గ్రహించడు. అతడు ఏమీ చూడలేదు కదా? చూచేవాడు అయ్యే చూడలేదు. "యద్వై తన్న పశ్యతి పశ్యన్ వై తన్న పశ్యతి।" (బృ॥ 4-3-23). అనగా, విశేషజ్ఞానము లేకపోవడానికి కారణము ఏకత్వమే.

ప్రశ్న:– ఒకవేళ అలా అయితే, తనను తాను కూడా ఎందుకు గుర్తించడు?

సమాధానము:– ఈ ప్రశ్న అనాద్యవిద్య వల్ల ఉత్పత్తి అవుతుంది. శరీరముతో ఇంద్రియములతో అధ్యాస వుండడము జీవుని స్వభావము అయిపోయినది. ఈ అవిద్యాకల్పిత బుద్ధి సంబంధముతోనే జీవుడు తన అస్తిత్వమును గ్రహిస్తున్నాడు. ఇందువల్ల, ఇంకొక వస్తుజ్ఞానము లేని సుషుప్తిలో, అతడు తనని తాను

లేనివానినిగా అనుకుంటాడు. కాని, అతడు సుషుప్తిలో కూడా ఉన్నాడు. లేకపోలేదు. ద్రష్టకు దృష్టిలోపము లేనే లేదు. అది అవినాశి. -"న హి ద్రష్టుః దృష్టేః విపరిలోపో విద్యతే అవినాశిత్వాత్।" (బృ॥ 4-3-23). ఒక్కడే ఉన్నప్పుడు, తనని తాను తెలుసుకోవడము అనే క్రియ ఉండదు. తన భుజము మీద తాను ఎలా కూర్చుంటాడు? అగ్ని తనని తాను కాల్చుకోజాలదు కదా?

ప్రశ్న:- కనీసము, 'బ్రహ్మతో ఏకమైనాను' అని అయినా తెలుసుకోడా?

సమాధానము:- తడిబట్టలో నీరు ఉండినట్లు జీవుడు బ్రహ్మలో చేరుకోలేదు. మధువులో అన్ని పువ్వుల రసము తేనెగానే ఉన్నట్లు, జీవుడు బ్రహ్మలో వేఱుగా కాక, కలసిపోయి వుంటాడు. అందువల్ల బ్రహ్మలో ఏకమైనాను అనికూడా తెలుసుకోలేడు. (ఛాం॥ 6-9-12).

13-25) ఒక లౌకిక దృష్టాంతము

స్వప్న జగత్తును చూసి, ఆత్మజ్యోతిని తెలుసుకున్నాము. అంతేకాక, సుషుప్తిలో కూడా అది వున్నదని తెలుసుకున్నాము. కాని, అక్కడ ఏమీ తెలియకపోవటంవల్ల ఈ విషయమును సులభముగా తెలుసుకునేది కాదు. ఇందుకు, ఒక లౌకిక దృష్టాంతమును ఇస్తున్నాము - తీవ్రమైన ప్రకాశ సహాయముతో బయలులో జరుగుతున్న నాటక ప్రదర్శనమును చిత్రముగా తీశారు. తరువాత, కేవలము చిత్రపటము ద్వారా, నాటకమును చూడజాలము. కాని, చిత్రప్రదర్శనశాల చీకటిలో, తీవ్ర ప్రకాశముతో చిత్రము ప్రకాశించినప్పుడు చూడగలము. స్వప్నము కూడా ఇటువంటిదే. జాగ్రత్తు యొక్క వ్యవహారము, మనస్సులో వాసనా రూపముగా బంధింపబడి వుంటుంది. ఇంద్రియములు, ఆగిపోయిన నిద్రలో, చిత్రరూపమైన మనోవాసనలను, ఆత్మజ్యోతిః ప్రకాశముతో చూడగలము. జాగ్రత్తులో ఉన్నప్పటికీ, ఆత్మజ్యోతి ప్రకాశించినప్పుడు, కేవలము ఒకే వాసనను ఏకాగ్రచిత్తములో చూడగలము. పిల్లలు ఏమో ఆలోచిస్తూ, తమలో తామే మాట్లాడుకోవడము, భక్తుడు - ఏకాగ్రచిత్తముతో తన ఆరాధ్యదైవమును చూడడము ఇవి పైన చెప్పిన తత్త్వమునకు ఉదాహరణములు.

ఇంకొక విషయము - సుషుప్తి నుంచి లేచాక జీవుడు - "నాకు ఏమీ తెలియలేదు " అని చెపుతాడు. ఇది ఎలా సంభవము? నాటక చిత్రీకరణము జరిగేటప్పుడు, ఫిల్ములో కొంత భాగము ఏ చిత్రమునూ తీయకుండా ఆకాశమువైపు తిరిగి ఉన్నది. ఈ విషయము ఆ సమయములో తెలియదు. చిత్రమును సరిచేసి, ప్రదర్శనశాలలో ప్రదర్శించేటప్పుడు అక్కడ ఏమీ లేదని తెలుస్తున్నది. 'ఏమీ లేదు' అంటే, ఏ దృశ్యమూ లేదని. అప్పుడు ప్రకాశింపజేసే ప్రకాశము కూడా లేదని కాదు. ప్రకాశము తప్ప, ఇంక ఏమీ లేదని దాని అర్థము. ఈ ప్రకారము, సుషుప్తిలో కూడా 'ఏమీ లేదు' అనే దాని అర్థము - ఆత్మజ్యోతి తప్ప, అక్కడ ఇంకేమీ లేదు అని మాత్రమే.

13-26) సుషుప్తిలో అవిద్య ఉన్నదా, లేదా?

సుషుప్తిలో జీవునికి బ్రహ్మతో ఏకత్వము వున్నది. అందువల్ల, నానాత్వముతో వచ్చే విశేషజ్ఞానము అక్కడ లేదు అని ఇంతకుముందు చాలాసార్లు చెప్పాము. అవిద్యవల్లనే నానాత్వము కనపడుతుందని కూడా చెప్పాము. అందువల్ల సుషుప్తిలో అవిద్య లేదని అనిపిస్తుంది. భాష్యకారులు కూడా ఇంకొకటి అని చూపించే దానికి హేతువైన అవిద్య అక్కడ లేదు- "అన్యత్వ ప్రత్యుపస్థాపకహేతోః అవిద్యాయాః అభావాత్।" (బృ॥

భా॥ 4-3-21) అని ఒక చోట చెప్పారు. దీనివల్ల, సుషుప్తిలో అవిద్య లేదని గ్రహించగలుగుతున్నాము. అయితే, తురీయ విషయము ఇలా చెప్తున్నారు – సుషుప్తిలోని ప్రజ్ఞాన ఘనత్వమును నిషేధిస్తూ, సుషుప్తావస్థను కూడా నిషేధించారు. ఎందుకంటే, అక్కడ బీజరూపముతో అవివేకము వున్నది. –"న ప్రజ్ఞానఘనం ఇతి సుషుప్తావస్థా ప్రతిషేధః బీజభావావివేకరూపత్వాత్।" (మా॥భా॥7). అయితే, ఇలా ప్రశ్న వస్తుంది – సుషుప్తిలో అవిద్య ఉన్నదా, లేదా? చాలామంది విద్వాంసులు ఉన్నది అంటున్నారు. కాని కొందరు లేదు అంటున్నారు. అందువల్ల దానిని భాష్యాధారముతో విచారణ చేయాలి.

13-27) సుషుప్తిలో అవిద్యను లేదంటే దోషము

సుషుప్తిలో అవిద్యను ఆమోదించకపోతే అనేక దోషములు వస్తాయి.

1) సాధన సంపత్తిలేని మానవులు, సింహము పులి మొదలైన జంతువులు, కీటకములు అన్నీ గాఢనిద్ర పోతాయి. నిద్రలో అవిద్య లేకపోతే, నిద్రపోయిన వీనికన్నిటికీ ముక్తిరావలసి వుంటుంది. "సుప్తమాత్రో ముచ్యత ఇతి ఆపద్యేత।" (సూ॥భా॥3-2-9). దగ్గరవున్న జిల్లేడు మొక్కతోనే తేనె దొరకేటట్లయితే, దానికోసము ఎవరూ కొండమీదికి వెళ్ళరు. (సూ॥భా॥3-4-3). ఇంత సులభముగా ముక్తి దొరకేటట్లయితే, ఎవ్వరూ కూడా అధ్యాత్మ సాధన చేయరు. దీనివల్ల శాస్త్రీయ సాధనామార్గము నిరర్థకము అవుతుంది.

2) శ్రుతి, ఆత్మ దేహత్రయాతీతమని చెప్పి తురీయుడు కారణశరీరమనే అవిద్యామలము లేనివాడని చెప్పినది – "అవిద్యామల రహితమితి కారణ శరీర ప్రతిషేధః" (ఈశా॥భా॥8). తురీయాత్మ – అవిద్యా, దాని కార్యములు (అధ్యాస) లేనివాడు. –"తురీయం అజ్ఞానతత్ కార్య వర్జితం।" (గీ॥భా॥10-3). అవిద్యా రూప కారణ శరీరము సుషుప్తిలో లేకపోతే " న ప్రజ్ఞానఘనం ఇతి సుషుప్తావస్థా ప్రతిషేధః బీజభావావివేక రూపత్వాత్ " – ఈ మాండూక్య భాష్య వాక్యముతో సరిపడదు. సుషుప్తిలోనే అవిద్య లేకుంటే దేహత్రయ నిరాకరణ చేస్తున్న తురీయమును చెప్పే ఆవశ్యకత కూడా ఉండేది కాదు.

3) బ్రహ్మతో ఒకటైనప్పటికీ, నిద్రలో అవిద్యా కర్మల సంబంధము ఉండడమువల్ల – "విద్యతే కర్మ చ అవిద్యా చ ।" (సూ॥భా॥ 3-2-9) లేచిన తరువాత తమ తమ అవిద్యలతోనే తమ తమ బుద్ధి సంబంధమును పొందుతున్నారు. ఆ సంబంధమును ఇచ్చేవాడు ఈశ్వరుడే. నిద్రలో అవిద్య లేకపోతే, లేచిన తరువాత, నిద్రకి పూర్వము ఉన్న బుద్ధిసంబంధమునే తిరిగి జీవుడు పొందడము సంభవము కాదు (సూ॥భా॥ 3-2-9). ఇలా అయితే, నిన్నటి వ్యవహారము ఇవాళ పూర్తి చేయజాలము. ఇందువల్ల, ఇలా చెప్పాలి – బుద్ధి యొక్క సంబంధము సుషుప్తి ప్రళయములలో శక్తి రూపముతో వుండి, జాగ్రత్తులోను సృష్టిలోను ప్రకటమవుతుంది – "బుద్ధి సంబంధః శక్త్యాత్మనా విద్యమాన ఏవ సుషుప్తిప్రళయయోః పునః ప్రబోధప్రసవయోః ఆవిర్భవతి ।" (సూ॥భా॥ 2-3-31). కేవలము ఇంతే కాదు– యోగము ద్వారా పొందిన సమాధిలో కూడా అవిద్య వుంటుంది – "సుషుప్తి సమాధ్యాదావపి సత్యాం స్వాభావిక్యాం అవిభాగ ప్రాప్తౌ మిథ్యాజ్ఞానస్య అనపోదితత్వాత్ పూర్వవత్ పునః ప్రబోధే విభాగో భవతి।" (సూ॥భా॥2-1-9).

4) ఒకవేళ సుషుప్తిలో అవిద్య లేకపోతే, అది ఆనంద స్వరూపమే అవుతుంది. కాని, అలా లేదు. జాగ్రత్తు స్వప్నములలో వున్న విషయ-విషయి ఆకారముతో కలిగే మనస్సుయొక్క స్పందనము వల్ల వచ్చే ఆయాస దుఃఖము ఆ సమయములో లేకపోవడము వలన అది ఆనందమయము. అనగా ఆనందముతో

నిండి వున్నది. కాని, ఆనంద స్వరూపము కాదు. ఎందుకంటే, అది సమాప్తం అయిపోతుంది – “మనసః విషయవిషయ్యాకార స్పందనాయాస దుఃఖాభావాత్ ఆనన్దమయః, ఆనన్దప్రచురః, న ఆనన్ద ఏవ, అనాత్యన్తికత్వాత్।” (సూ॥భా॥5).

ఈ ఆక్షేపములకు ఏమైనా సమాధానము ఉన్నదా? అని మనము అడిగినట్లయితే, వారు ఇలా అంటారు – అవిద్య లేనే లేదు. సుషుప్తి దృష్టితోనే చెప్పినప్పుడు భాష్యకారులు అవిద్యను ఆమోదించరు. ఎక్కడ అవిద్య వున్నదని చెప్పారో అది కేవలము జాగ్రత్ దృష్టితో చెప్పినదే.

13-28) సుషుప్తిలో అధ్యాస లేదు – అవిద్య వున్నది.

సుషుప్తిలో జీవుని అంతఃకరణము నాడీగత ‘పిత్తము’ అనే తేజస్సుతో వ్యాప్తమయి ఉంటుంది. అందువల్ల అది బాహ్య విషయములను చూడదు. – “తేజసా నాడీగతేన పిత్తాఖ్యేన అభివ్యాప్తకరణః న బాహ్యాన్ విషయాన్ ఈక్షతీ।” (సూ॥భా॥3-2-7). ఈ సమయములో జీవుని జ్ఞాతృత్వము నష్టమైపోతుంది. ఇక, సుషుప్తిలో బ్రహ్మ ఒకటే వుంటుంది. ఈ బ్రహ్మలో సుషుప్తి లేదు; జీవుడూ లేదు, అవిద్య కూడా లేదు. ఈ స్థితిలో – సుషుప్తిలో జీవునికి అవిద్య వున్నదా? లేదా? – అన్నది పశ్చాభాసము మాత్రమే. ఇందువల్ల, ఉపాధి సంబంధముతో జీవుని విషయమును స్పష్టముగా నిరూపణ చేసుకుని, ఇలా ప్రశ్నించాలి. జీవుడు ఎవరు? ‘సత్’ (బ్రహ్మ) నే, ఉపాధి సంబంధము వల్ల జీవుడని, ఉపచారముగా చెప్తున్నారు. ఎంతవరకు ఒక ఉపాధి సంబంధము వుంటుందో అంతవరకు ‘ ఆ జీవుడు’ అని వ్యవహరిస్తారు. ఇతర ఉపాధి సంబంధముతో, ‘ఇంకొక జీవుడు’ అంటారు. “సదేవ తు ఉపాధి సంపర్కాత్ జీవ ఇతి ఉపచర్యతే। ఏవం సతి యావత్ ఏకోపాధిగతా బంధానువృత్తిః తావదేక జీవ వ్యవహారః। ఉపాధ్యం తరగతాయాం తు బంధానువృత్తౌ జీవాన్తర వ్యవహారః।” (సూ॥ భా॥3-2-9). అతని అంతఃకరణ ఎప్పుడైతే నాడులలో ఉపశమిస్తుందో, అప్పుడు జీవుడు సుషుప్తిలో వుంటాడు. లేచిన తరువాత అతనిని ఇతర జీవులతో వేరు చేయడానికి కారణమైన అతని అవిద్య కర్మ అంతఃకరణములో వుంటాయి. “ఇహ తు విద్యతే వివేక కారణం కర్మ చ అవిద్యా చ।” (సూ॥భా॥ 3-2-9). మనవంటి వారికి అసాధ్యమైననూ నీటిని, పాలను కలసిపోయిన వాటిని హంస విడదీయగలదని మనకు తెలుసు. –“దృశ్యతే చ దుర్వివేచయోరపి అస్మజ్జాతీయైః క్షీరోదకయోః సంసృష్టయోః హంసేన వివేచనమ్।” (సూ॥భా॥ 3-2-9). ఇలాగే ఈ అవిద్య – కర్మల ద్వారా ఈశ్వరునితో విడదీయబడిన జీవునికి, వ్యవహారము జరుగుతుంది. ఈ ప్రకారము నిద్ర – జాగృతులలో ‘బీజాంకురన్యాయము’గా, సర్వదా విద్యమానమైన అవిద్య సంస్కారములతో కలసి ఉండే ఆ అంతఃకరణ ఉపాధివల్ల ‘వాడే లేచాడు’, అని చెప్పబడుతున్నది. “స ఏవాయమ్ ఉపాధిః స్వాపప్రబోధయోః బీజాఙ్కురన్యాయేన ఇత్యతః స ఏవ జీవః ప్రతిబుధ్యతే ఇతి యుక్తమ్।” (సూ॥భా॥ 3-2-9). జాగ్రత్తు నిద్రా, వానివే. అదే అంతఃకరణ అతనికి ఉపాధి. బ్రహ్మలో అతడు ఒకటిగా ఉన్నప్పుడు కూడా అంతఃకరణ వున్నది. దానిలో అవిద్య – కర్మ కూడా ఉన్నది. ఇలా, ఉపాధి సంబంధమును గుర్తులో ఉంచుకుని, సుషుప్తునికి అవిద్య ఉన్నదా, లేదా? అని విచారిస్తే – ‘సుషుప్తిలో జీవునికి అవిద్యాకార్యమైన అధ్యాస లేదు. అవిద్య ఉన్నది” అని తెలుస్తుంది. అవిద్య బీజరూపముతో వుంటుంది. దృష్టాంతము:– చిన్న పిల్లవానికి మీసములు, వాటి బీజరూపముతో అణగివుండి యౌవనములో ఆ మీసములు బయటకు వచ్చినట్లు, మనస్సు నాడీమండలము నుంచి బయటకు వచ్చిన తరువాత బీజావిద్య, అధ్యాసరూపముగా కనపడుతున్నది. (అవిద్యను బీజరూపమని చెప్పినా, అది ఒక భావవస్తువు కాదు. అది జ్ఞానాభావమని ఇదివరకే

నిశ్చయమయినది. బీజావిద్య అనేది ఒక శబ్ద వికల్పమే. అంటే, తన వాచ్యార్థము వల్ల, అది భావవస్తువనే వికల్పమును కలుగజేసినా కూడా, లక్ష్యార్థము ద్వారా ఆ వికల్పము యొక్క అవస్తుత్వమును తెలియజేసే శబ్దము- "శబ్ద జ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః।" (యోగ సూత్రములు - 1-9).

విశేషజ్ఞానము లేకపోవడమువల్ల, ఏకత్వమునే కారణముగా చెప్పి, తరువాత - "అన్యత్వ ప్రత్యుపస్థాపక హేతోః అవిద్యాయాః అభావాత్।"- ఇతరము ఉన్నదని చూపించడానికి హేతువు అయిన అవిద్య ఇక్కడ లేదు, అని భాష్యకారులు స్పష్టముగా చెప్పిన తరువాత, తిరిగి - అధ్యాస లేదు కాని, బీజరూపావిద్య వున్నది- అని ఎలా చెప్పారు?

అలా కాదు. ఉన్నదని స్పష్టముగా కూడా చెప్పారు- బుద్ధ్యాద్యుపాధి స్థాన విశేష సంబంధముతో విశేషజ్ఞానము (అధ్యాస) వస్తుంది. ఉపాధి నాశనముతో కలిగే ఈ విశేష జ్ఞాన నాశనమునే పరమాత్మ సంబంధమని ఉపాధి సాపేక్షముగానే **ఉపచారము కోసము** చెప్పాము- "బుద్ధ్యుపాధి స్థాన విశేషయోగాత్ ఉద్భూతస్య విశేషజ్ఞానస్య ఉపాధ్యుపశమే ఉపశమః స పరమాత్మానా సంబంధః ఇతి ఉపాధ్యపేక్షయైవ ఉపచర్యతే।" (సూ॥భా॥ 3-2-24) ఇంతేకాక, ఇంకా స్పష్టము చేశారు. సుషుప్తి అభయమే! అవిద్యాకార్యమే భయము. ఇందువల్ల, భయనామక కార్యము ద్వారా కారణ అవిద్యను నిరాకృతము చేశారు -"కిం చ అభయమ్। భయం హి నామ అవిద్యాకార్యం। తత్కార్య ద్వారేణ కారణ ప్రతిషేధో¬యమ్।" (బృ॥భా॥ 4-3-21). ఇదే కాకుండా తన ప్రియురాలి ఆలింగనములో బద్ధుడైన వ్యక్తి బాహ్య అభ్యంతర జగత్తులు ఏమీ తెలియకుండా వుంటాడు- "యథా ప్రియయా స్త్రియా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేదనాన్తరమ్।" (బృ॥ 4-3-21). ఈ అవస్థలో శ్రుతి ద్వారా ఆత్మలో ఏకత్వమును చెప్పిన కారణముగా, ఆ సమయములో కూడా అవిద్య లేదు - అని చెప్పే సాహసము ఎవరికి వుంటుంది? ఏకత్వము అనేది లేని సమయము లేదు. ఇంద్రియములతో నానాత్వమును చూస్తున్నా కూడా ఏకత్వము అవిద్య లేకుండా వుండాలి. విద్యకు అర్థము ఏకత్వజ్ఞానము. అధ్యాస లేకపోయినా అవిద్య వుంటుంది. కాని, అవిద్య లేకపోతే అధ్యాస వుండదు. ఎందుకంటే అధ్యాస అవిద్యా కార్యము. విద్య (ఆత్మ జ్ఞానము) తోనే అవిద్య నష్టము అవుతుంది. నిద్రతో కాదు. అది ఒకసారి పోతే మళ్ళీ తిరిగి రాదు.

ప్రశ్న: అయితే, అవిద్య సుషుప్తిలో లేదని ఎందుకు చెప్పారు?

సమాధానము: పిచ్చి పనిని పిచ్చితనము అన్నట్లే, ఇక్కడ అవిద్యా కార్యమైన అధ్యాసను అవిద్య అని పిలిచి అది నిద్రలో లేదని చెప్పారు.

అజ్ఞానమును జ్ఞానాభావము అని తెలుసుకునేవారికి సుషుప్తిలో అజ్ఞానము ఉన్నదని చెప్పడములో ఏకత్వమునకు హానీ ఏమీ లేదు. **ఇక, అజ్ఞానము భావరూపమని అనుకునే వారిని గురించి ఆలోచించాలి. సుషుప్తిలో ఏకత్వ సమన్వయము చేయడానికి, శాస్త్రము, ఇంద్రియములు, మనస్సు మొదలైన సమస్త కార్యజగత్తుకు బ్రహ్మలో ఉపశమనమును చెప్పింది. ఇంద్రియములు కార్యములు చేస్తున్నా, కార్యమునకు పూర్వము తత్త్వరూపములో వున్నా, అవి బ్రహ్మకార్యములు అవడము వల్ల బ్రహ్మ స్వరూపములే. (అధ్యా ॥ 6-5). ఇందువల్ల కారణములో కార్యము ఉపశమించుటకు ఆటంకము ఏమీ లేదు. అయితే తమ భావరూప అజ్ఞానమునకు కూడా ఉపశమించడమును ఎవరైతే చెప్తున్నారో వారికి దానిని బ్రహ్మ స్వరూపమునదే అని చెప్పవలసి**

వస్తుంది. ఈ విధముగా, ఏ బ్రహ్మ స్వరూపము అజ్ఞానమునకు విరోధి కాదో, అటువంటి బ్రహ్మతో మనకు పనేముంది?

ప్రశ్నలు:

1. జీవుడు ఏఏ అవస్థలను అనుభవిస్తున్నాడు?
2. జాగ్రదవస్థ విశేషములు ఏమిటి?
3. బహిఃప్రజ్ఞుడు అంటే ఎవరు?
4. చిత్తములో వాసనారూపముగా ఏమేమి వుంటాయి?
5. జాగ్రత్తు దేనికి ఆశ్రయము?
6. జాగ్రత్తులో వ్యవహారము చేయడానికి దేని ఆవశ్యకత ఉన్నది?
7. జ్యోతి శబ్ద వ్యాపకార్థము ఏమిటి?
8. శబ్దాదులను 'జ్యోతి' అనడములో ఔచిత్యము ఏమిటి?
9. జాగ్రత్తులో ఇంద్రియములు దేనిద్వారా వ్యవహారములు చేస్తున్నాయి? దానితో జీవునికి ఏమి లాభము?
10. స్వప్న స్వరూపము ఏమిటి?
11. స్వప్నావస్థలోని జీవునిని శ్రుతి ఏ పేర్లతో పిలిచింది?
12. స్వప్నము ఎలా కలుగుతుంది?
13. అతనిని 'ప్రవివిక్తభుక్' అని ఎందుకు అన్నారు?
14. 'ప్రవివిక్తాహారతరుడు' అంటే అర్థము ఏమిటి?
15. స్వప్నములో చేసిన పుణ్య-పాపములు జీవుడిని ఎందుకు అంటవు?
16. స్వప్నలోకము జీవసృష్టి అని శ్రుతి ఎందుకు చెప్తున్నది?
17. స్వప్నలోకములో కార్య కారణ సంబంధము - దేశకాల సంబంధము ఎందుకు లేవు?
18. స్వప్నములో కనపడిన ఏ సూచనలు సత్యముగా అవుతున్నాయి?
19. బృహదారణ్యకము, ప్రశ్న, కఠ ఈ ఉపనిషత్తులలో స్వప్నకర్త ఎవరని చెప్పారు?
20. 'స్వప్నకర్త ఈశ్వరుడు', ఇది ఎందుకు సరికాదు? జీవుడే స్వప్నకర్త అని సమర్థన చేయండి.
21. ఒకవేళ మనము సత్కర్మలే చేస్తూ వుంటే, మనకు ఏ విధమైన స్వప్నములు రావు?

22. వేదములు ఏ శైలిని అనుసరిస్తున్నాయి?

23. స్వప్నజ్యోతి విషయములో నాస్తికుల వాదము ఏమిటి?

24. స్వప్న జ్యోతి దేహసంబంధి కాదని ఎలా చెప్పగలము?

25. బాహ్యజ్యోతి, ఆత్మజ్యోతి కంటె వేఱుకాదని ఎలా చెప్పగలరు?

26. ఆత్మజ్యోతి నిర్విశేషమని ఎలా నిశ్చయమవుతున్నది?

27. ఆత్మను దేని ద్వారా తెలుసుకోగలరు?

28. ఆత్మలో ఏ ధర్మము ఆరోపితమైనది?

29. నిర్విశేష ఆత్మను, సవిశేషమని గుర్తించే కారణములను దృష్టాంతముతో వర్ణన చేయండి.

30. స్వప్నచర్చతో స్వయంజ్యోతి స్వరూపమైన ఆత్మను గుర్తించడము ఎలా సులభమవుతున్నది? ఈ సువిధమును ఎవరు యిచ్చారు?

31. స్వప్నములో జీవుడు ఎవరి ద్వారా కర్మ చేస్తున్నాడు?

32. తన అలసట పోగొట్టుకోవడానికి జీవుడు ఏమి చేస్తున్నాడు?

33. సుషుప్తిని 'ఏకీభూతము' అని ఎందుకు చెప్పారు?

34. 'ప్రజ్ఞానఘనము' అంటే ఏమిటి?

35. జీవుడిని ఆనందమయుడు – ఆనందభుక్ అని ఎందుకు అన్నారు?

36. ప్రాజ్ఞుడు ఎవరు? అతనికి ఈ పేరు ఎందుకు వచ్చింది?

37. గాఢనిద్రలో జీవుడు ఎక్కడ వుంటాడు?

38. పురీతత్ అంటే ఏమిటి?

39. బ్రహ్మసూత్రములలో నిశ్చయింపబడిన జీవుని సుషుప్తి స్థానము ఏది?

40. సుషుప్తి అనుభవములో విస్మయకర అంశము ఏమిటి?

41. సుషుప్తి అనుభవము అందరికీ ఒకలాగే ఎందుకు వుంటుంది? భేదము ఎందుకు వుండదు?

42. సుషుప్తిలో వచ్చే ఆనందమును 'అతిఘ్నీ' అని ఎందుకు అన్నారు?

43. సుషుప్తిలోని అనుభవమును పొందిన ఏకత్వము, సుషుప్తి తరువాత ఏమిగా అవుతున్నది?

44. సుషుప్తిలో జీవుడు ఎలా వుంటాడు?

45. శ్రుతి వర్ణించిన నిద్రానందమును తెలుసుకోవడము ఎందుకు కష్టము?

46. సుషుప్తిలోని ఆనందము, పరమానందమని ఎలా నిశ్చయమవుతున్నది?

47. సుషుప్తిలో ఆనందమునకు కారణము ఏమిటి?

48. సుఖమునకు – విషయములకు సంబంధము లేదని ఎలా నిశ్చయము అవుతున్నది?

49. విషయసంపర్కముతో సుఖము రావడానికి కారణము ఏమిటి? అది ఎందుకు క్షణికము?

50. 'విషయ సంపర్కముతో సుఖప్రాప్తి' ఈ అధ్యారోపమున అపవాదము ఎలా అవుతుంది?

51. సుషుప్తిలో పూర్తిగా ఏది నశిస్తున్నది?

52. భేదబుద్ధి తక్కువ అవుతూ వుంటే ఏది వృద్ధి అవుతుంది?

53. ఒక సోపానము నుండి ఇంకొక సోపానము వరకు వెళ్ళేటప్పుడు ఆనందముయొక్క వృద్ధికి క్రమమును చెప్పండి.

54. పరమానందమును ఇక్కడే ఎవరు పొందుతారు?

55. 'అకామహతుడు' ఎవరు?

56. 'దుఃఖము' అనే మిథ్యాప్రత్యయము ఎలా ఉత్పత్తి అయింది? దానిని మిథ్యాప్రత్యయము అని ఎందుకు అన్నారు?

57. స్వరూపములో, దుఃఖ సంబంధము లేదని ఎలా నిశ్చయము అవుతుంది?

58. జీవుని వాస్తవిక స్వరూపము ఏమిటి?

59. ఉపనిషత్తులో స్వస్వరూప వర్ణన ఏవిధముగా చేశారు?

60. సుఖ–దుఃఖములు రెండూ మిథ్యాప్రత్యయములే! అయితే, వీటిలో అంతరము ఏమిటి?

61. 'తాను బ్రహ్మే, తానే బ్రహ్మ' వీనిలో భేదము ఏమిటి?

62. బ్రహ్మాత్మైకత్వమును బోధించే శ్రుతిని తెలుసుకోవడానికి ఏ అంశములను జ్ఞప్తిలో వుంచుకోవాలి?

63. అసత్యత్వము ఏ రూపములతో ప్రకటింపబడుతున్నది?

64. సుషుప్తి కాలములో, ఆత్మలో సత్యత్వ లక్షణము ఉందనడానికి యుక్తి ఏమిటి?

65. 'జ్ఞాన' శబ్దమునకు అర్థము ఏమిటి?

66. బ్రహ్మయొక్క జ్ఞానరూపలక్షణము ఎక్కడ కనిపిస్తున్నది?

67. సుషుప్తాత్మ ఆనంత్యము ఎలా నిశ్చయమవుతున్నది?

68. సుషుప్తాత్మలో బ్రహ్మ లక్షణములు కనపడినప్పటికీ, 'బ్రహ్మాత్మైకత్వము అయినది', అనడానికి ఆలస్యము ఎందుకు?

69. ఇంద్రునికి ఏఏ ప్రశ్నలు వచ్చాయి?

70. సుషుప్తిలో ఏమీ తెలియబడదు. దీనికి కారణము ఏమిటి? శ్రుతి ఈ విషయములో ఏ దృష్టాంతమును ఇచ్చినది?

71. సుషుప్తిలో తనయొక్క జ్ఞానము కూడా ఎందుకు వుండదు? అప్పుడు తాను బ్రహ్మలో లీనమయి ఉన్నాడని కూడా ఎందుకు తెలుసుకో లేడు?

72. సుషుప్తిలో కేవలము ఆత్మజ్యోతి మాత్రమే ఉంటుంది. ఇలా చెప్పడానికి లౌకిక దృష్టాంతము ఏమిటి?

73. చిత్రపట దృష్టాంతముతో ఏమి నేర్చుకుంటున్నాము?

74. నానాత్వము దేనివల్ల ప్రకటింపబడుతున్నది?

75. సుషుప్త్యవిద్య విషయములో కొందఱు ఏమి చెప్తున్నారు?

76. సుషుప్తిలో అవిద్య లేదని చెప్పడములో ఏ కష్టములు వస్తున్నవి?

77. కొందఱు ఈ ఆక్షేపములకు ఏమి సమాధానము యిస్తున్నారు?

78. ఈ సమాధానము ఎందుకు సరికాదు?

79. సుషుప్తి వర్ణన, శ్రుతి ఏ దృష్టితో చేసినది?

80. 'బీజరూప అవిద్య' ఈ శబ్దమును ఎలా తెలియజేస్తారు?

81. సుషుప్తిలో విశేషజ్ఞానము లేని కారణముగా అక్కడ ఏకత్వము మాత్రమే ఉన్నది. అందువల్ల అక్కడ అవిద్య లేదు. ఈ పూర్వపక్షమునకు సమాధానము ఏమిటి?

82. అజ్ఞానమును, భావరూపము అని అనడము ఎందుకు సరికాదు?

అధ్యాయము - 14

తురీయము

పదకొండవ అధ్యాయములో ఆత్మ స్థూల - సూక్ష్మ శరీరములు కాదని, పన్నెండవ అధ్యాయములో ఆత్మ కారణ శరీరము కాదని చెప్పి, ఆత్మస్వరూపమును శరీరత్రయరూపములతో నిరాకరించడము అయినది. క్రిందటి అధ్యాయములో జీవుడు జాగ్రత్ - స్వప్న - సుషుప్తి అవస్థలలో ఉన్నప్పటికీ నిరుపాధికముగా అవస్థాత్రయాతీతుడు అని నిశ్చయమయింది. ఈ నిరాకరణమునకు అర్థము, "జగత్తుకూ జగద్వ్యవహారము నకూ నీవు సాక్షివి". దీనిని ఆమోదించి చాలామంది సాక్షిత్వమే పరమార్థము అని అంటున్నారు. ఇది సరియైన నిర్ణయము కాదు. శ్రుతి చెప్పిన సిద్ధాంతము వేఱుగా వున్నదని ఈ అధ్యాయములో నిశ్చయము చేస్తున్నాము.

14-1) సాక్షి

గంగానదిలో ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకి, అటునుంచి ఇటు తిరుగుతున్న మహా మత్స్యమువలె జీవుడు జాగ్రత్తు నుంచి నిద్రలోకి, నిద్ర నుంచి జాగ్రత్తుకు వస్తూ పోతూ వుంటాడు. తటములను సమీపించి తిరిగిపోయే మత్స్యము, తటము కంటె వేఱుగానే వుంటుంది. ఇలాగే జీవుడు కూడా మూడు అవస్థల కంటే వేఱుగానే వున్నాడు. ఇంతేగాక జాగ్రత్తు నుంచి స్వప్నములో ప్రవేశించేటప్పుడు స్థూల శరీరముతో సంబంధమును, స్వప్నము నుంచి సుషుప్తికి వెళ్ళేటప్పుడు ఇంద్రియ మనస్సులతో సంబంధమును వదలి వేస్తున్నాడు. అందువల్ల అతడు వీటికి వేఱుగానే వున్నాడు. ఈ ప్రకారము కేవలము ఇంద్రియాదులకంటె మాత్రమే కాదు, ప్రాణముకంటె కూడా జీవుడు వేఱు అవడము తెలిసినది. (అధ్యా ॥ 11-8). బాహ్యా జగత్తును, తనవైన స్థూల సూక్ష్మ శరీరములను దృశ్యముగా చేసుకొని జీవుడు వీటన్నిటికీ సాక్షిగా వుంటున్నాడు.

14-2) సాంఖ్య యోగము

కొంతమంది, జీవుని సాక్షిత్వమును ఆమోదించగానే మోక్షప్రాప్తి వస్తుందని అనుకుంటారు. తెలుసుకున్న ఈ జ్ఞానమును స్థిరము చేసుకోవడము కొఱకు వారు 'చిత్త నిరోధము' అనే యోగమును అభ్యసిస్తారు. "త్ర్యున్నతం స్థాప్య సమం శరీరమ్।" (శ్వే ॥ 2-8)- శిరస్సు కంఠము, నడుము తిన్నగా ఉండేటట్లు శరీరమును సమముగా చేసి, "తాం యోగమితి మన్యంతే స్థిరామింద్రియధారణామ్।" (కఠ ॥2-3-11)- ఇంద్రియములను స్థిరముగా ఉంచడము యోగమనబడును. ఈ విధముగా యోగము గురించి వందలాది వాక్యములు వేదములో దొరుకుతాయి. అందువల్ల కొందఱికి, యోగము ద్వారా చిత్తవృత్తి నిరోధమే అధ్యాత్మ సాధనకి గమ్యము అని భావన కలుగుతున్నది. కాని మనము ఒక విషయమును మరచిపోకూడదు. ఆసనము మీద కూర్చుని చిత్తేంద్రియముల క్రియలను బలపూర్వకముగా నిలిపి, యోగాభ్యాసము చేయడము అంతఃకరణ శుద్ధి కోసము. -"తత్రైకాగ్రం మనః కృత్వా యత చిత్తేంద్రియ క్రియః, ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే" (గీ॥6-12). యోగమునకు జన్మ మృత్యువులు వున్నాయి - "యోగో హి ప్రభవాప్యయౌ" (కఠ॥2-3-11). కాని, మోక్షము శాశ్వతము. ఇంతే కాదు. శ్రుతి, చిత్తవృత్తి నిరోధము మోక్షసాధనమని ఎక్కడా నిశ్చయించి చెప్పలేదు. బ్రహ్మాత్మజ్ఞానము కన్న ఇంకొక మార్గము మోక్షమునకు

లేదు. –“నిరోధస్తర్హి అర్థాంతరమ్ ఇతి చేత్? న । మోక్ష సాధనత్వేన అనవగమాత్। న హి వేదాంతేషు బ్రహ్మాత్మవిజ్ఞానాత్ అన్యత్ పరమపురుషార్థ సాధనత్వేన అవగమ్యతే ।” (బృ॥భా॥ 1–4–7).

ఈ పైన చెప్పిన మాటలు యోగక్రియలకు సంబంధించినవి. ఈ క్రియలకు ఆధారమైన యోగ సిద్ధాంతము సాంఖ్యుల సిద్ధాంతమే సాంఖ్యులు – యోగులు, ఇద్దరూ ద్వైతులే ఆత్మైకత్వ దర్శులు కారు. కాని, జీవునికి అసంగత్వాది ఏ లక్షణములు శ్రుతిలో చెప్పబడినవో వాటినీ, సంన్యాస ధర్మములనూ వీరు స్వీకరిస్తున్నారు. శ్రుతులలో చెప్పబడిన “తత్కారణం సాంఖ్య యోగాభిపన్నం జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః।” (శ్వే॥6–13)– సాంఖ్య యోగముల ద్వారా పొందదగినవాడూ జగత్కారణుడూ ఐన దేవుడిని తెలుసుకున్నట్లయితే జీవుడు అన్ని పాశముల నుండి ముక్తుడౌతాడు. ఇలా శ్రుతికి స్వమతానుసారము వ్యాఖ్యలు కూడా చేశారు. దీనివల్ల సామాన్య జనులకు వీరు వేదాంతులు కారని తెలియదు. (అధ్యా॥ 5–7), (అధ్యా॥ 12–17). ఇక్కడా – గీతలో కూడా సాంఖ్యమునకు అర్థము వైదిక జ్ఞానమే. ప్రకృతి – పురుష వివేకముతో వచ్చిన సాక్షిత్వము కాదు. యోగమునకు అర్థము వైదిక ధ్యానమే. చిత్తవృత్తి నిరోధము కాదు. – “ద్వైతినో హి తే సాంఖ్యా యోగాశ్చ నాత్మైకత్వ దర్శినః। యత్తు దర్శనం ఉక్తం తత్కారణం సాంఖ్య యోగాభిపన్నం ఇతి వైదికమేవ తత్ర జ్ఞానం ధ్యానం చ।” (సూ॥2–1–3).

14–3) సమ్యగ్దర్శనమే సర్వాత్మభావము

1) అన్నీ తెలుసుకుంటున్నాడు కనుక అతడు సాక్షి. కాని, తనను సాక్షిగా అనుకోవడము ఆత్మ యొక్క ‘అకృత్స్న’ (అపూర్ణ) దర్శనము. వింటున్నాను, చూస్తున్నాను – ఇలా తనని తాను ఎంతవరకు తెలుసుకుంటూ వుంటాడో, అంతవరకు అతడు పూర్ణ ఆత్మను తెలుసుకున్న వాడు కాదు. – “యావదయం ఏవం వేద పశ్యామి, శృణోమి, స్పృశామీతి, తావత్ అంజసా కృత్స్నమ్ ఆత్మానం న వేద।” (బృ॥ భా॥ 1–4–7). ఎందుకంటే, దీనిలో చూస్తున్న దృశ్యము – దర్శనము – దృక్, ఉండడమువల్ల ‘త్రిపుటి’ వుంటుంది. ఇదే సాంఖ్యము. ద్వైతము కూడా. ఇది ఆత్మయొక్క పూర్ణదర్శనము కాదు. ఎంతవరకూ ద్వైతము వుంటుందో, అప్పటివరకు రెండవ దానిని చూస్తాడు. ఎక్కడ ఆత్మ ఒక్కటే అన్నీ అవుతుందో, అక్కడ – దేనితో ఎవరిని చూస్తాడు? – “యత్ర ద్వైతమివ భవతి, తదితర ఇతరం పశ్యతి.... యత్ర సర్వం ఆత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్..... (బృ॥ 4–5–15). ఇలా చెప్పి, **ఆత్మజ్ఞానము వచ్చిన తరువాత త్రిపుటి యొక్క వ్యవహారమును శ్రుతి నిరాకరించింది. ఎలా నిరాకరించింది? ‘దీనికి అస్తిత్వమే లేదు’ అని చెప్పి శూన్యవాది ప్రత్యక్ష జగత్తును ఎలా నిరాకరణ చేస్తున్నాడో అలా నిరాకరించిందా? లేదు ‘ఇది కేవలము కల్పితము’ అని విజ్ఞానవాదము ఎలా నిరాకరణ చేస్తున్నదో, అలా నిరాకరించిందా? అలా కాదు. ‘జగత్తు నీకంటె వేఱుకాదు. అందువలన నీలో వ్యవహారము కొంచెము కూడా లేదు’ అని చెప్పి త్రిపుటి వ్యవహారమును నిరాకరించింది.** ఎదుటవున్న లోకమును, తనకంటె వేఱుగా – అనాత్మ స్వరూపముగా ఎవరైతే చూస్తున్నారో వానిని మోక్షమునకు అయోగ్యుడు అని లోకములు తోసివేస్తున్నాయి. “లోకాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో లోకాన్ వేద।” (బృ॥2–4–6). ‘ఏ బ్రహ్మలో పంచ–పంచ జనులు, అవ్యాకృతము ఓతప్రోతమై వున్నారో, దానినే ఆత్మ – అమృత బ్రహ్మ అయిన నేను అని ఆమోదిస్తున్నాను. నేను దానికంటె వేఱని భావించడము లేదు –“యస్మిన్ బ్రహ్మణి పంచపంచ జనాః అవ్యాకృతం ఓతం చ ప్రోతం చ అమృతం బ్రహ్మ మన్యే అహం; న చాహం ఆత్మానం తతోఽన్యత్వేన జానే।”

(బృ॥భా॥ 4-4-17). ఇందువల్ల, ఎవరినీ అన్యులుగా తలచనివాని సర్మాత్మభావమే సమ్యగ్దర్శనము. సాక్షిత్వము సమ్యగ్దర్శనము కాదు. ఎప్పుడు వెంట్రుక చివరి భాగమంత మాత్రమైనా 'ఇది నేను కాదు' అని భావించబడుతోందో, అది అవిద్యావస్థ మాత్రమే! -"యత్తు సర్వాత్మభావాత్ అర్వాగ్ వాలాగ్ర మాత్రమపి అన్యత్వేన దృశ్యతే నాహమస్మి ఇతి తదవస్థా అవిద్యా।" (బృ॥ భా॥ 4-3-20). ఆ బాహ్యాలోకము మనకు ఆత్మవ్యతిరిక్తము కాదు, ఎందుకంటే, మనకు అంతా ఆత్మే - అందరికీ మనమే ఆత్మభూతులము. - "స చ బాహ్యాలోకో నాస్త్యస్మాకం ఆత్మవ్యతిరిక్తః సర్వం హి అస్మాకం ఆత్మభూతమేవ, సర్వస్య చ వయం ఆత్మభూతాః।" (బృ॥ 4-4-22). ఇప్పటికి కూడా "నేనే బ్రహ్మను" అని తెలుసుకున్నవాడు ఇదంతా వాడే అవుతాడు. "తదిదమప్యేతర్హి య ఏవం వేద అహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి।" (బృ॥ 1-4-10). మొదట అవిద్య వల్ల అసర్వమై ఉన్నాడు; తరువాత విద్యతో అవిద్యా నివృత్తి అయి సర్వము తానే అయ్యాడు- "పూర్వం అవిద్యయా అసర్వ ఆసీత్, పునర్విద్యయా అవిద్యాపనయే సర్వో భవతి।" (ప్ర॥ 4-10), ఆత్మ, అనాత్మ రెండూ తెలియక పోవటంవల్ల రెండింటినీ తెలుసు కోవాలి. ఆత్మోపాసన విషయము మాత్రము ఎందుకు చెప్పారు? అలా కాదు. అనాత్మను తెలుసుకొనేదానికి ఆత్మజ్ఞానము కన్న వేరే జ్ఞానము అవసరము లేదు. ఆత్మజ్ఞానముతోనే అన్నీ తెలుస్తాయి- "అనిర్జ్ఞాతత్వసామాన్యాత్ ఆత్మా జ్ఞాతవ్యః అనాత్మా చ । కస్మాత్ ఆత్మోపాసనే ఏవ యత్న ఆస్థీయతే? న, కిం తర్హి జ్ఞాతవ్యత్వేపి న పృథక్ జ్ఞానాంతరం అపేక్షతే ఆత్మజ్ఞానాత్।" (బృ॥భా॥1-4-7). ఈ తాదాత్మ్య సంబంధము నామరూపములకు మాత్రం మితమైనది కాదు. సర్వ వ్యవహారములకు అన్వయమగును - "సదాత్మనా సత్యత్వాభ్యుపగమాత్ ... సర్వవ్యవహారాణాం సర్వవికారాణాం సత్యత్వం" (ఛాం॥ భా॥ 6-3-2) సదాత్మ విజ్ఞానము నుంచి **సర్వ వ్యవహారములు** తన ఆత్మ వల్లనే జరుగుతున్నదని జ్ఞాని తెలుసుకొంటాడు - "సదాత్మ విజ్ఞానే తు సతి ... సర్వోప్యన్యో వ్యవహారః ఆత్మన ఏవ విదుషః" (ఛాం॥భా॥ 7-26-1) అందువల్ల ఎవరైతే రాయిని - మట్టిని చూసి, 'ఇది రాయి - ఇది మట్టి' అని వేఱు వేఱుగా తెలుసుకుంటాడో, అలా వేఱుగా తెలుసుకోవడమే అవిద్య కాదు. 'స్వరూపములోనూ ఇవి వేరు వేరు, నేనూ వేరు. నేను వీటిని చూసేవాడిని' అని భావించడం అవిద్య. అలా అయితే ఆత్మజ్ఞాన - అనాత్మజ్ఞానములలో భేదము ఏమిటి? అని ప్రశ్నించవచ్చు. అనాత్మ జ్ఞానములో నానాత్వము వుండడము వల్ల అప్రాప్తమయిన దానిని పొందాలనే భావనలో లాభము - లబ్ధవ్యము - లబ్ధ అనే త్రిపుటి వుంటుంది. కాని, ఆత్మజ్ఞానములో నానాత్వము లేనందువల్ల ఈ త్రిపుటి వుండదు. (బృ॥1-4-7).

2) ఈ విషయములో ఒక సందేహము వస్తుంది. జగత్తు అసత్యము - ఆత్మమాత్రమే సత్యము అని మాటిమాటికి చెప్తున్నారు. సర్వాత్మ భావమును బట్టి ఈ అసత్యమైన జగత్తును, 'ఇది ఆత్మ' అని ఎలా తెలుసుకోవడము? బహుశః ఈ సందేహమునకు వివరణ తెలియక సాధకులు, తమను సాక్షీభావసాధనకు బంధించుకుంటున్నారు. సాక్షిభావమును పొందడము, సర్వాత్మ భావమును పొందడము కన్న కొంత సులభము. ఇందువల్ల, సర్మాత్మ భావమునకు వివరణ యిస్తున్నాము. ఈ జగత్తు బ్రహ్మమే. ఇంతేకాక, కార్యాకారము కూడా కారణమే. స్వరూపమునకు భిన్నమైన ఆకారము పుట్టనే పుట్టదు. కాని, కారణములో కార్యము స్వతంత్ర రూపముగా లేదు. ఇందువల్ల, నిశ్చయముగా జగత్తు బ్రహ్మకంటే వేఱు కాదు. కాని, బ్రహ్మ జగత్తుకంటె వేఱుగానే ఉన్నది. (అధ్యా ॥ 6-5-2). అటువంటి బ్రహ్మ నీవే! అనగా, జగత్తు ఆత్మకంటె వేఱు కాదు. కాని, ఆత్మ జగత్తుకన్న వేఱు. ఎప్పుడు మనస్సు బహిర్ముఖమై కార్యాకారరూపవృత్తిని ధరిస్తున్నదో, అప్పుడు, నాకంటె వేఱుగా కార్యము ఏమీ లేదనే బుద్ధివృత్తి వుండాలి. బ్రహ్మావాదులకు

కార్యకారణ సంబంధము ఎలా వుంటుంది? వారికి తాదాత్మ్య లక్షణ సంబంధము వుంటుంది. – "బ్రహ్మావాదినః కార్యకారణ సంబంధః కథమ్? తస్య తాదాత్మ్య లక్షణ సంబంధోపపత్తే"(సూ॥2-2-38). ఈ సంబంధము కేవలము నామరూపములతో మాత్రమే కాదు వ్యవహారములలో కూడా వుంటుంది. ఆత్మ విజ్ఞానమునకు ముందు, తన కంటె భిన్నముగా వున్న పరమాత్మ వల్ల జగత్తు యొక్క ఉత్పత్తి – ప్రళయములు జరుగుతూ వుండేవి. సదాత్మ విజ్ఞానము వల్ల అవి తన ఆత్మవలననే అయ్యేవిగా అయిపోయాయి. ఈ విధముగా, అన్ని వ్యవహారములు జ్ఞానికి ఆత్మవలననే జరుగుతాయి. (ఛాం॥7-23-1). మనస్సు అంతర్ముఖము అయి ఎప్పుడైతే కార్యాకార వృత్తి అవదో, అప్పుడు సహజముగానే తాను కార్యముతో వేఱుగా ఉంటాడు. ఈ ప్రకారము బాహ్యాకార భేద బుద్ధి నివృత్తి మాత్రమే ఆత్మస్వరూప ఆశ్రయమునకు కారణమవుతుంది. – "బాహ్యాకార భేద బుద్ధి నివృత్తి రేవ ఆత్మస్వరూపావలంబన కారణమ్।" (గీ॥భా॥ 18-50). అన్ని వ్యవహారములు నశించుటకు ఈ విజ్ఞానమే కారణము. (బృ॥భా॥1-4-7). అందువల్ల, సర్వాత్మ భావములో ప్రవృత్తి వుండదు. అక్కడ అవిద్య, కామ, కర్మలు లేవు. అది క్రియా కారక ఫలరహితము. – "సర్వాత్మ భావో మోక్షో విద్యాఫలం క్రియా కారక ఫలశూన్యం ..... యత్ర అవిద్యా కామ కర్మాణి న సంతి ।" (బృ॥భా॥ 4-3-21).

ప్రశ్న: బహిర్ముఖ బుద్ధి వృత్తిలో వున్నప్పుడు అసత్యమును ఆత్మ అని అనుకోవడము అనుచితము కదా?

సమాధానము: ఏదైతే పూర్వము లేదో – ఇప్పుడు కనపడుతున్నదో – తరువాత ఉండదో, ఆ కార్యము తార్కికుల చేత చెప్పబడిన, కారణముకంటె వేఱే వున్న కార్యము. అది అసత్తు మాత్రమే. (అధ్యా॥ 6-5-3). అది స్థితి కాలములో ఉన్నట్లు కనపడినా, లేనిదే. కాని, ఎదుట కనపడే జగత్తు అటువంటిది కాదు. అది ఒకప్పుడు కనపడుతుంది – ఒకప్పుడు కనపడదు. అప్పుడది అవ్యక్తము. అందువల్ల అసత్యము. దీనిలో ఇలా వ్యక్తము – అవ్యక్తము కావడము అనే వ్యవహారము ఉన్నప్పటికీ ఇది బ్రహ్మమే. ఇందువల్ల "సత్..తద్విపరీతం అసచ్చైవ అహమ్..... కార్యకారణే వా సదసతీ।"– సత్, దానికి భిన్నమైన అసత్, రెండూ నేనే.... కార్యమే అసత్ – కారణమే సత్. (గీ॥భా॥9-19). అందువల్ల జగత్తును ఆత్మకు అభిన్నముగా తెలుసుకోవడమే సమ్యక్ జ్ఞానము.

ప్రశ్న: ఇలా తెలుసుకోవడము వల్ల లాభము ఏమిటి?

సమాధానము: ఎంత గొప్ప జ్ఞానికైనా, ప్రారబ్ధము వల్ల మనస్సు బహిర్ముఖము అవుతూనే వుంటుంది. – "శరీరారమ్భకస్య కర్మణో నియతఫలత్వాత్ సమ్యగ్జ్ఞాన ప్రాప్తావపి అవశ్యం భావినీ ప్రవృత్తిః వాఙ్మనఃకాయానామ్।" (బృ॥భా॥1-47). ఆ సమయములో, జగత్తు తనకంటె అభిన్నమనే బుద్ధివృత్తి వుంటేనే దానితో జరిగే వ్యవహారములతో ఏమీ సంబంధము వుండదు. దీనికి విరుద్ధముగా, సాంఖ్యుల సాక్షిత్వములో భిన్నత్వ బుద్ధి వుంటుంది. దానివల్ల వ్యవహారముతో సంబంధము కూడా వుంటుంది. క్రియ బంధనము కాదు – క్రియతో సంబంధము బంధము. ఈ ప్రకారము సర్వాత్మభావ బుద్ధి వృత్తి వల్ల లాభము – అవ్యవహార తురీయప్రాప్తియే.

14-4) నిదర్శనము

దీనివల్ల లాభము వున్నదనే విషయము అజ్ఞాని ఉదాహరణముతో కూడా తెలుస్తుంది. ఆరోగ్యముగా వున్న మానవుడు - దేహముతో పూర్తిగా తాదాత్మ్యముతో వుంటాడు. దేహముతో తీసుకునే శ్వాస - నిశ్వాసములుగాని, కళ్ళరెప్పలు కదలుటగాని, శారీరికములైన కదలికలుగాని అనేక దైహిక క్రియలు అతనికి తెలియకుండానే జరుగుతూ వుంటాయి. ఈ విధముగా సమ్యగ్దర్శి విషయములో కూడా, సర్వాత్మభావముతో వున్నందువల్ల, కర్మానుసారము క్రియలు జరుగుతున్నా కూడా జరగనట్లే!

ఇటువంటి మనోభావము అసంభవము కాదు. అందఱు జ్ఞానులు దీనిని పొందుతూనే వున్నారు. ఈ విధమైన స్వహృదయ ప్రత్యయమును (స్వానుభూతి) ఇతరులు నిరాకరించలేరు. ఇలాగే, ఋషి వామదేవుడు - "అహం మనురభవం సూర్యశ్చ-" నేనే మనువును, సూర్యుడను - అని (ఋగ్వేదసంహిత, 4-26-1). సర్వాత్మభావమును తెలుసుకున్నాడు. అందరిలో తనని తాను చూసిన పరమపూజ్యులు 'నమ్మాళ్వార్ శఠకోపముని' చెప్పినవి చాలా హృదయంగమములు:

కాణ్కిన్ర నిలమేల్లాం యానే యన్నుమ్ - దృశ్యమాన సమస్త భూమి నేనే ।

కాణ్కిన్ర విశంబేల్లాం యానే యన్నుమ్ - దృశ్యమాన సంపూర్ణ గగనమునేనే।

కాణ్కిన్ర వేన్దీ యల్లాం యానే యన్నుమ్ - దృశ్యమాన వాయువు అంతా నేనే।

కాణ్కిన్ర విక్కాౖటేల్లాం యానే యన్నుమ్ - దృశ్యమాన అగ్ని అంతా నేనే ।

కాణ్కిన్ర కడలేల్లాం యానే యన్నుమ్ - దృశ్యమాన సముద్రము అంతా నేనే।

ఉౖటారగళ్ ఏనకిల్లై యానే యన్నుమ్ - నాకు బంధువులు ఎవరూ లేరు.

ఉౖటారగళ్ ఏనక్కింగేల్లారుం యన్నుమ్ - ఇక్కడ అందరూ నా బంధువులే.

ఉౖటారగళ్ చ్చైవేన్నుం యానే యన్నుమ్ - బంధువులను చేసేవాడు నేనే.

ఉౖటారగళ్ అళిప్పేన్నుం యానే యన్నుమ్ - బంధువులను నశింపజేసేది నేనే.

ఉౖటారగళ్ ఉౖటేనుం యానే యన్నుమ్ - బంధువులకు బంధువు నేనే.

ఈ ప్రకారము పది శ్లోకములలో సర్యాత్మభావ సామ్రాజ్య సమ్యగ్దర్శనమును పూజ్య నమ్మాళ్వారులు చేయించారు.

14-5) ప్రపంచం యొక్క ప్రవిలయము

మనస్సు ప్రారబ్ధవశముగా బహిర్ముఖమవుతుంది. దీని ఆధారముతోనే పైన సర్వాత్మ భావమును చెప్పడము జరిగినది. కాని, బ్రహ్మ కార్య జగత్తుతో లిప్తమై వుంటుంది గాన తనను కూడా అలాగే గుర్తించాలని పైన చెప్పిన దాని అర్థము కాదు. ఈ విషయము చక్కగా అర్థము చేసుకోవాలి. కార్యము బ్రహ్మ స్వరూపము కాని, బ్రహ్మ కార్య స్వరూపము కాదు. "బ్రహ్మ స్వభావో హి ప్రపంచః, న ప్రపంచ స్వభావం బ్రహ్మ।" (సూ॥భా॥ 3-2-21). కార్య జగత్తు యొక్క ఆధారముతో తనను బ్రహ్మగా ఎవరైతే తెలుసుకుంటారో,

అతడు ఇక్కడ ఉన్నదంతా తానే అయిపోతాడు. "య ఏవం వేద అహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి।" (బృ॥ 1-4-10). కాని, బ్రహ్మ తన స్వరూపములో అస్థూలము, అనణువు, అహ్రస్వము, అదీర్ఘము, (అధ్యా॥ 10-1). మొదలైనవి చెప్పి శ్రుతి చాలాసార్లు దానిని అరూపము అనే చెప్పింది. "అరూపవ దేవ తత్ ప్రధానత్వాత్।" (సూ॥ 3-2-14). అనగా మనస్సు కార్యాకార రూపధారణ చేసినప్పుడు సర్వాత్మ భావమును స్వీకరించాలి. కాని, బ్రహ్మాత్మైకత్వ స్వరూప జ్ఞానము కోసము అరూపబ్రహ్మనే తీసుకోవాలి. "అంతా బ్రహ్మమే అయితే, ఈ విధముగా సామానాధికరణ్యమును (అని సర్వమును - బ్రహ్మను ఒకే విభక్తిలో ప్రయోగము) ఎందుకు చెప్పారు? ఇలా ప్రశ్నిస్తే- దానివల్ల, బ్రహ్మ అనేక రసములు కలవాడని అనుకోకూడదు. జగత్తు యొక్క ప్రవిలయము కోసము ఇలా చెప్పారు - "సర్వం బ్రహ్మ ఇతి తు సామానాధి కరణ్యం, ప్రపంచ ప్రవిలాపనార్థం, న అనేక రసతా ప్రతిపాదనార్థం।" (సూ॥భా॥1-3-1) అందువల్ల 'నాలో కార్యజగత్తు ప్రవిలయమయినది' అని తెలుసుకోవాలి.

"ముందు జగత్తును ఆమోదించి, తరువాత దానికి ప్రవిలయము చేయాలని చెప్పేకంటే, ఆరంభములోనే దానిని 'అసత్తు' అని ఎందుకు చెప్పరాదు?" అలా చెప్పరాదు. ప్రవిలయమునకు అర్థము నాశనము చేయడము కాదు. జగత్తు ప్రవిలయము అంటే అర్థము ఏమి? అగ్నియొక్క తాపజనకమైన సంపర్కముతో నెయ్యి యొక్క ప్రగాఢత్వము ప్రవిలయము చెందుతున్నది. జగత్ప్రవిలయము అలాగు కాదు. ఒకవేళ, ఎవరైనా జ్ఞానప్రాప్తిని పొందినవారు అలా చేస్తే ఇక, జగత్తు వుండనే ఉండదు. "కో¬యం ప్రపంచవిలయో నామ? కిం అగ్ని ప్రతాప సంపర్కాత్ ఘృతకాఠిన్య ప్రవిలయ ఇవ ప్రపంచ ప్రవిలయః కర్తవ్యః?..... ఏకేన ఆది ముక్తేన పృథివ్యాది ప్రవిలయః కృతః ఇతి ఇదానీం పృథివ్యాది శూన్యం జగత్ అభవిష్యత్।" (సూ॥భా॥ 3-2-19). ఇదే కాకుండా, ఏకత్వ జ్ఞానముతో వస్తువు నశించదు - ఉత్పన్నమూ కాదు. "న తు పారమార్థికం వస్తు కర్తుం నివర్తయితుం వా అర్హతి బ్రహ్మ విద్యా।" (బృ॥భా॥ 1-4-10), (అధ్యా ॥ 12-19 ష). ఈ విధమైన ప్రవిలయము, కల్పాంతములో ఈశ్వరుని ద్వారా అవుతున్నది. ఇంక ఎవరివల్లా ఈ పని సంభవము కాదు. అందువల్ల, ఒకడు, ఆత్మను తెలిసికొనే ఆతురతతో శ్రుతి ప్రతిపాదించిన బ్రహ్మను, బ్రహ్మాత్మైకత్వమును, దానిని పొందగలిగే క్రమమును, వదలి వైనాశికుల వలె జగత్తును 'అసత్' అని చెప్తే, భవిష్యత్ జగత్తు విషయములో ఈశ్వరుని ప్రత్యక్ష జ్ఞానము మిథ్య అవుతుంది -"అసంశ్చేద్ భవిష్యద్ ఘటః ఐశ్వరం భవిష్యద్ఘట విషయం ప్రత్యక్షజ్ఞానం మిథ్యా స్యాత్।" (బృ॥భా॥ 1-2-1). లేక జగత్తు కేవల అవిద్యా కల్పిత బుద్ధి ప్రత్యయము అని చెప్పినట్లయితే, అది ముందే నిరాకరింపబడిన విజ్ఞానవాదము అవుతున్నది. (అధ్యా॥5-3). అందువల్ల, జగత్తును 'అసత్' అని కాని - కేవలము విజ్ఞానము అని కాని, చెప్పడము మానివేసి, పైన చెప్పిన క్రమముతో బ్రహ్మాత్మైకత్వమును స్థాపించడము వల్ల అద్వైతులను 'ప్రచ్ఛన్న బౌద్ధులు' అని చెప్పేవారు 'అప్రచ్ఛన్న మూర్ఖులు' అని స్పష్టమవుతున్నది.

దీనివల్ల జగత్ప్రవిలయమునకు అర్థము వేఱని తెలుస్తున్నది. దీని క్రమమును ఒక దృష్టాంతముతో చెప్తాము - అర్థములో దానికి దూరముగా ఉన్న శబ్దాత్మక అక్షరము లేదు. శబ్దాత్మక అక్షరములో దానికి కూడా అతి దూరములో ఉన్న రేఖాత్మక అక్షరము లేనే లేదు. అయినా, అర్థముతో అతి దూరముగా వున్న రేఖాత్మక అక్షరమును - కొంత దగ్గరగా ఉన్న శబ్దార్థక అక్షరములో ప్రవిలయము చేసి, ఈ శబ్దాత్మక అక్షరములను అర్థములో ప్రవిలయము చేసి, మనము అర్థమును తెలుసుకుంటున్నాము. ఈ విధముగా (అధ్యా॥ 12-17) లో చెప్పబడినట్లు - అజ్ఞానికి రెండు జగత్తులు ఉన్నాయి. ఒకటి, తనకు తెలిసినది -

ఆత్మ వ్యతిరిక్తమైనది – అనగా అవిద్యా కల్పితము; రెండవది శ్రుతి ద్వారా చెప్పబడిన బ్రహ్మ స్వరూపమైన జగత్తు. శ్రుతి అర్థమును లోతుగా మననము చేసిన తరువాత – అవిద్యాకల్పిత జగత్తును, శ్రుత్యుక్త క్రమముతో బ్రహ్మాభిన్న జగత్తులో ప్రవిలయము చేస్తే, ఇక, శ్రుత్యుక్త జగత్తు మాత్రమే మిగులుతుంది. ఇది తన కంటె వేఱుగా లేని కారణమువల్ల, జ్ఞానప్రాప్తికి ముందు ఏ అవిద్యా కల్పిత వ్యవహారము ఉన్నదో, అదంతా నష్టమైపోతున్నది. (సూ॥భా॥3-2-21). అప్పుడు కేవలము 'నేతి నేత్యాత్మ' మాత్రమే మిగులుతున్నది. ఇదే స్వరూపజ్ఞానము. ఇప్పుడు జగత్ప్రవిలయము యొక్క క్రమము మూడు అంతస్తులతో చెప్పబడుతున్నది. దీనికి ముందు సమష్టి – వ్యష్టి అనే రెండు పదముల అర్థమును చెప్తాము.

14-6) సమష్టి – వ్యష్టి

అన్నీ కలసిన సమూహము సమష్టి. ఈ సమష్టి నుంచి ఏదో ఒక విశేష గుణము కారణముగా విడిగా అయిన ఒక అంశము వ్యష్టి. ప్రత్యక్ష జగత్తులో కనపడుతున్న భూతపంచకము సమష్టి – జీవుని శరీరము వ్యష్టి. అందరు ప్రాణులలోను ఆయూరూపి ప్రాణదేవత సమష్టి – జీవుని ప్రాణము వ్యష్టి; హిరణ్యగర్భుని మనస్సు – బుద్ధి, సమష్టి; జీవుని మనస్సు – బుద్ధి, వ్యష్టి; (బ్ర॥భా॥ 3-2-3). ఏదో ఒక కారణముచే వ్యష్టి సమష్టి నుంచి వేఱయితే కూడా, స్వరూపములో వేఱు కాదు. ఉదాహరణకు; జీవుని శరీరము – తన ఆకార, క్రియలతో బాహ్యజగత్తుకంటె వేఱయినప్పటికీ, స్వరూపముతో వేఱుకాదు; జగత్తుతో సమానముగా భూత పంచకమే అయి వున్నది. అనగా, బాహ్యములో ఉన్న పంచభూతములే ఇంకొక ఆకారముగా శరీర రూపములో కనపడుతున్నాయి. కొంచెము, బుద్ధితో శ్రమపడి దీనిని తెలుసుకోవడము కష్టము కాదు. జీవుని బుద్ధి వ్యష్టి – హిరణ్యగర్భుని బుద్ధి సమష్టి అని తెలుసుకోవడము కష్టము. దీనిని తెలుసుకోవడానికి శాస్త్రము అవసరము. అధ్యారోపిత విశేషణములను అపవాదము చేసి (అధ్యా॥ 10-5) వ్యష్టి జీవుని ప్రత్యేక స్థానములో సమష్టితో ఐక్యభావమును పొందించడానికి ప్రయత్నము చేయాలి.

14-7) వైశ్వానరాత్మ

1) జాగ్రద్వ్యవహారములో జీవుడు వ్యష్టి అయితే, వైశ్వానరుడు సమష్టి. (మాం॥3). జాగ్రద్ వ్యవహారములో వ్యష్టి జీవుడు తాను స్వతంత్రుడని అనుకుంటాడు. కొంచెము ఆలోచించి చూస్తే, ఈ ధారణ, వ్యర్థమని తెలుస్తుంది. ప్రతియొక్కని వ్యవహారము ఇతరులతో ముడిపడి వున్నది. స్వతంత్ర రూపముగా చేయగలిగిన కార్యము ఒకటి కూడా లేదు. అందువల్ల, జీవుని ఏ కార్యమైనా, సమష్టి ఆత్మయైన వైశ్వానరునితోనే అవుతుందని నిశ్చమయినది. జీవుడు తిన్న ఆహారమును ఈతడే పచనము చేస్తున్నాడు కదా!(గీ॥ 15-14 బృ॥ 5-9-1).

2) ఈతడు పరమాత్ముడే. ప్రత్యగాత్మ యొక్క ప్రథమపాదము, జాగరితస్థానుడు, బహిష్ప్రజ్ఞుడు, ఏకోనవింశతి (19) ముఖములు కలవాడు, స్థూలభుక్. ఇవన్నీ వ్యష్టిలో చెప్పినట్లే వుంటాయి (అధ్యా॥ 13-1). ఇంతేగాక దీనితో కూడా వైశ్వానరుడు 'సప్తాంగములు' కలవాడు. వానికి ఏడు అంగములు ఉన్నవి. అంతరిక్షము శిరస్సు, సూర్యుడు కళ్ళు, వాయువు ప్రాణము, గగనము నడుము, నీరు మూత్రము, పృథ్వి ఇతని రెండు పాదములు (ఛాం॥ 5-8-12).

ఒకసారి కొందరు ఋషులు 'వైశ్వానరవిద్య' తెలుసుకోవడము కోసము ఉద్దాలక ఆరుణి దగ్గరకు వెళ్ళారు. అది అతనికి పూర్తిగా తెలియదు. అందువల్ల, అతడు ఆ ఋషులను 'అశ్వపతి కైకయుడు' అనే

ఒక రాజు దగ్గరకు తీసుకువెళ్ళాడు. అతనికి ఆ విద్య బాగా తెలుసు. అందరూ తాము బ్రాహ్మణులమనే అభిమానమును విడచి, తమకంటె తక్కువ వర్ణము వాడైన రాజు దగ్గరకు వినయముగా వెళ్ళారు. ఇంతకు ముందు, ఒక్కొక్క ఋషి – వైశ్వానరుని ఒక్కొక్క అంగమును వైశ్వానరునిగా భావించి ఉపాసన చేస్తూ ఉండేవారు. వీరి ఈ మాటలను విని రాజు చెప్పాడు – వైశ్వానరుని అంగములను విడిగా ఉపాసనము చేయడము వల్ల, ఆయా అంగములు శిథిలమవుతాయి. ఈ విషయము రాజు హెచ్చరిక చేశాడు. పూర్తిగా వున్న వైశ్వానర ఉపాసన చెప్పాడు. ఆ సమయములో అతడు సప్తాంగములను చెప్పాడు.

3) ఇక్కడ ఒక ప్రశ్న: ప్రత్యగాత్మకు అర్థము – మన శరీరములో సాక్షి భూతముగా ఉన్న ఆత్మ. ఈ ఆత్మ యొక్క నాలుగు పాదములను గురించి మాండూక్య ఉపనిషత్ చెప్పినది. ఈ సందర్భములో, ఒక్కసారిగా, ప్రత్యగాత్ముని శరీరమునకు బాహ్యముగా వైశ్వానరుని యొక్క అంగములను ఎందుకు చెప్పారు? దానికి **సమాధానము:–** ప్రత్యగాత్మ కేవలము తన శరీరమునే ఆత్మ అని అనుకుంటున్నాడు. అందరికీ, తానే స్వతంత్ర సాక్షినని కూడా అనుకుంటున్నాడు. ఇదే అతని పెద్ద ప్రమాదము. ప్రత్యగాత్మ తన అవిద్యతో శరీరమునే ఆత్మ అని అనుకుంటూ, సర్వము ఆత్మకాదని భావిస్తున్నాడు. కాని, వస్తుతః అతడు జగద్వ్యాపియైన బ్రహ్మమే. ఇది తెలుసుకోవాలంటే, తన అవిద్యా కల్పిత సాంతత్వమును (పరిచ్ఛిన్నత్వమును) విడచి, వైశ్వానరునితో ఐకాత్మ్యను పొందాలి. ఇందువలన, తన శరీరమునకు బాహ్యమైన వైశ్వానరుని అంగముల గురించి చెప్పారు. ఈ విధముగానే సమష్టి తైజసునిలో – సమష్టి ప్రాజ్ఞునిలో ఏకత్వప్రాప్తిని పొంది, ఆఖరులో అంత జగత్తును ప్రవిలయము చేయడములోనే అద్వైతసిద్ధి ఉన్నది. అన్ని భూతములను తన ఆత్మలో – తన ఆత్మను అన్ని భూతములలో ఎవరు చూస్తున్నాడో (ఈశా॥6) అతడే సమ్యగ్దర్శి. ఇలా కాకుండా, తన శరీరములో పరిచ్ఛిన్నమైన ప్రత్యగాత్మను – సాంఖ్యాదుల వలె – ఎవడు తన స్వరూపముగా తెలుసుకుంటాడో వాడు శ్రుత్యుక్తాద్వైతదర్శి కాదు – "అన్యథా హి స్వదేహ పరిచ్ఛిన్న ఏవ ప్రత్యగాత్మా, సాంఖ్యాదిభిరివ దృష్టః స్యాత్. తథా చ సతి, అద్వైతమితి శ్రుతికృత విశేషో న స్యాత్।" (మాం॥ 3).

14-8 తైజసాత్మ

స్వప్న వ్యవహారము చేసే జీవుడు వ్యష్టి అయితే తైజసాత్మ సమష్టి. వ్యష్టిలాగే సమష్టిలో కూడా తైజసునిది స్వప్నస్థానమే. ఇతడు అంతఃప్రజ్ఞుడు, ఏకోనవింశతిముఖుడు, ప్రవివిక్తభుక్, సప్తాంగుడు. కాని, ఈ అంగములు వైశ్వానరుని అంగముల సూక్ష్మరూపములు. స్థూల విషయములను కాక, కేవల ప్రకాశ స్వరూపములైన వాసనారూప ప్రజ్ఞలను తెలుసుకుంటూ వుండడము వల్ల అతడు తైజసుడు. ఇది పరమాత్మ రూపియైన ప్రత్యగాత్మ యొక్క రెండవ పాదము. (మాం॥ 4). ఇది సమష్టిబుద్ధియైన హిరణ్యగర్భుడు.

వైశ్వానరుడు జీవుని నేత్రస్థానములో వుండి జాగ్రద్వ్యవహారములను నడిపిస్తూ వుంటాడు. స్థాన భేదముతో అతనిని, దక్షిణ నేత్రస్థానములో ఇంద్రుడని, వామనేత్ర స్థానములో వాని పత్ని ఇంద్రాణి అని శ్రుతి చెప్తున్నది. ఇంద్ర పదము వస్తుతః 'ఇంధ'. కాని, దేవతలు ప్రత్యక్షద్వేషులు, పరోక్షప్రియులు కావడము వలన వానిని పరోక్షరూపముతో 'ఇంద్రుడు' అంటున్నారు. ఇతడు నేత్రస్థానమును వదలి హృదయములో ప్రవేశించినప్పుడు స్వప్నము వస్తున్నది. ఈ విధముగా ఇంద్రాణితో కలిసిన ఇంద్రుడు తైజసుడు. (బృ॥ 4-2-3). తైజసుడైన హిరణ్యగర్భుడు పరమేశ్వరుని ప్రథమజుడు. అనగా, ఇంద్రుడే పరమేశ్వరుడు – ఇంద్రాణి ప్రకృతి అవుతున్నది. అందువలననే తైజసాత్మునికి ఆత్మయైన ప్రాజ్ఞుడు పరమేశ్వరుడే!

14-9) ప్రాజ్ఞాత్మ

వ్యష్టిలో సుషుప్తాత్మ ఎవరో అతడే సమష్టిలో ప్రాజ్ఞాత్మ. ఇతనిని వ్యష్టిలో ప్రాజ్ఞుడు అన్నారు. (అధ్యా॥ 13-13). సుషుప్తాత్మే నిద్రలో ముందు, తరువాత కూడా అందరినీ తెలుసుకునేవాడు గనక ఇతనిని ప్రాజ్ఞుడు అన్నారు. కాని, సమష్టిలో ఇతడు కేవలము ప్రజ్ఞప్తి రూపుడు మాత్రమే. అనగా, కేవలము చైతన్యరూపుడు. ఈ కారణమువల్ల అతడు ప్రాజ్ఞుడు. వైశ్వానరుడే కానీ, తైజసుడే కానీ, పరమాత్ముడే అవడమువల్ల, ఉపాధి సంబంధము ద్వారా అతనిలో విశేషవిజ్ఞానము కనపడుతున్నది. కాని, ప్రాజ్ఞుడు అలాకాదు. ఇతడు ప్రజ్ఞానఘనుడు. ఇతడే సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, అంతర్యామి, అన్నిటికీ కారణము. భూతముల ఉత్పత్తి - ప్రళయములు ఇతనివల్లనే జరుగుతున్నాయి. -"ఏష సర్వేశ్వరః ఏష సర్వజ్ఞః ఏషోఽన్తర్యామీ, ఏష యోనిః సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానామ్।" (మాం॥6) ఇది ఆత్మ మూడవ పాదము. వైశ్వానరుడు తైజసుడు ప్రాజ్ఞుడు - క్రమముగా ఆత్మ యొక్క మూడు పాదములు. ఇవి ఆవు పాదముల వలె కాదు. రూపాయిలో 25 పైసలు ప్రథమపాదము - 50 పైసలు రెండవ పాదము -75 పైసలు మూడవ పాదము. ఈ మూడు పాదములలో - మొదటి రెండు పాదములు మూడవ పాదములో, మొదటి పాదము రెండవ పాదములో అంతర్నిహితముగా వున్నాయి. ఇదే విధముగా, ఆత్మలో నాలుగు పాదములు ఉన్నవి. ఆత్మలో జగత్తును ప్రవిలయము చేసేటప్పుడు ఇది దృష్టాంతము. స్థూలవైశ్వానరుని సూక్ష్మతైజసునిలో - వైశ్వానరునితో కలసిన తైజసుడిని, సూక్ష్మతర ప్రాజ్ఞునిలో - విశ్వతైజసులతో కూడిన ప్రాజ్ఞుడిని, సూక్ష్మతమ ఆత్మలో ప్రవిలయము చేసి, 25-50-75 పైసలతో విడిగా వ్యవహారము మానివేసి, పూర్తి రూపాయిని మూటకట్టుకున్నట్లు, ఆత్మను పొందాలి.

14-10) తురీయాత్మ

ఇప్పటికి అర్థమయ్యే వుంటుంది - ఆత్మను పొందడము ఎంత కఠినమైనదో! దీనికి కారణము ఎవరూ సరిగా తెలియచెప్పలేకపోయారు. అవును, తెలియజేయడము కష్టమే. ఒకవేళ సరిగా తెలియజేయాలంటే, దానిని తన దృష్టితో తెలుసుకోవాలి, లేక ఇతరుల వాక్కు ద్వారా తెలుసుకోవాలి, లేక మనస్సుతో విచారణ చేసి తెలుసుకోవాలి. కాని ఈ ఏ విధములలోనూ స్వయముగా తెలుసుకోజాలడు. దాని వైపుగా, ఇంద్రియములు వాక్కు, మనస్సు వెళ్ళలేవు. అందువల్ల స్పష్టరూపముగా మనము తెలుసుకోలేము. అది ఎలా వున్నది అని, ఎలా తెలియచెప్పాలి అన్నది కూడా తెలియదు- "న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః న విద్మో న విజానీమో యథై తదనుశిష్యాత్।" (కేన॥ 1-3). రెండింటి కష్టముల రహస్యము బ్రహ్మస్వరూపములో వున్నది. ఏదైనా చెప్పాలంటే, దానిని, బయట వెదకడము మనస్సు యొక్క సహజప్రవృత్తి, కాని, ఈ ప్రవృత్తికి కారణము బ్రహ్మ. బ్రహ్మ అన్ని బుద్ధిప్రత్యయములకు ఆధారమైన చైతన్యము - "ప్రతిబోధ విదితమ్।" (కేన॥ 2-4). అందువల్ల మనస్సు బ్రహ్మను విషయీకరణము (విషయము) చేయలేదు. (కేన॥ 1-6). అంతే కాకుండా, దీనినిమించి స్వయముగా తానే బ్రహ్మ అయివున్నాడు. అందువల్లనే దీనిని తెలుసుకోవడము కఠినము. కాని, కరుణామయుడైన పరమాత్ముడు సుషుప్తిని మనకు ప్రసాదించాడు. ఒకవేళ మనము పామరులమైతే, సుషుప్తిలో అలసట తీర్చుకుని తిరిగి అవివేకముతో సంసారులము అవుతాము. ముముక్షువులమైతే, శ్రుతి సమ్మత తర్కముతో ఏకత్వమును నిశ్చయించుకుని బ్రహ్మాత్మైకత్వమును పొందుతాము.

సుషుప్తిలో ఉన్న బ్రహ్మాత్మైకత్వమును తెలుసుకోవడానికి ఆటంకమైన అన్ని అధ్యాసములకు అపవాదము చెప్పాము. అధ్యాస కారణమొక్కటి మిగిలివున్నది. అదే అవిద్య. సుషుప్తిలోనే ఉండి, దానిని నశింపజేయడానికి వీలులేదు. జాగృతుడయే వుండాలి. ఒకవిధముగా చెప్పాలంటే – జాగ్రత్తు – స్వప్నము – సుషుప్తి, మూడు అవస్థలనుండి జాగృతుడయే వుండాలి. ఈ మూడూ స్వప్నములే! – "త్రయః స్వప్నాః", (ఐ॥ 1–3–12). అజ్ఞాని స్వప్నావస్థనుంచి లేచి ఇలా చెప్తాడు – 'నేను ఊరికే భయపడ్డాను. వృథాగా సంతోషించాను . వీటికి కారణము ఏమీ లేదు. అన్నీ కూడా నాలోనే కల్పించబడ్డాయి.' ముముక్షువు కూడా అలాగే తెలుసుకోవాలి "జాగ్రత్తు – స్వప్నము – సుషుప్తి అనే వ్యవహారములతో సుఖ–దుఃఖములను అనుభవిస్తున్నాను. వీటికి ఏమీ కారణము లేదు. ఈ వ్యవహారములన్నీ నాలోనే కల్పించబడ్డాయి. ఈ జగత్తుకంతటికి ఉపాదానమైన బ్రహ్మ నేనే. వ్యవహారము కార్యములలో మాత్రమే కనిపిస్తున్నది. కారణములో లేదు. నేనే కార్యములలో ఉన్నాను (సర్వాత్మభావము). అయినా, నాలో కార్యములు లేవు (స్వరూపజ్ఞానము)" అని ఈ విధమైన యథార్థజ్ఞానమును పొందుతాడు. వాసుదేవుడు, నారదునితో యిలా అన్నాడు – "హే నారద! ఏది నేనుగా కనపడుతోందో, అది నాచే సృజించబడిన మాయ. నేను ఈ ప్రకారము అన్ని భూతములతో కలసి వున్నానని అనుకోవద్దు. – "మాయా హ్యేషా మయా సృష్టా యన్మాం పశ్యసి నారద! సర్వ భూతగుణైర్యుక్తం మైవం మాం జ్ఞాతుమర్హసి॥" (మోక్షధర్మము – 339–45). ఇలా, మూడు అవస్థల వ్యవహారము లేనిదే, 'తురీయము'. ఇది స్వరూపజ్ఞానము కూడా. సర్మాత్మ భావము కూడా. వ్యవహారము వలె కనపడుతున్నప్పటికీ, సర్వాత్మ భావములో వ్యవహారము లేదు. వాసుదేవుడు పైన చెప్పినది ఇదే!

తురీయ ఆత్మే ప్రత్యగాత్మ యొక్క చతుర్థపాదము. –"సోఽయమాత్మా చతుష్పాత్॥" (మాం॥2). అంటే ఆవు నాలుగు పాదముల వలె కాదు. రూపాయిలో నాల్గవ భాగము – రూపాయే అయినట్లు, ఆత్మయొక్క నాలుగవ పాదము ఆత్మయే. ఇది అంతఃప్రజ్ఞ కాదు; బహిష్ప్రజ్ఞ కూడా కాదు; అనగా విశ్వుడు కాదు; జాగ్రద్వ్యవహారము చేసేవాడు కాదు; ఈ రెండు అవస్థలకు మధ్యన ఉన్నవాడు కాదు; వేఱు – వేఱు ప్రజ్ఞలు ఘనీభూతమై ఏమీ తెలియని అవివేకి ప్రజ్ఞానఘనుడు కాదు; అనగా సుషుప్తుడు కాదు; ఇంకొక్కటిని చక్కగా తెలుసుకునే ప్రజ్ఞుడు అంటే ప్రజ్ఞాత కాదు; ఎందుకంటే తనకంటే అన్యుడు ఎవరూ లేరు. అప్రజ్ఞుడు కాదు, అనగా చైతన్యము లేనివాడు కాదు. చూచేవాడు కాదు; వ్యవహారమునకు చిక్కేవాడు కాదు. అనుమానాది ప్రమాణములతో బుద్ధిగ్రాహ్యుడు కాదు; ఏ లక్షణములు లేనివాడు. అందువల్ల అచింత్యుడు. శబ్దములతో స్పష్టముగా వివరించబడేవాడు కాదు. అతడు మూడు అవస్థలలో ఉన్న ఏకాత్మ ప్రత్యయము ద్వారా తెలుసుకోవలసిన వాడు. విశ్వమంతా ఉపశమించుటకు ఆశ్రయము. అందువల్ల శాంతుడు, శుభుడు, ద్వైతరహితుడు, ఇదే ఆత్మ – "నాన్తఃప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞాన ఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్ అదృష్టమ్ అవ్యవహార్యమ్ అగ్రాహ్యమ్ అలక్షణమ్ అచిన్త్యమ్ అవ్యపదేశ్యమ్ ఏకాత్మప్రత్యయసారం ప్రపఞ్చోపశమం శాంతం శివమ్ అద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః॥" (మాం॥7).

14–11) కొన్ని సంశయములు

1) వైశ్వానరుడిని – తైజసుడిని, – ప్రాజ్ఞుడిని పరమాత్ముడే అని చెప్పినట్లయితే, తురీయములో ఈ మూడింటిని ఎందుకు నిరాకరించారు?

పరమాత్ముడే, ఉపాధిసంబంధముతో వేఱు వేఱు వ్యవహారములతో కనపడుతూ, స్వయముగా వైశ్వానరుడుగా, తైజసుడుగా, ప్రాజ్ఞుడుగా అయ్యాడు. ప్రాజ్ఞుడిలో కూడా జగత్తు యొక్క సృష్టి, స్థితి,

లయములు ఉన్నాయి. తురీయుడు నిరుపాధికుడు. అందువల్ల, అతనిలో ఈ వ్యవహారములన్నీ నిరాకరింపబడ్డాయి.

2) ఈ ఆత్మ, బయట, లోపల లేకపోయినా ప్రజ్ఞలు ఘనీభవించిన ప్రజ్ఞానఘనుడు. "అయమాత్మా అనన్తరో అబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ।" (బృ॥ 4-5-13). ఈ విధముగా శ్రుతి ఆత్మనే 'ప్రజ్ఞానఘనుడు' అన్నది. అయితే, ఆత్మ రూపియైన తురీయుడిని 'ప్రజ్ఞానఘనుడు' కాదు అంటున్నారు. ఇది ఎలా?

ఒకే శబ్దము వేఱు వేఱు అర్థములతో ప్రయోగింపబడినది. తురీయములోను, సుషుప్తిలోను విశేషజ్ఞానము వుండదు. ఇది రెండింటిలోన సమాన లక్షణము. దీని ఆధారముతోనే శ్రుతి, రెండు చోట్లను 'ప్రజ్ఞానఘనుడు' అనే శబ్ద ప్రయోగము చేసినది. కాని, సుషుప్తిలో 'వాడు ఏమీ తెలుసుకోలేదు' అనే అవివేక రూపమైన అవిద్య ఉంటుంది. (అధ్యా॥13-13). తురీయములో 'అంతా ఆత్మయే!' అనే విద్య ఉంటుంది. అందువల్ల విశేష జ్ఞానము వుండదు. ప్రశ్నలో ఉదాహరించిన బృహదారణ్యక మంత్రము - ఆత్మనే చెప్తున్నది.

3) బ్రహ్మరూపమైన తురీయమునే ఇక్కడ అలక్షణముగా చెప్పారు. కాని, బ్రహ్మను సత్య - జ్ఞాన - అనంతములనే మూడు లక్షణములతో చెప్పారు (అధ్యా॥9, 4-11). దీనికి సమన్వయము ఎలాగ?

మొదట చెప్పిన మూడు లక్షణములలో అనంత లక్షణము ఉద్దేశ్యము సాంతత్వమును నిరాకరణ చేయడమే! అందువల్ల అది బ్రహ్మ అలక్షణమని చెప్పడములో బాధకము కాదు. మిగిలిన రెండు శబ్దములు - జ్ఞానము, సత్యము - తమ అర్థముతోనే బ్రహ్మ లక్షణములు. కాని, బ్రహ్మ వాచకములు కావు. అనగా, ఈ శబ్దములతోనే బ్రహ్మను చెప్పడానికి ఉద్దేశించినవి కావు. కావున ఈ శబ్ద వాచ్యార్థములను గ్రహించకూడదు. అందుకే, 'స్థూలారుంధతి న్యాయము'తో వాని వాచ్యార్థముతో బ్రహ్మను వేఱుగా గ్రహించి, లక్ష్యార్థమును తీసుకోవాలి. (తై॥భా॥ 2-1-1). అనగా, బ్రహ్మను విచారము చేసి, అనుభవములో వున్న వస్తువుల ప్రకారముగా - ఇది అసత్యము కాదు, జడము కాదు అని తెలుసుకోవాలి. సత్య-జ్ఞాన-అనంత పదములు తనకంటె విరుద్ధమైన అర్థమును నివర్తింప చేస్తున్నాయి. అందువలన ఇవి కూడా అలక్షణత్వమునకు బాధకములు కావు.

4) తురీయము ఏ ప్రమాణము తోనూ తెలుసుకోలేమని ఎలా ఆమోదించాలి? శ్రుతి ప్రమాణము ఉండనే ఉన్నది కదా!

'ఇది అప్రమేయము' అనేది తథ్యము - "ఏ తదప్రమయం।" (బృ॥4-4-20). అందువల్ల శ్రుతి కూడా తిన్నగా దీనిని 'ఇలా ఉన్నది' అని చెప్పజాలదు. కాని, స్వతః ప్రమాతరూపముగా ఉన్నదానిని - ప్రమాత - ప్రమాణ- ప్రమేయము మొదలైన అవిద్యాకల్పిత వ్యవహారముల నుండి విడిపించవలసి వున్నది. శ్రుతి, ఆత్మ విషయములో శబ్దములను అందుకే ప్రయోగిస్తున్నది.

5) తురీయాత్మగా తనని ఎవరైతే అనుకుంటున్నాడో అతనికి స్వప్నముగాని, నిద్రగాని రాదా?

అలాగ ఏమీ లేదు. నేత్ర స్థానములో వుండే సమయములో మనస్సు జాగృతముగా వుంటుంది; హృదయములోనికి వచ్చినప్పుడు స్వప్నము - సుషుప్తి వస్తాయి. ఇందువలన, అవస్థలు శరీర ధర్మములని తెలుస్తున్నది. జ్ఞానప్రాప్తి కాగానే శరీరము మరణించదు. విడిచిన బాణము లాగా ప్రారబ్ధము వున్నంత వరకు వుంటున్నది. అందువల్ల, జ్ఞాని శరీరములో కూడా ఈ మూడు అవస్థలూ ఉంటూనే ఉంటాయి.

(ఛాం॥ 8–3–3). కాని, జ్ఞాని మనస్సులో సర్వాత్మభావము ఎలా ఉంటుందో, అలాగే అజ్ఞాని మనస్సులో అ–సర్వాత్మ భావము వుంటుంది. అందువల్ల వారి స్వప్నముల విధానము కూడా వేఱుగానే ఉంటుంది. అజ్ఞానికి పోట్లాడుట, గెలుచుట, ఏనుగు వెంట తరముట, అగాధములో పడిపోవుట, ఇటువంటి కలలు వస్తాయి. జ్ఞానికి, తాను స్వయముగా రాజైనట్లు, దేవతలైనట్లు, విశ్వమంతా తానే అయినట్లు కలలు వస్తాయి. (బృ॥4–3–20). కాని, జ్ఞాని – మూడు అవస్థలలో ఒకటి కూడా తనలో లేదని భావిస్తూ వుంటాడు.

6) అంతఃకరణమును విచారణ చేసే సమయములో (అధ్యా॥ 1–1–6) – మనస్సు ఒక చోట వుంటే ఇంకొక చోట వుండదు అని చెప్తారు. ఈ విధముగా ఉన్నప్పుడు – మనస్సు ఆత్మలో లగ్నమయి ఉన్న జ్ఞాని యొక్క వ్యవహారము ఎలా వుంటుంది?

మనస్సు ఎప్పుడైతే సంకల్ప రహితము అవుతుందో, అప్పుడు ఏ కార్యమూ అవదు. కాని, పరోక్షజ్ఞానికి సంకల్పము వున్నప్పుడు "వ్యవహారమును తన ద్వారా పరమేశ్వరుడే చేయిస్తున్నాడు" అనే భావన వుంటుంది. అయితే, పరమేశ్వరుడు తనకంటె అన్యము కాదనుకునే అపరోక్షజ్ఞానికి – మనస్సు ఆత్మపైనే ఉన్నప్పటికీ పనులు జరుగుతూ వుంటాయి. ఎందుకంటే – ఏ విషయములలో మనస్సు లగ్నము చేసి పనులు చేయాలో, ఆ విషయములు ఆత్మకంటె వేఱుకావని – అతనికి దృఢ నిశ్చయము వుంటుంది. శారీరక వ్యవహారము ఉన్నప్పటికీ అతడు అకర్త. ఇతరులకు, 'అది ఇతని వ్యవహారము' అని కనపడేది, అతనికి వ్యవహారము కాదు. అతని స్వరూప జ్ఞానమునకు దీనివల్ల కొంచెము కూడా హాని లేదు. అన్ని వ్యవహారములు సద్రూపములో సత్యములే.

7) తనని తాను 'అకర్త' – 'అసంగుడు' అని ఎవరైతే అనుకుంటారో, వారు ఇతరులలాగే వర్తించుట నాటకము వంటిది కాదా?

కాదు. అధ్యాపకుడు, వ్రేళ్ళు లెక్కిస్తూ, పిల్లలకు గణితమును బోధిస్తూ వుంటే – అలా వ్రేళ్ళు కదిలించడము నాటకమని ఎవరైనా అంటారా? అలాగే, లోక సంగ్రహము కోసము పని చేసే జ్ఞాని, కర్మసంగి అయిన అజ్ఞాని లాగే కర్మ చేస్తాడు. (గీ॥భా॥ 3–26).

8) ఏ కర్మా తనని అంటదు అని ఎవరైతే అనుకుంటున్నాడో – ఆ జ్ఞాని ఎప్పుడైనా చెడ్డపనులు చేస్తాడా?

వివేక – వైరాగ్యములు, శమదమాది సంపత్తి ఉన్న వ్యక్తి వేదాంత శ్రవణమునకు అధికారి అని చెప్తున్నారు. ఇక, శ్రవణ, మనన, నిదిధ్యాసనములు చేసి, కృతకృత్యుడైన తరువాత అతడు ఎప్పుడూ చెడ్డపనులు చేయడు. రాత్రిలోనే అగాధమును చూడగలిగినవాడు – ఇక, పగలు దానిలో పడడు. (ఛాం॥భా॥ 2–2–3).

9) జ్ఞాని కర్మ అజ్ఞానలేశ లక్షణమా?

అలా కాదు. ఆత్మజ్ఞానము పొందడము కఠినము అని అందరికీ తెలుసు. ఇందువలననే– "ఆ ఆత్మ నీవే" – "స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో" అన్న రీతిలో పొందిన ఆత్మజ్ఞానమును స్పష్టము చేసుకోవడము కొఱకు, శ్వేతకేతువు నెమ్మది నెమ్మదిగా సంశయములను నివృత్తి చేసుకుని, తొమ్మిదిసార్లు ఉపదేశమును

పొందాడు. అజ్ఞానము నెమ్మదినెమ్మదిగానే వదులుతుంది. పూర్ణముగా వదలిపోయే వరకు సందేహములు వస్తూనే వుంటాయి. అప్పటివరకు సమ్యక్‌జ్ఞానము కుదరదు. ప్రథమముదో, ఆఖరుదో, సంతతము అయినదో, అసంతతము అయినదో, ఏ ప్రత్యయము ద్వారా అవిద్యాది దోషములు తొలగిపోతాయో అదే విద్య - "య ఏవ అవిద్యాది దోష నివృత్తి ఫలకృత్ ప్రత్యయః ఆద్యః అన్త్యః సన్తతః అసన్తతో వా స ఏవ విద్యా ।" (బృ॥భా॥1-4-10). సమ్యజ్ఞాన ప్రాప్తి అయిన తరువాత అవిద్యాలేశమునకు అర్థము లేదు. విద్యలో 'అర్ధజరతీయ' న్యాయము చెల్లదు. ఏకర్మ కైనా అవిద్యయే కారణమని అనుకునే వాళ్ళు అలా అంటూ వుంటారు. ఇది సరియైన మాటకాదు. ఎందుకంటే, తన హృదయములోనే ఉన్న బ్రహ్మయొక్క జ్ఞానమును - దేహధారణమును ఇతరులు ఎలా నిరాకరిస్తారు? శ్రుతి - స్మృతులలో స్థిత ప్రజ్ఞుని లక్షణములను చెప్పి దీనిని బోధపరిచారు కదా! - "కథం హి ఏకస్య స్వహృదయ ప్రత్యయం బ్రహ్మవేదనం దేహధారణం అపరేణ ప్రతిక్షేప్తుం శక్యేత? శ్రుతి స్మృతిషు చ స్థితప్రజ్ఞలక్షణనిర్దేశేన ఏతదేవ నిరుచ్యతే।" (సూ॥భా॥ 4-1-17). సామాన్యజనులు జ్ఞానిని భిక్షాటనాది కర్మలకు కర్త - అని అనుకుంటారు. కాని, శాస్త్ర ప్రమాణ జనిత స్వానుభవములో అతడు అకర్తగానే ఉంటాడు- "లోక వ్యవహార సామాన్య దర్శనేన లౌకికైః ఆరోపిత కర్తృత్వే భిక్షాటనాదౌ కర్మణి కర్తా భవతి । స్వానుభవేన తు శాస్త్ర ప్రమాణజనితేన అకర్తైవ।" (గీ॥భా॥4-22). జ్ఞానిలో కనబడే ఈ కర్మ అతని స్వరూపమునకు విరుద్ధము కాదు. సర్వ వ్యవహారములు - సర్వవికారములు, సద్రూపముగా చూడడము వల్ల జ్ఞానికి సత్యములే. - "సదాత్మనా సత్యత్వాభ్యుపగమాత్ సర్వ వ్యవహారాణాం, సర్వ వికారాణాం చ సత్యత్వమ్।" (ఛాం॥భా॥ 6-3-2). ఆ ఆత్మతోనే జగత్తు; ఆ ఆత్మతోనే చిత్తము సంకల్పము మనస్సు వాక్కు మంత్రము కర్మ; - ఆ ఆత్మతోనే అన్నీ వున్నాయి. (ఛాం॥ 7-23-1). ఇలా ఆలోచిస్తే, తాను బహురూపములతో పుట్టి అన్ని రూపములను సృష్టించి వాని వానికి పేరు పెట్టి పిలుస్తూ ఉండే పరమాత్మ ధర్మోద్ధారము కోసము, అవతరించినప్పుడు గాని, పనిచేస్తూనే వుంటాడు. అతని మీద కూడా అవిద్యను ఆరోపించడము బుద్ధిమంతుల పని కాదు. ఇప్పుడే ఫలితమును ఇచ్చే ప్రారబ్ధము వల్ల మాత్రమే జ్ఞాని శరీర క్రియలు జరుగుతున్నా - అతడు తనకు వానితో సంబంధము లేదనే భావిస్తూ వుంటాడు. ఇటువంటి దృఢమైన ప్రజ్ఞకలవాడే జ్ఞాని. జ్ఞాని కూడా కర్మ చేస్తూ వుంటాడు అని ఇతర జనులు అనుకుంటూ వుంటారు. అతడు మాత్రము అలా భావించడు.

ప్రశ్న: వానికి ఎంతవరకు ఈ శరీరమునుంచి విమోచనము అవదో, అదే ఆలస్యము (శరీరము పడిపోగానే) వాడు సత్సంపన్నుడు అవుతాడు - "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే~థ సంపత్స్య ఇతి ।" (ఛాం॥ 6-14-2) అని శ్రుతి చెపుతున్నది. ఇందువల్ల ప్రారబ్ధము మోక్షమునకు అవరోధము. ఈ ప్రారబ్ధకర్మకు వెనుకటి జన్మలలోని అవిద్యే కారణము. అందువల్ల ప్రారబ్ధమును అవిద్యాలేశము అనే అనవచ్చు కదా?

సమాధానము: ఇది సరికాదు. ఒక వ్యక్తి జిహ్వా చాపల్యముతో ఒకప్పుడు అభోజ్య భోజనము చేసి అనారోగ్యము పొందాడు అనుకుందాము. చాపల్యమును విడచిన తరువాత కూడా అనారోగ్యము వుండవచ్చు. అయితే, ఆ అనారోగ్యమును చాపల్యలేశము అనము. ఇదే విధముగా, జ్ఞాని యొక్క ప్రారబ్ధమును అవిద్యాలేశము అనరాదు. 'అవిద్యాది క్లేశములు భస్మమైన తరువాత - కర్మాశయములో ఒక భాగము భస్మమైనది ఇంకొక భాగము కర్మను కలిగిస్తున్నది - అని చెప్పడము సరి కాదు. అగ్నిలో కాల్చివేయబడిన ధాన్యపు గింజలో ఒక భాగము మొలకెత్తదు. విడిచిన బాణము వేగము నశిస్తూనే పడిపోయినట్లు, తన

ఫలము పూర్తి అవుతూనే ప్రారబ్ధము కూడా వుండదు. "న చ అవిద్యాది క్లేశదాహే సతి క్లేశబీజస్య కర్మాశయస్య ఏకదేశదాహః ఏకదేశ ప్రరోహశ్చ ఇత్యుపపద్యతే। న హి అగ్నిదగ్ధస్య శాలి బీజస్య ఏకదేశ ప్రరోహో దృశ్యతే। ప్రవృత్త ఫలస్య తు కర్మాశయస్య ముక్తేషోరివ వేగక్షయాన్నివృత్తిః। (సూ॥భా॥ 3-3-32).

ప్రశ్న: అలా కాదు. కారణశక్తి పూర్తిగా వ్యయమయే వరకు కార్య వ్యవహారము జరుగుతూనే వుంటుంది. అలాగే, ఎప్పటి వరకు ప్రారబ్ధము క్షయించదో, అప్పటివరకు అవిద్య ఉండనే ఉంటుంది. అంటే, ప్రారబ్ధము అవిద్యాలేశమునకు గుర్తు కదా?

సమాధానము: ఇది కూడా సరికాదు. కర్మకు అవిద్య కారణము. కాని, అది కర్మకు ఉపాదానము కాదు. కర్మకు ఉపాదానము త్రిగుణాత్మిక ప్రకృతి. 'కేవల అవిద్య, సుఖ- దుఃఖవైషమ్యమునకు కారణము కాదు. అది (అభావరూపము అవడమువల్ల) అందరికీ ఒకే విధముగా ఉంటుంది. కాని, రాగాది క్లేశవాసనలతో చేసిన కర్మ, వైషమ్యకారి అవుతుంది. - "న చ అవిద్యా కేవలా వైషమ్యస్య కారణమ్ ఏకరూపత్వాత్ । రాగాది క్లేశవాసనాక్షిప్త కర్మాపేక్షా తు అవిద్యా వైషమ్యకరీ స్యాత్।" (సూ॥భా॥ 2-1-36). ఇక్కడ భావరూపమైనది, రాగాది క్లేశ త్రిగుణాత్మిక ప్రకృతి. ఇలా కాకుండా, "అవిద్య భావమే. అది ప్రారబ్ధకర్మకు ఉపాదానము. ఎంతవరకు ప్రారబ్ధము వుంటుందో అంతవరకు అవిద్య ఉంటుంది" - అని చెప్పడము క్రింద చెప్పబడిన సిద్ధాంతమునకు విరుద్ధమవుతుంది - 'జ్ఞానికి శరీరము ఉన్నట్లు కనపడినా అతడు ఇక్కడే, బ్రహ్మగా ఉన్నాడు. బ్రహ్మ అయి- బ్రహ్మలోనే చేరిపోతాడు. "విద్వాన్ స ఇహైవ బ్రహ్మ। యద్యపి దేహవానివ లక్ష్యతే । స బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి।" (బృ॥భా॥4-4-6).

ప్రశ్న: అయితే, 'మోక్షమునకు ప్రారబ్ధము ఆటంకము,' అని చెప్పే శ్రుతికి అర్థము ఏమిటి?

సమాధానము: మోక్షమునకు ప్రారబ్ధము అవరోధము కాదు. జ్ఞాని ఇక్కడే ముక్తుడు. అయితే జ్ఞానికి - అజ్ఞానికి ఒక సామ్యమూ వున్నది, ఒక అంతరము కూడా వున్నది. ఇద్దరికీ, ప్రారబ్ధము సమాప్తి అవగానే శరీరము పడిపోతుంది. కాని, అజ్ఞాని తను చేసిన సంచితకర్మల వల్ల ఇంకొక జన్మ పొందుతాడు. జ్ఞానికి జన్మ వుండదు. అందువల్ల, శరీరపతనము వరకే అతనికి అవరోధము అని శ్రుతి చెప్పినది.

10) ఆత్మ సర్వజ్ఞము, సర్వశక్తిమంతము అయితే, ఆత్మజ్ఞానికి కూడా ఇటువంటి సామర్థ్యము వుంటుందా?

సామర్థ్యము ఉపాధుల ద్వారానే ప్రకటింపబడుతున్నది. సృష్టి- స్థితి - లయములను చేసే హిరణ్యగర్భుడు, తన నిరతిశయ సామర్థ్యముతో కూడిన మనోబుద్ధులతోనే వాటిని చేస్తున్నాడు. సంపూర్ణముగా సృష్టి-స్థితి- లయములు చేసే ఉత్తరదాయిత్వము అతనికి తప్ప, ఇంకెవరికీ లేదు. అలా కానట్లైతే, ఒక దయాళువు, అందరి కష్టములు దూరము అవడానికి ప్రళయమును కోరితే, ఇంకొక వ్యసనపరుడు, ముక్తులకు కూడా జన్మ వుండాలనుకుంటాడు - ఇలా అంతా కోలాహలము అయిపోతుంది (అధ్యా॥ 12-12-2). కాని, తమ తమ యోగ్యతలను అనుసరించి చేసిన సాధనకు అనుసారముగా, కొన్ని ఈ సామర్థ్యములను పొందవచ్చు. అయితే, ఆత్మజ్ఞానమునకు, ఈ సామర్థ్యములకు ఏమీ సంబంధము లేదు. ఈ సామర్థ్యములను పొందిన వ్యక్తి అజ్ఞాని కూడా కావచ్చు. సామర్థ్యములు లేనివాడు జ్ఞాని కూడా కావచ్చు.

11) అప్పుడు జ్ఞాని ఈశ్వరుడు ఎలా అవుతాడు?

జ్ఞాని బ్రహ్మమే అవుతున్నప్పుడు ఈశ్వరుడు ఎందుకు కాడు? (అ॥14-3-(1) చూడండి) జ్ఞాని, మాయోపాధితో తాను ఈశ్వరుడయ్యాడని అనుకుంటాడు. ఏ ఆత్మకు ఏదీ తెలియనిది ఉండదో ఆ సర్వజ్ఞుడే ఆత్మ. "యస్యాత్మనో¬ విజ్ఞేయం న కించిత్ పరిశిష్యతే స ఆత్మా సర్వజ్ఞః।" (కఠ॥భా॥2-1-3). జ్ఞానిలో సర్వజ్ఞత్వ వ్యవహారము లేదు; అయితే సర్వజ్ఞత్వమున్నది.

12) జ్ఞానికి పునర్జన్మ ఉన్నదా? లేదా?

జ్ఞానికి పునర్జన్మ లేదు. వాని కర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమయాయి. (గీ॥4-9). అతని అంత్యకాలములో, వాక్కు- మనస్సు- ప్రాణములు, అజ్ఞాని వలె, కర్మిష్ఠునివలె, ఆగామి జన్మలలో వ్యవహారము కొఱకు సూక్ష్మవృత్తి రూపధారణ చెయ్యవు (అధ్యా॥11-12). ఆ తత్త్వములో కలసి వుండే భూతమాత్రలు, పంచభూతములలో కలసిపోతాయి. (బృ॥3-2-11), (ప్రశ్న॥6-5). ఈ జన్మ ప్రారబ్ధము పూర్తి కాగానే - శుద్ధ జలము శుద్ధ జలములో కలసి పోయినట్లు స్వయముగా బ్రహ్మ అయి వున్నవాడు ఇప్పుడు బ్రహ్మలో ఒకటై పోతాడు. 'అపాంతరతములు' వ్యాసులై, అవతారమును పొందినట్లు - కొందఱు జ్ఞానులు భగవంతుని ఆజ్ఞతో ఇంకొక జన్మపొందవచ్చు. ఇటువంటివారు, తమ మిగిలిన ప్రారబ్ధమును తీసుకుని జన్మను పొందుతారు. (సూ॥భా॥ 3-3-22).

13) అతనికి సంచిత - ఆగామి కర్మలు మిగిలి ఉన్నవి కదా? వానికోసమైనా జన్మ ఎత్తాలి కదా?

లేదు. జ్ఞానబలముతో అతనికి ఆగామి కర్మ లేనే లేదు. జ్ఞానప్రాప్తి పొందనంతవరకు చేసిన పుణ్యపాపములనూ, సంచిత పుణ్యపాపములనూ ఈ విధముగా పంచిపెడతాడు - అతని సంతానము ధనమును, మిత్రులు అతని పుణ్యములను, ద్వేషులు అతని పాపములను పంచుకుంటారు. "తస్య పుత్రా దాయముపయన్తి, సుహృదః సాధుకృత్యాం, ద్విషన్తః పాప కృత్యాం।" (శాట్యాయన శాఖా శ్రుతి - సూ॥భా॥ 3-3-26, 27) "తస్య ప్రియా సుకృతముపయంతి అప్రియా దుష్కృతం" (కౌ॥1-4)

14) జ్ఞానప్రాప్తికి సంన్యాసి కావలసిన అవసరము ఉన్నదా?

జ్ఞాన సాధనకు సంన్యాసి కావలసిన అవసరము వున్నది. జ్ఞానప్రాప్తికి అది అనివార్యము కాదు. పూర్వజన్మసాధన వల్ల వామదేవుడు గర్భములోనే జ్ఞానమును పొందాడు. (ఐ॥ 2-1-4).

14-12) ఓంకారము:

ప్రజాపతి అందరికంటే ముందు జన్మించి, అన్ని లోకముల సారమును తెలుసుకోవాలని తపస్సు చేశాడు. ఆఖరున అతనికి ఇలా తెలిసింది - భూః, భువః, సువః అనే వ్యాహృతులు మాత్రమే ఆ సారము. ఆ వ్యాహృతుల సారమును తెలుసుకోవాలని తిరిగి తపస్సు చేశాడు. అప్పుడు, 'ఓం' కారమే వాటి సారమని తెలిసింది. అందువల్ల, సర్వస్వమూ ఓంకారమే! (ఛాం॥ 2-23 - 2, 3). దగ్గరైనది - ఇది పరమాత్మునికి దగ్గరయైనది. ఇది అతని నామమే. దీనిని ఉచ్చరించడము వల్ల అతడు ప్రసన్నుడు అవుతాడు. ఇది బ్రహ్మ యొక్క ప్రతీకము కూడా. విష్ణువు అనే భావముతో సాలగ్రామమును పూజించినట్లే, బ్రహ్మ అనే బుద్ధితో ఈ శబ్దమును ఉపాసించాలి. ఇలా వేదోక్త కర్మలన్నీ ఓంకార పూర్వకముగానే చేయబడుతున్నాయి.

'ఓం'కారోపాసన విభిన్న ప్రకారములుగా ఉన్నది. వాటిలో, ముఖ్యప్రాణమును ఓంకారముగా భావించి చేసిన ఉపాసన యొక్క మహిమను చెప్పే ఒక ఆఖ్యాయిక (కథ) ఉన్నది. పూర్వకాలములో రాక్షసులకు భయపడి దేవతలు ఓంకారమును, – ఘ్రాణము, వాక్కు, చక్షువు, శ్రోత్రము, మనస్సులుగా భావించి ఉపాసన చేశారు. అప్పుడు రాక్షసులు ఒక్కొక్క దానిని చంపి వేశారు. అప్పుడు ఘ్రాణమునకు దుర్గంధము వచ్చినది, వాక్కుకు అసత్యము వచ్చినది; కన్ను చూడకూడనిది చూసినది; చెవి వినకూడనిది విన్నది; మనస్సు దేనిని చింతించకూడదో దానినే చింతనచేసినది. అప్పుడు దేవతలు ఓంకారమును ముఖ్యప్రాణముగా భావించి ఉపాసన చేశారు. ఇక రాక్షసులు వాటిని చంపలేకపోయారు. వారే మరణించారు. ఇందువల్ల, ఓంకారమును ముఖ్యప్రాణముగా భావించి ఉపాసన చేసే వారి శత్రువులు – మట్టిముద్ద బండకు తగిలి ఛిన్నాభిన్నమైనట్లు అయిపోతారు. (ఛాం॥ 1-2-18).

ఓంకారము స్వయముగా ఆత్మ కావడమువల్ల, ఆత్మయొక్క నాలుగు పాదములే ఓంకారము యొక్క నాలుగు పాదములు. వైశ్వానరుడు దీని ప్రథమ మాత్ర 'అ' కారము; తైజసుడు దీని ద్వితీయ మాత్ర 'ఉ' కారము; ప్రాజ్ఞుడు దీని తృతీయ మాత్ర 'మ' కారము; ఆత్మ 'అమాత్ర' రూపి ఓంకారము. మాత్రలకు వైశ్వానరాదులకూ ఉండే సాదృశ్యము ఇది.

1) వైశ్వానరుడు ఆత్మజ్ఞానమునకు ప్రథమ సోపానము. ఇతడు జగత్తంతా వ్యాపించి ఉన్నాడు. 'అ' కారము, అక్షరములలో ప్రథమ అక్షరము. అది అన్ని అక్షరములలో వ్యాపించి వున్నది. ఇందువల్ల వైశ్వానరుని ఓంకారములోని 'అ' కారముగా భావించి ఎవరైతే ఉపాసన చేస్తున్నారో – అతడు అందరిలో ప్రథముడుగా ఉంటాడు. అన్ని కామనలతో (అభీష్ట పదార్థములతో) నిండి వుంటాడు. అనగా, అన్ని కామనలను పొంది వుంటాడు.

2) తైజసుడు – వైశ్వానరునిలో నుంచి వచ్చిన రూపము. విశ్వ – ప్రాజ్ఞుల మధ్యనున్నవాడు. 'ఉ' కారము 'అ' కారము నుంచే వచ్చిన రూపము, 'అ' కార – 'మ' కారముల మధ్య నున్నది. తైజసుడిని ఓం కారములో 'ఉ' కారము అని భావించి ఎవరైతే ఉపాసన చేస్తాడో, అతడు జ్ఞానమును తనవైపు ఆకర్షించుకుంటాడు. అంటే, పెద్దవాడు అవుతాడు. శత్రువుల – మిత్రుల మధ్య వుంటాడు. ఎవ్వరికీ ద్వేషపాత్రుడు కాడు.

3) ప్రాజ్ఞుడు – విశ్వ తైజసుల సరిహద్దు. వాటిని తనలో లయింపచేసుకుంటాడు. ఓంకారములోని 'మ' కారము – 'అ' కార, 'ఉ' కారముల సరిహద్దు. వాటిని తనలో లీనము చేసుకుంటుంది. అందువల్ల ప్రాజ్ఞుని, ఓంకారములోని 'మ' కారముగా భావించి ఉపాసన చేసినట్లయితే – జగత్తు యొక్క సరిహద్దు, అనగా సత్యత్వమును దర్శించి, బ్రహ్మలో లీనమవుతాడు.

4) విశ్వాది మాత్రలు – ఆత్మ, వీటికి ఉన్న పైన చెప్పిన సంబంధమును తెలుసుకుని ఓంకారమును ఉపాసన చేయడము వల్ల, అల్పజ్ఞుడు కూడా కాలాంతరములో బహ్మాత్మైకత్వ స్థితిని పొందుతాడు.

ప్రశ్నలు:

1. శరీరత్రయమును నిరాకరించుట అనగా అర్థము ఏమిటి?
2. దృశ్యజగత్తుకు – స్వప్నలోకమునకు జీవుడు సాక్షి అని ఎలా చెప్తారు?
3. యోగమువల్ల మోక్షము ఎందుకు సాధ్యము కాదు?
4. గీతలో సాంఖ్యము, యోగము అనే రెండు పదములను ఏ అర్థములో ప్రయోగము చేశారు?
5. 'అపూర్ణదర్శనము' అంటే ఏమిటి? సమ్యగ్దర్శనము ఏమిటి? శ్రుతి ఆత్మలో త్రిపుటి వ్యవహారమును నిరాకరణ ఎలా చేసింది?
6. సర్వాత్మభావమే సమ్యగ్దర్శనము, అని చెప్పడమువల్ల ఏ సందేహము ఉత్పన్నమవుతున్నది?
7. సర్వాత్మక బుద్ధివృత్తితో లాభము ఏమిటి?
8. సమ్యగ్దర్శి యొక్క క్రియలు ఎలా అవుతాయి?
9. నమ్మాళ్వార శఠకోపముని, సమ్యగ్దర్శన విషయములో ఏమి ఉద్గారము చేశారు?
10. సర్వాత్మభావమును చెప్పడమువల్ల ఎటువంటి 'అనన్విత' అర్థము చేసుకోరాదు?
11. శ్రుతి బ్రహ్మయొక్క వర్ణన ఏ విధముగా చేసింది?
12. బ్రహ్మాత్మైకత్వ జ్ఞానమునకు ఎటువంటి బ్రహ్మను స్వీకరించాలి?
13. జగత్ప్రవిలయము ఏమిటి? ఏమిటి కాదు?
14. అజ్ఞానికి ఎన్ని జగత్తులు ఉన్నాయి?
15. వ్యష్టి–సమష్టి అనగా ఏమిటి?
16. స్వరూపములో వ్యష్టి సమష్టికన్నా ఎలా వేఱు కాదు?
17. వ్యష్టి జీవుడు తమలో స్వతంత్రులు కారని ఎలా చెప్తారు?
18. ఏ కథా ప్రసంగములో వైశ్వానరుడు సప్తాంగుడని చెప్పారు?
19. ప్రత్యగాత్మ ఎటువంటి పెద్దతప్పు చేస్తున్నాడు?
20. అద్వైతము ఎప్పుడు సిద్ధిస్తున్నది?
21. సమ్యగ్దర్శి ఎవరు?
22. తైజసాత్మ ఎవరు?
23. దేవతలు ఎటువంటివారు?
24. స్వప్నము ఎప్పుడు వస్తుంది?
25. సుషుప్తాత్మకు 'ప్రాజ్ఞ' నామము ఎందుకు వచ్చింది?
26. ఆత్మయొక్క మూడవ పాదము ఏమిటి?
27. వైశ్వానరుడు – తైజసుడు – ప్రాజ్ఞుడు ఈ ముగ్గురి క్రమ ప్రవిలయము ఎలా అవుతున్నది?
28. బ్రహ్మను తెలుసుకోవడము కష్టము; అని కేనోపనిషత్తు ఎందుకు చెప్పినది?

29. పరమాత్ముడు జీవులకు ప్రసాదించి ఉండే సుషుప్తితో ఏమి తెలుస్తున్నది?

30. సర్వాత్మభావము మరియు స్వరూపజ్ఞానము వీనిలో ఏ అంతరము వున్నది?

31. తురీయము యొక్క స్వరూపము ఏమిటి?

32. వైశ్వానరుడు – తైజసుడు – ప్రాజ్ఞుడు, ఈ ముగ్గురిని పరమాత్ముడని ఆమోదించి తరువాత ఎందుకు నిరాకరణ చేశారు?

33. 'తురీయము ప్రజ్ఞాన ఘనము కాదు', ఇలా చెప్పిన తరువాత ఎటువంటి సందేహము వస్తున్నది? దాని నివారణ ఎలా?

34. తురీయమును, అలక్షణము అని చెప్పిన తరువాత ఎటువంటి సందేహము కలుగుతుంది? అది ఎలా పోతున్నది?

35. 'తురీయము అప్రమేయము' ఇలా చెప్పిన దానిలో శంక, సమాధానము ఏమిటి?

36. తనను తురీయాత్మ అని తెలుసుకున్న జ్ఞానికి, స్వప్నము – నిద్ర రావా?

37. ఆత్మలో మనస్సు నిలిపిన జ్ఞాని వ్యవహారము ఎలా వుంటుంది?

38. తనను అసంగుడు – అకర్తృ అయిన ఆత్మ అనుకునే జ్ఞానికి కర్మ నాటకము వంటిది కాదా?

39. కర్మ సంబంధమును విడిచిపెట్టిన జ్ఞాని ఎప్పుడూ దుష్కర్మను చేయడా?

40. అలిప్తుడు అయిన జ్ఞాని కర్మలో అవిద్యాలేశము ఎందుకు వుండదు?

41. ఆత్మ సర్వజ్ఞము – సర్వశక్తిమంతము అయితే, ఆత్మజ్ఞానిలో ఆ సామర్థ్యములు ఎందుకు వుండవు?

42. జ్ఞాని ఈశ్వరుడే! ఎలాగ?

43. జ్ఞానికి పునర్జన్మ లేదు. ఎందుకు?

44. జ్ఞానప్రాప్తికి సంన్యాసము ఎందుకు అనివార్యము కాదు?

45. లోకముల సారము ఏమిటి? ప్రజాపతికి అది ఎలా తెలిసింది?

46. వేదోక్త కర్మలన్నీ ఓంకార పూర్వకముగానే ఎందుకు జరుగుతాయి?

47. ఏ ఆఖ్యానము, ఓంకారోపాసన యొక్క మహత్వమును చెప్తున్నది?

48. వైశ్వానరుడు – తైజసుడు – ప్రాజ్ఞుడు, వీరిని ఓంకార మాత్రలలో ఎందుకు పోల్చి చెప్పారు?

49. ఓంకారోపాసనతో ఏ ఫలము వస్తున్నది?

అధ్యాయము -15

పంచకోశ విమర్శ

ఆత్మ ఏకమేవాద్వితీయము అయితే, అనాత్మలు అనేకము. ఆత్మబుద్ధి ఏకరూపము – అనాత్మ బుద్ధులు వేలు వేలు సందర్భములలో వేలువేలు రూపములుగా వుంటాయి. ఇటువంటి అనాత్మబుద్ధుల నుంచి జీవుడిని ముక్తుడిని చేయడము కోసము శాస్త్రములో అనేక వివరణలు దొరుకుతాయి. ఇది సహజము. వెనుకటి అధ్యాయములలో శరీరత్రయము – అవస్థాత్రయముల గురించి విమర్శ చేయడము జరిగింది. ఈ అధ్యాయములో పంచకోశ విమర్శ చేస్తున్నాము. దీనిని తైత్తిరీయ ఉపనిషత్తు చెప్పింది.

15-1) వ్యష్టి వ్యవహారము:

జీవుని వాస్తవిక రూపము బ్రహ్మము. జ్ఞాన స్వరూపుడైన ఆ బ్రహ్మను మన శరీరములోని 'హృదయగుహ' లోనే వెదకాలి. ఇంకెక్కడా కనపడదు. కారణము ఏమిటంటే, ఇది జ్ఞానమునకు చాలా దగ్గర స్థానము. బయట అందరికీ కనిపించే శరీరము నుండి ఈగుహ వరకు, 5 ప్రకోష్ఠముల ఒక కోట ఉన్నది. స్థూల శరీరము – ప్రాణము – మనస్సు – బుద్ధి – భోక్తృత్వవృత్తి, ఇవి ఐదు ప్రకోష్ఠములు. ఇక్కడ భోక్తృత్వవృత్తి యొక్క అర్థము – భోగమును విషయముగా చేసుకునే అంతఃకరణ వృత్తి. భోగము కర్మవల్ల ఉత్పన్నమవుతున్నది. ఏ కర్మకైనా ముందుగా భోగేచ్ఛ ఉత్పన్నమవుతున్నది. భోగేచ్ఛతో ఆయా పనులు చేయాలనే నిశ్చయాత్మకబుద్ధి ఉత్పన్నమవుతున్నది. ఆ నిశ్చయాత్మక బుద్ధితో కర్మ చేయాలనే మనస్సంకల్పము కలుగుతుంది. దాని తరువాత కర్మ చేయాలనే సంకల్పము చేసిన మనస్సు శరీరము ద్వారా కర్మ చేయాలని ప్రాణమును ప్రేరేపిస్తున్నది. దాని తరువాత ప్రాణము యొక్క ప్రేరణతో శారీరక కర్మ. ఈ ప్రకారము భోక్తృత్వ వృత్తి, బుద్ధి, మనస్సు, ప్రాణము, శరీరము – ఇవి ఐదు ఇదే క్రమములో లోపలినుండి బయటకు ఉన్న ఐదు ప్రకోష్ఠముల రూపములో వ్యవహారము చేస్తూ వుంటాయి. ఈ అన్ని వ్యవహారముల ఫలములను భోగిస్తూ, కోట మధ్యలో రాజుగారి వలె జీవుడు వుంటాడు. జీవుడు కర్మ చేసే సమయములో శరీరముతోను – దాని గురించి ప్రయత్నము చేసే సమయములో ప్రాణముతోను – సంకల్పము చేసే సమయములో మనస్సుతోను – నిశ్చయము చేసే సమయములో బుద్ధితో – కర్మఫలమును అనుభవించే సమయములో భోక్తృత్వవృత్తితో అధ్యాస చేస్తూ వుంటాడు. ఈ విధముగా అధ్యాస క్రమములో అతనికి ఆటంకము ఏమీ వుండదు.

15-2) విమర్శ క్రమము:


పైన చెప్పిన కోటలో ఐదు ప్రకోష్ఠములను క్రమముగా – అన్నమయకోశము, ప్రాణమయ కోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము అని అంటారు. అన్నమయకోశమునే ఆత్మ అనుకునే జీవుడిని 'అన్నమయాత్మ' అంటారు. అదేవిధముగా ఆ జీవుడు – ప్రాణమయాత్మ, మనోమయాత్మ, విజ్ఞానమయాత్మ, ఆనందమయాత్మ అవుతూ వుంటాడు. ఈ జీవుడు రెండు విధములుగా పొరబాటు చేస్తూ వుంటాడు.

1) తాను అన్నమయాది **కోశములే** అనుకోవడము మొదటి ప్రమాదము. ఇది వ్యష్టి స్వరూపా జ్ఞానమువల్ల వస్తుంది. ఇది వెనుక (అధ్యా॥ 11-2, అధ్యా॥ 11-8) అనుచ్ఛేదములలో చెప్పబడినది.

2) కేవలము వ్యష్టి అన్నమయాది **కోశములు మాత్రమే** తాను అనుకోవడము రెండవ ప్రమాదము. ఇదే వెనుక చెప్పిన అ-సర్వాత్మ భావము (అధ్యా॥ 14-3). ఇది సమష్టి స్వరూప అజ్ఞానమువల్ల వచ్చినది.

వీటిలో మొదటి తప్పును సరిచేసుకోవడానికి - పైన చెప్పిన క్రమానుసారము విమర్శ చేసి, అన్నమయాద్యాత్మల ప్రత్యేకమైన క్రియలకు - వాటి లోపల వున్న ప్రాణమయాది ఆత్మలే ప్రేరకములని గుర్తించాలి. అప్పుడు - తాను బాహ్యమైన ఆత్మ కాదని నిర్ణయము చేయగలుగుతాడు. ఇలా, లోపలకు వెళ్ళగా వెళ్ళగా కేవలము ఆనందమయాత్మ ఒక్కటే మిగులుతుంది. అలా అపవాద క్రమములో ముందుకు వెళ్ళగా, కారణాంతరములవల్ల, చివరలో నిర్ణయింపబడిన ఆనందమయాత్మ కూడా తాను కానని నిర్ధారణ జరుగుతున్నది. ఈ విధముగా వ్యష్టిలో అవిద్యా కల్పిత ఆత్మలను నశింపజేసుకోగలడు. తరువాత, వానికి స్వయముగా సాక్షిగా ఉంటాడు.

ఈ సాక్షి ఎవరు? ఎప్పుడైతే, సమష్టిరూపాజ్ఞానమువల్ల ఉత్పన్నమయిన రెండవ తప్పును దిద్దుకుంటాడో అప్పుడు దీనికి సమాధానము దొరుకుతుంది. ఈ సాక్షి, శరీరభేదముచే భిన్నమయిన సాంఖ్యుల ప్రత్యగాత్మ కాదు. ఇది అంతటా వ్యాపించిన బ్రహ్మ. దీని నిర్ణయము చేసే విమర్శ వ్యష్టి నుంచి సమష్టి వైపు వెళు తున్నది. ఈ వెళ్ళడములో మొదటి అడుగులో ఇలా నిర్ణయించుకోవాలి - నా శరీరముగా కనపడే అన్నమయాత్మ మాత్రమే నేను కాదు. ఎందుకంటే, ఈ శరీరములో కనపడే అన్ని తత్త్వములు, ఇతర అన్ని ప్రాణుల శరీరములలోను కనపడుతున్నాయి. ఈ తత్త్వములు బాహ్యజగత్తులో ఉన్న తత్త్వములకన్న వేఱుకాదు. వేఱువేఱు పాత్రలలో పోసినప్పటికీ, అన్నిటిలో వున్న నీరు ఒక్కటే. ఇందువల్ల అన్ని ప్రాణులలోను, మానవులలోను శరీరము ఏ సమష్టి అన్నముతో నిలబడిఉన్నదో, ఆ సమష్టి అన్నమయాత్మ నీవు - కేవలము వ్యష్టి అన్నమయాత్మ కాదు. ఈ భావము ఏ వ్యక్తిలో దృఢమవుతున్నదో, అతడు సమష్టి అన్నమయాత్మలోనికి ఉపసంక్రమణము చేసిన వాడవుతాడు-అనగా పొందుతాడు, ఎవరైతే ఇలాగ సమష్టి వ్యాప్తికి వస్తాడో, అప్పుడు, అతడు వ్యష్టిలో చేసినట్లుగానే మొదటి సమష్టి ఆత్మలను తరువాతి సమష్టి ఆత్మలలోనికి ఉపసంక్రమణము చేయాలి -అనగా పొందాలి - అంటే స్వయముగా తానే అవి అని తెలుసుకోవాలి. అంతములో సమష్టి ఆనందమయాత్మ మిగులుతున్నది. శ్రుతి ఇలా చెప్తున్నది - సమష్టి ఆనందమయాత్మ ఏ ఆనందమును అనుభవిస్తున్నదో అది బ్రహ్మానందములో ఒక 'మాత్ర' (అంశము) మాత్రమే. అందువల్ల సమష్టి ఆనందమయాత్మను కూడా వదలి తన స్వరూపము పరబ్రహ్మయొక్క ఆనందమే-అనే అంతిమ నిశ్చయముతో నిలబడాలి. ఇక్కడితో విమర్శ పూర్తి అవుతున్నది. ఇప్పటివరకు సంక్షేపముగా ఏ వివరము చెప్పామో దానిని ముందు విస్తారముగా చెప్తాము. (చిత్రము - 15-2,క)



(చిత్రము 15-2, క పంచకోశ విమర్శ క్రమము)

15-3 అన్నమయాత్మ (వ్యష్టి)

స్థూలశరీరమే అన్నమయకోశము. దీనిని ఆత్మ అనుకునే జీవుడే అన్నమయాత్మ. ఈ శిరస్సే ఇతని శిరస్సు. వ్యక్తి తూర్పు దిక్కుగా నిలబడినప్పుడు అతని దక్షిణ హస్తము ఇతని దక్షిణ పక్షము. ఎడమ హస్తము ఉత్తర పక్షము. దేహ మధ్యభాగమే ఆత్మ, అని చెప్తున్నారు. ఎద్దు తోక వలె నాభి క్రిందుగా వున్న కాళ్ళు ఇతని పుచ్ఛము. శరీరము వీటిమీదే నిలబడి వున్నది. అందువల్ల ఇదే అన్నమయాత్మ యొక్క ప్రతిష్ఠ. ఇవే అతని అంగములు. - తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః।అయముత్తరః పక్షః । అయమాత్మా । ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా (తై॥2-1-3)

జీవుడు వీడు కాజాలడు. ఎందుకనగా, అన్నమయ కోశమును లేవదీసి, దీనిచేత అన్ని పనులను చేయించే ప్రాణమయాత్మ ఇందులో ఉన్నది. అందువలన అది నీవు. 11వ అధ్యాయములో వర్ణించినట్లు స్థూల శరీరమును నిరాకరణ చేసి, దానిలోఉన్న సూక్ష్మశరీరములో ప్రవేశించే క్రమమే ఇక్కడ అన్నమయాత్మనుండి ప్రాణమయాత్మలో ప్రవేశించడములో ఉన్నది. ఇలా మొట్టమొదటి మెట్టులో అవిద్యాకల్పితాన్నమయాత్మను నిరాకరించడమైనది.

15-4) ప్రాణమయాత్మ (వ్యష్టి)

అన్నమయకోశములో ఉన్న ప్రాణసమూహములే ప్రాణమయకోశము. నేను అదే అనుకునే జీవుడు ప్రాణమయాత్మ. ప్రాణవాయువు ఇతని శిరస్సు. వ్యానవాయువు దక్షిణపక్షము. అపానవాయువు ఉత్తరపక్షము. సమానవాయువు ఆత్మ. పృథ్వి ఇతనికి పుచ్ఛము. ఇతర వాయువుల యొక్క ప్రభావముచేత ఇతడు అటూ – ఇటూ చెదిరిపోకుండా పృథివి ఇతనిని ఆకర్షించి ఉంచుతుంది. అందువల్ల పృథివి ఇతని ప్రతిష్ఠ – తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః। అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా (తై॥ 2-2-3).

జీవుడు ఈ ప్రాణమయాత్మ కాదు. ఎందుకంటే, మనస్సు ప్రాణములకు నియామకము కనుక. మనస్సు అన్యథా ఏకాగ్రమయిన వారికి చివరకు బయటకు రాగానే ఒకసారి బలముగా ఊపిరి తీసుకున్నప్పుడు మనస్సు ప్రాణములకు నియామకము అని తెలుస్తున్నది. అందుచేత ప్రాణమయాత్మయొక్క ఆత్మత్వము మనస్సువల్లనే వచ్చింది. కనుక నీవు అదే! ప్రాణము కాదు. ఈ విధముగా, రెండవ మెట్టులో అవిద్యా కల్పిత ప్రాణమయాత్మను కూడా నిరాకరించడము అయినది.

15-5) మనోమయాత్మ (వ్యష్టి)

మనస్సే మనోమయకోశము. తనను తాను మనస్సుగా అనుకునే జీవుడే మనోమయాత్మ. యజుస్ అతని శిరము. ఋక్ దక్షిణ పక్షము. సామ ఉత్తరపక్షము. బ్రాహ్మణము ఆత్మ. అథర్వణము వాని పుచ్ఛము, ప్రతిష్ఠ – తస్య యజురేవ శిరః। ఋగ్ దక్షిణః పక్షః। సామోత్తరః పక్షః। ఆదేశ ఆక్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా। (తై॥ 2-3-4).

జీవుడు మనోమయుడిగానూ ఉండజాలడు. ఎందుకనగా, కర్మ చేయడానికి తగిన మనస్సంకల్పము బుద్ధి చేసిన నిశ్చయము ద్వారానే ఉత్పన్నమవుతున్నది. ఈ ప్రకారము మనోమయాత్మకి ఆత్మ – బుద్ధి (విజ్ఞానము). అదే నీవు. అప్పుడు, ఈ మూడవమెట్టు అయిన అవిద్యాకల్పిత మనోమయాత్మను నిరాకరించడము జరిగినది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉన్నది, కోశపంచకము అన్ని ప్రాణులలో ఉన్నది. అయితే, ఋగ్యజుస్సామాథర్వములను మనోమయాత్మకు అంగములుగా చెప్పడములో సామంజస్యమేమి? దానికి ఇది సమాధానము:– ప్రాణుల తెలివి నిమ్నతరముగా వుంటుంది. ఇది, ఆకలి-దప్పికలు మొదలైన స్థూలశరీరముయొక్క ఆవశ్యకతల వరకే పరిమితమై వుంటుంది. కాని, మనుష్యులలో ప్రజ్ఞాశక్తి అధిక తరముగా వుంటుంది, అతడు భవిష్యత్తును, లోకాంతరములను గురించి కూడా ఆలోచించగలడు. మానవులలో కూడా ఆత్మానాత్మ వివేకమును గురించి ప్రయత్నము చేసేవాళ్ళు చాలా తక్కువమంది వుంటారు. ప్రయత్నము చేసేవారిలో కూడా, అన్నమయాత్మ లోపలి ఆత్మలకంటే వేఱుగా వున్న తనను తెలుసుకునే యోగ్యతను కలిగినవాళ్ళు ఒకరో యిద్దరో వుంటారు. ఇటువంటి యోగ్యత వేదార్థజ్ఞానముతోనే వస్తుంది. అందువల్ల శ్రుతి మనోమయాత్మ యొక్క అవయవములుగా, ఋగాది వేదములను చెప్పింది.

వేదమంత్రములే వేదము. మంత్ర లక్షణము ఏమిటి? దాని నిశ్చయము చేయబడుతున్నది. నోటితో చేసే ఉచ్చారణ మాత్రమే మంత్రము కాదు. శరీరములో వేఱువేఱు స్థానములలో చేసే ప్రయత్నముతో

పుట్టిన నాదము, ఉదాత్త అనుదాత్త స్వరములు, పదములు, వాక్యములు – ఇవన్నీ ఉచ్చారణవల్ల వచ్చిన శబ్దమాత్రములు. ఉచ్చరించిన మరుక్షణమే అవి నశిస్తున్నాయి. అందువల్ల వాటి ఆవృత్తిని తిరిగి చేయలేము. కాని, మంత్రము ఆవృత్తి చేయగలిగినది. అందువల్ల ఉచ్చరించిన శబ్దము మాత్రమే మంత్రము కాదు. 'ఉచ్చరించిన ముందు క్షణము, మనస్సులోని మంత్రాక్షరముల స్మృతి నశించకపోవడమువల్ల, అవి ఆవృత్తి చేయగలిగినవిగా వున్నాయి. అందువల్ల ఈ అక్షరముల స్మృతి మంత్రము అవుతుందా?" కాదు. అవి కూడా అభ్యాసము లేనందువల్ల నశిస్తున్నాయి. అయితే, ఈ స్మృతికి విషయమైనది నశించదు. అందువల్ల ఈ విషయమే ఆవృత్తి యోగ్యమైనది. దాని భావనతో కూడా ఈ విషయస్మరణ చేస్తూ ఉచ్చారణ చేయడమే మంత్రావృత్తి. 'ఈ భావన ఎలా వుంటుంది?' ఇది శ్రద్ధతో ఉపనిషత్తుతో (సమాహిత చిత్తముతో) గ్రహించిన మంత్ర విషయ విజ్ఞానము. దీనిని ఛాందోగ్య శ్రుతి ఇలా చెప్తున్నది –"యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి।" (ఛాం॥1-1-10)– ఏ కర్మను విద్యతో శ్రద్ధతో ఉపనిషత్తుతో చేస్తామో అది వీర్యవంతముగా అవుతుంది. ఇటువంటి విజ్ఞానముతో కూడిన మంత్రము – మానవుని బుద్ధిగత పరిశ్రమతో వచ్చిన మనోవృత్తిగాని, వాక్కుగాని, కాదు. ఈ మంత్ర విషయము ఆత్మచైతన్యమే. ఇది మానవుని మనస్సుకు వాక్కుకు అతీతము. –"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ।" (తై॥2-4-1). ఈ ప్రకారముగా ఆద్యంతరహిత ఆత్మచైతన్యమే మంత్రమునకు జన్మస్థానము. ఇలాగ జన్మించిన మంత్రము – ఆ ఆత్మ చైతన్యము యొక్క అనుగ్రహముచేత మంత్రద్రష్టల స్మృతిలో కలిగిన మనోవృత్తి రూపోపాధిద్వారా ప్రవేశించి నాద, స్వర, పద, వాక్యముల రూపముతో ప్రకటింపబడుతున్నది. ఇలా ఆత్మ చైతన్యమునుండి పుట్టిన మంత్రము అపౌరుషేయము, నిత్యము. అందువలన, ఆత్మ చైతన్య విజ్ఞానముతో కలసిన మనోవృత్తి యొక్క ఆవృత్తిని మంత్రావృత్తి అంటారు.

15-6) విజ్ఞానమయాత్మ (వ్యష్టి)

మనస్సు ద్వారా తెలుసుకున్న వేదార్థమును విమర్శ చేసిన తరువాత కలిగే నిశ్చయరూపమైన బుద్ధిని విజ్ఞానము అంటారు. ఆ విజ్ఞానము కలదానినే విజ్ఞానమయాత్మ అంటారు. వీనికి శ్రద్ధ శిరస్సు. ఋతమే దక్షిణపక్షము. ఇక్కడ ఋతము అనగా శాస్త్రవిధితో నడిచే నిశ్చితమైన బుద్ధియే. సత్యమే ఉత్తరపక్షము. సత్యమునకు అర్థము – ఎప్పుడూ సత్యము చెప్తూ, శరీరముతో ధర్మముగా నడవడము. యోగమే ఆత్మ. యోగము యొక్క అర్థము, మనస్సును సదా సమాహితముగా ఉంచుట. మహత్తత్త్వమే పుచ్ఛము మరియు ప్రతిష్ఠ. మహత్తత్త్వమునకు అర్థము = సమష్టి రూప హిరణ్యగర్భుని బుద్ధి. తస్య శ్రద్ధైవ శిరః । ఋతం దక్షిణః పక్షః । సత్యముత్తరః పక్షః । యోగ ఆత్మా । మహః పుచ్ఛం ప్రతిష్ఠా । (తై॥ 2--4--4). ఏ కారణముగా మనోమయాత్మకు అంగములుగా వేదములను చెప్పారో, అలాగే విజ్ఞానమయాత్మకు ఋతము మొదలైనవానిని అంగములుగా చెప్పారు. అన్ని కర్మలకు ఆధారము వాటికి సంబంధించిన నిశ్చయాత్మక బుద్ధి మాత్రమే. అయినా, వైదిక కర్మలకు ఆవశ్యకమైన నిశ్చయబుద్ధిని విజ్ఞానము అని చెప్పడము కూడా ఈ కారణము వల్లనే.

ఈ విజ్ఞానమయాత్మను కూడా జీవుడని చెప్పలేము. ఎందుకంటే, ఏ కర్మ చేయడానికైనా నిశ్చయబుద్ధికి ప్రేరకము, ఆ కర్మతో వచ్చే భోగముల మీద ఆసక్తి మాత్రమే. అందువల్ల నీవు భోక్తవు. విజ్ఞానమయాత్మ కాదు. ఇలా ఈ నాల్గవ మెట్టులో అవిద్యాకల్పిత విజ్ఞానమయాత్మను నిరాకరించడమైనది.

15-7) ఆనందమయాత్మ (వ్యష్టి)

భోక్తను ఆనందమయాత్మ అంటారు. బాంధవులను కలుసుకోవడములో ఉన్న ఆనందము ప్రియము. అది వీని శిరస్సు. మోదము దక్షిణ పక్షము. మోదమునకు అర్థము ప్రియమైన వస్తువు లభించడములోని హర్షము. ప్రమోదము ఉత్తరపక్షము. అత్యధిక హర్షము ప్రమోదము. సుఖ సామాన్యమైన ఆనందమే ఆత్మ. దీని పుచ్ఛము బ్రహ్మమే. అదే ప్రతిష్ఠ కూడా – తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। (తై॥ 2-5-4).

ఈ ఆనందమయాత్మ జీవుని నిజస్వరూపము కాదు. అనగా బ్రహ్మ కాదు. కారణము – ఆనందమయాత్మానుభవములో సత్యత్వము అనే బ్రహ్మ ధర్మమునకు విరుద్ధముగా తారతమ్యము వున్నది. ఉదా:– ఒకనికి మంచి యింటిలో ఉండడము ప్రియము. ఆ ఇల్లు తనదే అవడము మోదము. అది ప్రియము కంటె ఎక్కువ. అందువల్ల ఆనందమయాత్మ కార్యాత్మయే. విషయానందము కంటె పరమైన పరమానందము గల సుషుప్తిలో అది ఉండదు. ఈ విధముగా ఐదవమెట్టు మీద అవిద్యాకల్పిత ఆనందమయాత్మను నిరాకరించడము అయినది.

ఇంకొక విషయము :– శ్రుతి సుషుప్తాత్మను 'ఆనందమయుడు, ఆనందభుక్' అని వర్ణించినది (మాం॥7). దాని అర్థము, సుషుప్తాత్మ ఆనందమయాత్మ అని కాదు. ఆ ఆనందమయుడు శారీరాత్మ లాగా కాదు. వాడు అందరిలో ఒకడే. (అధ్యా॥ 13-15). వానికి అవయవములు లేవు. వాడు ఆనందమయాత్మ లాగా ప్రసిద్ధుడు కాదు. వానిలో భోక్తృత్వము లేదు. ఇంక కోశము ఎక్కడ వుంటుంది? సుషుప్తాత్మయొక్క ఆనందమయత్వము భాష్యకారులను అనుసరించి ఆనందప్రాచుర్యము అనే అర్థములోనే వుంటుంది. (అధ్యా॥ 13-13) ఆనందమయాత్మ, విజ్ఞానమయాత్మయొక్క ఆశ్రయము తీసుకుని స్వప్నములో దొరుకుతున్నది. –"ఆనన్దమయో విజ్ఞానమయాశ్రితః స్వప్నే ఉపలభ్యతే" (తై॥ భా॥ 2-5-3). సుషుప్తిలో ఎంతమాత్రము లేదు.

అప్పుడు, ఆనందమయాత్మ కూడా కాకపోతే తాను ఎవరు? అన్నమయాది పంచకోశములను, వాని హెచ్చుతగ్గులను, చూసే సాక్షి.

15-8) సమష్ట్యాత్మల ఉపసంక్రమణము

ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్ళడానికి ముందు అధ్యా॥ 15-2ను ఇంకొకసారి చదవండి. వ్యష్టిలో పంచకోశములను దాటిన తరువాత మీరే వున్నారు. తనను తాను 'లేన'ని అనుకోరు కదా? ఇక, ఈ నిశ్చయము చేయడము మిగిలి వున్నది – అయితే, ఇప్పుడు నేను ఎవరు? పంచకోశములకు నేను సాక్షిని అని నిశ్చయమైనది. దీని తరువాత కూడా నిశ్చయము చేయడానికి ఇంకేమైనా ఉన్నదా? ఉన్నది. కేవలము ఇంతే తెలుసుకుంటే ధ్యేయము పూర్తి కాదు. ఇక్కడే ఆగిపోతే శ్రుతి దీని ముందుకు చెప్పిన సమష్ట్యాత్మల ఉపసంక్రమణమునకు ఆబ్రహ్మ మనుష్యపర్యంతమైన ఆనందమీమాంసకూ ప్రయోజనము లేకపోతుంది. అందువల్ల ఈ సాక్షి యొక్క ఉద్దేశ్యము, అంతటికి ఉపాదానముగా ఉండే బ్రహ్మలో ఐక్యము కానంతవరకు పూర్తి కాదు. అనగా సర్వాత్మబుద్ధి ప్రాప్తిని పొందేటంతవఱకు పూర్తి కాదు.

ఈ ఉద్దేశ్యమును పూర్తి చేయడానికి తిరిగి అన్నమయకోశముతో ప్రారంభించి, వ్యష్టి అన్నమయము నుంచి సమష్టి అన్నమయము వరకు వెళ్ళాలి. ఇప్పుడే (అధ్యా॥ 15-3లో) స్వయముగా తాను వ్యష్టి

అన్నమయాత్మ ఎందుకు కాదో చెప్పాము. దీనిని తన స్వరూపము అనుకున్నప్పటికీ అంత మాత్రమే 'నీవు' అనుకోవడానికి ఆధారము లేదు. ఇది ఎలా అవుతుంది? దీనికి సమాధానము తెలుస్తే, వ్యష్టినుంచి సమష్టికి వెళ్ళగలము. ఈ శరీరము - ఏ ప్రాణి శరీరమైనా - పాంచభౌతికమైనదే. అందువల్ల, అన్ని వైపులా ఉన్న పంచ భూతములనుంచి విడదీసి, కేవలము ఒక్క శరీరమును ఆత్మస్వరూపమని అనుకోవడానికి ఏ కారణమూ లేదు. దీనికి ఉదాహరణగా, అనేక పాత్రలలో గల ఏకరూపమైన నీటిని చెప్పాము. ఇలాగ, ఈ శరీరము మాత్రమే నీవు కాదు. పంచభూతాత్మక సమష్టి అన్నమయాత్మవే నీవు. ఇలా తెలుసుకోవడమే సమష్టి అన్నమయాత్మయొక్క ఉప సంక్రమణములో మొదటిమెట్టు.

ఇది తెలుసుకున్న తరువాత - సర్వాత్మభావ స్వరూపజ్ఞానము వరకు వెళ్ళే మార్గమును వ్యష్టిలో ఉన్న విధముగానే తెలుసుకోవాలి. ఈ సమష్టి అన్నమయాత్మ యొక్క ఆత్మ సమష్టి ప్రాణము; దాని ఆత్మ సమష్టి మనస్సు; దాని ఆత్మ మహత్తత్త్వము అనే సమష్టి బుద్ధి; దాని ఆత్మ సమష్టి భోక్త - అనగా హిరణ్యగర్భుడు; ఈ విధముగా ముందు ముందుకు వెళ్తూ, వెనుకగా వున్న ఆత్మలను నిరాకరణ చేస్తూ పోవాలి. ఆఖరున మిగిలిన సమష్టి ఆనందమయాత్మ కూడా నీవు కాదు. ఎందుకంటే హిరణ్యగర్భుని అనుభవములో వచ్చే ఆనందము, బ్రహ్మానందములో ఒక మాత్ర(అంశ)మే. అందువల్ల, ఈ సమష్ట్యానందమయాత్మయొక్క ఉపసంక్రమణ తరువాత - "నేనే దీని పుచ్ఛము ప్రతిష్ఠ అయిన పరబ్రహ్మ" అని నిశ్చయాత్మక బుద్ధిని కలిగి వుండాలి. ఈ విధమైన నిశ్చయబుద్ధి కలవాడే 'పూర్ణజ్ఞాని'.

15-9) ఆనందము - ఆనంది

హిరణ్యగర్భుని వరకు అందరు ప్రాణులు 'ఆనంది' - అనగా ఆనందమును అనుభవించేవారే. ఈ ఆనంద అనుభవమును అన్య ఉపాధి ద్వారా పొందుతున్నారు. కాని, సర్వాత్మభావులకు తాము తప్ప అన్యము ఏమీ లేదు. అందువల్ల అక్కడి ఆనందము స్వాభావికము. ఇటువంటి జ్ఞానుల ఆనందము, అనుభవించే ఆనందము కాదు. దానిలో ఆనంది - ఆనందము అనే విభాగము లేదు. అది ఆనంద స్వరూపమే!

పరబ్రహ్మ యొక్క ఈ పరమానందము సదా హృదయ గుహలోనే ఉంటుంది. కాని, తమోగుణమువల్ల కనిపించదు. ప్రియవస్తువు దగ్గర ఉండడమువల్ల ఏ మనోవృత్తి కలుగుతుందో - అది ఈ తమోరూప ఆవరణను తొలగించి వేస్తున్నది. అప్పుడు అక్కడవున్న ఆనందము కనపడుతున్నది. కాని, ఈ మనోవృత్తి స్థిరము కాదు. అందువల్ల ఆ సుఖము క్షణికము. ఈ ఆనందమును విస్తృతము చేసుకునే క్రమమును తెలుసుకోవాలి.

దుఃఖకారణము పాపము. పాపకారణము కామము. అందువల్ల కామము తగ్గుతున్న కొలదీ, ఆనందము వృద్ధి పొందుతూ ఉంటుంది. అత్యంత కామిని 'కామహతుడు' అంటారు. అనగా, కామముతో దుఃఖమును పొంది తనను తానే హత్య చేసుకున్నవాడు. అందువల్ల, ఆనందము వృద్ధి పొందాలంటే, ఎక్కువగా 'అకామహతుడు' కావాలి. ఎంత బుద్ధిమంతుడైనా, పాప-పుణ్యముల లక్షణములను నిశ్చయము చేయలేడు. వీటిని కేవలము శ్రుతి ద్వారానే తెలుసుకోవాలి. అందువల్ల, పాపమును వదలిపెట్టాలి అనే నిశ్చయము కలవాడు శ్రోత్రియుడిగానే ఉండాలి. ఇలా శ్రోత్రియుడు, మంచివాడు, యువకుడు, దృఢమైన నిశ్చయము కలవాడు, యుధిష్ఠరునితో సమానమైన సార్వభౌముడు అయినవాని ఆనందము - మానవుని ఆనందమునకు

ఒక కొలత. ఐతే, అది అతని అకామహతత్వముతో పెరుగుతూ మానవుని ఆనందముకంటె నూరురెట్లు వుంటుంది. మానవానందమునకుపైన గంధర్వానందము, దాని పైన దేవతల ఆనందము, దానిపైన ఇంద్రుని ఆనందము, దానిపైన బృహస్పతి ఆనందము, ఆ పైన ప్రజాపతి, ఆ పైన హిరణ్యగర్భుడు. ఈ ప్రకారము పైన చెప్పిన అంతరములలో ఆనందము వృద్ధి అవుతూ వుంటుంది. ఈ కారణముగా, ఆకామహతత్వము అధికముగా అవుతూండడంవల్ల – అనగా కామము తక్కువ అవడము వల్ల, శీతోష్ణము మొదలైన ద్వంద్వములు తక్కువ అవడము వల్ల, ఆనందము వృద్ధి అవుతూ వుంటుంది. హిరణ్యగర్భుడు పొందే ఆనందమునకు నిమిత్తము వాని ధర్మ – జ్ఞాన – అకామహతత్వములలో హద్దులు లేకపోవడమే. సర్వవ్యాపి కేవలము చిన్మాత్రమైన బ్రహ్మమును స్వయముగా తెలుసుకునే వానికి ద్వంద్వములు నామమాత్రముగా కూడా ఉండవు. అతనికి ధర్మము జ్ఞానము అకామహతత్వము పరిపూర్ణముగా వుంటాయి. అతనికి, ఎక్కడా–ఎవరివల్లా భయము లేదు. అతడు ఆనందభోక్త కాదు – ఆనంద స్వరూపుడు.

15–10) సమష్ట్యాత్మల ఉపాసన

ఈ పరమానందమును పొందాలనుకునే ఇచ్ఛ కలవాడు సమష్ట్యాత్మల ఉపసంక్రమణ చేస్తాడు. కాని, సమష్ట్యాత్మల ఉపాసనను చేసేవారు వాటికి సంబంధించిన సిద్ధులను పొందుతున్నారు. శాస్త్రము చెప్పిన ప్రకారముగా, ఏదో విషయములో, తైలధారవలె అవిచ్ఛిన్న (వ్యవధానములేని) చిత్తవృత్తి ప్రవాహమును, ఉ పాసన అంటారు. దానివల్ల సిద్ధులు ప్రాప్తిస్తాయి. (ఛాందోగ్య అవతరణిక). ఉదా:– "నేను సమష్టి అన్నమయాత్మను, నేను అన్నము నుంచే పుట్టాను, అన్నరూపముగానే ఉన్నాను, అన్నములోనే లీనమవుతాను" – ఈ విధముగా సమష్టి అన్నమయాత్మను ఉపాసన చేయవచ్చు. (తై॥భా॥ 2–2–1) అతడు స్వయముగా ఆత్మయే అయినందువల్ల ఈ ఉపాసకుడు అతిథికంటె ముందుగా భోజనము చేయాలి. (సూ॥భా॥ 3–3–41). అన్నము చాలా గొప్పది. అది బ్రహ్మమే. దానిని నిందించరాదు. దానిని పారవేయరాదు. అడిగిన వారికి తప్పక యివ్వాలి. అందువల్ల, అన్నమును ఎక్కువగా సంపాదించాలి. ఎంత అధికశ్రద్ధతో దానిని దానము చేస్తారో, అంత అధికముగా దాని ఫలమును పొందుతారు. ఈ ప్రకారము వ్రతము చేసేవారు దానిని సమృద్ధిగా పొందుతారు. అన్న ఉపాసకులు భోజనము చేయగానే, ఇతరులు కూడా తృప్తిపొందుతారు.

ఇదే ప్రకారము సమష్టి ప్రాణోపాసన కూడా. ప్రాణమే భూతములకు ఆయువు కనక, దానిని 'సర్వాయుషం' అన్నారు. ఎవరైతే తనను, అన్ని ప్రాణులకు ఆత్మయైన ప్రాణముగా భావించి ఉపాసన చేస్తారో, వారు పూర్ణాయువు కలవారవుతారు. వారు అపమృత్యువును పొందరు. ఈ ఉపాసనలలో అప్రమత్తతతో ఉండాలి. అంటే ఏదో ఒక సమష్ట్యాత్మను ఉపాసించేవారు తక్కువ ఆత్మలలో అధ్యాస చేయకూడదు. అంతేగాక ఉపాస్య ఆత్మ స్వరూపమును పూర్తిగా అవగాహన చేసుకోవాలి.

జీవ ప్రకరణ యొక్క తాత్పర్యము

ఉపాధుల ద్వారా వివిధ రూపములతో కనిపిస్తున్న జీవుల నిజస్వరూపమును ఆ రూపములతో వేరు చేసి తెలుసుకోవడము ఈ ప్రకరణము యొక్క తాత్పర్యము. ఈ రూపములు శరీరత్రయము – అవస్థాత్రయము – కోశపంచకము, ఈ మూడింటిలోనే కలసి వుంటాయి. శరీరాది సమస్త జగత్తు మాయాకార్యము. వీటిని, జీవుడు స్వయముగా తానే అనుకుని తప్పుగా గ్రహిస్తాడు. ఇది అతని అధ్యాస. అతడు స్వయముగా తాను బ్రహ్మము అని తెలుసుకోకపోవడమే దీనికి కారణము. ఇది అతని అవిద్య, ఈ విధముగా ఈ సంసారము

అవిద్యా సంయుక్తమాయ. అనగా, విషతుల్యమైన అవిద్య జీవునిది – అన్నతుల్యమైన మాయ భగవంతునిది. (గీ॥ 7–4 వ్యాఖ్య) స్థూల సూక్ష్మ శరీరములు, అవస్థాత్రయములు, కోశ పంచకములు, మాయద్వారా జీవునికి వచ్చినవి. ఇవి బ్రహ్మకంటె అన్యము కావని జీవుడు తెలుసుకోలేదు గనుక, వీటిని అవిద్యా కల్పితములు అని శాస్త్రము అన్నది. ఈ అధ్యాసలను విడిచిపెట్టడము జీవుని మోక్షప్రాప్తికి మొదటి మెట్టు. తాను శరీరాది స్వరూపముల వాడు కానని, వాటికి కేవలము సాక్షినని, అప్పుడు గ్రహిస్తాడు. ఇక్కడితో ఆగిపోకూడదు. ఇంకా ముందుకు వెళ్ళి, నేనే బ్రహ్మను అని గ్రహించాలి. ఇందుకు వ్యష్టిశరీరమును అపవాదము చేసి సాక్షిత్వములో స్థిరపడిన వానిని శ్రుతి, నెమ్మది నెమ్మదిగా సమష్టి శరీరము వరకు తీసుకువెళ్తున్నది. ఇది మొదటి మెట్టు. సమష్టి శరీరము బ్రహ్మకార్యము అవడమువల్ల ఇది అవిద్యా కల్పితము కాదు. ఇప్పుడు తాను బ్రహ్మతో అభిన్నుడనని జీవుడు తెలుసుకుంటాడు. అందువల్ల, 'అంతా నేనే' అని అనుకోవడము అసమ్యగ్ జ్ఞానము కాదు. ఇది సర్వాత్మభావమే. సమష్టి శరీర నామక కార్యము బ్రహ్మతో అభిన్నమయినప్పటికీ, బ్రహ్మము కార్యముకంటె వేరైనది. అందువల్ల ఈ కార్యజగత్తును ప్రవిలయము చేయడము రెండవ సోపానము. తురీయమనే ఈ సోపానములో స్వరూప జ్ఞానము ప్రాప్తిస్తున్నది. సర్వాత్మ భావము – స్వరూప జ్ఞానము, ఒక దానితో ఇంకొకదానికి విరోధమని భావించరాదు. ఒకే ఆత్మ తత్త్వమును, కార్యరూపములో చూడడము సర్వాత్మభావము– కారణ రూపములో చూడడము స్వరూప జ్ఞానము. ఇలా 'శరీరము వలె నేను మార్పుచెందను, నేను సద్రూపుడను' అని శరీరత్రయ శోధన వలనను 'జ్ఞేయమును అనుసరించి మార్పు చెందే జ్ఞాత నేను కాను కనుక నేను చిద్రూపుడను' అని అవస్థాత్రయ శోధన వలనను, 'భోగ్య వస్తువును అనుసరించి మార్పు చెందే భోక్త నేను కాదు. కనుక ఆనందరూపుడను నేను" అని పంచకోశ శోధనవలనను, జీవునికి నిశ్చయము అవుతున్నది. ఈ నిశ్చయ జ్ఞానమే స్వరూప జ్ఞానము.

ప్రశ్నలు :–

1. పంచకోశములను దేనితో పోల్చి చెప్పారు?
2. ఆరంభమునుండి అంతమువరకు వ్యక్తియొక్క భోగ వ్యవహారమున క్రమము ఏమిటి?
3. జీవుల అధ్యాసలో ఉండే వైవిధ్యత ఏమి?
4. పంచకోశముల పేర్లు ఏమిటి?
5. ఏఏ కోశములతో జీవుడు తాదాత్మ్యతను పొందుతున్నాడో, అప్పుడు ఆ జీవునికి ఏఏ పేర్లు వస్తున్నాయి?
6. జీవుడు చేసే పొరపాట్లు ఏవి?
7. అవిద్యాకల్పిత ఆత్మతో ఎలా విడిపోవాలి?
8. సాక్షి ఎవరు? అనే ప్రశ్నకు సమాధానము ఎప్పుడు దొరుకుతున్నది?
9. తాను అన్నమయాత్మ కాననే నిశ్చయము ఎలా చేయాలి?
10. సమష్టి అన్నమయాత్మను ఉపసంక్రమణము చేసేది ఎవరు?
11. పంచకోశముల పరిసమాప్తి ఎప్పుడు అవుతున్నది?

12. అన్నమయాత్మ అంగములు ఏవి?
13. అన్నమయాత్మ కార్యములు ఎవరు చేయిస్తున్నారు?
14. ప్రాణమయాత్మ ఆత్మత్వము ఎవరితో వచ్చినది?
15. మనోమయాత్మ ఆత్మత్వము ఎవరిది?
16. మనోమయాత్మ అవయవములు వేదాలని శ్రుతి ఎందుకు చెప్పినది?
17. విజ్ఞానమని దేనిని అంటారు?
18. విజ్ఞానమయాత్మ అంగములు ఏవి?
19. శ్రద్ధాదులను దానికి అంగములని ఎందుకు చెప్పారు?
20. విజ్ఞానమయాత్మగానే జీవుడు వుండడము ఎందుకు సంభవము కాదు?
21. ఆనందమయాత్మ జీవుని నిజస్వరూపము ఎందుకు కాదు?
22. అన్నమయాత్మ ఉపసంక్రమణము ఎలా చేయబడుతున్నది?
23. పంచకోశముల సాక్షిత్వము జీవుని నిజస్వరూపము ఎందుకు కాదు?
24. సమష్ట్యాత్మల ఉపసంక్రమణమునకు అర్థము ఏమిటి?
25. జ్ఞాని ఆనందస్వరూపుడని ఎలా చెప్తున్నారు?
26. పరమానందము ఎక్కడ ఉన్నది?
27. అది దేనితో ఆవరింపబడి ఉన్నది?
28. విషయసుఖము ఎలా ప్రాప్తిస్తున్నది? అది ఎందుకు క్షణికము?
29. దుఃఖమునకు కారణము ఏమిటి?
30. అకామహతుడు ఎవరు?
31. ఆనందము వృద్ధి అవాలంటే ఏమి చేయాలి?
32. మనుష్యానందమునకు కొలత ఏమిటి?
33. ఆనంద వృద్ధిలో ఒకదానికంటె ఇంకొకటి ఎక్కువయ్యే స్థితులు ఏవి?
34. ఏ విధమైన వ్యక్తికి ద్వంద్వములు నామమాత్రము కూడా వుండవు?
35. సమష్ట్యాత్మల ఉపాసన అనగా ఏమి?
36. అన్నోపాసన ఎలా చేయాలి?
37. ఉపాసనలలో ఎటువంటి జాగ్రత్త వుండాలి?
38. జీవ ప్రకరణము యొక్క సారాంశమును సంక్షేపముగా వ్రాయండి.

సాధనా ప్రకరణము

వేదాంతములో ఒక విచిత్ర లక్షణము ఉన్నది. అది చాలా కష్టకరమయినది, చాలా సులభము కూడా. చాలామంది బుద్ధిమంతులు, అందులో కూడా ఆధునిక విద్యలలో ఘనులు, వేదాంతమును చాలా చక్కగా గ్రహించగలిగారు. సూక్ష్మమైన ప్రశ్నలు అడగగలిగారు. అయినప్పటికీ, వారికి వేదాంతములో వాచ్యార్థము మాత్రమే తెలిసినది. ఇంకా, కొంతమంది అంత బుద్ధిమంతులు కారు. వాదనాపటిమ కూడా వారికి లేదు. అయినా, వారు వేదాంతములోని లక్ష్యార్థమును గ్రహించారు. దీనివల్ల, వేదాంతములో లక్ష్యార్థము వేఱు, వాచ్యార్థము వేఱు అని తెలుస్తున్నది. అనగా, వేదాంత రసానుభవమునకు కావలసిన అధికారము వాదసామర్థ్యముతో రాదు. చిత్తశుద్ధితోనే వేదాంత శ్రవణమునకు ఆవశ్యకమైన సాధన చతుష్టయ సంపత్తితో ఇది తప్పక వస్తుంది. కాని, ఏ సాధనతో ఇది వస్తుందో, అటువంటి కర్మ స్వరూపమును తెలుసుకోవడము ఇంక మిగిలిన విషయము. ఈ సందర్భములో వచ్చిన ప్రశ్న 'జ్ఞానము అభేదబుద్ధి మీద అధారపడి వున్నది – కర్మలను భేద బుద్ధితో చేయవలసి వస్తుంది. అటువంటి కర్మ ఏ విధముగా జ్ఞానప్రాప్తికి సాధనము కాగలదు?' ఇది సమ్యక్ ప్రశ్న: ఒక దృష్టాంతముతో దీనికి సమాధానము దొరుకుతుంది. విషపూరితమైన ముల్లు గ్రుచ్చుకుంటే, ఆ దుఃఖము పోవడానికి ఆ ముల్లును ఇంకొక ముల్లుతోనే తీయాలి – అదే మార్గము. అయితే, ఏ ముల్లుతో తీయాలనుకుంటున్నామో అది విషరహితముగా వుండాలి. దుఃఖకారణము ఇప్పటివరకు చేస్తున్న కామ్యకర్మలు, శాస్త్రనిషిద్ధకర్మలు. అవే విషపూరితమైన ముళ్ళవంటివి. శాస్త్ర విహిత నిష్కామ కర్మలు విషరహితమైన ముల్లువంటివి. నిష్కామ కర్మతో చిత్తము విషరహితమై సమాధాన స్థితిని పొందుతుంది. దాని తరువాత వైరాగ్య బుద్ధి కలిగి, ముముక్షువును సంన్యాసమువైపుగా తీసుకువెళ్తున్నది. ఈ పరిస్థితిలో ఉపాసన ద్వారా ప్రాప్తించిన సమాహిత చిత్తము జ్ఞాననిష్ఠకు ఆధారమవుతున్నది. ఈ ప్రకారము నిష్కామకర్మ మోక్షమునకు పరంపరగా అనివార్య సాధనము. దాని స్వరూపము తెలుసుకోవడమే ఈ ప్రకరణము యొక్క ఉద్దేశ్యము.

అధ్యాయము - 16

మోక్షము

శాస్త్రమును అనుసరించి మోక్ష స్వరూపము, మోక్షప్రాప్తికి మార్గము, మిగిలిన ప్రాసంగిక విషయముల యొక్క విమర్శ ఈ అధ్యాయములో చేయబడినది.

16-1) మోక్షము అంటే ఏమిటి?

1) మోక్షము అంటే సంపూర్ణ దుఃఖరాహిత్యమే, అని అందరూ ఆమోదించిన వ్యాఖ్య. అయినప్పటికీ, దీని స్వరూపమును నిశ్చయించడములో విభిన్న అభిప్రాయాలు ప్రచారములో ఉన్నాయి. నాస్తికులు మృత్యువునే మోక్షము అంటున్నారు. వారి మతములో పునర్జన్మ లేదు. బౌద్ధులు పునర్జన్మను అంగీకరిస్తున్నారు కాని, వారి అంతిమ సిద్ధాంతము ప్రకారము శూన్యమే వారికి మోక్షము. ఆ రెండు మతములూ దోషయుక్తములే. ఎందుకంటే, మోక్షము ఎవ్వరికి వస్తుంది? అనే నిశ్చయము వారు చేయలేకపోయారు. లౌకికులు అయితే సుఖమయ జీవనమే మోక్షము అని అనుకుంటూ వుంటారు. కొందఱు ఆస్తికులు వైకుంఠమును మోక్షము అనుకుంటారు. కాని, వైకుంఠములోని జయ-విజయులు కూడా శాపగ్రస్తులై ఈ లోకమునకు వచ్చారు. అందువల్ల అక్కడి సుఖము కూడా అనిశ్చితమైనదే. యయాతి, నహుషుడు మొదలైనవారి ఉదాహరణతో స్వర్గసుఖము కూడా నిత్యము కాదని తెలుస్తున్నది. అది కూడా మోక్షము కాదు. భగవంతుని సాన్నిధ్యము కూడా మోక్షము కాదు-ఎందుకనగా, అర్జునుడు దానిని పొందే వున్నాడు. అయితే, అతడు యుద్ధభూమిలో అపార దుఃఖమును పొందాడు.

2) వీనిలో ఏదీ శ్రుతి సమ్మతము కాదు. నిత్యనిర్దోష నిరతిశయానందమే, మోక్షమునకు అర్థము. శ్రుతి ప్రకారము, తన స్వరూపమును గుర్తించడమే మోక్షము. జీవుని స్వరూపము అనగా జీవుని నిరుపాధిక రూపము విషయమునే చెప్తున్నారని మరువకూడదు. ఈ నిరుపాధికరూపము సుషుప్తిలో ఉంటుంది. అయితే, ఈ ఆనందము లేవగానే పోతున్నది కనుక అనిత్యము కదా అనే సందేహము సరికాదు. జాగ్రత్తులో, స్వప్నములో ఏ దుఃఖప్రాప్తిని పొందుతున్నాడో, అది అవిద్యాకల్పిత శరీరసంబంధము కలది. ఎవరైతే, తన స్వరూపమును గుర్తిస్తారో, వారికి శరీర సంబంధము వుండదు, వీనినే అ-శరీరి లేక జ్ఞాని అంటారు. ఎవరు అశరీరి అవుతాడో, అతనిని ప్రియాప్రియములు అంటవు - "అశరీరం వావ సన్తం న ప్రియాప్రియే స్పృశతః ।" (ఛాం॥ 1-4-5). అయితే, బ్రహ్మవిదుడు కూడా సామాన్య సంసారివలె కనిపిస్తూ వుంటే, ఇక అశరీరత్వమునకు అర్థము ఏమిటి? దీని అర్థము ఇది - సశరీరి యొక్క ధనము దొంగిలింపబడితే అతనికి దుఃఖము కలుగుతుంది - కాని, అశరీరికి అటువంటి సమయంలో దుఃఖము కలుగదు. కుండలములు ధరిస్తే సశరీరికి గర్వము వస్తుంది - అశరీరికి అటువంటి గర్వము రాదు. ఇలా, ముక్తుడు - సంసారివలె కనిపించినా, సంసారి కాదు (సూ॥భా॥ 1-1-4).

3) మోక్షమునకు ఇంకొక పేరు 'భూమ'. తనకంటె అన్యముగా ఏదైనా ఉన్నదని అనుకున్నప్పుడే జీవునికి దుఃఖ భయముల అనుభవము కలుగుతుంది. ఎక్కడ, అన్యమును చూస్తున్నారో, అన్యమును వింటున్నారో, అన్యమును తెలుసుకుంటున్నారో, అది అల్పము- "యత్ర అన్యత్పశ్యతి, అన్యచ్ఛృణోతి, అన్యద్విజానాతి తదల్పమ్ ।" (ఛాం॥ 7-24-1). ఎక్కడ అన్యమును చూడడో, అన్యమును వినడో, అన్యమును

తెలుసుకోడో, అది 'భూమ' – "యత్ర నాన్యత్పశ్యతి, నాన్యచ్ఛృణోతి, నాన్యద్విజానాతి స భూమా । యో వై భూమా తదమృతం యదల్పం తన్మర్త్యమ్" (ఛాం॥ 7-24-1) – ఏది భూమమో అది అమృతము ఏది అల్పమో అది మర్త్యము. "ద్వితీయాద్వై భయం భవతి ।" – రెండవదాని వల్లనే భయము కలుగుతుంది. "యన్మదన్యన్నాస్తి కస్మిన్ను బిభేమి?" – నాకంటె అన్యము ఏమీ లేనప్పుడు నేను ఎందుకు భయభీతుడును కావాలి? (బృ॥ 1-4-3). "నేహ నానాస్తి కించన" – ఇక్కడ నానాత్వము ఏమీ లేదు. "య ఇహ నానేవ పశ్యతి మృత్యోః స మృత్యుమాప్నోతి॥"– ఎవరు, ఇక్కడ నానాత్వము (భేదము) ఉండినట్టు చూస్తున్నాడో, అతడు మృత్యువు నుండి మృత్యువును పొందుతున్నాడు. (బృ॥ 4-4-19). ఈ ప్రకారము ద్వైతభావ రాహిత్యమే అమృతము – అభయము అని శ్రుతి ప్రతిపాదిస్తున్నది.

16-2) జ్ఞానమువల్లనే మోక్షము

1) ఈ అశరీర మోక్షము – ప్రకృతి వలె పరిణామి నిత్యము కాదు. అనగా, ప్రకృతి నిత్యమైనప్పటికీ (అధ్యా॥ 8-9), సృష్టికాలములో అవస్థల ద్వారా (జగదాకారముగా) పరిణామమును పొందుతూ, ప్రళయములో అవ్యక్తముగా వుంటున్నది. కాని, మోక్షము అలా కాదు. అది కూటస్థ నిత్యము. అంటే, ఏ పరివర్తనము లేకుండా, ఒకే విధముగా వుంటుంది. ఇది తెలియని వారు దుఃఖములో మునిగిపోతారు. మోక్షము వచ్చేదీ కాదు –పోయేది కాదు. అందువల్ల, తనను అశరీరి అని గుర్తించడమే మోక్షము. దీనిని, శ్రుతి, వందల వాక్యములతో చెప్తున్నది.

2) "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" – బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడు (ముం॥ 3-2-9). "క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ।" – పరావరుని సాక్షాత్కారముతో ఇతని కర్మలు క్షీణిస్తాయి. (ముం॥ 2-2-9). పర = కారణరూపముతో ఎక్కువ, అవర = కార్యరూపముతో తక్కువ, "ఆనన్దం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన ।" – బ్రహ్మానందమును తెలుసుకున్నవాడు, దేనికీ భయపడడు. (తై॥ 2-9-1). "తదాత్మానమేవావేత్ అహం బ్రహ్మాస్మీతి తస్మాత్తత్సర్వమభవత్ ।" – తనను తాను బ్రహ్మ అని తెలుసుకున్నవాడు, అంతా తానే అయినాడు. (బృ॥ 4-2-4). "తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః॥" – ఏకత్వమును తెలుసుకున్న వానికి మోహము ఎక్కడ? శోకము ఎక్కడ? (ఈశా॥ 7). ఋషి వామదేవుడు తానే మనువునని, సూర్యుడనని తెలుసుకున్నాడు. ఇప్పుడు కూడా ఎవరైతే తాను బ్రహ్మనని తెలుసుకుంటాడో అతడు అన్నీ అవుతాడు – "తదిదమప్యేతర్హి య ఏవం వేద అహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి ।" (బృ॥ 1-4-10). "అస్మాకం అవిద్యాయాః పరం పారం తారయసి॥" – మమ్మల్ని అవిద్యనుండి తరింప చేయుము. (ప్ర॥ 6-8). నారదముని సనత్కుమారునితో యిలా అన్నాడు – "మీ వంటి పూజ్యులు చెప్పగా నేను విన్నాను – ఆత్మను తెలుసుకున్నవాడు శోకసాగరము నుండి తరిస్తాడు. ఓ పూజ్యుడా! నన్ను శోకసాగరము నుండి తరింపచేయి" (ఛాం॥ 7-1-3). అప్పుడు సనత్కుమారుడు నారదుని తమస్సు నుండి తరింపచేశాడు – "తమసః పారం దర్శయతి భగవాన్ సనత్కుమారః" (ఛాం॥ 7-2-6) ఇంతగా చెప్పాక కూడా 'కేవలము ఆత్మ విజ్ఞానముతోనే మోక్షము వస్తుందా?' అని సంశయించకూడదు. ఎవరికి అశ్వమేధములో అధికారము లేదో వారికి కేవలము దాని విజ్ఞానముతోనే దాని ఫలము వస్తుంది – "యేషాం అశ్వమేధే నాధికారః తేషాం అస్మాదేవ విజ్ఞానాత్ తత్ ఫల ప్రాప్తిః ।" (బృ॥ అవతరణిక). అలా అయినప్పుడు, కేవలం ఆత్మ విజ్ఞానముతో మోక్షము ఎందుకు రాదు? కర్మ ఫలమునకూ, మోక్ష ఫలమునకూ శాస్త్రమే ప్రమాణము.

అందువల్ల, మోక్షము కోసము – బ్రహ్మము తన స్వరూపమే అని తెలుసుకోవడము కన్న చేయవలసినది ఏమీ లేదు. 'నిల్చుని పాడుతున్నాడు'– అనే దానిలో, నుంచోవడానికి, పాడడానికి మధ్య అంతరము ఏమీ లేనట్లే – 'తన స్వరూపమును తెలుసుకుని ముక్తుడు అయ్యాడు ' అనే దానిలో కూడా, స్వరూప జ్ఞానమునకు–ముక్తికి మధ్య అంతరము ఏమీ లేదు. (సూ॥భా॥ 1–1–4). ఇటువంటి బ్రహ్మజ్ఞానము శాస్త్ర శ్రవణము – మననము – నిదిధ్యాసములతో వస్తుంది. శ్రవణము అంటే గురువు ద్వారా, శ్రద్ధ–ఏకాగ్రతలతో వేదాంత విషయములను వినుట. కేవలము వినడము వలననే అతిప్రబలమైన మంచి సంస్కారముగలవాడు మోక్షమును పొందుతాడు. కాని, సాధారణ మానవులు శ్రవణము తరువాత మననము చేయాలి. లౌకికముగాను – శ్రుతి సమ్మత తర్కముతోను ఆధారపడిన మాటలను విని, వినిన మాటలను చర్చించి–యథార్థ జ్ఞానమును సంపాదించాలి. మననము చేసే సమయములో, శ్రుతిని ఖండించే యుక్తులనుండి – అనగా దుస్తర్కముల నుండి తప్పుకోవాలి. దేహాత్మబుద్ధుల యొక్క శ్రద్ధ, ప్రత్యక్షానుమానములపై ఆధారపడి వుంటుంది. కాని, రజ్జువు యొక్క మిథ్యా జ్ఞానము యథార్థ జ్ఞానముచేత నశించిన తరువాత తన మిథ్యా జ్ఞానమునకు కారణము కళ్ళది కాక తన తెలివిదని వాడు కూడా తెలుసుకుంటాడు. ఇదే ప్రకారముగా, శ్రుతిలో సందేహము వచ్చినప్పుడు ముముక్షువు శ్రుతిలో దోషము చూపించకుండా, తన తెలివిని సరిచేసుకోవాలి. శ్రుతి సమ్మతమైన తర్కముతో చేసిన మననము వల్ల, జీవునికి–బ్రహ్మకు ఏకత్వమే శ్రుతితాత్పర్యమని తెలుస్తున్నది. ఇలా, నిశ్చయమయిన అర్థమును నిదిధ్యాసన చేయాలి. మననము చేసిన అర్థమును ధ్యానము చేయడము–నిదిధ్యాసనము. బ్రహ్మము తన స్వరూపమే అని అభిన్నత్వజ్ఞానమును దృఢపరచుకోవాలి. 'స్వయముగా నేనేబ్రహ్మ' అని నిశ్చయము వుండాలి. నిధిధ్యాసనమువల్ల, ఇప్పటివరకు దేహేంద్రియముల వైపుగా ప్రసరిస్తున్న ప్రవృత్తి – ఇప్పుడు ఆత్మవైపుగా ప్రసరించడము ప్రారంభిస్తుంది. అందువల్ల, మోక్షప్రాప్తికి శ్రుతి–శ్రవణము, తర్క–మననము, అనుభవము, ఈ మూడూ ఆవశ్యకమైనవి (బృ॥భా॥ 2–4–5).

16–3) మోక్షము కర్మజన్యము కాదు :

1) మోక్ష–కర్మలలో చాలా అంతరము వున్నది. మోక్షము – స్వర్గమువలె కర్మవల్ల ప్రాప్తించదు. దానికోసము ఏ కర్మానుష్ఠానము చేయనక్కర లేదు. సత్కర్మవల్ల జీవునికి ప్రియము (సుఖము), దుష్కర్మవల్ల అప్రియము (దుఃఖము) లభిస్తాయి. సత్కర్మలయినా, దుష్కర్మలయినా, మనసా–వాచా–కాయేన చేయాలి. వాటి ఫలములు కూడా (ప్రియా ప్రియములు) మనోవాక్కాయములచేతనే ప్రాప్తిస్తాయి. కాని, ఆత్మ జ్ఞానమునకు ఈ మూడింటిలో దేనితోనూ సంబంధము లేదు. అందువల్ల, తపస్సుచేతగాని, కర్మచేతగాని సాధ్యము కాదు, దానిని జ్ఞాన ప్రసాదమువల్లనే పొందాలి – "న తపసా కర్మణా వా జ్ఞానప్రసాదేన తం పశ్యతే।" (ముం॥ 3–1–8). ఆత్మ ధర్మాధర్మముల కంటె వేఱైనది; కృతాకృతముల కన్న వేఱైనది – "అన్యత్ర ధర్మాత్ అన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మాత్ కృతాకృతాత్।" (కఠ॥ 1–2–14). పూజ్యులైన వ్యాసులు ఇలా చెప్పారు– ధర్మమును–అధర్మమును విడిచిపెట్టు; సత్యమును–అసత్యమును విడిచిపెట్టు; సత్యాసత్యములను దేనితో విడిచిపెడుతున్నావో దానిని కూడా విడిచిపెట్టు – "త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ, ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి, తత్త్యజ ।" (మోక్షధర్మము – 316–40). జ్ఞానము, శరీరముతోగాని వాక్కుతోగాని చేసిన ఏ క్రియకూ ఫలము కాదు. ఇది మానసిక క్రియకు కూడా ఫలముకాదు. మానసిక క్రియకు ఫలము వేఱు. అల్పమైన మనస్సును అనంత విశ్వే దేవతలు అని తెలుసుకుని ఉపాసన చేసినట్లయితే అనంత ఫలమును పొందుతారు. ఇటువంటి ఫలితమును 'సంపత్తి' అంటారు. మోక్షము ఈ

ప్రకారము సంప్రదాయమైనది కాదు. అది ధ్యానఫలము కూడా కాదు. అది ఆత్మజ్ఞానమునకు మాత్రమే ఫలము. అనగా కర్మ **'పురుష తంత్రము'** జ్ఞానము **'వస్తుతంత్రము'** (సూ॥భా॥ 1-1-4).

కర్మ 'పురుష తంత్రము', అంటే అర్థము - అది పురుషుని ఇచ్ఛానుసారము నడుస్తున్నది. అనగా, కర్మ చేయవచ్చు చేయకపోనూ వచ్చు. ఆ ఫలమును యిచ్చే ఇంకొక పద్ధతితో చేయవచ్చు. కేవలము లౌకిక కర్మలేగాక వైదిక కర్మల విధానము కూడా ఇంతే. కాని, వస్తుజ్ఞానము విషయములో ఇటువంటి వికల్పములకు అవకాశము లేదు. వస్తువును గురించి ఏ జ్ఞానము వుంటుందో అది వస్తువు మీదే ఆధారపడి వుంటున్నది. వస్తుతంత్రము అనగా అర్థము ఇదే. వస్తుతంత్ర-పురుష తంత్రములలోవున్న అంతరమును, మరొక పద్ధతిలో చెప్తాము: కర్మలో, కర్త-కర్మ-కరణము అనే 'త్రిపుటి' వుంటుంది. (విశేష) జ్ఞానములో జ్ఞాత-జ్ఞానము-జ్ఞేయము అనే త్రిపుటి వుంటుంది. కర్మ త్రిపుటిలో, కర్తలో వికల్పము లేకపోయినా, కర్మ-కరణములలో వికల్పము వుంటుంది. అంటే, కర్మచేయవచ్చు చేయకపోనూవచ్చు. ఇదే ఫలప్రాప్తికి ఇంకొక విధముగా కూడా చేయవచ్చు. అదే కరణమును ఉపయోగించవచ్చు; ఉపయోగించక పోవచ్చు; అదే ఫలప్రాప్తికి ఇంకొక కరణము ఉపయోగపడవచ్చు. మానసిక క్రియ అయినందువల్ల ఉపాసన కూడా పురుషతంత్రమే. అయితే, జ్ఞానత్రిపుటి యిలా వుండదు. జ్ఞాత-జ్ఞేయము నిశ్చితముగా వుంటాయి. వాటిలో వికల్పము లేదు. అందువల్ల, అతని జ్ఞానములో కూడా వికల్పము వుండదు. అంటే, జ్ఞేయమును ఇంకొక విధముగా తెలుసుకోలేము. అలా తెలుసుకోగలిగితే అది మిథ్యాజ్ఞానము అవుతుంది. (సూ॥భా॥ 1-1-2). ఉదా:- శ్రుతిలో ఒకచోట పురుషుడిని అగ్నిగా భావించమని చెప్పారు. ఇంకొక చోట స్త్రీని అగ్నిగా భావించమని చెప్పారు. (ఛాం॥ 5-7-1). అందువల్ల మానసిక భావమైన ఈ క్రియలో వికల్పము వున్నది. అందువల్ల, ఇది పురుష తంత్రము; కాని, అగ్నిని అగ్నిగానే భావించడములో వికల్పము లేదు. ఈ జ్ఞానము వస్తు తంత్రము.

3) కర్మఫల-జ్ఞానములలో ఇంకొక అంతరము చూడవచ్చు. కర్మఫలము 4 విధములుగా పొందవచ్చు. **ఉత్పాద్యము**-క్రొత్తగా ఉత్పన్నమయేది; **వికార్యము** - ఏది ఉన్నదో దానిలో ఆవశ్యకమైన మార్పులు చేయడము; **ఆప్యము** - ఎక్కడకో వెళ్ళి పొందవలసినది; **సంస్కార్యము** - దోషమును తీసివేసి గుణమును చేర్చి పొందవలసినది. ఈ నాలుగు విధములుకాక, కర్మ ఫలమును పొందుటకు ఇంకొక పద్ధతి లేదు. కాని, నిత్యమైన మోక్షము ఒకే విధముగా వుంటుంది. అందువల్ల ఉత్పాద్యము కాదు, వికార్యమూ కాదు. బ్రహ్మరూప మోక్షము సర్వగతము కనుక ఆప్యమూ కాదు. అది పరిపూర్ణము కనక, దీనిలో చేర్చవలసినది ఏమీలేదు. దోషరహితము కనక తీసివేయవలసినది ఏమీలేదు; అందువల్ల సంస్కార్యము కూడా కాదు. దీని అర్థము ఏమంటే మోక్షము కర్మఫలము కాదు. దీనికి శ్రుతి చెప్తున్నది; మృత్యువును జయించుటకు దేవతలు మొదట 'త్రయీవిద్య'తో (వైదికకర్మతో)యుద్ధము చేసి ఓడిపోయారు; తరువాత కర్మను విడిచి 'ఓంకారము'ను ఉపాసించారు. (ఛా॥ 1-4-2, 4).

4) కొంతమంది మోక్షమును జ్ఞాన-కర్మ సముచ్చయ లభ్యమని చెప్తున్నారు. వారి అభిప్రాయములో కేవల ఆత్మజ్ఞానమువల్ల మోక్షప్రాప్తి కాదు. జ్ఞానముతోపాటు వేదోక్త కర్మలు కూడా చేయాలి. ఈ విధముగా జ్ఞాన-కర్మల సమ్మేళనముతోనే మోక్షప్రాప్తి కలుగుతుంది. కాని, ఇది సరికాదు. ఎందుకంటే, జ్ఞానము-కర్మ ఎప్పుడూ కలసి వుండవు. క్రియా కారక ఫల భేదము లేకుండా (అంటే అవిద్య లేకుండా) కర్మ సాధ్యము కాదు. ఇక, జ్ఞానము భేద నిరాకరణము చేస్తున్న విద్య. అందుకే, ప్రాచీన కాలములో విద్వాంసులు

దృశ్యమాన లోకమును, ఆత్మవ్యతిరిక్తము కాదని (ఆత్మకంటె అభిన్నమని) తెలుసుకుని, "మాకు ఇదే ఆత్మ-ఇదే లోకము" అని చెప్పి, కర్మను విడిచి వెళ్ళిపోయారు. (బృ॥భా॥ 4-4-22). అందువల్ల, మోక్షము జ్ఞాన-కర్మ సముచ్చయమువల్ల పొందదగినది కాదు.

5) ఇప్పుడు ఇంకొక సందేహము :- అయితే, వేదోక్త కర్మకాండకు అధికారి ఎవరు? దీనికి సమాధానము కర్మాధ్యాయములో దొరుకుతుంది. ప్రస్తుతము ఇది జ్ఞాపకము వుంచుకుంటే చాలు- ద్వైతభావము దృఢముగా వున్నవారే అధికముగా ఉన్నారు. దానిని విడిచిపెట్టే ఇచ్ఛ కలవారు చాలా కొద్ది మంది మాత్రమే. ఎవరో ఒక్కరు మాత్రమే విడిచిపెడుతున్నారు. వీరిలో మొదటి వర్గమువారు కర్మకు అధికారులు.

ప్రశ్నలు :-

1. మోక్షమునకు అందరూ స్వీకరించే వ్యాఖ్య ఏమిటి?
2. మోక్షము విషయములో ఏ అభిప్రాయములు ఉన్నవి? వాటిలో ఏవి సరియైనవి? ఏవి సరియైనవి కావు?
3. మోక్షము విషయములో శ్రుతి ఏమని చెప్తున్నది?
4. అశరీరి ఎవరు?
5. అశరీరి - సశరీరి వీరిలో భేదము ఏమిటి?
6. మోక్షమునకు రెండవ పేరు ఏమిటి?
7. 'భూమ' స్థితిని శ్రుతి ఎలా వర్ణించినది?
8. ఏ జ్ఞానముతో మోక్షము ప్రాప్తిస్తున్నది?
9. బ్రహ్మజ్ఞానము దేనితో ప్రాప్తిస్తున్నది?
10. ఆ జ్ఞానమునకు ఏమి కావాలి?
11. సంపత్తి అంటే ఏమిటి?
12. పురుషతంత్రము, వస్తుతంత్రము అంటే ఏమిటి? వాటిలో భేదము ఏమిటి?
13. జ్ఞానములో వికల్పము ఎందుకు లేదు?
14. కర్మఫలములో - జ్ఞానములో అంతరము ఏమిటి?
15. మోక్షము, జ్ఞాన-కర్మల సముచ్చయమునకు ఫలమా? ఈ పక్షమువారు ఏమి చెప్తున్నారు?
16. ఆ పక్షము చెప్పడములో దోషము ఏమిటి?

అధ్యాయము 17

సంన్యాసము

బ్రహ్మచారికి, గృహస్థునకు, వానప్రస్థునకు – అందరికీ వేదము కర్మను విధించినది. వారు కర్మను చేస్తూనే వుండాలి. ఆ వేదమే, విధిపూర్వకముగా కర్మను విడిచిపెట్టడము కూడా చెప్పినది. ఆ విధిపూర్వక కర్మ పరిత్యాగమే సంన్యాసము. దీనిని 'పారివ్రాజ్యము' అని కూడా అంటారు. దీనివలన, జ్ఞానసాధన సులభముగా అవుతుంది. ఈ అధ్యాయములో ఈ చతుర్థాశ్రమమునకు సంబంధించిన విషయ విమర్శ ఉన్నది.

17-1) సంన్యాసము వేదోక్తమయినది

సంన్యాసము వేదోక్తమయినది కాదని, అది స్మృతి పరంపరతో వచ్చినదని కొందఱి అభిప్రాయము. కర్మను విడిచిపెట్టకూడదనే శ్రుతి వాక్యమును ఉల్లేఖించి, దీనిని సమర్థిస్తున్నారు. (సూ॥ భా॥ 3-4-18). కాని, ఇది సరియైనది కాదు. తమ ఆశ్రమ ధర్మమునకు విధించిన కర్మ చేయకపోయేటట్లయితే 'ప్రత్యవాయ' దోషము వస్తున్నది. విధిపూర్వకముగా ఈ కర్మలను విడిచిపెట్టిన సంన్యాసికి ఈ దోషము లేదు. కర్మలను విడిచిపెట్ట వచ్చును. శ్రుతి దీనిని ప్రశంసించినది కూడా. కర్మలను విడిచి పెట్టే పద్ధతి కూడా చెప్పినది. "న్యాస ఇతి బ్రహ్మ అవరాణి పరాంసి న్యాస ఏవాత్యరేచయత్।" (తై॥నా॥ 78), సంన్యాసము బ్రహ్మయే; అన్యతమమైనవి గౌణములు. న్యాసమే అన్నిటికన్న గొప్పది. "వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సంన్యాస యోగాద్యతయః శుద్ధ సత్త్వాః।" (ముం॥ 3-2-6)- వేదాంత విజ్ఞానముతో సునిశ్చిత అర్థము తెలిసి, సంన్యాసయోగముతో శుద్ధసత్త్వము కలవారు యతులు. "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః।" (తై॥ నారాయణీయం. 12) – కర్మతో కాదు, ప్రజ వలన కాదు, ధనమువల్ల కాదు, కేవలము త్యాగముతోనే కొందరు అమృతత్వమును పొందివున్నారు. "ఏత ఏవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తో బ్రాహ్మణాః ప్రవ్రజన్తి।" – బ్రాహ్మణులు ఈ ఆత్మరూపలోకము మీద ఇచ్ఛతో సంన్యాసగ్రహణము చేస్తున్నారు. (శతపథ బ్రాహ్మణము). ఈ శ్రుతులన్నీ ఈ విధముగా సంన్యాసమును ప్రశంసిస్తున్నాయి. జాబాల శ్రుతి తిన్నగా చెప్పినది – "బ్రహ్మచర్యం పరిసమాప్య గృహీ భవేత్ గృహీ భూత్వా వనీ భవేత్, వనీభూత్వా ప్రవ్రజేత్। యది వేతరథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్ గృహాద్ వా వనాద్ వా।" (జా॥ 4)- బ్రహ్మచర్యము సమాప్తి చేసి గృహస్థు అవాలి; గృహస్థు అయిన తరువాత వనీ (వానప్రస్థుడు) అవాలి; వానప్రస్థుడవు అయిన తరువాత పరివ్రాజకుడు కావాలి. అలా కాకుండా, ఈ క్రమమునకు భిన్నముగా బ్రహ్మచర్యము నుండైనా, గృహస్థుగానైనా, వానప్రస్థము నుంచి అయినా పరివ్రాజకుడు కావాలి. "అత ఏవ చాగ్నీంధనాద్యనపేక్షా।" దీనికి అగ్ని – ఇంధనములు (కఱ్ఱలు) మొదలైనవాటి ఆవశ్యకత లేదు. (సూ॥ 3-4-25). ఇలా బ్రహ్మ సూత్రములు కూడా జ్ఞానప్రాప్తికి కర్మతో ఆవశ్యకత లేదని చెప్తున్నాయి.

జాబాలశ్రుతి సంన్యాస క్రమమును స్పష్టముగా తెలియచెప్పినది. రంగులేని వస్త్రములు కట్టుకొని, శిరస్సును ముండనము చేసి, ఎవరినుంచీ ఏమీ తీసుకోకుండా, శుచి అయి, అద్రోహి అయి, భిక్షాటనము చేస్తూ ఉండే పరివ్రాజకుడు బ్రహ్మభావన పొందడానికి పాత్రుడు అవుతాడు – "అథ పరివ్రాడ్ వివర్ణ వాసా ముండో¬పరిగ్రహః శుచిరద్రోహీ భైక్షాణో బ్రహ్మభూయాయ భవతి" (జాబాలోపనిషత్-5). ఇదే విధముగా,

కఠరుద్రోపనిషత్ కూడా చెప్పినది: – "యజ్ఞోపవీతం వేదాంశ్చ సర్వం తద్వర్జయేద్యతిః" (క॥రు॥2)– యతి యజ్ఞోపవీతమును, వేదములను వర్జించాలి. జీవుడు కర్మ బద్ధుడవుతాడు, విద్యచేత ముక్తుడవుతాడు. ఇందువల్ల పారదర్శులయిన యతులు కర్మలు చేయరు. –"కర్మణా బధ్యతే జంతుః విద్యయా చ విముచ్యతే। తస్మాత్ కర్మ న కుర్వంతి యతయః పారదర్శినః" (మోక్షధర్మము – 341–7) అని స్మృతి కూడా చెప్పినది.

17–2) విద్వత్సంన్యాసము : జ్ఞానము ప్రకాశము – కర్మ అంధకారము. ఎవడు జ్ఞానమును పొందుతాడో వాడు సహజముగానే కర్మ సంన్యాసము చేస్తాడు (కర్మను త్యాగము చేస్తాడు). "అందువల్ల ఓ మైత్రేయీ! ఇదే అమృతత్వము" అని చెప్పి యాజ్ఞవల్క్యుడు వెళ్ళిపోయాడు –"మైత్రేయ్యేతావదరే ఖల్వమృతత్వమితి హోక్త్వా యాజ్ఞవల్క్యో విజహార।" (బృ॥ 4–5–15). దీనిని విద్వత్సంన్యాసము అంటారు. జ్ఞాని కర్మ చేసినా, విడిచిపెట్టినా – అనగా అతని శరీరము ద్వారా కర్మ జరుగుతున్నట్లు కనిపించినా, లేకపోయినా – చింత ఏమీ లేదు; ముందు కర్మ చేయవలసిన అనివార్య కారణము ఏదీ లేకపోతే కర్మను విడిచి చేస్తాడు. ఎందుకంటే కర్మ చేయాలంటే యిల్లు, భార్య, ధనము అన్నీ కావాలి. ఇవన్నీ కామములే! జ్ఞాన విరుద్ధములే. అయితే కర్మత్యాగము వల్ల ప్రయోజనము ఏముంటున్నది? ఈ ప్రశ్న ఎంత వ్యర్థమైనది అంటే – అంధకారము నుంచి ప్రకాశమువైపు వచ్చినవాడు, అగాధములో, బురదలో, ముళ్ళలో పడకపోవడములో లాభము ఏమిటి–అని అడగడము వంటిది. స్మార్తలింగము విడిచిపెట్టి, లింగరహితుడైన జ్ఞాని అయి, అవ్యక్తలింగుడు అయి, అవ్యక్తాచారముతో భిక్షాటన చేసేవాడైన (బృ॥ 3–5–1) వ్యక్తి "నేను నా పనిని విడిచిపెట్టాలి" అని చెప్పి కర్మను విడిచిపెట్టనక్కర లేదు. బ్రహ్మజ్ఞానము వచ్చిన తరువాత – కొబ్బరిచెట్టు నుంచి మట్టలు రాలిపోయినట్లు – అతని కర్మలు అతినిని విడిచిపెడతాయి.

కొందఱు గృహస్థులు భిక్షాటన చేయుటకు, చేసేవారు తిరస్కరించబడుటకూ తమలో తాము చాలా భయపడతారు. మళ్ళీ తెలివిగా యిలా అంటారు – "సంన్యాసులకు కూడా భిక్షాటన నియమమయితే వుంటుంది. అందువల్ల కేవలము శరీరధారణకోసము ఇచ్ఛ వున్న జ్ఞానులు తమకు ఆవశ్యకమైన అన్న వస్త్రములకు ఇంటిలోనే ఉంటే తప్పేమిటి?" అయితే, ఏదైనా ఇంటిని తనది అని అనుకోగానే దానిమీద మమత ఏర్పడుతుంది. ఈ మమకారము లేనివాడు అన్నవస్త్రములకోసము భిక్షాటన చేయాలి.

17–3) జ్ఞాని యొక్క కర్మ

1) జ్ఞానప్రాప్తితో కర్మ వదలిపోవడము సహజమే కానీ, అప్పుడప్పుడు జ్ఞానులు కూడా కర్మ చేయడము కనపడుతున్నది. ఉదా : జనకుడు, అశ్వపతి మొదలైన రాజులకు కర్మసంన్యాసము యుక్తము అయినప్పటికీ వారు కర్మ చేస్తూనే సిద్ధి పొందారు; కర్మ సంన్యాసము చేయలేదు–"జనకాదయః కర్మసంన్యాసే ప్రాప్తే ऽపి కర్మణా సహైవ సంసిద్ధిం ఆస్థితాః న కర్మసంన్యాసం కృతవన్తః" (గీ॥ భా॥ 2–13). ఎందుకంటే, వారికి లోకసంగ్రహము చేయవలసిన బాధ్యత ఉన్నది. లోకసంగ్రహమునకు అర్థము – లోకులను ధర్మమార్గములో నడిపించడము. లేకపోతే, రాజ్యములో అరాజకత్వము వ్యాపిస్తుంది. ఇటువంటి వారు తమ పుత్రులకు రాజ్యభారము అప్పగించి వెళ్ళిపోతారు.

రాజులు కాని జ్ఞానుల విషయములో కూడా కొన్ని అనివార్య కారణము వస్తాయి. వారికి, సంన్యాస జీవనము గడపగలిగే ఆరోగ్యము వుండకపోవచ్చు; అదీగాక, భార్య, పిల్లలు, వృద్ధులైన తల్లితండ్రులు మొదలైనవారు, వీరు లేకపోతే అనాథులయ్యే ప్రమాదము వుండవచ్చు. పూజ్యులైన శంకరాచార్యులవారికి

వృద్ధురాలైన తల్లి వుండేది; ఆమెను సంరక్షించమని బంధువులకు అప్ప చెప్పి వెళ్ళారు. అనివార్య కారణమువల్ల ఆమె మృత్యుసమయములో వారు వచ్చారు కూడా. ఇలా అనేక అనివార్య కారణములవల్ల గృహములోనే ఉండవలసి రావచ్చు. అప్పుడు, లోకసంగ్రహము కోసమైనా, లేక శిష్టులవల్ల నిందపడకుండా వుండడము కోసమయినా, వారు కర్మ చేస్తూ వుంటారు. అయితే వారి కర్మ సత్యమైన అర్థములో కర్మ అనరు - "నిర్గమాసంభవాత్ లోకసంగ్రహ చికీర్షయా శిష్టనిబర్హణా పరిజిహీర్షయా వా పూర్వవత్ కర్మణి అభిప్రవృత్తోఽపి నిష్క్రియాత్మదర్శన సంపన్నత్వాత్ నైవ కించిత్ కరోతి సః" (గీ॥ భా॥ 4-20)

17-4) వివిదిషా సంన్యాసము

1) అజ్ఞాని, జ్ఞానప్రాప్తికి శ్రవణ - మనన - నిదిధ్యాసములలో ఎల్లప్పుడూ ఉంటూ ఉండాలి. 'అహం బ్రహ్మాస్మి' - అనే భావనలో అవిరామంగా వుండడమే నిదిధ్యాసనము. ఈ భావము - కర్మ రెండూ కలవడము కుదరదు అనేది సర్వవిదితము. కర్మలో ద్వైతభావము కావాలి. అందువల్ల, ఎవరైనా అజ్ఞాని, మనన-నిదిధ్యాసనలను చేయాలనుకుంటే, వాటికి విరోధియైన కర్మలో భాగి అవడము అతడు ఇష్టపడడు. కాని, వేదములే కర్మను నియమించాయి. అందువల్ల ఎవరైనా సరే, ఊరకే కర్మను వదలి జ్ఞానసాధనకు నిదిధ్యాసనలో లగ్నము కాలేరు; విధిపూర్వకముగానే కర్మను విడిచిపెట్టాలి. ఈ విధముగా, ఉద్దేశ్య పూర్వకముగా, శ్రుతిని అనుసరించి కర్మను విడిచిపెట్టే సంన్యాసమును 'వివిదిషా సంన్యాసము' అంటారు. లౌకిక వ్యవహారములో వచ్చే ఆటంకములు ఇక్కడ వుండవు. ఇక్కడ అవి నివారించబడుతున్నవి. మోక్షసాధనకు ఇది చాలా సహాయకారి. తాను నిష్కామకర్మ చేస్తూ, కాలక్రమములో వైరాగ్యమును పొంది, అతడు సంన్యాసమును స్వీకరించవలసి వున్నది.

2) ప్రశ్న : నిష్కామకర్మ స్వరూపము ఏమిటి? దానివల్ల వైరాగ్యము ఎలా కలుగుతుంది?

సమాధానము : కర్మ నాలుగు విధములు : నిత్యము, నైమిత్తికము, కామ్యము, ప్రతిషిద్ధము. (తరువాతి అధ్యా॥లో చూడండి.) ఇందులో ప్రతిషిద్ధ కర్మ పాపకారణమగుటవల్ల దుఃఖమును కలుగజేస్తుంది. అందువల్ల, వివేకము వున్నవారు ఎవరూ దీనిని చేయరు. కామ్యకర్మ ఫలము పుణ్యము. దానిద్వారా సుఖము కలగడము వలన అందరూ సహజముగా దీనినే చేస్తూ వుంటారు. నిత్య నైమిత్తిక కర్మలకు ఫలమును శాస్త్రము చెప్పలేదు. అందువల్ల సాధారణ జనులకు వీటిని చేయాలనే ప్రేరణ కలుగదు. కాని, ముముక్షువులు అలా కాదు. ఫలమును చెప్పకపోయినా, శ్రుతి విధి ప్రకారము, దానిని భగవదాజ్ఞగా పాటించి, కామ్యకర్మలను విడిచి, శ్రద్ధతో ఈ కర్మలను చేస్తూ వుంటారు. ఇదే భగవదర్పణ బుద్ధితో చేసే నిష్కామకర్మ. దీనిని చేయడములో మోక్షేచ్ఛ కూడా వుండకూడదు. పరమేశ్వరాజ్ఞగా భావించి కేవలము దాసభావముతో చేయాలి. ఇలా ప్రారంభించిన నిష్కామకర్మ, నెమ్మది నెమ్మదిగా అన్ని వ్యవహారములను ఇదే దృష్టితో చేసే సంస్కారమును కలిగిస్తున్నది. పరోపకార బుద్ధికూడా పెరుగుతుంది. ఇదే వైరాగ్యము. కొందఱు - పరోపకార కర్మనే 'నిష్కామకర్మ' అని తమలో తాము భావించి, నిత్య-నైమిత్తిక కర్మలను విడిచి, కేవలము వాటిలోనే రక్తి కలిగివుంటారు. కాని, ఇలా చేయడమువల్ల, చిత్తశుద్ధి కలుగదు. ఎందువల్లననగా, పరమేశ్వరుని మరిచిపోయి, ధిక్కారముచేసి చేసిన సత్కర్మ కూడా నిష్ఫలమవుతున్నది.

17-5) వివిదిషా సంన్యాస విధి :

1) జ్ఞానసాధనకోసము, కర్మను విడిచిన సంన్యాసికి, జ్ఞానసాధనకు ఉపకారమయ్యే నియమమే విధి. దానికోసము ప్రయత్నించేవారికి గీతలో ధ్యానయోగమును చెప్పారు. ధ్యానయోగమునకు ప్రయత్నించేవారిని 'ఆరురుక్షువు' అంటారు. ఆ ప్రయత్నములో సఫలత్వమును పొందినవారిని 'ఆరూఢుడు' అంటారు. ఆరురుక్షువు కర్మయోగమును చేస్తూ చేస్తూ ఆరూఢుడు అవుతాడు. ఇతనికి, విషయములమీద, కర్మమీద అభిరుచి వుండదు. ఆ ఆరూఢుడు తన భవిష్యత్ ప్రగతి కోసము శమమును ఆశ్రయిస్తాడు. "ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే। యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే।" (గీ॥ 6-3). సంన్యాసములోనే వుంటూ ధ్యానము చేస్తాడు - ఇందువల్ల, అతనికి శమము విహితము.

2) ఆరూఢుడైన ముముక్షువు సర్వాత్మభావన సాధనకోసము వైదిక ధ్యానము చేస్తాడు. ఎప్పుడైతే అతడు బహిర్ముఖుడు అవుతాడో, అప్పుడు తన ఎదురుగా వున్న సర్వమును బ్రహ్మగా భావిస్తాడు. ఇదంతా అపరాప్రకృతి వేషములో ఉన్న బ్రహ్మమే. - "భూమిరాపో౽నలో వాయుః ఖం మనోబుద్ధిరేవ చ అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా।" (గీ॥ 7-4). అంతర్ముఖుడై తన వైపు తిరిగినప్పుడు, అక్కడ ఏది కనబడుతుందో దానిని కూడా ఇలాగే తెలుసుకుంటాడు; జీవుడు కూడా పరాప్రకృతి వేషములో ఉన్న బ్రహ్మమే కదా? - "అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరాం. జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్।" (గీ॥ 7-5). ఇదే అతని ధ్యానము. శమదమాదులతో ధ్యానముతో బ్రహ్మనిష్ఠను పెంచుకుంటూ వెళ్ళడమే అతని ఆశ్రమవిహిత ధర్మము. (సూ॥ 3-4-20).

3) ఈ ప్రకారము చేసే ధ్యానముతో ఆత్మస్వరూపముయొక్క నిశ్చితమైన జ్ఞానమును పొందుతాడు. దీనిని **'అమౌనము'** అంటారు. శ్రుతి ఇలా విధిస్తున్నది - "బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్, బాల్యం చ పాండిత్యం చ నిర్విద్య అథ మునిరమౌనం చ మౌనం చ నిర్విద్య।" (బృ॥ 3-5-1). బ్రాహ్మణుడు అనగా బ్రహ్మవిదుడు పాండిత్యమును పొంది బాల్యములో నిలిచి, బాల్యమును పాండిత్యమును పొందిన తరువాత మునియై, అమౌనము మరియు మౌనమును కూడా పొంది (బృ॥ 3-5-1). అనగా, శ్రుతి పాండిత్యము, బాల్యము, మౌనము ఈ మూడింటిని అతనికోసము విధించినది. **పాండిత్య**మునకు అర్థము ఆత్మజ్ఞానమును సంశయము లేకుండా పూర్ణముగా గురువు మరియు వేదములద్వారా పొందడము. **బాల్యము** అంటే అర్థము దంభ దర్పములు లేకుండా బాలుని వంటి స్వభావము కలిగి వుండడము. సంన్యాసి తనను తాను ప్రకటించుకోకుండా ఈ భావముతో వుండాలి. 'అతడు సత్పురుషుడా లేక అసత్పురుషుడా, గొప్ప జ్ఞానా లేక అజ్ఞానా, మంచి అలవాట్లు ఉన్నవాడా లేక చెడ్డ అలవాట్లు ఉన్నవాడా - ఇవేవీ ఎప్పుడూ ఎవరికీ తెలియకూడదు. ఇక, మూడవది 'మౌనము'. అప్పుడు అతనికి శమదమాదులు, పాండిత్యము, బాల్యము, మౌనము, ఇవన్నీ ఉండవలసిన ఆవశ్యకత ఉన్నది. ఈ ఆశ్రమము ఈ గుణములను తప్ప, ఇంక వేటినీ అపేక్షించదు. (సూ॥ భా॥ 3-4-47, 50).

17-6) సంన్యాసమునుండి ప్రచ్యుతి :

సంన్యాసాశ్రమములో సాంసారిక సమస్యలు ఉండవు. కానీ, అజ్ఞుని దృష్టిలో వున్న, ప్రియవస్తుజన్యమైన సుఖము కూడా ఇందులో ఉండదు. కేవలము ప్రథమాంశమునే దృష్టిలో ఉంచుకుని సంన్యాసమును స్వీకరించిన మూర్ఖుడు - సంన్యాసములో ఆనందమును పొందలేడు. తన, వెనుకటి ఆశ్రమ ధర్మమునే

ఇంకా చక్కగా నిర్వహించగలననే భావముతో ఆ సంన్యాసి, తన ఉన్నచోటునుంచి జారిపోతాడు; కాని అతడు తిరిగి వెళ్ళడము శాస్త్రవిరుద్ధము. **ఎవరికి ఏ విధి నిర్ణయింపబడినదో అదే వారి ధర్మము; ఏది బాగుగా చేయగలడో అది కాదు. ఎందుకంటే, ధర్మమునకు శాస్త్రప్రేరణే ప్రమాణము. అందువల్ల రాగాదుల ప్రేరణతో వెనుకకు పోరాదు. ఎందుకంటే శాస్త్ర నియమము దీనికన్న బలవత్తరము**– "యో హి యం ప్రతి విధీయతే స తస్య ధర్మో. న తు యో యేన స్వనుష్ఠాతుం శక్యతే। చోదనాలక్షణత్వాత్ ధర్మస్య। న చ రాగాది వశాత్ ప్రచ్యుతిః; నియమశాస్త్రస్య బలీయస్త్వాత్। (సూ॥ భా॥ 3-4-40). ఈ నిషేధము కేవలము చతుర్థాశ్రమమునకు మాత్రమే కాదు. ఏ ఆశ్రమమునుంచైనా, దానికంటె దిగువ ఆశ్రమమునకు రావడానికి వీలులేదు. ఈ విధముగా, మార్గమునుండి జారిపోవడము చాలా దోషము; 'గురుతల్పగమనము' మహాపాపము. మిగిలిన పతనములు ఉపపాతకములు; వానికి ప్రాయశ్చిత్తములు ఉన్నవి. అతని వల్ల మహాపాతకము అయినా, ఉపపాతకము అయినా, శిష్యులు బహిష్కరించవలసే ఉన్నది. ఆరూఢపతితుడిని – ఎవరైతే ఆశ్రమమునుంచి చ్యుతిని పొందుతారో–వారిని స్పృశిస్తే 'చాంద్రాయణము' చేయాలి. మిగిలిన శిష్యులు వానితో కలసి యజ్ఞము, అధ్యయనము, వివాహము మొదలైనవి ఏమీ చేయరు. (సూ॥ భా॥ 3-4-43).

ప్రశ్నలు :

1. సంన్యాసము తీసుకోవడానికి ప్రమాణము ఏమిటి?
2. విద్వత్సంన్యాసము అంటే ఏమిటి?
3. సంన్యాసము విషయములో కొందఱు గృహస్థుల అభిప్రాయము ఏమిటి?
4. జ్ఞాని ఏ సందర్భములో కర్మ చేస్తూ వుంటాడు?
5. వివిదిషా సంన్యాసము అంటే ఏమిటి?
6. ఇది మోక్షసాధనమునకు ఎలా ఉపకరిస్తున్నది?
7. కర్మ సంన్యాసాధికారము శ్రుతి ఎవరికి విధించినది?
8. ఆరురుక్షువు – ఆరూఢుడు, వీరిలో అంతరము ఏమిటి?
9. ఆరూఢుని ధ్యానము ఎటువంటిది?
10. 'అమౌనము' అనగా ఏమి? పాండిత్యము అనగా ఏమి?
11. సంన్యాసాశ్రమము దేనిని అపేక్షిస్తున్నది?
12. ధర్మలక్షణము ఏమిటి? ధర్మమునకు ప్రమాణము ఏమిటి?
13. మహాపాతకము – ఉపపాతకములు ఏవేవి?
14. ఆరూఢపతితునితో మరియు తన ఆశ్రమము విడిచి వచ్చినవానితో శిష్యులు ఏప్రకారము వ్యవహరించాలి?

అధ్యాయము 18

ఉపాసన

మనస్సు చంచలము అవడమువల్లను, పరబ్రహ్మ అరూపము – అతిసూక్ష్మమము అవడము వలనను; దానిని మననము చేసి ఆత్మ అని తెలుసుకోవడము ఒక దుష్కరకార్యము. సాధకుని ఈ కష్టమునుంచి తప్పించడానికి, నెమ్మది నెమ్మదిగా ముందుకు వెళ్ళడానికి శ్రుతి ఉపాసనను విధిగా చెప్పినది. ఈ అధ్యాయములో దాని విచారణ చేయబడుతున్నది.

18–1) ఉపాసన అంటే ఏమిటి?

మనస్సును ఒక స్థానములో కేంద్రీకరించడానికి సహకరించే ఆధారమును 'ఆలంబనము' అంటారు. ఉదాహరణకు – ఓంకార శబ్దము, హృదయాకాశము, ప్రాణము (ఛాం॥ 8–1–1, 8–5–4) మొదలైనవి. సాధకుని యోగ్యతానుసారముగా ఈ విధమైన అనేక ఆలంబనములను శాస్త్రము ప్రతిపాదించినది. శాస్త్రములో చెప్పిన ఏదో ఒక ఆలంబనను స్వీకరించి దానిలో ఒకే ప్రకారముగా – చిత్తవృత్తిలో ఇంక ఏ విలక్షణ ప్రత్యయము రాకుండా – మనస్సును ఒకే స్థితిలో ఉంచడమును 'ఉపాసన' అంటారు. (అధ్యా॥ 15–10). ఇది 'చిత్తశుద్ధి'ని కలిగిస్తున్నది; అదిగాక చాలా సులభమైన మార్గము. మెల్లమెల్లగా అద్వైత ప్రాప్తికి సహకారి అవుతుంది. (ఛాం॥ భా॥ అవతరణిక). ఈ ఆలంబనములు పరమేశ్వరుడే అయినప్పటికీ, విశేషణములతో చెప్పబడుతూ వుంటాడు. వీటిలో కొన్ని ఉపాసనలు కర్మతో చేర్చి చేయవలసినవి ఉన్నాయి. కర్మలో ఉన్న విద్యాస్వరూపమును తెలుసుకొనకుండా, కర్మచేసినా కూడా ఫలము వస్తున్నది. కాని, తెలిసి చేసినట్లయితే ఫలము అధికముగా వుంటున్నది – "యదేవ విద్యయా కరోతి తదేవ వీర్యవత్తరం భవతి।" (ఛాం॥ 1–1–10). ఇంకా కొన్ని ఉపాసనలు, క్రమముక్తిని అనగా, బ్రహ్మలోక ప్రాప్తిద్వారా ముక్తిని ఇస్తాయి; కొన్ని ఉపాసనలు సిద్ధులను ఇస్తాయి. ఉదా : అన్నోపాసన చేసినవారికి అన్నము సమృద్ధిగా వుంటుంది; అతడు భోజనము చేస్తే ఇతరులకు కూడా తృప్తిగా వుంటుంది. ప్రాణోపాసకునికి పూర్ణాయుస్సు వుంటుంది, వానికి అపమృత్యువు కూడా ఉండదు (అధ్యా॥ 15–10). ఈ ఉపాసనల ద్వారా సిద్ధులను ఆశించకపోతే, ఇవి ఉపాసకుని అద్వైత జ్ఞానమువైపు తీసుకువెళ్తాయి.

చిత్తవృత్తిని స్థిరముగా ఉంచుకోవడమే ఉపాసనకు అర్థము; చిత్తమును ఎటువైపు వెళ్ళనీయకూడదు. అంటే, మనస్సు ఎటువైపు చలించకుండా ఒక్క ఆకారము మీదనో, లేక ఏదో ఒక శబ్దము మీదనో, ధ్యానము ఉంచడము కాదు; శాస్త్రము ఆలంబనము కోసము ఏ చైతన్య స్వరూపమును చెప్పినదో, దానిని మనస్సులో మాటి మాటికి చింతన చేస్తూ వుండాలి. ఉదాహరణకు ఓంకారమును జపించేటప్పుడు, మనస్సులో దాని మాత్రలనూ, మాత్రలకు వైశ్వానరాది సంబంధమునూ, వైశ్వానరాదులనూ పదేపదే చింతన చేయాలి. మనస్సు యొక్క స్వభావము ఎప్పుడూ ఏదో యోచించే అలవాటు కలది కనుక ఇలా చింతన చేయడము సులభము. కాని, మధ్యలో విజాతీయ ప్రత్యయము ఏదీ ఉండరాదు. విజాతీయ ప్రత్యయ నివృత్తిని, ప్రయత్నించి చేయాలి. అయితే, దీనిని సాధించడము చాలా కష్టము. మనస్సు చంచలము. ఇంద్రియములను విక్షిప్తము చేసే శక్తి కలది. గాలిని నిగ్రహించడము ఎంత కష్టమో, మనస్సును నిగ్రహించడము అంతకంటె

కష్టము. ప్రబలమైన విషయ సుఖ సంస్కారము మనస్సును విషయముల వైపుకు తీసుకుపోతూ వుంటుంది. దీనిని నిగ్రహించడానికి అవసరమైనదే వైరాగ్యము. అంతేకాదు, మనకు కొంచెము కూడా ఆసక్తికరము కాని రాళ్ళు, చెత్త, ముళ్ళు - వీటివైపు కూడా మనస్సు పోతూ వుంటుంది. దీని నిగ్రహమునకు అభ్యాసము ఆవశ్యకము. అనగా, ఎక్కడెక్కడికో పోయే మనస్సును ధృతితో తిరిగి ధ్యేయము వైపుకు మళ్ళించాలి. ఈవిధముగా, వైరాగ్య, అభ్యాసములతో చంచలమైన మనస్సును ధ్యేయముపైన నిలబెట్టాలి - "అభ్యాసేన తు కౌంతేయ! వైరాగ్యేణ చ గృహ్యతే।" (గీ।। 6-34,35).

18-2) ఆలంబనతో తన సంబంధము

1) ప్రశ్న - శాస్త్రము చెప్పిన ప్రకారము, విశేషణములతో కూడి వున్న పరమాత్మే ఆలంబనము. ఈ పరమాత్మను తానేనని గ్రహించాలా? లేదా?

సమాధానము- సాక్షాత్కారము తరువాత పరమాత్మ తనకంటే అభిన్నమైన వాడని తెలుస్తున్నది. జాబాల శ్రుతి యిలా చెప్తున్నది - "త్వం వా అహమస్మి భగవో దేవతే-ऽహం వై త్వమసి।"- హే! పూజ్యదేవతా! నీవే నేను. నేనే నీవు. దీనిని సమర్థిస్తూ యాజ్ఞవల్క్యుడు, గౌతమునితో యిలా అన్నాడు "ఏషత ఆత్మాన్తర్యామీ।" - అదే నీ ఆత్మ అంతర్యామి. (బృ।। 3-4-3). శ్వేతకేతువుతో తండ్రి ఆరుణి యిలా అన్నాడు- "స ఆత్మా తత్త్వమసి।" ఆ ఆత్మ నీవే। (ఛాం।। 6-8-7). ఇంతేకాక, ఇంకా యిలా చెప్పాడు. - "యో-ऽన్యాం దేవతాముపాస్తే అన్యో-ऽసౌ అన్యో-ऽహమస్మి ఇతి న స వేద యథా పశురేవం స దేవానాం।" - అన్యదేవతను, నేను వేఱు, వారు వేఱు అని ఎవడైతే ఉపాసిస్తున్నాడో వాడు తెలిసినవాడు కాదు; వాడు దేవతలకు పశువుతో సమానము. (బృ।। 1-4-10). ఈ విధమైన భేదభావము కేవలము నిందనీయము. అందువల్ల, ఉపాస్యదేవతను, తనతో అభిన్నమని అనుకోవాలి.

2) ప్రశ్న : ఇక్కడ, ఉపాసకుడు పాప-పుణ్యములనుండి తరించడానికి ఉపాసన చేస్తున్నాడు. కాని, ఉపాస్యము పాపరహితము, అయితే, తనతో అది అభిన్నమని ఎలా అనుకోవాలి?

సమాధానము: ఈ వైలక్షణ్యము కల్పితము. కాని, అది యిప్పుడు తెలియదు. చిత్తశుద్ధి ద్వారా, ఈ ఉపాసన చేయగా చేయగా జ్ఞానోత్పత్తికి సహకారి అవుతుంది. ఆ తరువాత, జీవ-బ్రహ్మలలో ఏమీ భేదము లేదని తెలుస్తున్నది. (సూ।। భా।। 4-1-3). ఈ విధముగా, ఉపాసన - నిదిధ్యాసములలో భేదము వున్నది - ఈ రెండింటిలో అనుష్ఠానకాలములో, ఆత్మతో అభిన్న విషయమైన పరమాత్మ ప్రత్యయముయొక్క ఆవృత్తి మనస్సులో వుంటుంది. (సూ।। భా।। 4-1-1). **శ్రవణ, మననములతో దృఢమైన ప్రత్యయమును ఆవృత్తి చేయడము నిదిధ్యాసనము అవుతుంది; కాని, దానికంటె ముందు ఆలంబనద్వారా అయ్యే ఆవృత్తి ఉపాసన.**

18-3) ప్రతీకోపాసన

ముందు చెప్పిన ఆలంబన ఉపాసనకంటె ప్రతీకోపాసన సులభము. ఏ ఉపాసనలో బ్రహ్మయొక్క కార్యరూపమైన ఏ వస్తువైనా ఉపాస్య బ్రహ్మ అవుతున్నదో, అది 'ప్రతీకోపాసన' అనబడుతున్నది. ఇక్కడ బ్రహ్మయొక్క కార్యరూప వస్తువు 'ప్రతీక'. ప్రతీకోపాసనలో బ్రహ్మయొక్క కార్యరూప వస్తువును, తనకంటె

గొప్పదానినిగా భావించి, ఉపాసన చేస్తాడు. ప్రతీకము బ్రహ్మయొక్క కార్యరూపము మాత్రమే. ఆలంబనమయితే సవిశేష బ్రహ్మమే. (కొన్నిచోట్ల వీనిని పర్యాయరూపములుగా కూడా ప్రయోగము చేశారు.)

ఉదా : ఆదిత్యుడు బ్రహ్మ; సాలగ్రామము విష్ణువు అని చేసే ఉపాసనలలో – ఆదిత్యుడు సాలగ్రామము ప్రతీకలు. ఈ కాలములో సాధారణముగా చేస్తున్న ఉపాసనలన్నీ ప్రతీకోపాసనలే. ఆలంబనోపాసనవల్ల వచ్చే ఫలముకంటే, ప్రతీకోపాసనలలో వచ్చే ఫలము చాలా తక్కువ.

ప్రశ్న : ఆలంబనోపాసనలో, ఉపాసకుడు తనను స్వయముగా దేవతగా భావిస్తాడు. అయితే, ప్రతీకోపాసనలో ప్రతీకను తననుగా భావన చేయవచ్చా?

సమాధానము : లేదు, సంసారియైన ఉపాసకుడు తాను ప్రతీకతో సమానము. అందువల్ల ప్రతీకను తాను అనుకోవడములో లాభము ఏమీ లేదు. ప్రతీకను దేవత అని భావించి ఉపాసన చేయాలి. (సూ॥ భా॥ 4-1-4).

ప్రశ్న : ప్రతీకను దేవత అనుకోవాలా? దేవతను ప్రతీక అనుకోవాలా?

సమాధానము : ప్రతీకనే దేవత అనుకోవాలి. దీనివల్ల, తక్కువ దానిని గొప్పగా భావించినట్లవుతున్నది. గుమాస్తాను అధికారిగా పొగడవచ్చు, దానివలన లాభము వుంటున్నది. కాని, అధికారిని గుమాస్తాగా సంబోధిస్తే ప్రమాదము అవుతుంది. (సూ॥ భా॥ 4-1-5).

ప్రశ్న : కూర్చునే ఉపాసన చేయాలా?

సమాధానము : అవును. తిరిగేటప్పుడుగాని, నిలుచునిగాని ఉపాసన చేస్తే, ధ్యాస శరీరము మీదికే వస్తుంది. పడుకుని చేస్తే నిద్ర వస్తుంది. అందువల్ల, కూర్చునే ఉపాసన చేయాలి. కాని కర్మలతో చేసే ఉపాసనలో కూర్చోవాలనే నియమము ఏదీ లేదు. ఉదా : నమస్కారము చేసేటప్పుడు కూర్చోవడము కుదరదు. ఏ కర్మతో ఉపాసన చెప్పారో, ఆ కర్మతోనే ఉపాసన చేయాలి. (సూ॥ భా॥ 4-1-7). దీనిని 'జ్ఞానకర్మ సముచ్చయము' అంటారు. ఇక్కడ జ్ఞానము అంటే ఉపాసన, ఆత్మజ్ఞానము కాదు. ఎందుకంటే ఆత్మజ్ఞానములో కర్మ ఉండదు.

ప్రశ్న : ఎక్కువగా వైదిక కర్మలలో దిక్కులు – దేశము – కాలము మొదలైన నియమములు ఉంటాయి. ఉపాసనలో కూడా ఇవన్నీ పాటించాలా?

సమాధానము : అలా ఏమీ లేదు. ఏ దిక్కు అయినా, ఏ దేశమైనా, ఏ కాలమైనా కావచ్చు. అయితే ఆ దిక్కులూ, దేశకాలములూ మనస్సుయొక్క ఏకాగ్రతకు అనుకూలముగా ఉండాలి. ఎంత సమయము చేయవచ్చో, అంత సమయము వరకు చేయవచ్చు. (సూ॥ భా॥ 4-1-11).

ప్రశ్న : ఉపాసన ఎన్నిరోజులు చేయాలి?

సమాధానము : మరణము వరకు ప్రత్యయము యొక్క ఆవృత్తిని చేస్తూనే వుండాలి. ఎందుకంటే, దానివల్ల వచ్చిన ఫలము బుద్ధి ప్రత్యయరూపముగా మరణసమయములో కనపడుతున్నది. రాబోయే జన్మరూపురేఖలు ఈ ప్రత్యయముమీద ఆధారపడి వుంటాయి. (సూ॥ భా॥ 4-1-12).

ప్రశ్నలు :

1. శ్రుతి ఉపాసనను ఎందుకు విధించినది?
2. ఆలంబనము అని దేనిని అంటారు?
3. ఉపాసన అంటే ఏమిటి?
4. ఉపాసన దేనికి మార్గము అవుతున్నది?
5. ఉపాసన క్రమము ఏమిటి?
6. ఉపాసన యొక్క ఆలంబన మీద శాస్త్రకారులు ఏమి చెప్పారు?
7. నిదిధ్యాసన – ఉపాసనలలో తేడా ఏమిటి?
8. ప్రతీకోపాసన అనగా ఏమి?
9. ఆలంబన – ప్రతీకలలో అంతరము ఏమిటి?
10. ఆలంబన – ప్రతీకోపాసనలు ఎలా చేయాలి?
11. ఉపాసన కూర్చునే ఎందుకు చేయాలి?
12. ఉపాసనలో దిక్కు – దేశము – కాలముల ఉపాసన నియమములు ఏమిటి?
13. ఉపాసనలు ఎన్నిదినముల వరకూ చేయాలి?

అధ్యాయము 19

కర్మ

మోక్షము బ్రహ్మాత్మైకత్వజ్ఞానమునకు ఫలము, కర్మమునకు కాదు. అయితే, మోక్షమునకు కర్మతో ఏమీ ప్రయోజనము లేదని అనుకోకూడదు. అది పరంపరగా మోక్షమునకు కారణమవుతున్నది. ఉపాసన అటువంటి కర్మే. కాని, ఇది ఆంతరిక కర్మ – అంటే మానసిక కర్మ. ఇప్పుడు ఈ అధ్యాయములో కర్మ గురించి వివరిస్తాము.

19–1) జ్ఞానకాండ – కర్మకాండలలో అంతరము

మానవుడు, సుఖప్రాప్తికి దుఃఖ నివారణకు ప్రయత్నము చేస్తూనే వుంటాడు. సుఖ దుఃఖములు వ్యక్తిని బట్టి కాలభేదమును బట్టి వివిధముగా వుంటాయి. ఏదో ఒక నిర్దిష్ట రూపముతో – ఈ సమయములో ఈ విధముగా ప్రాప్తిస్తాయి అని చెప్పడానికి వీలులేదు. ప్రత్యక్ష – అనుమాన ప్రమాణములు దీనిని నిశ్చయము చేయలేవు. ఇతరుల పరిస్థితిని చూసి, సుఖప్రాప్తి, దుఃఖ నివారణకోసము నిర్దిష్ట క్రమముతో నిర్దిష్ట సమయములో ఫలితము వచ్చే విధానమును ఎంత బుద్ధిమంతుడైనా చెప్పలేడు. ఎందుకంటే సుఖ దుఃఖములు ఈ జన్మ ప్రయత్నములవలన మాత్రమే వచ్చేవి కావు; గతజన్మల కర్మలవల్ల దైవమువల్ల కూడా వచ్చేవి. కనుక ప్రత్యక్ష ప్రమాణముచేత వీటి కారణములను నిశ్చయించజాలము. తనకు ఏది శ్రేయస్కరమో దానిని నిర్ణయించే శక్తి కూడా జీవునికి లేదు. అందువల్ల, తనకు ప్రేయమైనదానిని – శ్రేయమైనదానిని ఆగమములవలననే నిశ్చయము చేయాలి. జన్మాంతర సంబంధమైన ఇష్టానిష్టముల ప్రాప్తి–పరిహారముయొక్క విధానము కేవలము ఆగమము మాత్రమే చెప్పగలదు. ఆత్మస్వరూప విషయము చెప్పబడే వేదవిభాగములో తర్కమును అనుభవమును కలిపి చర్చ చేయబడుతున్నది. ఎందుకంటే అంతములో ఆత్మ కేవలము అనుభవముతోనే తెలుసుకోదగినది. కాని, విధినిషేధములను బోధించే కర్మకాండ విభాగములో ఇటువంటి తర్కమునకు అవకాశము లేదు. కేవలము ఆగమము చెప్పినట్లుగానే కర్మ అనుష్ఠింపబడాలి.

19–2) వర్ణముల సృష్టి

కర్మ, వర్ణములననుసరించి నియమింపబడినది. అందువలన వర్ణముల గురించి మొదట చెప్పబడుతున్నది.

1) సృష్టి ప్రారంభములో, అగ్నిరూపమున కేవలము బ్రాహ్మణుడు ఒక్కడే వుండేవాడు. ఈ సందర్భములో శ్రుతి అతనిని బ్రహ్మ అన్నది. ఒక్కడే వుండడమువలన అతడు కర్మ చేసేటందుకు సామర్థ్యము కలగినవాడు కాదు. ఎందుకంటే, దానిని రక్షించేవారు లేరు కనుక. అప్పుడు, అతడు క్షత్రరూపము (క్షత్రియుడు)ను సృష్టించాడు. ఇంద్రుడు, వరుణుడు, సోముడు, రుద్రుడు, పర్జన్యుడు, యముడు, మృత్యువు, ఈశానుడు – వీరందరూ క్షత్రియ దేవతలు. "బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్ ఏకమేవ తదేకం సన్నవ్యభవత్ తచ్ఛ్రేయోరూప మత్యసృజత క్షత్రం।" (బృ॥ 1–4–11). అప్పుడు కూడా అతడు కర్మ చేసే సామర్థ్యమును పొందలేదు; కర్మకు ఆవశ్యకమైన సంపత్తిని సంపాదించేవాడు లేకపోవడమువల్ల కర్మ చేయలేకపోయాడు. దానిని పూర్తిచేయడానికి వైశ్యజాతిని సృష్టించవలసి వచ్చినది. అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, త్రయోదశ విశ్వేదేవతలు, సప్త మరుత్తులు – ఈ గణములన్నీ వైశ్యదేవతలు. "స నైవ వ్యభవత్, స విశమసృజత।"

(బృ॥ 1-4-12). అప్పుడు కూడా అతడు సమర్థుడు కాలేదు; ఎందుకంటే, కర్మను పోషించేవారు ఎవ్వరూ లేకపోయారు. అప్పుడు శూద్రజాతిని సృష్టించాడు. ఇతడే పూషుడు. దీని అర్థము అందరినీ పోషించేవాడు. "స నైవ వ్యభవత్ స శౌద్రం వర్ణమసృజత పూషణమియం వై పోషేయ హీదం సర్వం పుష్యతి యదిదం కిం చ ।" (బృ॥ 1-4-13).

2) ఈ విధముగా నాలుగు వర్ణముల సృష్టి జరిగిన తరువాత కూడా అతడు కర్మచేసే సామర్థ్యమును పొందలేదు. ఎందుకంటే, క్షత్రజాతి ఉగ్రరూపము కలది; దానిని నియంత్రణ చేయాలి. అలాగే వారి వారి స్వభావదోషములను అనుసరించి, ఇతరులను కూడా నియంత్రణ చేయాలి. అందువల్ల వారికి ధర్మములను సృష్టించాడు. "స నైవ వ్యభవత్ తచ్ఛ్రేయో రూప మత్యసృజత ధర్మం।" (బృ॥ 1-4-14). ధర్మముకన్న గొప్పది ఏమీ లేదు. అందరూ దాని నియంత్రణములోనే ఉంటారు. అన్నిదేశములలోను, అన్ని కాలములలోను - అతి దుర్బలుడైన వ్యక్తికూడా, అధిక బలశాలియైనవాడిని - ఒకవేళ రాజునైనా సరే, ధర్మబలముతోనే ఓడించగలననే విశ్వాసముతో వుంటాడు. ధర్మమే సత్యము, సత్యమే ధర్మము. సత్యమంటే శాస్త్రముయొక్క అర్థము. దానిని ఆచరించేది ధర్మము. ఇందువల్ల, జ్ఞానానుష్ఠానరూపమైన ఈ ధర్మము, శాస్త్రజ్ఞులను, ఇతరులను కూడా బంధించి ఉంచుతున్నది. (బృ॥ 1-4-15). ఆ సమయములో, దేవతలద్వారా సృష్టించబడిన వర్ణములలో ఈ ధర్మము కలిసివుండేది. అందువల్ల దేవతలవలననే మానవులలో కూడా నాలుగు వర్ణముల సృష్టి జరిగినది. వీటన్నింటికీ, అగ్నిరూప బ్రాహ్మణుడు మూలము కనుక, ఇతని కర్మ అగ్నితోనే సంబంధించి వుంటున్నది; ఇంకా, బ్రాహ్మణుడు కర్మ చేయిస్తాడు. అందరితో మిత్రత్వము ఉన్నవాడే బ్రాహ్మణుడు - "మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే।" (మనుస్మృతి 2-87). ఇలా నాలుగు వర్ణములు భగవంతుడి సృష్టి. అందువల్లనే నష్టము కాక, ఇప్పుడూ ఉన్నది.

19-3) వర్ణధర్మము

1) సర్వజ్ఞుడైన పరమాత్ముడు, అందరి హృదయములలోనూ నివసిస్తూ వుంటాడు. తమ తమ సంస్కారములను అనుసరించి ఆయా వర్ణములలో జన్మను యిస్తాడు. ఈ వర్ణ వ్యవస్థమీదే సమాజము నిలబడి వున్నది. సమ - అజ, అనగా, బ్రహ్మతో సమానము గనుగ సమాజము అయినది. అందువల్ల, సమాజము బ్రహ్మమే. వర్ణములలో ఒకటి ఎక్కువకాదు - ఒకటి తక్కువ కాదు. అందరూ అన్నదమ్ములే. "అజ్యేష్ఠాసో అకనిష్ఠాసః ఏతే సంభ్రాతరః" (ఋగ్వేదమంత్రము). జన్మతో వచ్చిన గుణములను అనుసరించి పరమాత్మ అందరికీ వేదముల ద్వారా తమ ధర్మములను తెలియజేస్తున్నాడు. ఎంతవరకూ, అందరూ దానిని అనుసరించి నడుస్తారో, అంతవరకు ధర్మము వారిని రక్షిస్తూ వుంటుంది. ఎప్పుడైతే మోహలోభములకు వశులై ప్రజలు ధర్మచ్యుతి పొందుతారో, అప్పుడు జగత్తు క్షోభిస్తుంది. (గీ॥భా॥ 3-35).

శమము, దమము, తపము, శౌచము, క్షమ, సరళత్వము, శాస్త్రముమీద శ్రద్ధ, శాస్త్రజ్ఞానము, ఆత్మానుభవము - ఇటువంటి లక్షణములతో ఉండడమే బ్రాహ్మణ జన్మ ఉద్దేశ్యము. (గీ॥ భా॥ 18-42). ఎవరిలో ఈ గుణములు ఉండవో, వాళ్ళు బ్రాహ్మణ బంధువులు మాత్రమే. కాని, బ్రాహ్మణులు కారు - అని శ్రుతి వారిని నిందించింది. (ఛాం॥ 6-1-1). అధ్యయనము, అధ్యాపనము, యజ్ఞము, యాజనము, ప్రతిగ్రహము, దానము - ఇవి ఆరు బ్రాహ్మణుని కర్మలు. వేదాధ్యయనము, యజ్ఞము, దానము - ఇవి

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు ముగ్గురికీ సమానమే. – "అవిశిష్టో హి అధికారః త్రయాణాం వర్ణానాం।" (బృ॥ భా॥ 4–4–22). కాని, అధ్యాపనము, యాజనము, ప్రతిగ్రహము ఇవి మూడు కేవలము బ్రాహ్మణుని కర్మలు మాత్రమే. స్మృతి, పురోహితుడి లక్షణములను ఇలా చెప్పింది – "ఎల్లప్పుడూ ప్రియముగా మాట్లాడేవాడు, సరళముగా జీవించేవాడు, వడ్డీవ్యాపారము చేయనివాడు, ఓర్పు కలవాడు, ఎవరికీ ద్రోహము చేయనివాడు, సంకోచ స్వభావము కలవాడు, శమ–దమములు కలిగినవాడు మొదలైనవి ఆతని లక్షణములు. శ్రుతి ఇలా చెప్పినది : మేము పురోహితులము ఈ రాష్ట్రములో జాగ్రత్తతో వుందాము. – "వయం రాష్ట్రే జాగ్రియామ పురోహితాః।" (తై॥సంహిత॥1–4–10). అనగా, వారు వైదిక కర్మలలో నిరతులయి, మిగిలిన వారిని కూడా తమ తమ కర్మలలో నిరతులయేటట్లు చేయగలిగి వుండాలి. స్త్రీలకు వేదాధ్యయనములో అధికారము లేదు. పుత్రికకు గృహకృత్యములే పాండిత్యము – ఎందుకనగా వారికి వేదములో అధికారము లేదు కనుక – "దుహితుః పాండిత్యం గృహతంత్ర విషయమేవ; వేదే అనధికారాత్।" (బృ॥భా॥ 6–4–17). దీనికి కారణము – వేదము ద్వారా కర్తవ్యవిహితములుగా చెప్పబడిన నిత్య–నైమిత్తిక కర్మలను తన శరీరధర్మమువల్ల స్త్రీ చేయజాలదు.

3) క్షత్రియ కులములో పుట్టినవారికి, ఈ గుణములు చెప్పబడ్డాయి–శౌర్యము, దృఢత్వము, కష్టములలో ధైర్యము, అకస్మాత్తుగా వచ్చిన బాధ్యతలను నిర్మోహ భావముతో నిర్వహించుట, యుద్ధములో వెనుకాడకుండుట, దానము చేయుట, ప్రజలపై ప్రభుశక్తితో పరిపాలించే సమయములో ఈశ్వర భావముతో వుండుట – మొదలైనవి క్షత్రియ గుణములు. (గీ॥ భా॥ 18–43). పన్నులు ధనరూపముగా వసూలుచేసి, వానిని ప్రజలను రక్షించుటకు వినియోగించని రాజును స్మృతి గొప్ప పాపాత్ముడని అన్నది. వర్ణాశ్రమ ధర్మములను రక్షించేవాడు క్షత్రియుడు. తన పరివారముకన్న ప్రజలకు క్షేమము చేయడమే క్షత్రియుని ముఖ్యకార్యము.

4) వైశ్యుడు – వ్యవసాయము, గోసంరక్షణ, వ్యాపారము మొదలైన పనులు చేస్తాడు. సమాజములో ఇతడే ధనమును సంపాదించేవాడు. ఇతని వైదిక కర్మల గురించి ముందే చెప్పాము. (గీ॥ భా॥ 18–44).

5) శూద్రుడు పోషణము కోసము కర్మ చేస్తాడు. అతడు, పూష కులమువాడు. తనకోసము, సమాజము కోసము, ఆవశ్యకమైన వస్తువులను ఉత్పాదన చేయడము ఇతని వృత్తి. ముగ్గురు – నలుగురు బుద్ధిమంతులు గుణవంతులు అయిన శూద్రులను, రాజు తన మంత్రిమండలిలో చేర్చుకోవాలి అని రాజధర్మము చెప్తున్నది. శూద్రునికి లౌకిక విద్యలలో సంపూర్ణ అధికారం ఉన్నది. వైదిక కర్మలో లేదు. ఆయా కాలములలో మాత్రమే చేయదగిన వైదిక కర్మల నియమములకు, వీరు చేసే కర్మలకు సమన్వయము కుదరకపోవడమే దీనికి కారణము. ఇది వారి ఆధ్యాత్మిక ప్రగతికి ఏమీ బాధకము కాదు. త్రైవర్ణికులకు తమ ధర్మము వల్ల ఏ విధముగా చిత్తశుద్ధి ప్రాప్తిస్తున్నదో, అదే విధముగా శూద్రునికి కూడా తన ధర్మమువల్ల చిత్తశుద్ధి ప్రాప్తిస్తున్నది. అతనికి ఆత్మజ్ఞానము పురాణములద్వారా ప్రాప్తిస్తున్నది. ఆఖరుకు చెప్పేది ఇది – వేదాంత శాస్త్రములో ఏతత్త్వమును తెలియచెప్పారో, ఆ తత్త్వమునకు వర్ణభేదముగాని, ఆశ్రమభేదముగాని ఏమీలేదు. ఇందువల్ల, అద్విజుడైన విదురుడు, ధర్మవ్యాధుడు, నాయన్మారులు, ఆళ్వారులు మొదలైనవారందరూ బ్రహ్మజ్ఞానులై ప్రసిద్ధిపొందారు. (అధ్యా॥ 2,6).

19-4) ఆశ్రమ ధర్మములు :

బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సంన్యాసము - ఇవి నాలుగు ఆశ్రమములు. ఉపనీతుడైన బ్రహ్మచారి, తల్లిదండ్రులను విడచి, ఆచార్యుని దగ్గరే సేవ చేస్తూ వుండి, విద్యార్జన చేయాలి. అది పూర్తయిన తరువాత, ఆచార్యునికి గురుదక్షిణ యిచ్చి, అతని అనుమతితో తిరిగి యింటికి వచ్చి, గృహస్థుడు కావాలి. తనకు ఏ వైదిక కర్మలు చెప్పారో, వర్ణానుగుణముగా వాటిని ఆచరిస్తూ జీవనము గడపాలి. ఎప్పుడైతే మనుమడు పుడతాడో, తన పుత్రుడు అతని పుత్రునికి పరంపరాగత సంస్కారములను బోధిస్తూ వుంటాడో, అప్పుడు, వానప్రస్థుడు కావాలి. వానప్రస్థములో శరీరమును శుష్కింప చేయడమే ముఖ్యమైన తపస్సు; దాని తరువాత సంన్యాసి కావాలి. సంన్యాస ధర్మములు విస్తారముగా చెప్పే వున్నాము.

19-5) కర్మ :

వేదములలో నాలుగు విధముల కర్మలు చెప్పబడ్డాయి.

1) నిత్యకర్మలు : ఈ కర్మలు ప్రతిదినము - సమయానుసారముగా, విధిపూర్వకముగా చేస్తూ వుండవలసినవి. వీని జ్ఞానము బ్రహ్మచర్య అవస్థలోనే తెలుస్తున్నది. గృహస్థాశ్రమములో ప్రవేశించక ముందే మానవుడు - బ్రహ్మచర్య విషయములో ఋషులకు, యజ్ఞవిషయములో దేవతలకు, ప్రజల విషయములో పితృదేవతలకు ఋణపడి వుంటాడు. ఈ ఋణముల నుండి విముక్తుడు అవడమే ఈ కర్మల ఉద్దేశ్యము. (బృ॥ భా॥ 1-4-10). వీటిలో దేవయజ్ఞము, ఋషియజ్ఞము, పితృయజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము అని 5 అంగములు ఉన్నవి. శ్రుతి ఈ కర్మల ఫలితమును చెప్పలేదు. కాని, మీమాంసకులు చెప్పారు. ఈ కర్మలను చేయకపోవడము వల్ల 'ప్రత్యవాయము' (దోషము) కలుగుతుంది అని. (అధ్యా॥ 5-7). అది సరికాదు. 'చేయలేదు' అనే అభావరూపమువల్ల, భావరూప దోషము రాదు. కాని, ఆ కర్మలను చేయకపోవడమువల్ల, ఇతరమైన చేయనక్కరలేని కర్మలను చేస్తూ వుంటాడు. వానివల్ల దోషము వస్తుంది. నిత్యకర్మలవల్లనైతే పుణ్యము రానే వస్తున్నది.

2) నైమిత్తిక కర్మ : ఇది విశేష నిమిత్తములు వచ్చినప్పుడు చేయవలసిన కర్మ. గ్రహణము సమయములో చేసే కర్మ, పితృశ్రాద్ధము, తర్పణము మొదలైనవి. వీటిలో కూడా పుణ్యఫలము వున్నది. వీటిని కూడా ఆయా కాలములలో చేయాలి.

3) కామ్యకర్మ : ఏదైనా కామ్యముతో, శ్రుతిని అనుసరించి చేసే కర్మలు - కామ్యకర్మలు. పుత్రులకోసము చేసే పుత్రకామేష్టి, రాజ్యాధికారము కావాలని చేసే సాంగ్రహణ్యేష్టి-"సాంగ్రహణ్యేష్ట్యా యజతే ఇమాం జనతాం సంగృహ్ణానీతి।" (తై॥బ్రా॥3-8-1) స్వర్గప్రాప్తికి చేసే జ్యోతిష్టోమము-"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత।" (తాండ్య బ్రాహ్మణము 16-3-3), మొదలైనవాటిని కామ్యకర్మలు అంటారు.

4) ప్రతిషిద్ధ కర్మ : ఇది నిషిద్ధ కర్మ. "తస్మాత్ బ్రాహ్మణః సురాం న పిబతి పాప్మనా నేత్సంసృజ్యా ఇతి" (కాఠక సంహిత 12-12)-పాపాలు తనను అంటకూడదనే భావనతో బ్రాహ్మణుడు మద్యపానమును చేయడు. "నాప్సు మూత్ర, పురీషం కుర్యాత్ న నిష్ఠీవేత్ న వివసనః స్నాయాత్।" - నీటిలో మల-మూత్ర విసర్జనము కూడదు. ఉమ్మివేయ కూడదు, నగ్నముగా స్నానము చేయరాదు, మొదలైనవి నిషిద్ధములు.

(యజురారణ్యకము 1-112). ఇవి చేయడమువల్ల పాపము నిశ్చయము.

19-6) కర్మతో మోక్షము వస్తుందా?

ఈ భాగములో ప్రశ్నోత్తరముల ద్వారా కర్మతో మోక్షము రాదని చెప్పడము అయినది.

1) ఇదివరకు ఇలా చెప్పాము – మోక్షము నిరతిశయ సుఖము. మిగిలిన సుఖములు పుణ్యఫలములు. అందువల్ల, అత్యధిక పుణ్యకర్మలవల్ల మోక్షము ప్రాప్తిస్తుందా?

ఎంత పుణ్యకర్మ వుంటుందో, అంతే సుఖము వుంటుంది. అందువల్ల, అధిక పుణ్యకర్మ ఎంతో ఎక్కువయిన పుణ్యలోకప్రాప్తిని ఇస్తున్నది. అయినా, ఆ పుణ్యకర్మ అయిపోగానే ఆ పుణ్యలోకములను విడిచిపెట్టి రావాలి. అలాంటి పరిస్థితిలో పుణ్యకర్మలవల్ల వచ్చిన సుఖము అనిత్యము అని తెలుస్తున్నది. అవి నిత్యసుఖమైన మోక్షమును ఇవ్వలేవు.

2) ప్రతిషిద్ధ కర్మలను చేయకపోవడమువల్ల పాపము పోతున్నది. కామ్యకర్మలను విడిచిపెట్టడమువల్ల పుణ్యము దూరమవుతున్నది. నిత్య నైమిత్తిక కర్మలను చేయడమువల్ల ప్రత్యవాయదోషము రాదు. ఇలా చేయడమువల్ల మోక్షము ప్రాప్తిస్తున్నదా?

ఈ విధముగా కర్మలు చేస్తున్నవారికి కూడా వారి పూర్వజన్మలలో చేసిన సంచితకర్మ ఆధారముగా జన్మలు ఎత్తవలసే వుంటున్నది. ఇప్పుడు చేస్తున్న నిత్యనైమిత్తిక కర్మలవల్ల వచ్చిన పుణ్యముతో కూడా జన్మలను పొందాలి. ఇందువల్ల ఈ విధమైన కర్మానుష్ఠానముతో మోక్షము రాదు.

3) ఈ జన్మలో చేసిన నిత్యనైమిత్తిక కర్మలవల్ల సంచిత కర్మలు నశించవా? అలా నశిస్తే మోక్షము ప్రాప్తిస్తున్నదా?

ఒకవేళ అలా జరిగితే మోక్షము వస్తుంది. కాని, నిత్యకర్మల పుణ్యము సంచితకర్మలలోని పాపమును నశింపచేస్తున్నది; పుణ్యమును నశింపచేయదు. ఇంకా, పుణ్యము పెరుగుతుంది. అందువల్ల ఈ కర్మలవల్ల మోక్షము సిద్ధించదు.

4) అవిద్యా నాశనమువల్ల మోక్షము వస్తుందని చెప్పబడినది కదా! నిత్యకర్మలు అవిద్యను నశింపచేయలేవా?

నిత్యకర్మలు అలా చేయలేవు. ఎందుకనగా, నిత్యకర్మలకుగాని, ఇతర ఏ కర్మలకుగాని అవిద్యతో విరోధము లేదు. అవి ఒకదానికి ఇంకొకటి పూరకము.

5) శ్రుతి నిత్యకర్మల ఫలమును చెప్పలేదు. అందువల్ల వాటికి ఫలము మోక్షమే అవుతున్నదా?

కర్మఫలము ఏదైనా అది అనిత్యము అవడమువల్ల, మోక్షము నిత్యము కనక, కర్మల ఫలము మోక్షము కాదు.

6) కనీసము చిత్తనిరోధమనే మానసిక కర్మకు మోక్షఫలము వస్తుందా? – "చిత్తవృత్తి నిరోధస్య వేదవాక్య జనిత ఆత్మవిజ్ఞానాత్ అర్థాంతరత్వాత్ తన్త్రాంతరేషు చ కర్తవ్యతయా అవగతత్వాత్ విధేయత్వమితి చేత్?"

అలా రాదు. బ్రహ్మాత్మవిజ్ఞానము తప్ప వేఱే ఏ విధినీ మోక్షమునకు సాధనముగా శ్రుతి చెప్పలేదు. కాని, ఆత్మవిజ్ఞాన స్మృతి సంతానముతో చిత్తవృత్తి నిరోధము తనకు తానే అవుతున్నది – "న హి ఆత్మవిజ్ఞాన తత్స్మ ృతి సంతాన వ్యతిరేకేణ చిత్తవృత్తి నిరోధస్య సాధనమస్తి...న తు బ్రహ్మవిజ్ఞాన వ్యతిరేకేణ అన్యన్మోక్షసాధనమ్ అవగమ్యతే।" (బృ॥ భా॥ 1-4-7). ఈ విధముగా చిత్తవృత్తి నిరోధము, ఆత్మవిజ్ఞాన స్మృతి సంతానమునకు ఫలము. అంతేగాని ఆత్మవిజ్ఞానమునకు చిత్తవృత్తి నిరోధము సాధనము కాదు.

ఇంతగా చెప్పిన తరువాత, మోక్షమార్గములో కర్మయొక్క స్థానము చెప్పవలసి వున్నది. కామ్యకర్మలవల్ల స్వర్గాదులు వస్తాయి; కాని మోక్షము రాదు; ఇది ముందే నిశ్చయమయినది. ప్రతిషిద్ధ కర్మము తప్పక నరకమునకు తీసుకుపోతున్నది. కాని, నిత్యనైమిత్తిక కర్మ నిష్కామముగా – అనగా, "నేను కేవలము భగవంతుని దాసుడను, అతడు వేదములద్వారా ఏ విధమైన నిత్యకర్మ చేయమని నిర్ణయించాడో, అదే విధముగా ఆ కర్మ చేస్తూ వుండడము నా కర్తవ్యము." – ఈ విధమైన నిష్కామభావముతో చేస్తూ వుంటే, వానికి చిత్తశుద్ధి కలుగుతుంది. యోగులు, సంగమును విడచి, ఆత్మశుద్ధికోసము కర్మచేస్తూ వుంటారు– "యోగినః కర్మ కుర్వంతి సఙ్గం త్యక్త్వాత్మశుద్ధయే।" (గీ॥ 6-11). చిత్తము ఎంతగా శుద్ధమవుతూ వుంటే, వేదాంత అర్థము అంతగా మనస్సుకు పడుతుంది. జ్ఞానము వృద్ధి చెందుతుంది. అంటే, శాస్త్రవిహిత నిష్కామకర్మ, సాక్షాత్తు మోక్షప్రాప్తిని కలిగించకపోయినా, మోక్షకారణమైన జ్ఞాన ఉత్పత్తికి సహకారి అవుతుంది. (సూ॥ భా॥ 3-4-26).

19-7) మోక్షమార్గము ఒకటా? అనేకమా?

నిష్కామముగా చేసే నిత్యనైమిత్తిక కర్మలు జ్ఞానోత్పత్తికి అనివార్యములని మనకు తెలిసినది. అనగా, ఈ ప్రకారము కర్మ చేయనివారికి జ్ఞానప్రాప్తి ఏమాత్రమూ కలుగదు. "న కర్మణామనారంభాన్నైష్కర్మ్యం పురుషో¬శ్నుతే।" (గీ॥ 3-4). కాని, నేటి వక్తలు కొందరు మోక్షమునకు జ్ఞానమార్గము, కర్మమార్గము, భక్తి మార్గము మొదలైన అనేక మార్గములు వున్నవి. నీవు ఏ మార్గములోనైనా వెళ్ళవచ్చు' అని చెప్తున్నారు. వారికి సిద్ధాంతము తెలియదు.

మోక్షమునకు ఒకటే మార్గము వున్నది. ఇంకొక్కటి లేదు. నాన్యః పంథా అయనాయ విద్యతే । (తై॥ ఆ॥ 3-12-14). కర్తృత్వబుద్ధితో వున్న అజ్ఞానులు – తమ కర్మలను చేస్తూపోవడము ఈ మార్గములో ప్రథమ సోపానము. ఈ సోపానము కర్మమార్గము. ఈ కర్మలవల్ల కలిగిన చిత్తశుద్ధి యొక్క బలముతో, కర్మలను విడచి సదా భగవంతుని చింతనతో శ్రవణ – మనన – నిధిధ్యాసనలతో సమయము గడుపుతూ వుంటాడు. ఇది మోక్షమార్గములో రెండవ సోపానము. ఇది జ్ఞానమార్గము. ఈ రెండు నిష్ఠలు లేకుండా, మూడవమార్గము ఏదీ లేదు – "లోకే¬స్మిన్ ద్వివిధా నిష్ఠా, పురాప్రోక్తా మయానఘ। జ్ఞానయోగేన సాంఖ్యానాం, కర్మయోగేన యోగినామ్।" (గీ॥ 3-3). ఈ విధముగా మోక్షము – జ్ఞానముచేతనే పొందదగినది. ఇంక దేనివల్ల కాదు. ఎవరో ఒకరు తన జీవితమంతా కర్మమార్గములో వుండగలరు. ఇంకా ఒకరు జ్ఞానమార్గముతోనే తమ యాత్ర ప్రారంభించవచ్చు. దీనివల్ల ఇవి రెండూ స్వతంత్ర మార్గములు అని అర్థము చేసుకోరాదు. ఎందుకంటే, గతజన్మల కర్మల ఫలితముగానే, ఇప్పుడు జ్ఞానమార్గములో వెళ్ళేవారికి బలము వస్తుంది అని శాస్త్రము చెప్తున్నది. కర్మలలోనే లిప్తుడైవుండే వాడికి మోక్షము రాదు అని కూడా శాస్త్రము చెప్తున్నది.

ఇంకా కొంతమంది – జ్ఞానమార్గముకాక మోక్షమునకు భక్తిమార్గము కూడా ఉన్నది – అంటున్నారు. ఇది పూర్తిగా అసంబద్ధము. ఎందుకనగా, వాసనాదూషితమైన భక్తితో రావణుని వంటి వారు కూడా మోక్షవిరుద్ధమైన కామ్యములను మాత్రమే పొందారు. భక్తి లేకుండా కర్మయోగము కూడా సంభవము కాదు. జ్ఞానయోగము కూడా సాధ్యము కాదు. ఈ రెండూ విడచి, కేవలము భక్తితో మోక్షప్రాప్తి అనే మాట భక్తిశాస్త్రమునకు కూడా విరోధి. "యః స్వధర్మం పరిత్యజ్య భక్తిమాత్రేణ జీవతి। న తస్య తుష్యతే విష్ణుః ఆచారేణైవ తుష్యతి।" – ఎవరైతే స్వధర్మమును విడచి, భక్తిమార్గముతోనే జీవితమును గడిపివేస్తారో, వారి విషయములో విష్ణువు తృప్తిపడదు. స్వధర్మాచరణముతోనే తృప్తి పడతాడు. (నారద పురాణము). ఈ హెచ్చరికను పరమ భాగవతోత్తములైన నారదులే చెప్పారు. అందువల్ల, ఇలా భక్తి ఒక్కటే చాలు, ఇంకేమి అక్కరలేదు అని చెప్పడము – కర్మలో నిర్లక్ష్యము, అశ్రద్ధ, ఆలస్యము (బద్ధకము), అజ్ఞానము, వీటికి గుర్తు అవుతున్నది. వైదిక కర్మలలో ఎవరికి అధికారము లేదో వారికి భక్తిమార్గము మోక్షప్రాప్తి కలిగిస్తున్నదని చెప్పడము కూడా పద్ధతి కాదు. కారణము, ఇటువంటి వారికి కూడా వారికి తగిన వేఱే ప్రకారమైన పూజలు – జపములు మొదలైనవి చెప్పారు. అవే వారి కర్మలు – "పురుషమాత్ర సంబంధిభిః జపోపవాసదేవతారాధనాదిభిః ధర్మవిశేషైః అనుగ్రహో విద్యాయాః సంభవతి।" (సూ॥ భా॥ 3–4–38).

19–8) భక్తి

భక్తి సామాన్య ధర్మము. భక్తి లేనివాడు నాస్తికుడు. వాని విషయములో ఇప్పుడు చర్చ చేయవలసిన అవసరము లేదు. ముముక్షువు కానటువంటి ఆస్తికునిలో కూడా భక్తి వుంటున్నది. దుఃఖములో వుండే ఆస్తికుడైన 'ఆర్తుడు'; ఎక్కువగా సుఖసంపత్తిని కోరే ఆస్తికుడైన 'అర్థార్థి' కూడా భక్తులే. సుఖ–దుఃఖ ద్వంద్వములను తరించాలనే ఇచ్ఛగలిగి భగవంతుని స్వరూపమును తెలుసుకోవాలనే ఇచ్ఛ వున్న 'జిజ్ఞాసు'వు కూడా భక్తుడే. ఇంతేకాక, అతనిని తెలుసుకున్న 'జ్ఞాని' కూడా భక్తుడే. 'భక్తి' అంటే మానవుని హృదయములో వుండే ప్రేమ. ఈ ప్రేమ సాధారణముగా పతి–పత్ని, పుత్రులమీద వుంటున్నది. అది భగవంతుని మీద, గురువుమీద వుంటే దానిని 'భక్తి' అంటారు. శ్రవణ, భజన, స్మరణ, నమస్కారాద్యాచరణముల వల్ల భక్తి అభివృద్ధి చెందుతుంది. మెల్లమెల్లగా జగద్వ్యవహారములో అతనికి రుచి పోతుంది; అదే వైరాగ్యము. దాని తరువాత శాస్త్ర శ్రవణ–మనన–నిదిధ్యాసనములతో జ్ఞానము పొందగలడు. ఈ విధముగా భక్తితో సంసారములో వైరాగ్యము, వైరాగ్యముతో జ్ఞానము పొందగలడు. ఏ విధముగా కర్మఫలము భగవంతుని అధీనమో, అదే విధముగా జ్ఞానఫలము కూడా భగవంతుని అధీనమే. –"మదధీనం కర్మిణాం కర్మఫలం జ్ఞానినాం చ జ్ఞానఫలం।" (గీ॥ భా॥ అధ్యా॥ 15 యొక్క సంబంధ భాష్యము). ఇందువలన ముముక్షువునకు భగవంతునిపై భక్తికన్న అన్యమార్గము లేదు.

ఇప్పుడు జ్ఞానికి భక్తి ఎలా వుంటున్నదో దానిని వివరిస్తాము. ఎవరైతే, తన లోన – బయట అంతటా వాసుదేవుడినే చూడగలడో, అతడు – ఆర్తాది భక్తులందరి కన్న శ్రేష్ఠుడు. అటువంటి మహాత్ముడు దుర్లభుడు. "వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః। (గీ॥ 7–11). "తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిర్విశిష్యతే।" (గీ॥ భా॥ 7–17). ఎందుకనగా, అతడు బ్రహ్మకంటె వేఱే తానొక్కడున్నాడని అనుకోను కూడా అనుకోడు; అందువల్ల, అతడు వాసుదేవుడే అయి వుంటాడు – "జ్ఞానీత్వాత్మైవ మే మతమ్।" (గీ॥ 7–18). ఇటువంటి జ్ఞానము భక్తికి పరాకాష్ఠ. ఇటువంటి భక్తుడు, జిజ్ఞాసువుగా ఉన్న స్థితిలో ఏ భక్తిని ప్రకటిస్తున్నాడో అది

ఇప్పుడు అతనిలో కనపడదు. ఎందుకనగా, అప్పుడు ద్వైత భావముతో ఉన్నాడు; ఇప్పుడు అది అతనిలో లేదు. ఇలాంటివానికి భక్తి ఏ విధముగా వుంటున్నదని సామాన్య మానవునికి సందేహము వస్తున్నది. అతనికి, యిప్పుడు ద్వైత భావము లేకుండా కేవలము పరమాత్మ స్వరూపముతో ఒక్కటిగానే ఉంటున్నది. ఒక దృష్టాంతముతో ఇది స్పష్టమవుతున్నది. పరమేశ్వరునితో వివాహము కోసము పంచాగ్ని మధ్యములో తపస్సుచేసిన గిరిజాదేవి జిజ్ఞాసువు; అయితే, తన తపోబలముచేత పరమేశ్వరునిలో ఒక్కటైన పరమేశ్వరి జ్ఞాని అయినది.

సాధనా ప్రకరణముయొక్క తాత్పర్యము

ప్రారబ్ధానుసారము శారీరక వ్యవహారములు చేస్తూ వున్నా, తన శరీరము మీద 'నేను' అనే అధ్యాస లేకుండా, అందరిలోనూ తన ఆత్మలోనూ వున్నది బ్రహ్మమే అని అనుకునే సర్వాత్మభావమే మోక్షము. ఈ జ్ఞానము, శ్రుతి చెప్పిన శ్రవణ మనన నిదిధ్యాసములతో వస్తున్నది. కర్మతో గాని, ఇంక ఏ సాధనములతోగాని రాదు. ఇది హృదయగతమగుటవలన చిత్తశుద్ధి అవసరము. ఏ విధముగా మోక్షము జ్ఞానమువల్లనే ప్రాప్తిస్తున్నదో – అలాగే, చిత్తశుద్ధి గృహస్థునకు నిష్కామకర్మవల్ల, వివిదిషా సంన్యాసికి నిష్కామ ఉపాసనవల్ల –ప్రాపిస్తున్నది. జ్ఞానములో, కర్మలో భక్తి కలసే వుంటుంది. అందువల్ల భక్తియోగము మోక్షమునకు ఇంకొక వేఱే మార్గము కాదు.

ప్రశ్నలు :

1. మోక్షము దేని ఫలము?
2. మోక్షమునకు కర్మతో ఏమీ లాభములేదని ఎందుకు చెప్పరాదు?
3. సుఖ–దుఃఖముల కారణములను ఎవరూ ఎందుకు నిశ్చయము చేయ్యలేరు?
4. జీవుని శ్రేయోమార్గమును ఏ ప్రమాణముతో తెలుసుకోవాలి? ఎందుకు?
5. వర్ణముల సృష్టి ఎలా జరిగినది?
6. ధర్మము యొక్క సృష్టి ఎందుకు జరిగింది?
7. సమాజము అంటే ఏమిటి?
8. బ్రాహ్మణునికి సహజకర్మలు ఏవి?
9. పురోహితుని లక్షణములను స్మృతి ఎలా చెప్పినది?
10. క్షత్రియుని స్వాభావిక కర్మలు ఏవి?
11. వైశ్యుని వృత్తులు ఏవి?
12. శూద్రుడు ఏఏ కర్మలు చేయాలి?
13. ఆశ్రమములు ఎన్ని? వాని ధర్మములు ఏమిటి?

14. ప్రతిషిద్ధ కర్మలు విడిచిపెట్టి, నిత్య-నైమిత్తిక కర్మలు చేస్తూ వుంటే మోక్షము ఎందుకు రాదు?
15. చిత్తశుద్ధి ఎలా అవుతున్నది?
16. కర్మతో మోక్షము ఎందుకు ప్రాప్తించదు?
17. మోక్షమార్గము యొక్క సోపానములు ఏవి?
18. భక్తిమాత్రముతోనే మోక్షం ప్రాప్తిస్తున్నది అన్నమాట ఎందుకు సరికాదు?
19. భక్తి అంటే ఏమిటి? భక్తితో మోక్షము ఎలా ప్రాప్తిస్తున్నది? జ్ఞానిలో భక్తి ఏరూపముగా వుంటుంది?

ఉపసంహారము

మేము ఏది చెప్పాలనుకున్నామో అది చెప్పేశాము. ఇదే సమగ్ర వేదాంతము యొక్క సారాంశము. వీటినన్నిటినీ ఒకసారి సింహావలోకనము చేయడమువల్ల విషయము బాగా స్పష్టము అవుతుంది, జ్ఞాపకము కూడా వుంటుంది. ఇప్పుడు ఈ సారాంశము యొక్క సారమును చెప్తున్నాము.

ఇందులో విషయము – జగత్తు, బ్రహ్మ, జీవుడు వీరి నిజస్వరూపమును స్పష్టము చేయడము. వీనిని తెలియడమువల్ల లాభము, మోక్షము. దానిని పొందడము అందరికీ సాధ్యము కాదు. దానికి 'అధికార'మనే యోగ్యత కావాలి. (అధ్యా॥ 1). నిత్యానిత్య వస్తువివేకము, వైరాగ్యము, శమాదులు, ముముక్షుత్వము – ఇవి మోక్షప్రాప్తి పొందగలిగే 'అధికారి' లక్షణములు. మోక్షప్రాప్తిలో జాతి–లింగము మొదలైన భేదములు ఏమీలేవు. (అధ్యా॥ 2). ఇన్ని గుణములు వున్నా సద్గురువు యొక్క సహాయము లేకుండా, స్వతంత్రముగా మోక్షమునకు ప్రయత్నము చేయకూడదు. ఎంత బుద్ధిమంతుడైనా, శాస్త్ర పరిజ్ఞానము వున్నా, అలా చేయరాదు. గురువుకు, అనివార్య గుణ–పరంపర, శాస్త్రజ్ఞానము కూడా వుండాలి. ఇటువంటి గుణములు కలిగిన గురువును, ముముక్షువు వెదకాలి; ఇది అతని కర్తవ్యము. అటువంటి సద్గురువు భగవత్కృపవల్లనే దొరుకుతాడు. ఒకవేళ, దౌర్భాగ్యమువల్ల అయోగ్యుడైన గురువు దొరికినట్లయితే, ఎప్పుడు ఆ సత్యము తెలుస్తుందో, అప్పుడే అతనిని విడిచిపెట్టాలి. (అధ్యా॥ 3). గురువు ఆగమ ప్రమాణముతోనే శాస్త్రమును నేర్పిస్తాడు. ప్రత్యక్ష–అనుమాన–ఉపమాన–అర్థాపత్తులనే ప్రమాణములతో ఏ ప్రకారముగానూ ఆత్మస్వరూపము నిశ్చయము అవదని చెప్తాడు; ఆగమములు, అపౌరుషేయములు గనుక, ధర్మాధర్మములు – ప్రకృతికి అతీతమయిన విషయములు, వేదముల ద్వారానే నిర్ధారణ చేయబడతాయి. (అధ్యా॥4).

పూర్వము ప్రతిపాదింపబడిన జగత్తుయొక్క సత్యమైన స్వరూపము బ్రహ్మమే. ఇందువల్ల అది వేదములద్వారానే నిశ్చయింపబడుతున్నది. అంటే, అది ప్రత్యక్షాది ప్రమాణముల పరిధిలోనికి రాదు. అయినా, వేదాంత విరోధులయిన నాస్తికులు మొదలైన సిద్ధాంతులు, దానిని అనుమానాది ప్రమాణముల ద్వారా నిర్ధారణ చేయాలని ప్రయత్నము చేస్తున్నారు. వాటిలో ఏదీ ఉచితముగా లేదు. వైదికులైనప్పటికీ, మీమాంసకులు ఇలా చెప్తున్నారు. – 'జగత్తు అనాది. ఇది సృష్టింపబడలేదు'. కాని, ఇది కూడా సరియైనది కాదు. అందువల్ల, శ్రుత్యనుసారమే ఈ విషయము నిర్ణయము చేయడము జరిగినది. (అధ్యా॥ 5).

బ్రహ్మ జగత్తుకు అభిన్న నిమిత్తోపాదాన కారణమని శ్రుతి చెప్తున్నది. ఈ విషయము వేదాంత శాస్త్రమునకు ప్రాణము వంటిది కనుక జాగ్రత్తగా తెలుసుకోవాలి. సృష్టికి ప్రథమమున కేవల బ్రహ్మమే వున్నది. అందువల్ల, ఇప్పుడు అనుభవమునకు వస్తున్న అంతటికీ, బ్రహ్మమే ఉపాదానము, ఇంకేదీ అవడానికి వీలులేదు. అప్పుడు, జగత్తుయొక్క సత్యస్వరూపము బ్రహ్మమేనని నిశ్చయము అవుతున్నది. బ్రహ్మ కారణము – జగత్తు దాని కార్యము. ఈ కార్య–కారణ సంబంధము చాలా చమత్కారముగా వున్నది. ముముక్షువునకు చాలా జాగ్రత్తగా బోధపరచే ఉద్దేశ్యముతో దీనిని ప్రత్యేక ఆవరణములలో స్పష్టముగా చూపించాము. ఇవన్నీ యుగళవాక్యములు. వీటిని మళ్ళీ మళ్ళీ మననము చేయడము శాస్త్రజ్ఞానమునకు అవసరము. (అధ్యా॥ 6). బ్రహ్మ, జగత్తుకు అభిన్న నిమిత్తోపాదాన కారణమని వేదాంత సిద్ధాంతము చెప్తున్నది. ఈ సిద్ధాంతమునకు విరోధులైన ప్రాచీనుల, ఆధునికుల, భవిష్యద్విద్వాంసుల అన్ని ప్రశ్నలకూ ఇందులో సమాధానము దొరుకుతుంది. అవన్నీ చాలా దీర్ఘమైన సమాసములు; కాని, 'ఉపాధి' అనే పారిభాషిక

శబ్దమును ప్రయోగము చేసి, వీటిని సంక్షేపముగా చెప్పాము. బ్రహ్మకు, కార్యరూపి జగత్తు ఉపాధి; కార్యము కేవలము వాచారంభణ నామధేయము మాత్రమే. ఈ జగత్తు కారణ బ్రహ్మలో లేదు; కాని జగత్తులో బ్రహ్మ ఉన్నది. (అధ్యా॥ 7).

బ్రహ్మకు ఒక చిహ్నమూ లేదు. కాని జగత్తులో అనేక చిహ్నములు ఉన్నవి. పైన చెప్పిన బ్రహ్మ ఈ విధమైన జగత్తుకు కారణము అయితే, ఆ రెండింటికీ మధ్య ఏదో ఒక విచిత్రమైన శక్తి ఉండవలసి వస్తున్నది. అదే, 'మాయ'. అది బ్రహ్మ స్వరూపమును దాచి, దానిని అన్యరూపముతో ప్రకటించే బ్రహ్మ శక్తి. ఇది త్రిగుణాత్మిక మరియు పరిణామి నిత్యము. కార్యదృష్టితో చూస్తే కార్యముగా, కారణదృష్టితో చూస్తే కారణముగా కనపడుతున్నది. ఇందువల్ల, ఇది అనిర్వచనీయము. కాని, తన స్వరూపములో ఇది బ్రహ్మకంటె వేఱు కాదు. (అధ్యా॥8).

ఈ విధముగా, జగత్తు యొక్క స్వరూపము బ్రహ్మగా సిద్ధమయిన తరువాత, బ్రహ్మ స్వరూపమును తెలుసుకోవలసి వున్నది. జగత్తులోనే వర్తమానమయి వుండడమువల్ల దానిని యిక్కడే వెదుకవలసి ఉన్నది. అంతకంటె మనకు ఇంకొక మార్గము కూడా లేదు. కాని, దాని స్వరూపములో ఏ వికారములు లేవో అవి జగత్తులో ఉన్నవి. ఈ వికారములకు అన్యముగా బ్రహ్మను తెలుసుకోవలసి ఉన్నది. మొదట బ్రహ్మను దాని విశేషణములతోను, తరువాత దాని లక్షణములతోను బోధించడము అయినది. దానికి సర్వజ్ఞత్వాది విశేషణములు – సత్యత్వాది లక్షణములు ఉన్నవి. విశేషణములకంటె, లక్షణములు స్వరూపమునకు దగ్గరగా వుంటాయి.

ఇక్కడ, కార్యకారణానన్యత్వ న్యాయమును సూక్ష్మ విచారణ చేసి, సత్యము–అసత్యము, అనిర్వచనీయత్వము, మిథ్య, వీటిని ప్రత్యేక అర్థములతో స్పష్టము చేయడమయినది. బ్రహ్మ సంబంధము లేని జగత్తు మిథ్య; ఇది కార్య–కారణానన్యత్వ న్యాయములోని ఉత్తరార్ధవాక్యములో చెప్పిన జగత్తు. ఇది అనిర్వచనీయము కాదు. పూర్వార్ధ వాక్యములో చెప్పిన కార్యము అసత్యము, అనిర్వచనీయము అవుతున్నది. దృశ్య జగత్తు ఇదే. జిజ్ఞాసువు శాస్త్రము ద్వారా దీనిని బ్రహ్మాభిన్నము అని వింటాడు. కాని, తన పూర్వ వ్యవహార దృష్టితో బ్రహ్మకంటె భిన్నమనే అనుకుంటాడు. ఇలా ఉండడమువల్ల భాష్యకారులు జగత్తును అనిర్వచనీయమని చెప్పారు. ఇది జిజ్ఞాసువు సంశయ జ్ఞానమునకు విషయము.

ప్రశ్న : రజ్జువును చూడగానే, "ఇది రజ్జువా, సర్పమా? అనే సంశయ జ్ఞానమునకు, ఈ సంశయ జ్ఞానమునకు తేడా ఏమిటి?

సమాధానము : రజ్జువును పరీక్షించిన తరువాత 'ఇది సర్పము కాదు – సర్పము లేనే లేదు. రజ్జువు ఒక్కటే వున్నది' అని తెలుస్తున్నది. ఈ సర్పము మిథ్య. అనిర్వచనీయము కాదు. శాస్త్రము ద్వారా జగత్తును పరీక్షించిన తరువాత నిశ్చయము అవుతున్నది – 'జగత్తు బ్రహ్మతో భిన్నము కాదు; ఎప్పుడూ భిన్నముగా లేదు కూడా. పరిణామము (పరివర్తన) జరుగుతున్నా కూడా ఎప్పుడూ బ్రహ్మమే, ఇందువల్ల బ్రహ్మము ఒక్కటే వున్నది.'

బ్రహ్మ లక్షణములలో చెప్పబడిన జ్ఞానము – మామూలు వాడుక మాటలతో చెప్పే జ్ఞానముకన్న వేఱైనది. అది కేవలము జ్ఞప్తి. ఇది మననము చేసిన తరువాత తెలుస్తున్నది. (అధ్యా॥ 9).

బ్రహ్మ విషయములో విశేషణములు – లక్షణములు చెప్పి, దాని స్వరూపమునకు చాలా దగ్గరగా తీసుకువెళ్ళిన తరువాత కూడా దాని స్వరూపము తెలియడము జరగదు; కారణము – అది నూటికి నూరుపాళ్ళు లక్షణరహితము కనుక తెలియబడదు. ఈ విధమైన ఏ ప్రయత్నముతో గాని చెప్పబడదు – తెలుసుకోబడదు. ఏ ఏ చిహ్నములద్వారా, మాటలద్వారా తెలియజెప్పడానికి ప్రయత్నము చేస్తామో, వాటన్నిటికి అదే ఆత్మ కనుక – అది పూర్తిగా అలక్షణము. ఇందువలన, దానిని 'స్థూలారుంధతీ న్యాయము'తోనే చెప్పాలి. ఇది ఎలాగంటే – చాలా చిన్న నక్షత్రమును చూపించడానికి, కిటికీ ద్వారా పెద్దచెట్టును, ఆ చెట్టుకొమ్మమీదుగా పెద్ద నక్షత్రమును చూపి, ఆ నక్షత్రము ప్రక్కన ఉన్న చిన్న నక్షత్రమువైపు దృష్టిని మళ్ళించి చూపించాలి. ఇలాగే బ్రహ్మను కూడా తెలియపరచాలి; ముందువచ్చే విచారణను తెలుసుకున్న తరువాత, వెనుకటి విచారణను నిరాకరణ చేస్తూ ముందుకు వెళ్ళే క్రమమునే అధ్యారోప – అపవాదము అంటారు. ఇక్కడ నిరాకరణమునకు అర్థము – స్వరూపములో నిషేధము చేయడము. దీనిని, తెలియజేసేటందుకు – ప్రాతిభాసిక సత్యము, వ్యావహారిక సత్యము, పారమార్థిక సత్యము, అని మూడు సత్యములను శాస్త్రము చెప్పినది. (అధ్యా॥ 10.)

ఇప్పుడు గ్రంథముయొక్క తరువాతి భాగములో, జీవ ప్రకరణము వున్నది. మిగిలిన అన్ని ప్రకరణములకన్న ఇది చాలా విస్తృతము. జీవుడు తనకోసము ఏ భ్రాంతులను సృష్టించుకున్నాడో అవి చాలా విస్తృతముగా ఉన్నవి. వాటిని నిరాకరణ చేసే ఈ ప్రకరణము కూడా అందువల్ల చాలా విస్తృతము అయినది. ప్రతియొక్కరు 'నేను' అని చెప్పే, స్థూల – సూక్ష్మ శరీరముల విశ్లేషణమే దీనిలో ప్రథమ అధ్యాయము. ఇక్కడ, గమనించవలసిన విషయము – సాంఖ్యాదులు చేసిన పంచప్రాణముల విశ్లేషణ, శ్రుతిలో చెప్పిన విశ్లేషణ వేఱుగా వున్నాయి. జీవుడు, ఒక జన్మనుంచి యింకొక జన్మకు వెళ్ళిన తరువాత ఈ స్థూలశరీరము ఇక్కడే నశించిపోతున్నది. కాని, సూక్ష్మశరీరము ముందు జన్మలకు వెళ్తూ వుంటుంది. 'కాయేన మనసా వాచా' చేసే అన్ని కర్మల సంస్కారములను ఇది తనలో దాచుకునే వుంటుంది. వాటిని అనుసరించి తరువాతి జన్మ ప్రాప్తిస్తున్నది. ఇలా, అనాది కాలమునుంచి వస్తూనే వున్నది. (అధ్యా॥ 11).

ఈ అనాది కర్మలకు కారణమైన అవిద్యయే 'కారణ శరీరము'. అవిద్యవలననే జీవుడు సత్కర్మ – దుష్కర్మ చేస్తున్నాడు. వాటి ఫలములను అనుభవిస్తున్నాడు. తనని తాను తెలుసుకోకపోవడమే అవిద్య. ఈ తెలుసుకోకపోవడము వల్లనే అతడు, తనను శరీరాదులని అనుకుంటున్నాడు. ఇదే అధ్యాస. శరీరోపాధిద్వారా తనను – పురుషుడూ స్త్రీ అని, స్థూలుడు కృశించినవాడు అని ఈ మొదలైనవన్నీ అనుకుంటున్నాడు. ఇంకా, బుద్ధి ఉపాధి ద్వారా తనను సుఖి–దుఃఖి అనికూడా అనుకుంటున్నాడు. అతని నిరుపాధిక స్వరూపమే బ్రహ్మ అని శాస్త్రము చెప్తున్నది. ఒకవేళ, జీవుడు ఇది తెలుసుకుంటే – అతనికి శరీరము మీద వున్న తాదాత్మ్యభావము తొలగిపోతున్నది. కర్తృత్వము, భోక్తృత్వము కూడా వదలిపోతాయి. ఇందువల్ల అంతఃకరణములో సంస్కారములు ఉత్పన్నము కావు. అందువల్ల, తరువాత జన్మకూడా రాదు. ఈ విధముగా "అహం బ్రహ్మాస్మి॥" అని తెలుసుకోవడమే మోక్షము; అది తెలియకపోవడమే అవిద్య; అదే బంధము. ఈ అవిద్యారూప అంధకారము అభావరూపము. కాని, దీనితో జన్యమయిన అధ్యాస భావాత్మకబుద్ధిప్రత్యయము. అందువల్ల అవిద్య సాక్షాత్తు దుఃఖకారణము కాదు, కామనవల్ల ప్రేరేపింపబడిన అధ్యాస సాక్షాత్తు దుఃఖకారణము. ఈ అవిద్య ఏదో ఒక సమయములో మొదలయినది కాదు; ఇది అనాది.

ఈ సందర్భములో మాయ–అవిద్యల అంతరమును స్పష్టముగా చెప్పాము. శాస్త్రమును ధ్యానపూర్వకముగా అధ్యయనము చేస్తే, వీటిని అభిన్నముగా చూడడము సంభవమే కాదు. కాని, ఒకే జగత్తును అవిద్యా కల్పితము అని – మాయాకార్యము అని వర్ణనము చేయబడినది. ఇందువల్ల లోకులు ఈ భ్రమలో పడుతున్నారు. మాయ అంటే అవిద్య అని వీరి భావము. అందువల్ల విషయమును మరొకసారి పరిశీలించాలి. అవిద్యా కాలములో జీవుడు జగత్తును బ్రహ్మకంటె స్వతంత్రమని అనుకుంటాడు. ఈ జగత్తు అవిద్యా కల్పితమైనది; ఎందుకనగా, అది స్వతంత్రము కనక. ఇందువల్ల, దానిని నిరాకరణ చేసి, కారణదృష్టితో జగత్తును తెలుసుకోవడమువల్ల, అది మాయా కార్యమని బోధపడుతున్నది. అనగా, అది బ్రహ్మతో అనన్యము. ఈ విధముగా, ఎప్పుడు అవగాహనకు వస్తుందో, అప్పుడు, పంచేంద్రియములతో జగత్తులో వ్యవహారము జరుగుతున్నా కూడా స్వరూపములో బ్రహ్మతో ఒకటిగానే వుంటాడు – ఎలాగంటే, ఇటుకలుగా – కుండలుగా చూస్తూ వున్నా, అవి కేవలము మట్టి మాత్రమేనని తెలుసుకున్నట్లుగా. ఈ ఘటము అవిద్యా కల్పితము కాదు. కుమ్మరి తయారు చేసినది. ఇదే ప్రకారము ఈ జగత్తు ఈశ్వరునిచే చేయబడినది. జీవుడు తన అవిద్యనుంచి దీనిని కల్పన చేయలేదు. ఒకవేళ ఇలా కల్పన చేయడము సంభవమే అయితే, ఇంక మోక్షముయొక్క ఆవశ్యకత లేనేలేదు. (అధ్యా॥ 12).

వెనుకటి రెండు అధ్యాయములలో ఆత్మ మూడు శరీరములు కాదు అని శరీరత్రయముతో వేఱు చేసి, నిర్ణయము చేసిన తరువాత, జీవుని అవస్థాత్రయ విచారణ చేయబడినది. ఇందులో ప్రధాన విషయము – జగత్తులోని అన్ని వ్యవహారములకు, బ్రహ్మ అనగా ఆత్మయొక్క జ్యోతి ఆధారము. జాగ్రత్తును ఉదాహరణగా తీసుకుని దీనిని తెలుసుకోవడము కష్టము. ఎందుకంటే, జాగ్రత్తులో ఆదిత్యుడు మొదలైన అనేక ప్రకాశములు ఉండడమువల్ల, సాధారణ వ్యక్తికి, వీటినుంచి విడదీసి ఆత్మజ్యోతిని తెలుసుకోవడము తేలిక కాదు. కాని, జీవుని స్వప్నావస్థలో, బాహ్యమైన ఈ ప్రకాశములు ఏవీ లేకపోయినా, జాగ్రత్తులోలాగే అన్ని ప్రజ్ఞలూ జీవునికి కలుగుతూ వుంటాయి. అయినా కూడా, అక్కడి ఆత్మజ్యోతిని నిర్ధారణ చేయడములో ఒక సందేహము వస్తున్నది. బహుశః అక్కడి ప్రకాశము శరీరమునకు సంబంధించే వున్నదా? అని. దానితో ఇలా ప్రశ్న వస్తున్నది. అక్కడి ప్రకాశము మనసుకి సంబంధించి వున్నదా? అని.

సమాధానము : ఏ మాత్రమూ లేదు. ఎందుకంటే, సుషుప్తిలో మనస్సు లేదని జీవునికి అనుభవము ఉన్నది; అప్పుడు, మనస్సు జడము – దానికి సాక్షియైన నిరుపాధిక ఆత్మే జీవుడు, అని నిశ్చయమవుతున్నది. ఇందువల్ల, మనస్సు జాగ్రత్స్వప్నములలో దృష్టిగోచరము కావడానికి, సుషుప్తిలో దృష్టి గోచరము కాకపోవడానికి, ఈ రెండింటికి ఆత్మజ్యోతే కారణము. మరియు స్వప్నావస్థలో మనస్సుద్వారా ప్రకాశించే జ్యోతి నిజముగా ఆత్మే. ఆత్మజ్యోతి ఉన్నప్పటికీ, విషయములను వేఱు వేఱుగా ప్రకాశింపజేయడానికి, ఇంద్రియాది బాహ్యజ్యోతుల అవసరము కూడా ఉన్నది.

సుషుప్తిలో నిరుపాధిక స్వరూపము ఉన్నప్పుడు జీవుడు ఏ ఆనంద అనుభవమును పొందుతున్నాడో, అది పరమానందమే. దానికంటె గొప్ప ఆనందము ఏదీ లేదు; దీనివల్ల, సుఖమునకు – ఇంద్రియములు ఉండనవసరము లేదని నిశ్చయమవుతున్నది. కాని, స్థూలశరీరములో ఉన్న తాదాత్మ్య బలమువల్ల విషయ సుఖము అనే మత్తులో, సుషుప్తిలో పొందే ఆనందమును పరమానందమని ఆమోదించడములో జనులకు విశ్వాసము కుదరదు. అందువల్ల, (అధ్యా॥ 13–16,17) అనుచ్ఛేదములలో, కొంత విశేష పరిశ్రమతో దీనిని నిశ్చయము చేశాము. ఈ ఆనందము కేవలము సుషుప్తిలోనే ఉన్నదని దీని అర్థము కాదు. ఏ

నిరుపాధిక ఆనందమును సుషుప్తిలో పొందుతున్నాడో, ఆ ఆనంద స్వరూపమును గుర్తించి, ఎల్లప్పుడూ ఆనందములోనే వుండవచ్చును. సుషుప్తిలో విశేషము ఏమంటే – ఈ జగత్తు అంతా ఏ ఆత్మకంటె వేఱు కాదో, కాని, జగత్తు అంతటితో ఏదైతే వేఱుగా వుంటుందో – ఆ ఆత్మకంటె, సుషుప్తిలో జీవుడు ఒక్కటి అయివుంటాడు. ఈ ప్రకారము ఒకటి అయి వుండడము వల్ల విశేష జ్ఞానము ఏమీ వుండదు. విశేషజ్ఞానము వుండాలంటే, ద్వైతము వుండాలి. ఈ విధమైన ఏకత్వము జీవునికి ఎలా ప్రాప్తించినది? తన అన్ని ఉపాధులు విడిపోవడమువల్ల ప్రాప్తించినది. అంటే, శరీరమును కోసి దూరముగా పారవేయడము కాదు; శరీరాదులు వున్నప్పటికీ సంబంధమును విడచి, ఒక్కడే నిరుపాధికుడుగా ఉండడము. అంటే, సర్వాత్మయే జీవుని నిరుపాధిక రూపము. దీనిని యుక్తితో (అధ్యా॥ 13–22) అనుచ్ఛేదములో నిశ్చయము చేయడము అయినది. ఇందువల్ల, జాగ్రత్తులో కూడా "నేను సర్వాత్ముడను" అనే దృఢనిశ్చయము కలిగి వుంటే ఉపాధులు అతనిని ఏమీ చేయలేవు. అతడు పరమానందములోనే ఉండిపోతాడు. (అధ్యా॥ 13).

పరమానందానుభవమునకు ఆటంకమైనదే అవిద్య. 'రామేశ్వరము వెళ్ళినా, శనీశ్వరుడు వదలనట్లు" గానే, సుషుప్తిలో నిరుపాధిక పరమాత్మతో ఐక్యము అయినప్పటికీ, అవిద్య అతనిని విడిచిపెట్టదు. అందువల్ల జీవుడు నెమ్మదినెమ్మదిగా బ్రహ్మాత్మైకత్వ స్థితికోసము ప్రయత్నము చేస్తూ వుండాలి. మొట్టమొదట, జీవుడు జాగ్రత్ సమష్ట్యాత్మ వైశ్వానరునితో ఐకాత్మ్యం పొందాలి; ఆ తరువాత, అక్కడి స్థూల వికారములను అపవాదము చేసి, సూక్ష్మతైజసునితో ఐకాత్మ్యం పొందాలి. అక్కడి సూక్ష్మవికారములను అపవాదము చేసి, సూక్ష్మతర ప్రాజ్ఞునితో ఐకాత్మ్యమును సాధించాలి; అక్కడ మాయోపాధినికూడా తొలగించి, ఆఖరున పరమాత్మునితో ఐకాత్మ్యం పొందాలి; ఇదే తురీయము. ఇక్కడ ఏ విధమైన వ్యవహారము వుండదు. కాని, జగత్తులోని అన్ని వ్యవహారములు తన నుంచే జరుగుతున్నాయి అనే ఆ సర్వాత్మభావము దీనికంటె వేఱు కాదు. (అధ్యా॥ 14).

ఇక ముందు జీవ స్వరూప నిర్ణయమునకు పంచకోశ విచారణ చేయబడినది. శరీరము, ప్రాణము, మనస్సు, బుద్ధి, భోక్తృత్వము – ఇవి పంచకోశములు. వాటిని అభిమానించే జీవుడు – అన్నమయుడు, ప్రాణమయుడు, మనోమయుడు, విజ్ఞానమయుడు, ఆనందమయుడు. అనగా వీటికి అభిమానియైన జీవుడే ఈ ఆత్మలు. వెనుకటి కోశములలో దృష్టిగోచరమయే ఆత్మయే తరువాతి కోశములలోని ఆత్మ. అందువల్ల, వెనుకటి కోశములలో తాదాత్మ్యమును విడచి, అంతములో ఆనందమయుని తెలుసుకోవాలి. కాని, అక్కడ ఉన్న ఆనందము కూడా కార్యమే. అనగా, ఎంతో కొంత తక్కువవాడే. ఇందువల్ల, వానికి అవికారుడైన సాక్షి – జీవుడైన ఆత్మ ఆనందమయుడు కాదు. అయితే, ఆ జీవుడు ఎవరు? దీనిని నిర్ణయించడానికి వైశ్వానరాదులతో ఎలాగో అలాగే సమష్టి అన్నమయాది ఆత్మలతో తాదాత్మ్యతను పొందాలి. సమష్ట్యాత్మలలో కూడా, వెనుకటి ఆత్మలను నిరాకరణ చేసి, సమష్ట్యానందమయుడైన హిరణ్యగర్భుని పొందాలి. దీని తరువాత ఏ హిరణ్యగర్భానందము పరబ్రహ్మానందముయొక్క అంశమో ఆ బ్రహ్మలో ఒకటై పోవాలి. (అధ్యా॥ 15).

ఇదంతా చెప్పిన తరువాత – "నానుధ్యాయాత్ బహూన్ శబ్దాన్ వాచో విగ్లాపనం హి తత్।" (బృ॥ 4–4–21) అనేక శబ్దముల చింతన చేయరాదు. ఎందుకంటే, అవి వాక్కుకు శ్రమను మాత్రమే కలిగిస్తాయి. ముముక్షువు కోసము, శ్రవణ – మనన – నిదిధ్యాసనముల విధానమును, వేదాంత శాస్త్రము ఆడంబరము కోసముగాని, మనోరంజనము కోసముగాని చెప్పలేదు అని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. మిగిలిన అన్ని శాస్త్రములు

మనోరంజనము కోసమే; వేదాంతము మాత్రము మోక్షము కోసమే అని మరచిపోకూడదు. అందువల్ల శ్రవణ మననముల తరువాత నిదిధ్యాసనము చేయాలి. సంన్యాసములో అవి నిరాటంకముగా సాగుతాయి. మిగిలినవారు, వాటికి సహకరించే ఇతర కర్మలను – ఉపాసనను పూర్తి నిష్ఠతో చేయాలి. పతితులు – ఆచారవిహీనులు అయినవారితో ముముక్షువు సాంగత్యము చేయరాదు. కర్మరహితమైన భక్తికి ఏమీ అర్థము లేదు. ఈ కర్మరహితమైన భక్తి ఎటువంటిది అనగా – వంట కూడా చేయక భర్తకు భోజనము పెట్టని పతివ్రత లాగా, తల్లికి భోజనము పెట్టని మాతృభక్తుడిలాగా, వుంటున్నది. (అధ్యా॥ 16,17,18,19). శాస్త్ర విధానమును అనుసరించి నడచినదే భక్తి. భగవంతుని ఆజ్ఞారూపమైన విధులను ధిక్కారముచేసే భక్తి, ముముక్షువులకు కలగకుండుగాక. మన కర్మఫలము దైవాధీనమని మనకు తెలుసు. అయితే తనను పరమాత్మునిలో లయింపచేసుకునే ఏ జ్ఞానము వున్నదో దాని ఫలము కూడా ఆ పరమాత్ముని అధీనములోనే వుంటుంది. ఇది, మరువరాదు. అజ్ఞుల కార్యములకు దేవతలు విఘ్నము చేస్తారు, అన్నది నిజము. అయితే, ఎవరైతే పరమాత్ముడే తనకు గతి అనుకుని తన సర్వస్వము అతనికి సమర్పిస్తాడో – భగవంతుని నిఃశ్వాసరూపమైన శాస్త్రములను అనుసరించి అతని దాసుడుగా ఉంటాడో – అతనికి ఏ దేవతా ఏ ఆటంకమును కలిగించదు. ఈ ప్రకారమైన, ఆత్మనివేదనా రూప భక్తికి పరాకాష్ఠ ఎవరిలో వుంటున్నదో వారికి జ్ఞాన ఫలమైన మోక్షము ప్రాప్తిస్తుందని అనడములో సంశయము ఏమీ లేదు; అతనికి పునర్జన్మ లేదు; అతనికి పునర్జన్మ లేదు.

సంపూర్ణము

సమస్త సన్మంగళాని భవంతు।

శబ్దానుక్రమణిక